Open your heart
And you will find me already there.

The Mother

నీ హృదయ కవాటాలు తెరిచావంటే
అక్కడే ఉన్న నన్ను చూడగలవు.

శ్రీమాత

P.O. Regn. No:
TN/PMG(CCR)/39/03-05
WPP No. 35/03-05

References: *Savitri* p.681; *Poems* p. 130; *Savitri* pp. 520, 513-514, 507, 701; *Poems* p. 154
Quotes selected by Tehmiben; Editor: R.L.N.Sastry;
Publishers: Pradeep Narang for Sri Aurobindo Society, Pondicherry - 605001
Printers : Sri Aurobindo Ashram Press, Pondicherry; price: **Rs. 20**

Vol. 35, No. 1, Registered with the Registrar of Newspapers for India: No. 23593/72

అఖిల భారత పత్రిక, జనవరి 2006

నీవు ఉండబట్టే

(శ్రీఅరవిందుల ప్రవచనములు)



Because he is there the Inconscient does its work,
Because he is there the world forgets to die.

ఆయన ఉండబట్టే శిలల్లో చైతన్యం మేల్కొంటుంది.
ఆయన ఉండబట్టే ప్రపంచం మృత్యువును మరచిపోతుంది.



A secret harmony steals through the blind heart
And all grows beautiful because Thou art.

మూగవోయిన హృదయం తిరిగి వికసిస్తుంది.
నీవుండబట్టే సర్వము అందచందాలతో అలరారుతుంది.



Because thou art, the soul draws near to God;
Because thou art, love grows in spite of hate
And knowledge walks unslain in the pit of Night.

నీవుండబట్టే ఆత్మ దైవం దరికి చేరుతుంది
నీవుండబట్టే ద్వేషము ప్రేమగా మారుతుంది.
అంధకారంలో కూడ జ్ఞానం పరిఢవిల్లుతుంది.



Because thou art in him, man hopes and dares;
Because thou art, men's souls can climb the heavens
And walk like gods in the presence of the Supreme.

మానవుని హృదయంలో నీ వుండబట్టే అతను సాహసిస్తాడు.
నీవుండబట్టే మానవాత్మలు దివ్యలోకాలకు అధిరోహిస్తాయి,
పరమాత్మ సన్నిధిలో సంచరిస్తాయి.



Because thou art, men yield not to their doom,
But ask for happiness and strive with fate;
Because thou art, the wretched still can hope.

నువ్వుండబట్టే మానవులు విధిని తప్పించుకుంటారు.
మృత్యువును సవాలు చేస్తారు, ఆనందాన్ని ఆకాంక్షిస్తారు.
నువ్వుండబట్టే మ్లేచ్ఛులు కూడా అమరులౌతారు.



"Hearts touched by thy love shall answer to my call,
Discover the ancient music of the spheres
In the revealing accents of thy voice
And nearer draw to me because thou art..."

"నీ ప్రేమ పాశమును పొందినవారికి నా పిలుపు వినబడుతుంది.
నీ పలుకులలోని దివ్యసందేశాన్ని వింటారు.
నువ్వుండబట్టే మానవులు నా దరికి జేరుతారు."

సృష్టిలోని సౌందర్యమంతా ముద్దకట్టిన మూర్తివి నీవే, ఆనందసర్వస్వమూ నీవే. అందువలనే ప్రతి వస్తువూ నన్ను పరవశింప చేస్తోంది, సౌందర్యానందభూతులతో పులకరింప జేస్తోంది. అందరి నేత్రముల ద్వారా చూచునది నీవే, కంఠముల ద్వారా పలుకునది నీవే. సమస్త ప్రకృతీ నీ రూపమే. చెట్టూ, పుట్టా, రాయీ, రప్పా నీ ఆనందాన్నే చాటుతున్నాయి. కాలవాహినిలోని ప్రతి క్షణమూ నిన్నే మోసుకొనివస్తోంది – రాబోవు బంగారు భవిష్యత్తుకు బాటలు తీర్చిదిద్దుతోంది.

శ్రీఅరవిందులు

BECAUSE THOU ART

Because Thou art All-beauty and All-bliss,
My soul blind and enamoured yearns for Thee;
It bears Thy mystic touch in all that is
And thrills with the burden of that ecstasy.


Behind all eyes I meet Thy secret gaze
And in each voice I hear Thy magic tune:
Thy sweetness haunts my heart through Nature's ways;
Nowhere it beats now from Thy snare immune.

It loves Thy body in all living things;
Thy joy is there in every leaf and stone:
The moments bring Thee on their fiery wings;
Sight's endless artistry is Thou alone.

Time voyages with Thee upon its prow –
And all the future's passionate hope is Thou.

Sri Aurobindo





మహాసరస్వతి

(శ్రీమాత మహాసరస్వతి అంశ)

అఖిల భారత పత్రిక, ఫిబ్రవరి 2006

మహాసరస్వతి

ఉపోద్ఘాతము

మానవజన్మనెత్తినందుకు ఏదైనా గొప్పపని చేయాలని వుంటుంది. అది దైవకార్యమైతే మరీ మంచిది. కాని దైవకార్య మేమిటో తెలుసుకోవటమెలా? నీ ప్రజ్ఞాపాటవాలను దైవానికి అర్పించుకో. నువ్వేమీ ఆలోచించవలసిన పని లేదు. మనసును కదలకుండా మెదలకుండా అట్టేపెట్టుకోవాలి అంతే. నువ్వేం చేయాలో, ఎలా చేయాలో ఆయనే చూసుకుంటాడు. ఇది ఎలా సాధ్యమో కాస్త వివరంగా తెలుసుకోవాలి కదా? ఇప్పుడు శ్రీమాత అంశమైన 'మహాసరస్వతి' మనకి చాలా దగ్గరగా వున్నది. ఆమె కార్యశీలి. అంటే ఏదో పురాణంలో కథలకు మల్లె ఊహాలోకంలో కాదు. ప్రత్యక్షంగా, భౌతికంగా నిర్వహిస్తుంది. మరి ఈ కార్యానికి నీ వొక చక్కటి ఉపకరణము ఎందుకు కాకూడదు? అందు కవస రమైన విద్యను, సాంకేతిక పరిజ్ఞానాన్ని (the intimate and precise knowledge) ఆమె సమకూర్చగలదు. ఆమెను గురించి శ్రీఅర విందులు The science and craft and techinique of things are Mahasaraswati's province అన్నారు. మరింక ఆలస్యమెందుకు? నువ్వామెను పట్టుకోవాలి. నీ అంతర్ ద్వారాలను తెరచిపెట్టాలి. అప్పుడే ఆమె శక్తిని గ్రహించి నువ్వామె ఆదేశాలను పాటించ గలుగుతావు. నీ జీవితం ధన్యమవుతుంది. ఇది కొన్ని యుగాలకు వచ్చే అమూల్యావకాశము. మన గుమ్మంలో నిరీక్షిస్తున్న ఆ మహా సరస్వతిని సాదరంగా లోనికి ఆహ్వానించెదము గాక!

— సంపాదకుడు

మాతృమూర్తి మహాసరస్వతి దర్శనము

ఇక్కడ శ్రీఅరవిందులు మాతృమూర్తి యొక్క నాలుగు ముఖ్యాంశములు – ఆమె ముఖ్యశక్తులు, దేవతాస్వరూపములు అయిన మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతులను గురించి వివరిస్తున్నారు. మహాసరస్వతిని గురించిన విశేషములను ఇక్కడ అందిస్తున్నాము .– సంపాదకుడు

మానవజీవితానికి దైవీశక్తి తోడైతే మనిషి ఎన్ని పనులైనా చేయగలడు. కష్టమైన కార్యాలను కూడ నిర్వహించగలడు. అట్టి శక్తిని ఎవరివ్వగలరు? శ్రీమాత నాలుగు అంశలలో ఒకటైన మహాసరస్వతి భూలోకానికి చేరువుగా వుండి మానవునికి అవసరమైన ఆధ్యాత్మిక సంపదనే కాకుండా విజ్ఞానశాస్త్రాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడ సమకూరుస్తుంది. – సంపాదకుడు

I

మహాసరస్వతి సక్రమ నిర్వహణ, సమగ్రతలకు మూలము. ఆమె కార్యనిర్వహణాకౌశలము సాటిలేనిది. శ్రీమాత నాలుగు శక్త్యంశలలో చివరిదైన ఈమె భౌతికప్రకృతికి అతిసన్నిహితురాలు. ప్రథమాంశ అయిన మహేశ్వరి ప్రపంచశక్తులను సమీకరించి వాని స్థానములను నిర్దేశించుటలో ప్రధాన బాధ్యత వహించును. ద్వితీయాంశ మహాకాళి వానికి ప్రయోగసామర్థ్యము, ధైర్యస్థైర్యముల నొసగును. మహాలక్ష్మి వాని ప్రమాణమును, తీరుతెన్నులను నిర్ణయించును. ఏ పనిని ఏ ఏ శక్తులు ఎంతెంత ప్రమాణములో సమ్మేళనమయితే విజయవంతమౌతుందో ఆయా శక్తులను అంతంతగా సమ్మేళనము చేయు ప్రతిభ, కార్యశీలత మహాసరస్వతి లక్షణములు. విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం, హస్తనైపుణ్యం మహాసరస్వతి అధీనంలో వుంటాయి. ఆమె కృపకి పాత్రుడైన వ్యక్తికి స్పష్టమైన విషయ పరిజ్ఞానం కలిగిస్తుంది. ఓర్పు, బుద్ధిసూక్ష్మతలనిస్తుంది. నిర్దుష్టమైన ఆత్మప్రబోధిత మనస్సును ప్రసాదిస్తుంది. చురుకైన హస్తనైపుణ్యం, సూక్ష్మదృష్టి కలుగజేస్తుంది.

II

నీ ప్రకృతిని మార్చివేసి నిన్ను పునర్నిర్మాణము చేయనున్నది శ్రీమాత. మనిషిని మార్చటమంటె మాటలా? ఇది చాలా అసాధ్యమైన విషయము. కాని దైవశాసనమైనది. ఆయన తన శక్తిని పంపించాడు. మహాసరస్వతి వున్నది కదా, ఆమె నీ అంతరంగంలోకి ప్రవేశించి ఒక్కొక్క అవయవాన్ని, అణువణువును తీర్చి దిద్దుతుంది. — *సంపాదకుడు*

ఆమె క్రియాశక్తి చాలా అమోఘమైనది, అపారము, అలసట యెరుగనిది, అప్రమత్తమైనది. అత్యంత సమర్థురాలైన నిర్మాత, కార్యశీలి, పరిపాలనాదక్షురాలు, సాంకేతిక పరిజ్ఞాని, వివిధ జగత్తుల వర్గీకరణ శక్తి.

ప్రకృతి పునర్నిర్మాణంలో పరిణామాన్ని చేపట్టినప్పుడు ఈమె అమితంగా శ్రమిస్తుంది. ప్రతి చిన్నవిషయాన్ని పరిగణనలోకి తీసుకుంటుంది. అసహనపరులకది చెప్పలేనంత నెమ్మదిగా నత్తనడకలా తోస్తుంది. కాని అది శాశ్వతమైనది, సంపూర్ణమైనది. ఎక్కడా యే లోపంలేని సమగ్రతతో భాసిస్తుంది. ఆమె పనులలో సంకల్పశక్తి అత్యంత శ్రద్ధతో, మెలకువతో అవిశ్రాంతంగా పని చేస్తుంది. మన విషయంలో ఆమె ప్రతి చిన్న వివరాన్ని గుర్తు పెట్టుకుని స్పృశిస్తుంది. ప్రతి చిన్నలోపాన్ని కనిపెట్టి సరిజేస్తుంది. వంకరలు తీరుస్తుంది. ఖాళీలను పూరిస్తుంది. ఇప్పటివరకు పూర్తిచేసిన మొత్తం పనిని, ఆ తరువాత చేయవలసిన పనిని కూడా అంచనావేసి తన పరిగణనలోకి తీసుకుంటుంది. ఏ సూక్ష్మాంశమూ ఆమె దృష్టిని తప్పించుకోలేదు. ప్రతి వస్తువు, దానిలోని ఎంత చిన్నభాగమైనా సరే, పరిపూర్ణమైన దాని సమగ్ర రూపం సంతరించుకొనేవరకు మళ్ళీ మళ్ళీ విసుగూ విరామం లేక తీర్చిదిద్దబడుతుంది. దానిదైన స్థానంలో సరిగ్గా వుంచబడుతుంది. అందువల్ల దాని ప్రయోజనాన్ని అది నెరవేర్చగలుగుతుంది. దేశకాల పరిస్థితులకనుగుణంగా తగిన పరికరాన్ని యెన్నుకొనడంలో

ఆమె పొరబడదు. ఏది స్వీకరించాలో, యేది తిరస్కరించాలో నిర్ణ యించడంలో ఆమె ఆత్మప్రభోదం గొప్పగా పనిచేస్తుంది. అవస రాన్నిబట్టి ఏ వస్తువు ఏ స్థానంలో అమర్చాలో, ఆ స్థానంలో అమర్చడంలో ఆమె కనబరిచే శ్రద్ధ, స్థిరసంకల్పం సాటిలేనివి.

III

పనిలో ఏ మాత్రం అశ్రద్ధ చేసినా ఆమె సహించదు. ప్రతి వస్తువు దాని నిర్ణీత ప్రదేశంలో వుండాల్సిందే. ప్రతి పని అత్యంత కౌశ లంగా నిర్వహించాల్సిందే. పనులు సగం చేసి వదిలేసెయ్యటం, పనిముట్లను చిందరవందరగా పడేయటం ఆమె కిష్టముండదు. మనం మన పనులను అత్యంత శ్రద్ధతో నిర్వహించెదము గాక!

— సంపాదకుడు

నిర్లక్ష్యం, అశ్రద్ధ, సోమరితనం మహాసరస్వతికి అస్సలిష్టముం డవు. అరకొర పనులు, తొందరపాటుతనం, అస్తవ్యస్తంగా, అపరి శుభ్రంగా, గందరగోళంగా చేసే చెదురుమదురు పనులు ఆమె అసలు సహించదు. తప్పుడు అంచనాలు, పనిముట్లను తప్పుగా వుపయోగించడం, వక్రమార్గాలు, చేసే పనిని మధ్యలో వదిలి వేయడం ఆమె స్వభావానికి సరిపడనివి! అమిత ఆగ్రహం కలిగిం చేవి.

ఏ పనైనా పూర్తయ్యేసరికి ఏ చిన్న అంశం స్థానభ్రంశం కాకూడదు. ఎక్కడా పొరబడకూడదు. ఏదీ వదిలిపెట్టకూడదు. అంతా కచ్చితంగా, నిర్దుష్టంగా, పరిపూర్ణంగా మెచ్చుకోలుగా వుండాలి. సంపూర్ణ సమగ్రతతో ఎటూ వేలెత్తి చూపలేనంత సంతృప్తికరంగా వుండాలి. సృష్టి సంపూర్ణతకి అవసరమయితే ఆమె శాశ్వతంగా శ్రమించడానికి సంసిద్ధురాలు. అందుచేతనే మనిషివల్ల అతడు చేసే లెక్కలేనన్ని తప్పుడుపనులవల్ల ఆమ్మ శక్తులలో అత్యంత వ్యథకి గురయ్యే క్రియాశక్తి ఆమెయే.

IV

మనిషియొక్క అధో (సహజ) ప్రకృతిని మార్చి ఉన్నత మానవుని గా మలచటం యోగం నిజమే. కాని మనమొక స్థాయి ముందుకుపోయి మానవుని పరివర్తింపచేయాలని చూస్తున్నాము. ఈ ప్రయత్నానికి దైవసహాయం అవసరం. అందుకే ఆమె నిరంతరం మన వెనకాలే నిలబడి మనకి దారి చూపిస్తూ వుంటుంది. మనని చేయి పట్టుకొని నడిపిస్తుంది. కష్టాలలో ఆదుకుంటుంది.

— సంపాదకుడు

మనం నిజాయితీగా, సూటిగా ఒకే లక్ష్యంతో తనని నమ్మినట్టయితే ప్రతి అడుగులోను ఆమె చేయందించి సాయపడుతుంది. వరుసగా అపజయాలయినా కృంగిపోకుండా, అధైర్యపడకుండా వుండేందుకు చేరదీసి కరుణపూరిత మందహాసంతో ఓదారుస్తుంది. రెండునాల్కల ధోరణి ఆమెకు గిట్టదు. నటన, ఆత్మవంచనతో పిచ్చి పిచ్చి వేషాలేసి నాటకాలాడితే నిర్దాక్షిణ్యంగా అణగదొక్కేస్తుంది. మన కోర్కెలు తీర్చడంలో అమ్మ; ఆపదలలో ఆదుకోడంలో ఆప్తమిత్రురాలు; స్థిరమైన, ప్రశాంతమైన అనుభవశాలియైన సలహాదారు. నిరాశ, నిస్పృహ మేఘాల్ని చెదరగొట్టే ఆకర్షణీయమైన చిరునవ్వుకాంతులతో కూడిన రూపం మన మనస్సులో చెరగని ముద్రగా నిలచిపోతుంది. కోరిన వెంటనే సహాయపడేందుకు ఎల్లప్పుడూ సంసిద్ధురాలయి నమ్మినవారిని దివ్యకాంతిపథానికి నడిపిస్తుంది. ఆమె మూర్తి స్థిరమైనది, ప్రశాంతమైనది. గాఢమైన తదేక దీక్షతో నిరంతర ఆకాంక్ష కలిగివున్నవారికి పరిపూర్ణత్వం సంతరించుకున్న ఉన్నత ప్రకృతివైపు నడిపిస్తుంది. శ్రీమాత యితర శక్తులన్నీ తమ కర్తవ్యనిర్వాహణకు మహాసరస్వతి మీదనే ఆధారపడతాయి. వాటికి కావలసిన సాధనసామగ్రిని సమకూర్చి, రక్షణకవచాన్ని నిర్మించి అభయహస్త మిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

(*SABCL* Vol. 25, pp. 33-35)

కర్మకౌశలం:

ఆమె కార్యశీలత్వము

దైవశక్తి మానవలోకంలోకి ప్రవేశించవచ్చు. కాని అది సూక్ష్మ లోకంలోనే వుండిపోవచ్చు కూడ. కాని మహాసరస్వతికి అది నచ్చదు. ఆమె ఈ ప్రపంచాన్ని ఉద్ధరించేందుకు వచ్చిన కార్య కర్త్రిణి – ఊరికే చేతులు కట్టుకొని కూర్చోదు.. ఏ కార్యమైనా సరే అది భౌతికస్థాయిలో జరిగి తీరవలసిందే.

– సంపాదకుడు

ఇతర దేవతలందరూ వారి వారి పనులను పూర్తిచేసేందుకు ఆమె మీదనే ఆధారపడతారు. *– శ్రీఅరవిందులు*

అవును, నిజమే. ఆమె అద్భుతమైన కార్యశీలి కనుకనే అలా జరుగుతుంది. ఏ పనైనా కూడ అత్యంత శ్రద్ధతో చెయ్యాల్సిందే, మంచి పనితనముండాలి – ఎంత చిన్న దోషమున్నా ఆమె భరిం చలేదు. మరో విషయం – సాధారణంగా దేవతలందరు సూక్ష్మ భూమికలలో పనిచేస్తూ వుంటారు. కాని మహాసరస్వతి అలా కాదు. ప్రతి పనీ, ఆమె చేయు కార్యములన్నియు ప్రత్యక్షంగా భౌతికరూపం దాల్చాల్సిందే. ఆమె చేతలు కేవలం ఊహాచిత్రములు కావు, ఎదురుగుండా కనపడాలి. అది కూడ ఎంతో అందంగా విశ్వకర్మ నిర్మాణముల వలె అద్భుతంగా, అందచందాలతో అల రారుతూ వుండాలి. అందుకనే ఆమె మిగతా దేవతలు చేయు గొప్ప గొప్ప కార్యములన్నిటికి ప్రత్యక్షరూపమిస్తుంది – అమూర్త దశనుండి మూర్తం చేస్తుంది.

*

శ్రీమాతయొక్క మొదటి మూడు అంశలు (దేవతలు) చేపట్టిన కార్యములను మహాసరస్వతి పూర్తిచేస్తుంది, మెరుగులు దిద్దు తుంది. ఆమెలో మరొక ప్రత్యేక లక్షణమున్నది. చిన్నవాళ్లు, ముఖ్యంగా పిల్లలు, సాధన ప్రథమదశలోనే వుండి ఇంకా చాలా దూరం వెళ్లవలసిన వాళ్లంటే ఆమెకు చాలా ఇష్టం. వాళ్లకు చాలా

సహాయపడుతుంది. పరిణామ ప్రక్రియలో ఆమెది చివరి దశ, అందుకనే ఆమె చిట్టచివరగా ఆవిర్భవిస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్ శాస్త్రి

(*CWM* Vol. 6, p. 283; Vol. 4, p. 404)

మహాసరస్వతి

(Mahasaraswati – The Goddess of the Works of the Spirit)

సుదూర లోకాల నుంచి మహత్తరమైన ఆధ్యాత్మిక శక్తిని తీసుకొనివచ్చిన మహాశక్తి ఆమె. ఆమెయే జ్ఞానానికి నిలయమైన మహేశ్వరి. అజ్ఞానంతోను, మృత్యువుతోను పోరాడి గెలవగల మహాకాళి. ప్రేమానందములతో మననావహించి రక్షించగల మహాలక్ష్మి. 'యోగః కర్మసు కౌశలం' అనే సూక్తి మూర్తీభవించిన దేవత మహాసరస్వతి. ఆమెకు చేతకానిది ఏమీ లేదు. మానవునితో చేతులు కలిపి కార్యములను నిర్వహించగల దిట్ట.

– సంపాదకుడు

ఆమె జగజ్జనని, నిత్యత్వం నుండి విశ్వనిర్మాణం చేసే జాగృత శక్తి. పరమాత్మ విశ్వముఖీనమైన శక్తి, సర్వతోముఖప్రజ్ఞ, సమగ్ర సామర్థ్యం, సర్వతోముఖ విజయపరాక్రమశాలిని. సమగ్ర నైపుణ్యం, కర్మలు ఆమె చేతిలోని ఉసిరికాయ. అవన్నీ ఆత్మరత్న నిధులు, అన్ని సంపూర్ణతలకు – సిద్ధులకు పెన్నిధి.

[The Divine Shakti] is the conscious Power and universal Goddess all-creative from eternity and armed with the Spirit's omnipotence. All knowledge, all strengths, all triumph and victory, all skill and works are in her hands and they are full of the treasures of the Spirit and of all perfections and siddhis.]

ఆమె మహేశ్వరి: పరమజ్ఞాన స్వరూపిణి. ఆమె దయవల్ల మనకు దర్శనభాగ్యంతో పాటుగా బృహత్సత్య సాక్షాత్కారాలు

కల్గుతున్నవి. ఆమె ధార్మిక ప్రవర్తన పరాత్పరమైన ఆమె బృహత్‌శాంతి, ఆవేశాలు, ఆమె ప్రకాశానందమయత్వం మన మనస్సంకల్పాల కందించే కల్పవల్లి.

ఆమె మహాకాళి: మహాశక్తిమయమూర్తి. శక్తిసామర్థ్యాలు – ఆత్మశక్తులు – ఉగ్రతపస్తీవ్రత – యుద్ధవేగం – జయము – హాస్యమూ. అట్టహాసము ఆమెకాభరణాలు. ఇవి అపజయ – మృత్యు – అజ్ఞానభారాన్ని తొలగించే సాధనలు కనుక.

ఆమె మహాలక్ష్మి: పరమప్రేమానంద సామ్రాజ్య సింహాసనాధిష్ఠాత్రామె, ఆమె మహాలక్ష్మి. ఆమె దానం చేసేది ఆత్మానుగ్రహాన్ని. ఆనందముయొక్క అందచందాలామె అధీనంలోని నిధులు. జగద్రక్షణ – దివ్యమానవీయ ఆశీర్వాదాలు ఆమెయే.

ఆమె మహాసరస్వతి: దివ్యకర్మలను కుశలంగా నిర్వహించే తల్లి. కర్మనిర్వహణ నైపుణ్యం కలది. కర్మకౌశలమైన యోగ సామ్రాజ్య మహారాణి. ఆత్మజ్ఞానము నుపయోగించటంలో, ఆత్మ ప్రకాశాన్ని జీవితానికన్వయించటం దాని సంతోష సమతా సంగీతాన్ని వీణపై ఆలాపించటంలోను – ఆమె కౌశలం వర్ణింపరానిది. ఆమె సర్వరూపాల్లో, శక్తిసామర్థ్యాలలో నిత్యశక్తియైన పరమేశ్వరి యొక్క పరమశ్రేష్ఠమైన నైపుణ్య భావనలను తనతోపాటు మోసుకొని వస్తుంది. సర్వకర్మలను నిర్వహించటంలో వేగవంతమైన సామర్థ్యం కలది. ఇది సాధనాధీనమైన ఏకత్వం, భాగస్వామ్యం వహించటంలో స్వేచ్ఛాతన్మయత్వం, జీవకోటిలోని శక్తులతో సమైక్యం పొందటం ఆమె లక్షణాలు. కాబట్టి తన దివ్యేచ్ఛతో సమన్వయాన్ని విశ్వంలో నింపుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

(*SABCL* Vol. 21, pp. 752-53)

Synthesis of Yoga, Part 3 Ch.

కర్మసు కౌశలం అంటే?

యోగమనగా 'కర్మసు కౌశలం' అని విని విని మనం విసిరి వేసారి పోపోతున్నాయేగాని దీని అసలు అర్థమేమిటో తెలియదే! మామూలుగా డాక్టర్లు, లాయర్లు లాంటి వాళ్లందరూ యోగం చేస్తున్నారా ఏమిటి – అది కాదు. నువ్వు నీ మనస్సును దాటి వెళ్లాలి. నీ చేతన దివ్యచేతనలో లీనమైపోవాలి. నీ మనస్సు ఆ చేతనకు వశమైపోవాలి. అప్పుడే నీ కర్మలు దివ్యకర్మలుగ పరిణమిస్తాయి.

– సంపాదకుడు

భగవద్గీత '*యోగః కర్మసు కౌశలం*' అని చెప్పింది. ఈ ప్రాచీన శృతి వాక్యంలో '*యోగ*'మనే పదం మనస్సు వికాసానికి, రూపాంతరీకరణకూ సూచకంగా వాడబడింది. కర్మ నిర్మహాణ కౌశలం అంతరంగస్థితి నుండి సత్కర్మాచరణం ద్వారా, విత్తనం నుండి చెట్టు ఎలా మొలకెత్తుతుందో అలా ఆధ్యాత్మికతను, దివ్య కర్మలను ఉద్భవింపజేస్తుంది. ఒక సైనికాధికారి ఎంతటి ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించినా, ఒక న్యాయవాది ఎంత నైపుణ్యంతో వాదించినా, చర్మకారుడు తనదైన రీతిలో ఎంతటి నేర్పును చూపించినా వారిని యోగులనలేము. కౌశలం అంటే ఏదో ఒక రంగంలో నైపుణ్యంకాక విశ్వమానవ సమానత్వానికి తోడ్పడే కర్మయోగస్ఫూర్తిగానీ, భగవంతుడితో ఐక్యాన్ని సాధించే భక్తి యోగసాధనగానీ కావచ్చు. కర్మలలో కౌశలాన్ని సంపాదించిన యోగాభ్యాససాధన అహంకారపు బంధాలను తెంచి, ఇంద్రియార్థాల పరిమితుల కతీతంగా తన అంతఃకరణ చతుష్టయాన్ని దివ్యమైన, విశ్వమయమైన ప్రకృతియొక్క లయలతో శ్రుతి కలపడానికి తోడ్పడుతుంది.

యోగానికి కావలసిన ఉత్తమ కౌశలాన్ని అవ్యయసాయాత్మక బుద్ధి కలిగి, జంతుకక్ష్యలలో వర్తించే మానవుడు సాధించలేడు. దీనిని అవగాహన చేసుకోవాలంటే ఎలాగైనా సరే వ్యక్తిగతజీవితాన్ని, ఇచ్ఛను, సుఖాన్ని త్యాగం చేసి జీవితాన్ని ఉదా

త్తంగా మలచుకుంటేతప్ప సాధ్యం కాదు. అప్పుడే కౌశలాన్ని సిద్ధింపజేసుకుని మన క్షేమాన్ని, ఇతరుల సంక్షేమాన్ని సాధించిన వాళ్ళమవుతాము. సామాన్యమానవుడు ఇటువంటి కౌశలాన్ని తనకు సంబంధించిన ఏదో తాత్కాలిక ప్రయోజనాలను పీక లోతు సమస్యల ఊబిలో మునుగుతున్నప్పుడుపయోగించి ఎలాగో లాగ బయటపడవచ్చు. అయినా ఏం లాభం? మళ్లి మరొక పరి స్థితి సంభవించటంవలన మళ్ళి పీకలోతుకు మునిగిపోతాడు. నిజమైన కర్మయోగి తన మనస్సు, తన కోరికలు, తన ద్వంద్వ ప్రవృత్తి తనను ఎక్కడ మోసగిస్తున్నాయో తెలుసుకుంటాడు. ఇలా తెలుసుకోవటంవల్ల అతడు పరమప్రశాంతతను, నిరంతర సంతృప్తిని, నిండైన ఆనందాన్ని పొందుతాడు. దీనివలన కలిగే అనుభూతి తనకు మాత్రమేకాక చుట్టుపక్కలవారికి కూడ ఆనందాన్ని కలుగజేస్తుంది. ఇది కూడ మన సత్తలో వచ్చిన పరి ణామం నుండి ఉద్భవిస్తుంది. ఎందుకంటే పరిశుద్ధమైన సత్యం యొక్క అస్తిత్వంలో ఎప్పుడూ అమలినమైన ఆనందం వర్తిస్తూ వుంటుంది గనుక. అనంతత్వంలో కూడ అవి విడదీయరానివై ఉంటాయి.

వేదకవులు ప్రయోగించిన ఒక అలంకారం ద్వారా చెపితే బృహద్రూపుడు, అనంత సత్యస్వరూపుడైన వరుణుడు యోగం ద్వారా ఉద్భవించి, అనంత ఆధ్యాత్మికజీవనాన్ని మనలో ఆవి ష్కరిస్తాడు. కాంతికి, ప్రేమకు అధిష్ఠానదేవత అయిన మిత్రుడు ఆ బృహత్త్వంలోనే ఉదయించి మన ఆలోచన, ఆవేశం, సంకల్పం అనే వాటికి ఒక దివ్యమైన సమన్వయాన్ని సమకూరుస్తాడు. ఈ బృహత్త్వంలోనికి సమన్వయ మాధుర్యంలోకి ఆహ్వానింపబడి ఆర్యముడు ప్రత్యక్షమవుతాడు. దివ్యత్వంయొక్క ప్రదీప్తశక్తిచేత (Illumined) సత్తయొక్క ఉదాత్తతచేత సర్వనిర్ణాయకమైన, శక్తి వంతమైన సంకల్పంచేత ఈ ముగ్గురిలో అంతర్యామియైన భగుడు వ్యక్తమవుతాడు. దైవం తన శుద్ధమైన ఆనందంతో మనకు కలిగే భయంకరమైన, మన ఉనికిని ఛిన్నాభిన్నం చేసే దుస్వప్నాలను మటుమాయంచేసి అన్నిటినీ ఆర్యముడియొక్క కాంతివైభవంతో,

మిత్రుడుయొక్క ఉద్భవం మనం నిర్వహించే సత్కార్యాల ఫలితమైన పుత్రుడి లాంటిది. దీనిని సృజించటంకంటే అద్భుతమైన కౌశలం మరొకటి ఏముంటుంది? దానికంటే ఆచరణీయమైన, ఉత్కృష్టమైన నైపుణ్యం ఎక్కడుంటుంది?

*

సృష్టికర్త దేశకాలాల కతీతము. మరి ఆయన సృష్టిలోకి ఎలా ప్రవేశిస్తాడు? సృష్టికార్యమును నిర్వహించుటకై ఆయన తన 'శక్తి'[1] ని (*శివః శక్త్యోయుక్తో*) పంపిస్తాడు. విశ్వమనస్సు, విశ్వ ప్రాణికము, విశ్వభౌతికము ఆమెయే – వాటి క్రియారూపములే మన మనోప్రాణికదైహికములు.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

(*SABCL* Vol. 16, pp. 291, 296-97; Vol. 21, p. 734)

కర్మ – అంతరార్థం

దివ్యకర్మలనగా ఏవో పూజలు, పునస్కారాలు కావు. ఆత్మసమర్పణ భావంతో ఏ పని చేసినా అది కర్మయోగమే. స్వలాభాపేక్ష లేనప్పుడు నీకంటె అధికమైన శక్తి ఒకటి నీలోకి ప్రవేశించి నీచేత పనులు చేయిస్తుంది. అప్పుడే నీలో దైవాంశ పెరుగుతుంది.

– *సంపాదకుడు*

రాజసప్రవృత్తితో అహంకార పరితృప్తికై చేసే కర్మను నేను కర్మగా భావించను. అది అహంకారంతో, అజ్ఞానంతో చేసేది మాత్రమే అవుతుంది. అజ్ఞానానికి ముద్రలైన, అహంకారాన్ని, రాజసప్రవృత్తిని, కోరికను, నశింపచేసుకోవాలనే కాంక్ష లేకుండా కర్మయోగం ఉండదు.

---

1 శ్రీఅరవిందులు Divine Shakti అనేది ఈమెనే

కర్మకు గహనమైన సత్యార్థం ఉంది. అది దాతృత్వం, మానవసేవ, నైతికవర్తన, ఆదర్శవాదం మొదలైనవాటి ప్రత్యామ్నాయం కాదు.

దైవస్ఫూర్తితో ఆయనతో మమేకమవుతూ దేవుని కోసం చేసే సర్వకర్మలూ, చేష్టలూ సత్కర్మలే అని నేను భావిస్తున్నాను. ప్రారంభంలో లోతైన ధ్యానం, ప్రకాశవంతమైన విజ్ఞానం, నిజమైన ప్రేమ, నిత్యభక్తి కలగటమెంత కష్టమో ఇదీ అంత కష్టమే.. ఇందుచేత మిగిలినవాటి వలెనే కర్మలు కూడా దాని యథార్థ స్ఫూర్తితో ప్రారంభించాలి. ఇందుకు నాందీగా నీలో సత్యసంకల్ప సిద్ధి ఉండాలి. తరువాత అన్నీ వాటంతటవే జరుగుతాయి.

ఈ స్ఫూర్తితో చేసే కర్మ, భక్తివలె, తాదాత్మ్యంవలె సత్ఫలితాలు ఇస్తుంది. కోరికను, రాజస ప్రవృత్తిని, అహంకారాన్ని తిరస్కరించి ప్రశాంతతను, పవిత్రతను, చేతనను ఆవిష్కరించుకోవాలి. ఇది దైవశ్రద్ధ వల్లనే సిద్ధిస్తుంది. అహంకారాన్ని నశింపచేసుకుని దైవసంకల్పంతో మనోకర్మ సంకల్పాన్ని సంలీనం చేస్తే వైశ్వికచైతన్యం ఉద్గమిస్తుంది. అనగా మనోచైతన్యాన్ని, వైశ్వికచైతన్యాతీతం చేసుకోవాలి. అప్పుడు ప్రకృతి నుంచి, పురుషశక్తి విడివడి బాహ్యప్రకృతి నుంచి సంకెళ్ళు తెగి, ఆత్మచైతన్యం సాక్షాత్కరించి, విశ్వచేతనలోనికి కర్మభావన పరిణమిస్తుంది. ఇదంతా జగన్మాత లేదా దైవీశక్తి మన హృదయకుహరంలోంచి జరుపుతున్నట్లు అవగాహన అవుతుంది. సంకల్పశక్తిని, కృషిని, నిరంతరం దైవదత్తం చేస్తే ప్రేమ, ఆరాధన పరిఢవిల్లుతాయి. ఆత్మికశక్తి ఉద్గమిస్తుంది. ఊర్ధ్వశక్తి గురించిన ప్రస్తావన పదే పదే తెస్తుండడం వలన అది అధో, ఊర్ధ్వ గమనాలు నిరంతరం సాగిస్తున్నట్లు స్ఫురణకు వస్తుంది. చివరగా కృషి, భక్తి, విజ్ఞానము సంగమించి, ఆత్మ నిర్దిష్టత సాధ్యమవుతుంది. దీనినే మనం ప్రకృతి పరివర్తనం అంటాము.

ఈ ఫలితాలన్నీ ఒకేసారి సంభవించవు. క్రమంగా, నెమ్మదిగా అవతరిస్తాయి. ఆత్మ చైతన్యశక్తిని అనుసరించి ఇది పరిపూర్ణం అవుతుంది. దైవసాక్షాత్కారానికి రాచబాటలు లేవు.

ఆత్మ అంకితభావం మనం చేసే కృషిపై ఆధారపడి ఉండదు. కానీ దాని స్ఫూర్తిపై నిబద్ధమై ఉంటుంది. ఆత్మసమర్పణతో ఏ కృషి చేసినా అది ఫలిస్తుంది. దైవదత్తంగా, జాగ్రత్తగా, చక్కగా చేసే కృషి అవసరం. అహంకారంకానీ, కోరికకానీ ఉండకూడదు. అదృష్టం గురించిన మంచిచెడుల ప్రస్తావనలేని, శాంతస్థితి మానసిక సమానత అవసరం. వ్యక్తి స్వార్థానికిగాక, దైవదత్తంగా ఏ ఆశా లేకుండా ఈ కృషి జరగాలి. కర్మ ద్వారా ఆత్మసమర్పణ భావంతో దైవశక్తియందు విశ్వాసముంచి కర్మ చెయ్యాలి.

*

చైతన్యంలో కృషి గురించిన భావసంపుటి రూపుదాలిస్తే కృషి చైతన్యవంతంగా సాగుతుంది. వ్యక్తిగతశక్తికన్న దైవశక్తి అద్భుతమైనదనే భావనతో సాధన చెయ్యాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: పురాణపండ రంగనాథ్

(*SABCL* Vol. 23, pp. 528-29, 678, 682)

విభాగం III: వ్యవహార దక్షత

లౌకికపరిపూర్ణత్వం – దివ్యపరిపూర్ణత్వం

(Mundane Perfection and Divine Perfection)

'నేను' అనే భావం వున్నంతవరకు నువ్వు ప్రకృతి చేతిలో కీలుబొమ్మగానే వుంటావు. ఎంత తెలివితేటలతో చేసిన పని అయినప్పటికి నీకు పూర్తి వికాసము. కలగదు. నిన్ను మించిన ఒకానొక శక్తి నిన్ను ఆవహించాలి. అది నీ ప్రకృతి స్థానంలో నిలిచి నీ ద్వారా పనిచేసినప్పుడు దైవమే నీ సాధనను వహించి నీకు దివ్యానుభూతులను కలుగచేస్తాడు. – సంపాదకుడు

మానవజీవితం దివ్యపరిపూర్ణత్వం చెందడం – ఇదీ మా లక్ష్యం. మానవుని సమగ్రపూర్ణత్వంలోని ప్రధానాంశాలేమిటో మొదట మనం గ్రహించాలి. రెండవది: మానవపూర్ణత్వం కాకుండా దివ్య పరిపూర్ణత్వం అంటే ఏమిటో తెలుసుకోవాలి. (A divine perfection of the human being is our aim. We must know then first what are the essential elements that constitute man's total perfection; secondly, what we mean by a divine as distinguished from a human perfection of our being.) మానవమనస్సు ఊహించి, నిర్ధారించి, అనుసరించే ఒక ఆదర్శప్రాయమైన సంపూర్ణత్వ ప్రమాణాన్ని, స్వీయ అభివృద్ధిని సాధించే శక్తి మనిషికి వుంది. ఆలోచించే మానవాళికి ఇది ఒక ఉమ్మడి భూమిక. జీవితానికి ముఖ్యమైన లక్ష్యాన్ని సమకూర్చడం సాధ్యమేనని భావించేవారు కొద్దిమందే వుంటారు. కాని కొందరు దీనిని లౌకిక పరివర్తన అని మరికొందరు మతరూపాంతరము అని భావిస్తారు.

లౌకిక పరివర్తన అంటే బాహ్యమైనది, సామాజికమైనది, కర్తృత్వ సమన్వితమైనది. తన తోటివారితో, పరిసరాలతో మరింత హేతుబద్ధమైన సంబంధం కలిగి వుండటం. మరింత మెరుగైన, సమర్థవంతమైన పౌరసత్వం కలిగివుండడం, విధులను నిర్వర్తించడం, జీవితం ఇచ్చే అవకాశాలను మరింత న్యాయబద్ధంగా, సమరసభావంతో, అనుభవిస్తూ, మరింత మెరుగైన, సుసంపన్నమైన, కారుణ్యపూరితమైన, సంతోషకరమైన జీవనవిధానం అని సర్వసాధారణంగా అంతా భావిస్తుంటారు. మరికొందరు అంతర్గతమైన, అంతర్ముఖమైన, ఆదర్శంగా భావిస్తారు. మేధస్సు, సంకల్పం, హేతువును స్పష్టంగా ఆవిష్కరిస్తూ మరింత ఎత్తుకు వాటిని తీసుకొనివెళ్లడం, మానవస్వభావంలోని శక్తియుక్తుల్ని క్రమబద్ధం చేయడం, ఉదాత్తమైన నైతికత, సంపన్నమైన రసదృష్టి సంస్కారవంతమైన ఉద్వేగాలు, ఆరోగ్యవంతమైన సంయమనంతో కూడిన ప్రాణిక, భౌతిక జీవనవిధానంగా మరికొందరు పరిగణిస్తారు. ఒక్కొక్కసారి ఒక్క అంశానికి ప్రాధాన్యం యిచ్చి, మిగతావాటిని వదిలివేస్తారు. ఒక్కొక్కసారి మరింత విశాలమైన,

మరింత స్థితప్రజ్ఞత సాధించిన మనస్సులకు సంబంధించి, సామ రస్యాన్ని, సమగ్రపూర్ణత్వంగా పరిగణిస్తారు. ఇందుకు విద్య, సామాజిక వ్యవస్థలలో మార్పు బాహ్య ఉపకరణంగా భావిస్తారు. లేదా అంతర్గతమైన స్వీయశిక్షణ, అభివృద్ధి దానికి నిజమైన ఉప కరణంగా భావిస్తారు. లేదా ఈ రెండు లక్ష్యాలను అంటే – అంత ర్గత వ్యక్తిపూర్ణవికాసం, బాహ్యజీవన పూర్ణత్వాన్ని – స్పష్టంగా సంలీనం చేయవచ్చును.

ప్రకృతిలో ఒక దివ్యత్వం దాగి వుంది. ఆ దివ్యత్వం ఆవి ష్కరణ వైపు, సాఫల్యంవైపు అస్పష్ట ఆరోహణమే మానవజీవిత మంతా. మనిషిలోను, ప్రపంచంలోను వున్న పరమాత్మవైపు జ్ఞానం, సంకల్పం, జీవితం, కార్యాచరణ వంటి ఉపకరణాలను ఉన్మీలనం చేయడంతో ప్రకృతిలోని దివ్యత్వం రానురాను స్పష్ట మవుతుంది. మరింత చైతన్య ప్రదీప్తమవుతుంది. మరింత ఆత్మ నిక్షిప్త దివ్యనిధిగా మారుతుంది. మనస్సు, జీవితం, శరీరం ఇతర రూపాలు అన్నీ ఈ వికాసానికి సాధనాలు అవుతాయి. కాని వాటికి అతీతంగా వున్నదాని వైపు ఉన్మీలనం చెందగలిగినప్పుడే చిట్టచివరి పరిపూర్ణత్వం సాధ్యమవుతుంది. అవే మనిషి కాదు. మరేదో వుంది. అది కూడ అతనే. అది అతనికి పూర్ణత్వాన్ని, నిండుతనాన్ని ఇస్తుంది. అతనిలోని ఉన్నతమైన, విశాలమైన సత్యాన్ని అతనికి చూపించే వెలుగు నిస్తుంది.

బౌద్ధిక, నైతికమైన, మానసికమైన, ఉద్వేగాలు, రసదృష్టి పరమైన, భౌతిక శారీరశిక్షణ, అభివృద్ధి ఇవన్నీ మంచివే, కాదన లేము. కాని అవి ఆత్మశక్తి, సాన్నిధ్యాల వైపు ఉన్మీలనం కాక పోతే, ఆత్మ నేరుగా జోక్యం చేసుకోడానికి అనుమతి యివ్వక పోతే, అవి ఒక వలయంలో నిరంతరం పరిభ్రమిస్తుంటాయి. జీవి తాన్ని ఒక వెలుగులోకి విముక్తం చేసే దేదీప్య లక్ష్యం వాటికి వుండదు. ఆత్మ ప్రత్యక్షంగా మనలో తన పని చేసుకుంటూపోతే అప్పుడు మన సమస్త చైతన్యం రూపాంతరం చెందుతుంది. ఆత్మసత్యం, ఆత్మశక్తిలోకి వికాసం చెందడం, ఆ శక్తి ప్రత్యక్ష జోక్యంవల్ల ఆత్మవ్యక్తీకరణకు ఒక సరియైన వాహిని కావడం,

భగవంతునిలో మనిషి జీవించడం, మానవాళిలో ఆత్మ దివ్య జీవనం సాగించడం – ఇదీ పూర్ణయోగంయొక్క ప్రధాన లక్ష్యం, ప్రధానసూత్రం. (To grow into the truth and power of the Spirit and by the direct action of that power to be made a fit channel of its self-expression, – a living of man in the Divine living of the Spirit in humanity, – will therefore be the principle and the whole object of an integral Yoga of self-perfection.)

ఈ పరివర్తనలో రెండు దశలున్నాయి. భగవంతునిలో దివ్యజీవనం సాగించే అవకాశం వుందని మనిషి తన ఆత్మ, మనస్సు, హృదయంతో తెలుసుకొనగానే, అదే తన నిజమైన లక్ష్యంగా భావించి అటు తిరగడం, అందుకు తనను తాను సన్నద్ధం చేసుకోవడం, నిమ్నస్థాయిలోని కార్యకలాపాలకు స్వస్తి చెప్పడం, ఆధ్యాత్మిక సత్యానికి, దాని శక్తికి ఉన్మీలనం కావడా నికి అడ్డువచ్చే అవరోధాలను తొలగించడం – ఇదంతా మనిషి వ్యక్తిగత ప్రయత్నంగా భావించాలి. ఈ విముక్తి ద్వారా అతని ఆధ్యాత్మిక చైతన్యాన్ని పదిలపరచుకోడానికి, ఆ చైతన్యం స్వీయ వ్యక్తీకరణకు స్వేచ్ఛాయుత సాధనాలుగా తన సహజ కదలిక లను మార్చుకోవడానికి ఆ ప్రయత్నం అవసరం. ఈ యత్నంతో ఎరుకతో మానవయోగనిష్ఠ తన లక్ష్యాన్ని తెలుసుకొని ప్రారం భమవుతుంది. ఒక కొత్త జాగృతి సంభవమవుతుంది. జీవన ప్రయోజనంలో ఊర్ధ్వపరివర్తన కలుగుతుంది. మామూలు జీవన ప్రయోజనాల కొరకు బౌద్ధికమైన, నైతికపరమైన, ఇతర శారీరక శిక్షణలన్ని, అవన్నీ మనస్సు, శరీరం, జీవితం పనిచేసే సాధారణ వలయాన్ని దాటలేనప్పుడు, మనం ఇంకా ప్రకృతి సాగించే అస్పష్టమైన, మసకబారిన ప్రాథమిక యోగదశలో ఇంకా కొట్టు మిట్టాడుతున్నట్లే. భగవంతుని కొరకు, దివ్యపరిపూర్ణత్వం కొరకు, మనలోని అన్ని భాగాలలో ఒక ఏకత్వం కొరకు, మన ప్రకృతిలో ఆధ్యాత్మిక పూర్ణత్వం కొరకు మనలో ఒక ఆధ్యాత్మిక ఆకాంక్ష కలగాలి. మనలో పరివర్తన వచ్చినట్లు అదే ఒక సూచన. మన చైతన్యం, జీవితం పూర్ణంగా రూపాంతరం చెందిందనడానికి అది

తొలి సంజ్ఞ. (A greater perfection can only be arrived at by a higher power entering in and taking up the whole action of the being. The second stage of this Yoga will therefore be a persistent giving up of all the action of the nature into the hands of this greater Power...)

మరింత ఉన్నతమైన శక్తి మనలో ప్రవేశించి చైతన్య పరివర్తనను చేపట్టినప్పుడు మరింత మహనీయమైన పూర్ణత్వం సిద్ధిస్తుంది. ఈ శక్తికి సర్వపరివర్తన కార్యాన్ని అప్పగించడం ఈ యోగంలో రెండవదశ. వ్యక్తిగత ప్రయత్నం స్థానే ఆ శక్తి పని చేస్తుంది. అప్పుడు భగవంతుడే యోగానికి ప్రత్యక్ష అధినేత అవుతాడు. ఆయనే మన చైతన్యంలో ఆధ్యాత్మిక, ఆదర్శపూర్వక పరివర్తన సాధిస్తాడు.

విశ్వాతీత దైవానికి తనను తాను ఉన్మీలనం చేసుకోవడం ఈ సమగ్ర పూర్ణత్వంలోని అతిప్రధాన అంశం. విశ్వజనీన దైవంతో సాయుజ్యం చెందడం మరో ప్రధానాంశం. సచ్చిదానందంతోనూ, సమస్త సృష్టి వస్తురాశిలో, జీవులలోగల విశ్వజనీన ఆత్మతో సాయుజ్యం పొందకపోతే, మానవప్రకృతిని దివ్యప్రకృతిగా మార్చడం, దివ్యజ్ఞానం, ఇచ్ఛ, జీవిత ఆనందాల ఉపకరణంగా మానవప్రకృతిని మార్చడం అసంభవం. దివ్యప్రకృతిలో స్వీయ సంలీనం కాకుండా, పూర్ణంగా విడిగా వుండి, దివ్యప్రకృతిని వశం చేసుకోవడం సాధ్యం కాదు. మానవజీవితం ఉన్నంతకాలం మనస్సు, జీవం, శరీరం ద్వారా విడిగా జీవిస్తూ ఆ సాయుజ్యాన్ని అంతర్గత ఆధ్యాత్మిక ఏకత్వంగా పరిగణించ లేడు. ఆధ్యాత్మిక సాయుజ్యం ద్వారా విశ్వాత్మకు ఇతర నిరంతర లక్షణాలైన విశ్వజనీన మనస్సు, విశ్వజనీన జీవనం, విశ్వజనీన రూపం ద్వారా, ఈ ఆధ్యాత్మిక సాయుజ్యం ద్వారా పూర్ణత్వాన్ని వశం చేసుకోవాలి. మనిషిలో సిద్ధిపొందిన భగవంతుని ఆత్మవ్యక్తీకరణమే మానవజీవితంగా ఇప్పటికీ ఆమోదిస్తున్నందువల్ల, మన జీవితంలో పూర్తిగా దివ్యప్రకృతికి చెందిన కార్యాచరణ వుండి తీరాలి. ఇటువంటి స్థితిలో అతిమానసరూపాంతరీకరణ అవసరం. మానవ

ప్రకృతి అసంపూర్ణ కార్యాచరణకు, ఆధ్యాత్మిక చైతన్యపరమైన స్వకీయ కార్యాచరణ అప్పుడు సాధ్యపడుతుంది. ఆధ్యాత్మిక ఆదర్శ మహత్వంతో, మానసిక, ప్రాణిక, భౌతిక భూమికల్ని రూపాంతరం చెందించడం సాధ్యం అవుతుంది. పరాత్పరునితో, విశ్వజనీన ఆత్మతో సాయుజ్యం చెందడం, అతిమానస కార్యాచరణ – ఇవి సర్వసమగ్ర దివ్యపరిపూర్ణత్వంలోని ముఖ్య విశేషం. విశ్వాతీతమైనప్పటికీ, విశ్వజీవనమైనప్పటికీ, వ్యక్తి ఆత్మ, సహజమైన ఉపకరణం ఈ సాయుజ్యంలో పాలు పంచుకోవడం గమనార్హం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. యజ్ఞన్న

(SABCL Vol. 21, pp. 590-96)

జనని కర్తృత్వము

మనిషి అనగా మనో ప్రాణిక దైహికముల సంపుటి, ఈ త్రిగుణాలతో పనిచేసే యంత్రము. కాని మనము వీటికి బందీ అయివుండనవసరము లేదు. ఈశ్వరుడు 'శక్తి' ద్వారా సృష్టిని నిర్వహిస్తాడు. అది మనని పాలించే దేవత. మన మా దేవతను మనలోకి ఆహ్వానించినపుడు మనకు వికాసము కలుగుతుంది. క్రమక్రమంగా అతిమానసస్థాయికి చేరుకోగలుగుతాము. *– సంపాదకుడు*

ఈ సమగ్రతా సంపూర్ణతలు చేరుకోవడానికి నిచ్చెన జగన్మాత. నీ సర్వస్వం ఆమెనాహ్వానించటంలో కంపించిపోవాలి. మన కర్మల బాధ్యతలనామె కప్పగించాలి. అప్పుడు కర్మనిర్వహణలో సంకుచిత అహంభావన క్షాళితమైపోయింది. నేను కర్తనన్న భావమే ఉండదు! త్రిగుణాధీనత తొలగిపోతుంది. మనఃప్రాణశరీర ధర్మాలు వైదొలగిపోతాయి. అప్పుడు అమ్మే మనలో వెన్నెలగా నిండిపోయి, మన లోలోని కర్మజాలం పగ్గాలు తానే గ్రహించి బాహ్యజీవి

తాన్ని, మన యోగాన్ని పాలించే తల్లిగా దిగివస్తుంది. మన శక్తిపై ఆమె ఆధిపత్యం వహిస్తుంది – అది ఆమె కల్పించిన క్షుద్ర రూపమే కనుక. వాటిని ఉన్నతీకరించి పవిత్రమూ, సమగ్రమూ నైన ప్రజ్ఞాప్రకాశంగా, ఇచ్ఛాశక్తులుగా, ఆత్మచర్యగా పరిణమింప జేస్తుంది. (The divine Shakti will fill us and preside over and take up all our inner activities, our outer life, our Yoga. She will take up the mental energy, her own lower formation, and raise it to its highest and purest and fullest powers of intelligence and will and psychic action.) మన మనఃప్రాణశరీరాధీనంగా బ్రతికే మన బ్రతుకులను ఆమె నిత్యసాన్నిహిత్యంలో దివ్యానందమయ కాంతిలోకి మళ్ళిస్తుంది. ఆమె మనలో వ్యక్తమై మానసిక వివిధ దివ్యానుభూతులకు సమన్వయం కల్పిస్తుంది. ఈ ప్రక్రియకు కిరీటప్రాయంగా ఆ తల్లి మనోభూమికల్లోకి పరాత్పర జ్యోతిస్సులను అవతరింపచేస్తుంది. అప్పుడు మనస్సన్నదే మారిపోతుంది. అది పరాత్పరచేతనగా పరిణమిస్తుంది. క్షుద్రశక్తులను తన పరమేశ్వర శక్తులుగా ఊర్ధ్వీకరించి, మనలను దివ్యప్రజ్ఞలో మేల్కొలుపుతుంది. అప్పుడామెయే పురుషోత్తమునిగా అవతరిస్తుంది. ఆ ఈశ్వరుడే తన పరాచేతనగా, పరమాత్మగా తానై అవతరిస్తాడు – తనను తానుగా వ్యక్తీకరించుకొంటాడు. అప్పుడు మన వ్యక్తిత్వానికీ, కర్మలకూ, జీవితానికీ, యోగానికీ అతడే యజమాని.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

(*SABCL* Vol. 21, pp. 732-33)

ఈ పరివర్తన ఎవరికోసం?

ఈ యోగము, ఈ సాధన, ఆ మాటకొస్తే అసలీ బ్రతుకెందుకు? ఏవేవో గొప్ప సిద్ధులను సంపాదించి దివ్యసౌఖ్యాలను అనుభవించేందుకా? కానే కాదు, ఇక్కడ నువ్వు పొరపడకూడదు. అది దైవేచ్ఛ కనుక, దైవకార్యానికి నువ్వొక చక్కటి మాధ్యమము కనుక. ఆ ఉద్దేశంతో, చిత్తశుద్ధితో, ఏ మాత్రం మినహాయింపు లేకుండా నిన్ను నువ్వు పూర్తిగా దైవానికి సమర్పించుకో. అప్పుడు ఆయనే నిన్ను తన ఇచ్ఛానుసారంగా మలిచి నీ జీవితాన్ని తీర్చి దిద్దుతాడు.

— సంపాదకుడు

మధుమయీ, ఈ విధంగా వ్రాయబడింది, "ఈ విముక్తి, పర్ఫెక్షన్, పరిపక్వతలను కూడ మనకొరకు కాదు, దైవం కొరకే అనుసరించాలి". కాని మనం చేయు సాధన మన కోసం కాదా?

అంత కచ్చితంగా ఆయన నొక్కి చెప్పేది అదే. దాని అర్థం మనం పొందబోయే ఈ సిద్ధి అంతా వ్యక్తిగతము, స్వార్థ పూరితమగు లక్ష్యంతో కూడినది కాకూడదు. అది దైవసాక్షాత్కారం జరుగుటకుగాను, దైవోపయోగానికై వినియోగింపబడాలి. ఈ వికాసాన్ని వ్యక్తిగత పరిపూర్ణతను పొందాలనే స్వార్థపూరిత ఉద్దేశంతో అనుసరించకూడదు. దైవకార్యాన్ని నెరవేర్చుటకే అనుసరించాలి.

కానీ, మనమీ దైవకార్యాన్ని అసలు ఎందుకు చేయాలి? మనలను మనం సిద్ధపరచుటకు...

కాదు, కానే కాదు! అది దైవేచ్ఛ కనుక. వ్యక్తిగత కారణం కోసం కానే కాదు. అలా కాకూడదు కూడ. అది దేవేచ్ఛయే. దైవకార్యం కనుకనే దానిని చేస్తాము.

ఒక వ్యక్తిగత ఆకాంక్షయో, కోరికయో, ఒక స్వార్థపూరిత సంకల్పమో దానితో మిళితమై వున్నంతవరకు, అది ఒక మిశ్రమ ఫలితాన్ని కలుగజేస్తుందే తప్ప అచ్చమైన దైవేచ్ఛను అభివ్యక్త

పరచదు. *ప్రాధాన్యతనివ్వవలసింది దైవానికి, అతని సంకల్పానికి, అతని సాన్నిధ్యానికి, అతని అభివ్యక్తతకు మాత్రమే.* ప్రతియొక్కరు ఇచ్చట నున్నది అందుకొరకే. ప్రతివారు ఆ ప్రతిరూపమే తప్ప వేరొకటి కాదు. నేను, నాది అనే భావన, అహం, వ్యక్తిగతం అనేవి ప్రవేశిస్తే సరేసరి, మనిషి తాను ఎదగవలసిన స్థాయికి ఇంకా ఎదగలేదని రుజువైనట్లే. ఇది ఒక చిటికెలో అయ్యే పని కాదు. అయినా కూడ ఇదే సత్యమని చెప్పగలను. ఈ ఆధ్యాత్మిక క్షేత్రంలో కూడ కేవలం వ్యక్తిగత కారణాల కోసమో, స్వార్థపర కారణాల కోసమో సాధన చేసేవారు చాలామంది వున్నారు. (ఆధ్యాత్మిక జీవితాన్ని ఎన్నుకొని, యోగాభ్యాసం చేసేవారి గురించి నేను చెప్పగలను.) కొందరు జీవితంపై విసుగు చెంది, కొందరు దుఃఖ భాజితులై, కొందరు ఇంకా ఎంతో తెలుసుకోవాలనే కోరికతోటి, ఇంకొందరు ఆధ్యాత్మికంగా గొప్పవారు కావాలనే తపనతోను, మరికొందరు ఇతరులకు బోధించుటకై ఎన్నో విషయాలను నేర్చుకోవాలనే కోరికతోను – వాస్తవంగా యోగాభ్యాసం చేపట్టుటకు వెయ్యినొక్క వ్యక్తిగత కారణాలుండవచ్చు. కాని భగవంతుడు నిన్ను చేరదీసి, తన సంకల్పానికి అనుగుణంగా నిన్ను తీర్చిదిద్ది, పవిత్రతను, ప్రేమాభిమానాలను నీలో పూర్తిగా నింపగలిగేలా నిన్ను నీవు దైవానికి సంపూర్ణంగా సమర్పించుకునే అతి సాధారణ మార్గాన్ని అనుసరించేవారు, ఎక్కువగా లేరు. అయినప్పటికి అదే పరమసత్యం. ఈ మార్గంలో తప్పులు దొర్లే అపాయం లేకుండ గమ్యాన్ని తిన్నగా చేరవచ్చు. But the simple fact of giving oneself to the Divine so that the Divine takes you and makes of you what He wills, and this in all its purity and constancy, well, there are not many who do that and yet this indeed is the truth; and with this one goes straight to the goal and never risks making mistakes. మిగతా కారణాలన్నీ కలగూరగంప లాంటివి. అహంభావ ఆచ్ఛాదితములై వుంటాయి. అందువల్ల అవి నిన్ను గమ్యానికి దూరంగా అటో ఇటో కొనిపోతాయి.

కాని, నీ ఉనికికిగల కారణం ఒక్కటే, నీ గమ్యం ఒక్కటే, నీ ఉద్దేశం ఒక్కటే. ఇటుపైన నీకు భగవంతునికి మధ్య తేడా తెలియనటువంటి స్థాయిని అందుకునేటందుకు నీ సర్వస్వాన్ని పరిపూర్ణంగా, నిశ్శేషంగా అతనికే అంకింతం చేయాలనీ, వ్యక్తిగత స్పందనలు అడ్డుతగలకుండా నీ సర్వమూ సంపూర్ణంగా, నిశ్శేషంగా అతనిదే అనే భావనను కలిగియుండుట ఆదర్శవంతము. అదీగాక అన్నింటినుండి నీకు రక్షణ కల్పించి నీ జీవితంలోను, నీవు చేసే ప్రతిపనిలోను పురోభివృద్ధిని సాధింప వీలుకలుగజేయునది ఇదొక్కటే. అన్ని అపాయాలకన్నా మిన్నైన అపాయం నీకు నీనుండే పొంచివుంటుంది కనుక, దాని నుండి కూడ నీకు రక్షణ కల్పించేది ఇదే. నీకు నీనుండి కలిగే అపాయానికన్నా తీవ్రమైనది మరొకటి లేదు.

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

(*CWM* Vol. 7, pp. 191-92,)

ఆత్మ ప్రక్షాళన

నువ్వొక సమూహంలో వుంటావు. నువ్వెంత జాగ్రత్తగా వున్నా సరే. ఇతరుల ఆలోచనలు, స్పందనలు నిన్ను కలవరపరుస్తాయి. దీన్ని తప్పించుకోవాల్నంటే నువ్వు నీ ఆత్మస్పర్శను పొందాలి. ఆత్మసింహాసనంలో సుస్థిరంగా ఆసీనుడవై వుండాలి. బాహ్యా స్పందనలన్నిటిని అక్కడికక్కడే తిప్పికొట్టాలి. – సంపాదకుడు

వ్యక్తి తనను తాను పరిపూర్ణుడుగా తీర్చిదిద్దుకొనుటకుగాను, మొదట అతను తనను తాను తెలుసుకోవాలి. ఉదాహరణకు, యిలాంటి పరిస్థితి నీ జీవితంలో చాలాసార్లు తప్పక తటస్థపడి వుంటుంది. ఎవరో ఒకరు వున్నట్లుండి నిన్ను, 'నీవు అది ఎందుకు చేశావు?' అని ప్రశ్నిస్తారు. సరే, వెంటనే వచ్చే సమాధానం, 'నాకు తెలియదు'. నిన్నెవరయినా, 'దేనిని గురించి ఆలో

చిస్తున్నావు?' అని అడిగితే 'నాకు తెలియదు' అంటావు. 'ఎందుకు సంతోషంగా వున్నావు?' 'నాకు తెలియదు' – ఇదీ వరస. ఓ యాభైమందిని, ఆలోచించుకొనుటకు అవకాశమివ్వకుండా, అమాంతంగా, 'నీవు అదెందుకు చేశావు?' అని ప్రశ్నిస్తే, వారు గనుక అంతర్గతంగా మేల్కొని వుండనట్లయితే, 'నాకు తెలియదు' అని సమాధానమిస్తారు. (ఇక్కడ నేను మాట్లాడుతున్నది ఆత్మజ్ఞాన శిక్షణ నభ్యసించినవారి గురించిగాని, తమను తాము పూర్తిగా జయించినవారి గురించిగాని కాదు. వారిని వారు సమీకరించుకొని, ఏకాగ్రతను పొంది సరైన సమాధానాన్ని యివ్వగలరు. కాని అందుకు కొంత సమయం పట్టవచ్చు.) కాని నిన్ను నీవు శ్రద్ధగా గమనించినట్లయితే యిలా జరుగుతుంది. నువ్వు ఏదో ఒకటి అంటావు. కానీ అలా యెందుకని అన్నావో నీకు తెలియదు – మాటలు నీ నోటినుండి బయటపడిన తర్వాత గానీ, నీవు చెప్పదలచినది అది కాదు అని గమనించలేవు. మాట వరుసకు, నీవు ఎవరినో చూచుటకు వెళ్లవలసివస్తే, వారితో మాట్లాడబోయే మాటలను ముందుగానే సిద్ధపరచుకుంటావు. కానీ ఆ సంబంధిత వ్యక్తి ఎదుటబడగానే, నీవేమీ అనలేవు, లేదా వేరే మాటలు నీ నోటినుండి వస్తాయి. ఎంతమేరకు యెదుటి మనిషియొక్క సాన్నిధ్యము నీపై ప్రభావము చూపి, నీవు సిద్ధపరచుకున్న మాటలను మాట్లాడనీయకుండా ఆపిందో చెప్పగలవా? నేను మాట్లాడేది పరస్పర ప్రభావాలు యెంత స్పష్టంగా ప్రస్ఫుటమవుతాయన్న దానిని గురించి, నీ ప్రకృతి పైన యేది పనిచేస్తుంది, యేది విఘాతాన్ని కలిగిస్తుంది అనే దానిని గురించి. ఉదాహరణకు, ఒక వ్యక్తి ఉన్నట్లుండి బాధపడటమో లేక సంతోషంతో వుప్పొంగడమో జరుగుతుంటుంది. కాని, 'ఇది ఇందువల్ల' జరిగింది అని యెవరు చెప్పగలరు? ఇది తెలుసుకోవడం చాలా కష్టం. అంత సులభమేమీ కాదు. వ్యక్తి పూర్తిగా మేల్కొని వుండాలి, నిరంతరం అత్యంత శ్రద్ధతో పరిశీలించగల స్థితిలో వుండాలి.

రోజుకు పన్నెండు గంటలు నిద్రిస్తూ మిగతా సమయంలో 'నేను మేల్కొనే వున్నాను' అని అనే వారున్నారు! రోజుకు ఇరవై గంటలు నిద్రిస్తూ మిగతా సమయం సగం నిద్రలో వుండేవారు కూడా వున్నారు!

ఇంత శ్రద్ధాపూర్వకంగా గమనించగల స్థితిలో నుండు టకుగాను, చెప్పాలంటే, నీ చైతన్యముయొక్క కేంద్రముతో నిరం తర సంపర్కము కలిగి యున్నటువంటి ఏంటెన్నా (antennae) నీకు ప్రతి చోటా వుండాలి. దీనివలన ప్రతి విషయాన్ని నీలో నమోదు చేసుకొనగలుగుతావు. క్రమపద్ధతిలో ఏర్పాటు చేసుకొన గలుగుతావు. ఈ విధంగా అయితే, ఆకస్మిక పరిణామాలు నిన్ను కలవరపరచవు. నీవు వంచింపబడవు. నీవు అన్యథా భావించ బడవు. నీవు మాట్లాడాలనుకున్నది తప్ప వేరొకటి మాట్లాడవు. కాని, మామూలుగా, యెంతమంది యీ స్థితిలో మనగలరు? 'చైతన్యవంతుడగుట' అని నేనడంలోగల కచ్చితమైన అర్థం యిదే. నీ ప్రస్తుత స్థితిగతులనుండి, పరిస్థితులనుండి యెక్కువ ప్రయోజ నాన్ని కోరుకుంటే, నీవు పూర్తిగా మేల్కొని వుండాలి. నీవు ఆకస్మిక సంభ్రమాశ్చర్యాలకు లోనుకాకూడదు. ఎందుకో తెలుసు కోకుండా పనులను చేయకూడదు. విషయాలపై అవగాహన లేకుండ మాట్లాడకూడదు. నిరంతరం మెలుకువతో వుండాలి.

విభిన్న వ్యక్తిత్వాలు మీలో లేవని, జీవితమంతా శక్తుల, చైతన్యముల, ప్రకంపనలయొక్క, అన్నిరకముల కదలికలయొక్క నిరంతర వినిమయములతో (exchanges) కూడినదని కూడ నీవు తెలుసుకోవాలి. ఒక గుంపులో చూడు – ప్రతి యొక్కరు త్రోసి నట్లయితే అందరూ ముందుకు సాగుతారు. అందరూ వెనుకకు తగ్గితే ప్రతి ఒక్కరూ వెనుకకు వస్తారు. నీ అంతరంగంలోను, నీ చైతన్యములోను జరిగేది యిలాగే వుంటుంది. అన్ని వేళలా ఎన్నో శక్తులు, ప్రభావాలు నీపైన పనిచేస్తుంటాయి. విఘాతాలను కలిగి స్తుంటాయి. ఇది వాతావరణంలో విషవాయువు వలె వుంటుంది. నీవు పూర్తిగా మేల్కొని వుండనట్లయితే యివి నీలో ప్రవేశిస్తాయి. నీలోనికి బాగా చొచ్చుకొనిపోయి, తిరిగి నీలో నుండే వచ్చినట్లుగా

బయల్పడినట్లుగాని, వాటిని గురించిన అవగాహన నీకు కలుగదు. అధైర్యంతో ఆందోళన చెందినవారు, ఆగ్రహావేశాలతో వూగిపోతున్నవారు, విచారంతో క్రుంగిపోతున్నవారు ఎవరికైనా తారసపడినట్లయితే, వారు కూడ ఉన్నపళంగా అధైర్యపడి, ఆగ్రహంచెంది, విచారానికి లోనుకావడం ఎన్నిసార్లు జరుగదు? ఇలా యెందుకు జరుగుతుందో వారికే తెలియదు. కొందరితో ఆటలాడుతున్నప్పుడు, నీవు చాలా బాగా ఆడగలుగుతావు. కాని, మరికొందరితో ఆడినప్పుడు నీవు అసలు ఆడలేకపోతావు. ఇలా యెందుకు జరుగుతుంది? దుర్మార్గానికి దూరంగా వుండే అతి నెమ్మదస్తులు సైతం యెప్పుడైనా అల్లరిమూకలతో కలవడం సంభవిస్తే, వారు కూడ అకస్మాత్తుగ కోపోద్రిక్తులవుతారు. ఇలా జరగటానికి కారకులెవరో ఎవరికీ తెలియదు; ఇది యేదో పీడగాలి వీచినట్లు వుంటుంది. ఇలాంటి ప్రకంపనలను విడుదల చేయగల వారుంటారు. ఇతరులు తెలియకుండానే వాటికి ప్రతిస్పందిస్తారు. అతి చిన్న విషయంనుండి అతిపెద్ద విషయం వరకు ప్రతీదీ యిలాగే వుంటుంది.

ఒక గుంపులో తన స్వతంత్రాన్ని నిలద్రొక్కుకుని ఉండాల్నంటే అతను తనను తాను పరిపూర్ణంగా తెలుసుకోవాలి. అన్ని మిశ్రమాలకు అతీతమైన ఆత్మను గురించి తెలుసుకోవాలి. అనగా, నేను దేనినయితే నీ అస్తిత్వపు పరమ సత్యము అని అంటానో, దానిని గురించి తెలుసుకోవాలి. సమిష్టి ఆలోచన, సమిష్టి సూచనలు, వ్యక్తిగత ఆలోచనలపై తమ తీవ్ర ప్రభావాన్ని తరచుగా కనపరుస్తూంటాయి. విశేషమేమంటే యెవరు కూడ గమనించరు. ప్రతివారు తాము 'అదే మాదిరి' గా ఆలోచిస్తున్నామని నమ్ముతారుగాని అసలు నిజం, 'అదే మాదిరి' గా ఆలోచించేది సమిష్టిగాని, వ్యష్టి కాదు. సమిష్టి యెప్పటికీ వ్యక్తికన్నా అల్పమైనదే. ఒకే వర్గానికి చెందిన ఒకే మాదిరి గుణములుగల వ్యక్తులను తీసుకో. వారు గుంపులో కలవకుండా ఏకాంతంగా వున్నప్పుడు, గుంపులో నున్న అదే వర్గానికి చెందిన యితరుల కన్నా రెండురెట్లు ఉన్నతంగా వుంటారు. ఆ గుంపులో అస్పష్టతల మిశ్రమము

వుంటుంది. చైతన్యరహితస్థితిలోనికి తప్పక జారిపోతావు. దీనిని తప్పించుకొనుటకు ఒకే ఒక మార్గం వున్నది. తనను తాను తెలుసుకొనుట, మరింత ఎక్కువ చైతన్యముతో నుండుట, మరింత శ్రద్ధగలిగి వుండుట.

ఈ చిన్న అభ్యాసాన్ని చేసి చూడు. రోజు ఆరంభంలో ఈ విధంగా అనుకో, 'నేను మాట్లాడేదానిని గురించి ఆలోచించకుండా మాట్లాడను' నీవు మాట్లాడేదంతా ఆలోచించే మాట్లాడతావని నీ నమ్మకం కదూ! అది యెంత మాత్రం నిజం కాదు. నీవు యే మాటను అనకూడదనుకున్నావో, అదే నీ నోటినుండి వచ్చేందుకు సిద్ధంగా వుండటం యెన్నోసార్లు జరుగుతుంది. దానిని బయటకు రాకుండా ఆపటానికి ఒక మనఃపూర్వక ప్రయత్నం చేయుట అనివార్యమవుతుంది.

ఆ విధంగా, క్రమక్రమంగా, నెమ్మదిగా, పట్టుదలతో, ముఖ్యంగా అతి జాగ్రత్త, అత్యంత శ్రద్ధ వున్నట్లయితే, వ్యక్తి చైతన్యవంతుడవుతాడు. తనను తాను తెలుసుకొనుటయు, తదుపరి తన మీద తాను ఆధిపత్యము వహించుటయు నేర్చుకుంటాడు.

మూలం: శ్రీమాత
అనువాదం: ఎ. కైలాసపతి, జానకి
(మార్చి 2005 '*అఖిల*' నుండి)

(*CWM* Vol. 4, pp. 34-37)

గొప్ప కార్యకర్త్రిణి మహాసరస్వతి

ఈ సృష్టి ఒక నిచ్చెన లాంటిది. ఒక్కొక్క యుగంలోను, ఒక్కొక్క చేతనాస్థాయి నందుకొంటుంది. సాధారణంగా మనిషి ఒక ఆధ్యాత్మిక సోపానాన్ని అధిరోహించినప్పుడు పాత జీవితాన్ని 'దాని కర్మ ఇంతేలే' అని వదిలేస్తాడు. కాని ఇప్పుడు భూలోకజీవితాన్ని అలా వదలివేయవలసిన అవసరం లేదు. ఇప్పుడు 'మహాసరస్వతి' వచ్చి మనని అతిమానసస్థాయికి తీసుకొనిపోతోంది.

— సంపాదకుడు

చేతన ఒక నిచ్చెన లాంటిది. అది ఒక్కొక్క యుగంలోను ఒక్కొక్క స్థాయిలో రాణిస్తూ ఉంటుంది. యుగాంతంలో ఒక మహాపురుషుడుదయించి నిచ్చెన పైమెట్టు ఎక్కుతాడు. ఎవ్వరూ చూడని మరో చేతనాస్థాయినందుకుంటాడు. పదార్థమయలోకాన్ని వదిలేసి ఉన్నతస్థాయిని చేరుకోవడం సాధ్యమే. కానీ అలా చేరుకున్నప్పుడు పాతభూమికతో సంబంధం తెగిపోతుంది. ఆ విధంగా పదార్థమయ చైతన్యంతో సంసర్గాన్ని వదలకుండా ఉన్నతస్థాయిని చేరి అక్కడ నుంచి అనేక భూమికల ద్వారా అట్టడుగు చైతన్యంతో అనుసంధానం ఏర్పాటు చేయడమే యుగకర్తల ధ్యేయము. అలా చేయడంతో పై స్తరాలకూ, అట్టడుగు స్తరాలకూ అంతరం లేకుండా సంసర్గాన్ని ఏర్పాటు చేయడమే అవతార పురుషుల కర్తవ్యం. ఈ విధంగా ఒక్కొక్క అవతారం పైకి అధిరోహిస్తూ ఒక్కొక్క సోపానపంక్తిని చేరుతూ పోయినప్పుడు ఒక్కొక్క నూతన సృష్టి జరుగుతూ వచ్చింది....

నేడు పొందుతున్న స్తరాన్ని శ్రీఅరవిందులు అతిమానస మన్నారు. దీని ప్రభావంతో మానవచైతన్యం ఈ అతిమానస లోకంలోకి ప్రవేశించినప్పటికీ తన వైయక్తికరూపం వదలుకోదు. అది తిరిగివచ్చి నూతనసృష్టిని స్థాపిస్తుంది. అయితే ఇదే చరమ శ్రేణి అని మాత్రం అనుకోకూడదు. ఇంకా ఎన్నో స్థాయిలున్నాయి. ప్రస్తుతం ఆ అతిమానసాన్ని పృథ్వి పైకి తేవడానికి కృషి చేస్తు

న్నాము. తద్వారా ఈ లోకాన్ని పునర్వ్యవస్థీకరించాలనీ, సత్య పరిపాలనను పునఃప్రతిష్ఠ చేయాలనీ మా సంకల్పము. అది నిజంగా ఒక సక్రమమైన వ్యవస్థ కావాలి. ప్రతిదీ నియమిత స్థానంలో సుస్థిరం కావాలి. దీన్ని ప్రధానంగా నిర్వహించవలసిన మహాశక్తి సర్వమంగళ స్వరూపురాలైన మహాసరస్వతి.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకట్రామ శాస్త్రి

(ఫిబ్రవరి 2004 *'అఖిల'* నుండి)

(*CWM* Vol. 3, pp. 178-79)

అల్లకల్లోలాల నరికట్టడ మెలా?

నేటి ప్రపంచ పరిస్థితి ఏమంత గొప్పగా లేదు కదా! మరి దీన్ని బాగుచేయటమెలా? ఎటు చూసినా సమ్మెలు లేక రాజకీయ సంక్షోభాలు మన జీవితాన్ని కలవరపరుస్తూనే వుంటాయి. కేవలం డబ్బులు పంచిపెట్టడంవల్లనో లేక అందరినీ మంత్రులు చేయడం వల్లనో ఈ సమస్య తీరేది కాదు. దీనికి మూలకారణమేదో కని పెట్టి దానిని కూకటి వేళ్లతో సహా పీకేయాలి. ఈ భారాన్ని దైవం మీదనే మోపాలి. Divine will *కే అప్పగించాలి. అప్పుడు* Divine harmony *నెలకొంటుంది. అంతా చక్కబడుతుంది.*

– సంపాదకుడు

ఒక శిష్యుడు: నేడు 'ప్రపంచమంతా' సంక్షోభంలో వుందని అందరూ ఆందోళన పడుతున్నారే....

అవును, పొద్దుట లేచిన దగ్గర నుంచీ ఎటు చూచినా సమ్మెలూ, పోరాటాలూ, దౌర్జన్యాలూ, కల్లోలాలూ మన చుట్టూ పరిభ్రమిస్తున్నాయి నిజమే. వాటి కన్నిటికీ పటిష్టమైన ఓ నియం త్రణ జరగాలి. ఏ వ్యక్తులవల్ల ఈ అరాచకాలు జరుగుతున్నాయో, వారివల్లే మళ్ళీ అవి చక్కబడాలని (మేధావుల అభిప్రాయం. అది సరైనదే కాని దాన్ని మామూలుగా కాక, కాస్త వున్నతంగా

ఆలోచించవలసి వుంది. నీతిసూత్రాలూ, సాంఘిక నిబంధనలూ మొదలైనవాటితో పరిస్థితిని చక్కపెట్టాలని ప్రయత్నిస్తూ ప్రతిసారీ విఫలమైపోతున్నాం. మాటిమాటికీ అలా తల పగలకొట్టుకోవడం కంటె, ఆ పద్ధతుల్ని విడిచిపెట్టి కాస్త ఉన్నతమైన మార్గాన్ని అనుసరించాలి. అది దైవేచ్ఛకి అనుగుణమైన తాత్వికమార్గంలో వుంటే ఉత్తమ పద్ధతి అవుతుంది. అసలు ప్రస్తుతానికి కావల సిందీ జరగవలసిందీ అదే.

అలా జరిగినట్లైతే, మామూలు పద్ధతుల్ని వ్యతిరేకిస్తూన్న ఆ తిరుగుబాటుదార్లు కూడా మీ ఉన్నతాశయాన్ని గ్రహించి అదే సత్యసమ్మతమైనదని ఋజువు చేస్తారు.

ఇప్పుడు అలాంటి ముందడుగు వెయ్యవలసిన సమయం వచ్చింది.

నిర్మాణాత్మకమైన కార్యాల్ని సాధించేటప్పుడు ఈ పద్ధతి, అతి శక్తివంతమైన మంత్రంలా అద్భుతంగా పనిచేస్తుంది. అయితే యిలాటి ఘనకార్యాల్ని ధార్మికులైన మేధావులు చేపట్టినప్పుడు మాత్రమే అది చైతన్యవంతమైన సత్యస్వరూపంగా అవతరిస్తుంది. ప్రస్తుతం తప్పనిసరిగా యీ రకమైన ముందడుగు పడాలి.

అసలైన పునర్నిర్మాణం జరగాలంటే, ఆ కోవకి చెందిన వారంతా చేతులు కలిపి ఐకమత్యంగా కార్యక్రమాన్ని చేపట్టాలి. నిలకడగా, నిలవలేని పాతపద్ధతుల్ని తుడిచి పారెయ్యాలి. మెరుగైన విధానాన్ని అమలుచెయ్యడం కోసం, కాలం చెల్లిన వాటిని తీసిపారెయ్యక తప్పదు.

దీన్ని గుర్తించినవారే ఆ ఆశయాన్ని నిర్వహించగలుగుతారు.

మూలం: శ్రీమాత

అనువాదం: రాజేశ్వరి శంకరన్

(*CWM* Vol. 11, pp. 253)

ఆర్గనైజేషన్ లేనిదే ఏ పనీ కాదు

(Organisation: Indispensable for all Good Work)

నువ్వు ఒక చోటుకి వెళ్ళాల్నంటే తిన్నగా అక్కడకి వెడతావా లేక దిక్కు తోచకుండా అటూ ఇటూ తిరుగుతావా? అలా చేస్తే కాలయాపన అవుతుందేగాని పనికాదు. కాని మనందరం చేస్తున్న పనేమిటి? వెయ్యి పనులు చేస్తాం. అందులో మనకి పనికి వచ్చే వెన్ని? ఎక్కువగా మనని తప్పు దారిపట్టించే వృథా కార్యక్రమాలే. మనమీ ఘోరప్రమాదం నుంచి తప్పించుకోవాలి.

— సంపాదకుడు

'ఆర్గనైజేషన్' అనే పుష్పాన్ని తమరు నాకు అందజేయటంలోని అంతరార్థం తెలుపగోరుతున్నాను.

నాయనా! నీ నిత్యజీవితాన్ని క్రమబద్ధీకరించుకో. అంటే నీవు ఒక నిర్ణీతపద్ధతిలో కార్యనిర్వహణ గావించుకోవాలని గ్రహించు.

(Organise your life, your work, your consciousness.

Organisation consists in putting each thing in its true place.)

*

(Mother gave the following comments while giving the significances of the flowers.)

Organisation: Indispensable for all good work.

Organisation in the vital: indispensable for all realisations.

Organisation of details: Indispensable for all accomplishment.

Result of harmonious organisation: More effective than showy.An effective simplicity.

Organised team work: Each one in his place and all together.

Integral organisation: Preliminary necessary for transformation.

Mahasaraswati's perfection in work: Is not satisfied with makeshift.

కరుణామయీ! నా నిత్యజీవితం, నా దైనందిన వ్యవహారాలు ఒక క్రమంలో సాగటం లేదు. ఏదైనా ఉపాయం కోసం ప్రార్థిస్తున్నాను తల్లీ!

నాయనా, నీవు ప్రతి నిత్యము నీ దైనందిన వ్యవహారాలు ఒక నిర్ణీత పద్ధతిలో ఆచరించుకోవటం అవసరం.

*

ఈ దైనందిన కార్యనిర్వహణలో సమయపాలన పాటించటానికి రెండు విషయాలు గుర్తుంచుకోవాలి. ప్రథమంగా, నిత్యజీవితాన్ని శోభాయమానంగా, ఒక క్రమపద్ధతిలో నిర్ణయించుకొని ఆచరించటం కాగా, రెండవది వృథా కాలయాపనకు అవకాశం ఇవ్వక పోవటమున్నూ. నలుగురు చేరినపుడు కాలక్షేపం కోసం కబుర్లు చెప్పుకోవటం ఈ కోవకే చెందుతాయి. ఈ కాలక్షేపం కబుర్లతో వృథా కాలయాపనకు అంతులేదు. ఒకమాట మీద మరోమాట. దానిపై ఇంకొకరికి మాట. ఇలా అంతులేకుండా సాగిపోతుంది వృథాగా. ఒక క్షణం ఆలోచిస్తే, కార్యనిర్వహణకు వ్యవధి తక్కువ అంటే సమయపాలన పాటించటం గాని, కార్యనిర్వహణ క్రమ పద్ధతితో ఆచరించటం లేదని గ్రహించవచ్చును. మరికొందరు మోయలేనన్ని బరువులు నెత్తికెక్కించుకుంటారు. అశక్తులౌతారు. ఈ పద్ధతి కూడా అశనిపాతమే.

ఒకానొక నిర్ణీతపద్ధతితో వ్యవహారాలు చక్కబెట్టుకొన్నప్పుడు, ప్రతి ప్రక్రియకు తగిన స్థానం తప్పక లభిస్తుంది. ఉదా: శరీర దారుఢ్యానికి ప్రతి నిత్యము 10-15 నిమిషాలు వ్యాయామం చాలు. ఈ విషయం అందరికీ అనుభవమే. శారీరక సమతౌల్యానికి ఇంతకన్నా శ్రమ అవసరం లేదు.

నీ జీవితాన్ని క్రమపద్ధతిలో ఆర్గనైజ్ చేయలేకపోవటం కేవలం ఒక మిష మాత్రమే. నీవు క్రమపద్ధతి పాటిస్తే, అన్ని పనులకు అవసరమైన వ్యవధి తప్పక సమకూరుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: శ్రీ శరణ్

(*CWM* Vol. 17, p. 156; Vol. 9, pp. 82-83)

క్రమశిక్షణ జీవితానికి అనివార్యం

క్రమశిక్షణ అంటే ఏమిటో మనందరికి తెలుసు. ఉదా: మన గుండె, జీర్ణకోశము మొ॥ అవయవాలన్ని వాటి వాటి విధులను సక్రమంగా నిర్వహించటం వలన ఈ ఘటం నడుస్తోంది. అలాకాక ఒక దాని కొకటి పొంతన లేకుండా వుంటే అప్రశుతులొస్తాయి. మరి మన జీవితంలో, ముఖ్యంగా బాహ్యాజీవితంలో క్రమశిక్షణను ఎందుకు పాటించకూడదు? — *సంపాదకుడు*

భౌతికజీవితానికి క్రమశిక్షణ తప్పనిసరి, ఉండితీరాల్సిందే. శరీరంలో అన్ని అవయవాలు చక్కగా పనిచేయడం క్రమశిక్షణ మీదే ఆధారపడింది. శరీరంలో ఏదో ఒక అవయవం లేదా ఒక భాగం తన సహజ క్రమశిక్షణను ఒక్క క్షణం పాటించకపోయినా మనిషిలో అనారోగ్యం ప్రవేశిస్తుంది.

క్రమశిక్షణ లేనిదే ప్రగతి లేదు. వ్యక్తి తనమీద తాను కఠినమైన, ఆత్మవికాసంతో కూడిన క్రమశిక్షణను విధించుకుని, ఆ నియమాన్ని పాటించినపుడు మాత్రమే మరొకరు విధించిన బంధనాయుత క్రమశిక్షణనుంచి స్వేచ్ఛను పొందగలడు.

అత్యంత ఉన్నతమైన క్రమశిక్షణ దైవానికి మనల్ని మనం సమగ్ర సమర్పణ చేసుకోవడం. ఆ సమర్పణకు ఆటంకంగా మనలో కలిగిన భావాలని, అవరోధమైన పనులను నిర్దాక్షిణ్యంగా విడిచిపెట్టాలి. ఆ సమగ్ర సమర్పణలో ఏ లోపమూ వుండ కూడదు. సంపూర్ణ సమర్పణ కావాలి. అది సాధిచడానికి చాలా శ్రమించాలి. కఠినమైన క్రమశిక్షణ పాటించాలి.

(The supreme discipline is integral surrender to the Divine and to allow nothing else either in one's feelings or in one's activities. Nothing should ever be omitted from this surrender – that is the supreme and most rigorous discipline.)

సామాజిక జీవనంలోనూ క్రమశిక్షణ ఉండాల్సిందే. బల వంతులనించి బలహీనులను కాపాడ్డానికి, వారు అణచివేతకు

గురికాకుండా ఉండడానికి ఈ క్రమశిక్షణ అవసరం. సమాజంలో ఉండే వారందరూ క్రమశిక్షణను గౌరవంతో పాటించాలి.

అయితే ఈ సాంఘిక జీవనం ఆనందదాయకంగా ఉండాలంటే ఈ క్రమశిక్షణ విశాల దృక్పథం గలవారిచే విధించబడాలి. అవకాశం ఉంటె అంతటా అందరిలో ఉన్నదీ, సర్వత్రా వ్యాపించిన దైవాంశను గుర్తించి, ఆ దైవానికి తనని తాను సమర్పణ చేసుకున్నవారిని నియమిస్తే ఆ సంఘానికి పూర్తి న్యాయం చేకూరుతుంది.

ప్రపంచం ఆనందధామంగా ఉండాలంటే దైవేచ్ఛను తెలుసుకోగలిగిన వాళ్ల చేతుల్లో పెట్టాలి. అయితే ప్రస్థుతానికది సాధ్య పడదు. ఎందుకంటె అలాంటి సత్యదర్శనం కలిగినవారు చాలా తక్కువమందే ఉన్నారు. ఒకవేళ అలాంటి వ్యక్తులు ఉన్నా, వారికి ఆ విధమైన ఆశ, ఆరాటం ఉండవు.

నిజానికి ఈ రకమైన అవగాహనకు సరైన సమయం వచ్చినపుడు సహజంగా సర్వం వారి చేతుల్లోకి వెడుతుంది. అది కాలమే నిర్ణయిస్తుంది. అందాకా ప్రతి వ్యక్తియొక్క కర్తవ్యం ఆ బాధ్యతను స్వీకరించడానికి తనని తాను తయారుచేసుకోవడమే.

*

క్రమశిక్షణ లేనిదే శరీరవ్యాయామవిద్య లేదు. కఠినమైన క్రమశిక్షణ లేనిదే ఈ శరీరం పనిచేయదు. ఈ విషయాన్ని, ఈ సత్యాన్ని గుర్తించక పోవడమే రోగాలకు ముఖ్యమైన కారణం. క్రమశిక్షణా రాహిత్యమే రోగాలకు నాంది.

అరుగుదల, పెరుగుదల, రక్తప్రసారం — అంతా ఒక క్రమశిక్షణే. మనం గమనిస్తే ఒక నిర్దుష్టమైన ప్రణాళిక ననుసరించి అన్నీ పనిచేస్తాయన్న సత్యాన్ని గ్రహించగలం. ఆలోచన, కదలికలు, హావభావాలు — అన్నీ ఒక క్రమశిక్షణ.... అందుకే క్రమశిక్షణాలోపం జరిగినపుడు మనిషి వెంటనే జబ్బుపడతాడు.

*

నిజమైన వివేకం మనం చేసే ప్రతి పనిలోనూ ఆనందం పొందడమే. అది సాధ్యపడాలంటె ప్రతి పనిని మన పురోభివృద్ధిలో

భాగంగా భావించాలి. పర్ఫెక్షన్ సాధించడం కష్టమైన విషయమే. పట్టుదలతో, శ్రమతో నిరంతర కృషి చేసినపుడే పర్ఫెక్షన్ అన్న బహుమతి దొరికేది.

'తాత్కాలిక సుఖాల వెంటపడడమంటె బాధల్ని తెచ్చుకోడానికి దగ్గర దారి వెతుక్కోవడమే'. నీకు నిజమైన శాంత్యానందాలు కావాలంటె నీ ధ్యాసంతా ఒకే విషయంపై ఉండాలి. అది దైవాన్ని తెల్సుకుందుకు, దైవానికి సేవ చేయడానికి నీవు ఏ రకమైన అభివృద్ధిని సాధించాలన్న విషయం. అదే ఒక దీక్షగా పాటించాలి.

TO SEEK PLEASURE IS CERTAINLY THE BEST WAY TO MAKE YOURSELF MISERABLE.

If you truly want peace and happiness, your constant preoccupation should be: "What progress must I make to be able to know and serve the Divine?"

'బాధలకి దగ్గర మార్గం తాత్కాలిక సుఖం అన్వేషించడమే' అన్నది నగ్నసత్యం. నీ చిన్న అహాన్ని తృప్తిపరచాలనుకోవడమే నీలో ఆనందం లోపించడానికి ముఖ్యకారణం అన్న విషయాన్ని ధృవపరుస్తుంది. అహాన్ని తృప్తిపరచడమంటె తప్పనిసరిగా విచారాన్ని వరించడమే అన్న విషయాన్ని స్పష్టపరుస్తోంది.

*

బాహ్యామైన, ఆంతరంగికమైన క్రమశిక్షణ లేకుండా జీవితంలో ఎవరూ ఏం సాధించలేరన్నది నిర్వివాదాంశం. అది ఆధ్యాత్మిక జీవితంలోనైనా సరే, లౌకిక జీవితంలోనైనాసరే ఉండి తీరాల్సిన సత్యం. ఒక కళాత్మకమైన సృజన చేసేవారుకానీ, నలుగురుకీ ఉపయోగపడే పని చేసినవాళ్లుకాని, ఈ సత్యాన్ని తెలుసుకున్న వారే. వాళ్ళని వాళ్లు ఎలా క్రమశిక్షణలో పెట్టుకోవాలో తెలిసిన వారే అనుకున్నది సాధించగలరు.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

(CWM Vol. 12, pp. 382-84; Vol. 16, pp. 123-24)

భౌతికవస్తువులు చైతన్యమూర్తులు

శ్రీమాత ఒకసారి పారిస్ నగరాన్ని విడిచి వెళ్ళిపోయేటప్పుడు తన ఇంటిలోని వస్తువుల నన్నిటిని పరామర్శించి, కృతజ్ఞతాపూర్వ కంగా వాటివద్దనుంచి సెలవు తీసుకున్నారు. భౌతికవస్తువులకు చైతన్యముంటుంది. అందుకని మనం వాటిని గౌరవంగా చూడాలి, బుజ్జగించాలి. ఒకవేళ వాటిని నిర్లక్ష్యపరచామో అవి బెడసికొడ తాయి!

— సంపాదకుడు

తాము ఉపయోగించే వస్తువులను ఎవ్వరైనా జాగ్రత్తగా చూసుకో వటం లేదంటే అది వారి అచైతన్యానికీ, అజ్ఞానానికీ గుర్తు. తమ వస్తువులను జాగ్రత్తగా వాడుకోలేని వారికి వాటిని ఉపయోగించే హక్కుకూడా ఉండదు.

*

...మనం వాటిని శ్రద్ధగా చూసుకోవడం కేవలం మనకుండే మక్కువ కోసమని కాకుండా, అవి కూడా కొంతమటుకు దివ్య చైతన్యాన్ని వ్యక్తం చేస్తుంటాయి కాబట్టి, వాటిని జాగ్రత్తగా పదిల పరచుకోవాలి.

*

భగవంతుడు సర్వవ్యాపి. మనం అపురూపంగా పదిలపరచుకునే వాటిలోను, నిర్లక్ష్యంగా విసిరేసే వాటిలోను, మనం ఆరాధించే వాటిలోను, మన కాలికింద నలిపేసే వాటిలోను కూడా ఆయనే ఉన్నాడు. అందుకని అన్నిటిలోను మనమా భగవంతుని దర్శిం చుకుంటూ గౌరవభావంతో మెలగాలి.

*

ప్రశ్న: మనం వస్తువులను వాడే తీరు ఎలా ఉండాలి?

మొట్టమొదట వేటిని ఎలా వాడాలో తెలుసుకొని ఏమాత్రం హెచ్చుతగ్గులు లేకుండా ఆ విధంగా అవి పాడుకాకుండా అతి జాగ్రత్తగా చూసుకుంటూ వాడుకోవాలి.

ఉదాహరణకు ఒక కత్తెర తీసుకోండి. కత్తెర్లలో అనేక రకాలుంటాయి కదా! కాగితాలు కత్తిరించే కత్తెరలు వేరు, దారాలు కత్తిరించేవి వేరు. నీ దగ్గర కత్తెరుంటే అది దేనికి వాడేదో చూసు కొని దానికే వాడు. కోతిపనులు చేయకు. అయితే కొంతమంది సిల్కుదారాలు కత్తిరించే కత్తెరతో ఇనపతీగెలు కత్తిరిస్తారు. అవ సరమైతే డబ్బా మూతలు కూడా దానితోనే తీస్తారు! ఒకటేమిటి? అన్నిటికీ అదే ఉపయోగిస్తారు. తర్వాత కొన్నాళ్ళకి నా దగ్గర కొచ్చి "నా కత్తెర పాడైపోయింది, కొత్తది ఇవ్వండి" అంటారు. "నీవు ఇష్టం వచ్చినట్లు వాడి అది పాడుచేశావు కదా! ఇంకోటి ఇవ్వను" అని నేనంటే వాళ్ళు నివ్వెరపోతారు. ఇట్లాంటివి ఎన్నో జరుగుతుంటాయి.

ఒక వస్తువు మీద మనకుండే మక్కువవల్ల కాకుండా స్వతహాగా ప్రతి వస్తువుకీ ఉండే ప్రతిపత్తివల్ల దాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. ఒక వస్తువు తయారీలో ఉండే కృషి, పరిశ్రమను బట్టి దానికొక విలువ ఏర్పడుతుంది కాబట్టి మనం అది గుర్తించి దాన్ని పదిలంగా వాడుకోవాలి.

కొంతమంది చాలా నిరాడంబరంగా ఉంటారు. అత్యవసర వస్తువులు కూడ దగ్గర పెట్టుకోరు. కాబట్టి వారంతట వారే వాటిని తయారుచేసుకోవలసి వస్తుంది. అప్పుడు వారి తెలివితేట లతో కష్టపడి కావలసిన వస్తువులను తయారుచేసుకుంటారు. దానిలో ఉండే కష్టము, శ్రమ వారికి బాగా తెలియటంవల్ల వారు వాటిని ప్రాణంగా చూసుకుంటారు. వాటి విలువ వారికి బాగా తెలు స్తుంది. అటువంటివాళ్ళను నేను ఎరుగుదును. మరికొంతమంది వారి చేతిలో పుష్కలంగా డబ్బుండటంవల్ల ఇట్టే బజారుకెళ్ళి డబ్బు పారేసి కావలసినవన్నీ తెచ్చేసుకుంటారు. దానినిబట్టే వారు దాన్ని వాడే విధానం కూడా ఉంటుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 17, p. 88; Vol. 16, p. 256; Vol. 7, pp. 50-51)

ఒక అపూర్వావకాశము

(ఇది శ్రీ కపాలిశాస్త్రిగారి '*Flame of White Light*' అనే పుస్తకానికి ఎమ్.పి. పండిట్‌గారు రాసిన పీఠికలోని భాగము)

శ్రీ టి.వి. కపాలిశాస్త్రిగారు చిన్నప్పట్నుండికూడ అనేక ఆధ్యాత్మిక మార్గములను అవలంబించిన నిష్ణాతులు. అందులో మంత్రోపాసనలు, పూజావిధులు, తంత్రములు, క్రియలు ఒకటేమిటి చాలా శ్రమతో కూడిన అనేక విద్యలను అనేక సంవత్సరములు చాలా ఓపికతో అభ్యసించారు. వాటి వలన మీకేమైనా ప్రయోజనము కలిగినదా అని అడిగినప్పుడు వారు వెంటనే "ఇంకా మెల్లిగా అడుగుతున్నావా? ఇదిగో నన్ను శ్రీమాతారవిందుల పాదసన్నిధికి తీసుకొనిరావటంకంటె ఇంకేం కావాలి!" అన్నారు. వారి జవాబు "ఏమిటి, మనమిక్కడ ఇన్నాళ్లుండి ఈ విషయాన్ని గ్రహించలేక పోతున్నామే" అని నా మీద చాలా గాఢమైన ముద్రవేసింది.

భూలోకచరిత్రలో అనేక వేలసంవత్సరాలకు ఒక్కసారి కూడా రాని ఒక అపూర్వమైన తరుణంలో మనమిప్పుడు ఉన్నామన్న విషయము వారికి తెలుసు. వారి జీవితంలో ప్రతిక్షణము ఈ విషయాన్ని గుర్తుచేసుకుంటూ చాలా శ్రద్ధగా పాటిస్తూండేవారు. వారి ఉద్దేశంలో శ్రీమాత కేవలం ఒక ఆధ్యాత్మిక వ్యక్తియో లేక ఋషిపుంగవురాలో కాదు. ఆధ్యాత్మిక శిఖరాల నధిరోహించిన యోగినీ కాదు. పురాణాలలో చెప్పిన అవతారంలాంటిదంతకన్నా కాదు. కొన్ని క్లిష్టసమయాలలో దేవుడు తన శక్తిని, తనలోని ఒక అంశను ఈ భూమ్మీదకు పంపించినప్పుడు మనం అవతారమంటాము. కాని ఈమె అటుల కాదు. కపాలిశాస్త్రిగారు ఆమెలోని పూర్ణావతారాన్ని గుర్తించారు. '*The Mother*' అనే పుస్త*కంలో శ్రీఅరవిందులు చెప్పినట్లు భూలోకసృష్టికి, మనుగడకు అధిష్ఠాత్రి అయిన ఆద్యశక్తీ, దైవముయొక్క సంపూర్ణావిష్కర*

ణమూ ఈమెయే. వారు ఆమె నాలుగు అంశలైన మహేశ్వరి, మహా కాళి, మహాలక్ష్మి, మహాసరస్వతుల నందరిని గురించి ఎంతో నిష్ఠగా తపస్సుచేసి దర్శించగలిగిన దిట్ట. ఈ విధంగా ఆమె చతుర్విధ చేతనారీతులను చూసారు.

ఇది '*దైవముహూర్తము*' అని శ్రీఅరవిందులు చెప్పినట్లు యుగయుగాల పర్యంతము ఈ భూలోక చరిత్రలో ఇటువంటి మహాపరిణామములు జరుగుతూనే వున్నాయి. సృష్టిని ఒక స్థితి నుంచి మరొక ఉన్నతమైన స్థితికి పరిణామము జెందే మలుపులు సంభవింపజేయుటకై దైవము ప్రత్యేకరూపములలో అవతరిస్తూనే ఉన్నాడు. కాని ఇప్పుడు జరుగుతున్నది అంతకు మించిన ఓ బృహత్పరిణామమమంటే నమ్మండి! పరిణామ ప్రక్రియ ఒకానొక స్థాయికి చేరుకుంది. ప్రకృతి యుగయుగాలుగా శ్రమించి మనిషిని తయారుచేసింది. అతని ద్వారా సాధ్యమయినంత ప్రగతిని సాధించింది. ఈ స్థాయిని దాటిపోవాల్నంటే మరో ఎత్తు వేయాలి. లేనియెడల ఈ మానవావతారము ఇంతటితో అంతమైపోవాల్సిందే, నశించిపోవాల్సిందే.

అయితే ఈ భూలోకంలో పాతుకుపోయిన అజ్ఞానశక్తులకు ఈ అయోమయస్థితిని దాటి వెలుగును చూడటం ఇష్టముండదు. ఏమైనా సరే మేమిక్కడ నుంచి కదలము అని భీష్మించుకొని కూర్చుంటాయి! *వీటిని కదిలించాలంటే దేవుడు దిగిరావల్సిందే. దివ్యచైతన్యము చాలా పెద్ద ఎత్తులో వస్తేగాని ఈ కార్యము నెరవేరదు.* దీనికి ప్రత్యక్షరూపమే శ్రీమాత, భూదేవి ఆర్తికి దైవము యొక్క సమాధానము. She is the most complete embodiment of the Divine Grace so far in the history of creation – ఈ సృష్టి మొదలైనప్పటినుంచి ఇంత పెద్ద ఎత్తులో దైవమెప్పుడూ అవతరించలేదు. ఆమెది సంపూర్ణ అవతారము. ప్రకృతిని మహాప్రకృతిగా మలచి మానసిక మానవుని దివ్యమానవునిగా పరిణమింపజేయుటకు అవసరమైన 'అస్త్రశస్త్రాలతో', తాంత్రికశక్తులతో అరుదెంచిన దివ్యమూర్తి. ఈ కార్యమును నెరవేర్చుటకై పాంచభౌతికశరీర

మును ధరించి, ఎన్నో బాధల కోర్చుకొని చాలా ఓపికతో అనేక దశాబ్దాలు సాధన చేసి శ్రమించిన దివ్యమూర్తి.

The world unknowing for the world she stood.[1]

ఈ విధంగా దైవము ఒక నూతన సృజనశక్తిని – అతిమానసశక్తిని భూలోకంలోకి తీసుకొనివచ్చాడు. అతిమానస శక్తిని (Truth-Power) ఇక్కడ ప్రతిష్ఠింప చేసాడు. దీని అర్థమేమిటి? మానవుడు మానసికస్థాయి నుండి దివ్యస్థాయికి ఎదుగుటకు మార్గ మేర్పబడినది. ఇక ప్రతి మానవుడు నూతన చైతన్యాన్ని, నూతన జీవితాన్ని పొందగలడు – జన్మను దివ్యచరితార్థము గావించు కొనగలడు. శ్రీమాత తన కర్తవ్యమును జయప్రదముగా నెరవేర్చారు. 24 ఏప్రిల్ 1956 నాడు ఆమె ఈ చరిత్రాత్మకమైన ప్రకటనను జేసారు:

"అతిమానసావిర్భావము ఇప్పుడొక వాగ్దానం మాత్రమే కాదు, ప్రత్యక్షసత్యము.

ఆ శక్తి ఇక్కడ పనిచేసి ఈ సృష్టినే మార్పుచేస్తున్నట్లు అందరికి విదితమౌతుంది. ఎంతటి గ్రుడ్డివారు, అజ్ఞానులైనప్పటికి ఈ విషయాన్ని గుర్తించవలసిన సమయము వచ్చితీరుతుంది."

ఆమె మానవజాతికి ఇచ్చిన వరము ఎంత అద్భుతమైనదో నీ చేతనలో ఎంత లోతుకు వెడితే అంత గొప్పగా తెలుస్తుంది. ఒక మహాశక్తి శాంతి తరంగములను నీ మీదకు ప్రసరింపజేసి నిన్ను అద్భుతమైన ఆనందంలో ముంచెత్తుతుంది. నిన్ను ముందుకు తీసుకొనిపోతుంది. శ్రీమాతను తలచుకున్నమాత్రాన, ఆమె నామమును ఉచ్చరించినంత మాత్రాన ఆమె కారుణ్యము వరదలై నీ మీదకు ప్రవహిస్తుంది. ఆహా! మన మెటువంటి దివ్యముహూర్తంలో ఉన్నాము.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి, లక్ష్మీప్రసాదమ్మ

---

[1] Sri Aurobindo (Savitri)

సమాచారపత్రం

1 జనవరి 2006: ఆశ్రమం నూతన సంవత్సర గ్రీటింగుకార్డులోని శ్రీమాత సందేశము.

"Bonne Année. "Let the past be past. Concentrate only on the Eternal"

గతం గతః. నీ దృష్టిని దైవం మీదనే కేంద్రీకరించుము.

3 ఫిబ్రవరి 2006 నాడు చాలామంది సరస్వతి పూజ చేసుకుంటారు. అది వసంతపంచమి కూడాను. అందుకని ఈ ఫిబ్రవరి 'అఖిల' మహాసరస్వతిని గురించిన ప్రత్యేకసంచికగా వెలువడుతున్నది.

21 ఫిబ్రవరి – శ్రీమాత 128 వ జన్మదిన మహోత్సవము ఆశ్రమమంలోను, దేశవిదేశాలలోని అనేక శాఖలలోను జరుపబడును. ఈ సందర్భంలో నళినికాంత గుప్తాగారు పొందిన దర్శనానుభూతి:

"చూడు, నన్ను చూడు. నేను నా నూతన శరీరాన్ని ధరించి వచ్చాను – అది దివ్యశరీరము. రూపాంతరీకరణము చెందినది. (I am here come back in my new body – divine, transformed and glorious.)

నేను నీ మదర్‌నే, మానవ శరీరధారియైన నీ పాత మదర్‌నే. నువ్వేమీ కష్టపడక్కర్లేదు. నిన్ను గురించిగాని, నీ ప్రగతిని గురించిగాని, సిద్ధిని గురించిగాని ఇతరుల విషయంలోగాని ఏ మాత్రం సందేహం వలదు. ఆత్రమెందుకు? భయం నాస్తి! నేనిక్కడున్నాను చూడు. నా వంక చూడు, నా కళ్లల్లోకి చూడు. నాలోకి పూర్తిగా ప్రవేశించు, నాలో కరిగిపో, నన్ను ప్రేమించు, నా ప్రేమకు బందీవై పో. ఇలా చేసావంటే నీ సమస్యలు తీరిపోతాయి. అన్నీ సిద్ధిస్తాయి, ఫలిస్తాయి. Forget all else, forget the world. Remember me alone, be one with me, with my love...."

28 ఫిబ్రవరి: 29 ఫిబ్రవరి 1956 నాడు జరిగిన "Supramental Manifestation upon Earth' అతిమానసావిర్భావము యొక్క



నూరేళ్లనాటి కథ – I

అఖిల భారత పత్రిక, మార్చి 2006

నూరేళ్లనాటి కథ

అది మార్చి 3, 1906

సరిగ్గా ఆ రోజునే శ్రీఅరవిందులు బరోడా నుండి కలకత్తా విచ్చేశారు.

విచ్చేశారు... అంటే... మామూలుగా రావడం కాదు! స్వాతంత్ర్య సముపార్జన కోసం నడుం బిగించి సమరంలోకి ప్రత్యక్షంగా దూకడానికే వేంచేశారు.

లార్డ్ కర్జన్ తన కుటిలనీతికి తొలి నిదర్శనంగా బెంగాల్‌ని నిలువునా చీల్చాడు. మిత్రబేధాన్ని రగిలించి మతచిచ్చును ప్రేరేపించాడు. భారతీయ రాజకీయాలలో మతం పేరుతో విషం కక్కాడు.

స్వాతంత్ర్య సమరంలో శ్రీఅరవిందులు ప్రత్యక్షంగా పాల్గొనడానికి ఇదిగో – ఈ విభజనే కారణం. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ, వలస పాలనను నిరసించే ఓ నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారు శ్రీఅరవిందులు.

స్వతంత్ర్యం అంటే అదేదో ఊహల్లో విషయమని, కలలకే పరిమితము, ఆచరణసాధ్యం కాని అంశమని చాలామంది భారతీయులు భావిస్తున్న సమయమది. దానికి తగ్గట్టుగా జాతీయ కాంగ్రెసు ఆశయము కూడా '*విన్నపం, విజ్ఞప్తి, నిరసన*' అనే సిద్ధాంతానికే పరిమితమైంది.

ఇటువంటి పరిస్థితుల్లో '*సంపూర్ణ స్వాతంత్ర్యమే భారత జాతి గమ్య*' మని బాహాటంగా చాటిన తొలి భారతీయుడు శ్రీఅరవిందులు. విదేశీయుల పాలనకు వ్యతిరేక గళం విప్పిన భారత మాత పుత్రులలో తొలివీరుడు శ్రీఅరవిందులు. జాతీయవాదుల గళాన్ని నినదించే '*వందేమాతరం*' పత్రికలో తన కొత్త పంథాను నిష్కర్షగా, నిర్భీతిగా స్పష్టం చేసిన ధైర్యశాలి శ్రీఅరవిందులు.

అంతే కాదు. జాతి ఆశయ సాధనకై నూతన విధానాలను రూపొందించిన మహామేధావి శ్రీఅరవిందులు. సంపూర్ణ సహాయ

నిరాకరణతో విదేశీపాలనను వ్యతిరేకించే విధానాన్ని ఆవిష్కరించిన ఉద్యమవేత్త శ్రీఅరవిందులు.

శ్రీఅరవిందులు ఊపిరిపోసిన ఉత్సాహం ఉరకలు వేస్తూ విస్తరించింది. విశ్వరూపం దాల్చి, '*వందేమాతరం*' నినాదంగా మారి మారుమూలల్లో సైతం మారుమ్రోగింది. దేశప్రజల కంఠాలు ఆ మహామంత్రాన్ని ప్రతిధ్వనించాయి. స్వాతంత్ర్యకాంక్ష పెరిగి విజయమో, వీరస్వర్గమో అనే భావం ప్రజలలో బాగా నాటుకుంది. వెనుకటి మెతకతనం, పిరికితనం పటాపంచలై, అడ్డుకోలేని ఓ మహత్తరశక్తి ఆవిర్భవించి ప్రజలందరిని ఆవహించింది.

మూడు నాలుగేళ్ళ అనతికాలంలోనే శ్రీఅరవిందులు భారత రాజకీయరంగం ముఖచిత్రాన్నే మార్చివేయగలిగారు. ఇదివర కెన్నడూ ఎరగని ఒక దృఢవిశ్వాసాన్ని జాతిభావ చైతన్యంలో నింపగలిగారు శ్రీఅరవిందులు.

కాంగ్రెస్ చరిత్ర రాసిన డాక్టర్ పట్టాభి సీతారామయ్య మాటలో చెప్పాలంటే '*శ్రీఅరవిందుల ప్రతిభ గగనంలోని దూర తీరాలకు దూసుకెళ్ళింది. ఆయన స్వాతంత్ర్య ఉద్యమ తారాపథంలో వేగు చుక్కలా వెలుగొందింది కొలది కాలమే కావచ్చు. అయితేనేం! దేదీప్యమానమైన ఆ మహాతేజస్సు అసేతుహిమాచలం జాతి నంత టిని ఏకం చేసింది.*'

భారతజాతి చరిత్రలో చిరస్మరణీయమైన ఆ మహత్తర అధ్యాయానికి శతజయంతి కదా! అందుకని ఈ సంచికను ఆనాటి స్మృతులకు అంకితం చేసుకొంటూ వివిధ అంశాలపై గురుదేవుల సొంతమాటలను మీ కందిస్తున్నాము!

1. శ్రీఅరవిందుల రాజకీయ ఆశయాలు – ఆచరణలు

2. దేశప్రజలకు శ్రీఅరవిందుల బహిరంగ లేఖ

3. శ్రీఅరవిందులు రాజకీయాలను విరమించుకోవడానికి కారణాలు.

*

ఇంకా వచ్చే సంచికలో (ఏప్రిల్ 2006) మీకీ అంశాలనందిస్తు న్నాము.

1. ఆలీపూరు కుట్రకేసులోని వాదనలనుండి, తీర్పునుండి కొన్ని మెరుపులు
2. శ్రీఅరవిందులపై House of Commons (మన లోక్‌సభను పోలినది) లోని చర్చలు [ముఖ్యంగా నాటి లేబర్ పార్టీ నాయకుడు, తరువాత బ్రిటన్ ప్రధాని అయిన సర్ రామ్‌సే మెక్‌డోనాల్డ్ (Sir Ramsay Macdonald) మహాశయుని ఉల్లేఖనం.]

రాజకీయ జీవితం

శ్రీఅరవిందుల రాజకీయ భావాలు, చర్యలు మూడువైపులుగా సాగాయి. మొదటిది సాయుధ పోరాటం ప్రధానోద్దేశంగా రహస్య విప్లవ ప్రచారము చేయుట. సాయుధ పోరాటాన్ని వ్యవస్థీకృతం చేయుట, రెండోది జాతినంతా దేశస్వాతంత్ర్యమే ఆదర్శంగా గుర్తించేటట్లు చేయడంకోసం ప్రచారము. అప్పట్లో దేశస్వాతంత్ర్యమొక అసాధ్యమైన విషయమనీ, ఆచరణయోగ్యం కానిదనీ, అటువంటి ఊహాలు పెట్టుకోవడం భ్రమ అవుతుందనీ భారతీయుల్లో ఎక్కువ భాగం అనుకునేవారు. బ్రిటిష్ సామ్రాజ్యం చాలా శక్తివంతమైందనీ, భారతదేశం చాలా దుర్బలస్థితిలో ఉన్నదనీ, స్వతంత్రపోరాటం చేసి గెలవటమనేది ఊహించటానికి కూడా చేతగాని నిర్వీర్యస్థితిలో ఉన్నదనీ వారి భావన. కొంతమంది పౌరులను జేరదీసి, శిక్షణ నిచ్చి వారిచేత బహిరంగంగా విదేశీ పాలనను కించపరిచే విధంగా సంఘటిత వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ, సహాయనిరాకరణం, నిష్క్రియా ప్రతిఘటనల ద్వారా ప్రభుత్వాన్ని కూలదోయాలనేది మూడవది.

ఆ రోజులలో అగ్రరాజ్యాల సైనికవ్యవస్థ, వాటి సాధన సంపత్తి ఇప్పుడున్నంత శక్తివంతంగాను, అప్రతిఘటితంగానూ ఉండేవికావు. తుపాకిబలం ఒక్కటే నమ్మదగ్గ ఆయుధం. వాయు విమానశక్తి ఇంకా వాడుకలోకి రాలేదు. శతఘ్నిశక్తి కూడ ఆ తర్వాత తయారైనంత వినాశకరంగా లేదు. భారతదేశంలో ఆయుధ

సంపత్తి లేదు. సరిగ్గా వ్యవస్థీకృతం చేసుకుని బయటనుంచి తెచ్చుకునే సహాయంతో ఈ లోపాన్ని అధిగమించవచ్చునని శ్రీఅరవిందులు భావించారు. విశాలమైన దేశం కావటంవల్ల, బ్రిటిష్ సైన్యం చాలా స్వల్పమైనది కావటంవల్ల, మిగిలిన విషయాల్లో అంతా కలిసి ఎదిరించి, ప్రతిఘటిస్తే గొరిల్లాయుద్ధం చేసినా ఫలిత ముంటుందని వారు అనుకున్నారు. దానికి తోడు భారతసైన్యంలో మొత్తం తిరుగుబాటు వచ్చే సూచనలున్నాయి. అటువంటి సమయంలోనే బ్రిటిష్‌వారి లక్షణాలు, గుణగణాలు, వారి రాజకీయ వైఖరులు ఎటుమొగ్గేదీ శ్రీఅరవిందులు క్షుణ్ణంగా పరిశీలించారు. వారు భారతీయులు స్వయంవిముక్తికై ఏ ప్రయత్నం చేసినా ప్రతిఘటించి తీరినప్పటికీ, తమ సార్వభౌమత్వానికి ముప్పు కలగదనుకున్న సంస్కరణలకు మాత్రం మెల్లమెల్లగా అంగీకరించగలరని, చివరిదాకా క్రూరంగా మూర్ఖత్వంచేసే రకం కాదని శ్రీఅరవిందులు విశ్వసించారు. విప్లవం, తిరుగుబాటుతనం దేశమంతా వ్యాపించి పట్టు వదలకపోతే వారి రాజ్యాన్ని నిలబెట్టుకోగలిగినంత వరకూ ఏదో సర్దుబాటు చేయటానికి ప్రయత్నిస్తారు. చివరికి తప్పనిసరైన పరిస్థితుల్లో వారి దగ్గర్నుండి బలవంతంగా రాజ్యాన్ని లాక్కోకముందే భారతీయులకు స్వాతంత్ర్యాన్ని ప్రదానం చేయవచ్చు.

శ్రీఅరవిందుల రాజకీయవైఖరి పూర్తిగా శాంతికరమైనదని, ఆయన సిద్ధాంతరీత్యా, ఆచరణరీత్యా కూడా హింసను ప్రతిఘటిస్తారనీ, హిందూమతం నిషేధించిన తీవ్రవాద కార్యకలాపాలు, విప్లవాలు ఆయన కూడా వ్యతిరేకిస్తారని కొంతమంది అనుకున్నారు. అహింసా సిద్ధాంతాన్ని ముందుగా ఆయనే సూచించారని కూడా అంటారు. అది ఏమాత్రం నిజం కాదు. ఆయన వ్యర్థ నీతులు వల్లించే అర్భకుడు కాదు.

అప్పట్లో రాజకీయచర్యలు నిష్క్రియా ప్రతిఘటనకే పరిమితం చేయాలని, అదే అప్పటి పరిస్థితికి సరైన పద్ధతి అనుకొని ఒప్పుకున్నారేగానీ అహింసా సిద్ధాంతానికి లోబడిగానీ, శాంతి ఆదర్శమనుకొనిగానీ చేయలేదు. అత్యుత్తమ ఆదర్శంలో ఒక భాగం

మాత్రమే శాంతి. అయితే మూలంలో అది ఆధ్యాత్మికంగానైనా, అథవా తాత్విక ప్రాతిపదిక మీాదైనా ఆధారపడి ఉండాలి. మానవ స్వభావంలో మార్పు లేకపోతే శాంతిస్థాపన చిరస్థాయి గాదు. ఇంకే విధంగా (అంటే నీతిసూత్రాలు, అహింసా సిద్ధాంతము, మొద లైన వాటి ద్వారా) చేయాలన్నా మొదటికే మోసం జరుగుతుంది. అంతర్జాతీయ బలగముల ద్వారా అంటే 'సరిక్రొత్త విధానము' (న్యూ ఆర్డర్) ద్వారా యుద్ధాన్ని నివారించటానికి జరుగుతున్న ప్రయత్నాలకు శ్రీఅరవిందులు సుముఖులే. అలా జరిగినా కూడ అది అహింస కానేరదు. ఒక అరాచక బలాన్ని చట్టబద్ధమైన శక్తితో అణచివేయటమే అవుతుంది కాని అది శాశ్వతమని చెప్పలేము. రాజ్యాలలో ఈ విధమైన శాంతి నెలకొల్పగలిగినా అడపా తడపా చెలరేగే అంతర్యుద్ధాలు, విప్లవాలు, రాజకీయ సంచలనాలు, అణచి వేతలు, ఒక్కొక్కప్పుడు రక్తపాతాల వరకు వెళ్ళడంలాంటి వాటిని మాత్రం ఈ శాంతి నిరోధించలేదు. విశ్వశాంతిని నెలకొల్పినా ఈ విధంగానే ఉంటుంది. ప్రత్యామ్నాయ మార్గాలు లేనప్పుడు ఏ దేశమైనా హింసామార్గం అవలంబించి స్వాతంత్ర్యం సంపాదించు కోవచ్చుననే శ్రీఅరవిందుల అభిప్రాయం. వారెప్పుడూ దాన్ని దాచే ప్రయత్నం చేయలేదు. అది అప్పటి పరిస్థితులననుసరించి అలా చేయవచ్చా లేదా అని నిర్ణయించాలి కాని నైతికచింతనతో మాత్రం కాదు. ఈ విషయంలో శ్రీఅరవిందుల అభిప్రాయం, ఆచ రణ తిలక్ మహాశయునితోను, తదితర జాతీయవాదులతోను ఒకటిగానే ఉంది. వారెవ్వరూ కూడా అహింసను, శాంతిని ఆరా ధించే మనుష్యులు కారు.

భారతదేశానికొచ్చిన క్రొత్తలో కొన్ని సంవత్సరాలు శ్రీఅరవిందులు దేశపరిస్థితులను పరిశీలిస్తూ చేయవలసిందేమిటో పూర్తిగా అనుభవపూర్వకంగా తెలుసుకొని నిర్ణయం తీసుకోవటా నికి రాజకీయాలకు దూరంగా ('ఇందుప్రకాష్' పత్రికకు వ్యాసాలు వ్రాయటం మినహా) ఉండిపోయారు. ఆ తర్వాత కార్యరంగం లోకి దిగి, బరోడా సైన్యంలో ఉండే జతిన్ బెనర్జీ అనే యువ బెంగాలీ సైనికుని కార్యరంగం సిద్ధం చేయటంకోసం, ఆ తర్వాత

చర్య అనే ప్రణాళికతో తన ప్రతినిధిగా బెంగాల్‌కు పంపించారు. ఆ కార్యక్రమం ఫలప్రదం కావటానికి 30 సంవత్సరాలు పట్ట వచ్చునని వారి అంచనా. చివరకి విమోచనోద్యమం విజయ మార్గంలో పడటానికి 50 సంవత్సరాలు పట్టింది. రహస్యంగా గానీ, వీలైన చోట ఏవో మిషల మీద బహిరంగంగా గానీ, విప్లవ ప్రచారం చేస్తూ సైన్యాన్ని పోగుచేయాలని వారనుకున్నారు. ఈ విధంగా యువకులైనవారిని సైన్యంలో చేర్చుకుంటూ, ఆలోచనా పరులైన వృద్ధుల దగ్గర్నుంచి సానుభూతి సహకారాలను, ఆర్థిక సహాయాన్ని పొందటం, ఇంకా అటువంటి వారిని మంచిచేసుకో వడం వారి ప్రణాళికలో భాగాలు. ఇంకా ప్రతి గ్రామంలోను, పల్లెలోను కేంద్రాలను స్థాపించాలి. అనేక రకాలైన సాకులతో యువకులను పోగుచేయడం, సాంస్కృతిక సంఘాలు, సాంఘిక కూటమి మొదలైన సంఘాలనే కాకుండా అంతవరకు పనిచేస్తున్న మిగిలిన సంఘాలను కూడా చేరదీసి విప్లవ చర్యల కోసం శిక్షణ నివ్వడం, యువకులకు గుర్రపుస్వారీ, సాముగరిడీలు, కసరత్తులు మొదలైన శారీరక శిక్షణలేర్పాటు చేయడం, చివరకు అనుకున్న ట్లుగా సైనికచర్యలో పాల్గొనేటట్లు చేయడం. ఈ విధమైన భావాలు ప్రజలలో నాటగానే అవి చాలా చురుకుగా వర్ధిల్లాయి. అప్పటికే చిన్న చిన్న సంఘాలలో సభ్యులుగా ఉన్న యువకులు అంత వరకు విప్లవమంటే ఏమిటో తెలియకపోయినప్పటికీ ఇటుప్రక్కకి రావటం సాగించారు. ముందే విప్లవభావాలున్న యువకులు కూడా వచ్చి చేరటంతో అంతా కలిసి ఒక వ్యవస్థగా పనిచేయటం ప్రారం భించారు. అది చాలా తొందరగా విస్తరించింది. ఈలోగా శ్రీఅరవి దులు పశ్చిమభారతంలోని ఒక గుప్తసంఘ సభ్యుని కలుసుకొని తాను కూడా ఆ సంఘంలో ప్రమాణం స్వీకరించి బొంబాయి కౌన్సి ల్‌కు హాజరైనారు. ఆయన తర్వాత కార్యక్రమాలను కౌన్సిల్ ఏ రకంగానూ ఆదేశించనప్పటికీ బెంగాల్‌లో దాని లక్ష్యసాధనకు మద్దతు సంపాదించిపెట్టే బాధ్యత తీసుకున్నారు. అప్పటికింకా బెంగాల్‌లో కౌన్సిలుకు సభ్యత్వమూ లేదు. అనుయాయులూ లేరు. ఆయన బెంగాల్‌కి వెళ్ళి కౌన్సిల్ ఆశయాలు మొదలైనవాటి గురించి

పి. మిట్టర్ మహాశయునితోను, విప్లవసంఘంలోని మిగతా నాయ కులతోను చర్చించగా వారందరూ కూడా సంఘానికి ప్రమాణం చేసి దాని లక్ష్యసాధనకై శ్రీఅరవిందులు చెప్పిన పద్ధతిలో ముందుకు సాగటానికి అంగీకరించారు. సరళాఘోసాల్ ఆధ్వర్యంలో అప్ప టికే ప్రచారంలో ఉన్న లాఠీక్రీడను ఆసరాగా మిట్టరు సంఘం వారు 'లాఠీ క్రీడాసంఘం' అనే పేరుతో కలిసేవారు. మిగిలిన సంఘాలవారు ఏవో దొంగ పేర్లు పెట్టుకొని కలిసేవారు. ఈ ఉద్యమాన్నంతా ఒక సంఘటిత వ్యవస్థగా చేద్దామనే శ్రీఅరవిం దుల ప్రయత్నం ఫలించలేదు. అయినప్పటికీ ఉద్యమం బాగానే నడిచింది. ఈ విడి విడి సంఘాలన్నీ మౌలిక లక్ష్యాలను పాటిస్తూ పనిచేయడంవల్ల విప్లవోద్యమం మరింత పుష్టివంతంగానూ, చురుకు గానూ విస్తరించింది. ఆ తర్వాత వచ్చిన బెంగాలు విభజనతో అతి వాదులు విజృంభించి, దేశమంతా విప్లవజ్వాలలు రగిలి, గొప్ప జాతీయోద్యమం చెలరేగింది. శ్రీఅరవిందులు కూడా దీని కోసమే పనిచేస్తుండంవల్ల రహస్యసంఘాల పనులకు ప్రాముఖ్యం తగ్గి పోయింది. అయితే ఆ తర్వాత భావిలోని ఉగ్రతర విప్లవం అనే భావాన్ని జనసమ్మతం చేయడానికి స్వదేశీ ఉద్యమాన్ని ఉప యోగించుకున్నారు. సోదరుడు బరీన్ సలహాపై 'యుగాంతర్' పత్రిక ప్రారంభించడానికి శ్రీఅరవిందులు అంగీకరించారు. బాహా టంగా విప్లవం, బ్రిటిష పాలనకు పూర్తి వ్యతిరేకత ప్రబోధించ డమే కాకుండా, గొరిల్లా యుద్ధం చేయడానికి సూచనలిచ్చే వ్యాసా లను పరంపరగా ఈ 'యుగాంతర్' ప్రచురించ నారంభించింది. తొలిసంచికల్లో శ్రీఅరవిందులే స్వయంగా కొన్ని వ్యాసాలు వ్రాసే వారు. వారికి పత్రిక మీద మంచి అదుపు ఉండేది. ఒకసారి పోలీ సులు సోదా చేయటానికి వచ్చినప్పుడు, పత్రిక ఉపసంపాదకు లలో ఒకరైన స్వామి వివేకానందుని సోదరుడు తానే సంపాద కునిగా చెప్పి పోలీసులకు లొంగిపోయి నిర్బంధింపబడ్డాడు. అప్పుడు శ్రీఅరవిందుల ఉత్తర్వుల ననుసరించి బ్రిటిష్ పరిపాల నను వారు అంగీకరించటం లేదు కాబట్టి బ్రిటిష్ కోర్టుల కొచ్చి వాదించకపోవటం యుగాంతర్‌యొక్క విధానంగా ప్రకటించేసరికి

లాలా లజపతిరాయ్ దేశబహిష్కరణ

సానుభూతిపూర్వకమైన మోర్లే పరిపాలనా పర్వం ప్రస్తుతానికి రికార్డు సాధించింది. ప్రస్తుతానికి మాత్రమే. లాలా లజపతిరాయ్‌ను బ్రిటిష్ ఇండియా నుండి దేషబహిష్కృతుని చేశారు. ఈ విషయానికి వేరే వ్యాఖ్య అనవసరం. క్రోధావేశ నిరసన సమావేశాలను నాలుగు రోజులపాటు నిషేధించినట్లు ఆ టెలిగ్రాం చాటుతోంది. క్రోధావేశ నిరసన దినాలా! ప్రసంగాలకు, అందమైన రచనలకు ఇది సమయం కాదు. బ్రిటిష్ అధికార సింహాసనం తన సవాలును విసిరింది. ఆ సవాలును స్వీకరిస్తున్నాం.

పంజాబ్ వీరులారా! సింహాలై గర్జించండి! మిమ్మల్ని మట్టిలోకి తమ ఉక్కుపాదాలతో అణచివేసే ఈ బ్రిటిష్ పాలకులకు గుణపాఠం నేర్పండి. ఒక లాలాలజపతిని బంధిస్తే, ఆ స్థానంలో వందమంది లజపతిరాయ్‌లు ప్రభవిస్తారు అని వారికి చాటండి. '*జై హిందుస్థాన్*' అని మీ యుద్ధనినాదాన్ని వందరెట్లు బిగ్గరగా వారికి వినిపించండి. ఆ నాదంతో వారి చెవులు చిల్లులు పడాలి.

వందేమాతరం — మే 10, 1907

అనువాదం: కె. యజ్ఞన్న

దేశంలో ఆ పత్రికయొక్క ప్రతిష్ఠ, ప్రభావము ఇనుమడించాయి. బెంగాల్‌లోని ప్రముఖ రచయితలు ముగ్గురు ఆ పత్రిక ముఖ్య రచయితలుగా, నిర్దేశకులుగా ఉండటంవల్ల బెంగాల్ రాష్ట్రంలో దాని ప్రభావం మరింత పెరిగింది. గమనించవలసిన విషయం ఏ మంటే రహస్యసంఘం (సీక్రెట్ సొసైటీ) తన ప్రణాళికలో తీవ్ర వాదాన్ని చేర్చినప్పటికి అక్కడ జరిగిన అణచివేతచర్యల ఫలి తంగా తీవ్రవాదం విజృంభించింది.

'ఇందుప్రకాష్' లో వ్రాయటం ప్రారంభించటంతో శ్రీఅర విందుల బహిరంగ క్రియాశీలత ప్రారంభమైంది. దాని సంపాద కులైన శ్రీ కె.జి. దేశపాండే శ్రీఅరవిందుల కేంబ్రిడ్జి మిత్రుడు. ఆయన ప్రోత్సాహం మీద 'పాత లాంతర్లకు క్రొత్త లాంతర్లు' అనే ఏడు వ్యాసాలలో శ్రీఅరవిందులు అప్పటి కాంగ్రెసు విధా నాల 'ప్రార్థించు, అర్థించు, తిరగబడు' అనే వాటిని తీవ్రంగా ఖండిస్తూ స్వయం సహకారము, నిర్భీతులకు ప్రాధాన్యమిచ్చే అతి శక్తివంతమైన నాయకత్వం కావాలని పిలుపునిచ్చారు. ఈ నిష్కపటమైన, నిరాక్షేపణీయమైన విమర్శలు ఒక మితవాద నాయ కుని చర్యతో కుంటుపడ్డాయి. అతను ఆ పత్రికా సంపాదకుని భయపెట్టి శ్రీఅరవిందుల భావాలు పూర్తిగా పత్రికల్లోకి రాకుండా నొక్కిపట్టారు. ఇంక ఆ పత్రికలో కాంగ్రెసు కార్యక్రమాలను గురించి, అవి మధ్యతరగతి, బూర్జువా వర్గాలకే పరిమితం కాకుండా సామాన్యప్రజానీకంలోకి విస్తరింప చేయాల్సిన ఆవ శ్యకతను గురించి వ్యాసాలు ప్రచురించవలసి వచ్చింది. చివరకు శ్రీఅరవిందులు ఈ విధమైన బహిరంగ చర్య లన్నిటికి స్వస్తి చెప్పి 1905 దాకా రహస్యంగా పని చేశారు. అయితే తిలక్ మహా శయుడు విప్లవోద్యమ నాయకుడుగా ఉండదగ్గ మనిషి అనుకుని అహమ్మదాబాదు కాంగ్రెసుకు వెళ్ళి ఆయనను కలిసారు. తిలక్ మహాశయుడు శ్రీఅరవిందులను బయటకు తీసుకొని వెళ్ళి ఒక గంటసేపు ఆంతరంగికంగా మాట్లాడి, సంస్కరణోద్యమంపై తన కున్న తృణీకారాన్ని చూపించి, మహారాష్ట్రలో తాను చేయబోయే పనులను గురించి వివరించారు.

విప్లవోద్యమంలో శ్రీఅరవిందులు ఒక సరిక్రొత్త కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఆ తర్వాత అది జాతీయపార్టీ ప్రజాకార్యక్రమాల్లో ఒక ప్రధానపాత్ర వహించింది. పార్టీ కేంద్రాలలో ఉన్న యువకులను స్వదేశీభావాన్ని ప్రజల్లో ప్రచారం చేయమని ఆయన ప్రేరేపించారు. అప్పటిదాకా అది ఆరంభదశల్లో ఉండి కొంత మంది దృష్టిలో వట్టి భ్రాంతిగా కనిపించేది. ఈ విప్లవసంఘాలలో 'సఖారాం గణేశ దేవస్కర్' అనే మహారాష్ట్ర యువకుడు చాలా సమర్థుడు. అతను బెంగాల్‌లో స్థిరపడిన కుటుంబానికి చెందినవాడు కావటంవల్ల వంగభాషలో రచనలు కావించేవాడు. అతను వ్రాసిన శివాజి చరిత్రలో మొదటిసారిగా 'స్వరాజ్య' మనే మాటను ప్రయోగించగా దాన్నే జాతీయవాదులు స్వాతంత్ర్యాన్ని సూచించే పదంగా తీసుకున్నారు. అప్పట్నుంచి పార్టీ చతుర్విధ ప్రణాళికల్లో 'స్వరాజ్య' మొక అంశంగా ఏర్పడింది. ఆయన 'దేశ కథ' అనే పుస్తకంలో బ్రిటిష్ వారు మన పారిశ్రామిక, వాణిజ్య అవకాశాలను ఏ విధంగా కొల్లగొడుతున్నదీ సవివరంగా తెలియజేస్తూ వ్రాశారు. దానితో బెంగాల్ లోని యువతరమంతా కదలిపోయి స్వదేశీ ఉద్యమానికి ఎనలేని సేవలందించింది. శ్రీఅరవిందులు కూడా పారిశ్రామిక, వాణిజ్యాభివృద్ధి ద్వారా ఆర్థికస్వాతంత్ర్యం సంపాదించడం విప్లవ కార్యక్రమానికి అనుబంధంగా ఉండాలని అనుకున్నారు. బరోడా సర్వీసులో ఉన్నంత కాలం బాహాటంగా రాజకీయాలలోకి రాలేకపోయినా శ్రీఅరవిందులు తెరవెనుక నుండి తన పేరు పైకి రాకుండా పని చేయడానికి, నాయకత్వం వహించడానికి కూడా యిష్టపడ్డారు. అయితే 'వందేమాతరం' సంపాదకునిగా విచారణ జరపడంవల్ల ప్రభుత్వమే ఆయనను ప్రజలకు పరిచయం చేసినట్లయింది. దానితో అంత వరకు జాతీయపార్టీకి ప్రధాన నాయకుడుగాను, బెంగాల్ ఉద్యమానికి సూత్రధారుడిగాను పనిచేస్తున్న శ్రీఅరవిందులు బహిరంగంగా కార్యరంగంలోకి వచ్చారు. దేశం ఏ విధంగా పనిచేయాల్సిందీ మనస్సులో ఆయన నిర్ణయించారు. ఆయన తయారుచేసిన ప్రణాళిక, ఆ తర్వాత ఐర్లండులో ప్రారంభించిన 'సిన్‌ఫైన్' ఉద్య

మంగా తయారైన ప్రణాళిక మాదిరిగానే ఉంది. అయితే శ్రీఅర
విందులు మాత్రం ఐరిష్ ఉద్యమం చూసి తమ ప్రణాళికను
రూపొందించలేదు. ఎందుకంటే ఐరిష్ ఉద్యమం ఆ తర్వాతే
ప్రాముఖ్యంలోకి వచ్చింది. పాండిచ్చేరి నివాసానికి వచ్చేదాకా
ఆయనకు దాని విషయం తెలియదు. అంతేకాకుండా భారతదేశా
నికి, ఐర్లండుకు చాలా తేడా ఉంది. ముందరనుంచి కూడా ఐరిష్
ప్రజలు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉంటూ తిరుగుబాటే ఒక
అలవాటుగా మధ్య మధ్య అంతరాయాలుంటూ వచ్చినా స్వాతం
త్ర్యోద్యమం ఒక అవిశ్రామ పోరాటంగా అయింది. భారతదేశంలో
ఇటువంటిదేమీ లేదు. ప్రజల్లో స్వతంత్రభావన కలిగించటమే
శ్రీఅరవిందుల కొక గురుతర బాధ్యత అయింది. ఒక పార్టీని
మొదట ప్రోత్సహిస్తూ, ఆ తర్వాత జాతినంతా ఒక క్రమపద్ధ
తిలో, ఆదర్శాన్ని సాధించటంకోసం తీవ్ర రాజకీయ చైతన్యంతో
నడిపించవలసి వచ్చింది. కాంగ్రెసును వశం చేసుకొని విప్లవా
త్మక చర్యలకు దాన్ని సాధనంగా చేయాలని వారి ఉద్దేశం. అలా
కాకుండా అది కేవలం రాజ్యాంగపరంగా చేయగలిగిన పిరికి
ఆందోళనలకు కేంద్రమై మాటలతో తీర్మానాలు చేస్తూ విదేశీ
ప్రభుత్వానికి సిఫార్సులు పంపించటానికి పరిమితమై ఉండటా
నికి మాత్రం కాదు. కాంగ్రెసు పార్టీని వశం చేసుకోలేకపోతే
ప్రత్యేకంగా కేంద్రీయ విప్లవసంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలి.
అది ఒక రకంగా రాష్ట్రంలో రాష్ట్రంగా ఉంటూ, ప్రజలకు ఆదేశా
లిస్తూ, తమ పని చేయడానికి వ్యవస్థకు సంఘాలను సమాఖ్యా
లను తయారు చేసుకోవాలి. సహాయనిరాకరణ, నిష్క్రియా ప్రతి
ఘటనల ద్వారా విదేశీప్రభుత్వానికి రాజ్యపాలన కష్టసాధ్యంగాను,
చివరకు అసాధ్యంగాను అనిపించేటట్లు చేయడం, అణచివేతను
లెక్క చేయనటువంటి అలజడిని ప్రజల్లో లేపటం, చివరకు అవ
సరమైతే దేశం మొత్తం తిరుగుబాటు లేవదీయడం దీని పనులు.
ఇంతేకాకుండా బ్రిటిష్ వాణిజ్యాన్ని బహిష్కరించడం, ప్రభుత్వ
సమాఖ్యలకు బదులుగా జాతీయపాఠశాలల నేర్పరచడం, ప్రభుత్వ
న్యాయస్థానాలకు మారుగా జనాలకు వీలుగా ఉండే స్వచ్ఛంద

న్యాయస్థానాలు, బహిరంగ విప్లవానికి కేంద్రీయ సైన్యంగా పని చేసేటట్లు స్వచ్ఛంద దళాలను తయారు చేయుటం. ఇంకా ఈ లక్ష్యసాధనకు చేయవలసినవన్నీ పూర్తి చేయడం ఇందులో ఉన్నాయి. శ్రీఅరవిందులు బహిరంగంగా భారత రాజకీయల్లో పని చేసిన కాలం చాలా తక్కువ. ఎందువల్లనంటే వారు 1910 లో ఇవన్నీ వదిలిపెట్టి పాండిచ్చేరి వెళ్ళిపోయారు. వారు రాజ కీయాలలో లేకపోవడంవల్ల అనుకున్న ప్రణాళిక అమలుకి లోప మైంది. అయినప్పటికీ భారత రాజకీయాల రూపురేఖలనే మార్చి వేసి, భారతజాతినే కదలించేశారు. ఇంకా సర్వస్వతంత్రమే జాతి లక్ష్యంగా, సహాయ నిరాకరణ, ప్రతిఘటనలు దానికి మార్గాలుగా ఆయన రూపొందించిన ప్రణాళికలు కొంతవరకూ అమలు జరు పుతూ, మధ్య మధ్యలో విప్లవాలు చెలరేగుతూ ఉద్ధృతమైనా, విజయం చేకూరటానికి సరి పోయేది. ఆయన రాజకీయాల నుండి వైదొలిగాక జరిగిన సంఘటనలు ఆయన భావాల ననుసరించే జరిగాయి. జాతీయపార్టీ కాంగ్రెసును కైవశం చేసుకొని స్వాతం త్ర్యం లక్ష్యంగా ప్రకటించి కార్యరంగంలోకి దిగింది. ఎక్కువ భాగం మహమ్మదీయులు, కొంతమంది నిమ్నవర్గాలవారు తప్పితే దేశమంతా జాతీయపార్టీ నాయకత్వాన్ని అంగీకరించింది. ఆ తర్వాత అదే మొట్టమొదటి జాతీయ ప్రభుత్వంగా ఏర్పడి చివ రకు బ్రిటిష్‌వారి దగ్గర్నుంచి స్వాతంత్ర్యానికి అంగీకారం సంపా దించింది.

ప్రారంభంలో శ్రీఅరవిందులు తెరవెనుకనుంచి మాత్రమే కాంగ్రెసు రాజకీయాల్లో పాల్గొన్నారు. అప్పటికింకా బరోడా సర్వీసు వదలిపెట్టడానికి నిశ్చయం చేసుకోకపోయినా జీతనష్టం మీద ఎక్కువ సెలవు తీసుకున్నారు. ఆ సమయంలో రహస్య విప్లవ కార్యభారం వహించడమే కాకుండా, పోలీసులు బెదర గొట్టిన బారిసాల్ సభకు హాజరయ్యారు. ఇంకా బిపిన్‌పాల్‌తో తూర్పుబెంగాల్ పర్యటన జరిపారు. కాంగ్రెసులో చొరవగల (ఫార్ వర్డ్ గ్రూప్) ముఠావారితో సన్నిహితత్వం పెంచుకున్నారు. ఈ కాలంలోనే బిపిన్‌పాల్‌తో కలిసి వందేమాతరం పత్రికా సంపాద

కీయం వహించారు. బెంగాల్‌లో క్రొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. కలకత్తాలో జరిగిన కాంగ్రెసు సభకు హాజరైనారు. ఈ సభలోనే అతివాదులు అల్పసంఖ్యాకులైనప్పటికీ తిలక్ నాయకత్వంలో తమ రాజకీయ కార్యక్రమాన్ని కాంగ్రెసు కొంతవరకూ అనుసరించేటట్లు చేశారు. బెంగాల్ జాతీయ కళాశాల స్థాపనతో శ్రీఅరవిందులకు కావలసిన అవకాశం వచ్చి, బరోడా సర్వీసులో తన ఉద్యోగాన్ని విరమించి, ఆ కళాశాల ప్రిన్స్‌పాల్‌గా చేరారు. శ్రీఅరవిందుల రహస్య కార్యకలాపాలలోను, ఆ తర్వాత కాంగ్రెసులోను సహచరుడుగా పనిచేసిన సుబోధ్ మల్లిక్ – శ్రీఅరవిందులు కలకత్తాలో ఉండగా వారింట్లోనే ఉండేవారు – జాతీయ కళాశాల స్థాపనకై లక్ష రూపాయల విరాళమిచ్చి శ్రీఅరవిందులకు నెలకి 150 రూపాయలు వేతనంగా ఇచ్చేటట్లు కూడా ఏర్పాటు చేశారు. దానితో సమయమంతా పూర్తిగా దేశానికి సేవ చేసే స్వేచ్ఛ వారికి లభించింది. స్వయం సహకారము, సహాయనిరాకరణములను వివరించడమే ప్రధానంగా చాలాకాలం నుండి వారపత్రిక నడుపుతున్న బిపిన్‌పాల్, 'వందేమాతరం' అనే దినపత్రికను ప్రారంభించారు. అయితే అది కొద్దికాలపు సాహసమే. ఆయన కేవలం 500 రూపాయలతో ప్రారంభించారు. ముందు ముందు ఏ రకమైన ఆర్థికసహాయం అందుతుందో అనే హామీ కూడా లేదు. ఈ సాహసకార్యంలో శ్రీఅరవిందులను తనతో కలవమని కోరగా ఆయన వెంటనే అంగీకరించారు. ఈ పత్రిక ద్వారా తన విప్లవోద్యమానికి అవసరమైన బహిరంగ ప్రచారము ప్రారంభించటానికి మంచి అవకాశం వచ్చినట్లుగా వారనుకున్నారు. కాంగ్రెసులో చొరవగల యువకుల నందర్నీ (ఫార్‌వర్డ్ గ్రూప్) సమావేశపరిచారు. వారంతా కలిసి బహిరంగంగా ఒక క్రొత్త రాజకీయ పార్టీగా ఏర్పడి మహారాష్ట్రలో తిలక్ నాయకత్వంలో ఉన్న ఇటువంటి సంఘంతో చేతులు కలిపి, కలకత్తా సమావేశంలో మాదిరిగానే మితవాద పార్టీతో ఘర్షణలకు దిగారు. అంతేకాకుండా వందేమాతరం పత్రికను పార్టీ విభాగంగా తీసుకోమన్నారు. ఆ పత్రిక నిధులకోసం 'వందేమాతరం' కంపెనీని ప్రారంభించారు. పార్టీ

ముఖ్యోద్దేశము, కార్యక్రమాలను గురించి ప్రకటించటానికై బిపిన్ పాల్‌ను జిల్లాల్లో పర్యటించడానికని పంపించినప్పుడు కంపెనీ వ్యవహారాలు శ్రీఅరవిందులే చూసుకొనేవారు. క్రొత్త పార్టీ బాగా జయప్రదమైంది. భారతదేశమంతటా 'వందేమాతరం' పత్రిక ప్రచారమైంది. శ్రీఅరవిందులు, బిపిన్‌పాల్ కాకుండా ఇంకా కొంత మంది సమర్థులైన రచయితలు, శ్యామసుందర చక్రవర్తి, హేమేంద్ర ప్రసాద్ ఘోష్, విజయచటర్జీ మొదలైనవారు పత్రిక నిర్వాహక వర్గంలో ఉండేవారు. శ్యామసుందర్, విజయ్ లిద్దరూ ఆంగ్లములో మంచి పండితులు. వారి వారి ప్రత్యేకశైలి వారి కుండేది. శ్యామ సుందర్‌కి శ్రీఅరవిందుల శైలి పట్టుబడింది. దానితో ఆ తర్వాత అతని రచనలు చూసి, అవి శ్రీఅరవిందుల రచనలే అనుకునే వారు. కొంతకాలం తర్వాత బిపిన్‌పాల్‌కు, కంపెనీ నిర్వాహకు లకు, చందాదారులకు మధ్య భేదాభిప్రాయాలు కలిగాయి. దానికి కారణం వారి స్వభావాలకు పొందిక లేకపోవడం, రాజకీయ దృక్పథంలో తేడాలు. ముఖ్యంగా రహస్య విప్లవచర్యలతో మిగి లినవారు ఏకీభవించినా బిపిన్‌పాల్ వ్యతిరేకించేవారు. బిపిన్ పాల్ పత్రిక నుంచి వైదొలగడంతో అది సమసిపోయింది. అయితే దీనికి శ్రీఅరవిందులు ఒప్పుకునేవారు కాదు. ఎందువల్లనంటే బిపిన్ పాల్ గుణగణాలు పత్రికకొక పెన్నిధి వంటివని శ్రీఅర విందుల అభిప్రాయం. పాల్ కార్యవాది కాకపోయినా, రాజకీయ నాయకుడు కాలేకపోయినా అతడు దేశంలోని రాజకీయ మేధా వులలో అగ్రగణ్యుడు, ఉత్కృష్టమైన రచయిత, గొప్ప వక్త. అది శ్రీఅరవిందులకు తెలియకుండానే జరిగిపోయింది. ఆ సమయంలో వారు ప్రమాదగ్రస్తమైన జ్వరంనుంచి కోలుకుంటున్నారు. అప్పుడే 'వందేమాతరం' పత్రికా సంపాదకునిగా వారి పేరు కూడా పత్రి కలో ఆయన అంగీకారం లేకుండా ప్రచురించారు. అయితే ఒక్క రోజులోనే శ్రీఅరవిందులు దాన్ని ఆపేశారు. అప్పటికింకా వారు బరోడా సర్వీసులో ఉంటున్నట్లే లెక్క. ఏ రకంగానూ ఆయన పేరు బహిరంగమవటానికి వారి కిష్టం లేదు. ఏమైనప్పటికీ అప్పటి నుంచి 'వందేమాతరం' విధానం బెంగాల్‌లోని పార్టీతో సమాంత

రంగా ఉండేటట్లు చేశారు. బ్రిటిష్ ఆధిపత్యం ఏమీ లేకుండా పూర్తి స్వయంపాలనే క్రొత్త పార్టీ ఆశయంగా బిపిన్‌పాల్ వ్యక్తీక రించారు. కానీ ఇందులో మితవాదుల ఆశయమైన వలసరాజ్యాల స్వయంపరిపాలన అని కూడా చేర్చి ఉండవలసింది. నిజానికి కల కత్తా సమావేశానికి అధ్యక్షుడుగా దాదాభాయ్ నౌరోజీ, స్వాతం త్ర్యానికి అతివాదులు వాడుతున్న 'స్వరాజ్య' మనే పదాన్ని వలస రాజ్యాల స్వయంపాలనకు బదులుగా ఉపయోగించేందుకు ప్రయ త్నించారు. శ్రీఅరవిందులు తలపెట్టిన ప్రధానకార్యం సంపూర్ణ సర్వస్వతంత్రమే భారతదేశంలో రాజకీయ చర్యలకు ఆదర్శమని బహిరంగంగా ప్రకటించడం, దాన్నే పత్రికలో పదే పదే నొక్కి చూపుతూండడం – ఈ విధంగా బాహాటంగా ప్రకటించే ధైర్యము చూపించిన మొదటి రాజకీయవేత్త వారే. ఆ వెంటనే వారు విజ యాన్ని సాధించారు. స్వతంత్రానికి ఆదర్శం స్వరాజ్యం. అది వెంటనే సర్వత్రా వ్యాప్తి చెందింది. కానీ కాంగ్రెసు మాత్రం చాలా కాలం గడిచాక జాతీయవాదుల నాయకత్వం కింద కరాచి సమా వేశంలో పునఃవ్యవస్థీకరించబడి, పునర్నిర్మాణం పొందినప్పుడే తన ఆదర్శంగా 'స్వరాజ్య' మనే మాటను తీసుకుంది. ఇంకా ఆ పత్రిక దేశానికొక క్రొత్త రాజకీయ కార్యక్రమాన్ని రూపొం దించి అదే జాతీయపార్టీ కార్యక్రమంగా ప్రకటించింది. అవి శ్రీఅర విందుల ప్రణాళికలోని సహాయనిరాకరణ, నిష్క్రియా ప్రతిఘటన, స్వదేశీ, విదేశీ బహిష్కరణ, జాతీయవిద్య న్యాయవిచారణకోసం స్వచ్ఛంద న్యాయస్థానాలు, మొదలైనవి. ఆ పత్రికలో శ్రీఅరవిం దులు ఇంకా అనేక విషయాల మీద వ్యాసాలు వ్రాయనారంభిం చారు. నిష్క్రియా ప్రతిఘటన మీద, విప్లవంయొక్క రాజకీయ తత్వాన్ని విపులీకరిస్తూ కొన్ని వ్యాసాలు, మితవాదుల మూఢ త్వాన్ని బ్రిటిష్ ప్రభుత్వం మనకు చేసే సహాయం మీదా వారి న్యాయనిర్ణయం మీదా, వారి న్యాయస్థానాల మీదా, పాఠశాలల్లో విశ్వవిద్యాలయాల్లో వారు చేస్తున్న యుక్తమైన విద్యాబోధన మీద మితవాదులకు ఉండే నమ్మకాన్ని గురించి వ్రాశారు. ఇంత వరకు ఎవ్వరూ చేయని రీతిలో పరిపాలనలోని లోపాలను, దుష్ఫలి

తాలను గురించి ఘాటుగా వ్యాసపరంపరలను ప్రచురించారు. జాతి నిర్వీర్యం కావటం, పురోగతి లేకుండా నిలిచిపోవటం లేదా కొద్ది పాటి ప్రగతి మాత్రమే ఉండటం, పేదరికం, ఆర్థిక పరాధీనత, భారీపరిశ్రమలు లేకపోవడం, మొదలైనవాటి మీద వ్రాసేవారు. ఒకవేళ పరిపాలన ఉదారంగా, ఉపయోగకరంగా ఉన్నా కూడా కోరవలసింది అది కాదు. స్వేచ్ఛగా ఉండే ఆరోగ్యవంతమైన జాతీయ జీవితానికి అది సరి తూగదు. ఈ విధమైన ప్రచారంతో జాతీయవాదుల అభిప్రాయాలకు అన్ని చోట్లా ఊత లభించింది. ముఖ్యంగా మితవాద రాష్ట్రమైన పంజాబులో కూడా ఆదరణ లభించింది. పత్రికా ప్రపంచంలో 'వందేమాతరం' ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఒక పత్రికతో జాతి సంతతినీ మేల్కొలిపి, విప్లవానికి సిద్ధం చేయటం చరిత్రలో ఇది ఒక్కటే. అయితే ఆర్థిక బలం లేకపోవటంతో అది నీరసించింది. అతివాదుల పార్టీ పేదల పార్టీగానే ఉండిపోయింది. శ్రీఅరవిందుల అధీనంలో ఉన్నంత కాలం వారు ఏదో విధంగా కష్టపడి పత్రికను నడపటానికి కావలసిన మొత్తాన్ని ప్రజల దగ్గర్నుంచి తేగలిగేవారు. కాని అది ఏ విధంగాను వారనుకున్న పద్ధతిలో పత్రికను పెంచడానికి సరిపోయేది కాదు. ఇక వారు జైలులో బందీగా ఉన్న సంవత్సర కాలంలో అది మరింత దిగజారిపోయింది. ఇక చివరికి పత్రికను నిలుపుచేసే పరిస్థితి వచ్చినప్పుడు అది ఆర్థికలోపంవల్ల కాకుండా ఘనమైన ముగింపు కావాలనుకున్నారు. అందులో విజయ్ చటర్జీ గారి వ్యాసం ప్రచురిస్తే ప్రభుత్వమే ఆపుచేస్తుంది. అదివరలో శ్రీఅరవిందులు చాలా చతురతతో దాని సంపాదకీయం నిర్వహించేవారు. వారిటువంటి వ్యాసాలు వ్రాసినప్పటికీ రాజద్రోహ నేరం ఆరోపించి దాని ఉనికికి భంగం కలిగించటానికి వీలులేని పద్ధతిలో నడిపించేవారు. ఒకసారి స్టేట్స్‌మన్ పత్రికా సంపాదకుడు 'వందేమాతరం' మీద అభియోగం కూడా తెచ్చారు. దీని పంక్తుల మధ్యన తిరుగుబాటు రేకెత్తించే వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని ఫిర్యాదు చేసినప్పటికీ, దానిమీద చర్య తీసుకోవటానికి వీలులేని నేర్పుతో వ్రాయటంవల్ల, చట్టం ఏమీ చేయలేక

పోయింది. ఇప్పుడు విజయ్ ఛటర్జీని వ్యాసం వ్రాయమని కోరి ఆ వ్యాసం ప్రచురించగానే వారనుకున్న పని నెరవేరింది. శ్రీఅరవిందుల పరోక్షంలో వందేమాతరం ముగిసిపోయింది.

జాతీయవాదుల కార్యక్రమాలు కార్యరూపం తాలుస్తూండగానే ప్రభుత్వ కఠినచర్యలవల్ల తాత్కాలికంగా భంగం కలిగింది. వాటిలో ఎక్కువ ఆచరణాత్మకంగా ఉండేవి స్వదేశీ, బహిష్కరణ. స్వదేశీ అనే ఆలోచన ప్రచారంలోకి తేవటానికి చాలా ప్రయత్నం చేశారు. దాని అమలు ప్రారంభం కూడా అయింది. కాని సత్ఫలితాలు గొప్పగా కనబడటానికి కొంతకాలం పట్టింది. ఈ స్వదేశీ ఉద్యమాన్ని బాగా ప్రచారం చేయటమే కాకుండా ఒక ఆచరణాత్మక వ్యవస్థగాను, ఒక ప్రభావిత శక్తిగాను చేయాలని శ్రీఅరవిందులు తహతహ లాడారు. ఈ విషయమై బరోడా నుండి ఒక లేఖ వ్రాశారు. పారిశ్రామికవేత్తలను, ఉత్పత్తిదారులను కలుపుకొని భూస్వాముల ధనసహాయంతో ఈ ఉద్యమం నడపకూడదా అనీ, కేవలం రాజకీయవేత్తలే కాకుండా అనుభవము, శక్తిసామర్థ్యములున్న పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు కూడా కలిసి ఒక వ్యవస్థగా ఏర్పడి కార్యాన్ని నడిపిస్తూ ప్రణాళికను నడిపించే ఉపాయాన్ని కనిపెడుతూ ఉండకూడదా అనీ కూడా వ్రాశారు. అది అసంభవమని, భూస్వాములు, పారిశ్రామికవేత్తలు, పిరికితనం వల్ల ఈ ఉద్యమంలో చేరరని, పెద్ద వ్యాపారులంతా బ్రిటన్ నుంచి సామానులు దిగుమతి చేసుకొని వ్యాపారం చేసుకోవటంలో ఆసక్తి ఉన్నవారు కాబట్టి, వారి కిప్పుడున్న పద్ధతే ఇష్టమని వారికి సమాధాన మొచ్చింది. దానితో స్వదేశీ, బహిష్కరణలను వ్యవస్థలుగా చేయాలనే ఆలోచన విరమించారు. తిలక్, శ్రీఅరవిందులు కూడా బ్రిటిష్ వస్తువులను పట్టుదలగా బహిష్కరించాలనుకున్నారు. కేవలం బ్రిటిష్ వస్తువులనే ఎందుకంటే విదేశీవస్తువులకు ప్రత్యామ్నాయంగా మన దేశంలో ఏమీ లేవు. అందువల్ల బ్రిటిష్ వస్తువులకు బదులుగా జర్మనీ, ఆస్ట్రియా, అమెరికా మొదలగు దేశాల నుంచి వస్తువులు దిగుమతి చేసుకుంటే, అది ఇంగ్లాండు మీద మంచి వత్తిడి తీసుకురాగలదని, వారు ఆ విధంగా సిఫారసు

చేశారు. బహిష్కరణ (బాయ్‌కాట్) అనేది కేవలం స్వదేశీ ఉద్యమానికి సహకారంగా చేయడం కాకుండా అదే ఒక రాజకీయ ఆయుధంగా ఉండాలనుకున్నారు. విదేశీ వస్తువులను సాకల్యంగా బహిష్కరించటం సాధ్యం కాని పని. కాంగ్రెసు తీర్మానాల్లో ప్రతిపాదించిన పరిమిత చర్య రాజకీయ ప్రభావం చూపించడానికి చాలదు. ముఖ్యమైన పరిశ్రమలు స్వయం సమృద్ధంగా ఉండాలనీ, కావలసిన వస్తువులను తయారుచేయుటానికి సహజవనరులు భారతదేశంలోనే ఉన్నాయి కాబట్టి యిక్కడే తయారు చేసుకోవచ్చుననీ స్వతంత్ర్యం వస్తే భారతదేశం ఎగుమతి, దిగుమతులు చేసుకొని దేశంలో వాడుకకు కావసినవన్నీ అందించాలి అంటే అంతర్జాతీయ మార్కెట్టుతో సత్సంబంధాలుంచుకోవాలనీ, అందుకని స్వయంసమృద్ధి అనేది ఆచరణీయంగా గానీ, వాంఛనీయంగాగానీ తోచటం లేదని వారనుకున్నారు. అయితే ఈ విదేశీ వస్తుబహిష్కరణ పట్ల ఆకస్మికంగా ప్రజల్లో ఉత్సాహం కట్టలు తెంచుకొని విజృంభించేసరికి నాయకులు అనుసరించక తప్పలేదు. అది స్వదేశీ ఉద్యమానికిచ్చిన స్ఫూర్తిని చూసి వారు తృప్తి పడాల్సి వచ్చింది. శ్రీఅరవిందులు ప్రాధాన్యతనిచ్చిన మరొక అంశం జాతీయవిద్య. బ్రిటిష్ ప్రభుత్వం మన కాలేజీలలో యూనివర్సిటీలలో ప్రవేశపెట్టిన విద్యావిధానాన్ని బరోడా కాలేజీలో ప్రొఫెసర్‌గా బాగా పరిశీలించారు. కాబట్టి ఆయనకు చాలా విసుగు కలిగించింది. ఆ విధానం పిల్లల్లో ఉండే అమోఘమైన సున్నితబుద్ధిని, తెలివితేటలను శుష్కింపజేసి మందమతులుగా చేస్తుందని, పనికిరాని అలవాట్లన్నీ బుద్ధికి నేర్పి పాడు చేస్తుందని – అంటే సంకుచిత సమాచారం అందజేస్తూ యాంత్రికమైన బోధనలు చేస్తూ వారి కల్పనాశక్తిని, సృజనాత్మకశక్తిని నాశనం చేస్తుందని ఆయన అభిప్రాయం. ఈ ఉద్యమం బాగా ప్రారంభమైంది. బెంగాల్‌లో చాలా జాతీయ పాఠశాలలను నెలకొల్పారు. సమర్థులైనవారు చాలా మంది ఉపాధ్యాయులుగా చేరారు. అయినప్పటికీ వాటి అభివృద్ధి ఉండవలసినంతగా లేదు. ఆర్థిక పరిస్థితి అస్థిరమైపోయింది. శ్రీఅరవిందులు తనే స్వయంగా

దీన్ని చేపట్టి, విస్తృతపరచి గట్టి పునాదులు వేయాలనుకున్నారు. కానీ ఆయన బెంగాల్ విడిచి వెళ్ళటంతో ఈ ప్రణాళికకు అంత రాయం కలిగింది. ఆ తర్వాత బ్రిటిష్ అణచివేత చర్యల వల్లనూ, దానివల్ల ఏర్పడిన సాధారణ మాంద్యం వల్లనూ ఎక్కువ పాఠ శాలలు నిలువలేకపోయాయి. అయితే ఆ ఊహ మాత్రం సజీవం గానే ఉంది. ఏదోనాటికి కార్యరూపం దాల్చకపోదు. ప్రజాన్యాయ స్థానాలు కూడా కొన్ని జిల్లాలలో విజయవంతంగా నెలకొన్నాయి. గాని ఈ గందరగోళంలో అవి నశించిపోయాయి. స్వచ్ఛంద దళా లనే ఊహ మాత్రం పుష్టిచెంది, వృద్ధిపొంది కార్యరూపం దాల్చింది. తర్వాత అడపా దడపా జరిగిన స్వతంత్ర పోరాటాలలో సూటిగా తలపడే ఉద్యమాలలో వీరే నాయకులుగా ముందు నిల బడేవారు. ఈ జాతీయప్రణాళికలలోని సిసలైన రాజకీయాంశాలు మాత్రం ప్రతి అణచివేతతోను విజృంభిస్తూ, విమోచనోద్యమాన్ని సజీవంగా ఉంచే సూత్రంగా దాన్ని 50 సంవత్సరాల పాటు కలిపి ఉంచింది. అన్నిటి కంటే ఆ సమయంలో చెప్పుకోదగ్గ గొప్ప విశేషమేమంటే దేశంలో ఒక క్రొత్త చైతన్యం మేల్కోవటం. దేశ మంతా నూతనోత్సాహం పరవళ్ళు తొక్కుతూ 'వందేమాతరం' నినాదం మార్మోగుతూంటే ప్రజలంతా ఆ సమయంలో జీవించి ఉండటం వారి అదృష్టంగా భావిస్తూ కలిసి సాహసంగా పని చేయడానికి, ఆశలు పెంచుకోవడానికి ముందుకు వచ్చారు. పూర్వపు నిరాశ, పిరికితనం పోయి ఏదీ కూడా నశింపచేయలేని నూతన శక్తి తరంగాలుగా ఉవ్వెత్తుగా లేస్తూ సంపూర్ణ ఘనవిజ యానికి భారత దేశం దగ్గరయ్యేటట్లు చేసింది.

'వందేమాతరం' పత్రిక కేసు తర్వాత శ్రీఅరవిందులను బెంగాల్‌లో జాతీయనాయకునిగా గుర్తించారు. మిడ్నపూర్‌లో జరి గిన బెంగాల్ రాష్ట్రీయ సమావేశాలకు ఆయన పార్టీ నాయకత్వం వహించారు. అక్కడ రెండు పార్టీల మధ్య భీకరమైన సంఘర్షణ జరిగింది. మొదటిసారిగా వేదిక నెక్కి బహిరంగోపన్యాసాలు చేశారు. సూరత్‌లో పెద్ద పెద్ద సమావేశాలలో ప్రసంగించి అక్కడ జరిగిన జాతీయమహాసభకు అధ్యక్షత వహించారు. కలకత్తాకు

తిరిగి వచ్చేటప్పుడు అనేక చోట్ల ఆగి ప్రసంగాలు చేశారు. ఆ ప్రసంగాలు వినటానికి అధికసంఖ్యలో ప్రజలు హాజరయ్యేవారు. హుగ్లీ దగ్గర ఏర్పాటు చేసిన రాష్ట్రీయ సభకు కూడా వారే పార్టీ నాయకత్వం వహించారు. ఆ సభలోనే జాతీయవాదం మొదటి సారిగా ప్రాబల్యం పొందటం స్పష్టమైంది. ఎందువల్లనంటే ప్రతి నిధులలో ఎక్కువమంది జాతీయవాదులే. సంస్కరణలు కావాలని ప్రతిపాదించిన మితవాదుల తీర్మానం ఉద్దేశానికి సరిపడలేదని, సత్యదూరమని చెప్పి వీగిపోయేటట్లు చేసి, తమ తీర్మానం ఆమోదం పొందేటట్లు చేసుకోగలిగారు. అయితే అది కొనసాగి నట్లైతే వేరైపోతామని మితవాద నాయకులు బెదిరించారు. వేర్పాటును ఆపటం కోసం మితవాదుల తీర్మానం ఆమోదం పొందేటట్లు చేశారు. కాని బహిరంగ సమావేశంలో దీన్ని గురించి వివరించారు. జాతీయవాదుల తీర్మానం గెలిచినప్పటికీ, బెంగాల్‌లో రాజకీయశక్తులలో సమైక్యతను కొంతవరకు నిలిపి ఉంచటానికి ఈ మార్పును అంగీకరించమని జాతీయవాదులను అడిగారు. మొదట్లో జాతీయవాదులు తీర్మానం అంగీకారం పొందగానే విజయోత్సాహంతో ఉండి శ్రీఅరవిందుల ఆజ్ఞమేరకు మెల్లిగా సభ వదిలి వెళ్ళిపోయారు. అలా చేస్తే మితవాదుల తీర్మానానికి అనుకూలంగా గానీ, ప్రతికూలంగా గాని ఓటు వేయనక్కర లేదు. ఈ చర్యతో ఆశ్చర్యచకితులైన మితవాదులు మనస్సులో చికాకుపడి జనం పెద్దవాళ్ళ మాటలను, అనుభవజ్ఞులైన నాయకుల మాటలను వినటం మానేస్తున్నారని పెద్ద పెట్టున గొడవ చేశారు. కాని రాజకీయాలకు కొత్త అయిన ఒక యువకుని మాటకు కట్టుబడి అందరూ కలిసి క్రమశిక్షణ పాటించి ఏకమైనట్లుగా శాంత పడ్డారు.

ఈ సమయంలోనే శ్రీఅరవిందులు బెంగాలీ దినపత్రిక 'నవశక్తి' ని నడిపించటానికి నిశ్చయించుకున్నారు. స్కాట్సు వీధిలో భార్య, చెల్లెలుతో కలిసి ఉంటున్న అద్దె యింట్లో నుంచి దినపత్రిక ఆఫీసులో నున్న గదుల్లోకి మకాం మార్చారు. ఇంకా ఈ క్రొత్త బాధ్యత ప్రారంభించకముందే ఒకరోజు తెల్లవారు

ఝామున వారు నిద్రిస్తూండగానే పోలీసులు చుట్టుముట్టి రివాల్వర్లు పట్టుకొని, మెట్లెక్కి వచ్చి ఆయనను బంధించి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్ళారు. ఆ తర్వాత ఆలీపూర్ జైలుకి తీసుకెళ్ళి మేజిస్ట్రేటు విచారణ, సెషన్స్ కోర్టు విచారణ జరిపి సంవత్సర కాలం అక్కడే ఉంచారు. మొదట్లో కొంతకాలం ఒక చిన్న గదిలో ఒంటరిగా నిర్బంధించి, ఆ తర్వాత ఈ కేసులో మిగిలిన ఖైదీలతోపాటు ఒక పెద్ద భాగంలో ఉంచారు. కానీ ఆ జైలులో అప్రూవర్ (కడమ ఖైదీలమీద సాక్షిగా ఉండే ఖైదీ) హత్య గావించబడడంతో ఒకరితో ఒకరు మాట్లాడటానికి వీలులేని ఒంటరి గదుల్లో విడివిడిగా నిర్బంధించారు. వారు కోర్టు లోనూ, రోజూ వ్యాయామం చేసేటప్పుడూ కలుసుకున్నప్పటికీ మాట్లాడుకొనే అవకాశం లేదు. ఈ రెండవ జైలు నిర్బంధంలోనే శ్రీఅరవిందులవారు కేసులోని తన తోటి ముద్దాయిలను పరిచయం చేసుకొన్నారు. జైలులో ఉన్న సమయంలో వారు చాలావరకు గీత, ఉపనిషత్తులు చదువుతూ, తీవ్రంగా ధ్యానం చేస్తూ, యోగసాధన చేస్తూ గడిపేవారు. రెండో జైలులో అందరితో కలిసి ఉంటూ, ఏకాంతం లోపించినప్పుడు కూడా అంటే అందరూ మాట్లాడుతూ నవ్వుతూ ఆటలాడుతూ గోలచేస్తూ నిశ్శబ్దం లేకుండా చేసినా వీరు యోగసాధన కొనసాగిస్తూ, ధ్యానం చేయటం అలవాటు చేసుకున్నారు. మొదటి దఫా, మూడవ దఫా ఏకాంతనిర్బంధాన్ని అవకాశంగా తీసుకుని పూర్తిగా వినియోగించుకున్నారు. సెషన్స్ కోర్టు విచారణలో నిందితుల నందర్నీ ఒక పెద్ద ఖైదీల బోనులో ఉంచి నప్పుడు కూడా విచారణ మీద ధ్యాస లేకుండా, సాక్ష్యాలు వినకుండా రోజంతా ధ్యాననిమగ్నులై గడిపారు. శ్రీఅరవిందులు తన కేసును ప్రఖ్యాత న్యాయవాది, జాతీయ కార్యక్రమాల్లో తన సహచరుడు అయిన చిత్తరంజన్ దాసు (సి.ఆర్.దాసు) కు అప్పజెప్పి తాను స్థిమితంగా ఉన్నారు. సి.ఆర్. దాసు తన ప్రాక్టీసు నంతా పక్కన పెట్టి శ్రీఅరవిందులను కాపాడటానికి నెలల తరబడి కృషి చేశారు. ఈ కాలంలోనే జీవితాన్ని గురించి శ్రీఅరవిందుల వైఖరి పూర్తిగా మారిపోయింది. జీవితంలో తను తలపెట్టిన

కార్యానికి కావల్సిన శక్తిసామర్థ్యాలు సంపాదించడానికి, భగవం తుని మార్గదర్శకత్వం పొందడానికి యోగసాధన ప్రారంభించారు. కానీ అది క్రమంగా ఆయనకు అపారమైన ఆంతరిక ఆధ్యాత్మిక జీవనాన్ని, సిద్ధిని సాధించిపెట్టింది. అంతటితో ఊరుకోకుండా క్రమాభివృద్ధి పొందుతూ ఆయనను పూర్తిగా ఆక్రమించేసింది. పూర్వము తలపెట్టిన కార్యము దీనిలో అంతర్భాగముగాను, దాని పర్యవసాన ఫలితముగాను అయింది. దేశసేవ, దేశ స్వాతంత్ర్య ములను మించిన ఆదర్శం, పూర్వం లీలగా ఆయనకు గోచరిం చింది. ఇప్పుడు స్పష్టమైంది. అది ఇప్పుడు ప్రపంచాన్నంతా కలుపు కుంటూ మానవజాతి భవిష్యత్తుకు సంబంధించినదై పోయింది.

శ్రీఅరవిందుల కారాగారం నుంచి విడుదలై రాగానే దేశం లోని రాజకీయవైఖరి మారి ఇంకో విధంగా ఉన్నట్లు గమనిం చారు. జాతీయనాయకుల్లో ఎక్కువ భాగం జైళ్ళలోకిగానీ, తమకు తాముగానే తెరమరుగుకి గానీ వెళ్ళిపోయారు. అంతటా నిరు త్సాహం, మాంద్యం ఆవహించింది. అయితే భావాలు మాత్రం మారలేదు. అణచివేతకు గురైనప్పటికి లోలోపల మరింత బల పడింది. శ్రీఅరవిందులు సమరం కొనసాగించాలనే నిశ్చయించు కున్నారు. కలకత్తాలో ప్రతివారం బహిరంగ సమావేశాలు ఏర్పాటు చేశారు. అయితే పూర్వం వేల సంఖ్యలో హాజరైన సభ్యుల్లో తొణి కిసలాడిన ఉత్సాహం, శక్తి యిప్పుడు హాజరయే కొద్దిమందిలో ఏమాత్రం లేకపోయినాయి. ఇంకా జిల్లాల్లో పర్యటనలు జరిపి ఉపన్యాసాలు యిచ్చారు. ఈ సందర్భంలోనే ఉత్తరపరా అనే చోట మొదటిసారిగా తన యోగజీవితాన్ని గురించి, ఆధ్యాత్మిక అనుభవాలను గురించి మాట్లాడారు. ఈ కాలం లోనే ఇంగ్లీషులో 'కర్మయోగి', బెంగాలీ 'ధర్మ' అనే రెండు పత్రికలు ప్రారంభిం చారు. పూర్వపు 'వందేమాతరం' మాదిరిగా కాకుండా ఈ పత్రి కలు స్వయంపోషకంగా ఉండి మంచి ప్రచారంలో ఉండేవి. 1909 లో బారిసాల్ రాష్ట్రీయ సమావేశంలో పాల్గొన్నారు. బెంగా ల్‌లో హుగ్లీ సమావేశపు రాజీవల్ల అతివాద మితవాద సంఘా లుగా విడి పోకుండా, పార్టీలు కలిసే రాష్ట్రీయ సమావేశంలో

పాల్గొన్నాయి. కాంగ్రెసు స్థానాన్ని ఆక్రమించిన కేంద్రీయ మిత వాద సంఘంలో జాతీయపార్టీకి ప్రతినిధులెవరూ లేకపోయారు. అప్పటికి సురేంద్రనాథ్ బెనర్జీ శ్రీఅరవిందులను సమావేశానికి ఆహ్వానించి, ఇంకా ఇద్దరు ముగ్గురు జాతీయవాదులను కూడా పిలిచి, చర్చలు జరిపి రెండు పార్టీలను బెనారస్ సమావేశంలో ఏకంచేసి, మితవాదులలో అధికారంలో ఉన్న సాంప్రదాయవాదు లతో (రైట్ వింగ్) సంయుక్తంగా పోరాటం జరపటానికి ప్రణా ళిక తయారు చేద్దామనుకున్నారు. సంయుక్త బెంగాల్‌కు మళ్ళీ తనే నాయకుడు కావాలని, అతివాదులను తన కుడిభుజంగా చేసుకోవాలనీ ఆశపడ్డారు. ఆ విధంగా చేస్తే జాతీయవాదులు బెంగాల్ మితవాదుల ప్రతినిధులై సూరత్‌లో విధించిన రాజ్యాం గాన్ని అంగీకరించవలసి వస్తుంది. ఇలా చేయడానికి శ్రీఅరవిం దులు తిరస్కరించారు. కొత్తగా ఏర్పడిన సంఘాలు తమ ప్రతి నిధులను తామే ఎన్నుకొనే అధికారం ఉండేటట్లుగా రాజ్యాం గంలో మార్పులు చేయాలని తద్వారా జాతీయవాదులు తమ ప్రతినిధులను స్వతంత్రంగా అఖిలభారత సభలకు పంపే వీలు కలుగుతుంది కాబట్టి ఆ మార్పులు చేయాలని పట్టుబట్టారు. ఈ అంశం మీదనే రాయబారాలు విఫలమైనాయి. ఈ మారిన పరిస్థి తుల్లో జాతీయోద్యమాన్ని ఏ విధంగా పునరుద్ధరించాలో నని శ్రీఅరవిందులు ఆలోచించటం మొదలుపెట్టారు. ప్రభుత్వం అణచి వేయలేనటువంటి స్వయంపరిపాలనా ఉద్యమాన్ని (హోమ్ రూల్ మూవ్‌మెంట్) చేపట్టే అవకాశం ఉందేమోనని ఆలోచించారు. ఆ తర్వాత అనిబిసెంటు దానినే సాధించారు. అలా చేస్తే ఆదర్శా న్నుంచి వైదొలగి స్వతంత్రాన్ని వాయిదా వేయటమే అవుతుంది. నిష్క్రియా ప్రతిఘటన తీవ్రతరంచేసి బాగా నడిపిద్దామనే ఆలో చన కూడా చేశారు – అదే తర్వాత గాంధీగారు అమలుచేశారు. అయితే తాను అటువంటి ఉద్యమానికి నాయకత్వం వహించటం జరగదని అనుకున్నారు. వారు ఎప్పుడు కూడా ప్రభుత్వం యిస్తా నన్న బూటకపు సంస్కరణలను అంగీకరించలేదు. 'సమాధాన పడి సర్దుకోవటం' ఉండకూడదనే నినాదాన్ని సమర్థించేవారు.

ఇప్పుడు "స్వాధీనమయే వరకు సహకరించేది లేదని" 'కర్మ యోగి' లో ఒక లేఖ కూడా ప్రచురించారు. రాజకీయంగా, పరి పాలనాపరంగా, ఆర్థికపరంగా ఎన్నికల ద్వారా ఏర్పడిన అసెంబ్లీ మంత్రులకు యథార్థమైన అధికారం అప్పగిస్తే తప్ప బ్రిటిష్ ప్రభుత్వం ఏం చెప్పినా వినేది లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే దీనికి ఏ విధమైన జవాబు లేదు. తర్వాత 'మాంటాగు' సంస్కరణల ప్రతిపాదన వచ్చినప్పుడు మాత్రం ఈ విధమైన అవ కాశం వస్తుందేమో ననిపించింది. జాతి ఆకాంక్షను సగం వరకు నెరవేర్చడానికి ప్రయత్నాలు చేయవలసిన పరిస్థితి బ్రిటిష ప్రభు త్వానికి వస్తున్నదని శ్రీఅరవిందులు గ్రహించారు. అయితే అది వచ్చేదాకా ఆ విషయం ముందరగా అనుకోవడానికి వారు ఇష్ట పడలేదు. చివరికి వారు పాండిచ్చేరి వెళ్ళిన 9 సంవత్సరాలకు 'మాంటాగు' సంస్కరణలు వచ్చాయి. వారు అప్పటికే ఆధ్యాత్మిక కార్యంలో నిమగ్నులై బాహ్యమైన రాజకీయ చర్యలను, బహిరంగ కార్యక్రమాలను వదిలి పెట్టేసి భారతదేశంలోని ఉద్యమాలపై ఆధ్యాత్మికశక్తితో పనిచేశారు. దేశనాయకులకు, బ్రిటిష్ పాలకు లకు మధ్యన తాను ముందుగా అనుకున్నట్లు నిజమైన సంప్రదిం పులు జరిగి అవి క్రిప్స్ రాయబారంగా రూపొంది, దాని పరిణా మాలు వచ్చేవరకు వారు ఆ విధంగా పనిచేశారు.

ఇదిలా ఉండగా బ్రిటిష్ వారి అణచివేత సిద్ధాంతం అమలు జరగటానికి శ్రీఅరవిందులొక్కరే అడ్డంకిగా నిలిచిపోయారనీ, వారిని ఏ విధంగానైనా తొలగించుకోవాలని ప్రభుత్వం అనుకుంది. వారిని అండమాను దీవులకు పంపించలేక పోయారు కాబట్టి దేశబహిష్కరణ చేయించాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం సోదరి నివేదిత తెలుసుకొని శ్రీఅరవిందులకు వర్తమానం పంపారు. వారి పనిని అర్ధాంతరంగా ఆపకుండానూ పూర్తిగా నిలిపివేయ నక్కర లేకుండానూ, బ్రిటిష్ ఇండియాను వదిలిపెట్టి బయటకు వెళ్లి పనిచేయమని కోరారు. అప్పుడు శ్రీఅరవిందులు ప్రభుత్వం తలపెట్టిన దేశబహిష్కారం గురించి ప్రస్తావిస్తూ తన సంతకంతో 'కర్మయోగి' పత్రికలో తన అంతిమ శాసనమనే పేరుతో ఒక

వ్యాసాన్ని ప్రచురించారు. దానితో ప్రభుత్వంవారి దేశబహిష్కరణ ఊహాలు అంతమవుతాయని ఆయనకు తెలుసు. అదే జరిగింది. దేశబహిష్కారం లేకపోతే ప్రభుత్వం చేయగలిగింది శ్రీఅరవిందు లను రాజద్రోహ నేరంమీద శిక్షించడం. ఆ అవకాశం కోసం ఎదురుచూస్తుండగా కర్మయోగిలో అప్పటి రాజకీయపరిస్థితిని సమీక్షిస్తూ శ్రీఅరవిందులు సంతకం చేసిన వ్యాసం ప్రచురణ కావడంతో అది సిద్ధించింది. ఆ వ్యాసం ధోరణి బాగా మితవాద తత్వంలో ఉండటంతో అందులో రాజద్రోహం ఉందని కోర్టు వారు ఒప్పుకోక ప్రచురణ కర్తను విడుదల చేసేశారు. ఆ తర్వాత ప్రభుత్వం 'కర్మయోగి' ఆఫీసును సోదా చేసి తమను బంధించ టానికి ప్రయత్నిస్తున్నట్లు ఒక రోజు రాత్రి ఆఫీసులో ఉండగా వర్తమానం వచ్చింది. దానికి ఏ విధంగా స్పందించాలోనని శ్రీఅరవిందులు అనుకుంటున్నంతలో హఠాత్తుగా ఫ్రెంచి ఇండియా లోని చంద్రనాగూర్ పట్టణానికి వెళ్ళమని పైనుంచి ఒక ఆదేశం వచ్చింది. వెంటనే వారు దాన్ని ఆచరించారు. అప్పటికే వారు భగవంతుని మార్గదర్శకత్వంలో పనిచేస్తున్నారు. దాన్ని వ్యతిరే కించే ఆలోచన లేనే లేదు. కాబట్టి ఇక ఎవరితోను సంప్రదించా లని కూడా అనుకోకుండా పది నిమిషాల్లో గంగరేవు కెళ్ళి చంద్ర నాగూర్ వెళ్ళే ఓడ ఎక్కేశారు. కొద్ది గంటల్లోనే చంద్రనాగూర్ వెళ్ళి ఒక రహస్యస్థావరానికి చేరిపోయారు. తను వచ్చేదాకా 'కర్మయోగి' పత్రిక సంపాదకీయం నిర్వహించమని అక్కడనుంచి సోదరి నివేదితకు కబురు చేశారు. దీనితో తన రెండు పత్రికల తోనూ వారి అనుబంధం ముగిసిపోయింది. చంద్రనాగూర్ వెళ్ళి నప్పటి నుండి వారు ఏకాంత ధ్యానంలో ఉంటూ మిగిలిన పను లన్నీ వదలివేశారు. అక్కడనుండి పాండిచ్చేరి వెళ్ళమని ఆదేశం వచ్చేసరికి ఉత్తరపరానుంచి వచ్చిన కొంతమంది యువ తిరుగు బాటుదార్లు తమ పడవలో శ్రీఅరవిందులను కలకత్తా తీసుకొని వచ్చి, 'డూప్లే' అనే ఓడలో పాండిచ్చేరి పంపించారు. ఆ విధంగా వారు 1910 ఏప్రిల్ 4 వ తేదీన పాండిచ్చేరి చేరారు.

పాతదీపాలకు కొత్తదీపాలు

(New Lamps for Old – 3 లోని భాగము)

కాంగ్రెసు శక్తి చాలదు అన్న నా ఆరోపణకు తగిన ఆధారాలను ముందు నేను స్పష్టం చేయవలసి వుంది. నా మాటలు డొంకతిరుగుడుగా ఉన్నట్లు అనిపించే సందర్భాలు ఉన్నాయి కాబట్టి నేను చాలా విషయములు చెప్పదలిచాను. ఉద్వేగ భరితమైన అనేక సున్నితభావాలకు నేను విఘాతం కలిగించక తప్పదు. పొగడ్తలు, పూజలు అందుకునే చాలామంది ప్రాబల్యంకల వ్యక్తుల విషయంలో కఠినమైన రీతిలో నేను మాట్లాడవలసి వస్తుంది – అన్నిటికన్న అధమం అది. ఎన్ని ప్రమాదాలున్నా అన్నీ నిజాలు చెప్పాల్సిందే. ఆ బాధ్యత నాపై ఉన్నందున, నాకు అందుబాటులో వున్న ఉత్తమ పద్ధతిలో, సాహసంతో నేను ముందుకు వెళ్లగలను. కాంగ్రెసు లక్ష్యాలు లోపభూయిష్టమైనవి. ఆ లక్ష్యాలను నెరవేర్చే స్ఫూర్తిలో నిజాయితీ లేదు, చిత్తశుద్ధి లేదు. అది చేపట్టిన పద్ధతులు సరియైనవి కావు. అది నమ్ముకున్న నాయకులు నాయకులు కానే కారు. ఒక్క మాటలో చెప్పాలంటే – అంధులుగా కదులుతున్న మనల్ని అంధులు కాకపోయినా, ఏకాక్షులు ముందుకు నడుపుతున్నారు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

(*SABCL* Vol. 1, p. 15)

అప్పటినుండి వారి యోగసాధన మరింత తీవ్రమైపోయింది. బాహ్యమైన అన్ని రాజకీయ చర్యలను విరమించారు. పునరుద్ధరించిన జాతీయ కాంగ్రెసు సభలకు అధ్యక్షత వహించమని ఆహ్వానాలు వచ్చినా అనేకమారులు తిరస్కరించారు. ఆధ్యాత్మిక విషయాలు తప్ప మరి బాహ్యమైన విషయాలను గురించి మాట్లాడరాదని నియమం పెట్టుకున్నారు. ఆ తర్వాత 'ఆర్య' పత్రికలో తప్ప ఏ విధమైన రచనలు ఎక్కడికి పంపించలేదు. కొన్ని సంవత్సరాలు ఒకరిద్దరు వ్యక్తుల ద్వారా తను నడిపిన విప్లవోద్యమ శక్తులతో రహస్య సంబంధాలు కొనసాగించారు. ఆ తర్వాత అది కూడా మానివేయడంతో వారి రాజకీయ విరమణ అన్ని రకాలుగానూ పూర్తి అయింది. భవిష్యత్తుకు సంబంధించి వారి దృష్టి అంతకంతకు స్పష్టం కావడంతో దివ్యశక్తుల ప్రమేయంవలన భారతదేశం సర్వస్వతంత్రం కావడం తథ్యమని స్థిరమైన నమ్మిక కలిగింది. అంతర్జాతీయమైన ఒత్తిడులవల్లనైతే నేమి, భారతీయుల ప్రతిఘటనల వల్లనైతే నేమి బ్రిటిష్ ప్రభుత్వం తప్పనిసరిగా భారతీయులకు స్వతంత్రమివ్వటానికి ఇష్టమున్నా లేకపోయినా, ఆ దిశలోనే వారు నడుస్తున్నట్లు ఆయన గ్రహించారు. సాయుధ పోరాటం జరుపవలసిన అవసరం లేదనీ, దానికోసం చేసే రహస్యప్రయత్నాలు మానుకోవచ్చని దానివల్ల జాతీయ వివాదానికేవిధమైన ముప్పు ఉండదని వారు తెలుసుకున్నారు. అయితే విప్లవచైతన్యం మాత్రం చెక్కుచెదర కూడదు. ఈ కారణంవల్ల రాజకీయాల్లో తాము వ్యక్తిగతంగా కల్పించుకోవలసిన అవసరం ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. దానికి తోడు తన ముందున్న ఆధ్యాత్మిక కార్యభారము స్పష్టంగా తెలుస్తూండడంతో తన శక్తినంతా దానిమీదే కేంద్రీకరించవలసిన అవసరం గుర్తించారు. ఆ విధంగానే ఆశ్రమం ఏర్పడిన తర్వాత రెండు మూడు ప్రత్యేక సందర్భాలలో వారు రాజకీయాల్లో కల్పించుకోవలసి వచ్చినప్పటికీ అది వారి వ్యక్తిగత హోదాలోనే గాని, ఆశ్రమపక్షంగా కాదు. బ్రిటిష్ ప్రభుత్వం కానీ, దేశప్రజలు కానీ శ్రీఅరవిందుల రాజకీయ విరమణను నమ్మలేకపోయారు. పైపెచ్చు వారు రహస్యంగా

విప్లవచర్యలలో పాల్గొంటున్నారని, ఫ్రెంచి ఇండియా రక్షణలో ఉండి ఒక రహస్యసంస్థను స్థాపిస్తున్నారని కూడా అపోహ పడ్డారు. అవి కేవలం వారి ఊహాలు, పుకారులు మాత్రమే. వారి రాజకీయ జీవితం ముగిసి పోయింది. 1910 లో వారు పూర్తిగా ఏకాంతవాసంలోకి వెళ్లిపోయారు.

ఇలా చేయటంతో చాలామంది అనుకున్నట్లు శ్రీఅరవిందులు ఓ గొప్ప ఆధ్యాత్మికానుభవంలో మునిగిపోయి ఈ ప్రపంచం మీద, భారతదేశ భవిష్యత్తు మీద శ్రద్ధ వదిలేసుకున్నారని కాదు. ఎందువల్లనంటే వారి యోగలక్ష్యం కేవలం భగవంతుని తెలుసు కుని సంపూర్ణ ఆధ్యాత్మిక చైతన్యం పొంది ఉండిపోవటమే కాదు. జీవితాన్నంతటినీ, ప్రపంచ వ్యవహారముల నన్నిటినీ ఆధ్యాత్మిక చైతన్యపు పరిధిలోకి తీసుకొనివెళ్లి, దాని కార్యములుగా చేసి, జీవితానికి ఆధ్యాత్మికమైన అర్థం ఇవ్వాలని, జీవితం భగవంతునిపై ఆధారపడేటట్లు చేయాలనేది వారు చేసే యోగసాధన లక్ష్యము. తను ఏకాంతవాసంలో ఉన్నా ప్రపంచంలోను, భారతదేశంలోను ఏమి జరుగుతున్నది ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవసరమైన ప్పుడు కల్పించుకొని ఆధ్యాత్మికశక్తితో నిశ్శబ్దంగా పనిచేశారు. యోగమార్గంలో బాగా పురోగమించిన సాధకులు పదార్థమయ మైన మనస్సు, ప్రాణము, శరీరములు చేసే పనులు, వాటి శక్తులే కాకుండా పైనుంచి, పక్కలనుంచి పనిచేయగలిగేవి, పనిచేసేవి అనేక శక్తులు ఉండటం వారి అనుభవంలో భాగంగా గమనించి ఉంటారు. అంతే కాకుండా ఆధ్యాత్మిక చైతన్యాన్ని బాగా పొందినవారు స్వాధీనము చేసుకోగలిగిన ఆధ్యాత్మిక గతిశీల శక్తి (డైనమిక్ పవర్) ఒకటుంది. దాన్నందరూ పొందాలని అను కోరు. పొందినా ఉపయోగించరు. కానీ అది ఇతర శక్తుల కంటే గొప్పది, బాగా పనిచేస్తుంది. ఈ శక్తిని శ్రీఅరవిందులు అందు కున్నారు. అందుకోగానే దాన్ని ఉపయోగించారు. మొదట్లో వ్యక్తి గతంగా పరిమిత క్షేత్రంలో ఉపయోగించి, ఆ తర్వాత ప్రపంచ పరిణామాల మీద ఉపయోగించటం సాగించారు. దాని ఫలితా లతో అసంతృప్తి చెందటంగానీ మరో విధంగా పనిచేయవలసిన

అవసరం కానీ వారికి కలగలేదు. రెండుసార్లు మాత్రం ఇంకేదైనా బహిరంగమైన శక్తిని తీసుకోవడం మంచిదేమో అనుకున్నారు. మొదటిసారి రెండవ ప్రపంచయుద్ధ సందర్భంగా అనుకున్నారు. ప్రారంభంలో దాన్ని గురించి ఎక్కువ పట్టించుకోలేదు. కానీ హిట్లరు తననెదుర్కొంటున్న శక్తులనన్నిటినీ అణగద్రొక్కుతున్నట్లు, ప్రపంచమంతా నాజీ అధికారం (నాజీయిజం) ప్రబలిపోతున్నట్లు తోచేసరికి జోక్యం చేసుకోవటం మొదలు పెట్టారు. తాము మిత్రపక్షాలకు మద్దతు నిస్తున్నట్లు బహిరంగంగా ప్రకటించారు. నిధుల సేకరణకోసం విజ్ఞాపన వస్తే ధనవిరాళం కూడా యిచ్చారు. ఎవరైనా సైన్యంలో చేరుతామని వారి దగ్గరకొచ్చి సలహా అడిగినప్పుడు ప్రోత్సాహమిచ్చి పంపేవారు. డన్‌కర్క్ పోరాటం నుంచి అంతర్గతంగా మిత్రపక్షాలవైపు తమ ఆధ్యాత్మిక శక్తిని ప్రయోగించారు. ఆ సందర్భంలో ప్రతివారూ ఇంగ్లండు పడిపోవటం తప్పదనీ, హిట్లరు గెలవటం ఖాయమనీ అనుకున్నారు. కానీ జర్మనీ విజయ పరంపరలు వెంటనే నిరోధించబడటం, యుద్ధవీచికలు అభిముఖంగా సాగటం చూసి సంతృప్తి చెందారు. ఇలా చేయటానికి కారణం హిట్లరు వెనుక, నాజీతత్వం వెనుక అతి దుష్టమైన రాక్షస శక్తులుండటమే. ఇవి విజయం పొందితే చెడు యొక్క క్రూరప్రభుత్వానికి మానవజాతి అంతా దాస్యం చేయవలసి వచ్చేది. పరిణామక్రమం తిరోగమనం చేయాల్సి వచ్చేది. అందులో ముఖ్యంగా మానవజాతి ఆధ్యాత్మిక పరిణామక్రమం, యూరపు మాత్రమే కాకుండా ఆసియా కూడా, అందులో ఉన్న భారతదేశం ఇంతవరకూ ఎన్నడూ ఎరుగనంతటి భయంకరమైన, దుర్భర బానిసత్వం అనుభవించాల్సి వచ్చేది. భారతదేశ విముక్తి కోసం అంతవరకూ చేసిన కృషి అంతా వృథా అయేది. ఈ కారణం వల్లనే క్రిప్సు ప్రతిపాదనలను బహిరంగంగా మెచ్చుకొని, కాంగ్రెసు నాయకులను దానికి ఒప్పుకోమని వత్తిడి చేశారు. అనేక కారణాలవల్ల జపాను జరుపుతున్న దండయాత్రలకు వ్యతిరేకంగా తమ ఆధ్యాత్మికశక్తితో పనిచేయలేదు. కానీ అది భారతదేశం మీద పడి, యుద్ధం చేసి గెలవాలని

అనుకుంటున్నట్లు స్పష్టమయేసరికి తప్ప లేదు. యుద్ధానికి మద్దతు నిస్తూ హిట్లరు తత్త్వము గురించి తన అభిప్రాయాలను బల పరచుకుంటూ తాము వ్రాసిన లేఖలను బహిరంగం చేయడానికి ఒప్పుకున్నారు. క్రిప్స్ ప్రస్తావనకు మద్దతునివ్వటం కూడా దాన్ని ఒప్పుకుంటే భారతదేశం, బ్రిటన్‌లు రెండూ కలిసి అసురశక్తు లను ప్రతిఘటించ వచ్చుననీ, క్రిప్స్ ప్రతిపాదనతో స్వాతంత్ర్య సముపార్జనలో ఒక అడుగు ముందుకు రావచ్చునని అనుకున్నారు. కానీ చర్చలు విఫలం కాగానే దాడి చేసిన వారిమీద ఉపయో గించటానికి ఆధ్యాత్మికశక్తిపై తిరిగి ఆధారపడ్డారు. దానితో అంత వరకు జపాను ప్రభంజనం అన్నిటిని తుడిచి పెడుతూ ముందుకు సాగటం వెంటనే ఆగిపోయి, విపరీతంగా చితికిపోయి, చివరకు సర్వనాశనంగా ఓడిపోవటం చూసి సంతృప్తి చెందారు. ఇంకా కొంతకాలమైన తరువాత భారతదేశ పరిణామాలు తనను కొన్న విధంగా జరగటం చూసి సంతృప్తి చెందారు. ఆంతరంగికమైన కష్టాలు ఏమున్నప్పటికీ అది స్వతంత్రంగా నిలబడగలదని భవి ష్యద్దర్శనంలో వారికి అవగతమైంది.

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకట్రామశాస్త్రి

('*శ్రీఅరవిందులవారి ఆశ్రమం*' నుండి)

(*Sri Aurobindo and His Ashram*)

నా దేశప్రజలకు ఒక బహిరంగ లేఖ
(శ్రీఅరవిందుల చివరి రాజకీయ వీలునామా)

ఈనాటి భారతదేశంలో, తన దేశానికి తన కర్తవ్యాన్ని నెరవేర్చే ప్రజాసేవకుని పరిస్థితి, మరునాడు ఏం జరుగుతుందో చెప్పటానికి వీలులేనిది. నేను నా దేశానికి చేస్తున్న సేవనుంచి, ఒక సంవత్సరంపాటు దూరంగా వుంచబడి, ఈ మధ్యే బయటికొచ్చాను. అసలు నామీద నేరారోపణ చేయటానికి ఏమాత్రం నమ్మదగిన సాక్ష్యాధారాలు లేవు. అయినా ఈ విడుదల, నామీద ఇంకో కొత్త నేరారోపణ చేయబడదు అనటానికి ఎంతమాత్రం హామీ కాదు. అంతే కాదు, అసలీ నేరారోపణ, దానిని సాక్ష్యాధారాలతో ఋజువు చేయటమనే ఇబ్బందికరమైన వ్యవహారమే కానటువంటి, ఏకంగా ద్వీపాంతరవాసానికి పంపించటమనే అర్థరహితచర్య తీసుకొనే ప్రమాదమూ ఉంది.

అందులో, దేశభక్తిని గురించీ, దాని బాధ్యతలను గురించి మాట్లాడే ప్రతివానినీ తొలగించాలని, ఆంగ్లోయిండియన్ ప్రపంచం కుక్కలలాగ మొరుగుతున్నంత కాలం ఈ ప్రమాదం ఉండి తీరుతుంది. అంతకాలమూ, ఈ దేశంలోని వ్యక్తియొక్క స్వాతంత్ర్యము, ప్రమాదకరమనే దానికన్నా ఎక్కువ ప్రమాదంలో వుంది.

నన్ను ద్వీపాంతరవాసానికి పంపించేందుకు కలకత్తా పోలీసు నా మీద కేసును సిద్ధం చేసి, ఇదివరకే ప్రభుత్వానికి పంపారన్న పుకారు ప్రచారంలో వుంది. సిమ్లాలో కూర్చుని, అతి శక్తివంతమైన ప్రభుత్వానికి సలహా లిచ్చేవారికి, దేశంలోని శాంతియుత పరిస్థితులుకాని, మన విధానాలను తు.చ తప్పకుండా చూచే 'చట్టం' కాని ఏమాత్రం అడ్డంకులు కాబోవు.

ఇలాంటి పరిస్థితులలో, నా దేశప్రజకు బహిరంగంగా ఈ లేఖ వ్రాయటం సముచితమని నేను భావిస్తున్నాను. జాతీయవాద రాజకీయపక్ష సిద్ధాంతాలను నమ్మేవారికి, నేటి వారి పరిస్థితుల అవసరాలను గురించి, వారి భవిష్యత్ కార్యక్రమాన్ని గురించి ఇది ఉద్దేశింపబడింది. ఒకవేళ నన్ను దేశబహిష్కరణ చేసినట్లయితే,

తమ కార్యప్రణాళికను గురించి అనిశ్చితస్థితిలో వున్నవారికి, ఇది కొంతవరకు మార్గదర్శకంగా తోడ్పడవచ్చు.

ఒకవేళ నేనసలు తిరిగి రావటమంటూ జరగకపోతే, నా దేశప్రజకు నేనిచ్చే చివరి రాజకీయ వీలునామా ఇదే.

ఇప్పటి జాతీయవాదపార్టీ పరిస్థితి కష్టమైందేకాని, అసాధ్యమైంది కాదు. ఆ పార్టీ నాయకులు శిక్షింపబడ్డారని, వారిలో కొందరికి దేశాంతర శిక్షలూ విధింపబడ్డాయి. కాబట్టి ఆ పార్టీ కథ ముగిసింది అనే భావం చాలా తప్పు. అది కేవలం పైపైనే చూడటం వల్ల ఏర్పడే భావం. వ్యాప్తిలో ఇదివరకటికంటే ఏమాత్రం తక్కువ కాకుండా, ఇదివరకటికంటే ఏమాత్రం శక్తిహీనం కాకుండాను, ఆ పార్టీ ఇంకా వుంది.

కాకపోతే దానికి కావలసిందల్లా ఒక విధానం, ఒక నాయకుడు మాత్రమే. మొదటి దానిని అదే తెలుసుకోవచ్చు, రెండవ దానిని భగవంతుడు దానికీయగలడు.

ఈ మధ్యలో మన పరిస్థితిలోగల కష్టాలు, మనలను సాహసవంతమైన జాగ్రత్తతో కూడిన నడక నడవమంటున్నాయి. మన పరిస్థితికున్న బలమల్లా నైతిక బలమే. భౌతికమైనది కాదు. ఈ దేశంలో ఉన్న భౌతికమైన బలమంతా, తిష్ఠవేసుకు కూర్చున్న ప్రభుత్వానిదే. ఆ ప్రభుత్వ ప్రస్తుత స్వరూపాన్ని ఏమాత్రం గుర్తు పట్టటానికి వీలులేనంతగా, మన విజయం దానిని మార్చివేస్తుంది. అందుకని ఆ ప్రభుత్వం సహజంగానే తన దగ్గరున్న భౌతిక బలాన్నంతా ఆ మార్పును నిరోధించేందుకే వీలయినంతవరకు ప్రయత్నిస్తుంది.

కాని ఈ దేశపు యావత్తు నైతికబలం, న్యాయం మనతోటే ఉంది, ప్రకృతి మనతో ఉంది. ఏ మానవ న్యాయానికైనా అతీతమైన భగవంతుని న్యాయం మనతోనే వుంది. మన చర్యలను సమర్థిస్తుంది. యువత మనతో వుంది. భవిష్యత్తు మనదే సుమా.

మనం మన మనుగడకు, మన విజయానికి ఆ నైతికబలం మీదనే ఆధారపడాలి. మనం ఏ భూమికమీదనైతే బలంగా

వున్నామో దానిని వదిలి, ఇతర ఆకర్షణలకు లోనై, అసహనంతో మనం బలహీనంగా వున్న ఇతర భూమికల మీద కాలుంచ గూడదు.

మన ఆదర్శం ఏ న్యాయమూ ఖండించటానికి వీలులేని ఆదర్శం. మనం అనుసరించే పద్ధతులను, ఏ ఆధునిక ప్రభుత్వమూ సూటిగా అవి చట్టవిరుద్ధాలని ప్రకటించలేదు. అలా ప్రకటిస్తే ఆ ప్రభుత్వం తమది నాగరికపాలన అని చెప్పటానికి ఏమాత్రం హక్కుండదు. ఆ ఆదర్శానికి, అలాంటి పద్ధతులకే మనం దృఢంగా కట్టుబడి వుండి, మన అంతిమ విజయానికి ఆ పద్ధతులకే కట్టు బడి వుండాలి.

చట్టం పట్ల గౌరవమనేది ఒక జాతి జీవనానికి అవసర మైన లక్షణం. ఆ లక్షణం భారత ప్రజలయొక్క ప్రత్యేకత అని అందరూ గుర్తించారు. కాబట్టే మనమెప్పుడూ, అతి జాగ్రత్తగా ఆ చట్టాన్ని గమనించి, అదివ్వగలిగిన అన్ని రక్షణలనూ పొందుతూ, అది అందించే సౌకర్యాలను వాడుకుంటూ, మన ఆశయాన్ని ముందుకు తీసుకుపోతూ, మన ప్రచారాన్ని సాగించ గలగాలి.

స్వరాజ్యం లేదా విదేశీ పెత్తనంలేని పూర్ణ స్వయం ప్రతి పత్తి మన ఆదర్శం. ప్రతి జాతికీ తన శక్తియుక్తుల ప్రకారం, తన స్వభావానుసారంగా, తన ఆదర్శాలకనుగుణంగా బ్రతికే హక్కుం దని మనం చెబుతున్నాం. మన పరంపర నుంచి మనలను బయ టుంచేందుకో, మన నాగరికత కన్నా తక్కువైనదానిని, అదేదో ఉన్నతమైన సామర్థ్యం కలదనే కారణం చెబుతూ, ఇతరులు మన మీద బలవంతంగా రుద్దటాన్ని మనం వ్యతిరేకిస్తాం. దీర్ఘ కాలం పరాయి పాలనలో వుండటం వలన మన అసలు శక్తి సామర్థ్యాలకు లోపాలు, ముప్పులు ఏర్పడ్డాయని అంగీకరిస్తాం. కాని మళ్లీ తిరిగి మనం ఆ శక్తిని, ఆ సామర్థ్యాన్ని పునర్నిర్మిం చుకో గలమన్న నమ్మకం మనకుంది.

శతాబ్దాల నుండి ఎదురవుతున్న అపజయాలు, ప్రమాదాల నుండి ఈ దేశస్థులు అస్తిత్వాన్ని కాపాడిన మన జాతీయశక్తినే మనం ఇతరులకు చూపుతాం. అలాగే మొన్న మొన్నటివరకూ

మన పూర్వీకులు మహత్తర కార్యాలు కొనసాగించారనీ, శీల సంపద, మేధాసంపత్తి కలిగిన అనేకానేకులు, ఇంతవరకు ఏ పరాధీనజాతిలోనో ఉద్భవించనంతగా, ఈ జాతిలో ఉద్భవించారని చెబుతున్నాం. ఇలా ఇంతవరకూ ఎవరూ కనీ వినీ ఎరుగనటువంటి ప్రాణశక్తి కలిగిన ఈ జాతిని ఎవరూ అర్భకులనీ, అసమర్థులనీ అణచటానికి ప్రయత్నించటాన్ని మేం భరించం.

మేం మా పూర్వీకులకన్నా ఎంతమాత్రం తక్కువ వారం కాము. మాకు మేధ వుంది, ధైర్యమూ వుంది. వైవిధ్యమూ, అనంతమైన సామర్థ్యముంది. మేం కోరుకుంటున్నదల్లా ఒక అవకాశం, ఒక కార్యరంగం. ఆ రెంటినీ కేవలం ఒక జాతీయప్రభుత్వం, స్వేచ్ఛాయుత సమాజం, గొప్పదైన భారతీయ సంస్కృతి మట్టుకే సమకూర్చగలవు. ఎంతవరకైతే ఇవి మాకీయబడవో అంతవరకు మా మేధకు, ధైర్యానికి, సామర్థ్యానికి వేరే ఉపయోగమేమీ లేదు. అందుకే వాటిని పొందటానికి మేం ఎడతెగని పోరాటం కొనసాగిస్తాం.

ఆ ఆదర్శమైన '*స్వరాజ్యం*' లో ఏ యితర జాతిపట్ల ద్వేషం లేదు. అలాగే ఇప్పుడీ దేశంలో చట్టప్రకారం ఏర్పరచబడిన పాలన పట్ల ఎలాంటి ద్వేషం లేదు. ఇప్పుడిక్కడ మేం చూసేది '*బ్యూరో క్రాట్ల*' పాలన మాత్రమే. దానిని ప్రజాస్వామ్యం చేద్దామని మేం కోరుకుంటున్నాం. ఇక్కడో విదేశీ ప్రభుత్వముంది. మేం దానిని జాతీయం చేయదలచుకున్నాం; మేమొక విదేశీ నియంత్రణను చూస్తున్నాం. దానిని మేం భారతీయం చేయదలచుకున్నాం.

ఎవరైతే ఇలాంటి ఆకాంక్షలు ద్వేషానికి, దౌర్జన్యానికి అవసరాన్ని కలగచేస్తాయంటారో, వారు అబద్ధమాడుతున్నట్లే. మా ఆదర్శవంతమైన దేశభక్తి ప్రేమ, సౌభ్రాతృత్వాల మీద ఆధారపడింది. అది జాతీయైక్యతకు ఆవల కూడా చూచి, అంతిమంగా మానవాళి ఐక్యతను ఊహిస్తుంది సుమా. అయితే ఆ ఐక్యత సోదరుల మధ్య ఐక్యత, సమానులు, స్వతంత్రుల మధ్య ఐక్యత. అంతేగాని యజమాని బానిసల మధ్య, కబళించేవాడు కబళించబడే వాని మధ్యా ఐక్యత కాదు.

మేం ఒక ప్రత్యేక తెగగా, జాతిగా మాయొక్క సామూహిక మనుగడ కావాలని మేం అడుగుతున్నాం. ఎందుకంటే, అంతిమంగా మానవాళియొక్క సామూహిక భ్రాతృత్వాన్ని సాధించేందుకు అదొక్కటే మార్గం. అంతేకాని వ్యక్తులను, బహిర్గతంగా కనపడే భేదాలను పీల్చివేయటం ద్వారా ఈ సామూహిక భ్రాతృత్వం సాధింపబడదు. దానికిగాను, ఐక్యతకు అంతర్గతంగా అడ్డంకులుగా వున్న ద్వేషానికిగల కారణాలను, దుర్బుద్ధులను, అపార్థాలను తొలగించాలి.

మా హక్కుల కోసం జరిపే పోరాటంలో, పొరపాటుగా వాటిని కాదనేవారి పట్ల ఎలాంటి ద్వేషమూ లేదు. అది మాకే బాధలతో కూడిన ప్రయాస, వ్యక్తులతో నిమిత్తం లేకుండా మేం సత్యాన్ని నిర్భయంగా చెప్పగలగటం. అలాగే ప్రతి చట్టబద్ధమైన ఒత్తిడి, మా నైతికబలపు విధానాలను ఉపయోగించటం మాత్రమే. ఆ ఉపయోగించటమనేది మమ్మల్ని మేం సుస్థిరపరచుకోవటానికి. మరియు ఈ పురోగమన న్యాయాన్ని మాకు నిరాకరించే వారిని అస్థిరపరచటానికే సుమా.

మా పద్ధతులల్లా స్వయం సహాయం, సహాయ నిరాకరణలు మాత్రమే. మనం మన పరిశ్రమలను అభివృద్ధిపరుచుకో గలగటం, మన వ్యక్తిగత వివాదాలను పరిష్కరించుకో గలగటం. ప్రజా సంబంధమైన బహిరంగ సమావేశాల్లో శాంతిని, క్రమపద్ధతిని కాపాడుకో గలగటం, పారిశుద్ధ సమస్యలను పట్టించుకో గలగటం. బాధపడేవారికి, రోగగ్రస్తులకు సహాయపడ గలగటం. క్షామపీడితులను ఆదుకో గలగటం – ముఖ్యంగా మన మేధావుల మరియు సాంకేతిక, శారీరక విద్యలను చూచుకో గలగటం, మన అంతర్గత వ్యవహారాలకోసం మనదైన ప్రభుత్వాన్ని కనుగొన గలగటం, వీటన్నిటికీ చట్టాలను అనుసరిస్తూనే, చట్టసంబంధమైన బ్యూరోక్రటిక్ పాలనా పద్ధతిని కాదనకుండానే వీటిని సాధించగలగటం, ఇదే బహిరంగంగా మేం చెప్పేది, మా జాతీయవాద పార్టీ అనుసరించే విధానం.



నూరేళ్లనాటి కథ – II

అఖిల భారత పత్రిక, ఏప్రిల్ 2006

నూరేళ్లనాటి కథ – II


నూరు సంవత్సరాల క్రితం మాట. శ్రీఅరవిందులు 1906 కాంగ్రెసు సమావేశానికి హాజరైనారు. అతివాదపార్టీ సలహాసభ్య సమావేశంలో పాల్గొన్నారు. స్వరాజ్యము, స్వదేశీయత, విదేశీబహిష్కరణ, జాతీయ విద్యావిధానము – ఈ చతుస్సూత్ర నిబంధనావళి కార్యక్రమ రూపకల్పన చేశారు. 1906 తీర్మానములో దీనిని చేర్చుటకు మిత వాదులు తీవ్రంగా ప్రతిఘటించారు. అయినా వారు అంగీకరించక తప్పలేదు. అదే సమయంలో బిపిన్‌పాల్ 'వందేమాతరం' పత్రిక ప్రారంభించారు. అప్పటికి వారి జేబులో ఉన్న సొమ్ము రు॥ 500/- మాత్రమే. శ్రీఅరవిందుల సంయుక్త సంపాదకత్వంలో ఈ పత్రిక మూడు నాలుగు సం॥ ల లోనే వారియొక్క దేదీప్యమాన వెలుగులు దేశం నలుమూలలా ముంచెత్తించినది.

2006 మార్చి 'అఖిల' లో శ్రీఅరవిందుల మాటలలోనే మాచే ప్రచురించబడిన అంశాలు 1. వారి రాజకీయ భావాలు – కార్యక్రమాలు 2. దేశప్రజకి వారి బహిరంగ లేఖ, 3. మత రాజకీయ సన్యాసమునకు కారణాలు.

ఈ సంచికలో (ఏప్రిల్ 2006) పాఠకులకు అందించే అంశాలు:

1. *భారతదేశ ఆదర్శప్రభుత్వ స్వరూపానికి శ్రీఅరవిందుల సూచనలు*
2. *శ్రీఅరవిందుల ఆలీపూరు కుట్రకేసు విచారణలో, తర్వాత తీర్పులో వినిపించిన చెణుకులు*
3. *శ్రీఅరవిందులపై బ్రిటిష్ పార్లమెంటు (House of Commons) లో చర్చ*

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు



Sri Aurobindo (1915-18)

భారతదేశ ఆదర్శప్రభుత్వ స్వరూపానికి శ్రీఅరవిందుల సూచనలు

(జూలై 13, 1911 న పార్థసారధిగారికి
వ్రాసిన లేఖలో ఒక భాగము)

ఉగ్రవాదము, హింస, అసహనము, ఇతర దేశాలపట్ల ద్వేషభావము – ఇవి భారతీయ సనాతన రాజ్యాంగ సంప్రదాయాలకు పూర్తిగా విరుద్ధం. ఆధ్యాత్మికత, సనాతనధర్మ పాలనము, ప్రాచీన భారత రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలు. ఈ మహోన్నత ఆదర్శాల ఆలంబనగా ప్రాచీన భారత రాజ్యాంగం కొనసాగింది. మన కిప్పుడు కావల్సినవి అవే. – సంపాదకుడు

బూజు పట్టిన రాజకీయాలు తిరస్కరించటంలో నా సూచనలు కాస్త జాగ్రత్తగా గమనించు. ఆధ్యాత్మికతయే భారతదేశ రాజకీయము; సనాతన ధర్మపాలనమే స్వరాజ్యము. పాశ్చాత్య ప్రజాస్వామ్య భావాన్ని తొలగించుకోవటానికి, ఆచరణలో, అది దేశాలను ఉద్ధరించలేక ఎలా నిస్సహాయమైనదో, పార్లమెంటు వ్యవస్థ చరిత్ర కనుక గమనిస్తే తెలుస్తుంది. నిజానికి భారతదేశము ఒక రకమైన జాతీయ యోగ ప్రాథమిక దశలో నడుస్తోంది. ఆరంభంలో (1905) దైవీశక్తి పొంగిపొరలుకుంటూ వచ్చి దేశాన్ని ముంచెత్తింది. అజ్ఞాన తమస్సునుంచి మేల్కొలిపింది. దానితోపాటు, వ్యక్తులలో సంభవిస్తున్నట్లుగా, కుసంస్కారములు, కీడు, దుష్టభావోద్రేకాలు, మానసిక నైతిక అలవాట్లు దేశంలో పెంపొందాయి. దివ్యశక్తి దుర్వినియోగమైంది. ఫలితంగా ఈ క్షుద్ర రాజకీయ వాగ్ధాటి, ప్రజాస్వామ్యంపై అత్యుత్సాహం, సమావేశాలు, ఊరేగింపులు, సహాయనిరాకరణలు! చివరికి ముగింపు బాంబులు, రివాల్వర్లు, నిర్బంధ చట్టాలతో! ఇదొక అపరిశుద్ధ రాజసికమైన దశ. మరి దీనిని అనుసరించి నిరాశాపూరితమై, రజోగుణ ప్రధానమైన ప్రతిచర్య తప్పనిసరిగా ఉండనే ఉంటుంది కదా! వీటినంతటినీ భగవంతుడు తుడిచిపారవేశాడు – అవే ఇంగ్లీషు లిబర్లిజం యొక్క

అక్రమ సంతానము అయిన మితవాదం (Moderation) ఆశియా – ఐరోపాల సంయోగజనిత జాతీయవాదం (Nationalism) మరియు Bakumin – Mazzini ల నెల తక్కువ సంతానమైన ఉగ్రవాదం (Terrorism). ఈ చివరిది ఇంకా మిగిలి ఉన్నా చితకకొట్టబడు తూనే ఉన్నది. మనకీనాడు శత్రువు ఇదే. బ్రిటిష్ దమననీతి పాలనను నేను శత్రువుగా భావించను. ఒక రకంగా అది మేలు చేసేదే. అడ్డు ఆపు లేని ప్రచార కరపత్రాల జోరు, ఉద్రేకపూరిత దౌర్జన్యాలు, ఉన్మాదంతో రెచ్చగొట్టే విద్వేషాలు, అవివేకమైన కుట్రలు – ఈ బుద్ధిహీనమైన కార్యక్రమాలతో బాటు, అరడజను తుపాకీలు, వంద లాఠీలు చేబట్టి, 'ఫెరంఘీ - కో - మారో' నినాదంతో ఆధునిక ఆర్మీని ఎదుర్కొనే అవివేకం తొలగిపోయి, సాత్విక స్వభావ ఆలంబనగా బలమైన ఆధ్యాత్మిక ఉద్యమం ప్రారంభం కావాలి. అదే భారతీయ పునరుజ్జీవనానికి అవతారిక ఔతుంది. ఎన్నో పొరపాట్లు, బాధలు తప్పనిసరిగా ఎదురౌతాయి. కాని ఉద్యమం నిస్సందేహంగా సక్రమ మార్గంలో పయనిస్తుంది. భగవంతుడు అవసరమైన అనుభవాలు, పరిస్థితులు కల్పిస్తూ ముందుకు తీసుకుపోతాడు.

*

(ఈ క్రింది భాగాలు ఎ.బి. పురాణీగారి 'evening Talks' నుంచి తీసుకోబడినవి. నవంబరు 1938 లో శ్రీఅరవిందుల తొడ ఎముక చిట్లి ఉన్న సందర్భంలో సాయంకాలాలలో వారికి పరిచర్య చేసే శిష్యులతో కబుర్లు.)

డిసెంబరు 27, 1938

ప్రాచీన భారతీయ వ్యవస్థ, జనజీవనంలో నుంచి పుట్టుకు వచ్చి నది. అందులో ప్రతి అంశానికి, ఆసక్తికి తావుంది. సర్వస్వతంత్ర ప్రభుసత్తాక రాజ్యానికి (Monarchy) సర్వశ్రేష్టులైన పౌరప్రభుత్వా నికి (aristocracy) ప్రజాస్వామ్యానికి – అన్నిటికీ ప్రాతినిధ్యం ప్రభుత్వంలో ఉంది. పాశ్చాత్య వ్యవస్థ బుద్ధిపరమైనది. మార్పుకి, స్వేచ్ఛకు తావుండదు. ఇది సరిగ్గా ఇలాగే నిక్కచ్చిగా ఉండాలి

అనే వ్యవహారశైలి. ప్రజాస్వామ్యం అంటే ప్రజాస్వామ్యమే; మరిక దేనికీ అందులో తావు ఉండదు; వెసులుబాట్లు ఉండవు.

ఇండియా, పాశ్చాత్యదేశాల ననుకరిస్తోంది. పార్లమెంటరీ ప్రభుత్వము ఈ దేశానికి సరిపడదు. పాశ్చాత్యులు వదిలిపెట్టిన దానిని మనం పట్టుకుని వ్రేలాడుతూ ఉంటాం ఎప్పుడూ.

ప్రశ్న: భారతదేశానికి కావల్సిన ఆదర్శప్రభుత్వం గురించి మీ భావన ఏమిటి?

టాగోరు ఒక మారు వ్రాసినట్లుగానే నేను అనుకుంటాను. తగినన్ని అధికారాలతో పైన ఒక రాష్ట్రపతి ఉంటాడు. ప్రభుత్వ పాలసీ నిరాటంకంగా కొనసాగుతూ ఉంటుంది. ఇంకా దేశ ప్రతినిధుల సంఘము ఒకటి ఉంటుంది. రాష్ట్రాలన్నీ సంయుక్త కూటమిగా ఏకమై రాష్ట్రపతికి లోబడి ఉంటాయి. స్థానిక సంస్థలకు స్థానికంగా తమ తమ సమస్యల పరిష్కారానికి అనువుగా చట్టాలు చేసుకునే అవకాశం ఉంటుంది.

జనవరి, 1939

నేరస్థులు గురించి సి.ఆర్. దాసు ఏం చెప్పాడో తెలుసా?

"నా న్యాయవాద జీవితంలో ఘోరమైన నేరస్థులు (worst criminals) రాజకీయాలనుంచే నాకు తారసిల్లారు."

ఫిబ్రవరి, 1939

ఈ రోజుల్లో ప్రజలు అధునాతన ప్రజాస్వామ్యాన్నే – పార్లమెంటరీ ప్రభుత్వాన్నే – అభిలషిస్తున్నారు. పార్లమెంటరీ పద్ధతి పని అయిపోయింది. యూరపును అదే ఈనాటి దురదృష్ట పరిస్థితికి తీసుకువచ్చినది.

పూర్వం భారతదేశంలోలా, గ్రామపంచాయితీ వ్యవస్థతో ప్రారంభించి మీదకి వెళ్లాలి. గ్రామపంచాయితీలు, సహకార సంఘాలు ఇతోధికంగా ప్రజాప్రాతినిధ్యం వహిస్తాయి. ప్రజలతో నేరుగా సజీవ సంబంధాలు కలిగి ఉంటాయి. ప్రజల భావాలను ప్రతిబింబిస్తాయి. తద్భిన్నంగా స్థానికసంస్థలతో కూడిన పార్లమెం

టరీ వ్యవస్థ ప్రజలతో సజీవ సంబంధాలు లేక ఆచరణ సాధ్యంగా ఉండదు. ఈ ప్రజాప్రతినిధులు కేవలం ఉపన్యాసాలకే పరిమితమై ఉంటారు. ఏం చేస్తున్నారో ఎవరికీ తెలియదు. వారి కాల పరిమితి అనంతరం కూడా మిగిలేది ఈ కలగాపులగ భాగోతమే!

డిశంబరు 30, 1939

ఒక శిష్యుడు: వందేమాతరం జాతీయగీతంగా అభ్యంతరం చెప్పేవాళ్లు కొంతమంది ఉన్నారు. కొంతమంది కాంగ్రెసు వాళ్లు ఈ పాటలోని కొన్ని భాగాలను తొలగించాలనే దానిని సమర్థిస్తున్నారు.

శ్రీఅరవిందులు: అలాగే అయితే హిందువులు తమ సంస్కృతిని వదులుకోవాలి.

శిష్యుడు: వారి వాదం ప్రకారం ఈ గీతం 'దుర్గ' లాటి హిందూ దేవతలను ప్రస్తావిస్తుంది. ఇది ముస్లీములకు సహించనిది.

శ్రీఅరవిందులు: కాని ఇది మతసంబంధమైన గీతం కాదు. ఇది ఒక జాతీయగీతం. 'దుర్గ' గా భారతమాత అభివర్ణింపబడినది. దీనిని ముస్లీములు ఎందుకు ఆమోదించరు? ఇది ఒక కవితా చిత్రణ. భారతీయ జాతీయతాభావనలో, భారతీయ దృక్పథం ప్రతిబింబిస్తుంది. దానికి అక్కడ స్థానం లేకపోతే భారతీయులు తమ సంస్కృతిని వదులుకున్న వారౌతారు. 'అల్లా – హో – అక్బర్' కి ఏ హిందువూ అభ్యంతరం చెప్పడు కదా! హిందువు తన దైవాన్ని తానెందుకు పూజించుకోరాదు? అలా కాకపోతే హిందువు మహమ్మదీయ మతాన్నో, యూరోపియును సంస్కృతినో అంగీకరించాలి: లేదా నాస్తికుడు కావాలి.

నేను సి.ఆర్. దాస్‌తో చెప్పాను (1923) ఈ హిందూ ముస్లిం సమస్య బ్రిటిమవారు వైదొలగిపోయే లోగానే పరిష్కరింపబడవలెనని; లేకపోతే అంతర్యుద్ధ ప్రమాదం ఉన్నదని. ఆయన అంగీకరించాడు. పరిష్కరించాలని కోరుకున్నాడు.

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

ఆలీపూరు కుట్రకేసు

(విచారణ – తీర్పులలో వినిపించిన చెణుకులు)

1908 మే 1 వ తేదీన శుక్రవారం, నేను 'వందేమాతరం' పత్రిక కార్యాలయంలో ఉన్నాను. ముజఫర్‌పూర్ నుంచి వచ్చిన ఒక టెలిగ్రాంను, శ్రీ శ్యాంసుందర్ చక్రవర్తి నా చేతి కందించాడు. దానిని చదివిన మీదట, ఒక బాంబు విసిరిన సంఘటనలో ముజఫర్‌పూర్‌లో ఇరువురు యూరోపియను స్త్రీలు మరణించారని తెలిసింది. అదే రోజు 'ఎంపైర్' పత్రికలో మరో వార్త చదివాను. ఈ హత్యకు కారకులైనవారు తమకు తెలుసని, కొద్దిరోజులలోనే వారిని అరెస్టు చేస్తామని పోలీసు కమీషనర్ అన్నట్లు వార్త.

అప్పుడు పోలీసు దృష్టిలో, నేనే ముఖ్య అనుమానితుడనని, యువవిప్లవకారులకు, తీవ్రవాదులకు నేనే ప్రధాన రహస్య నాయుకుణ్ణి, ముఖ్య హంతకుణ్ణి, పోత్సాహకుణ్ణనీ అన్న భావనే నాలో లేదు.

శ్రీఅరవిందులు (*జైలు జీవిత కథలు*)

*

1908 మే ప్రారంభంలో, శ్రీఅరవిందులు, వారి సోదరుడు బరీంద్రునితో సహా సుమారు 40 మంది కుట్ర జరిపారన్న నేరారోపణతో అరెస్టు కాబడినారు. ప్రసిద్ధి చెందిన ఈ ఆలీపూర్ బాంబ్ కేసు విచారణ, పూర్తి సంవత్సరంపాటు సాగింది. అపుడీ ఖైదీలందరినీ ఆలీపూర్ కారాగారంలో ఉంచారు.

*

శ్రీఅరవిందులు న్యాయస్థానంలో బహిరంగంగా ఏ స్టేట్‌మెంట్ ఈయలేదు. న్యాయస్థానం ఆయన్ని ప్రశ్నించినపుడు, తానీ కేసు బాధ్యతను తన న్యాయవాదులకు అప్పగించాననీ, తన తరఫున వారే మాట్లాడతారనీ అన్నారు. న్యాయస్థానం ప్రశ్నలకు తానుగా ఏ సమాధానం చెప్పటంగాని, స్టేట్‌మెంట్ ఇవ్వడంగాని వారికిష్టం లేదు. వారిచ్చారని చెప్పబడే ఏ స్టేట్‌మెంటన్నా ఉంటే,

అది వారి తరఫున వారి న్యాయవాదులు తయారుచేసిందే కాని, వారు చెప్పింది కాదు.

('తనను గురించి శ్రీఅరవిందులు'Sri Aurobdindo on Himself గ్రంథం 52-53 పుటలు)

*

(ఈ క్రింది పుటలలో, ఆలీపూర్ బాంబ్ కేసులో, శ్రీఅరవిందుల న్యాయవాది, తరువాత దేశబంధు చిత్తరంజన్ దాస్‌గా ప్రసిద్ధి చెందిన శ్రీ సి.ఆర్. దాస్‌గారు న్యాయమూర్తి ముందు వినిపించిన వాదనల నుంచి కొన్ని మెరుపులలాంటి భాగాల నీయటం జరుగుతున్నది. అలాగే న్యాయమూర్తి బీచ్‌క్రాఫ్ట్, శ్రీఅరవిందుల సహాధ్యాయి. ఈ భాగాలు '20 శతాబ్దపు ప్రథమ దశాబ్దంలో శ్రీఅరవిందులు' అనే శ్రీ మనోజ్‌దాస్‌గారి గ్రంథం నుంచి.)

కొన్ని మెరుపులు

"గౌరవనీయ న్యాయమూర్తి మరియు పెద్దలారా? ఎట్టకేలకు ఈ విచారణ ముగిసేదశ కొచ్చినందుకు మనలను మనం అభినందించుకోవాలి. సంవత్సరంలో ఎక్కువ భాగం జైలులోనే గడిపిన ముద్దాయిలకు కూడా ఇది అభినందించుకోవలసిన విషయమే.

ఇప్పుడు మీరందరూ, మీ ముందుంచబడిన సాక్ష్యాలాధారంగా ప్రాశిక్యూషన్‌వారు ఆరోపించిన విధంగా ముద్దాయిలంతా నేరం చేశారా లేదా అనే విషయాన్ని, నిర్ధారించవలసిన సమయమొచ్చింది."

*

"ఈ తరహా కేసుల్లో, ముందు ఋజువు చేయవలసిన విషయం, ఒక కుట్ర జరపబడిందని, తరువాత, ఆ కుట్రతో ఫలానా ఫలానా ముద్దాయికి సంబంధముందని, కాని ఈ కేసులో నా మిత్రుడు (పబ్లిక్ ప్రాశిక్యూటర్ అవలంబించిన పద్ధతి ఏమిటి?)

సాక్షులు న్యాయస్థానం ముందు చెప్పిన మూజువాణి సాక్ష్యంగాని, లేదా ఇక్కడ ప్రవేశపెట్టబడిన పత్రాల ఆధారాలు

గాని చర్చించకుండానే, సరాసరి ముద్దాయిలంతా నేరస్థులుగా భావింపబడి విచారణ ప్రారంభించటం జరిగింది.

వారు నేరస్థులని నిర్ధారించి, వారిని సాక్ష్యాధారాలతో ముడిపెట్టేందుకు ప్రయత్నించారు. ప్రాశిక్యూటర్‌గారొక ఉత్తరాన్ని చదువుతారు, అందులో ఎ.జి అనే పేరు ఉదహరింపబడిందంటారు. ఎ.జి అంటే అరవింద ఘోషంటారు. ఎ.జి అంటే అరవింద ఘోషే అనటానికి ఋజువు ఏమిటి? ఏమీ లేదు. ఇదీ ఆయన వాదన. 'నేను అరవింద ఘోష్ అని చెబుతున్నాను, అదంతే' ముద్దాయిలను విచారించేటప్పుడు, వారు నేరం చేశారనే భావనతోనే మొదలుపెట్టి, తరువాతే వారికీ నేరానికిగల సంబంధం కోసం సాక్ష్యం వెదకడం!

ఛాత్ర భాండార్ విషయం తీసుకోండి. ఛాత్ర భాండార్‌తో సంబంధముంది కాబట్టి, అరవిందఘోష్ కుట్రదారుడు. నా మనవి ఇది పూర్తిగా అవలంబించతగని తప్పుడు విధానం. ఈ పద్ధతి ఇంతవరకు ఏ న్యాయస్థానంలోనూ అవలంబింపబడ లేదు.

ఈ నేరారోపణ ఎదుర్కొంటున్న వారంతా అమాయకులనే మీరు భావించాలి. మీ వద్ద ప్రవేశపెట్టబడిన సాక్ష్యాధారాలను పరిశీలించిన మీదట, వాటి ఆధారాంగా, ఆ సాక్ష్యం అనుమానం ఎంతమాత్రం ఉండటానికి వీలులేనంతగా వారే నేరం చేశారని ఋజువు చేస్తుందనే అంతిమ నిర్ణయానికి మీరు వస్తే, అప్పుడు మాత్రమే, మీరు వారిని నేరస్తులుగా శిక్షించగలరు. ప్రాశిక్యూటరు మీకీ విషయం చెప్పాలి.

ఇందులో ఇంకో విషయము ఉంది – అది అరవిందుని వ్యక్తిగత ఉత్తరాలు. ఆ ఉత్తరాలు మీరు చదవండి. అవి ఈ నేరాలకు సంబంధించిన విషయాల నెంత మాత్రం వివరించవని తెలుస్తుంది. వారి వ్యక్తిగత ఉత్తరాల పవిత్రత ఉద్దేశపూర్వకంగా, అక్రమంగా భంగపరపబడినవి. అది కేవలం వీరంతా నేరం చేశారని ఋజువు చేసేందుకే చేయబడిందా? ఎంత మాత్రం కానే కాదు. మీ ముందున్న వ్యక్తులు ఏ నేరారోపణలతో విచారింప

బడుతున్నారో, ఆ నేరాలకు సంబంధించిన ఏ వివరమూ, ఆ ఉత్తరాలలో ఎక్కడా దొరకదు.

ఇక్కడ నా మిత్రుని (ప్రాశిక్యూటర్) వాదనేమిటంటే 'మీరు ఉత్తరాలను యధాతధంగా కాకుండా అంతరార్థం కోసం చదవండి' అని. అంటే ఏమిటి? ఈ ఉత్తరాలు ఏ కుట్రనూ బల పరచకపోయినా, ఏ నేరాన్నీ సూచించకపోయినా, మీరు వాటి వల్ల మోసపోకండనే కదా! అరవిందుడు నేరస్థుడని మీకు తెలియదా? బాంబులతో సంబంధముందని తెలియదా? రాజుగారి మీద యుద్ధం ప్రకటించాడని తెలియదా? దీనిని మీరు ఆమోదించి నేరం చేశాడని నిర్ధారించాలి.

బరోడాలో అతని ఉద్యమం బాంబులకు సంబంధించిందే అని చెప్పబడింది. '*వందేమాతరం*' లో అతని వ్యాసాలూ ప్రస్తావించబడ్డాయి. కాని '*వందేమాతరం*' లోని ప్రతి వ్యాసానికీ అతనే బాధ్యుడని చెప్పడానికి నమ్మదగిన సాక్ష్యమేదీ మీ ముందుంచ బడలేదు.

ఆ వ్యాసాలు స్వాతంత్ర్యానికి ఊపిరులూదుతున్నాయి. నా స్నేహితుడు (పబ్లిక్ ప్రాశిక్యూటర్) తన వాదనను ప్రారంభిస్తూనే, ఆ ఆదర్శాలతో ఏ ఆంగ్లేయునికీ తగదా లేదన్నాడు. ఆ వ్యాసాలు మొదటి నుంచీ చివరిదాకా, అరవిందఘోష్ స్వాతంత్ర్యం అనే ఆదర్శాన్నే బోధించాడని చెబుతాయి. ఏ ఆంగ్లేయునికి, స్వాతంత్ర్యమనే ఆదర్శంతో ఎంతమాత్రం తగాదే లేదనీ మనకు మరీ మరీ చెప్పబడింది.

ఈ వాదనలో, నేను చెప్పిన తప్పే మళ్ళీ దొర్లుతుంది. అదేమంటే అరవిందఘోష్ కుట్రలో ఉన్నాడు, ఆదర్శాలను ప్రబోధించినా, ఆయన వ్యాసాల్లో యుద్ధం బాంబులు – ఇవే మనకు కనిపిస్తాయి. వారి వాదన మొత్తంలో ఈ తప్పే పునరావృతమౌతుంది.

అరవిందుని ఉత్తరాలన్నీ మీ ముందుంచబడ్డాయని నేనిదివరకే మీకు మనవి చేశాను. నిజానికి ఆయన జీవితం మొత్తం మీ ముందుంచబడింది. ప్రాశిక్యూటర్‌గారి వాదనేమిటంటే, ఈ

సాక్ష్యం అరవిందుని అంతర్జీవితానికి సంబంధించిందనీ, అందులో యుద్ధం చేయటానికి, కుట్రకు సంబంధించిన సూచనలు ఉన్నా యని.

నేను ఆత్మవిశ్వాసంతో అదే విషయం ఆ ఉత్తరాల ఆధా రంగానే నా వాదన కొనసాగిస్తాను. అరవిందుని జీవితం మొత్తం, ఆయన మొదటి కార్యక్రమం నుంచి అరెష్టయ్యే రోజుదాకా, ఒక ఉన్నత ఆదర్శంతో నడిచాడు. ఆయన బరోడాలో ఉన్నప్పుడు జరిపిన ఉత్తరప్రత్యుత్తరాలలోగాని, పత్రికలలోగాని, ఉపన్యాసా లలోగాని, వారు చెప్పిన అంశాల నుంచే, ప్రభుత్వానికి వ్యతిరే కంగా యుద్ధం చేయాలనే ఏ ఒక్క సలహా కూడా ఆయన నుంచి రాలేదని నేను నిరూపిస్తాను.

జీవితమంతా ఆయనొక ఉన్నతాదర్శంతో ప్రచోదింపబడి నాడు. 1904, 1905, 1906 సంవత్సరాల మధ్య నుంచి, అరెష్టవటా నికి కొద్దిరోజుల ముందువరకు ఆ ఆదర్శమే ఆయనను నడిపిం చింది. ఆ విషయాలను మీకు వివరించే ముందు, వారి ఆదర్శాల గురించి రేఖామాత్రంగా వివరిస్తాను.

నా మిత్రుడు (ప్రాశిక్యూటర్) తన వాదనలో దీనిని గేలి చేయటాని కెంతమాత్రం సందేహించలేదు. అయినా అది నా కన వసరం. ఈ జాతికి సంబంధించినంతవరకు, ఉన్నతాదర్శమైన స్వతంత్రాన్నే ఆయన ప్రబోధించాడు. ఇక వ్యక్తిగా సంబంధించి నంతవరకు, ఆయనుద్దేశ్యం ఎప్పుడూ, వ్యక్తిలో దైవాన్ని చూడాలి అని. ఈ ఆదర్శం మా దేశస్థులకు సుపరిచితం. ఇతరుల కిది అర్థం చేసుకోవటం చాలా కష్టం.

కాని ఓ పెద్దలారా, మీకిది సుపరిచితమే.

వేదాంత సిద్ధాంత మేమిటంటే, మానవుడు భగవంతునితో వేర్పాటు పొందినవాడు కాదు: అంటే దానర్థం, నిన్ను నీవు తెలుసుకోవాలంటే, నీలోనే ఉన్న భగవంతుని చూడవలె. నీ మనస్సులో, నీ ఆత్మలో, నీలో నివసించే భగవంతుని నీవు కను గొంటావు. ఆ భగవంతుని చేరకుండా ఏ మానవుడూ మోక్షాన్ని పొందలేడు; అలాగే జాతుల విషయంలో కూడా: ఏ జాతీయ

సంబంధమైన ప్రశ్ననూ లేవనెత్తకుండా, తనలోని అత్యున్నతము, ఉదాత్తము, అత్యుత్తమమైనదానిని గ్రహించకుండా, ఏ జాతీ దీనిని పొందలేదు.

ఎలా వ్యక్తులు తమ విషయంలో బయటి సహాయంతో తమ భగవంతుని చేరలేరో అలాగే జాతి విషయంలో కూడా.

ఒక జాతి తనకు తానుగానే పెంపొందాలి. కాని ఇతరుల సాయంతో కాదు. ఏ విదేశీయుడూ ఇంకో దేశానికి మోక్షాన్ని ప్రసాదించలేడు. జాతీయవాద స్ఫూర్తిని పునరుద్ధరించటమనేది నీ చేతుల్లోనే ఉంది. అరవిందుడు తన జీవితమంతా ప్రబోధించిన జాతీయవాద సిద్ధాంతం అంతా ఈ దేశ సంప్రదాయనికి అనను కూలమైన పద్ధతుల ద్వారా కానేకాదు. ప్రత్యేకంగా మీ దృష్టిని ఈ విషయంపై కేంద్రీకరించమని మనవి చేస్తున్నాను.

ఈ దేశపు మొత్తం చరిత్రకు సరిపడని పద్ధతుల ద్వారా ఈ దేశానికి ముక్తిని సాధించగలమనేది అరవిందుల తాత్విక దృక్పథం కాదు. అలాగే రచయిత అరవిందుని సంప్రదాయమూ అది కాదు. కాబట్టే అరవిందుడు బరోడా వదిలి, కలకత్తాకు వచ్చినపుడు, ఆయన ప్రబోధించినవి హింసాయుత సిద్ధాంతాలు కావు, సహాయనిరాకరణ సిద్ధాంతాలే.

ఆయన ప్రబోధాలు ఈ జాతికి బాంబులు కావు; వ్యధలు.

ఆయన రహస్యసంస్థలను, హింసను నిరసించి, దేశస్తులను బాధలు అనుభవించమన్నాడు. జాతి అభివృద్ధి నిరోధక దుర న్యాయ చట్టం ఏదైనా ఉంటే, దానిని అన్ని విధాలా నిరోధించండి. దాని ఫలితాలను అనుభవించండి. పత్రికా ప్రకటనలలోగాని, ఉప న్యాసాలలోగాని, ఎక్కడా ఒక్క చోట కూడా బలాన్ని ఉపయో గించమని ఆయన చెప్పలేదు.

విముక్తిని ఆటంకించే ఏ ప్రభుత్వ చట్టాన్నైనా ధిక్కరించడం ద్వారా నిరోధించమనేది అరవిందుని సలహా. ఇది నీ అంతరా త్మకు సంబంధించిన విషయం, భగవంతునికీ నీకు సంబంధిం చింది. చట్టం నీవు జైలుకు వెళ్లాలని చెబితే జైలుకు వెళ్లు. అరవిం

దుడు ప్రబోధించిన సహాయనిరాకరణ సిద్ధాంతపు మౌలిక అంశం ఇదే.

సహాయనిరాకరణ సిద్ధాంతము, ఇదే విధంగా ప్రపంచ మంతా బోధింపడలేదా? ఇది ఈ దేశానికే ప్రత్యేకమా – ప్రాశి క్యూటర్ నార్టన్‌గారిచేత అంత నిందాపూర్వకంగా విమర్శింప బడటానికి?

ఇంగ్లడ్‌లోని ప్రజ దీనినే తిరిగి తిరిగి ఆచరించలేదా? ఇదే సిద్ధాంతాన్ని, తన చేతికి సంకెళ్లు పడేదాకా అరవిందుడు బోధి స్తున్నాడు. తమ ఆత్మవిశ్వాసాన్నే కోల్పోవటంతో, తన దేశం తన సరస్వాన్ని కోల్పోతుందన్న భావం, అరవిందుని క్రుంగ దీసింది. అందుకనే, ఎప్పుడాయన స్వతంత్రాన్ని ప్రబోధించినా, ఈ విశిష్ట తను స్పష్టంగా ప్రబోధించేవారు.

ఆత్మవిశ్వాసంతో ఉండండి. ఆత్మవిశ్వాసం లేనివానికి ముక్తి ఉండదు – అని చెప్పేవారు. జాతి విషయంలో కూడా ఇంతేనని చెప్పాడు. ఆత్మవిశ్వాసంలేని ఏ జాతికి కూడ విముక్తి పొందే ఆశే ఉండదు; అర్హత అంతకన్నా ఉండదు. ఇదే అరవిందుని ప్రబోధం – 'మీరు పిరికి అసమర్థ జాతి కాదు; మీలో దైవత్వముంది. ఆత్మ విశ్వాసంతో మీ లక్ష్యం వైపు పురోగమించండి. స్వీయ అభివృ ద్ధిని సాధించిన జాతిగా నిలవండి.'

వ్యాసాలు ప్రచురించిన '*వందేమాతరం*' సంగతి. దీనికి వ్యతిరేకంగా ఎంతమాత్రం 'జాతివిద్వేష' ఆరోపణ చేయలేం. '*వందేమాతరం*' ప్రత్యేకత 'స్వజనం పట్ల ప్రేమ'. అందులోనే కొంత వ్యతిరేకత ఉంది అంటే, నేనర్థం చేసుకోగలను.

కాని నేను నొక్కి చెప్పదలచుకుంది ఒక్కటే, ఇందులోని ప్రత్యేక ప్రాధాన్యం వ్యతిరేకతకు కాదు, స్వజనం పట్ల ప్రేమ మాత్రమే. ఆ వ్యాసాలు వివరణలో మిగతా జాతులను ప్రస్తావిం చినపుడు, వాటి పట్ల సుముఖత వ్యక్తం చేసి ఉండకపోవచ్చు

మొత్తం వ్యాసాలను చదివినట్లయితే, వాటి ఉద్దేశ్యం ఏ జాతి మీదా దండయాత్ర చేయటం కాదనీ, కేవలం మనం మనకు ఉన్న వనరుల ఆధారంగా మనం మన కాళ్ల మీదనే నిలబడాలని చెప్ప

టమేనని అర్థమవుతుంది. నేనిదివరకే మీకు వివరించినట్లు మీ విముక్తి ద్వారా తప్ప మీ ఆదర్శాన్ని అందుకోలేరని తెలియ చెప్పటమే, ఆ వ్యాసాల ఉద్దేశ్యం.

'*వందేమాతరం*' ఇతర జాతులను ఎందుకు ఎత్తిచూపిం దంటే, ఈ దేశప్రజ విదేశీనాగరికత మోజులో యూరోపియన్ జాతుల ప్రత్యేక సమ్మోహనశక్తికి లోబడిపోయి ఉంది. ఈ వ్యాసాల ద్వారా దానిని తొలగించదలచటమే వాటి లక్ష్యం.

యూరోపియన్ నాగరికత చెడ్డదని కాదు. యూరోపియన్ నాగరికత యూరోపియన్‌ల కోసమే. యూరోపియన్ జాతులు తమకు సహజమైన తమ పద్ధతిలో తమ సంప్రదాయం ప్రకారం, ఉన్నత స్థానానికి వారు చేరుకోగలగాలి.

అలాగే భారతీయుల విషయమూ, వారు తమ స్వకీయమైన పద్ధతిని తామవలంబించవలె.

యూరోపియన్ నాగరికత చెడ్డదనీ కాదు – మీరిది ప్రత్యే కంగా గుర్తించాలని నా మనవి – ఈ వ్యాసాల్లో ఎక్కడా వారు చెడ్డవారని చెప్పబడలేదు – కాని ఈ యూరోపియన్ నాగరికత అమలు చేయబడినంత వరకు, ఈ దేశంలోకి తీసుకురాబడిన యూరోపియన్ సంప్రదాయాలకు సంబంధించినంతవరకు మాకు అవి ఎంతమాత్రం ఈ దేశపు పెంపుదలకు ఆధారభూతమైనవి కావు. అదే ఈ వ్యాసాల వెనుకగల మౌలిక తత్వం.

యూరోపియన్ నాగరికత అనే వృక్షం యూరోపియన్ భూమిలో పెరిగేది. ఆ వృక్షాన్ని మీరిక్కడకు తెస్తే, ఈ భూమి దాని కనువైనది కాదు. కాబట్టి ఇక్కడ అది వృద్ధి పొందలేదు. అదే విధంగా, ఒక జాతి అభివృద్ధి దాని సంప్రదాయాలాధారంగా ఉండవలె. నీవు దాని కాధారంగా ఇతర సంప్రదాయాల నుంచితే, ఆ భూమి దాని కనుకూలం కాదు.

అంతేకాని, అసలు మానవాళి పట్ల వ్యతిరేకత, అయిష్టత అనేవి ఈ వ్యాసాల్లో కనపడదు. నా మిత్రుడు పబ్లిక్ ప్రాశిక్యూ టర్ ఏమి లేవు అని అంటున్నారో అవే ఆ వ్యాసాల్లో ఉన్నాయి.

వీరి లెక్కలో, మానవత్వం కోసం తప్పితే, జాతీయవాదానికి హేతుబద్ధమైన ఆధారం లేదు. మీ అనుమతితో, ఈ రోజులలో వ్రాయబడిన ఒక వ్యాసాన్ని చదువుతాను. అది అలంకారప్రాయమైన భాషలో వ్రాయబడింది, కాని ఈ ధోరణిలో అంతర్గతంగా ఉన్న తత్వాన్నే అది వెలిబుచ్చింది." (అక్టోబరు 16 న ప్రచురించబడిన '*జాతీయదినము*' అనే వ్యాసాన్ని చదువుతాడు సి.ఆర్. దాస్)

తరువాత ఆయన 1907 ఏప్రిల్ నుంచి 1907 సెప్టెంబరు దాకా, అంటే అరవిందులు దేశద్రోహం నేరం కేసులో విడుదలయ్యేదాకా ఉన్న సమయం గురించి చెప్పాడు. ఆ సమయంలో అరవిందుని కార్యక్రమాలన్నీ, నేషనల్ కాలేజీ, '*వందేమాతరం*' పత్రికకే పరిమితమయ్యాయి. ఆ సందర్భంలో జపాన్‌లోని టోక్యో నుంచి అరవిందునికి, అతని '*వందేమాతరం*' పత్రిక కారణంగా విచారణ ఎదుర్కొంటున్న విషయమై సానుభూతి తెలుపుతూ వచ్చిన ఉత్తరాన్ని చదివి వినిపిస్తాడు.

*

తరువాత దాస్ అరవిందఘోష్ వ్రాసిన, ప్రచురించబడని దీర్ఘమైన వ్యాసం 'ఉగ్రవాదమంటే ఏమిటి?' చదివి వినిపిస్తాడు. దానిలో ఒక వాక్యముంది. '*చట్టం మానవుని కోసం చేయబడింది, కాని మానవుడు చట్టం కోసం చేయబడ లేదు.*'

దానిని విన్న న్యాయమూర్తి ఈ ప్రశ్న వేస్తాడు: "ప్రతి వ్యక్తికీ చట్టం మీద తన తీర్పును ప్రకటించే అధికారముందా?" అని.

దాస్ దృఢంగా 'ఉంది' అని సమాధానమిచ్చాడు. ఏ మానవునికైనా అతని జీవితాన్ని నడిపే మార్గదర్శి అతని అంతరాత్మ అంటాడు. ప్రాశిక్యూటర్ నార్టన్ మధ్యలో అడ్డువస్తూ అడుగుతాడు – "అట్లా అయితే సమాజాలు ఎలా బ్రతుకుతాయని."

న్యాయవాది దాస్ తన వాదనను కొనసాగిస్తూ, ఒక ప్రశ్న వేస్తాడు. "సహాయనిరాకరణాన్ని గురించి మిగతా దేశాలలోనూ

న్యాయమూర్తి: "నేనూ నా పూర్తి పేరు వ్రాయను. నేను నా ఇంటిపేరు మినహాయిస్తాను."

దాస్: "ఎవ్వరూ ఆ విధంగా సంతకం పెట్టరు. సందర్భాలను పరిశీలిస్తే, నా మనవి ఏమిటంటే, ఏ తమ్ముడూ తన అన్నకు వ్రాయదల్చుకుంటే, పూర్తిగా బరీంద్రకుమార్ ఘోష్ అని సంతకం చేయకపోవటమే సబబు."

దాస్ తన వాదనను కొనసాగిస్తూ ఇలా అన్నాడు: "ఈ మిఠాయిల ఉత్తరం అరవిందుడు తనతో భద్రంగా ఒక నిధిలా దాచుకున్నాడు. బాంబే రాష్ట్రంలోని అనేకానేక స్థలాలకు దానిని తీసుకువెళ్లాడు. అది కలకత్తాకు తీసుకురాబడింది. అక్కడ రెండు నెలలపాటు 23 స్కాట్స్ లేన్ అడ్రసులో ఉంచబడింది. పోలీసులు అదే ఉత్తరాన్ని అదృష్టవశాత్తు 48 గ్రే వీధి ఇంటిలో స్వాధీనం చేసుకున్నారు.

ఇది పూర్తిగా అసంబద్ధం. ఈ పరిస్థితులలో, న్యాయమూర్తులైన మీరు, ఈ ఉత్తరం అరవిందునికి వ్యతిరేకమైన సాక్ష్యమనీ, అది అరవిందఘోష్‌కు వ్యతిరేకమైన ఋజువని ఏ మాత్రం భావించరనుకుంటాను."

*

తరువాత దాస్ మిగతా అనేకమంది సాక్ష్యుల సాక్ష్యాన్ని ఉదహరించి, దాని మీద విమర్శలు కురిపించాడు. అదంతా అయన తరువాత ఆయన తన వాదననీ విధంగా క్లుప్తీకరించాడు.

"గౌరవనీయ న్యాయమూర్తి, పెద్దలైన ఎసెసర్లకు – మీరింత శాంతంగా, వివరంగా నా వాదనలు విన్నందుకు సర్వదా కృతజ్ఞుణ్ణి. నిజానికి నా కోరిక, ఈ కేసును ఈ న్యాయస్థానం ముందుంచే బాధ్యత నా మీద కాకుండా, ఇంకెవరి మీదనన్నా పడివుండాల్సిందని. కాని ఇది నా చేతులలో పడింది. నేను నా శక్తికొలది, సాక్ష్యాలను ఒక క్రమపద్ధతిలో ఈ న్యాయస్థానం ముందుంచాను.

అసలీ కేసు ప్రారంభంలోనే, ఒక ముఖ్యవిషయం నా దృష్టికొచ్చింది. కాని నేనింతవరకు దానిని ప్రస్తావించలేదు. ఈ

కేసులోని మౌఖిక, మరియు పత్రాల రూపేణా ఉన్న సాక్ష్యా న్నంతా విమర్శించిన తరువాత, ఆ విషయాన్ని ప్రస్తావిద్దామను కున్నాను.

అరవిందునికి అమిత తెలివితేటలున్నాయి. సంస్థలను నడప గల కార్యదక్షత ఉంది అని ప్రశంసిస్తూ, ఆయన ఈ కుట్రను నిర్దేశిస్తూ, దాని వెనుక నుండి నడిపిస్తున్నాడని నా మిత్రుడు ప్రాశిక్యూటరు వాదన. ఈ విషయాన్ని గురించే, ఇప్పుడు తమరి ముందు నా వాదన నుంచుతున్నాను.

ఈ కోర్టు ముందు ప్రవేశపెట్టబడిన సాక్ష్యం ఆధారంగా ఋజువైన కుట్ర ఏదైనా ఉంటే (అసలు ముందు ఋజువు అవాలి కదా!) అలాంటి కుట్ర సఫలమౌతుందని అరవిందుడు నమ్మ టమే అసాధ్యం. ఆయన మేధోశక్తిని మీరే గుర్తించారు కదా! గుర్తించకపోయి ఉంటే – అది వేరే విషయం.

కాని మీరు దయతో అతనికి ఆపాదించిన తెలివితేటలను గణనలోకి తీసుకొని, అతనే ఇలాంటి కుట్రకు నాయకుడు అనీ, దీనిని నడుపుతున్నాడనీ అంటే, నా సమాధాన మిదే. అరవిం దుని బోటివాడు అసలిలాటి కుట్ర విషయం ఆలోచిస్తాడనేది, పైగా అది విజయవంతం అవుతుందని అనుకుంటాడనేది, పూర్తిగా అసంభవం.

నా మిత్రుడైన ప్రాశిక్యూటర్‌గారు, ఈ కుట్రకుగల వేయి నొక్క కోణాల గురించి, ఈ కుట్ర ఎలా కలకత్తా నుంచి ట్యూటి కోరన్ దాకాను, ఇంకా ఇతర చోట్ల ఉంది, ఈ అతిపెద్ద కుట్ర అనే నేరారోపణను బలపరుచుకునేందుకు, రికార్డులో ఎంత మాత్రం లేని సాక్ష్యాలను గురించి, దానితో ఏమాత్రం సంబంధం లేనివారికి వ్యతిరేకంగా, ఆ ఆరోపణ చేస్తూ, వాదించారు. దానినే మాత్రం జమలోకి తీసుకోవద్దని నేను కోరుతున్నాను. ఈ కుట్రంతా కేవలం ప్రాశిక్యూటర్‌గారి ఊహల్లోనే ఉంది. అయినా వారా కుట్రను నమ్ముతున్నారు.

వారొక్క క్షణం కూడా, ఈ కుట్ర నిజం కాదని నమ్మటం లేదు. వారు చెప్పిన ప్రతి మాటా, ప్రతి అక్షరం వారు నమ్మటం

లేదని నేనెంత మాత్రం అనను. అందులో వారికెంత మాత్రం అనుమానం లేదు. వారి కుట్రను పూర్తిగా నమ్మారు. దానినే ఈ కోర్టు ముందుంచారు. ఆ విషయాన్ని వివరిస్తూ, నే సూచించగలిగేది ఒక్కటే. ప్రాశిక్యూటర్‌గారు బాగా పోలీసువారి ప్రభావంలో పడిపోయారు. అందుచేత వారి మనసు పోలీసువారిచేత విషపూరితం కాబడినది. పోలీసువారు చెప్పిన ప్రతిదీ ప్రాశిక్యూటర్ గారు పూర్తిగా నమ్మి, దానినే కోర్టు ముందుంచారు."

*

"మీకు నా మనవి ఇదే: మీ ముందు ఆరోపణల నెదుర్కొంటూ నేరస్థుడుగా నిలబడిన ఇలాంటి వ్యక్తి కేవలం ఈ న్యాయస్థానం ముందే కాదు, ఉన్నత చారిత్రక న్యాయస్థానం ముందే నిలబడి ఉన్నాడు. కాబట్టే నా మనవి ఇదే:

ఈ వివాదం సమసిపోయి, ఆందోళన ముగిసి, ఈ గందరగోళం విరమింపబడిన చాలా రోజుల తరువాత, ఈ వ్యక్తి నిష్క్రమించిన తరువాత – ఆయన దేశభక్తి సాహిత్య సృష్టికర్తగా (The poet of Patriotism) జాతీయవాద ప్రవక్తగా, విశ్వమానవ ప్రేమైక మూర్తిగా గుర్తింపబడతాడు. ఆయన మరణానంతరం ఆయన మాటలు ఈ దేశంలో ధ్వనిస్తాయి; ఒక్క భారతదేశంలోనే కాకుండా, ఖండ, ఖండాంతరాలలోనూ ప్రతిధ్వనిస్తాయి.

మీ ముందిక్కడ నిలచిన వ్యక్తి, ఈ న్యాయస్థానం ముందే కాదు, ఉన్నత చారిత్రక న్యాయస్థానం ముందే నిలబడి ఉన్నాడు."

తరువాత, న్యాయమూర్తి బీచ్‌క్రాఫ్ట్ నుద్దేశించి, ఇలా అంటారు దాస్: "సర్, మీరు మీ తీర్పును గురించే ఆలోచించే సమయం వచ్చింది. గౌరవనీయులైన అసెసర్ మహాశయులారా! మీరూ మీ నిర్ణయాన్ని చెప్పే సమయం వచ్చింది.

కాబట్టే, సర్, ఆంగ్లన్యాయమూర్తులు నిర్మించిన సత్సంప్రదాయం, ఆంగ్లేయ చరిత్రలో ప్రసిద్ధిచెందిన ప్రకరణం. కాబట్టే, ఉదాత్తమైన ఆ విషయాలను గుర్తు చేస్తూ, ఆంగ్లన్యాయమూర్తుల ద్వారా ఉద్ఘాటించబడిన, బహుళ న్యాయసూత్రాలను తలుచుకుంటూ మనవిచేస్తున్నాను.

అలాగే, తమ తమ వివాదాలను వారి ముందుకు తెస్తే, వాటిలో తాము వెలువరించిన తీర్పుల ద్వారా వారందరి విధేయ తనే కాకుండా, గౌరవాన్ని కూడా పొందిన ప్రముఖ న్యాయ మూర్తులను తలుచుకుంటున్నాను.

ఆంగ్లచరిత్రలో ప్రసిద్ధి చెందిన ఆ ప్రకరణాన్ని తలుచు కుంటూ, నా మనవి ఇదే. భవిష్యత్‌లో, ఒక ఆంగ్ల న్యాయమూర్తి న్యాయం చేయటం మరిచిపోయాడనే మాట రాగూడదు."

అసెసర్ల నుద్దేశించి, దాస్ ఇలా అంటాడు: "అరవిందుడు ఏ ఆదర్శాన్ని ప్రచారం చేశాడో, ఆ ఆదర్శం పేరుతో, ఈ దేశపు సంప్రదాయాల పేరుతో, మీ అందరికీ నా మనవి ఒక్కటే. భవి ష్యత్‌లో, ఎవ్వరూ, అరవిందుని దేశస్థులైన ఇద్దరు అసెసర్ల ఆవే శానికి, పక్షపాతానికి, తాత్కాలిక గందరగోళానికి లోనయ్యారని చెప్పబడగూడదు."

న్యాయమూర్తి బీచ్‌క్రాఫ్ట్ తీర్పునుంచి

"ఇప్పుడీ కేసులోని ప్రముఖ ముద్దాయి అరవిందఘోష్ విషయా నికి వస్తాను. మిగతావారందరికన్నా ఈతనికే శిక్షపడేటట్లు చేయా లని ప్రాసిక్యూషన్ ఆదుర్దాగా ఉంది. ఇతను గనుక ముద్దాయిగా లేకపోతే, ఈ కేసు విచారణ ఎప్పుడో పూర్తయి ఉండేది. అందు వలనే, నేనూ కొంతవరకు, ఈ తీర్పులో చివరగా అతని వ్యవ హార పరిశీలనకు పూనుకున్నాను. ఇతనికి వ్యతిరేక సాక్ష్యమంతా, దాదాపు మొత్తంగా, అతను ఇతర ముద్దాయిలతో కలవటం మీదనే ఆధారపడి ఉంది.

ముందుగా అతని న్యాయవాది వాదించినట్లుగా, అతను తన ముందుంచుకున్న ఆదర్శాన్ని గురించి, వీలయినంత క్లుప్తంగా చెబుతాను. తరువాతే, అతనికి వ్యతిరేకంగాగల సాక్ష్యాన్ని చూస్తాను. ప్రాశిక్యూషన్‌వారి ప్రకారం, అతని న్యాయవాది ప్రకారం కూడా, అతను చాలా మతైకప్రవృత్తి కలవాడు. ప్రాశిక్యూషన్ ప్రకారం, అతని ఈ మతైకప్రవృత్తి, భారతదేశపు స్వాతంత్ర్యవాం ఛతో కలిసి అతనినొక పిచ్చివానిగా మార్చింది.

అతని న్యాయవాది వాదన ప్రకారం అతనో వేదాంతి. ఆ వేదాంత సిద్ధాంతాలను, తన రాజకీయ సిద్ధాంతాల నిర్మాణానికి వినియోగించుకున్నాడు. అలా వేదాంత సిద్ధాంతాన్ని, ఒక వ్యక్తి ఆపాదించుకుంటే, అతను తనలోగల దైవత్వాన్ని కనుగొనేందుకు, అంతర్ముఖుడవుతాడు; తనలోగల అత్యుత్తమమైనదానిని సాధిస్తాడు. అలాగే ఒక జాతి విషయంలో, తనలో అంతర్గతంగా గలదానికి సాధించటం ద్వారా మాత్రమే, అది పెరగగలుగుతుంది. ఏ విదేశీయుడూ దానికి తరుణోపాయాన్ని ప్రసాదించలేడు; ఆ తరుణోపాయాన్ని, అది తన స్వభావసిద్ధమైన పద్ధతుల ద్వారా మాత్రమే పొందగలుగుతుంది.

అతని సిద్ధాంతాలు కేవలం సహాయనిరాకరణ మాత్రమే కాదు; బాధలు పడడం ద్వారా, తరుణోపాయాన్ని సాధించగలగటం. చట్టం అన్యాయమైంది అయితే, దానిని పాలించవద్దు, పాలించకపోవటం వలన వచ్చిన ఫలితాలను అనుభవించండి. మీరు హింసావాదులు కాకండి, కాని చట్టం అన్యాయమైందయితే, నైతికంగా మీకు దానిని పాలించవలసిన అవసరం లేదు; దానిని నిరాకరించండి, బాధలు పడండి.

అతను తన ప్రజకీ విధంగా చెబుతూ వచ్చాడు. మీరు పిరికివారు కాదు, ఆత్మవిశ్వాసంతో ఉండండి. మీ తరుణోపాయాన్ని మీరు ఆలోచించండి. అది బయటివారి సహాయం ద్వారా పొందలేరు, అది మీకు మీ వలననే సాధ్యం. దాస్ వాదన ప్రకారం, ఇదే ఈ కేసుకు మూలాధారం."

*

తరువాత బీచ్‌క్రాఫ్ట్, అరవిందునికి వ్యతిరేకంగా అతను కుట్రదారుడని ఋజువు చేయటానికి ప్రాశిక్యూషన్ ప్రవేశపెట్టిన సాక్ష్యాధారాలన్నిటినీ పరిశీలించి, అవి నేరాన్ని ఋజువు చేసేందుకు చాలకపోగా వాస్తవానికి చాలా దూరంగా ఉన్నాయని నిర్ధారిస్తాడు.

తరువాత ఆయనీ విధంగా అంటాడు: "అరవిందుని ఉపన్యాసాలలో నిజంగా ముఖ్యమైనది పెద్దగా ఏమీ లేదు. 1908

జనవరి, ఫిబ్రవరి మాసాలలో బొంబాయి రాష్ట్రంలో ఆయన కార్య క్రమం, ఆయన ఉపన్యాసాలను గురించిన సాక్ష్యం ప్రవేశపెట్టబడింది. నిజానికీ సాక్ష్యం అంత అసలు అనవసరమే; కారణమేమిటంటే అది ఋజువు చేసేదంతా, అరవిందుడు ఎక్కడకు వెళ్లినా అక్కడ అమితంగా ఆదరింపబడ్డాడనేదే. ఈ విషయాన్ని ఆయన న్యాయవాది ఎప్పుడూ కొట్టిపారవేయలేదు.

ఆ ఉపన్యాసాలు నిజానికి, ప్రాశిక్యూషన్ కన్నా, అరవిందుని రక్షణకే ఎక్కువ ఉపకరించాయి. వీటి ద్వారా మనకు ప్రభుత్వ పాఠశాలలలోని పద్ధతులకంటే భిన్నంగా, జాతీయవిద్యను గురించి ఆయనెలా నొక్కిచెప్పిందీ తెలుస్తుంది. అదంతా ఆయన ఆలోచనలలో మొదటినుంచీ కనపడేదే; భారతదేశం తన తరుణోపాయాన్ని తనలో నుంచే కనుక్కోవాలిగాని బయటినుంచి కాదు. రెచ్చగొట్టేది అని చెప్పటానికి అనువైన ఒకే ఒక వాక్యం, ఆయన ఉపన్యాసాలలోని చివరి వాక్యం, 'మీ దేశం కోసం మీరు బ్రతకండి, మీ దేశం కోసం మీరు మరణించండి' అన్నదే. మహా అయితే అది ఒక అతిశయోక్తిగా మనం క్షమించవచ్చు."

*

"నేనిప్పుడు నిజంగా అరవిందునికి వ్యతిరేకంగా ఉన్న పత్రాలను పరిశీలిస్తాను. వీటన్నింటిలో అతిముఖ్యమైనది. 295 వ పత్రం. దీనినే మిఠాయిల (Sweet meats) ఉత్తరం అని పేరు పెట్టారు. అది 1907 డిసెంబరు 27 న, కాంగ్రెసు సమావేశాల రెండవ రోజున వ్రాయబడిందని చెప్పబడింది. అదీ విధంగా ఉంది – ప్రియమైన సోదరా, ఇదే సరైన సమయం. దయచేసి వారందరిని, మన సమావేశంలో కలిసేటట్లుగా ప్రయత్నం చేయి. అవసరమయితే, దేశమంతా మధురభక్ష్యాలను తయారుగా ఉంచాలి. నీ సమాధానం కోసం ఎదురు చూస్తుంటాను – నీ ప్రియమైన బరీంద్రకుమార్ ఘోష్ – confidential అని వ్రాసిన కవర్ కూడా దొరికింది. ఆ కవరు మీది వ్రాత కూడా బరీన్‌దే.

దాస్ ప్రకారం ఆ ఉత్తరమొక ఫోర్జరీ, కాకపోతే అది ఫోర్జరీ చేసినవాని ప్రత్యేక ప్రావీణ్యానికి ఉదాహరణ. ఇందులో

మిఠాయిలు అంటే బాంబులని అర్థం చేసుకున్నారు ప్రాశిక్యూషన్‌వారు. వాడటానికి ఈ మాట ఎంతమాత్రం అసహజమైనది కాదు. పత్రం CL లో కింగ్స్‌ఫర్డ్‌ను 'వరుడు' గా వర్ణింపబడ్డాడు. పత్రం 239 లో 'వివాహఖర్చులు' క్రింద Riv 52 అనే మాట 'రివాల్వర్' కు సంక్షిప్తపదంగా వాడబడింది. ఇవన్నీ అలా అర్థం చేసుకోవటానికి కారణాలు.

కాంగ్రెసు సభలలో మొదటి రోజున విజయం సాధించటంలో, అమితోత్సాహంతో, బరీన్ ఈ ఉత్తరాన్ని అరవిందునికి పంపాడనీ, తోటలో తాము అవలంబించిన పద్ధతులనే దేశమంతా అనుసరించాలని బరీంద్రుని కోరిక అనీ ప్రాశీక్యూషన్ వాదన.

కాని నా మనస్సుకు, ఈ ఉత్తరం అరవిందునికి బరీన్ వ్రాసి ఉండడని అనిపిస్తుంది. నేనీ సందర్భంలో, ఇద్దరూ ఒకే ఊళ్లో ఉంటే ఉత్తరం వ్రాసుకుని ఉండరనే వాదనను, లేదా ఉత్తరం అందుకొన్నవారు దాని నింతకాలం దాచి ఉంచరనే వాదనను – రెంటినీ పట్టించుకోవటం లేదు. రెంటికీ వివరణలు ఈయవచ్చు. కాని నేనీ విషయాన్నా, ఉత్తరంలోని అంతర్ సాక్ష్యాన్నిబట్టే నిర్ణయిస్తున్నాను.

5 గురు సోదరులలో బరీంద్రుడు ఆఖరివాడు. అరవిందుడు మూడవవాడు. అసెసర్ల లెఖ్ఖ ప్రకారం, అందువలన బరీంద్రుడు అరవిందుని ప్రియమైన సోదరా అని వ్రాసి ఉండడు. అలాగని పెద్దన్నయ్య ఒక్కడినే అలా సంబోధిస్తారు. ఆ ఉత్తరం అరవిందునికే వ్రాయబడి ఉంటే, ఆయనను 'ప్రియమైన సెజ్దా!' అని సంభోదించి ఉండేవాడు. ఈ విషయాన్ని గురించి నేను అసెసర్ల అభిప్రాయాన్నెంత మాత్రం ప్రశ్నించలేను.

అరవిందునికి వ్రాసేటప్పుడు బరీంద్రుడు తన పూర్తి చేవ్రాలు చేస్తాడని అనుకోను. ఇతర బంధువులతో జరిపే ఉత్తర పత్యుత్తరాలలో అరవిందుడు బరీంద్రుడిని 'బరి' అని సంబోధిస్తారు. ఇద్దరు సోదరులు స్నేహితులుగా మసలేవారు. ప్రాశిక్యూషన్ వారి కథనం ప్రకారం నెం. 23 కు రావటమంటే, అరవిం

దుని దగ్గరకే రావటం అన్న మాట. బరీంద్రుడు అరవిందునికి వ్రాయటమంటే, ఈ విధంగా సంతకం చేయడమనేది అసంభవం.

అతను ఇంకెవరికైన వ్రాస్తే, 'ప్రియమైన సోదరా' అని దేశీయంగా 'భాయ్' అని సంబోధిస్తాడు. ఆ సందర్భంలో, ఈ ఉత్తరం నిజంగా అరవిందునికే ఉద్దేశించబడిందే అయితే, ఇద్దరు సోదరులూ సూరత్‌లోనే ఉన్నట్లైయితే బరీన్ అరవిందునికే నేరుగా ఎందుకు వ్రాయలేదు?

పైగా emergencies అనే మాటను imergencies అని వ్రాయటం ఏమీ వింత కాదు. పత్రం 667 లో బరీన్ philosophy అనే మాటను phylosophy గా వ్రాస్తాడు. మే 2 వ తేదీన నిజంగా ఈ పత్రం అరవిందుని ఇంటిలోనే దొరికిందని నిర్ధారించినా, అది ఎంత అనుమానాస్పదంగా ఉందంటే, దానిని అంగీకరించటానికి నేను సందేహిస్తున్నాను. మన అనుభవం ఏమి చెపుతుందంటే, గూఢచారులు నియమింపబడిన చోట, అనుమానితుల గృహాల్లో పత్రాలు చేరుతవి. అవి ఎలా వచ్చాయనేది అనుమానితులు ఎంత మాత్రం వివరించలేరు."

*

"అరవిందునికి అనుకూలమైన ఇంకో వాస్తవం, 'వందేమాతరం' పత్రికలోని వ్యాసాల్లో ఆయన హింసను నిరసించాడు. అలాంటిదే ఒక వ్యాసం 1907 మే 28 వ తేదీన ప్రచురితమైనది. ఇంకో వ్యాసం 1908 ఏప్రిల్ 10 వ తేదీ నాటిది. ఆ వ్యాసంలో జాతీయోద్యమాన్ని అంతర్గతంగా తీసుకుపోకూడదని, దానిని రహస్య సంస్థ వ్యవహారం చేయకూడదని అన్నారు. బహిరంగ అభిప్రాయ స్వేచ్ఛను అడ్డగిస్తే అదే జరుగుతుంది.

కుట్రతో అతనికిగల సంబంధం ఋజువయిందని నిర్ణయించే ముందు ఆయన ఒకటి వ్రాస్తూ, మరొకటి చేస్తున్నాడనేది నిరూపింపబడాలి.

బ్రిటిష్ ఇండియా మీద, రాజు తన సార్వభౌమాధికారాన్ని కోల్పోయేందుకు జరిగే కుట్రలో ఒక వ్యక్తి చేరవచ్చు, అందులో ఆనాటి పరిస్థితుల పట్ల అసంతృప్తిని ప్రచారం చేయవచ్చు.

అయినా అతనికి కుట్రలో ఆయుధాలు, మందుగుండు సామగ్రులను ప్రోదిచేసే శాఖను గురించి తెలియకపోవచ్చు. అరవిందుడు ఈ కేసులో ఇలాంటి పరిస్థితిలోనే ఉండవచ్చు.

అలాంటి పరిస్థితిలో, అతని ప్రబోధాలన్నీ ఆ కుట్రలో భాగమేనని స్పష్టంగా చూపబడాలి. ఈ కేసులో ఉద్యానవనం యొక్క పాత్రతో సంబంధం లేకుండా, కుట్రలో అరవిందునికి భాగముందని చెప్పటం చాలా కష్టం.

భారతదేశంలో ఉన్న పరిస్థితులలో, నేడు ఉన్న స్థితిగతులకు వ్యతిరేకమైన సిద్ధాంతాలను ప్రచురించటం, ప్రమాదకరం కావచ్చు. కొన్ని పరిస్థితులలో, రాజద్రోహనేరాన్ని అతని మీద మోపవచ్చు.

ఇప్పుడలాంటి నేరారోపణ అరవిందునికి వ్యతిరేకంగా చేయవచ్చా లేదా అనేది, నా ముందున్న ప్రశ్న కాదు. నా ముందున్న విషయమల్లా – అరవిందుని వ్రాతలు, ఉపన్యాసాలు, వాటంతంట వాటిగా పరిశీలిస్తే అవి కేవలం దేశపునర్నిర్మాణం సంగతి తప్ప వేరు విషయాలను గురించి చెప్పవు. అతనికి వ్యతిరేకంగా ఋజువైన విషయాలను, సాక్ష్యాధారాలతో పరిశీలించినా కూడా – అతనీ కుట్రలో సభ్యుడని నిరూపించే తీవ్రమైన నేరం ఋజువయిందని చెప్పటానికి సరిపోవనే, నా అభిప్రాయం.

ఈ కేసును నేను విశాలమైన ప్రాతిపదిక మీదనే పరిశీలించటానికి ప్రయత్నం చేశాను. అంతేకాని చిన్న చిన్న వివరాలను పెద్దగా పట్టించుకోలేదు. అలా చేసినట్లయితే ఈ తీర్పులో ఉన్న ముఖ్యమైన అంశం గందరగోళమయేది. ఈ కేసు ఇప్పటికే, అతిగా పెరిగింది.

నేను అరవిందుని విషయాన్ని ప్రస్తావిస్తున్నప్పుడు, మిడ్నపూర్ సంఘటనలనుగాని, బసంత జైల్లో ఉన్నప్పుడు అతని కుటుంబాన్ని అదుకొనేందుకు ప్రోగుచేయబడిన నిధికి, అరవిందునికిగల సంబంధాన్ని గురించిగాని ప్రస్తావించలేదు. ఎందుకంటే ఈ విషయాలు, ఈ కేసులోని అసలు విషయాన్ని ప్రభావితం చేయలేవు.

ఇక బిపిన్‌పాల్ జైలునుంచి విడుదలయిన సందర్భంలో, ఆయనను స్వాగతించేందుకు ఏర్పాటైన సభకు, అరవిందునికీ గల సంబంధ విషయం. అరవిందుని అభిప్రాయాలు, బిపిన్ అభిప్రాయాలతో ఏకీభవించకపోవచ్చు. కాని తాను ముద్దాయిగా ఉన్న కేసులో సాక్ష్య మీయటానికి నిరాకరించిన ఫలితంగా జైలుపాలైన వ్యక్తి విడుదలైనప్పుడు, ఆయనను స్వాగతించే సందర్భంలో తాను కలవటం అనే అంశం విమర్శకు గురి అయే అవకాశం లేదు."

(శ్రీ బిజయకృష్ణన్ 1922 లో రచించిన *'ఆలీపూర్ బాంబ్ ట్రయల్'* అన్న గ్రంథం నుంచి, ఈ విషయాలీయబడ్డాయి. సి.ఆర్ దాస్, బీచ్‌క్రాఫ్టుల వాక్యాలు "....." గుర్తులలో ఈయబడ్డాయి.)

అనువాదం: కాకుమాని తారానాథ్

నవంబరు 1922 – సి.ఆర్. దాస్‌కి వ్రాసిన లేఖలో ఒక భాగము

జాతి పరిభ్రమించే పనికిమాలిన వలయంలో నుంచి మానవుడు బయటపడాలనుకుంటే తనకు తానుగా నిర్మించుకున్న నూతన పునర్నిర్మాణంలో తాను నిలబడాలి. ప్రపంచం కోసం ఈ ఉన్నత విజయాన్ని సాధించవల్సినది భారతదేశమేనని నేను నమ్ముతాను.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

శ్రీఅరవిందులపై బ్రిటిష్ పార్లమెంటులో చర్చ

(ఇది మనోజ్‌దాస్ గ్రంథం. *"20 వ శతాబ్ది ప్రథమ దశకంలో శ్రీఅరవిందులు"* లోని, మొదటి అధ్యాయము (శ్రీఅరవింద ఆశ్రమ ప్రచురణ). బ్రిటిష్ పార్లమెంటు చర్చ ఇది. ఇంత కూలంకషమైన చర్చ బ్రిటిష్ పార్లమెంటులో మరి యే ఇతర భారతీయుని గురించి జరిగి ఉండకపోవచ్చు.)

ప్రామాణికమైన ఉన్నతశ్రేణి వక్తృత్వాల శకం ముగిసింది. వలసరాజ్యాలు బలపడుతున్నాయి. పార్లమెంటులోని ప్రభుత్వ, ప్రతి పక్ష – ఉభయపక్షాల సభ్యులూ ఆచితూచి మాట్లాడేవారు. ఎంతైనా సమిష్టి ప్రయోజనం ప్రజలకి ప్రజాప్రతినిధులకీ సాకారమైనది కదా!

అయితే, ప్రపంచయుద్ధాలు పరిస్థితిని తారుమారు చేసినై. వ్యవహారాలు మళ్లీ ఉత్సాహభరితమైనవి. కాకపోతే నిద్రాణమైన కాలమాన పరిస్థితికి అనుగుణంగా చర్చలు (debates) బేరీజు వేయవల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో, 1910 సం॥ లో సమావేశ మైన క్రొత్త పార్లమెంటు మొదటి చర్చ విప్లవాత్మకమైనది. ఇంచు మించు ఈ చర్చ అంతా శ్రీఅరవిందుల గురించే కావటం విశేషం.

బ్రిటిష్ ప్రజాప్రతినిధుల సభలో (The House of Commons) శ్రీఅరవిందులు ప్రస్తావనకు రావటం ఇదే మొదటిసారి కాదు. (28-4-1910) నేరం రుజువు కాకముందే దేశాంతరవాసశిక్ష విధించటం నిరంకుశమే అయినా, శ్రీఅరవిందులను దేశాన్నుంచి బహిష్కరించవల్సినదేనని, జె.డి. రీస్, 1909 ఆగస్టు 5 న ఉద్ఘాటిం చాడు. కారణం? దేశయువతపై శ్రీఅరవిందులకు ఉన్న అమోఘ ప్రభావం! మరొకటి – ప్రాచ్యదేశవాసులకు (వలసరాజ్య ప్రజలు) అత్యవసర పరిస్థితిలో అవసరమైతే పాలకులు నిరంకుశంగా కూడా తమ అధికారాన్ని వినియోగించగలిగే శక్తివంతులు అన్న సందేశం (పాలితులకు) తెలియజెప్పటం.

నాటి బ్రిటిష్ పార్లమెంటేరియన్లలో శ్రీఅరవిందులను మెచ్చు కొనే అభిమానులు కూడా లేకపోలేరు. అక్టోబరు 5, 1909 న

లేబరుపార్టీ సంస్థాపకుడు కెయిర్ హార్డీ తరఫున సర్ హెన్రీకాటన్, అండర్ శక్రటరీని ఉద్దేశించి అడిగిన ప్రశ్న ఇందుకు ఉదాహరణ.

"ఆలీపూరు కుట్రకేసులో సాక్ష్యంగా అరవింద ఘోష్ యొక్క ఉపన్యాసాలు కోర్టుకు సమర్పింపబడినవి. న్యాయవిచారణ చేస్తున్న న్యాయమూర్తి ఈ ఉపన్యాసాలను పరిగణనకు తీసుకున్నారు. తన దేశ పునరుజ్జీవన ప్రబోధకమైన ప్రసంగాలుగా వీటిని పరిగణిస్తూ అరవింద ఘోష్ నిర్దోషి యని తీర్పు చెప్పారు. ఈ నేపథ్యంలో సదరు ఉపన్యాసాలను తన పత్రికలో ప్రచురించి నేరస్థుడుగా పరిగణింపబడిన ఖోల్హాట్కరుకు 15 నెలల కారాగార శిక్ష విధించిన గౌరవనీయ ప్రభుత్వము, వారి విడుదలకు ఇప్పుడు ఆదేశాలు ఇస్తుందా?" అని అడిగారు.

The Master of Elibank: తిరుగుబాటు రెచ్చగొట్టే అంశాన్ని ప్రచారం చేశాడనేది ఈతనిపై ఉన్న అభియోగం. రాష్ట్రంలోని సర్వోన్నత న్యాయస్థానం, క్రింది కోర్టునుంచి తమకు వచ్చిన అపీలుపై తీర్పు ఇస్తూ క్రింది కోర్టు తీర్పునే ధృవపరిచింది. శిక్ష మాత్రం తగ్గించింది. రాష్ట్రంలోని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ఇది. దీనికి, అరవింద ఘోష్ రాజద్రోహ నేరంపై, ఆలీపూరు కుట్రకేసులో శషన్సు జడ్జి ఇచ్చిన తీర్పుతో సంబంధం లేదు. అది ఇక్కడ అప్రస్తుతం.

Mr. Mackarness: కొన్ని ఉపన్యాసాలు రాజద్రోహాన్ని రెచ్చగొట్టేవిగా ఉన్నాయని, తర్వాత అవి అలా లేవని అనటం నిజమేనా?

Mr. Rees: ఆ ఉపన్యాసాలు చేసిన పెద్దమనిషి బ్రిటిష ప్రభుత్వానికి, పాలనకి బద్ధశత్రువు కాడా? అని నేను గౌరవ సభ్యుని ప్రశ్నించవచ్చునా?

అయితే ఈ ప్రస్తావనలన్నీ 1910, ఏప్రిల్‌లో రామ్సే మేగ్డనాల్డు సృష్టించబోయే పెనుతుఫానుకు సూచికలు మాత్రమే! (రామ్సే మేగ్డనాల్డు తర్వాత కాబోయే లేబరుపార్టీ నాయకుడు, ఆ పార్టీ తొలి ప్రధాని కూడా.)

7 ఏప్రిల్, 1910

ఇండియా అండరు శక్రటరీ నుద్దేశించి మేగ్డనాల్డు అడిగిన ప్రశ్న:

డిశంబరు 25 నాటి '*కర్మయోగిని*' పత్రికలో ప్రచురిత మైన అరవింద ఘోష్ వ్యాసం ఆధారంగా ఆయనను నిర్బంధం లోనికి తీసుకోవలెనని ఉత్తరవులు విడుదల కాబడినట్లు ఈనాటి The Times పత్రికలో వచ్చిన వార్త మీరు ధృవీకరిస్తున్నారా? అయితే ఆ వ్యాసం కాపీ నొకదానిని సభ్యులకు అందుబాటులో ఉంచగలరా?

అండరు శక్రటరీ (మోంటేగ్): The Times పత్రికలో వచ్చిన ప్రకటన శక్రటరీ ఆఫ్ స్టేట్ దృష్టికి వచ్చినది. ఇందుకు సంబంధిత సాధికార సమాచారం లేదు. పూర్తి నివేదిక కొరకు ఇండియాకు టెలిగ్రాం ఇచ్చారు.

14 ఏప్రిల్ 1910

రామ్సే మేగ్డనాల్డు, అండరు శక్రటరీ నుద్దేశించి తిరిగి అదే ప్రశ్న అడుగుతూ వ్యాసరచయితను, ప్రచురణకర్తనూ కూడా నిర్బంధంలోనికి తీసుకునేటందుకు ఆదేశాలు ఇచ్చారా? అని అడిగారు. అదే నిజమైతే ఏ చట్టప్రకారం ఆ ఆదేశాలు ఇచ్చారని అడిగారు. ఆ పత్రికలో ప్రచురితమైన చట్టవిరుద్ధమైన వ్యాసము ప్రతి నొకటి సభ్యులకు అందచేయమని అడిగారు.

Mr.. Rees: నాకొక సంశయం. ఈ Seatless Syndicate వారి ప్రశ్నలు వింటుంటే వీరి కసలు రాజద్రోహులను శిక్షించే ఆసక్తి ఉన్నదా? అనుమానం కలుగుతోంది.

రామ్సే: ఒక గౌరవసభ్యుడు, సాటి గౌరవసభ్యుని ప్రశ్నను ఇలా తీవ్రమైనదిగా చిత్రీకరించటం తగునా?

Mr. Rees: మనసు నొప్పించేదిగా ఉంటే Seatless అన్న మాటను ఉపసంహరించుకుంటున్నాను. నా తాత్పర్యం వారికీ సభలో స్థానం లేదని.

అండరు శక్రటరీ: గౌరవ మిత్రుని ప్రశ్న మొదటి భాగానికి నా సమాధానం 'అవును' ఇంకెవరినైనా నిర్బంధించేందుకు ఉత్తర్వులు జారీ కాబడినవా అనేది తెలియదు. అరవింద ఘోష్‌ను శక్షను 124 ఎ ఇండియను పీనలు కోడ్ ఆధారంగా నిర్బంధంలోనికి తీసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. విషయసేకరణలో జాప్యం జరిగింది. ఓరిమి వహించమని మనవి. పూర్తి సమాచార సేకరణ జరుగుతోంది. ప్రశ్న చివరిభాగానికి సంబంధించి శక్రటరీ ఆఫ్ స్టేట్ హామీ ఇవ్వలేదు.

Mr Ress: సజీవుడై ఉన్న అరవింద ఘోష్ యొక్క '*Last Will and Testament*' కాపీలు, బ్రిటిష్ ప్రభుత్వమునకు, పాలనకు వ్యతిరేకమైన, రాజద్రోహ ప్రేరక వ్యాసాలు, ఉపన్యాసాల కాపీలు సభ్యులకు అందుబాటులో ఉంచటం ఎంతవరకు సమంజసం? దీనిని గురించి శక్రటరీ ఆఫ్ స్టేట్ ఆలోచించాలి.

మాంటేగ్: గౌరవనీయ మిత్రుని అభ్యర్థనను శక్రటరీ ఆఫ్ స్టేట్ మన్నించలేరు. అలాగని అరవింద ఘోష్ రచనలపై సభ్యుని అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్లు భావించకూడదు. ఆ రచనల తాలుకు లక్ష్య లక్షణాలు ఇంకా కోర్టు విచారణలో ఉన్నవి కదా!

28 ఏప్రిల్ 1910

మేర్గనాల్డు మళ్లీ ఏప్రిల్ 26 న శ్రీఅరవిందుల గురించి ప్రశ్న అడిగారు. అందుకు సమాధానంగా, మాంటేగ్, ఏప్రిల్ 14 న ఇచ్చిన సమాధానానికి మించి అదనంగా చెప్పే సమాచారం ఏమీ శక్రటరీ ఆఫ్ స్టేట్ దగ్గర లేదు అన్నారు. తిరిగి అదే ప్రశ్నను ఏప్రిల్ 28 న రెట్టించారు.

మాంటేగ్: శక్షను 124 ఎ, ఇండియా పీనలు కోడ్ ప్రకారం అరవింద ఘోష్‌పై బెంగాలు ప్రభుత్వం చర్య తీసుకొంటున్నదని గౌరవసభ్యునికి ఇదివరకే తెలియచేశాను. ప్రచురణకర్తపై ఏమైనా చర్య తీసుకొనబడుచున్నదా అనే విషయం తెలియదు. చట్టరీత్యా తీసుకొనబడుచున్న చర్యల తాలూకు పూర్తి సమాచారం శక్రటరీ ఆఫ్ స్టేటుకు ఇంకా అందవలసి ఉన్నది. గౌరవమిత్రుని

సూచన మేరకు చర్య తీసుకోవటం అంటే కోర్టు నిర్ణయానికి ముందే చర్య తీసుకున్నట్లు ఔతుంది కదా! ఇది సమర్థనీయం కాదని వారికీ తెలుసు. ఇది ఇండియా న్యాయస్థానపరిధి లోనిది. మనమిప్పుడు ఏ చర్య తీసుకున్నా విచారణకు ముందే (pre-judge) తీర్పు చెప్పినట్లు ఔతుంది.

మేగ్గనాల్డు: ఒక ముఖ్య ప్రజా ప్రయోజనకరమైన అంశాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నాను. ఈ నెల 7 వ తేది The Times పత్రికలో అరవింద ఘోష్‌పై చర్య తీసుకొనేటందుకు వారంటు జారీ కాబడినట్లు వార్త వచ్చింది. ఆ వారంటు డిశంబరు 25 '*కర్మయోగిన్*' పత్రికలో ప్రచురితమైన వ్యాసమును పురస్కరించుకొని ఈయబడినది. నేను వెంటనే ఇండియా ఆఫీసుకు నోటీసు ఇచ్చాను, ఈ అంశముపై సమాచారము కోరుతూ. ఈ సమయానికి తమ దగ్గర సమాచారం లేదని అండరు శక్రటరీ చెప్పారు. తర్వాత మళ్లీ అడగమన్నారు. మూడుసార్లు అడిగాను. నాల్గవ పర్యాయము ఈ రోజు అడిగాను. వారిచ్చిన సమాధానం – శిక్షను 124 ఎ IPC ప్రకారం వారంటు జారీ చేయబడినది అని మాత్రమే. ఈ కేసు గురించి అదనంగా ఏమి చెప్పినా అది కేసు విచారణకు ముందే తీర్పు చెప్పడం ఔతుందంటున్నారు. వారి అభిప్రాయాన్ని మర్యాదగా తిరస్కరిస్తున్నాను. సభ్యులకు ఆ వ్యాసాల తాలూకు కాపీలను అందచేయలేరా అని అడుగుతున్నాను. వారంటు జారీ చేయడం గురించి నేనేమీ అనటం లేదు. ఇండియాలో అధికారులకు, అరవింద ఘోషపై తీసుకోవల్సిన చర్యల గురించి, నే నేమీ సూచనలు ఇవ్వటం లేదు. ఇండియాకు సంబంధించి ఇది చాలా సున్నితమైన వ్యవహారం. ఈ విషయంలో అధికారుల వ్యవహారశైలి నన్ను వ్యాకులపరుస్తోంది.

ఇండియా నుంచి గత మూడువారాలుగా అందుకుంటు ఉన్న పోస్టు, వార్తాపత్రికలు ద్వారా నా సమాచారం నాకు అందుతోంది. అరవింద ఘోష ఒక చోట ఉన్నట్లు తెలిసింది. ఈయన ప్రాపంచిక విషయాలకు దూరంగా ప్రశాంత ఆధ్యాత్మిక జీవనంలో ఉన్నట్లు సమాచారం.

వారి ప్రస్తుత పరిస్థితి తెలిసి కూడా వారికీ వారంట్లు ఏమిటి! The Times పత్రిక (5 లేక 6 ఏప్రిల్) సమాచారం ప్రకారం వారికి ఇంకా వారంటు అందచేయలేదని, ఏ చర్యా తీసు కొనలేదని భోగట్టా."

తర్వాత మెగ్డనాల్డు శిక్షను 124 ఎ IPC యొక్క పుట్టు పూర్వోత్తరాలు వివరించి విశ్లేషిస్తూ 'రాజద్రోహము' లేక 'శాసన ధిక్కారము' అనే పదాన్ని అధికారులు ఎంత అపరిమిత విశాల పరిధిలో అమలు చేస్తున్నారో తెలియచేసారు. ప్రసంగం మధ్యలో రెండు పర్యాయములు (కన్సర్వేటివ్ సభ్యుడు) రీస్‌తో ఘర్షణ పడ్డారు.

పిమ్మట శ్రీఅరవిందుల జీవిత విశేషాలను తనకు తెలిసిన మేరకు రేఖామాత్రంగా స్పృశించారు.

"అరవింద ఘోష దాదాపు ఆంగ్లేయుడనే చెప్పాలి. పశి ప్రాయంలోనే ఈ దేశానికి తీసుకు రాబడినారు. మేంచస్టరు, లండను సెయింటు పాల్ స్కూలు, కేంబ్రిడ్జిలలో విద్యాభ్యా,సం కావించి ICS లో ఉత్తీర్ణులై గుర్రపుస్వారీ అర్హత పొందక సర్వీ సుకి అనర్హులైనారు. తర్వాత ఇండియా వెళ్లి బరోడా సంస్థానాధీ సుని ఆస్థానంలోని విఖ్యాత విద్యాలయంలో ఉద్యోగిగా నియమి తులైనారు."

శ్రీఅరవిందుల భావపరిణామ ప్రగతిని విశ్లేషిస్తూ మేగ్డ నాల్డు ఇంకా ఇలా అన్నారు.

"ఇండియాకు తిరిగి వెళ్లాక ఇండియా ప్రభుత్వ కార్యకలా పాలపై పరిశీలనాత్మక విమర్శలు చేయటంవల్ల ఈయన రాజ ద్రోహిగా పరిగణింపబడినారు. ఓ కన్ను వేసి ఉంచదగిన వ్యక్తిగా ప్రభుత్వం గుర్తించింది. రాజద్రోహ నేరస్థుల జాపితాలో ఈయన్ని కూడా అధికారులు చేర్చారు. నే నేమీ మీకు రహస్య సమా చారం అందించటం లేదు. ఈయనపై ఇంతకు ముందు ఆరోపిం పబడి విచారణ కాబడిన నేరం రుజువై ఉంటే అది వారి జీవి తానికే ముప్పు తెచ్చేంతటిది! అంతటి నేరం నుంచీ విచారణ అనంతరం విడుదలైనారు. అసలు విచారణ అనేది లేకుండానే

దేశాంతరవాస శిక్ష విధింపబడవల్సిన వ్యక్తుల జాపితాలో చేర్చ వలసినవారా అన్న అంశం కూడా న్యాయమూర్తి దృష్టికి వచ్చింది. ఆ రకంగా కూడా నిర్దోషిగానే ప్రకటింపబడిన వ్యక్తి ఈయన.

ఇండియాలో అందరికీ తెలిసిన సమాచారం ఆధారంగానే నేను మాట్లాడుతున్నాను. ఇందుకు సంబంధించిన చర్చలు ఏ నాడూ బహిరంగంగా ప్రకటింపబడలేదు. ప్రకటితమై ఉంటే సంతోషించేవాడిని. అరవింద ఘోషతో పాటు దేశాంతరవాస శిక్షార్హులుగా భావించే మిగిలిన తొమ్మండుగురు తాలుకు రిపోర్టులు, వాటి పర్యవసానము గౌరవ మిత్రుడు ప్రకటిస్తే అందరికంటే సభలో ఆనందించేవాడిని నేనే. అనుమానాస్పదుల జాపితాలో ఈయన పేరు ఇంకా అలానే ఉంచారు. వారిపైన వక్రీకరించి మోపిన నేరం అలానే ఉంది. అరవింద ఘోష్ రాజకీయాల నుంచి నిష్క్రమించారు. లౌకిక వ్యవహారాలకు అతీతంగా ఉండ దలచుకున్నట్లు నాకు స్వయంగా వారు చెప్పారు. వారి స్నేహితులు దీనిని ధృవీకరించారు. ఇదంతా ఒక ప్రగాఢ రహస్య కుట్రగా బెంగాలు ప్రభుత్వం భావిస్తోంది. నమ్మలేక వారిపై అరెస్టు వారంటు విడుదల చేసింది.

ఇంతకీ అంత గందరగోళం సృష్టించిన ఆ వ్యాసం ఏమిటి? గౌరవ మిత్రుడు దాని కాపీ నొకదానిని అందచేయ లేకపోయారు. నేనే ఒకటి సంపాదించాను. ఈ మధ్యకాలం వరకు అరవింద ఘోష సంపాదకత్వం వహించి, నడిపిన వారపత్రిక '*కర్మయోగిన్*' అందులో ప్రచురింపబడిన పూర్తి వ్యాసం నా దగ్గర ఉంది. అందులో కొన్ని ప్రధాన భాగాలు మీకు చదివి వినిపిస్తాను. అరవింద ఘోష ఆలోచనా సరళి మీకు బోధపడటమే కాకుండా, అది అభిశంసించే రీతిలో ఉన్నదా అనే విషయం కూడా మీకు తెలుస్తుంది. మొత్తం వ్యాసంలో కల్లా కీలకమైన వాక్యం మీకు వినిపిస్తున్నాను.

'జాతీయవాదులు ఏమాత్రం వెనుకడుగు వేసినా, జాతీయతావాదం అంతరించటం, ఆ స్థానం కుటిల ఉగ్రవాదశక్తులతో

నిండిపోవటం సంభవించవచ్చు. దేశస్వాతంత్ర్యాన్ని, అభివృద్ధిని కోరుకునే వారెవ్వరూ ఈ పరిణామాన్ని సహించరు.'

చదివే తీరులో ఆ వ్యాసాన్ని ఎవరు చదివినా భావం స్పష్టంగానే ఉంటుంది. ఇండియాలో హింస ప్రేరేపింపబడకుండా ఉండటానికి ఒకే ఒక హామీ (guarantee) అరవింద ఘోష. జాతీయోద్యమానికి నాయకత్వం వహించి నడిపించిన ఆయన వ్యక్తిత్వాన్ని, రచనలను, చర్యలను జాగ్రత్తగా పరిశీలన చేసేవారి కెవరికైనా ఇది అవగతమే. జాతీయ భావాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసేవారిని అణగద్రొక్కి పర్యవసానంగా సంభవించిన దురదృష్ట కర పరిణామాలకు – చావులకు, హత్యలకు, ఉరిశిక్షలకు – బాధ్యులైన ప్రభుత్వాధికారులను ఆయన గట్టిగా గర్హించారు.

జె. కింగ్: సరదాగా అడుగుతున్నాను. ఈ వ్యాసం బెంగాలీలోనే ప్రచురితమైనదా? అరవింద ఘోష్ బెంగాలీ కాదా?

రామ్సె మెగ్డనాల్డు: అపురూపమైన ఇంగ్లీషులో ఉంది ఈ వ్యాసం అంతా. బెంగాలీ నేనెంత బాగా వ్రాయగలనో ఆయనా అంతే!

ప్రధాన విషయాన్ని తెలియచేసే వ్యాసంలో రెండో భాగం ఇదిగో (చిత్తగించండి):

"చట్టాన్ని ధిక్కరించేవారికి చట్టమంటే భయం. మన ఆదర్శాలు ఉన్నతమైనవి, గౌరవప్రదమైనవి, నిష్కళంకమైనవి. మన పద్ధతులు సంకల్పబలంతో దృఢమైనవి; శ్రమతో కూడు కున్నవే అయినా శాంతియుతమైనవి. చట్టాన్ని అతిక్రమించం కాబట్టి మనకా భయం లేదు!"

తర్వాత బ్రిటిష్ అధికార పత్రాలలో (Blue Books) అర వింద ఘోష్ గురించి రికార్డు కాబడిన కొన్ని వ్యాఖ్యలను ప్రస్తా విస్తూ వాటి అనౌచిత్యాన్ని తెలియచేశారు. అరవింద ఘోష్ అన్న మాటలు ఇండియాలో సాధారణంగా అందరు అనుకుంటూన్నవే, అందరికీ తెలిసినవే అని అంటూ శ్రీఅరవిందుల వ్యాసంలోని మరికొన్ని అంశాలను వారి మాటలలోనే ప్రస్తావించారు:

"అవినీతి పోలీసు, నిర్లక్ష్య అధికార యంత్రాంగం, పక్ష పాత న్యాయవవస్థ – వీటి నిరంకుశ ఆదేశాలతో, తప్పుడు సాక్ష్యా

లతో, అసత్య ప్రమాణాలతో గౌరవప్రదమైన మన రాజకీయ పద్ధతులను అణచివేసే ప్రయత్నాలు కొనసాగింపబడుతున్నవి. ప్రజలు వేధింపబడుతున్నారు. అయినా స్వాతంత్ర్య సముపార్జనోద్యమ పురోగమనంలో ఎంత మూల్యాన్నైనా చెల్లించటానికి వెనుకాడబోము. అమర్యాదకరంగా, నిశ్చైతన్యులమై, అల్పమైన కుహనా పద్ధతులకు లోబడి కృంగిపోము. మన సమావేశాలు, వ్యవస్థలు, ప్రచార పద్ధతులు తప్పనిసరిగా ముందుకు సాగుతాయి. నిరంకుశ నిషేధాజ్ఞలకవి తలవంచవు. దేశమాత విధినిర్వహణోద్యమం పురోగమిస్తుంది. చట్టబద్ధ బహిరంగ రాజకీయ కార్యక్రమాలను అణగద్రొక్కే ప్రభుత్వ అవివేక వైఖరితో మనకు నిమిత్తం ఉండదు. నిరాశ నిస్పృహాలతో ఉన్న ఈ దేశాన్ని, ఇంటా బయటా పొంచి ఉన్న వీరావేశ భయంకర దుష్టశక్తుల హస్తాలలోకి నెట్టివేస్తూ ఉన్న వారి ఉన్మాదానికి మన మెట్లా బాధ్యుల మౌతాము!"

నాటి ఇండియా పరిస్థితిని వివరిస్తూ మేగ్డనాల్డు తన ప్రసంగాన్ని ఇంకా ఇలా కొనసాగించారు:

"గతసంవత్సరంగా ఇండియాలో తలవంపు తెచ్చే తీవ్రవాద వామపక్ష విధానాలు కొనసాగుతున్నాయి. ఈ దుష్టశక్తులతో సంబంధం ఉన్న వ్యక్తి ఒకాయన పారిసులో తిష్ఠవేసుకొని ఉన్నాడు. (The reference is most probably to Mr Shyamji's Krishna Varma) ఈయన పని ఈ దేశంలోను, ఇండియాలోను ఉన్న యువతను రెచ్చగొట్టడం. ఈ దుష్టసంఘ దుర్వ్యాపారాలను, విధానాలను నిందిస్తూ నిస్వార్థంగా చిత్తశుద్ధితో చేసే సద్విమర్శ లేకపోలేదు. కాని ఇలాంటి దుష్టశక్తులను ప్రతిఘటించి, ప్రభావితం చేయగలిగే ఒకే ఒక శక్తి అరవింద ఘోష్. ఏమిటీయన కార్యాచరణ సరళి? ఇండియాలో (బ్రిటిష్.) ప్రభుత్వాధికారులను వారి చర్యల గురించి నిర్భయంగా, నిష్కర్షగా ప్రకటించటం. ఈ విషయాలన్నీ ప్రస్తావించటం నాకు ఇష్టం లేదు. ముందే చెప్పాను ఈ సంగతి. ఇండియా నేడు విపత్కర పరిస్థితిలో ఉన్నది. విషయాన్ని సక్రమంగా అర్థం చేసుకోగలిగే నిర్ణాయకులు నిరాశవహంగా ఉన్నారు. ఒక్క మాట నిర్మొహమాటంగా చెప్పాలి.

ఇండియా ఆఫీసు తమ అధికారుల పరిపాలనా వ్యవహారాలలో ఒకింత ఔదార్యం, సమదృష్టి కలిగి వ్యవహరించమని, అరవింద ఘోష్‌లాంటి వ్యక్తులతో మరింత సన్నిహితంగా ఉండమని హెచ్చరించాలి. కాకుంటే భవిష్యత్తు మరింత దుర్భరంగా పరిణమిస్తుంది.

Keir Hardie: అరవింద ఘోష గురించి గౌరవ మిత్రుడు సమగ్రంగానే ప్రస్తావించారు. మరిక చెప్పవలసిన విషయం లేదు. కాని ఒక్క విషయం మాత్రం సభ దృష్టికి మరొకసారి తీసుకు రావలసి ఉన్నది. ఘోష, న్యాయస్థానంలో సమగ్ర విచారణకు లోబడిన వ్యక్తి. న్యాయమూర్తి సి.బి. బీచ్‌క్రాఫ్ట్ వెలువరించిన సుదీర్ఘ తీర్పుతో గత సంవత్సరం మే 6 న విచారణ ముగిసింది. ఇండియా వ్యవహారాలు, సంబంధింత చట్టాలు, పరిపాలన – గురించిన సమాచారం ఇండియా ప్రజలకు చాలా తక్కువ తెలుస్తోంది. వారి గురించిన అనుకూల సమాచారానికి ప్రచారం తక్కువ కాగా, అననుకూల సమాచారానికి మాత్రం చాటింపు బాగా ఉంటోంది. ఇండియాలో అమలులో ఉన్న ఏ న్యాయనిబంధనల ప్రకారం చూసినా అరవింద ఘోష్ నిర్దోషి అని తన తీర్పులో బీచ్ క్రాఫ్ట్ (న్యాయమూర్తి) స్పష్టం చేశారు. విశాల విస్తృత పరిధిలో అమలుపరుస్తున్న ఇండియా చట్టాల నేపథ్యంలో ఈ తీర్పు గమనార్హం. తన ప్రజలను అసాధారణంగా ప్రభావితం చేసిన వ్యక్తిగా అభివర్ణించాడు న్యాయమూర్తి. బీచ్ క్రాఫ్ట్ తన తీర్పులో పేర్కొన్న ఇంకా కొన్ని మాటలు:

"అరవింద ఘోష్ ఆదర్శం దేశస్వాతంత్ర్యం. దీనిని సాధించేందుకు ఆయన యెన్నుకున్న విధానం – శాంతియుత నిరాకరణ, ప్రజలను చైతన్యవంతులు కావించటం. ఈ రకమైన ఆదర్శం, హింసాత్మకం కానంతవరకు, తప్పు కాదు. ప్రభుత్వ తరఫు న్యాయవాది అంగీకరించినదే ఇది.

దేశానికి స్వేచ్ఛ కోరే అరవింద ఘోష ఆదర్శం, దానిని సాధించేందుకు ఆయన చేపట్టిన విధానాలు, కార్యక్రమాలు, హింసాత్మకము, నియమోల్లంఘనము కానంతవరకు ఆక్షేపణీయాలు

కావని ప్రభుత్వ న్యాయవాది అంగీకరించక తప్పలేదు. అది రాజద్రోహచర్య కూడా కానేరదు. హింసను ప్రేరేపించే ఏ ఒక్క వ్యాసమూ నా దృష్టికి రానే లేదు.

కనుకనే అరవింద ఘోష్ నిర్దోషిగా విడుదల పొందాడు. గౌరవ మిత్రుడు మేగ్డనాల్డు, వ్యాసాలలోని పలు అంశాలు ప్రస్తా వించారు. వాటినే ఆధారం చేసుకొని ప్రభుత్వం మళ్లీ తాజాగా ఉత్తర్వులు జారీ చేస్తోంది. ఈ సందర్భంగా వారి వ్యాసంలో ఒక భాగాన్ని మీకు చదివి వినిపిస్తాను. అరవింద ఘోషపై ఉన్న అరెస్టు వారంటుకు ఇదే ఆధారం. జాతీయ పార్టీ ఆదర్శాలు, ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం, కార్యక్రమాలు వివరిస్తూ అరవింద ఘోష్ వ్యాసం ఈ క్రింది విధంగా సాగుతుంది:

"మా లక్ష్యసిద్ధి కోసం జాతీయస్థాయిలో ఉద్యమం పటి ష్ఠంగా వ్యవస్థీకరింపబడాలి. ఈ భారం మాపై ఉన్నది. ఈ బృహ త్కార్యక్రమాన్ని సాధించగలిగే నైతిక భావవేశ శక్తి, విశ్వాసం, త్యాగశీలత మాలో ఉన్నాయి. ముందు, జాతీయ పార్టీ అత్యావ శ్యకంగా వ్యవస్థీకరింపబడాలి. దేశం నలుమూలలా ఉన్న అన్ని ప్రముఖ కేంద్రాలలో కార్యకర్తలు క్రియాశీలంగా వ్యవహరిస్తూ, నాయకులకు తమ సహకార సద్భావాలు అందించమని కోరు తున్నాను. జాతీయస్థాయిలో క్రియాశీల కార్యక్రమాలు చేపట్టేం దుకు నాయకులు త్వరలో సమావేశ మౌతారు. వారికి మీరు తోడ్పడాలి. జాతీయ సలహామండలి ఏర్పాటు కావాలి; వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల్లో సమావేశమవాలి. జాతీయ సమావేశాలు దేశంలో పలుచోట్ల ఏర్పాటు కాబడాలి. అప్పుడే మన కార్యక్రమ రూపురేఖలు ప్రస్ఫుటమౌతవి. ఆ విధంగానే మనం జాతీయస్థాయిలో రాజకీయంగా నిలదొక్కుకుంటాం."

శ్రీఅరవిందుల వ్యాసభాగాన్ని ఉటంకించిన పిమ్మట కైర్ హార్డె తన ప్రసంగాన్ని ఈ విధంగా కొనసాగించారు:

"ఈ ఉద్యమం హింసాత్మకమైనది కాదు. ఉన్నత నైతిక దేశభక్తి ఆదర్శాలతో ఉన్మీలితమైనది. దేశయువత నాకర్షించి వారు వక్రమార్గాలు అనుసరించకుండా ఉండటానికి నిర్దేశింప

బడినది కూడా. కొంతమంది యువకులు ఇప్పటికే వక్రమార్గా లకు పేరేపితులై ఉన్నారు. ఇది దురదృష్టకరం. అలాటి అక్రమ యువజనోద్యమాలను అణచివేసే నెపంతో అరవింద ఘోష్‌పై అభియోగం మోపి అదుపులోనికి తీసుకోవాలని ప్రభుత్వం ఉద్దే శిస్తోంది; బెదిరిస్తోంది; వారి కార్యకలాపాలను ఉక్కుపాదాలతో అణచివేస్తామని అంటోంది.

(ఇంతలో సభ కొంతసేపు వాయిదా పడింది.)

ఇండియా అండరు శ్క్రటరీవారి నుంచి నేను ఒకటి ఆశి స్తున్నాను. అరవింద ఘోష్ నిర్దేశికత్వంలో వ్యవహరించే జాతీయ సంస్థ, జాతీయ సమాలోచన సభ – వాటి కార్యకలాపాలు – వీటికి అవరోధం కల్గించే చర్యలు ఏమీ తీసుకొనబడవని మాకు నమ్మకం కలిగించే ప్రకటన సభాముఖంగా వారి నుంచి వినా లని నిరీక్షిస్తున్నాను.

(తర్వాత కైర్ హార్డ్ పోలీసు దురాగతాలకు ఒక దృష్టాంతం వర్ణిస్తూ – వారి మాటలలో):

ఈ మధ్యనే జరిగిన సంఘటన. అరవింద ఘోష్‌తో సూటిగా సంబంధమున్నదే. ఎ.బి. కల్హాత్కరు ఒక పత్రికా సంపాదకుడు. మద్రాసు విశ్వవిద్యాలయంలో చదువుకున్న విద్యాధికుడు. అర వింద ఘోష్‌యొక్క వ్యాసాలను, ఉపన్యాసాలను కొన్నిటిని తన పత్రికలో ప్రచురించాడు. అందుకు ఈయన ప్రభుత్వ తిరుగు బాటు ప్రబోధాల ప్రచారకుడుగా నిందితుడై నేరస్థుడయాడు. పదిహేను నెలల కారాగార శిక్ష విధింపబడినాడు. ఇక్కడ ఆసక్తి కరమైన విషయమేమంటే ప్రచురించబడిన వ్యాసకర్త/ఉపన్యాస కుడు అరవింద ఘోష ఇదివరేకే కోర్టు విచారణకి లోబడి నిర్దో షిగా బయయపడ్డాడు. కాని అవే వ్యాసాలు ప్రచురించినందుకు మాత్రం కొల్హాత్కరు శిక్షార్హుడు అయినాడు. నాగపూర్ జైలులో 5½ నెలలు ఏకాంత కారాగార శిక్ష అనుభవించాడు. నాకు తెలిసి, ఇండియను పీనలు కోడ్ ప్రకారం ఏకాంత కారాగారవాసం (in solitary cell) ఏడు రోజులకు మించకూడదు. కాని ఈయన పాపం 5½ నెలలు అనుభవించాడు. 32 పౌన్లు బరువు తగ్గిపో

యాడు. ఈ కారాగారవాసంలో ఇది చాలక సంకెళ్లతో బంధించారు. సంకెళ్ల బరువుతో అడుగు తీసి అడుగు వేయలేక పోయే వాడు. రాజకీయ ఖైదీలనిలా ఎందుకు హింసిస్తున్నారు? ఈ దేశ రాజకీయ ఖైదీలు మెరుగైన సదుపాయలు అనుభవిస్తున్నారే! ఇంకా మరిన్ని ప్రత్యేక సదుపాయాలు అందచేయబోతున్నామని హోం శక్రటరీగారు ప్రకటించినపుడు ఆనందించాం. మరి ఇండియన్ ఖైదీలకు కూడా సమాన సదుపాయాలు యెందుకు అందించరని మేము అడుగవచ్చును కదా?

తదుపరి కైర్ హార్డీ, మిడ్నపూర్ కేసు వివరాలు వర్ణిస్తూ అందుకు సంబంధించిన బాంబు నేరంలో చిక్కుకొన్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోనికి తీసుకొని అన్యాయంగా హింసించారని, అందుకు పోలీసులపై కేసు నమోదు చేశారని, ఆ ముగ్గురు యువకులు తర్వాత విడుదల కాబడినారని చెప్పారు. ఫరీద్‌పూరు, మైమాన్సింగు, బారిసాల్ పట్నాలలో కాంగ్రెస్ సమావేశాల నెందుకు నిషేధించారని అడిగారు.

స్టేట్ అండర్ శక్రటరీ (మోంటేగ్): మొదటిసారిగా ఇండియా వ్యవహారాలు ఈ పార్లమెంటులో చర్చకు రావటం ఒక మహాదవకాశంగా భావిస్తున్నాను. ఈ పార్లమెంటుకు ముఖ్యాతిముఖ్యమైన బాధ్యతలలో ఇది ఒకటి. కాకపోతే ఇండియా గవర్నమెంటును దుయ్యబట్టేవారు, సమర్థించేవారు – ఉభయులూ ఈ సభకు ఒకే వైపున ఉన్నారు. అటువైపువారు (Conservative Party) కుతూహలంగా చూస్తూ ఉండిపోయారు. చక్రవర్తి (బ్రిటిష్) పాలనా బాధ్యతల పట్ల నిర్లిప్తులుగా అగుపిస్తున్నారు.

ఇప్పుడు జరుగుతున్న చర్చ పట్ల నాకెలాటి ఆక్షేపణా లేదు. దీనిని గౌరవ మిత్రులు విశ్వసిస్తారనుకుంటాను. ఇండియన్ గవర్నమెంటుకి ఈ దేశప్రజకి మధ్య సమన్వయ కర్తగా వ్యవహరించే ఒక ఒకే వ్యవస్థ ఈ చట్ట సభ (The House of Commons) ఆ దేశ పరిపాలనా బాధ్యత ఈ చట్ట సభపై ఉన్నది. ఇండియా పాలనాధికార చర్యలను విమర్శించటం, ప్రశ్నించటం, సమర్థించటం అవశ్యం హర్షణీయం. సభకు ఆవలివైపు (The

Labour Party) గౌరవ సభ్యులు ఇద్దరు ప్రస్తావించిన అంశాలపట్ల చాలావరకూ నాకు ఎలాంటి అభ్యంతరము లేదు. మన్నిస్తే ఓ మాట అంటాను. వారు ప్రస్తావించిన వాస్తవాంశాల కంటే కూడా వారి సుదీర్ఘ వక్తృత్వనైపుణ్యం నన్ను ఆకట్టుకుంది. అరవింద ఘోషపై రాజద్రోహ నేరారోపణను ఆధారం చేసుకొని ఇండియాలో రాజద్రోహ నేరాల గురించిన ప్రస్తావన కావించిన సమయ సందర్భాలపై నాకు అభ్యంతరం ఉంది. ఈ సందర్భంగా ఉదయం ప్రస్తావనకు వచ్చిన అంశం ఒకటి మీకు తెలియపరుస్తాను. Louth నుంచి ఎన్నికైన గౌరవ సభ్యుడు నోబుల్ లార్డుకు సంబంధించిన ద్విభార్యాత్వ అంశం అది. సభలో దాని ప్రస్తావనకు అవకాశం లభించినపుడు గౌరవ సభ్యుడు ఏమన్నాడో వినండి:

అధ్యక్షా (Mr Speaker)! ఈ అంశం కోర్టు విచారణలో ఉన్నదని ఇక్కడ ప్రస్తావించటానికి మీరు అభ్యంతంర తెలిపారు. కాబట్టి నేనీ విషయం ఇపుడు ప్రస్తావించ తలచుకోలేదు.

గౌరవ సభ్యుని సముచిత నిర్ణయాన్ని స్పీకరు అభినంధించారు, కోర్టు విచారణలో ఉన్న అంశం సభలో ప్రస్తావించడం పద్ధతి కాదని.

రామ్సే మేగ్డనాల్డు: ఈ విషయం నేను స్పీకరుతో సంప్రదించాను.

మాంటేగ్: అరవింద ఘోష్ గురించి వినిపించిన గౌరవ సభ్యుని వాదం చాలవరకు ఇండియా చట్ట ప్రకారం ఏదో రకంగా ఇండియా న్యాయపాలనా వ్యవస్థకి భంగం కలిగించేదిగానే ఉంది. నా ఈ మాటలను గౌరవ సభ్యుడు మన్నిస్తాడనుకుంటాను. ఈ కేసుకు సంబంధిత వాస్తవాలను మీ ముందుంచుతాను. '*కర్మ యోగిన్*' పత్రికలో డిశంబరు 25 న ఒక వ్యాసం ప్రచురితమైనది. ఆ వ్యాసం బెంగాలు ప్రభుత్వ దృష్టికే కాకుండా, ప్రభుత్వ న్యాయనిపుణులు, ప్రభుత్వ న్యాయవాది (ఇండియనే) ఏడ్వకేటు జనరలు – వీరి దృష్టిని కూడా ఆకర్షించింది. శిక్షను 124 ఎ IPC ప్రకారం చర్య తీసుకోదగిన అంశాలు ఆ వ్యాసంలో ఉన్నట్లు న్యాయనిపుణు లందరూ అభిప్రాయపడ్డారు.

(సంబంధిత శిక్షను 124 ఎ IPC చదివి వినిపించారు.)

బెంగాలు ప్రభుత్వ న్యాయాధికారులు ఆ వ్యాసధోరణి చట్ట పరిధిలోనికి వస్తుందని నిర్ణయించి రచయిత అరవింద ఘోషగా స్థిరపర్చుకొని వారిపై చర్య తీసుకోవటానికి ప్రభుత్వ అనుమతితో నిర్ణయం తీసుకున్నారు. శిక్షను 196 క్రిమినలు ప్రోసీజరు కోడ్ ప్రకారం స్థానిక ప్రభుత్వ అనుమతి లేనిదే IPC, 124 ఎ శిక్షను అమలు చేయకూడదు.

రామ్సే మేగ్డనాల్డు: వ్యాసం సంతకము తోనే ఉన్నదే?

మాంటేగ్: సాంకేతికంగా నాయ్యపరమైన కారణాల వలన వ్యాస కర్త అరవింద ఘోష అని నిర్ణయించడంలో జాప్యం జరిగింది. అందుకే ఈ నెలాఖరు వరకు వారికి వారంటు అందచేయలేదు. తీరా ఇపుడు అందచేయాలనుకుంటే వారి జాడ పోలీసువారికి తెలియటం లేదు. ఘోష జాడ తెలుసుకోవటంలో పోలీసువారి కంటే గౌరవ సభ్యుడే ముందంజలో ఉన్నట్లున్నారు.

రామ్సే: నా వద్ద ఉన్న సమాచారం అంతా గౌరవ సభ్యునికి ముందుగానే అందచేసినట్లు వారికి గుర్తు చేస్తున్నాను.

మోంటేగ్: అవును. ఇదే సమాచారం ఇండియా ప్రభుత్వానికీ, అందినట్లు తలుస్తాను. అయినా పోలీసువారు, తమకు కావల్సిన వ్యక్తిని వెంటనే అదుపులోనికి తీసుకోగల్గటం ఎల్లప్పుడూ సాధ్యం కాకపోవచ్చు. ఏ క్షణంలోనైనా అరవింద ఘోష అరెస్టు కాబడతారు. ఘోష అరెస్టు తప్పించుకుంటున్నారని తాజా సమాచారం. బెంగాలు ప్రభుత్వము, న్యాయాధికారులు – వీరి అనుమతితో బెంగాలు చీఫ్ మేజిస్ట్రేటు బ్రిటిష చక్రవర్తి తరఫున ఘోష అరెస్టుకు వారంటు జారీచేసి ఉన్నారు. వారంటు అమలు కాబడి, వారు అరెస్టు అయిన పిమ్మటే ప్రచురితమైన వ్యాసం రాజద్రోహ ప్రేరకమా, కాదా అనే వివాదం ఇండియా న్యాయస్థానంలో పరిష్కరింపబడుతుంది. ఈ విషయం నిర్ణయించవల్సినది ఈ సభ కాదు; అభిప్రాయాలు వ్యక్తం చేయవల్సినవారు ఈ సభ్యులు కారు. గౌరవ సభ్యుడు మేగ్డనాల్డు చెప్పినది తప్పు అని విచారణ అనంతరం తీర్మానింపబడితే (కలకత్తా బీచ్ క్రాఫ్ట్ చేత) ఘోష శిక్షార్హుడు ఔతాడు. పై కోర్టుకు అపీలు చేసుకోగలిగే హక్కు

ఉంటుంది. అలా కాక ఘోష విడుదల కాబడితే గౌరవ సభ్యునికి, బెంగాలు ప్రభుత్వంతో పాటు, ఇంపీరియల్ గవర్నమెంటును, శక్రటరీ ఆఫ్ స్టేట్‌ను, ఇంకా కోరుకుంటే ఇందుకు సంబంధించిన అధికారులు అందరినీ, సవాలు చేయగలుగుతాడు. న్యాయస్థానం మాత్రమే ఈ వ్యాసం గురించి విచారణ చేయవలసి ఉండగా ఇక్కడ ఈ సభలో అభిప్రాయాలు వ్యక్తీకరించటం అనుచితం. అందుకు సంబంధించిన సమాచారం సభలో ప్రకటించటం మరీ అనుచితం. ఈ సభతో పాటు, మన కార్యనిర్వహణ వర్గము (Executive) వారికీ కూడ ఇండియా న్యాయ నిర్ణాయకుల (Judiciary) వ్యవహారాలలో జోక్యం కలుగుచేసుకునే హక్కు లేదని సవినయంగా మనవి చేస్తున్నాను.

ఘోష సంగతి ఇండియా న్యాయాధిపతులకే వదిలి పెడదాము. వారి కార్యకలాపాలలో మనం తల దూర్చరాదు. ఈ రకమైన అంశములు చర్చించటంలో కొంత ఇబ్బంది ఉన్నది. కోర్టు విచారణ నెదుర్కొంటూ ఉన్న వ్యక్తిని నిర్దోషిగా గౌరవ సభ్యుడు మేగ్డనాల్డు, కైరు హార్డే ప్రకటించారు. వారి ననుసరించడం నాకు ఇష్టం లేదు. అలాగని ఆ పెద్దమనిషిని నేరస్థుడుగా పరిగణించటం నాకు అసమ్మతం. గౌరవ మిత్రులు చెప్పినట్లు ఆయన ఇండియాలో గొప్ప పలుకుబడిగల వ్యక్తి. ప్రముఖ విద్యావేత్త. శక్తివంతమైన రచయిత. వారి రచనా పాటవాన్ని గౌరవ సభ్యుడు రుచి చూపించాడు. వ్యాస భాగాలు చదివి వినిపించాడు. అవి ఎంతవరకు సత్య ప్రమాణములు అనే సందిగ్ధ స్థితిని సభకు కలిగించి నన్ను అయోమయస్థితిలో పడవేశారు. సభను ఇట్టి పరిస్థితిలోనే ఉంచాలా? లేక ఘోషకు విరుద్ధంగా హాని కలిగించే విషయాలు ప్రస్తావించాలా? ఎటూ నిర్ణయించుకోలేని పరిస్థితి. ఒక్క విషయం మాత్రం తెలియచేయగలను. న్యాయాధిపతి బీచ్ క్రాఫ్ట్, అరవింద ఘోషను రాజద్రోహ నేరస్థుడుగా విచారించి తీర్పు చెప్పలేదు. ఆయనకు బాంబు కుట్ర కేసులో సంబంధము ఉన్నదా? బ్రిటిష్ చక్రవర్తిపై తిరుగుబాటు ప్రకటించారా? అనే అంశాలకే పరిమితమై విచారణ చేశారు. రాజద్రోహ నేరస్థుడుగా ఈయన

విచారింపబడనే లేదు. ఘోష యొక్క బోధనలు, వ్రాతలు, బీచ్ క్రాఫ్ట్ తన విచారణ సందర్భంగా పరిగణనకి తీసుకొనటానికి నిరాకరించారనే విషయం వారి మాటలలోనే మీకు తెలియచేయ గలను. ఘోష వ్యాసాలు ఆధారంగా ఆయన రాజద్రోహ నేరంలో నిర్దోషి అన్న కైర్ హార్డీ వాదనలో పస లేదు. శషన్సు జడ్జి బీచ్ క్రాఫ్ట్ ఆ వ్యాసాలను తమ విచారణ లోనికి అసలు తీసుకొనే లేదు కదా! గౌరవ సభ్యుని వాదం ఎంత అసందర్భంగా ఉన్నదో మీకు సవియనంగా మనవి చేస్తున్నాను. మచ్చున కిది ఒక ఉదాహరణ మాత్రమే!"

తర్వాత మోంటేగ్ కాంగ్రెసు సమావేశాలను నిషేదించ టాన్ని సమర్థించుకున్నారు. మిడ్నపూరు ఉదంతాన్ని ప్రస్తావిం చారు. మధ్యలో అప్పుడప్పుడు కైరు హార్డీ జోక్యం కలుగ చేసు కున్నారు. తర్వాత కన్సర్వేటివు పార్టీ సభ్యుడు జె.డి. రీస్ మాట్లాడుతు మేగ్డనాల్డు లాంటి బుద్ధిమంతుడు తన స్వదేశీయులు అందించిన సమాచారానికి ప్రాధాన్యత నీయక ఇండియా నుంచి తమకు చేరిన సమాచారాన్నే నమ్ముతున్నారని వాపోయారు.

రీస్: అరవింద ఘోష్ మతసంబంధమైన విషయాలపై దృష్టి మరల్చి ప్రాపంచిక విషయ కార్యకలాపాలకు దూరమై ఉన్నా రనే భావన హాస్యాస్పదం. గౌరవ సభ్యునికి (మేగ్డనాల్డు) ఇండియా మౌలిక పరిస్థితులతో ఏమాత్రం ప్రాథమిక అవగాహన ఉన్నా ఇదంతా అరవింద ఘోష తన కార్యక్రమ నిర్వహణలో భాగంగా పన్నిన పన్నాగం అని తెలుసుకోగలరు. ఇంతకన్న మేలైన పద్ధతి ఆయనకు వేరే ఏముంది? ఇండియా జాతీయతను ఈ రకంగా తెలియచెప్పిన మరొక ఇండియను శివాజీ. సన్యాసం స్వీకరించా నంటూ దేశాటనం చేస్తూ కూడా తన అధికార స్థావరం (post) నుంచి మాత్రం దృష్టి మరల్చలేదు. ఇండియా సొసైటీల నుంచి వచ్చే post ను ఆధారంగా చేసుకుని మాట్లాడుతున్న గౌరవ సభ్యుని తీరు కూడా ఇదే మాదిరి! అరవింద ఘోష రచనపై నేను వ్యాఖ్య చేయతలచుకో లేదు. అందుకు తగిన కారణాలు విదేశాంగశాఖ అండరు శక్రటరీ చెప్పనే చెప్పారు. అరవింద ఘోష

సుప్రసిద్ధ సాహిత్యవేత్త మాత్రమే కాడు; అన్నిటికీ మించి ఆయన ఇండియాలో బ్రిటిష పాలనను, మన దేశీయులను ద్వేషించడంలో కూడా ప్రసిద్ధుడే! అందువల్లనే కొన్ని ప్రాంతాల నుంచి కొందరి సానుభూతి సహకారాలు పొందగలుగుతున్నారు.

గౌరవ సభ్యుడు మేగ్డనాల్డు చెప్పినది విని చకితుడనయాను. ముప్పది కోట్ల జనాభా (ఇండియా) ను పరిపాలించే బ్రిటిష ప్రభుత్వము ఆంగ్లవిద్య నభ్యసించిన కొద్దిమంది హిందూ గుంపుచేత పరిపాలింపబడ వలెనా! ఎంత సాహసం! ఎంత మొరటైన ప్రతిపాదన! ఈ హాస్యాస్పద సూచనను సభ్యులు గమనించే ఉంటారని భావిస్తున్నాను.

21-2-1911


Mr. O'Grady అడిగిన మూడు ప్రశ్నలు:

అరవింద ఘోష్ వ్యాసాన్ని ప్రచురించిన *'కర్మయోగిన్'* ప్రచురణకర్త కోర్టులో విచారింపబడినాడా? ఫలితంగా నిర్దోషిగా నిరూపింపబడినాడా? ఈ వ్యాస రచనకు సంబంధించిన అరెస్టు వారంట్లు రద్దు కాబడినవా?

పై మూడు ప్రశ్నలకీ మోంటేగ్ 'అవును' అని సమాధానం చెప్పారు.

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

May 06 : Rs. 15



Tulipa: Blossoming

సంగీతము

అఖిల

అఖిల భారత పత్రిక, మే 2006

7/5/2006.

విషయ సూచిక

శ్రీమాత ప్రవచనములు

శ్రీఅరవిందుల ప్రవచనములు

సంగీత పరమార్థం

లలితకళలు – తత్రాపి – సంగీతం – వీటికి ఉన్న ప్రాచుర్యాన్ని మనవాళ్లు ఈ రోజులలో గుర్తిస్తున్నట్లు కనపడదు. ఎంతసేపూ శాస్త్రసాంకేతిక విజ్ఞానానికే పెద్దపీట వేస్తూ కళాసాహిత్యరంగాలను విస్మరిస్తున్నారు. జాతికి ఇదేమీ అంత ఆరోగ్యపరిణామం కాదు. సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి మనసుతోపాటు హృదయాంతరంగాలు కూడా పరిపుష్టం కావాలి. అలా కాకపోతే మనిషి బుద్ధిజీవుడైన రాక్షసుని కంటె కనికిష్టంగా మారే ప్రమాదం ఉంది అంటారు శ్రీఅరవిందులు. కావ్య, కళ, రసాస్వాదనంలో జీవనం రసరమ్యమైతే సమరస భావంతో అది పునీతమౌతుంది. అపుడే జీవితానికి పరిపూర్ణత చేకూరేది. సంగీత, సాహిత్యాలు, కళలు ఆత్మోన్నతికి సహకరించి వ్యక్తిని ఉన్నత చేతనా తీరాలకి ఉన్ముఖం చేస్తాయి. భగవంతునికి దగ్గర చేసే శక్తి సంగీతానికి ఉన్నది. శ్రీమాత 'నాదసుధారసరూపిణి', ".శ్రీమాతా! అరవింద లోచనా సుధా" – అని శ్రీమాతని కీర్తించారట శ్రీ టి.వి. కపాలి శాస్త్రిగారు. మనుష్యులను సంఘటితపర్చి, పరిశుద్ధులను చేసే శక్తి సంగీతానికి ఉంది అంటారు శ్రీమాత. సృష్టి అంతా సంగీతమే! వినగలిగే చెవులే ఉంటే ఎన్ని 'unheard melodies' వినిపించని రాగాలు వినిపిస్తాయో మరి! "రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్ పర్యుత్సుకీ భవతి యత్సుఖినోపి జంతుః" అంటారు కవి కులగురువు కాళిదాసు. శ్రీమాతారవిందులు రసరమ్యమైన స్వర రాగ నాదసుధాతరంగాలలో దివ్యానుభూతులు పండించుకోవచ్చునని చెప్పారు. ఆ రకంగా కూడా జీవిత పరమార్థాన్ని సాధించవచ్చు నంటారు. ఈ పావన పరమార్థాన్ని ఆ అవతారమూర్తుల అమృత వాక్కులలోనే అందుకోండి.

– సంపాదకుడు

సంగీత లక్ష్యం – ఆత్మ సాధన

మనలోని చైతన్యాన్ని ఉన్నతశిఖరాలకి చేర్చడంలో సహాయపడటమే సంగీతం పాత్ర. ఇలా కాక మన ఆత్మానందానికి దోహదపడకపోగా మన చైతన్యానికి అడ్డుగోడలు వేసి, కోరికలనీ ఉద్రేకాలనీ ప్రేరేపిస్తే, అది నిజమయిన సంగీత లక్ష్యాలకి భిన్నం కాబట్టి, దానిని వదిలివెయ్యడం నయం.

*

ఈ సృష్టిలో దివ్యత్వం పలు రూపాల్లో వ్యక్తమవుతుంది. సౌందర్యము, కళలు కూడా ఒకే దివ్యస్వరూప రూపకల్పనలే. ఇలా చూస్తే, నిజమైన కళాకారులు అరుదే. కానీ వాళ్లు తప్పక యోగులే అయివుండాలి. నిజమైన ప్రేరణ కోసం యోగుల్లాగే వాళ్లూ తపస్సు చేస్తూ ఎదురు చూస్తారు. ఏ కళాకారుడైనా నిజమైన సౌందర్యాన్ని కళలో వ్యక్తపరచాలంటే, ముందు దాన్ని తన అంతర్దృష్టిలో చూసి అర్థం చేసుకోగలగాలి. అతని కళ అతనికి లోపల కలిగిన సత్యదర్శనానికి బాహ్యాసాక్షాత్కారం. ఇదీ ఒక యోగమే! దీని ద్వారా కళాకారుడు తనలోని ఎన్నో లోకాలకి వెళ్లగలుగుతాడు. ఉదాహరణకి లియనార్డో డవిన్సీ లాటి కళాకారులు తప్పక యోగులే. లియనార్డో నిస్సందేహంగా ఉత్తమ కళాకారుడే – పైగా, అతను ఒక్క చిత్రకళలోనే కాక ఎన్నో కళారూపాలలో ప్రవీణుడు.

సంగీతసాధన కూడా వ్యక్తియొక్క మానసిక, ఆధ్యాత్మిక చింతనలలో ముడిపడి వున్న ఆత్మసాధనే. దురదృష్టవశాత్తు దాని ముఖ్య లక్ష్యాన్ని విస్మరించి కేవలం కళ కోసమే అనో లేక పాశ్చాత్య సంగీతంలో ఒపెరాల్లో, నాట్యానికి వంత పలికేస్తూ సాగుతోంది. ఈ రోజుల్లో తారసపడే సంగీతం ఈ కోవదే.... దీనికి ఒకవేళ ఏదన్నా ప్రత్యేకతంటూ వుంటే – శైలిలో వుండొచ్చు. అంతే. నిజానికి ఇటువంటి సంగీతాన్ని చిన్న చూపు చూడక్కరలేదు. దీన్ని కూడ ఉన్నత కళని వ్యక్తీకరించేందుకు వాడవచ్చు. దేనినైనా వాడే విధానంబట్టీ, వాడే ఉద్దేశాన్నిబట్టీ తేడా వస్తుంది.

దివ్యత్వం కోసం వాడటానికి పనికిరాని అంశం ఏదీ లేదు. ప్రతిదీ ఉపయోగపడుతుంది... అలాగే సరిగా ఉపయోగించకపోతే చూడ డానికి ఎంతో దివ్యంగా కనిపిస్తూ వున్నా కుక్కగొడుగులా నిర ర్థకమే.

*

ఈ సృష్టిలో ప్రతి వస్తువులోనూ దివ్యత్వం ఉంటుంది. దివ్యత్వం వైపు దృష్టి మరల్చినపుడే అది వెలికివస్తుంది. ఈ నియమం సంగీతానికీ వర్తిస్తుంది.

*

చక్కని సంగీతశైలి కేవలం ఒక చక్కని పరికరం లాంటిది. ఆ పరికరం ఎంత బాగుంటే అంత మంచిదే కానీ... దాని లక్ష్యం భగవదర్పణ కాకపోతే అది ఓటికుండలాగా నిరర్థకమే. చాలా మంది కళాకారులతో వచ్చిన చిక్కేమిటంటే, వాళ్లకి తాము స్వతంత్రులమనీ భగవంతుని దెశలో చూడనక్కరలేదనే ఆపోహ వుంటుంది. దివ్యరచనలో కళానైపుణ్యమూ భాగమే కనుక, దివ్య త్వాన్ని పుడమిపై అభివ్యక్తీకరించే మహాకార్యంలో తన స్థానమే మిటో తెలుసుకుని తగిన రీతిలో వుండాలి. అత్యుత్తమ కళ యొక్క లక్ష్యం అదే. నిజమైన కళాకారులు భౌతిక ప్రపంచానికీ దివ్యప్రపంచానికీ మధ్య వారధులు. ఇలా చూస్తే, కళకీ యోగా నికీ ఎక్కువ వ్యత్యాసం లేదు. అయితే, కళాకారుడికి ఈ సత్య జ్ఞానం వుండదు, కేవలం లీలగా ఓ భావనే వుంటుంది. అలా అని అందరూ అలా కాదు. తమ లక్ష్యం గురించి జ్ఞానం వున్న కళా కారులు కొంతమంది నాకు తెలుసు. వాళ్లు ఆ జ్ఞానంతోనే కృషి చేస్తారు. తమ వ్యక్తిగత అభిప్రాయలకంటే, తమ కళని భగవ దుపాసనగా తలచి, తమకీ భగవంతుడికీ వున్న సంబంధాన్ని చూపేందుకే నియోగిస్తారు.

మధ్య యుగాలలో దివ్యత్వాన్ని వ్యక్తీకరించడమే నూటికి నూరు పాళ్లు కళకి లక్ష్యంగా వుండేది. ఈ రోజుల్లో మనం వారిని 'అనాగరిక' చిత్రకారులంటాం కానీ, వాళ్లకీ యూరపులో ఎన్నో Cathedrals నిర్మించిన కళాకారులకీ కూడా కళ అంటే భవగదా

రాధన తప్ప వేరు దృష్టి లేదు. ప్రాచీన భారతదేశంలోని అన్ని నిర్మాణాలు, శిల్పాలు, చిత్రాలు దివ్యత్వాన్ని దివిలోంచి భువికి తేవాలనే ప్రేరణలోంచే జనించాయి. భక్త మీరాబాయి పాటలైనా, శ్రీ త్యాగరాజు కీర్తనలైనా, భారతదేశంలోని అనేకానేక సాధువుల, భక్తుల, ఋషుల రచనలైనా – అన్నీ ప్రపంచంలోని అత్యున్నత కళాత్మకతకి గీటురాళ్లే

మూలం: శ్రీమాత

అనువాదం: బి. వరలక్ష్మి

వినిపించే రాగాల వెనుక

ప్రశ్న: బాహ్య సంగీత శైలికి పరోక్షంగా ఉండేది ఏమిటి?

భావోద్వేగాలు, ఆలోచనలు, అనుభూతులు, ఆకాంక్షలు – వీటికి స్వరరాగబంధ వ్యక్తీకరణ సంగీతము. వీటికి ఒక ప్రసార సీమ ఉన్నది. అక్కడ నుంచి సృతిపేయమైన శబ్దాకృతిగా ఇవి ఆవిష్కృతమౌతవి. అనుభూతి ప్రేరణలో సుసంగీతజ్ఞుడు చెవి కింపైన సంగీతాన్ని స్వరపరుస్తాడు. అంతగా సంగీతజ్ఞానం లేని వానిలో కూడా ఉన్నతమైన అనుభూతి ప్రేరణలు ఉంటాయి. కాకపోతే సుస్వరమేళవింపు చేతకాక ఇతని సంగీతసృష్టి పేల వంగా అనాసక్తంగా మిగిలిపోతుంది. కాని ఒక్క విషయం. సంగీతంయొక్క శబ్దాకృతినికాక దాని మూల ఉత్పత్తిస్థానము నందు కోగలిగినపుడు నీ ఆస్వాదన వేరుగా ఉంటుంది. సంగీతానికి శబ్ద రూపముకంటె దివ్యమైన అంతఃప్రేరణ ముఖ్యం. అంతర్ప్రేరణతో కూడిన భావస్ఫూర్తిలేని సంగీతం యాంత్రికమై నిస్సారంగా ఉంటుంది. ఆస్వాదయోగ్యంగా ఉండదు. బాహ్యరూపము కంటె దివ్యమైన ఉన్నత భావస్ఫూర్తి సంగీతానికి ప్రాణప్రదము. ఇది లేని సంగీతము శబ్దాల రణగొణ ధ్వని మాత్రమే.

*

ఉద్దండులైన సంగీతజ్ఞులచేత స్వరకల్పన చేయబడిన కొన్ని సంగీతాలు పాండిత్యస్ఫోరకంగా ఉంటూ వారి సంగీత నైపుణ్యా తను ప్రకటిస్తాయే తప్ప భావస్ఫూర్తితో రసవత్తరంగా ఉండవు. అందువల్ల అవి యాంత్రికంగా పేలవంగా ఉంటాయి. మానవ సృష్టి ఏదైనాకానీ దానికి భావప్రేరణ (inspiration) అతిముఖ్యం. భావో ద్వేగం ఎంత ఉన్నతమైనదో అంత ఉన్నతంగానూ భావ ప్రక టన ఉండాలి. (కళా) సాంకేతికనైపుణ్యం (technique) అప్రధాన మని నేను అనను. ఇదీ అత్యావశ్యకమే. కాకపోతే inspiration కే ప్రథమస్థానం.

సంగీతము యొక్క జీవలక్షణం దాని ఉత్పత్తి స్థానముపై ఆధారపడి ఉంటుంది.

ప్రశ్న: మూల ఉత్పత్తిస్థానము అంటే అర్థం!

జన్మస్థానము. నదికి జన్మస్థానము నీటి ఊట అయినట్లుగా.

ప్రశ్న: ప్రతిదానికి ఒకటికంటె ఎక్కువ జన్మస్థానములు ఉంటాయా?

సర్వభౌతిక జీవనులకు మూలము, ప్రాణిక మానసిక చైతన్యములు. వీటికి కూడా వీటి తాలూకు ఉత్పత్తి స్థానము లుంటవి. అది వేరే విషయం. పోతే, భౌతికముగా అభివ్యక్తమయే ప్రతిదానికీ ఆధారభూతమై మౌలికంగా ఉండేది ఒక్కటే ఉన్నత సత్యము. (సత్యేసర్వం ప్రతిష్ఠితమ్) సత్యము లేకుండా ప్రపం చమే లేదు. సత్యచైతన్య శక్తుల ప్రచోదనల వలననే జీవితము అభివ్యక్తమై, నిలిచి, సాగుతోంది. లేకుంటే ఇక మిగిలేది ఏమీ ఉండదు.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

వివిధ సంగీత ప్రేరణలు

ప్రశ్న: ఏ స్థాయి – నుంచి సాధారణంగా సంగీతం ఉత్ప న్నమౌతుంది?

వివిధ స్థాయి లున్నాయి. సంగీతమంతా వున్నత ప్రాణికం నుండి వస్తుంది. ఒక్కొక్కప్పుడిది విపరీతాకర్షణతో, నరాల్ని మెలి పెట్టేంత వుద్రేకపూరితమై, ఆటవిక (vulgar) లక్షణంతో వుంటుంది. ఇది చికాకు కల్పించకపోయినా నరాల మూలాలని పట్టుకుం టుంది. ఈ రకం సంగీతం ప్రాణికస్థాయిదని చెప్పవచ్చు. దీనికి పూర్తిగా భిన్నమైనది, చైత్యమూలమైన సంగీతం. ఆ సంగీతం అత్యంత తేజోవంతమై నిన్ను పూర్తిగా పరవశింప చేస్తుంది. ఇటువంటి సంగీతాన్ని కావాలనుకున్నవారు కూడా దానిని ప్రాణికమార్గం ద్వారానే సాధించగలిగే సమర్థులు కావాలి. దానికి కావల్సిన బలం, వైభవం ప్రాణిక స్పందన నించే స్వంతం చేసుకోగలగాలి. లేకపోతే అది అందనంత వున్నత స్థాయిలో ఎలా వున్నదలాగే వుండిపోతుంది. అత్యున్నత స్ఫూర్తి పొందిన వాళ్లు కూడా నేలబారుగా వుండిపోవడానికి, వారి ప్రాణికంలో కదలిక లేకపోవడమే కారణం. ఆధ్యాత్మిక సాధనలవల్ల వారి ప్రాణికం పూర్తిగా నిశ్చేతనమయిందని చెప్పక తప్పదు. సంగీతం భౌతికంగా ప్రభావితం చేస్తుంది. కాని ఎవరైనా సంగీతం మూలా నికి సంధానించినప్పుడు వారిలో ఏదో వొక అద్భుతం చూడగలం. అయితే బాహ్యంగా దానిలో కొద్దిపాటి శ్రావ్యత తప్ప యింకేమీ వుండదు. అందులో స్వరసామరస్యం బలంగా వుండదు. అదే ప్రాణికాన్ని రంగంలో దింపితే వచ్చే స్పందన చాలా బలంగా వుంటుంది. దీనిని వున్నత కేంద్రానికి తీసుకుపోగలగడమే సంగీత ప్రావీణ్యానికి గీటురాయి.

సంగీతానికి మధ్యవర్తి కావాలి. లేకపోతే చాలా కష్టం. సంగీతానికుండే ప్రత్యేకతే అది.

సాహిత్యం, కవిత్వం, చిత్రలేఖనం లాంటి ప్రతి కళలాగే సంగీతం కూడా వొక లలితకళ. వ్యక్తి సృజనాత్మకతయొక్క

అసలు విలువ, వారు పొందిన స్ఫూర్తిస్థాయి, ఉన్నత ఉత్పత్తి స్థానం మీద ఆధారపడి వుంటుంది. కాని దానిని వ్యక్తపరచే విధానము, ప్రాణికశక్తి మీద ఆధారపడుతుంది. పూర్తి పరిణతికి రెండూ అవసరమే. ఇది చాలా అరుదు. సాధారణంగా దేనికైనా ప్రాణికమే అవసరమౌతుంది. ఇతర రకాలైన సంగీతాలు కూడా మన కున్నవి. హోటళ్లలో, సినిమాల్లో పాడే బృందరాగాలు. ఏదైనా సంగీతమనేది వొక అసాధారణ ప్రతిభ. అదే సంగీతానికి విలక్ష ణమైన అతి సాధారణత్వం, పామరత్వం కూడా వుంటుంది. ఏమైనా అది ముమ్మాటికీ అసాధారణ ప్రతిభే. నరాల మూల ల్లోంచి పట్టి కుదిపే దాని పట్టునుంచి తప్పించుకోవడం అసాధ్యం. ప్రాణికంగా, ప్రాణికస్పందనలతో చాలా గొప్పగా చేసిన సంగీతం అద్భుతం. అయితే రెండో వైపు సంగీతం మాత్రం చాలా భయం కరంగా వుంటుంది.

అత్యున్నత స్థాయి నించి ప్రాణికాన్ని అభివ్యక్తీకరించే ప్రాణికశక్తిని వూహించుకో. మహోన్నత స్ఫూర్తి, సాధనలతో స్వర్గద్వారాలన్నీ నీ కోసం తెరుచుకుంటాయి. అదొక అత్యద్భుత అనుభూతి. సీజర్, ఫ్రాంక్, బీథోవన్, బాక్ (Bach) మరికొంత మంది బాణీలు యీ స్ఫూర్తిని, శక్తిని కలిగివుంటాయి. కాని యిదంతా క్షణికం. శాశ్వతమైనది కాదు. ఒక కళాకారుడి పరి పూర్ణకృషిని యీ స్థాయిలో అంచనా వెయ్యలేము. ప్రేరణ అనేది మెరుపు లాంటిది. ఒక్కొక్కసారి అది నీ కృషి కొనసాగించే వరకూ ఉంటుంది. ఆ సమయంలో ఏకాగ్రతతో సంసిద్ధమయితే, హఠాత్తుగా అది శక్తినంతా కూడ గట్టి అత్యున్నతస్థాయికి తీసు కుపోయి అత్యద్భుత కాంతులతో నిండిన ఊర్ధ్వలోకాలలో ఓల లాడిస్తుంది. అనేక సంవత్సరాలు, అత్యంత శ్రమతో సాధించిన యోగఫలితాన్ని క్షణంలో సిద్ధింపజేస్తుంది. ఇంత గొప్ప అను భవం తరువాత కూడా కొందరు పతనమైపోతారు. ఎందుకంటే వారికి దివ్యచైతన్య కృప లేకపోవడమే. ఈ అనుభవం ఆనవాళ్లు కూడా వారిలో మిగలవు. యోగంతో పాటు దివ్యచైతన్యాన్ని ఆధారంగా చేసుకుని సంసిద్ధులయినవారికి యీ అనుభవం కల

గడమే కాకుండా వారిలో అది స్థిరపడిపోతుందన్నది నిస్సందేహం.

ప్రశ్న: గొప్ప వాగ్గేయకారులకు సంగీతం ఏ రూపంలో వస్తుంది? స్వరసమ్మేళనంగానా లేక మనకు వినపడే (పదముల కూర్పు) దానివల్లనా?

అది ఆ గాయకుడిని బట్టి వుంటుంది. ఉదాహరణకి ఇక్కడ మన భారతదేశంలో అంతగా శాస్త్రీయమైన స్వరసామరస్యం లేక పోవటంవల్ల melody లోనికి అనువదించబడింది. ప్రాణిక స్థాయిలో వెంటనే అందులో వొక స్వరసామరస్యం యేర్పడుతుంది. అది దానికి అంతకు మునుపు లేని ప్రాభవాన్ని, నిండుదనాన్ని సంతరించిపెడుతుంది.

ప్రశ్న: శ్రావ్యతే సంగీతమౌతుందా?

సంగీతమంటే శ్రావ్యతే కాదు. అసలు సంగీతమంటే అనేక ధ్వనుల సమ్మేళనం. ఆ ధ్వని సమ్మేళనంలో శ్రావ్యత కూడా వొక భాగంగా వుంటుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

పాశ్చాత్యసంగీతము – భారతీయసంగీతము

ప్రశ్న: పాశ్చాత్యసంగీతానికి, భారతీయసంగీతానికి మధ్య అంతరానికిగల కారణమేమిటి? అది వాటి మూలంలోనా, లేక పాడే తీరులోనా?

అది రెండింటిలోను వున్నది, కాని తలక్రిందులైనట్లుగా అనిపిస్తుంది.

అత్యంత తీవ్రమైన మనోప్రేరణ పాశ్చాత్య సంగీతంలో కలుగుట చాలా అరుదు; చైత్యపురుషసత్తానుండి ఉత్పన్నమగుట కూడ చాలా అరుదు. అది ఉన్నత భూమికల నుండి రావాలి, లేదా ప్రాణికమైనా కావాలి. కొన్ని అరుదైన సందర్భాలలో తప్ప,

దానిని పాడే తీరు చాలావరకు ప్రాణికంగానే వుంటుంది – ఉన్నత భూమికలనుండి వస్తే మాత్రం అది ఎంతో ఆసక్తికరమైనదిగాను, శక్తివంతమైనదిగా, అద్భుతంగానూ వుంటుంది. కొన్ని సార్లు, ముఖ్యంగా మతపరమగు సంగీతమైనప్పుడు, అది చైత్య పురుషసత్తా నుండి వెలువడుతుంది, కాని ఎప్పుడో కాని అలా జరుగదు.

చక్కని గాయకుల గళం నుండి వెలువడే భారతీయ సంగీతపు మూలం ఎల్లప్పుడూ చైత్యపురుషసత్తాలో వుంటుంది; ఉదాహరణకు, రాగాలకు మూలం చైత్యపురుషసత్తా, అవి అక్కడ వెలువడుతాయి. మనోప్రేరణ ఎల్లప్పుడూ పైనుండి రాదు. కాని భారతీయ సంగీతం చాలా బలమైన ప్రాణికంలో రూపుదిద్దుకొని యుండుట చాలా అరుదు. అందుకు భిన్నంగా దాని మూలం అంతరంగ సన్నిహితమైనది. నేను భారతీయ సంగీతాన్ని చాలా బాగా విన్నాను; కాని ప్రాణికశక్తిగల భారతీయసంగీతాన్ని చాలా అరుదుగా విన్నాను. బహుశః నాలుగైదు సార్లకు మించకపోవచ్చు. కాని చైత్యపురుష సత్తా ఆధారంగా ఉన్న భారతీయ సంగీతాన్ని చాలాసార్లు విన్నాను; అది దాదాపు సూటిగా భౌతిక పరివర్తనను కలుగజేస్తుంది. అప్పుడు నిజంగా ఏకాగ్రత వహించాలి. ఎలా చెప్పాలి?! అది సున్నితము, సుకుమారము అయిన అంశం కదా! తీవ్రమైన ప్రాణికస్పందనలు వుండనందున, వ్యక్తి దానిలో అతి సులభముగా లీనమైపోవచ్చు, ఆ సంగీతపు చైత్యపురుష సత్తా, మూలానికి తిరిగి చేరుకోవచ్చు. దాని ప్రభావం నీపై ఎలా వుంటుందంటే మత్తు పారవశ్యంలో మైమరచినట్లుగా వుంటుంది. కొంతమేరకు పారవశ్యంలో మునిగిపోయేలా చేస్తుంది. అలా వింటూ నిన్ను నీవు మరచిపోతే నీలో మెల్లమెల్లగా కదలికలు ప్రారంభమవుతాయి. క్రమక్రమంగా చైత్యపురుషసత్తలోనికి జారుకుంటావు. కాని నీవు కేవలం బాహ్యాచైతన్యంలోనే గనుక వుండిపోతే, ఆ సంగీతం ఎంత సున్నితమైనదంటే నీ ప్రాణికంలో ఎలాంటి స్పందన కలిగించదు. ఒక జడుడిలా వుండిపోతావు. ఒక్కోసారి ప్రాణికశక్తితో నిండి వుండి ఎంతో ఇంపుగా వుండేది.

నా మట్టుకు నేను ఆ సంగీతాన్ని చాలా ఇష్టపడతాను, ముఖ్యంగా హావభావయుక్తమై సంగీతప్రధానంగానే ఉండేదానిని. తర్వాత లెక్కలేనన్ని మార్పులతో పరిణతి చెందుతుంది. ఏ దిశగా పరిణతి చెందినా దాని ప్రధాన లక్షణం అలాగే వుంటుంది. యూరప్ దేశంలో గాయకులుండేవారు. వారు నిజమైన గాయకులు. వారిలో కూడా ఇలాంటి లక్షణమే వుండేది. బాక్ (Bach) కు వుండేది. అతను ఆ విధంగానే చేసేవాడు. మొజార్ట్ (Mozart) కు కూడ వుండేది. అతనిది నూటికి నూరుపాళ్ల సంగీతం. మరోదానిని వ్యక్తపరచే వుద్దేశ్యం అతనికి లేదు. అది సంగీతం సంగీతం కోసమే. కాని ఆ విధంగా కొన్ని రాగాలను తీసుకొని కొన్ని హెచ్చుతగ్గులతో ఆలాపించుట (ఈ హెచ్చుతగ్గులు అనంతమైనవి) నిన్ను విశ్రాంతిలోకి నెట్టుటకు అద్భుతంగా పనిచేస్తుందని నాకనిపిస్తుంది. నీలో లోపలికి వెళ్లిపోతావు. అప్పుడు నీవు సిద్ధంగా వున్నట్లయితే అది నీకు చైత్యపురుష చైతన్యాన్ని కలుగజేస్తుంది: అదే నిన్ను బాహ్యాచైతన్యం నుండి వెనుకకు మళ్లించేది, మరో చోట ప్రవేశపెట్టేది. అంతరంగంలోకి కొనిపోయేది.

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

ప్రణవాక్షర ప్రతిధ్వనుల ప్రసారాన్ని పట్టుపట్టి
అనంత తాళ ధ్వనులను ఛందోబద్ధం చేసి
అనంతుడి గళాన్ని ఆ గానంలో విన్నాను.

శ్రీఅరవిందులు

(సావిత్రి పుట. 405)

కొంతమంది సంగీత విద్వాంసులను గురించి శ్రీమాత

ప్రముఖులైన ఆధునిక సంగీతవిద్వాంసులలో చాలామంది సంగీత సృష్టి చేసినప్పుడు, వారి చైతన్యం ఉన్నత చైతన్యంతో సంసర్గాన్ని పొందింది. సీజర్ ఫ్రాంక్ అంతఃస్ఫూర్తితో ఆర్గాన్ వాయించినప్పుడు, అతని అస్తిత్వం చైత్యపురుషసత్వానికి తెరుచుకుంది. అతను ఆ చైతన్యంలో ఉంటూ చాలామటుకు దానిని వ్యక్తీకరించాడు. బీతోవన్, తొమ్మిదవ స్వరమేళనం కూర్చినప్పుడు అతనికి ఉన్నతలోక సంసర్గంతో పాటు అది భూవాతావరణంలోకి అవరోహణం దృశ్యమానమైంది. వాగ్నర్‌కు ధృఢమైన, శక్తివంతమైన సూచనలు నిగూఢ లోకాలనుంచి అందేవి. అతనికి మార్మికమైన సహజప్రేరణ, నిగూఢ బుద్ధి కలిగి దానిని నుండి గొప్ప స్ఫూర్తిని అందుకునేవాడు. కాని అతను చాలామటుకు ప్రాణిక పరిధిలోనే పనిచేశాడు. తరచూ అతని మనస్సు జోక్యం చేసుకుని అతని స్ఫూర్తిని యంత్రప్రాయ మొనర్చింది. అతని సంగీతం, చాలా శక్తివంతమైనప్పటికి, చాలా భాగం బాగా కలగలసిపోయి, ఎక్కువసార్లు అస్పష్టతతో, నీరసంగా ఉండేది. కాని, ఎప్పుడైతే అతను ప్రాణిక, మానసిక పరిధులను అతిక్రమించగలిగి, ఉన్నత భూమికలను చేరగలిగాడో, అతను పొందిన స్ఫూర్తి, 'పార్సిఫాల్' లోని 'ట్రిస్టా' లో కొన్ని భాగాలు, అందులోని చాలా చివరి ఘట్టాలు, అసాధారణమైన సౌందర్యాన్నందుకున్నాయి.

*

మనస్సుకు ఎగువగా ఒక క్షేత్రం ఉన్నది. దానిని మనం సామరస్య ప్రపంచం అంటాం. దానిని గనక నీవు చేరగలిగితే, భూమి మీద ఏది ఏ విధంగా ప్రకటితమౌతున్నా దానికి మూలమైన సమస్త సమరసభావమూ అక్కడ చూస్తావు. ఉదాహరణకు, ఒక రకమైన ఒరవడి కలిగి, శ్రేష్ఠమైన స్వరాలు కొన్ని మాత్రమే కలిగిన సంగీతం, ఇద్దరు కళాకారులు ఒకరి తర్వాత మరొకరు సృజించినది తీసుకుందాం. ఒకటి బాక్ స్వరాకృతి, మరొకటి

బీతోవన్ స్వరాకృతి. శాస్త్రపరంగా ఆ రెండు పద్ధతులు ఒకటి కావు. వినటానికి ఎంతో తేడా; అయినా అంతస్తత్వంలో అవి ఒకటే. తేడాలేని ఒకే చైతన్యస్పందన, విశిష్టమైన సామరస్యతా పూర్వకమైన ఒకే కెరటం ఇద్దరు కళాకారులనూ స్పృశించింది. బీతోవన్ ఎక్కువ భాగాన్ని అందుకున్నాడు. కాని అతనిలో అది అతని మానసిక నవ్య కల్పనలతోను, మధ్యస్థ మార్పులతోను కలగాపులగమయింది. బాక్ తక్కువ అందుకున్నాడు. అయినా అతను అందుకున్నది నిర్మలమైనది (పవిత్రమైంది) ఆ స్పందన చైతన్యపుటావిష్కరణ. అచేతన గర్భాన్ని చీల్చుకుని విజయోత్సాహంతో ఆవిర్భవించిన చైతన్యం. యోగము ద్వారా కళామూలానికి నీవు చేరుకోగలిగినపుడు నీకు సర్వకళలు స్వాధీనమౌతవి.

*

అవును, కొంతమంది సమ్మోహనావస్థలో (Somnabolism) అద్భుతమైన విషయాలు వ్రాస్తారు. కాని, తర్తిణి (Tartini) అటువంటి సమ్మోహన స్థితి పొందినవాడు కాడు. ఆయన వాద్యసంగీత రచనలన్నీ (Sonatas) స్వప్నావస్థలో వ్రాసినవి. కాని, ఇంతకు ముందు చెప్పుకున్న అవస్థ కొంత ప్రమాదకరమైంది.

*

(శ్రీమాత ఒక అనుభవాన్ని వివరిస్తూ ఈ విధంగా చెప్పారు.)

హఠాత్తుగా నేను విన్నాను. అదేదో, భూమి నలుమూలల నుంచి వస్తున్నట్లుగా ఒక రకంగా కొద్దిగా, బీతోవన్ యొక్క స్వరఝరిలోని (Concerto in D. major) తో పోలినది. అటువంటిది వికసిత (మధుర) క్షణాలలోనే వస్తుంది. యాభై వాద్యబృందాలు, సుస్వరంగా ఏకబిగిన పలికించిన స్వరఝరి. అది ప్రకృతి, ఆత్మల కొంగ్రొత్త అనుసంధాన స్వర సమ్మోహనం; ఎంతోకాలం ఎడబాటు తర్వాత దగ్గరైన మైత్రీమాధుర్యం.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ టి. ప్రసన్న కృష్ణ

బేయ్‌లౌజ్ (BERLIOZ'S) సంగీతం

ప్రశ్న: మనం చూసిన సినీమాకి సంబంధించి కళాసృష్టిలో వేదనకి ఉన్న స్థానము ఏమిటి? కళాసృష్టికి ఇది ఎంతవరకు దోహద పడుతుంది?

ఇది వ్యక్తులను బట్టి ఉంటుంది. కొంతమందికిది చాలా శక్తివంతంగా సహకరిస్తుంది. బేయ్‌లౌజ్ సంగీతం స్వచ్ఛాతిస్వచ్ఛమైనది. ఆయన సంగీత దేవత అపరావతారం. దురదృష్టవశాత్తు శారీరకంగా ఆయన దుర్బలుడు. యోగం వల్ల లభ్యమయ్యే దార్ఢ్యం ఆయనకు లేదు. ఇది ఆయన ప్రధానమైన బలహీనత. ఉద్వేగం, ఉద్రేకం, ఆందోళన – లతో ఈ బలహీనత ఆయన్ని బాగా కలచివేసింది. సంగీతసృష్టి పరంగా మాత్రం ఆయన మహా శక్తివంతుడు. ఒక ఊపు ఊపే శక్తి ఆయన సంగీతానికి ఉన్నది. అందుకే సంగీత అపరావతారం ఆయన.

వ్యధ ఆయన్ని సంగీత స్రష్టగా చేసినది అని అనుకోవడం మానవనైజం; కాని అది నిజం కాదు. ఒకటి మాత్రం గమనార్హం. ఆయన వేదన ఏదీ కూడా సంగీతంగా రూపాంతరీకరింపబడకుండా లేదు. శారీరక బాధకంటె ఆయనలోని సంగీత జీవలక్షణం బలీయమైనది. ఆయనలోని సౌకుమార్యత ఎలాటి బాధనైనా సంగీతాత్మకంగా మలిచింది. ఇది చాలా అరుదైన విశేషం. ఎలాంటి కళాస్రష్ట కూడా కళాసృష్టికి కాస్త వ్యవధి తీసుకుంటాడు. ఈయన విషయంలో అలాటిది ఏదీ లేదు. ఈయన సంగీత వ్యక్తీకరణ క్షణంలో జరిగేది. ఏ శారీరక అసౌకర్యం అయినా అది తక్షణమే సంగీతంగా అభివ్యక్తమయేది. నిజం చెప్పాలంటే ఈయన జీవితం సంగీతంతో ఆరంభమై సంగీతంతో ముగిసింది. సంగీతానికి, ఈయనికి ఉన్న అవినాభావ సంబంధం అంతటి బలమైనది. సంగీతం పట్ల ఆయనకున్న చిత్తశుద్ధి కూడా అంతటిదే. బలమైన ఆధారమే (శరీరం) కనుక ఆయన కుంటే ఇంకా పరమోత్కృష్ట సంగీతాన్ని సృష్టించగలిగి ఉండేవాడు. ఈయన మంచి సాంకేతిక పరిజ్ఞానం కూడా ఉన్నవాడు. ఈయన సంగీతశైలి స్వచ్ఛమైనది. ఈయన

స్వరసమ్మేళనం అద్భుతం, అనితర సాధ్యం. ఆరువందల స్వర సమ్మేళనలను ప్రదర్శించటం అంటే మాటలా! స్వరప్రస్థానాల మార్పులు చేర్పులు గణితశాస్త్ర ప్రావీణ్యతకి ఏమీ తీసిపోదు. అంత వైవిధ్యం, జటిలత ఉన్నది.

ప్రశ్న: అమ్మా! ఒక ఆఘాతం తగిలి బాధ కలిగినపుడు అది సంగీతంగానో, కవిత్వంగానో, అభివ్యక్తం కాబడవలెనా?

అభివ్యక్తం ఏమిటి? దానంతట అదే ఆనాయచితంగా, వ్యక్తీకరణం కాగలిగే సౌలభ్యం ఉంటేనే మేలైనదిగా ఉంటుంది.

మూలం: శ్రీమాత
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సంగీత ఆస్వాదనము ఎలా?

ప్రశ్న: శ్రీమాతా! సంగీతాస్వాదన విధానమేమిటి?

ఈ విషయం చెప్పాలంటే – శ్రోత ముందుగా శ్రద్ధగా ఆంతరంగికమైన నిశ్శబ్దతని పాటించాలి. తానే ఆ సంగీతాన్ని ప్రసారం చేస్తున్న పనిముట్టు కావాలి. అప్పుడు గ్రహణేంద్రియ చైతన్యం ఒక్కటే చురుకుగా వుంటుంది.

ఉత్తమ గానానుభూతి, స్వచ్ఛమైన అద్దంలో కనుపించే ప్రతిబింబంలా వుంటుంది. నిజమైన సంగీతప్రియులూ, వాయిద్య సహకారాన్ని అందించేవారూ, రాగాల్ని కూర్చేవారూ, ఆలపించే వారూ ఈ స్థితిలోనే వుండడం నేనెరుగుదును. ఆలోచనలను అన్నింటిని ఆపి, కావలసినదాని మీద దృష్టిని కేంద్రీకృతం చెయ్యడం ఈ స్థితికి ప్రాతిపదిక. దీని వల్ల అంతరంగపు కవాటాలు తెరుచుకుంటాయి. ఇది శక్తివంతమైన (ఓ ఆధ్యాత్మిక) ప్రక్రియ.

ప్రశ్న: మధుమయీ! మరొకరు ప్రదర్శిస్తున్న సంగీతానందంలోకి మనం ఎలా ప్రవేశించగలుగుతాం?

కొన్ని సమయాల్లో అప్రయత్నంగా యితరుల భావాల్ని సానుభూతితో పంచుకుంటాం. అదే విధంగా మరికొంత సన్నిహితత్వంతో వాళ్ల భావాలతో మమేకమై ఉంటాం. అప్పుడు జరగవలసినవన్నీ సహజంగా జరిగిపోతూ వుంటాయి. అలాగే యితర రణగొణధ్వనుల నన్నిటినీ అరికట్టి, ఏకాగ్రదృష్టితో సంగీతాన్ని విన్నప్పుడు ఆ స్థితే కలుగుతుంది. అదే, ఆ ప్రక్రియకు ఆఖరు దశ అని చెప్పవచ్చు. ఆ స్థితిలో వినవలసిన నాదం ఒక్కటే వినబడటంచేత దానికి సంబంధించిన భావోద్రేకాలన్నీ మనవే అయిపోతాయి. ఇదే యితరులు ప్రదర్శించే సంగీతానందంలో ప్రవేశించకలిగే రహాశ్యమార్గం.

ప్రశ్న: ఆమ్మా! ప్రతి ఆదివారం మీరు వాద్యం వాయించినప్పుడు ఎప్పుడు యింపుగా వుంటుంది. ఒక్కొక్కప్పుడు మరీ బాగుంటుంది. కారణం?

కొన్నిసార్లు నువ్వు గానానందాన్ని అనుభవిస్తావు. కొన్నిసార్లు ఆ అనుభూతి కలుగదు. కొన్నిసార్లు దాన్ని యిష్టపడతావు. కొన్నిసార్లు యిష్టపడవు. కొన్నిసార్లు అర్థం చేసుకోగలుగుతావు. కొన్నిసార్లు అర్థం కాదు. కొన్నిసార్లు నేను బాగా వాయిస్తాను. కొన్నిసార్లు అంతా బాగా వాయించను. (నవ్వు)

ఇది చాలా అంశాల మీద ఆధారపడి వుంటుంది. అన్నిటికన్నా అప్పుడు నీవు వున్న పరిస్థితి ప్రధానం. ఇంకా, ఏ భూమిక నుంచి సంగీతం వ్యక్తమౌతున్నదనే దానిపై కూడా ఆధారపడవచ్చు. కొన్ని అందుకోగలుగుతాము, కొన్ని అవగాహన చేసుకోలేము. సాధారణంగా గానం వింటున్నప్పుడు ఉన్న స్థితిపై కూడా ఇది ఆధారపడి వుంటుంది. మంచి పరిస్థితిలో ఉన్నప్పుడు నువ్వు వింటున్నది బాగుంటుంది. మరొకప్పుడు అసౌకర్యంగా వుంటావు. అప్పుడది అంత బాగుండదు. కొన్ని సమయాల్లో గానం నిన్ను నిద్రమత్తులో ఉంచుతుంది; మరికొన్ని సమయాలలో ఆహ్లాదపరుస్తుంది. కొన్ని సమయాలలో క్రొంగొత్త లోకాలు నీకు తెరుచుకుంటున్నాయనే అనుభూతి కలుగుతుంది. మరికొన్ని

సమయాలలో నాకేమీ తెలియటం లేదంటావు — మొత్తం ఇదంతా నీవు ఉన్న పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ యన్. రాజేశ్వరి

శ్రీమాత సంగీతము

అమ్మా! మీరు ఆదివారాలలో పియానో వాయిస్తూ, ఆ సంగీతం ఏ సీమనుంచి రావల్సి ఉంటుందో ముందే నిర్ణయిస్తారా?

ప్రారంభించే ముందు ఏ సంగీత స్వరం పలికిస్తానో నాకే తెలియదు. సీమ అంటారా? అది ఎప్పుడూ ఒక్కటే. అందుచేతనే Berlioz సంగీత స్థానం గురించి కొంత అనుభవంతో మాట్లాడ గలుగుతాను. అది నాకు సుపరిచిత సీమయే. శ్రద్ధగా తరుచు దర్శించేదే. నాకు మాత్రం ముందుగా ఏమి వస్తుందో తెలియదు. తెల్లకాగితంగా ఉంటాను. వస్తాను; కూర్చుంటాను; ఏకాగ్రత వహిస్తాను; ఏమి వస్తుందో వేచిచూస్తాను. కొంతసేపటికి నాకు తెలుస్తుంది. ఎప్పుడూ కాదు — రెండో పర్యాయం — మధ్యాహ్నమో, సాయంకాలమో — విన్నప్పుడు తెలుస్తుంది. అప్పుడు అక్కడ నేను కర్తగా ఉండను. నా నుంచి విడివడి గమనిస్తాను. అప్పుడు అదేమిటో తెలుస్తుంది.

మీ సంగీతంలో తరుచు ఆవృతమయే స్వరప్రాధాన్యత .(the significance of the tune) ఏమిటి?

కొంత ఇబ్బంది గందరగోళం తర్వాత స్వరం (స్థిరపడి) వ్యక్తీకరింపబడుతుంది. ఇది నీవు గుర్తించే ఉంటావు. ఒక సమస్యకి పరిష్కారంవలె వస్తుంది. చైతన్యస్థాయిలో ఇదొక ముందడుగు; ప్రగతి; ఒక కాంతిప్రసారము. సాధనలో అంతరంగ పరివర్తనాలను పోలి ఉంటుంది నా సంగీతం. ఒక్కొక్కప్పుడు ఒకో విధంగా — ఒక కష్టం, ఒక సమస్య, ఒక దుష్ప్రవర్తన — అధిగ



The Mother, playing on the organ

... the inner music's hidden key
That guides unheard the surface cadences.

Sri Aurobindo
(*Savitri*, p. 194)

మింపబడినట్లుగా ఉంటుంది. బలంగా (ఆ సంగీతం) పునరావృత మౌతూ ఉంటుంది. పిమ్మట ఇందుకు సమాధానంగా చైతన్య ప్రకట ప్రస్ఫుటమౌతుంది.

ఈ సంగీతాన్ని అర్థం చేసుకోవటం కష్టం – ప్రధానంగా పాశ్చాత్యబుద్ధికి. సాధారణంగా పాశ్చాత్యులకు ఇలాంటివేమీ అర్థం కావు. ఈ భావాలు వారికి అంత సులువుగా పట్టుబడవు. భారతీయ రాగజ్ఞానం ఉన్నవాళ్లే ఆ సంగీతాన్ని మెచ్చుకోగలుగు తారు. ఇక్కడ రూపం, సంప్రదాయం, గుర్తులు (notations) – సంబంధించిన నియమాలు అంతగా పాటింపబడవు.

క్రీడస్థలంలో మీ సంగీతం వింటూ ధ్యానం చేసేటప్పుడు ఏమి చేయడానికి ప్రయత్నించాలి?

ఆ సంగీతం లోతైన భావాలను ప్రేరేపిస్తుంది. ఇదే దీని లక్ష్యము. ఇది వినటానికి వీలైనంత నిశ్చలంగా నిశ్శబ్దంగా ఉండాలి. ఈ నిశ్శబ్దంలో జీవునిలోని ఒక భాగము నిర్లిప్తమై సాక్షి భూతంగా ఉంటుంది. ఆ స్థితిలో సంగీతం నీ భావోద్వేగాలపై ఎలాంటి ప్రభావం కల్గిస్తుందో గమనిస్తావు. ఆ నిశ్చల నీరవ స్థితిలో పారవశ్యం (semi-trance) పొందుతే అది ఎంతో మేలైనది.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సంగీతము, కళలు, కవిత్వం – వీటికి మన పూర్వులు ఎంతటి విలువ ఇచ్చారో ఇప్పటివారికి బొత్తిగా తెలీదు. ఈ భూమిని మొత్తం అంతా కేవలం చీమలపుట్ట గానో, ఓ పెద్ద తేనె పుట్టగానో భావించే స్థాయికి మారిన యుగం ఇది.

శ్రీఅరవిందులు

సంగీతము – సాధన

ఈనాటి సంగీతము గానములలో పాల్గొన్న ఆశ్రమవాసులకు: ఈ పర్యాయం ఎంతో అభివృద్ధి ఉన్నట్లు శ్రీఅరవిందులు, నేను భావించాము. కేవలం దాని బాహ్యా కార్యనిర్వహణలోనే గాక, వెనుకనున్న ఉన్నత ఆదర్శం, ఏకాగ్రతలో, అంతరంగ వైఖరిలోను అభివృద్ధి గమనార్హం. మీ అందరికీ ఆశీస్సులు.

*

నాకు సంగీతం అంటే యిష్టం లేదన్న వదంతిని యెవరు వ్యాపింపచేస్తున్నారో నాకు తెలీదు. ఇది యెంత మాత్రం నిజం కాదు. నాకు సంగీతమంటే ఎంతో ఇష్టము. కాని ఇది వినేవారు ఐదారు గురుకి మించకూడదు. చిన్నసమావేశము అయితే బాగుంటుంది. చాలమంది శ్రోతలతో కూడిన పెద్ద గుంపు అయితే ఒక సామాజిక సమావేశమై మంచి వాతావరణం ఉండదు.

*

మీరు నిరంతరం సంగీతసాధన రచనా వ్యాసంగాలలో లీనమై ఉంటుండటం మంచిదే. ఎందుకంటే ఆ ప్రక్రియల్లో మీ స్వభావం, మీ అంతర్గత అనుభవమును గుర్తిస్తుంది. అది మీ ప్రాణిక శక్తిని పోషించి సమతూకంలో ఉంచుతుంది.

సాధన గురించి మిమ్ములనొకటి అడగదలుచుకున్నాను. మీరు సంగీతం ద్వారా (ఆధ్యాత్మిక) సాధన ఎందుకు చేయరు? సాధనకు ధ్యానం ఒక్కటే మార్గం కాదు. సంగీతం ద్వారా భక్తి, ఆకాంక్ష పెంపొందుతాయి. అవి మీ స్వభావానికి వాస్తవరూపాన్ని ఇస్తాయి. ధ్యానము, ఏకాగ్రత వాటంతట అవి వస్తే సరే – లేకపోతే వాటిని బలవంతంగా తీసుకురావల్సిన అవసరం లేదు.

మూలం: శ్రీమాత

అనువాదం: బి. నరసింహయ్య

ఉత్కృష్టనాదం

ప్రశ్న: నాదము కేవలం భౌతికప్రపంచ సంబంధమైనదా.. లేక ఇతర భూమికల్లోనూ ఉంటుందా?

అక్కడ కూడా ఉంటుంది.

ప్రశ్న: అదీ ఇక్కడ వంటిదేనా?

సకల అభివ్యక్త లోకాల్లోనూ నాదం తప్పక ఉన్నది. విన గలిగేవారి కది వినిపిస్తుంది. కొన్ని నాదాలు ఉన్నతోన్నత లోకాలకు సంబంధించినవి. నిజానికి వాటి నాదాలతో పోల్చుకుంటే మన ప్రపంచనాదాలు రణగొణ ధ్వనులు. ఉదాహరణకు కొన్ని సంగీత సామరస్య లోకాలున్నాయి. అక్కడ వినిపించేదీ ఈ లోక సంగీతానికి జన్మస్థానమే అయినా వాటితో పోలిస్తే భౌతిక ప్రాపంచిక సంగీతం అనాగరికం, ఆటవికంగా ఉంటుంది. అది విన్న వారికి ఈ లోకంలో ఎంతటి పరిపూర్ణ సంగీత ఉపకరణం ఉన్నా అందుకు సరిపోదు అనిపిస్తుంది. మనిషి తయారుచేసుకున్న వాద్యాలలో వయోలిన్ చాలా పవిత్రనాదం పలికిస్తుంది. అయినా కూడా ఆ సూక్ష్మ సామరస్య లోకాలలోని మధురనాదాలు కంటె ఇది చాలా అల్పమైనదే.

మానవ గాత్రము పరిపూర్ణ స్వచ్ఛత కలిగి ఉన్నప్పుడు దాని ముందు ఏ భౌతిక వాద్యసంగమమైనా చాలా అల్పంగా ఉంటుంది. అయినా దాని కాఠిన్యం, మొరటుతనం దానికి లేక పోలేదు. ఉన్నతసీమలో ఉన్నపుడు నిజమైన సంగీత మేమిటో తెలుస్తుంది. ఈ సీమలో (world of harmonies) ఉన్నపుడే సంగీతమంటే నిజమైన అవగాహన ఉంటుంది. పరిపూర్ణ స్పష్టత ఉంటుంది. నాదంతో భావం, స్వరవైవిధ్యం, సూక్ష్మ భేదాలు అవగాహన ఔతవి. ఇది భావాలకి, సంవేదనలకి అతీతమైన ఆత్మాశ్రయమైన స్థితి లోనే సాధ్యం. అత్యంత ప్రతిభావంతులైన సంగీతజ్ఞులు (కళాకారులు) ఈ స్థితిలోనే ఉంటారు. మనమున్న ఈ భౌతిక ప్రపంచము మొద్దుబారినది. ఒక వ్యంగ్యచిత్రం లాంటిది.

*

చైతన్యము ఎలా పని చేస్తుందో నాకు తెలుసు. పియానో వాయిం చాలన్నా, చిత్రలేఖనంలో అయినా హస్తాలు సచైతన్యం కావాలి. బుద్ధికి వశం కాకుండా హస్తాలు తమకు తాముగా జాగృతమవాలి. బుద్ధి ఎక్కడో ఉంటుంది. దానికి ప్రాధాన్యత ఉండదు.

*

ప్రశ్న: తప్పుగా అపరిపూర్ణంగా పనిచేయకుండా హస్తాలను చైతన్యవంతం కావించటం సాధ్యమా? దానికి మార్గమేమిటి దివ్యమాతా?

చిత్రకారులు, శిల్పులు, సంగీతవిద్వాంసుల (ప్రత్యేకంగా పియానో వాయించేవారి) హస్తాలు సాధారణంగా చైతన్యవంతంగా ఉంటాయి. అందుకే అవి నైపుణ్యంతో చలిస్తాయి. ఇది శిక్షణ మీద ఆధారపడి ఉంటుంది.

మూలం: శ్రీమాత
అనువాదం: టి. కోటేశ్వరరావు

అన్ని కళారూపాలలోకీ సంగీతమే శ్రేష్ఠమైనదా!

మీరు ప్రతిపాదించిన అంశం – కవిత్వం కంటె సంగీతం ఉన్నత శ్రేణిది – అనే దాని గురించి ఏం చెప్పాలో నాకు తెలియదు. ఎందుచేతనంటే నా సంగీత ప్రశంస రూపరహితము, అవ్యక్తము. అయితే పద్యకావ్యము విషయానికి వస్తే సాధికారంగా సులువుగా వ్రాయగలను. అయినా రెండు కళారూపాల మధ్య కొలమానము అవసరమా? దేని గొప్ప దానిదే. దేని పద్ధతిలో అది దివ్యానంద అభిరుచుల అవధులను స్పృశింపచేయగలదు. సంగీతం దాని సారంలో నిస్సంశయంగా అనంతానికి అత్యంత సన్నిహితంగా తీసుకుపోగలదు. ఎందుచేతనంటే సంగీతము పూర్తిగా రోదసీ

వాహికమైన శబ్దాన్ని ఆలంబనం చేసుకొని ఉంటుంది. (మరో చివర పదార్థంలో బంధితమైనప్పటికి, వాస్తు శిల్పకళ కూడా కొంతవరకు ఇదే రకమై అనుభూతిని కలుగ చేయగలదు.) కాని చిత్రలేఖనము, శిల్పకళలు రెండూ బాహ్యాదృశ్య రూపాల నధిగ మించి రససిద్ధి కలుగచేస్తాయి. పద్యకావ్యము సంగీతం మాదిరి నాదప్రధానమై పరవశింప చేయలేకపోయినప్పటికీ, బహుతంత్రీ నాద సామరస్యాన్ని పదగుంభనలతో కూడిన కవిత్వంతో నాద జ్ఞానాన్ని అందించగలదు. ప్రకాశవంతమైన వర్ణరూపాల సుస్పష్ట స్ఫురణలను విస్తరింప చేస్తుంది. ఆ విధంగా ఇది మిగతా అన్ని కళారూపాల శక్తినీ సునిశితంగా తనలో మలుచుకొంటుంది. ఇలాటి దివ్యరూపాల మధ్య తరతమ భేదాలను ఎవరు నిర్ణయించగలరు?

నేనిలా చెప్పటం నీక్కొంచెము ఆశాభంగం కలిగించవచ్చు. దేవతల మధ్య (కళారూపాలకి) పోటీ పరీక్ష పెట్టి తారతమ్యాలు తూచ తలుచుకోలేదు. ఇదేమి భావన! శిఖరాగ్రలలో ఎవరి స్థానం వారికి ఉంది. వారి మధ్య పోటీలు పెట్టే ఆవశ్యకత ఏమున్నది? గతంలో పారిస్ (ట్రోజను వీరుడు) ఇచ్చిన తీర్పు వంటిది, నాపై ఆపాదిద్దామనుకుంటున్నావా? వీరుడు పారిస్, ట్రోజా పట్టణం చివరికి ఏమైనాయి? సంగీతాన్ని సామ్రాజ్ఞిని చేసి మిగిలిన కళా దేవతలను కించపర్చమంటావా?

అందరూ మెచ్చే సంగీతం గురించి నీ అంచనాలు సరి కాదు. ఏదో ఒక రణగొణ సంగీతం అందరికీ నచ్చవచ్చు. కానీ అసలైన మంచి సంగీతానికి సర్వత్రా ఆమోదం లభిస్తుందా? కళ విషయం తీసుకున్నా గూడా ఎక్కువమంది థియేటర్లకు వెళ్లా లనుకుంటారు, లేదంటే కథల పుస్తకాలు చదువుకుంటారుగానీ, పాట కచేరీలకు వెళ్లటాని కిష్టపడరు. అట్లాంటప్పుడు సంగీతం సర్వశ్రేష్ఠమని ఎలా చెప్పగలము? కొత్త కొత్తగా విడుదలయే నవలలు చదవటానికి ఇష్టపడినట్లుగా జనాలు మహాగ్రంథాలు చదవటానికి ఇష్టపడరు కదా! ప్రఖ్యాత విద్వాంసుల వాద్యసంగీ తాలు ఎంతమందికి నచ్చుతున్నాయి? తేలికగా అన్ని చోట్లా వినబడే సంగీతమే ఎక్కువమంది ఇష్టపడతారు. అదే దేవతల

రాజ్యంలో అయితే ఘనమైన విషయాలు మెప్పును పొందుతాయి. కానీ జంతువులు, మానవులు ఉన్న ఈ లోకంలో చవకబారు విషయాలే జనరంజకమవుతాయి. ఇకపోతే నీవు చెప్పిన రెండోది; వ్యతిరేక ధోరణిలో కూడా ప్రమాదాలు లేకపోలేదు. అతి తక్కువ మెప్పును పొందుతూ ఏమీ అర్థం కాకుండా ఉండే కళాఖండాలే అత్యుత్తమ కళారూపాలవుతాయి. అంటే త్రికోణాలు, చతురస్రాలు వగైరాలతో కనిపించే ఆధునిక చిత్రకళ (Modern art) గీసే చిత్ర కారులు అత్యున్నతస్థాయి కళాకారులని ఒప్పుకోవలసి వస్తుంది. ఇక వారికి దీటుగా, తాము తప్ప మరెవరూ చదవలేనివి చది వినా అర్థం చేసుకోలేని కవితలు రాసే ఆధునిక కవులను గురించి చెప్పవలసి వస్తుంది. అటువంటి కవితలను ఆ కవి మిత్రబృందం చదువుకోవలసిందే.

సూటిగా నచ్చేది, మెచ్చేది అని నీవు అన్నదే అసలు నిజము. అలా మెచ్చుకోటానికి అందులోని కళాత్మక మర్మాలు తెలుసుకోవాల్సిన పని లేదు. దాని మీద నిర్ణయాత్మక తీర్పు ఇవ్వాలంటేనే ఆ విధంగా కళాత్మక మర్మాలు తెలుసుకోవాలి. సంగీతం, చిత్రలేఖనం విషయాలను అలా నిర్ణయించటం చాలా కష్టం. సంగీతం సూటిగా అంతఃకరణను స్పృశిస్తుంది కాబట్టి పరిమితమైన జ్ఞానంతో దాన్ని అంచనా వేయాల్సిన అవసరం లేదు. కానీ చిత్రలేఖనాన్నీ, శిల్పాన్నీ, వాటికి మించి కవిత్వాన్ని అర్థం చేసుకోటానికి కొంత మనస్సు, ఆలోచనా అవసరమే అవు తాయి. ఈ విధంగా సూటిగా మెప్పుదల పొందేవి చెప్పాలంటే మొట్టమొదట సంగీతం, తర్వాత వాస్తుకళ, చిత్రలేఖనం వస్తాయి. కావ్యం మాత్రం చివరకే వస్తుంది. 'హౌస్మన్' అనే ఆయన చక్కని చిక్కని కవిత్వం అంటూ ఆవాకులు, చవాకులూ నింపి, అదే సూటిగా తగులుతుంది అంటారు. అది అంతఃకరణకి కాకుండా ఉదరభారమే ఔతుందేమో! ఈ విధంగా చూస్తే ప్రపం చంలో ఎక్కడా స్వచ్ఛమైన కవిత్వమే కనిపించదు. ఉన్న కొద్ది పాటిది కూడా కలగాపులగంగా ఉంటుంది; హోమియోపతి మోతాదులో మందు ఉన్నట్లు. వివేకవంతమైన అర్థం సూక్ష్మంగా

ఉంటుంది. ఆయన చెప్పినట్లు సూటిగా హత్తుకుంటుంది కాబట్టి ఇది ప్రశస్తమైనదని ఒప్పుకుంటే చిక్కుల్లో పడడం ఖాయం. ఎందుకంటే ఆధునిక చిత్రకళను (modern art) సంగీతం మాది రిగా ఒక పద్ధతిలో వేస్తున్నారు. (రాగంలో భావం ఇమిడి ఉన్నట్లు) వారు వస్తువును చిత్రించకుండా దాని వెనకాల భావాన్ని చిత్రి స్తున్నారు. అది కూడా రేఖలు, రంగులు ఉపయోగించి జామిత్రీ రూపాలను చిత్రిస్తున్నారు. అవి వస్తు ఆకృతిని పోలకుండా కేవలం అన్వర్థకాలను ప్రతిబింబిస్తాయి. ఉదాహరణకు వారు నీ ముఖచిత్రాన్ని వేయాలనుకుంటే మొదట ఒక గడియారాన్ని, దాని చుట్టూ మూడు త్రిభుజాలను వాటి కింద అల్లకల్లోలంగా సమాంతర చతుర్భుజాలనూ, ఇంకా కిందుగా కాళ్లకి బదులుగా కేస్టర్ చక్రాలను (టేబుల్ కాళ్లకు అమర్చే చక్రాలు) వేస్తారు. ఈ బ్రహ్మాండమైన చిత్రానికి ఫలానావాని ముఖచిత్రం అని పెద్దగా కనబడేటట్లు రాస్తారు. అలా సూటిగా ఆకట్టుకొనే చిత్రం చూసి నీ ఆత్మ ఉరకలువేస్తూ ఆ వస్తువుల వెనకాల ఉన్న సత్యాన్ని అంటే నీ భౌతికశరీరానికి ఆవలనున్న అసలు రూపాన్ని తెలుసు కుంటుంది. ఇంకేం! అదే నీ చైత్యపురుషుడని, లేదా ఆత్మ లేదా ప్రాణికసత్త అనుకుంటూ అభినందిస్తావు. అలా చేయవేమో గూడా! అదే మార్గంలో, అదే పద్ధతిలో కవిత్వం కూడా పయని స్తున్నట్లుగా ఉంది. అంటే మనస్సుకు దూరంగా జీవితపు లోతు లలోకి వెళ్లి చెప్పాలనుకోవడం; వక్రభాష్యం చెప్పేవారైతే మూఢ త్వంతో, వికారంతో సత్యసౌందర్యాలను ఆవిష్కరించడమే నంటారు. దాన్నిబట్టి నీకు అర్థమవుతుందనుకుంటాను. సూటిగా, తేలిగ్గా ఏ వికారాలు లేకుండా సంగీతం కలుగచేసే ప్రభావాన్ని కవిత్వం, చిత్రలేఖనాలు కలిగించాలనుకొని వికారాలు పోవటం తెలుస్తోంది కదా! పైగా అది వాటి ఉనికికే విరుద్ధం కాబట్టి అలా చేయటం నిరర్థకమే అవుతుంది. దీనిని బట్టి సూటిగా హృదయానికి హత్తుకునే సంగీతమే ఉత్కృష్టమైన కళ అనే, నీ సిద్ధాంతం ఋజువైనట్లేనా? కాకపోవచ్చు, కావచ్చు. జైనులు చెప్పి నట్లు 'స్యాద్ వా నాశ్యాద్ వా'.

ఏదీ ఇదమిద్ధంగా తేల్చకుండా చాలా చెప్పాను కదా... ఇదంతా కూడా నన్ను ఇరుకున పెట్టే నీ ప్రయత్నం నుంచి నిన్ను తప్పించటానికే.

*

...పోనీ మనం ఈ విధంగా అనుకుంటే సరిపోతుంది. ఈ గొప్ప గొప్ప కళారీతులన్నీ దేనికవే మనలను ఆకట్టుకుంటాయి. దేని పరిధిలో అది ఇతర వాటికంటే మహత్తరమైనది." సరేనా!

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

విద్యలో సంగీతం ప్రాముఖ్యత

ప్లేటో తన రిపబ్లిక్ గ్రంథంలో, విద్యావిధానంలో సంగీత ప్రాధాన్యతను అసాధారణమైన రీతిలో నొక్కి చెప్పాడు. ప్రజలు ఏ సంగీతానికి అలవాటు పడతారో అదే వారి సహజ వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తుంది అన్నాడు. శిల్పానికి, చిత్రకళలకు ఉన్న ప్రాధాన్యత కూడా అంత తక్కువేమీ కాదు. తాను దర్శించిన దానితో మనసు గాఢంగా ప్రభావితమౌతుంది. నేత్రం చిన్నప్పటి నుంచీ ఏకాగ్రతను, లయాత్మక సౌందర్యాలను ఆకళింపు చేసుకోవడానికి, చిత్రలేఖనలు, వాటి రంగుల్లోని పొందిక, కూర్పు, వాటి వెనుక ఉన్న అభిరుచులు, అలవాట్లు, వ్యక్తి గ్రహించే శిక్షణ పొంది వుంటే, పెద్ద అయాక కూడా జీవితంలో సూక్ష్మంగా అమరి వున్న సౌందర్య, సమరస సూత్రాన్ని అనుసరించగలిగే అలవాటు కలిగి ఉంటాడు.

ఉన్నతమైన కళ లేక సౌందర్య అధ్యయనాలు, భావావేశాలపై ఇంచుమించు ఇదే రకమైన ఫలితాన్ని కలుగజేస్తాయి. మనం సహృదయత, చిత్తశుద్ధి గురించి చెప్పుకుంటున్నాము. అరిస్టాటిల్ ఇదే కవిత్వానికి అత్యావశ్యక కర్తవ్యం అని చెప్పాడు. కవిత్వంలో ఈ చిత్తశుద్ధి, భావావేశ సౌందర్యవాదంలో నిర్వచించే

అక్షరసాలకు చెందియున్న నిరాసక్త, విముక్త ఆనందాస్వాదనం వలన కలుగుతుంది. ఈ అక్షరసాలు మానవస్వభావంలోని నిమ్న స్థాయి స్వార్థపూరిత కోర్కెల అలజడిలో చిందరవందర కాబడిన జీవితాన్ని రసాత్మకంగా పరిపుష్టం చేస్తాయి.

చిత్రలేఖనం, శిల్పకళలు వాటి విభిన్న కార్యసాధనాలలో ఒకే దిశలో పనిచేస్తాయి. కవిత్వం మాదిరిగా కొన్ని సమయాల్లో చిత్రకళ కూడ ఒకే రకపు సాధనాసంపత్తినే వినియోగించుకొంటున్నా కవిత్వస్థాయిలో మాత్రం అది పనిచేయలేదు. ఎందుకంటే కవిత్వాన్నికున్న చలనాత్మక ప్రవృత్తి చిత్రకళకు ఉండదు. ఇది ఒకే అంశానికి పరిమితమై, సుస్థిరమైపోతుంది. దీనికి అందిన దాన్ని రంగుల్లో వ్యక్తపరచి ఆగిపోతుంది. ఇవ్వబడిన ఆ క్షణం, ఆ ఆవరణను దాటి స్వేచ్ఛగా కాల, ప్రదేశాల కనుగుణంగా పరివర్తన చెందలేదు. పోతే, చిత్రకళకున్న ఈ నిశ్చలత, ఈ ప్రశాంతత, సుస్థిరతలు; దీని కంటూ ఒక విలక్షణమైన విలువను సంతరించి పెడతాయి. కవిత్వం భావావేశాన్ని ఉద్దీపన జేసి వాటి వాటి మధ్య అంతర్నిహితంగా ఉన్న ఆనందశోభను వెలికి తీస్తుంది. చిత్రకళ ఈ భావావేశాలను శాంతపరచి, అదుపు చేసి పరిమిత సంతృప్తిలో వున్న సంతోషాన్ని గూర్చి ప్రబోధిస్తుంది – నిజంగా ఇది గ్రీకుల స్వాభావిక లక్షణం. కవిత్వం కంటే చిత్రకళలోనే ఎంతో ప్రాచీనతను సంతరించుకొన్న చిత్రకారుల దేశం ఇది. ఆ కళాత్మకతను వారి కవిత్వంలోకి తెచ్చే ప్రయత్నం చేసారు వాళ్లు. అయితే సంగీతం భావస్పందనల లోతుల్లోకి పోయి వాటిల్లో పరస్పర సమన్వయాన్నీ, పొందికను తెస్తుంది. సంగీతం, చిత్రకళ, కవిత్వాలు ఆత్మకు పరిపూర్ణ విద్యను గరుపుతాయి. అవి ఆత్మాశ్రయ చర్యలను శుద్ధపరచి నియంత్రించి, వాటిల్లో గంభీరతను, లయబద్ధతను కలుగజేస్తాయి. కాబట్టి వ్యక్తిత్వాన్ని నిర్మించేకంటే, ఇంద్రియ విషయవాంఛల కోసం దిగజారిస్తే, జాతి భ్రష్ఠమౌతుంది. సక్రమంగా వినియోగింపబడితే మాత్రం సభ్యమైన, విద్యా, ఆధ్యాత్మిక వికాసాన్ని కూర్చే గొప్ప శక్తులివి.

సంగీత, శిల్ప, చిత్రకళల్లో దాగివున్న బ్రహ్మాండమైన మనో వికాసశక్తి సరిగ్గా గుర్తింపబడలేదు. ఈ కళ లనేవి మానవ మేధస్సుకి అప్రధానమైనవి – అందమైనవి, ఆసక్తికరమైనవే అయినా – అవి కొద్దిమందికే పరిమితం అని భావింపబడుతున్నది. సౌందర్యాస్వాదన, రాగ, ధ్వనుల ఆకర్షణ, చిత్రవిచిత్ర ఆకృతులను దర్శిస్తూ మమేకం కావటం – ఇవి మానవ మేధస్సుకి ప్రధానమైన నిరంతర వ్యాపకాలు. ఇవి విశ్వజనీన ప్రేరణలు. ఏ కొద్ది మందికో పరిమితమైనవనే భావన అవివేకమైనది.

కాని స్వయం శుద్ధత, తగు శిక్షణ లోపించిన ఈ స్పందన జీవితానికి కావలసిన సక్రమ విధానాన్ని, కళాత్మకమైన ఆనందాన్ని, చక్కని భావోద్వేగాన్ని, అటు వ్యక్తిత్వంలో, భౌద్ధికంగా కూడ – ఏది ఉన్నతోమో, శ్రేష్ఠమో దాన్ని గ్రహించి ఆ వైపుగా మనిషి పురోగమించడానికి సశక్తమైన విధానంతో సహకరించడానికి బదులు క్షుద్రమైన, అల్ప, వికృత, అసభ్య, హేయ, ఇంద్రియ జన్యవికారాల్లో వెచ్చింపబడుతుంది. మానవస్వభావంలోని నిమ్న స్థాయి జనితమైన వ్యర్థ, హానికర ఆనందాన్ని ప్రశంశించడు. లేదా ప్రోత్సహించడం తగదు. మానవుల్లోని అధికసంఖ్యాకుల కళాత్మక సుస్పందనలకిది విరుద్ధం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: సిహెచ్. హర్షవర్ధన్

సంగీతం అనేది మనను నియంత్రించే క్రమశిక్షణే కాదు – మనను మంచి మార్గంలోకి మళ్ళించే సతీమణి కూడా. సంగీతం

ప్రజలలో ఉద్రేకం తగ్గిస్తుంది. సరళ స్వభావం, నైతికప్రవర్తన, సహేతుకమైన ఆలోచనా అందిస్తుంది.

– లూథర్

సంగీత ప్రావీణ్యం, సంస్కృతి

ఆ వ్యాఖ్య లేమిటో నేను చూడలేదు. సంగీతంలో ప్రావీణ్యం సంపాదించడానికి, సర్వ సాధారణమైన సంస్కృతికి సంబంధం వుందని నేను భావించను. అటువంటి సంస్కృతితో సంబంధం లేకుండా బహుమతిగా లభించేది సంగీతం. ఇరువురు వ్యక్తులకు సంగీతం దైవదత్తమైన బహుమతిగా లభించినప్పుడు, సంస్కృతీ సుసంపన్నుడు రెండవవానికన్న సంగీతంలో ప్రావీణ్యం సంపాదిస్తాడనే రూలు ఏదీ లేదు. ఆ మాట కొస్తే ఏ కళలో కూడా అటువంటిది నిజం కాకపోవచ్చు. మరేదైనా కారణం కావచ్చు. సంస్కృతి అందించే ఒక ప్రాశస్త్యం, ఒక మలుపు సంగీత ప్రావీణ్యంలో ఉండవచ్చు. ఆ కోణంలో అది నిజం కావచ్చు, ఉదాహరణకు షేక్ స్పియర్ కవిత్వం తీసుకొందాం. జీవితం పట్ల బహుముఖాలుగా, సజీవంగా ప్రతిస్పందించిన ప్రజ్ఞానిధి యొక్క కవిత్వం అది. జీవితంలోని సకల సంఘటనలపై బహుళరీతులుగా పండించుకున్న పరిజ్ఞానం నుండి ఆ రచయిత కవిత జాలువారింది. అతను జీవిత పురోగమన పథంలో ఏరి కూర్చిన జ్ఞాన సంపద అది.

మిల్టన్‌కు తన అధ్యయన, పాండితీప్రకర్షల నుండి కవితా దీప్తి లభించింది. సంస్కృతి కారణంగా వారికి ప్రజ్ఞాప్రాభవం, ప్రావీణ్యం రాలేదు. మిల్టన్ కవీశ్వరునిలో ఒక మలుపు, తేజస్సు, వికాసం ఉన్నాయి. మరో విధంగా అవి వచ్చాయని భావించలేము. ఆ వైభవ తేజోనివహం షేక్‌స్పియర్‌లో లేదు. అది (సంస్కృతి) ఒకరికి మించి ఒకరికి కవితా ప్రావీణ్యంలో ఆధిక్యతను ఇవ్వలేదు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: యజ్ఞన్న

గీతానికి పద్యానికి ఉన్న తేడా

గీతాన్ని ఒక రకమైన పద్యమనడానికి వీల్లేదు. ఎందుకంటే గీతం తప్పనిసరిగా పద్యమై ఉండాల్సిన అవసరం లేదు గనుక. ఏ విధంగా చూచినా పద్యాలు కానివి మనోహర గీతాలెన్నో ఉన్నాయి. యూరప్‌లో గొప్ప పాటలను నృత్య సంగీత రూపకాలకు గీతాలను, పదాలను కూర్చేవారు కవుల కోవలోనికి రారు. అయితే ఆసియాలో మటుకు గీతాలకు, కవితా లక్షణాలను మేళవించటం సర్వసమాన్యం. ప్రాచీన, గ్రీకు దేశంలో సంగీతబాణీలకు అనుగుణంగా గేయకవితను (lyric poetry) రచించేవారు. ఈ సంగీతంలో సమ్మేళనం సాధ్యమయినా గీతమూ, పద్యమూ భిన్నమైన సాహిత్య కళాస్వరూపాలు, ఎందుకంటే వాటి ధ్యేయమూ, లక్షణమూ మౌలికసిద్ధాంతాలు వేరు గనుక.

ఆలోచనామృతమైనది పద్యమూ, అపాత మధురమైనది గీతమూ కావటం మాత్రమే ఈ తేడాకు కారణం కాదు. పద్యం కవి స్పష్టంగా అభివ్యక్తీకరించిన భావపరంపర ద్వారా మన హృదయాన్ని స్పృశిస్తుంది. గేయం సంగీతంతో సంగమం చెంది శబ్ద ప్రతీకల ద్వారా శ్రోతల హృదయతంత్రులను మీటుతుంది. ఒక పద్యంలోని భావాలూ, శబ్దాలూ నీ మేధస్సుకు నచ్చినంత మాత్రం చేత అది నీ హృదయాన్ని కదిలించినట్టు కాదు. అటువంటిదాన్ని నిజమైన పద్య కవిత్వంగా భావించడానికి వీలు లేదు. సంగీతానుభూతిని కలిగించటమే నిజమైన పద్య కవితలోని ప్రధాన లక్షణం. సంగీతంలో వుండే లయ మరోవిధంగా కవిత్వంలో ఉంటుంది. ఈ లయాన్వితమైన గమనమే శబ్దాల ద్వారా కవిత్వంలో మరో శక్తి ఉత్పన్నమవడానికి తోడ్పడుతుంది. శబ్దాలకు తమకు తాముగా ఈ శక్తిని సంపూర్ణంగా వ్యక్తం చేసే సామర్థ్యం లేదు. ఈ శక్తి వాటి కూర్పులో 'లయ' ద్వారా సంక్రమిస్తుంది. మరో విధంగా అవే శబ్దాలను కూర్పు చేస్తే వాటిలోని 'లయ' దూరమై మనల్ని కదలించి కరిగించే శక్తిని పోగొట్టుకుంటాయి. ఈ లయాన్వితమైన గమన లక్షణమే కవిత్వంలోని

అంతర్లక్షణము. శబ్దాల కూర్పులోని గమనం ద్వారా సాధింపబడే కవిత్వంలో స్ఫురణ అనే లక్షణం చోటు చేసుకుంటుంది. దీనిని కవితాత్మ అనవచ్చు. దీనిని దర్శనం, మానసికానందం, రసానుభూతి, ఆనందం, ఆత్మానుభూతి అని కూడా అనవచ్చు. (ఇది కేవలం ఒక భావమో, అభిప్రాయమో మాత్రమే కాదు) ఈ స్పందన మళ్ళీ మళ్ళీ కలిగిస్తే అది కవిత్వం లేకపోతే కాదు. స్పందన కల్గించే లక్షణం వుంటేనే పద్యంలో కవిత్వ లక్షణం వున్నట్లు లేకపోతే లేదు.

*

గీతానికి, పద్యానికీ ఉన్న ముఖ్యమైన తేడా ఒకటే. గీతం సంగీతంలో స్వరపరచడానికి ఉద్దేశింపబడగా, పద్యం తన లయాన్వితమైన గమనంచేత, ఆ గమనంలోని శుభగత్వంచేత, మాధుర్యం చేత కావలసిన ఫలితాన్ని సాధించడానికి రచింపబడింది. గీతంలో ఉండే లయకూ, పద్యంలో లయాత్మకతకు, గమనానికీ తేడా ఉంది. పద్యంలో ఈ లక్షణాలుంటేగానీ పద్యాన్ని సంగీతయుక్తంగా గానం చేయడానికిగానీ, స్వరపరచడానికిగానీ పనికిరాదు. మిగిలిన కవితా ప్రక్రియలకంటే గేయకవిత్వం సంగీతంలో స్వరపరచేందుకు అనువుగా వుంటుంది. సర్వ సాధారణంగా ఒక గీతం ఒక భావాన్ని, అనుభూతిని, వీలైనంత తేటగా, సూటిగా వ్యక్తం చేయటంలో తృప్తిపడుతుంది. ఈ కారణం వలన ఆ గీతంలోని అవ్యక్త మాధుర్యాన్ని వ్యక్తం చేయటం సంగీతం పని. అయినా ఈ నియమం అన్ని సందర్భాల్లోనూ పాటింపబడక గీతంలోని ప్రతి మాటా తనకు సహజంగా వుండవలసిన ప్రాముఖ్యం కంటే ఎక్కువ ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటున్నది.

లయాత్మకతా — గమనమూ

లయ అనేది కవితాభివ్యక్తికి అవసరమైన అంశాల్లో ప్రముఖమైనది. ఎందుకంటే భావ విన్యాసం లయాత్మకమైన, శబ్దగమనం మీద ఆధారపడి వుంటుంది. మేధస్సు వ్యక్తం చేయలేని భావాన్ని వ్యక్తం చేయడానికిగానీ, విపులీకరించడానికిగానీ, దాని తీవ్రతను

యినుమడింప జేయడానికిగానీ, కవి భావాన్ని పూరించడానికిగానీ, వాచ్యం చెయ్యని విషయాన్ని స్ఫురింపజేయడానికిగానీ, చాలా సందర్భాల్లో సంగీతంలోని మాధురీ మహిమను ఆశ్రయించటం తప్పనిసరి అవుతుంది.

ఇది కేవలం ఒక సాంకేతమైన అంశం మాత్రమే. ఆశించిన ఫలితాన్ని రాబట్టుకోడానికి ఒక విధమైన భౌతిక సాధనం మాత్రమే. ఇది సిద్ధించేది కేవలం కళాకౌశలం వలనగానీ, భౌతిక మైన శ్రవణం వలనగానీ, కాదు. అంతరంగపు లోతుల్లో దాగి వున్న అవ్యక్త మధుర లహరులను, అనంతమైన శృతిలయల విన్యాసాలను వ్యక్తం చేసే ప్రయత్నం వలన మాత్రమే ఇది సాధ్యమవుతుంది. ఇక్కడ మేధస్సు శ్రమించి, సాధించేదిగానీ, కవియొక్క సౌందర్యోపాసనా దృక్పథంగానీ అక్కరకు రావు. అనుభూతి అంతరంగపు లోతుల నుంచి తన్నుకుని పైకొచ్చేం దుకు చేసే ప్రయత్నం వలన తప్ప ఇది మరో విధంగా సాధ్యం కాదు. మనకెంత సంగీత కళాకౌశలమున్నా, మాధుర్య స్వర సమ్మేళనను సృజించేది అనిర్వచనీయమైన ఆత్మశక్తి చాలనం మాత్రమే. దీని ఫలితంగా సిద్ధించేది శబ్దాశ్రయమైన సంగీతం ద్వారా సాధింపబడే శబ్దాతీత సంగీత మాధుర్యమే. ఎందుకంటే శబ్దాశ్రయ సంగీతం గాఢమైన మేధాతీత ఆత్మానుభావం వలన ప్రాభవాన్ని సంతరించుకున్నప్పుడు మాత్రమే, ఆత్మానుభూతి వలన సంక్రమించే శక్తి వలన మాత్రమే అది సాధింపబడుతుంది. ఈ ఉత్తమ మాధుర్య కక్ష్యల్లోని లయాత్మకతలో ఆధ్యాత్మికత నిక్షిప్తమై వుంటుంది. కొన్ని సందర్భాల్లో ఆ కక్ష్యలలో ఆధ్యాత్మి కత ఆ లయాన్విత గమనంలోనికి చెంగలించి కలిసి, కరగి పోతుంది.

కవితలోని లయాత్మకత ఇంతటి శక్తివంతమైనది గనుకనే దాని నుంచి అభివ్యక్తి అనంతమైన రీతుల్లో ప్రభవిస్తున్నది. కవి తకు లయాత్మకత ఆధారభూతమైనా దానిని బహిరమైన అలం కారంగా ధరించక, తనలో అంతర్భాగంగా ఐక్యం చేసుకుంటుంది. లయాత్మకతకు అతీతమైన, ఉదాత్త సంగీత జలధిలో తేలుతూనే

కవిత ఒక వైపు సంగీతంలోని మాధుర్యపు లోతులను పూర్తిగా వ్యక్తం చేస్తూ మరో వైపు దాని సంభావ్యతను అధిగమిస్తుంది.

దీని ద్వారా మంత్రమయమైన సంగీతం మన శ్రోతస్సుల కందుతుంది. ఇది మన భౌతిక ఇంద్రియాల అపరిపూర్ణతల మీద ఆత్మశక్తి సాధించి విజయంగా నిలుస్తుంది. ఉపనిషత్తులు వర్ణించిన శ్రోతస్సుల శ్రోతస్సు దీనికి శ్రోత. నిత్యవ్యవహారంలో మార్పులకు లోనవుతూ సంభాషణ స్వరూపంలో వెలువడే వాక్కుల వెనుక. దార్శనిక భావమయ కక్ష్యలో మార్పుచెందని వాక్కు వర్తిస్తున్నది. కనిపించి వినిపించే దీనిని వేదాలు '*దృశ్యా తే(శూయ తే పివా*' అని వర్ణించాయి. శాశ్వతమైన, అనాహతమైన స్వయంవ్యక్తమైన మాధురీమయమైన వాక్కంటే ఇదే.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: ధారా రాధాకృష్ణ మూర్తి

యోగజీవితానికి, సంగీతం సాధనం కావచ్చునా?

శాస్త్రవిజ్ఞానము, వేదాంతము ఆధ్యాత్మికం కానట్లుగానే కళ, కవిత్వం, సంగీతం ఆధ్యాత్మికాలు కావు. మనస్సు, ఆత్మల తేడాను ఆధునిక బుద్ధిజీవులు తెలుసుకోలేరు. మానసిక, నైతికమైన, సుందర భావనా చేతనలను, ఆధ్యాత్మిక విషయాలుగా పొరబడుతుంటారు. కవియొక్క మానసికశక్తి, ఆలోచనలు నిజమైన లేక రూఢి అయిన, ఆధ్యాత్మికానుభూతికి దూరంగా ఉంటాయి. అవి నీలినీడలేగాని, సత్యప్రకాశ కిరణాలు మాత్రం కావు. ఆధ్యాత్మిక శిఖరాల నుంచి చూచినపుడు మానసిక ఉన్నతకి క్రిందనుంచి పైకి యెగబ్రాకే బాహ్యాజీవనానికి – పెద్ద వ్యత్యాసం కనపడదు. ఇవన్నీ దివ్యశక్తియొక్క ప్రచ్ఛన్న దృశ్యాలు, లీలలు, తాత్కాలిక చైతన్యకాంతులు. ఆత్మను గురించిన వేదాంత వివరణ, మానసిక సిద్ధాంతమే కాని, ఆధ్యాత్మిక అనుభూతి కాదు. మనస్సును కప్పి

ఉన్న తెర వైదొలగినపుడు దైవస్పర్శ పెనుమార్పుగా అంతరాంత రాల్లో తీసుకువచ్చి, సమత, ప్రశాంతతలను ప్రవేశపెడుతుంది. అపుడు ఉన్నత పర్వతశిఖరాగ్రం మీద నుంచుని విశాలత, సర్వ వ్యాపకత్వం దర్శించ గలుగుతాడు మానవుడు. మనస్సు ఆధ్యా త్మికతలో కలిసిపోతుంది. అనంతాన్ని చూడగలుగుతుంది. ఒక కాళికాదేవి గుడి ముందర నుంచుని మనమేం చూస్తాం? ఒక మనోహర శిల్పవిశేషాన్ని. తర్వాత అన్నిటికీ మించి ఊహించని ఒక సాక్షాత్కారం, ఏదో దివ్యశక్తి నీ కళ్లలోకి చూచే ముఖవైఖరి! ఇలాంటి స్పర్శలే సంగీతం, చిత్రకళ, కవిత్వం ద్వారా వాటి స్రష్ట లకు కూడా అనుభావ్యం కావచ్చు. సృష్టి అంతా దివ్యలీలా విలాసమే కదా! అందున్న సర్వరూపాలు కిటికీలు తెరచి అంత ర్నిహిత సత్యాన్ని చూపవచ్చు. ఇది ఆరంభం మాత్రమే. కాని యేదో ఒకనాడు యాత్రికునిలా ప్రయాణం ముందుకు సాగించి, ఈ అనుభూతిని నిజం చేసి చిరస్థాయిగా స్థాపించే యత్నానికి సాధకుడు తన్ను తాను నియమించుకోవాలి. ఇందుకు జీవితంలో తారసపడే, అనేక రూపాలను, క్రియలను నియోగించుకోవచ్చు. ఒక పుష్పం, ప్రార్థన, సత్కర్మ భగవదర్పణం చేసుకున్నట్లుగానే, కళాకారుడు తాను సృష్టించిన సుందర చిత్రాన్ని, గేయాన్ని, కవి తను, మధుర సంగీతాన్ని భగవన్నైవేద్యంగా అర్పించవచ్చు; దివ్యా నుభూతి పొందవచ్చు. దివ్య చైతన్య లీలలో కదిలి వృద్ధి పొంది నపుడు కళారూపాల సృష్టి ద్వారా యోగసిద్ధి అసాధ్యం కాదు. వీటికీ యోగంలో సముచిత స్థానం ఉంది. సాధారణంగా ఈ కళలు, మానసిక, ప్రాణికస్థాయి చేతనలలోనే విలువలు సంతరిం చుకుంటాయి. ఆధ్యాత్మికస్థాయిని అందుకోలేకపోవచ్చు. కాని వీటినీ యోగజీవనంలో ఒక భాగంగా మలుచుకోవచ్చు. వినియో గించుకొనే చైతన్యస్థాయిని బట్టి విలువ ఉంటుంది. అవశ్యంగా కావల్సినది ఒక్కటే. అది దివ్యసత్యచేతనలో మనుగడ సదా సాగించడం.

నీవు గానాన్ని గురించి వ్రాసింది అక్షరాలా నిజం. అంత రాంతరాల్లోంచి, నీవు దేన్నీ లెఖ్ఖ చేయకుండా పాడినపుడు నీ

లోని ఉన్నతమైన సంగీతం వెలువడుతుంది. నిన్ను నీవు మర్చి పోయి పాడాలి. బాహ్యసంగీత కళాకారుడు మరుగుపడిపోతాడు. అపుడే అంతర సంగీత కళాకారుడు బయటపడి, తన నిజమైన ఉనికిని వెలుపలికి తీసుకువస్తాడు. నీ గానాన్ని గురించి చెప్పా లంటే సంగీతంలో అది నీ నూతన సృష్టి అని నేననడం లేదు. లేదా దాని అందాన్ని దృష్టిలో పెట్టుకునీ కాదు. కానీ ఆధ్యాత్మిక మార్పు గురించి. నీలో ఉన్న లోతైన స్థానం నించీ బయలు వెడలి నపుడు అది అంతటి ఉన్నతస్థానాన్నీ చేరుకోగలుగుతుంది.

నువు సంగీతాన్ని మానెయ్యవలసిన అవసరం లేదు. నే ననేదేమిటంటే అంతరంగ మార్పును, అవసరాన్ని గుర్తెరిగి, గానం చేయాలి. సభ కోసం, ఓటమీ, గెలుపుల కోసం కాదు. వీటిని అధిగమించి గానం చేయగలగాలి. అంతర్గత మార్పే అన్నింటి కంటే ముఖ్యం. అదే దైవానికీ నిన్ను దగ్గర చేరుస్తుంది. తాదా త్మ్యంతో పాడగలగడమే నీ ఆశయం, లక్ష్యం కావాలి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: విమలాదేవి

సావిత్రిలోని మంత్రచరణాలు

పరిపూర్ణ హృదయ భావనా స్వర్గధామంలో నిమ్నరాగాలేవీ ఆ
అంతులేని ఆమె (జీవితం) వినిర్మల మాధుర్యాల మనోజ్ఞ
త్వాన్ని విచ్ఛిన్నం చేయలేకపోయాయి.
అద్భుత పరిమిళాలలో, విచిత్ర కిరణాలలో దృశ్యాన్ని దైవీకృతం
చేసే రూపాలు సాక్షాత్కరించాయి.
మనసును అమృతమయం చేసి, గుండెకు
అనంతలా పరివ్యాప్తం చేసే
సంగీత రసధునులు రవళించాయి.
నిగూఢ శ్రవణేంద్రియాన్ని తట్టి లేపే
అశ్రుత గాంధర్వ గానలహరులు ప్రవహించాయి...

బాహ్యశబ్దాలకు సుదూరమైన మానస శ్రవణేంద్రియం
అమర వాగ్వైభవ బీజాక్షరాలను ఆలకించింది.
అఖిల లోకాలను సృజించిన శ్రుతిలయలు వినిపించాయి.
సృష్టి సకల వస్తురాశిలో
అశరీర సంకల్పాన్ని బంధించింది.

*

అశ్రుత నాదాల గుసగుసలు హృదయం చుట్టూ చేరాయి.
లోనికి అడుగుపెట్ట లేకపోయాయి.
మానవాళికి తెలియని అజ్ఞేయం,
సరిక్రొత్త జన్మ పొందాలని వ్యర్థంగా చేసే ప్రయత్నం,
ఎవరూ చవి చూడలేని మధురిమ,
ఎప్పటికీ కానరాని అతిలోక సౌందర్యం
ఒక మంత్రగీతంగా పొంగింది.
మన మర్త్య శ్రవణేంద్రియాలకు వినిపించని
విశాల విశ్వలయాన్విత స్వరాలు
దివ్యగాన ఝురిగా పులకించగా,
మన సంకుచిత జీవనవలయాలకు
అనంతార్ణవమంతగా ద్రవీభూతం చేస్తూ,
పరిమిత మానవ రూపాన్ని అనంతానికి శ్రుతి చేస్తూ
ఈ భువి పై రాగ సుధాస్పందనలను
ఆ విశ్వగాన వియత్తరిణిగా మార్చాలని జీవితం పరిశ్రమిస్తుంది...

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: యజ్ఞన్న

కళ — శాస్త్ర విజ్ఞానము

కేవలం శాస్త్రీయవిజ్ఞానం ఆలోచనల్ని సునిసితం చేయవచ్చు. ప్రతీ దానిని సూక్ష్మంగా పరిశీలించనూవచ్చు. అయితే అది అంతా కొంత పరిమితి వరకు మాత్రమే సాధ్యం. ఆ విజ్ఞానం సంకుచిత మైనది. అంతే కాదు. పరమ కఠినమైదీ; మానవత్వాన్ని మరుగున పెట్టేదీ కూడాను.

మేధోసంపదతో అభివృద్ధి సాధించిన మానవుడు శాస్త్రవిజ్ఞానంలో గొప్పవాడే కావచ్చు. ప్రకృతిని స్థూలంగాను, సూక్ష్మంగాను పరిశీలించడంలో మహాపండితుడే అయి ఉండవచ్చు. అంతే కాక మొత్తం ఈ భూగోళాన్నే తన పాదపీఠంగా ఉపయోగించుకొనవచ్చుగాక! ఇలా ఎన్నిటినైనా చేయవచ్చునేమో కాని, హృదయపరంగా చూస్తే మాత్రం అభివృద్ధి శూన్యం. ఆత్మచైతన్యం మృగ్యం. క్షుద్రమైన శక్తులను ఉపయోగించుకుంటూ నీచమైన అసుర లక్షణాలతో జంతువులా జీవించగలిగేలా మాత్రమే తయారౌతాడు.

శ్రీఅరవిందులు

దివ్యానందం

మన మీద సంగీతం ప్రభావం ఎంత ఉందో లౌకికమైన మాటలలో వ్యక్తం చేయగలవారు ఎవరైనా ఉన్నారా? లోతులు తెలియని పైపై మాటలతో మనల్ని అనిర్వచనీయమైన ఆ సామ్రాజ్యపు అంచుల వరకు మాత్రమే తీసుకు వెళ్లగలవేమో! దానితో కొన్ని క్షణాలైనా ఆనందచ్ఛాయలను అనుభూతి చెందగలమేమో!

కార్లైల్

నిత్యజీవితంలో ఆత్మకు సోకే ధూళిని సంగీతం పూర్తిగా కడిగేస్తుంది.

ఆయర్ బాచ్

*

ఆత్మోన్నతిని కలిగిస్తుంది సంగీతం. — అడిసన్

కళ లన్నిటిలోకి స్వచ్ఛరూపమైనది సంగీతమే. కాబట్టి అది అందాన్ని వెంటనే వ్యక్తీకరించగలుగుతుంది.

రవీంద్రనాద్ ఠాగూర్

*

మొత్తం మీద పరిశీలిస్తే సంగీతం, చిత్రకళ, కవిత్వం – ఈ మూడూ సరియైన ఆత్మజ్ఞానాన్ని కలిగించేవి. అవి స్వచ్ఛమైన స్వీయ నియంత్రణతోను, సమంజసమైన సామరస్యంతోను ఆత్మ చైతన్యాన్ని కలిగిస్తాయి. కాబట్టి వీటి అభివృద్ధి పట్ల ఏ రకంగానూ అశ్రద్ధ వహించకూడదు. కేవలం శ్రవణానందం కోసమో, నేత్రానందం కోసమో, వీటి స్థాయిని తగ్గించకూడదు. తగ్గించామా – ఆత్మోన్నతి బదులు ఆత్మ పతనానికి దారితీస్తాయి. ఈ మూడింటిని సక్రమంగా ఉపయోగించుకుంటే సంస్కృతికి గొప్ప విజ్ఞానాన్ని, దానితోపాటు ఉదాత్త భావాలను కలిగించే శక్తులుగా రూపొందగలవు.

శ్రీఅరవిందులు

అనువాదం: పున్నమరాజు నాగేశ్వర రావు

సమాచార పత్రం

మార్చి 29 న శ్రీఅరవిందులతో శ్రీమాత ప్రప్రథమ సమవేశదినము (1914) పాటించబడినది.

ఏప్రిల్ 4 న శ్రీఅరవిందులు పాండిచేరి ఆగమన దినముగా (1910) పాటించబడినది.

24 ఏప్రిల్, దర్శన దినముగా (1920) పాటించబడినది. నాటి నుంచి పాండిచేరి శ్రీమాతకు స్థిరనివాసమైనది.

డా॥ యం.వి నడ్కర్ణిగారు 'సావిత్రి' అధ్యయన శిబిరాన్ని 23 ఫిబ్రవరి నుంచి మార్చి 5 వరకు నిర్వహించారు. 'సావిత్రి' బుక్ I సమీక్షించి, బుక్ II లో మొదటి అధ్యాయాన్ని సవివరంగా విశదీకరించారు.

డా॥ నడ్కర్ణిగారి 'సావిత్రి' ప్రసంగాల ఆడియో సి.డి శట్లు Splendour నుంచి ఆసక్తిగలవారు కొనుగోలు చేసుకోవచ్చు. కావల్సిన వారు – Splendour, 16 Goubert Avenue, Pondicherry - 605 001 వారిని సంప్రదించండి.

జూలై 7, 8 మరియు 9 తేదీలలో శ్రీఅరవింద సొసైటీ, బెంగుళూరు వారు యువజనులకు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తు న్నారు. ఇందుకు ప్రవేశరుసుము లేదు. ఆసక్తిగలవారు Sri M.M. Bhattacharjee, Co-ordinator (Youth Camp), Sri Aurobindo Society, Sri Aurobindo Bhavan, 110, Gangadhara Chetty Road, Bangalore - 560 042. Phones (080) 25559 885/25298684 వారిని సంప్రదించగలరు.

Sri Aurobdindo Complex Trust, Sri Aurobindo Marg, J.P. Nagar, I Phase, Bangalore - 560 078. Phone (080) 26349882 వారు, 'అధిమానస ఆవిష్కరణ' 50 వ వార్షికోత్సవం (స్వర్ణ జయంతి) రెండు రోజులు 'Sanathana Dharma and Sri Aurobindo's Vision of a Divine Life on Earth' అన్న అంశంపై గోష్ఠి నిర్వహిస్తున్నారు. తేదీలు ప్రకటితం చేయలేదు. శ్రీఅరవిందుల ఆధ్యాత్మికత, దార్శినకతలలో నిష్ణాతులైన పండితులు, విద్యార్థులు ఇంగ్లీషులో వ్యాసములు సమర్పించమని ఆహ్వానిస్తున్నారు. ఎన్నిక కాబడిన వ్యాసకర్తలకు పురస్కారము ఉంటుంది. అవి ప్రచురింప బడగలవు కూడా. ఆసక్తికలవారు పైన పేర్కొన్న Trust వారిని సంప్రదించగలరు.

తిరుపతి బ్రాంచివారు తే 21-2-2006 ది ని శ్రీమాత 128 వ జయంతిగాను, ఫిబ్రవరి 28 ని అధిమానస ఆవిష్కరణ స్వర్ణో త్సవ దినముగ శ్రద్ధ, భక్తులతో జరుపుకొన్నారు.

3/6/06

June 06: Rs. 15



జీవనవేదము

ఒక సరళ సుందరమైన కార్యక్రమము

అఖిల భారత పత్రిక, జూన్ 2006

జీవనవేదము

ఒక సరళ సుందరమైన కార్యక్రమము

నిరాడంబరంగా ఉండు

ఉల్లాసంగా ఉండు

ప్రశాంతంగా ఉండు

చేసే కార్యము ఏదైనా శక్తివంచన లేకుండా చెయ్యి.

ఎల్లవేళలా నా స్మృతిలో ఉండు

ఇంతకు మించి నీ నుంచి నేనేమీ అపేక్షించను.

శ్రీమాత

విషయసూచిక

నిరాడంబరంగా ఉండు

హాయిగా ఉండు

నిశ్చలంగా ఉండు

పనిలో ప్రాధాన్యత

నీ (లో) ద్వారాలు శ్రీమాతకై తెరచి ఉంచు

స్వచ్ఛత – సారళ్యతల అవసర స్పృహ కూడా సత్య స్పందనమే. అదీ లోలోపలి మార్గదర్శనం ద్వారానే వస్తుంది. అంతర్గత దివ్యాంశ – ఏది లోతుల్లో మనః ప్రాణ శరీరాంతర్గతంగా వున్నదో – అది – పైకి పొడుచుకొని వస్తుంది. దానితో కాని, నీలోని మార్గదర్శకునీ ఆధ్యాత్మిక పరిణామాన్ని కల్పించే శక్తినీ – గుర్తించలేవు. ఈ సరళత ఎలా కలుగుతుంది? – అంటే నీవు మానసిక వికారాలను, వాంఛా వలయాలను ఛేదించుకోగలిగినపుడు – స్వచ్ఛత లభిస్తుంది. ఆ కోరికల ప్రేరణలు నిన్ను ఒక చోట నిలువనీయవు. వాని నుండి విడివడిపోవటం ద్వారానే నీవా మహాసత్య – ప్రకాశాల కున్ముఖంగా పోగలవు. అప్పుడే నీ సర్వజీవితాన్నీ అవి ఆవరించి నడిపిస్తాయి.

శ్రీఅరవిందులు

అందమైన జీవనానికి
అమ్మ అందించిన అయిదు సూత్రాలు

క్రమబద్ధమైన జీవితము ఇహపరసాధనము. ప్రాణికోటిలో మానవుడు సర్వోత్కృష్ట జీవి. కాని మన మెలాంటి జీవితం జీవిస్తున్నాము? ఆలోచిస్తే ఆశ్చర్యమే కలుగుతుంది. యాంత్రికమైన గానుగెద్దు జీవనంతో నిరర్థకంగా బ్రతుకుతున్నాము.

లోచూపుతో అంతరంగసాక్షిగ బ్రతికే బ్రతుకే ఉత్కృష్టమైనది, ఉన్నతమైనది. సమున్నత చేతనాభూమికల నధిరోహింప చేయగలిగేది; నేటి మధ్యంతర మానవుని రేపటి ఉన్నతమానవునిగా పరిణమింప చేసేది. శ్రీమాతారవిందుల అవతార లక్ష్యము – "ఈ పృథ్వీజీవితము దివ్యజీవితమ్ముగ మారిపోవును" – అన్న వారి భవిష్యదర్శనమును సాకారం చేసేది. వారి దివ్య సందేశానికి అనుగుణంగా దివ్యజీవన సాధకులుగా లోకకళ్యాణానికి తోడ్పడటం మన అందరి కర్తవ్యం.

ఇందుకు ప్రాథమికంగా శ్రీమాత పంచసూత్రప్రణాళిక నొకటి మనకి ప్రసాదించారు. సారళ్యత, సంతృప్తి (ఆనందం) నిశ్చలత, పనిలో పరిపూర్ణత, మనుగడలో సంతత శ్రీమాతారవింద స్పృహ – ఇవీ పరమపద సోపానాలు. శ్రీమాత మనకు అనుగ్రహించిన జీవనవేదం. ఇందులో ఎక్కడా సంక్లిష్టత లేదు. మంత్రం లేదు.. తంత్రం అంతకన్నా లేదు. ఆచరణయోగ్యమై, స్వభావ పరిణామశీలమై జీవితానికి అర్థం పరమార్థం చేకూర్చేది. అమ్మ మాట బంగారు బాట. జీవనసారాన్ని బిడ్డలకు, అలా అలవోకగా అందించారు. తల్లికాక మరెవరు అలా అందించకలరు! ఎన్నటికీ అమ్మ అమ్మే! బమ్మెర పోతనామాత్యుని మాటలలో
"అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల పెద్దమ్మ సురారులమ్మ కడుపాఱడి పుచ్చిన యమ్మ తన్నులో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి యమ్మ...
.... మా యమ్మ...."

– సంపాదకుడు

నిరాడంబరత

పరమోన్నత సరళస్వభావమే ఆధ్యాత్మికత.

*

సామరశ్య వ్యక్తీకరణకు, అన్నిటికంటె శ్రేష్ఠమైనది, సారళ్యత

*

పుష్పం వికసించి సౌందర్య పరిమళాలు వెదజల్లే ప్రయత్నంలో హడావుడి హంగామా ఉంటుందా! అదీ నిరాడంబరత అంటే. అభివ్యక్తీకరణ అంటే అలా సహజ సుందరంగా ఉండాలి. అలాటి సహజత్వంలో (in this simplicity) నిర్మలమైన గొప్పశక్తి ఉంది. అందు ఏ రకమైన హానికర ప్రతిచర్యలు ఉండవు. ప్రాణికశక్తి నమ్మదగినది కాదు; తప్పు త్రోవ పట్టిస్తుంది; తన వలలో వేసుకో ప్రయత్నిస్తుంది; సద్యోఫలితాల ఎర చూపిస్తుంది. ఎంతో బాగా పనిచేయాలనే ఆతురతలో ప్రాణికశక్తి నడిపించినట్లు నడుచుకుంటూ ఉంటాం. కాని ఇది పనిని వక్రమార్గం పట్టిస్తుంది. భ్రమ, నాశనము – వీటికిది చోటు కల్పిస్తుంది.

సారళ్యత ఎంత స్వచ్ఛమైనది! ఎంత సుందరమైనది!

*

యోగమార్గానికి ఈ ఖచ్చితమైన సహజత్వం అత్యంత అభిలషనీయము. ఎందుచేతనంటే ఇది గాఢవాంఛా పరిపూతమైనది కాదు; భ్రమకి తావుండదు; అద్భుతాలు సాధిద్దామనే ఉబలాటం ఉండదు. యోగపురోగతికి ఈ అవరోధాలు ఏవీ ఉండవు.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

పరిపూర్ణ నిరాడంబరతను ఎలా సాధించగలం?

నేను వ్రాసినది, మీరు చదవమన్నదే ఇప్పుడు చదువుతాను. ఈ సూక్తులకు బహుశా విశ్లేషణ అవసరమనుకుంటాను.

"దివ్యత్వం కలిగి ఉండాలంటే మనం అత్యంత సహజంగా ఉండాలి."

సహజత్వం ఎలా కలుగుతుంది?

"సహజంగా ఉండాలంటె పరిపూర్ణమైన నిరాడంబరత కలిగి ఉండాలి."

సంపూర్ణ నిరాడంబరతను సాధించడం ఎలా?

"సంపూర్ణమైన నిరాడంబరతకి మొక్కవోని నిజాయితీ ఉండాలి."

పరిపూర్ణమైన నిజాయితీతో ఉండడమంటే అర్థమేమిటి?

"సంపూర్ణమైన నిజాయితీతో ఉండడమంటె, అస్తిత్వంలో ఏ రకమైన విభజన, వ్యతిరేకతలు లేకుండా ఉండటం."

మీరు వేర్వేరు పరస్పర విరుద్ధభావాల సంగమమైనపుడు, మీలో వేర్పాటు ధోరణి అనివార్యంగా చోటు చేసుకుంటుంది. ఉదాహరణకి మీలోని ఒక భాగం దివ్యజీవనం ఆకాంక్షిస్తుంది. మరో భాగం కోర్కెలకు, భవబంధాలకు ఆలవాలంగా ఉంటుంది. ఒక భాగం దైవానికి, దైవేచ్ఛకి, పరిపూర్ణంగా లోబడి ఉండాలనుకుంటుంది. దైవానుగ్రహం లేకపోతే ఏమీ చేయలేమని, దైవానుగ్రహం వల్లనే సర్వము సిద్ధించగలదని, అసలు తన ఉనికియే దైవంతో ముడివడి ఉన్నదనుకుంటుంది. ఈ అనుభవం ఆత్మార్పణ మార్గంలో అనుకూలమైనది. ఇందుకు భిన్నమైన మీలోని మరొక ప్రవృత్తి 'అహం' తో గింజుకుపోతుంది. మరి ఈ అహమే అంతా పాడు చేసేది.

ఇవేమీ అసాధారణ విషయాలు కానే కావు. ఈ రకమైన పరస్పర విరుద్ధమైన ప్రవృత్తులుకల వారి నెందరి గురించో నేను చెప్పగలను. అందుకే ఇక్కడ చిత్తశుద్ధి గురించి జాగ్రత్త వహిం

చాలి. ప్రక్కదారి పట్టించే నీ స్వభావం గురించి జాగ్రత్త వహించాలి. చంటిపిల్లవానిని బుజ్జగించినట్లుగా బోధపరచి, స్వభావంలోని కేంద్రబిందువుతో సామరశ్యత సాధించి, వక్రమార్గం పట్టకుండా జాగ్రత్త వహించాలి. ఇది చిత్తశుద్ధి చేసే పని. మరి ఇది అనివార్యమైనది కదా!

నీలోని పరస్పర విరుద్ధమైన స్వభావాల సామరశ్యత, సమన్వయము, ఐక్యత సాధించబడినపుడు, నీ జీవనము, సరళసుందరమై చేసే పనులు కూడా సక్రమంగా ఏకోన్ముఖంగా ఉంటాయి. స్వతస్సిద్ధమైన నీ సహజ స్వభావ కేంద్రానికి మొత్తం అంతా సమన్వయం కాబడి రాణిస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

సంక్లిష్టత అసంక్లిష్టతకి ప్రేరణ

సృష్టిలో ఒక దృక్పథం ఉంది. అది నవీనమైనదే కావచ్చు. కల్లోలం, అస్తవ్యస్తం విభ్రాంతుల నుండి, సామరస్యతాలోపం, గందరగోళాల నుండి తప్పించుకొనే అవసరాన్ని అది కలుగజేస్తుంది. ఈ భ్రమలు, అస్తవ్యస్తతలన్ని వీలున్నంతవరకు ప్రతిదానిలోను ఏర్పడి ఒక రకమైన అలజడిని, నిష్ప్రయోజనాన్ని, వ్యర్థప్రయాసను మిగిల్చిపోతాయి.

మంచిదే.... ఈ అవ్యవస్థ పరిస్థితి, కల్లోలం కూడా నిజమైన, స్వచ్ఛమైన నిరాడంబరత రూపొందేందుకు ప్రేరణ ఔతుంది.

ఈ రకమైన కలగాపులగత్వం రూపాంతరీకరించబడాలి. సరళ సుందరంగా మారాలి.

ప్రకృతి తన ఆత్మ వ్యక్తీకరణ ప్రయత్నంలో అత్యంత మౌలికమైన 'సాధారణత్వాన్ని' పునః స్థాపించుకోవటం కోసం నమ్మశక్యమేగాని ఊహించలేని క్లిష్టపరిస్థితుల్ని రూపుమాపడం కోసం తనకు తాను బద్ధురాలు కావాలి.

ఇలా మితిమీరిపోయిన క్లిష్టపరిస్థితి నుండే ఎప్పటికి క్షయమవ్వని దివ్యసామరశ్యత ఉద్భవించే అవకాశం ఉంది. ఈ గందరగోళ పరిస్థితికి మరి ఇదే ప్రయోజనం. ఇదంతా జరగడంలో ముఖ్యోద్దేశం... ఒకే దివ్యావస్థని, సహజత్వాన్ని, సమస్తంలో ఉన్న ఏకత్వాన్ని వెలికితీసే ప్రయత్నం చేయడం కోసమే.

ఒకప్పుడు ఇది వేగిరమౌతున్నప్పుడు సందేహం కలుగవచ్చు. అయితే ఆకాంక్ష తీవ్రంగా, ప్రభావోత్పాదకంగా ఉన్నప్పుడు జటిలమైనదాన్ని సాధారణంగానూ, క్రూరత్వాన్ని ప్రేమగాను రూపాంతరీకరించవచ్చు.

అయ్యో! అది అలా ఉందేమిటి? ఇది ఇలా ఎందుకు జరుగుతుంది? ఇలాటి అసంతృప్తి ధోరణివల్ల ఉపయోగం లేదు. అది అలా ఉండి ఉండకపోతే బాగుండేది అనుకుని లాభం లేదు. ఎలా ఉండాలో తెలుసుకోవాలి. అందుకు తగిన రీతిగా ప్రవర్తించాలి అంతే! That's all

మూలం: శ్రీమాత

అనువాదం: హార్షవర్ధన్

సమగ్రమైన నిరాడంబరత

పరిపూర్ణమైన అంతఃకరణశుద్ధి ఫలితంగా నిరాడంబరత సమగ్రమవుతుంది.

*

శ్రీఅరవిందాశ్రమంలో చైతన్యవంతమైన ప్రశాంతత పాదుకొని ఉండటం ఎవరైనా గమనించవచ్చు. ముఖ్యంగా బయటనుంచి వచ్చే పర్యాటకులకు వేరే లోకంలో ప్రవేశించిన భ్రమ కలుగుతుంది. కొంతవరకూ అది నిజమే. ఈ లోకంలో ఆంతరంగిక ప్రవృత్తే బాహ్యాజీవితాన్ని నడిపిస్తుంది. ఇక్కడ ఎవరి కోసం వారు కాకుండా ఒక ఆదర్శ సాధన కోసమే అందరం పనిచేస్తాము. మేము గడిపేది కేవలం సుఖసంతోషాలకై ప్రాకులాడి బలహీన

పడే సాధారణ జీవితమూ కాదు; సర్వసంగపరిత్యాగం చేసే ఆశ్రమజీవితమూ కాదు. ఆ రెండింటికీ అతీతంగా ఉండే వైవిధ్యమైన నిరాడంబరత మాది. వివిధములైన వృత్తి విశేషాలూ, అనేక విధాలైన కార్యకలాపాలు, వివిధమైన అభిరుచులు, ప్రవృత్తులు, స్వభావాలు, ఒకటేమిటి, ఎవరికి నచ్చిన జీవిత విధానాన్ని వారు ఏర్పరుచుకోవచ్చు. క్రమశిక్షణ కూడా మరీ ఎక్కువ వుండదు. ఇతరుల ఉనికికి భంగం కాకుండా, యోగసాధనకు ప్రతిబంధకం కాకుండా ఉండటానికి ఏ క్రమశిక్షణ కావాలో అంతవరకూ పాటిస్తాము.

*

ప్రశ్న: మధుమయీ మాతా! నా కొక్కొక్కసారి నేను చేసే ఇతర కార్యకలాపాలన్నీ వదిలేసి మొత్తం కాలమంతా పనిచేస్తూ గడపాలని అనిపిస్తుంది. నా ఆటపాటలూ, చదువూ మొదలైనవన్నీ ఒదిలేయాలనిపిస్తుంది.

దీనికి కారణం దైహిక ప్రవృత్తికుండే ఒక రకమైన తామసిక వైఖరే. క్లిష్టపరిస్థితులను ఎదుర్కోటానికి కావలసిన స్థైర్యాన్ని, దృఢత్వాన్ని సమీకరించుకొనే ప్రయత్నం చేయటానికి బద్ధకించి జీవితాన్ని సూక్ష్మీకరించుకోవాలనుకుంటున్నావు. నువ్వు సమగ్రమైన వ్యక్తిగత పురోగతిని సాధించాలనుకుంటే మాత్రం ఇలా జీవితాన్ని సూక్ష్మీకరించుకోవాలనుకోవద్దు.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. వెంకటరామశాస్త్రి, డా॥ ఎ. ప్రభావతి

ఆత్మానుభూతికి ప్రమాణాలు దేనికి?

ఆధ్యాత్మిక జీవితమంటే సన్యాసజీవితమనీ, శరీరావసరానికి అనుచితమైనవానిని పరిత్యజించటమనీ – అంతా అంగీకరించిన సత్యమే. ఇది జీవితం నుండి ఉపసంహారించుకొనే ఆధ్యాత్మిక జీవితావసరం. కానీ, ఆత్మోన్ముఖ ప్రయాణాని కత్యవసరమైనది కేవలం సరళత – క్లుప్తత. మిగిలినదంతా భౌతిక – వాంఛామయ స్వరూపం. కానీ, విశాలదృష్టితో పరికిస్తే ఇది మనస్సు కల్పించే ప్రమాణం. అది అజ్ఞానం మీద ఆధారపడినది. దీనికి ప్రేరణ కోరికలు. అజ్ఞాన విచ్ఛేదం. అహంకార నిర్మూలనం సర్వాన్ని త్యజించటం – కోరికలనే కాదు – అన్నిటినీ. ఇలాంటివన్ని మనఃకల్పిత ప్రమాణాలే. వాంఛల నతిక్రమించిన చేతన కివన్నీ అనవసరం. ఎందుకంటె, ఆత్మసంయమనం. పవిత్రత – పరిశుభ్ర తలు దాని బీజంలోని స్వభావాలు. ఇవి ఐశ్వర్యంలోనూ – పేద రికంలోనూ ఉండవచ్చు. దేనిలోనైనా అపవిత్రత, పరిశుద్ధత విధ్వంసము కావటానిక కవకాశ ముంది కనుక. అది నిజమూ కాదు – సంపూర్ణమూ కాదు. విజ్ఞానజీవితానికి ప్రధానాధార సూత్రం. ఆత్మస్వయం వ్యక్తీకృతి. దైవసంకల్పం. ఇదీ, ఆ ఆత్మా భివ్యక్తి కేవలం సరళ క్లుప్తజీవితం ద్వారానే వ్యక్తీకరించబడ తాయి లేదా సంక్లిష్ట – ఐశ్వర్య వైభవం ద్వారా కానీ వ్యక్తం కావచ్చు లేదా సహజ సమన్వయం ద్వారా కానీ, కావచ్చు. ఎందుకంటె సౌందర్య వైభవాలు, వస్తుగర్భంలో దాగిన మాధు ర్యం, హాస్యం; జీవిత సంతుష్టి – సూర్యుని వెలుగూ; ఆత్మశక్తి యొక్క వ్యక్తీకృతులే. సర్వతోముఖంగా వస్తుగతంగా అభివ్యాప్త మైన చైతన్యమే ప్రకృతిగత న్యాయసూత్రమై జీవిత పరిణామ పరిధినీ, పరిసరాల విస్తృతినీ నిశ్చయిస్తుంది. అన్నిటిలోనూ నిండి నిబిడీకృతమైన అదే – కరుణార్ద్ర సహజ – అకృత్రిమ సూత్రం తొణికిసలాడుతుంది. నీరస ప్రమాణాలు కూడా మనస్సు కల్పించే వస్తువుల ఏర్పాటుకు అవసరమైనా – ఆధ్యాత్మిక జీవనసూత్రం మాత్రం కాదు. చైతనవ్యక్తీకృతిలో స్వేచ్ఛావైవిధ్యము లుంటాయి.

వాటి కాధారంగా ఏకత్వమూ అభివ్యక్తమౌతుంది. కానీ సర్వే సర్వత్రా సమతా – ఋతము లేదా యధాతధ్యత లుండి తీరుతాయి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

II హాయిగా ఉండు:

ఆనందమార్గాన సాగిపో

కొత్త వెలుగు మీలోకి నింపుకొని నూతన కాంతిమార్గంలో ఆనందంతో ముందుకి అడుగువేయండి.

*

ఆత్మ సహజ స్వభావం శాశ్వత, నిశ్చల, దివ్యానందం.

*

ఆనందంగా ఉండే ప్రయత్నం చేస్తే, వెంటనే దివ్యతేజస్సుకు చేరువవుతావు.

*

ఆనందంగా ఉండేందుకు కావలసిన లక్షణాలు పట్టుదల, విశ్వాసం... ఇంకా ప్రతి చిన్నదానికీ నీరుకారిపోకుండా ఉండే ప్రసన్న సుందర స్వభావం. దేనికీ మనసు చిన్నబుచ్చుకోకుండా, చిరునవ్వుతో ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొనగలగాలి. దీనినే ఇంగ్లీషులో cheerfulness అంటారు. ఇది మీలో ఉంటే, ప్రగతికి అవరోధాలుగా వచ్చే ఎన్నో దుష్ప్రభావాలని తేలిగ్గా పక్కకి నెట్టగలుగుతారు.

*

ఆనందంగా ఉండాలంటే ఇంకో విషయం గుర్తుంచుకోవాలి. చీటికీ మాటికీ గునుస్తూ ఉండకూడదు. ఈ సణుగుడు స్వభావం, మీ ఉత్సాహాన్ని దిగజార్చే ఎన్నో శక్తులని స్వాగతీకరిస్తుంది.

ఎప్పుడూ చిరునవ్వుతో ఉండండి. నేనెప్పుడూ చలోక్తులు విసురుతూ ఉంటాను. కాని అవి నవ్వడం కోసమే కాదు. అది నాలోని ఛిత్‌శక్తి వ్యక్తమయ్యే తీరు – నాలోని ఆత్మవిశ్వాసానికి గుర్తు. చక్కని చిరునవ్వు మన ఆత్మస్థైర్యానికి గుర్తుగా, దివ్యత్వానికి ఏదీ అడ్డు నిలువలేదనీ, తుది విజయం దివ్యత్వానిదేనని చాటుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: బి. వరలక్ష్మి

అంతరంగ వైభవం

హాస్యము, ఆనంద వైభవపు స్వయంచాలక పార్శ్వము. నిరంతర మందస్మిత వదనారవింద వికసిత భావ విస్తృతియే హాస్యవిభావరి; ఆనందము, హాస్యము కలివిడిగ కలసియాడు లాస్యవిన్యాసములు. హాస్యము. ఎట్టి మానసిక, భౌతికతొందరలకు గురి చేయని, హానికరమైన అనుభవములను కల్పించని ప్రకాశ చైతన్య పూర్ణతల స్వయంచాలక అంతర్గతస్థితిలో సంలీనమై యున్నది. సమత సాఫల్యతపై సర్వేశ్వరుని అనుగ్రహ సంకేతమైన ఆమోద ముద్ర దాని నిర్దిష్టత. అది విశ్వవనవాటికలో ఆనంతబాలకుని బాలక్రీడలాడు శ్రీకృష్ణుని ప్రతిరూపముగ మనలోని అంతర్యామిగ చరించుచున్నది.

*

చమత్కారం సృష్టి మనుగడ మర్మం. ఆ చమత్కారం అదృశ్యమైనచో ఇప్పటికే ఎంతగనో గాడితప్పిన విశ్వతుల్యశక్తి మఱింతగ దిగజారి అస్తవ్యస్తమై ఏనాడో మసియై పోయి ఉండెడిది.

*

యోగి, సాధనలో ఎల్ల వేళలా గంభీరవదనము దాల్చి, మౌన ముద్ర ధరించి ఉండవలసిన ఆవశ్యకత లేదు. అయితే యోగమునకు నిశ్శబ్దత, ఆంతరంగ సమత్వముల అగత్యమున్నది. యోగ

సాధనలో నిరంతరము బాహ్యాభిముఖుడై చరించకూడదు. అలా గని, విషణ్ణుడై యుండవలెనని గానీ కాదు.

*

ప్రసన్న మాధురీ సంభూత భావనలు పురోగమించు గాత. ఏలన అవి ఆత్మ యొక్క దృఢసంకేతములుగా చైత్యపురుషని మేల్కొలిపి మనల వెన్నంటి యుండును. త్రికరణముల తప్పటడుగులు నిన్ను కలత పెట్టకుండు గాక. బహిర్లగ్నమైన ఏదో ఒక వస్తువుగ, వాటిని నీ కత్యంత దూరముగ నుంచుము... నీ దరికి జేరనీకుము. నీ ఆత్మ తదనుగుణ మహోన్నత సత్యాలు తోడుగా ఆవిష్కరించుకొనే వాటికే ఒడంబడి యుండుము.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అన్నవరం ఆదిశేషయ్య

సంతోషంగా ఉండడం ఎలా?

శాశ్వతమైన సంతోషానికి ఏకైక మార్గం దైవానుగ్రహం పట్ల సంపూర్ణమైన సమగ్ర విశ్వాసం ఉండటమే.

*

సంతోషంగా, శాంతంగా ఉండడానికి అత్యుత్తమ మార్గం దైవం పట్ల నిరంతర అపార, సమగ్ర కృతజ్ఞతాభావాన్ని నీ లోలోతులలో అనుభూతి చెందడమే.

*

నీ సంకల్పాల్లో నిరాశ దరి రానీయకు. ఆశను ఆహ్వానించు.

*

ఎల్లప్పుడు మనం మంచి పనినే చేద్దాం. దాని వల్ల మనం నిరంతరం ప్రశాంతంగాను, సంతోషంగాను వుండగలుగుతాము.

*

పవిత్రమైన నిష్కామమైన ప్రేమ ప్రసాదించేటంతటి ఆనందాన్ని మరేదీ ఇవ్వలేదనుట వాస్తవం.

నిజమైన ఆనందానికి మూలము దైవము. అది పవిత్రమైనది, స్వతంత్రమైనది. సాధారణ సుఖానికి ప్రాణశక్తి మూలము. అది అపవిత్రమైనది, పరిస్థితులపై ఆధారపడి ఉండేది. హృదయంలో ఈశ్వరానుభూతితో పోల్చదగిన మహదానందం ఎక్కడ ఉంటుంది?

మూలం: శ్రీమాత

అనువాదం: బి. నరసింహయ్య

స్వచ్ఛమైన ఆనందం తెలుసుకో

మానవ మాధవుల సమాగమనగా, మానవునిలో దివ్యాంశ చొరబడుట అని, దివ్యత్వములో మానవుడు తనకు తాను విలీనమగుట అని సదా భావించాలి.

కాని ఆ విలీనము నిర్మూలించే విధంగా ఉండదు (not annihilation). *ఈ శోధన, ఉద్రిక్తత, బాధ, పారవశ్యతల లక్ష్య సాఫల్యత, అంతరించుటలో* (extinction) *లేదు. అదే అయితే అసలీ క్రీడ ప్రారంభమయ్యేదే కాదు.*

ఆనందమే అసలు రహస్యం. స్వచ్ఛమైన ఆనందమును తెలుసుకున్నట్లయితే దైవానిని గూర్చి తప్పక తెలుసుకోగలవు....

– *శ్రీఅరవిందులు* (*Thoughts and Glimpses*)

ప్రశ్న: స్వచ్ఛమైన ఆనందమును గూర్చిన 'ఎరుక' ఎలా కలుగుతుంది?

మొట్టమొదట కోరికలు, వాటి సంతృప్తి, వాటివల్ల పొందే ఆనందము అస్పష్టము, మిశ్రమము, అస్థిరము, అసంతృప్తికరము అని తెలుసుకోవాలి. ఈ అవగాహన నీ శ్రద్ధాపూరిత పరిశీలన ద్వారా కలగాలి. మామూలుగా ఇది మొదటి మెట్టు. ఇక్కడ నుంచే నీ తెలివి ప్రారంభం కావాలి.

తరువాత వ్యక్తి యుక్తాయుక్త పరిజ్ఞానముతో వివేచన చేయవలసినది – కోరిక. దానిని సంతృప్తిపరచటానికి విముఖత.

అసలు ముందే కోరికను తిరస్కరిస్తే దానిని సంతృప్తపరచవల సిన అవసరమే రాదు కదా! కోర్కెలను సంతృప్తిపరచే ప్రయ త్నానికి విముఖత చూపే బదులు ముందే కోర్కెలను తిరస్కరిం చటం వల్ల పొందే ఆనందం అమితమైనది కదా! బుద్ధుడు ప్రప్ర ధమంగా ప్రవచించిన బోధన ఇదే! కోరికను తృప్తిపరచుటలో పొందే ఆనందం కన్నా, దానిని జయించుటలోను, నిర్మూలిం చుటలోను పొందే ఆనందం అపారమైనది, మహోన్నతమైనది. శ్రద్ధ, పట్టుదల కలిగిన ప్రతి సాధకుడు ఎప్పటికైనా ఈ సమ్యకస్న త్యమును తెలుసుకొంటాడు. అంతే కాదు, తన కోరికలను అధి గమించుటలో పొందే ఆనందము, వాటిని తృప్తిపరచుటలో కలిగే నశ్వరము, కలుషితము, అతిస్వల్పము అగు ఆనందము కన్న – అధికాధికమైనది, అసమానమైనదని కూడ తెలుసుకుంటాడు. ఇది రెండవ మెట్టు.

యిలాంటి నిరంతర క్రమశిక్షణ కలిగి ఉన్నప్పుడు కోరి కలు సహజంగానే దూరమవుతాయి. ఇబ్బంది పెట్టవు. అందు మూలంగా నీ అంతరంగంలోకి ఇంకొంత లోతుగా పోవుటకు, స్వేచ్ఛ లభిస్తుంది. ఆనందప్రదాత కోసం, దైవాంశ కోసం, దైవ కృప కోసం ఆకాంక్షిస్తూ నిన్ను నీవు తెరుచుకోగలుగుతావు. దీనిని శ్రద్ధాపూర్వక అర్పితభావనతో నిర్వర్తించినట్లయితే నీ హృదయమంతా హాయిని చేకూర్చే మధురభావనా స్రవంతులతో నిండిపోతుంది. దివ్యానందావిష్కరణకు ఇవి సూచికలు.

అటుపైన మార్గము సుగమమే...

ఒక సమయం ఆసన్నమవుతుంది. ఇక అంతా దివ్యానం దమే! అస్తిత్వమే బ్రహ్మానందమయము! (delight of being) నిజానికి ఉన్నది కూడా అది ఒక్కటే. వ్యక్తులలో మాత్రమే కాకుండా, సర్వభూతనివాసిగా కూడా! సర్వత్రా దివ్యానంద ప్రకంపనలే! కామనలలో, బంధనాలలో, ఆకర్షణ, వికర్షణలలో ఉన్నప్పుడు సహజంగానే ఈ అనుభూతి కలుగదు.

ప్రాణిక, శారీరక స్థాయి ఆనందాలలో, ఇది అనుభావ్యము కాదు. ఎందుకంటే ఈ దివ్యానందము సూక్ష్మగ్రాహ్యంగా

ఉంటుంది. వినిపించని రాగంలా నీవు ఎక్కడ ఉన్నా నీ కోసం ఇది గానం చేస్తున్నట్లుగానే ఉంటుంది. ఈ మాధుర్యం కొంత కాలానికి నీకు అలవాటైపోతుంది.

ఇలాంటి అనుభూతి కలుగగానే, శరీరములోని ప్రత్యణువు దానితో నిండిపోతుంది. తర్కానికి, విశ్లేషణానికి అతీతమైనది. ఈ స్థితిలోనే నీవు నివసిస్తావు. ఈ శరీరము కూడా ఇందులో భాగ స్వామ్యము వహించినపుడు, ఇది ఎంతో హాయిగా (fresh) మును పెన్నడూ, యెరుగనిదిదా క్రొత్త అనుభవంగా, సహజసిద్ధంగా (spontaneous) అనిపిస్తుంది. ఆత్మపరిశీలన, ఆత్మవిశ్లేషణ, వస్తు విశ్లేషణ – వీటికి అవకాశమే ఉండదు. ఆవేశతీవ్రత ఉండదు. నిశ్చలానంద సంకీర్తనంగా మధుర స్పందనలతో కూడి ఉంటుంది. ఇది సూక్ష్మమైనదే కాక తీక్షణమైనది కూడా. ఈ అనుభవంలో విశ్వమంతా ఒక ప్రమోదకరమైన సామరస్య మాధుర్యంతో తొణికిసలాడుతూ ఉంటుంది. సాధారణ చైతన్యానికి ఆమోదం కానివి, సహించనివి కూడా అద్భుతంగా కనిపిస్తాయి. పరమా ద్భుత సామరస్యతే అంతా! వాస్తవ దివ్యసత్యానందమే! అంతా మారిపోతుంది.

ఇదంతా ఒక క్రమశిక్షణగా సాధన చేయవల్సినది. దివ్యా నందమే నా లక్ష్యం అని ప్రారంభించకూడదు. స్వార్థం చేరితే ఫలితం ఆలశ్యమౌతుంది. ఫలితాన్ని ఆశించకూడదు. నిస్వార్థ అర్పణ భావంతో, సహజంగా బేరసారాలు లేకుండా దైవార్పణంగా నిర్వహింపబడాలి. అప్పుడే అంతా పరమోన్నత సత్య, శివ, సుందర ఆనందమయం ఔతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

III నిశ్చలంగా ఉండు:

మానసిక, ప్రాణిక ప్రశాంతత

'ప్రశాంతంగా ఉండాలె' అంటే అర్థం ఏమిటని ఒకాయన నన్ను డిగాడు. 'ప్రశాంతంగా ఉండు' అని నేనెవరితోనైనా అన్నానంటే, ఉద్దేశించిన వ్యక్తిని బట్టి దాని అర్థాలు మారుతుంటాయి. మొట్ట మొదటి ఆవశ్యక ప్రశాంతత మానసిక ప్రశాంతత. ఎందుకంటే ఇది సాధారణంగా మృగ్యమైపోతున్నది. 'ప్రశాంతంగా ఉండు' అన్ని చెప్పటంలో నా ఉద్దేశ్యం, నెమ్మదిలేని, ఉద్రేకపూరితమైన, ఆందోళన కల్గించే ఆలోచనలు రాకుండా ప్రయత్నించటం, మన సును పదిలపరచుకొని, ఊహాపోహల్లో, మానసిక కల్పనల్లో విహరించకుండా ఉండేట్లు యత్నించటం అని.

ప్రశాంతంగా ఉండమంటారు కాని అందుకేం చేయాలి? అని మళ్లీ మీరడగవచ్చు. దీనికి ధారాళంగా సమాధానం అదే. మీరు మొదట ఆ ప్రశాంతత అవసరాన్ని గుర్తించాలె, కోరుకో వాలె, ఆకాంక్షించాలె, తర్వాత ప్రయత్నించాలె. ప్రయత్నించడం కోసం ఎందరో మహానుభావులు బోధించిన, ఆచరించిన విధా నాలెన్నో ఉన్నాయి. ఈ పద్ధతులు సాధారణంగా దీర్ఘమైనవి, కష్టతరమైనవి. లక్ష్యాన్ని చేరుకునేలోగా ఎందరో నిరుత్సాహపడి పోతారు. వాళ్లెంత ప్రయత్నిస్తే అంతదా వారి తలల్లో ఆలోచనలు సుళ్లు తిరుగుతూ చికాకుపరుస్తాయి.

ప్రతి వ్యక్తికీ విధానం వేరుగా ఉంటుంది. అలసిపోయా ననో, శ్రమ ఎక్కువైందనో, తమ స్థితిని అధిగమించి ఉన్నత స్థితిని పొందాలనో – కారణం ఏదైనా మొట్టమొదట మానసిక ప్రశాంతతను మొదట అర్థం చేసుకొని, దాని అవసరాన్ని గుర్తిం చాలె. ఆ తర్వాత ఆ లక్ష్యాన్ని చేరుకోవటానికి ముందె తెలిసిన క్రొత్త మార్గాలనూ క్రమంగా యత్నించాలె.

అప్పుడు మరో ప్రశాంతత మన కత్యవసరమని తెలుసు కుంటాం. అదే ప్రాణిక ప్రశాంతత – కోరిక లేకపోవడం. ఈ ప్రాణికస్థితిని సరిగా పెంపొందించుకోకపోతే మాత్రం, మనం

ప్రశాంతతను కోరగానే అది నిద్రాణస్థితికో లేదా నిష్క్రియతకో దారితీస్తుంది! అప్పుడది “నేనేమీ చేయను. ముందుకు పోను. నా పోషణ కవసరమైన ఉద్రేకాన్ని, ఉత్సాహాన్ని, కోరికను, మోహాన్ని ఇవ్వకపోతే, నేను కదలను, మెదలను” అని మొరా యిస్తుంది. దాంతో సమస్య మరింత సున్నితమూ, కష్టతరమౌ తుంది. ఉద్రేకస్థితి నుండి జడత్వానికి దిగజారడం ప్రగతి కాదు కదా! జడత్వాన్ని లేదా నిద్రాణమైన నిష్క్రియత్వాన్ని ప్రశాం తంగా భావించడం తప్పు.

ప్రశాంతత అనేది ఒక గుణాత్మక స్థితి. సంఘర్షణకు వ్యతి రేకం కానిది గుణాత్మక ప్రశాంతత. ఇది చురుకైన ప్రశాంతత. ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తూ, అన్నింటినీ శక్తివంతంగా నియంత్రిస్తూ, శాంతపరుస్తూ ఒక క్రమపద్ధతిలో వ్యవస్థీకరిస్తుంది. ‘ప్రశాంతంగా ఉండ’ మనటంలో నా ఉద్దేశ్యం ఇదే. అంతేకాని “వెళ్లు, నిద్రించు; జడంగా, నిష్క్రియంగా ఉండు; ఏమీ చేయకు” అని కాదు. నిజమైన ప్రశాంతత ఒక మహత్తర శక్తి. మరో విధంగా చెప్పాలంటే నిజమైన శక్తివంతులందరూ ఎల్లప్పుడూ, ప్రశాంతం గానే ఉంటారు. బలహీనులే ఆందోళన చెందుతారు.

మూలం: శ్రీమాత

అనువాదం: యం. రాజగోపాలాచార్య

అందరిలో లేనిదల్లా భగవంతుని సర్వోత్కృష్టమైన ధ్యానము, మారని దివ్య ప్రశాంత అంతర్దృష్టి.

శ్రీమాత

అంతశ్శాంతి

ఎవరైతే బాహ్యాచర్యల వల్ల ఏమీ తెలియబడకుండా అంతర్ముఖులై ఉంటారో దాన్నే మౌనం అంటారు. అదే అంతశ్శాంతి. ఆ స్థితిలోని వారికి బాహ్యాచలన చాలనాలు, స్మృతులు, ధ్వని వినికిడి, దృశ్యావలోకనం ఉండవు. ఈ భౌతిక చర్యలకు అతీతంగా స్మృతికి, క్రియాకలాప సంసర్గం లేకుండా అంతశ్చైతన్యాన్ని, శాశ్వతత్వంలో విలీనం చేయడమే అంతశ్శాంతి. అప్పుడు మాత్రమే అచ్చమైన క్రియాకలాపార్థం అనుభూతికి వస్తుంది.

*

ప్రశాంతత బాహ్య ప్రపంచ పరిస్థితులలో అన్వేషించ కూడదు. అంతర్ముఖంగా జరగాలి. జీవిత అస్తిత్వంలో ఉన్న ప్రశాంతి నీ సత్వము నంతటికీ, శారీరకము వరకు ప్రసరింపబడే అవకాశం నీవే కల్పించాలి. నీవు అభిలషించి అన్వేషించవల్సినది అలాంటి ప్రశాంతతను మాత్రమే.

*

నిశ్శబ్ద ధ్యానంలో, నీ అస్తిత్వపు లోతులలోని సువిశాలమైన కాంతి శక్తిప్రవాహాలు నీ చైతన్యాన్ని ముంచెత్తుతవి. అల్పమైన ఏ రకమైన ప్రతిక్రియలైనా కూడా ఆ సువిశాల జ్యోతిర్మయ ప్రశాంతతలో మాయమైపోతవి. ఫలితంగా ఇది దైవంతో ఐక్యతకి దోహదపడుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: పురాణపండ రంగనాథ్

అంతశ్శాంతి, అంతశ్శాంతి, ఒక ప్రశాంత సమీకృత శక్తి సంపుటి. ఏ శక్తీ దీనిని చలింప చేయలేదు. సమీకృత సాధనకు ఇది అనివార్యమైన ఆధారం.

శ్రీఅరవిందులు

నిశ్చల మనస్సు

మౌనంగా ఉండటం ఎప్పుడూ ఉత్తమమే. అంటే అర్థం మానసిక స్థబ్దత కాదు. మనసుని ఆలోచనలకి ఆందోళనలకి, ఒత్తిళ్ళకి అతీతంగా, నిశ్చలంగా, ఆనందంగా వుంచుకొని, ఉన్నతశక్తికి ఉన్మీలనం (open) కావించుకోవటం. కల్లోలపరిచే అభిప్రాయాల్నీ, తప్పుడు ఆలోచనల్నీ, తికమకపెట్టే అనిశ్చిత విషయాల్నీ, బాధాకరమైన సంఘటనలనీ ఎప్పుడూ అన్వేషిస్తూ వుండడమనే దురవవాటుని వదులుకోవాలి. ఎందుకంటే అవి స్వభావాన్ని కలచివేసి, వ్యాకులపరుస్తాయి. అందుకే మనసుని నిర్మలంగా వుంచుకోవాలని చెప్పడం. బాహ్యాపరిస్థితులు, ఆంతరంగిక స్థిమితత్వాన్ని భంగపర్చకుండా ఉండే పద్ధతిని సాధన చెయ్యాలి. నిజానికి అది ఏమంత అసాధ్యమైన పని కాదు.

శాంతచిత్తంతో దర్శించే మానసిక దృశ్యం చాంచల్యం లేనిదై స్థిరంగా వుంటుంది. ఆ స్థితిలో ఆలోచనలు తీవ్రంగా వున్నా అవి మనసుని తాకకుండా నిశ్చల వాతావరణంలో ఎగిరిపోయే పక్షులులా దూసుకుపోతాయి. వాటి రాకపోకల ఉనికి కాని, చిహ్నంకాని ఎక్కడా కనపడదు. లక్షా తొంభై ఆలోచనలు తీవ్రంగా వచ్చినా మనసు మాత్రం వీటన్నిటికీ అతీతంగా ఒక విధమైన ఆధ్యాత్మిక స్థిరత్వంలో నిలిచిపోతుంది. అలా మనసు తాను సంపాదించుకొన్న నిశ్చలత్వాన్ని శక్తివంతంగా నిలుపుకోవడం జ్ఞానపరాకాష్ఠకి చిహ్నం. అప్పుడు మనసు తనంతట తాను ఏమీ చెయ్యకుండా దివ్యసందేశాన్ని వింటూ దర్శిస్తూ, చిన్మయానందంలో వుంటుంది.

వింత విషయం ఏమిటంటే, మనసు పై విధమైన పరాకాష్ఠ స్థితికి వచ్చిన తరువాత కూడా, అది తన పాత పద్ధతిలో త్రిగుణాత్మకంగా ప్రకోపించడానికి ప్రయత్నిస్తూ వుంటుంది. అప్పుడు సాధకుడు దాన్ని దరి చేరనివ్వకుండా, వూదెయ్యాలి. ఆధ్యాత్మికంగా ఒక స్థితికి వచ్చిన తరువాత సాధకుడు దీన్ని సులభంగానే సాధించకలుగుతాడు. దాన్నే పురుషప్రయత్నం అంటారు.

శాంతియుతుడైన (అంతరంగ) పురుషుడు బాహ్యాచర్యలకు అతీతంగానే వుంటాడు. ధీరుడు, స్థిరుడు అయిన అట్టి వ్యక్తి అంతర్ జగత్తులో లీనమై (ఆలోచనారహితంగా) బాహ్యాంతర జగతుల్ని ఏకకాలంలో దర్శిస్తూ వుంటాడు. (ఇదొక రకమైన యోగం.)

సాధకుడు బాహ్యప్రపంచపు లంపటాలకి స్పందిస్తూ, వున్నంతకాలం దివ్యనిశ్చలత్వాన్ని సాధించలేడు. నాటి నుంచి తాను వేరై వాటిని తానొక సాక్షిగా గమనిస్తూ ఉండటం తప్పనిసరి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: డా॥ రాజేశ్వరి

IV పనిలో పరిపూర్ణత:

పనికున్న ప్రాధాన్యత

నీవేపనీ చేయకపోతే నీకు ఏ అనుభవం రాదు. జీవితమంతా అనుభవాలకు రంగస్థలం. నీ ప్రతి కదలికా, ఆలోచనా, పనీ నీకు కొంత అనుభవాన్ని సంతరించి పెడుతుంది. అది తప్పనిసరి. సహజంగా ప్రతి పనీ అంతర్గత కృషిని అనుసంధానపర్చే అనుభవ క్షేత్రమే.

ఏ పనీ చేయకుండా ధ్యానంలో లేదా ఏకాగ్రంగా ఉండిపోదలిస్తే మంచిదే. కానీ అందువల్ల నీవు ఎంతగా ఎదిగావన్నది తెలియదు. నీ అభివృద్ధిని గురించి నీవొక భ్రాంతిలో ఉండిపోతావు. కానీ నీవు ఏదైనా పనిని ప్రారంభించినపుడు, నీ పనిని గురించిన ఆనుపానులు, ఇతరులతో నీ సంబంధాలు, నీ భౌతిక అవసరాలు, వెరసి నీ వెంతగా అభివృద్ధి సాధించావనేదానిని అవగాహన చేసుకొనేందుకు మాత్రమేగాక, ఇంకా ఏమి సాధించాల్సి వుంది అనేది నీ ఎరుకలోకి వస్తుంది. ఏ పనీపాటు లేకుండా నీలో నీవు స్థంభించుకొని ఉండిపోతావు. అలాకాక, నీవు బాహ్యతలంలో పనిని చేయడం ప్రారంభించినపుడు, ఇతరు

లతో నీ సంబంధాలలోనూ, జీవితంలో ఎదురయ్యే పరిస్థితుల లోనూ, విషయపరంగానూ, నీవెంత ప్రగతిని సాధించావనేది పని చేస్తూ, ప్రశాంతంగా ఉండగలుగుతున్నావా, సచేతనంగా ఉన్నావా, ధృఢంగా, నిస్వార్ధంగా, ఏ కోరిక లేకుండా, ప్రాధాన్యతలు లేకుండా, బలహీనతలను జయిస్తూ, అసంతృప్తికి తావీయకుండా స్థిరంగా ఉండగలుగుతున్నావా లేదా అనేది పని చేస్తున్నప్పు డేగా తెలిసేది!

*

దైనందిన జీవితంలో సమ్మెటదెబ్బలు అవుసరం. అవి స్వభావా లను పరిశుద్ధపరుస్తాయి. మెరుగు, నాణ్యతలను పెంపుచేస్తాయి. పరిపక్వత నొందిస్తాయి. రమణీయతతో కమనీయంగా తేజరిల్లు తాయి. ఈ స్వాభావికస్థితులన్నీ, ఒకదాని తర్వాత ఒకటి సమగ్ర అభివృద్ధి సాధించడం కోసం బాహ్యంలో కర్మ అవసరం. దైవాన్ని అభివ్యక్తం చేసేందుకు అంతర్బాహ్యాలలో ఈ పనివల్ల ఇతరేతర చైతన్యకేంద్రాలు కూడా వికసించేందుకు అనువుగా ప్రకాశమానం అవుతాయి. గర్వము, సంతృప్తి అనేవి ఎవరికైనా నికృష్టమైఇన ఆటంకాలే. అందుకే అందుబాటులోకి వచ్చిన ప్రతి సూక్ష్మమైన అంశాలను గూడా అత్యంత వినయంగా స్వీకరించి కాచి వడబోసి, స్వభావంలో చోటు చేసుకున్న మాలిన్యాలన్నిం టినీ పరిశుద్ధపరచి, వాటిని మృదువుగా మలిచి, నిర్వ్యక్తికం చేసి, నిస్వార్ధంగా, ఆత్మనివేదనతో, సభక్తికంగా, అనురాగపూరి తంగా కమనీయంగా మార్చుకోవాలి. అవి జీవుని నడవడికను తీర్చిదిద్ది ఖచ్చితమైన, సరియైన దిశానిర్దేశం చేస్తాయి. లక్ష్యమును చేరుకోవాలంటే అసంఖ్యాకములైన అనుభవాలను సంతరించు కోవాలి. వాటిని తప్పించుకోవాలని చూడకూడదు.

*

మనం మన ఋషుల ప్రబోధాలను గమనించితే వారు ఈ ప్రపం చాన్నుండి తప్పించుకొనడంగాక, ఈ ప్రపంచంలోనే ఉంటూ (ఆధ్యాత్మికత) సాధించాలని వారు భావించారు. వారు ఊహిం చిన స్వర్ణయుగం ఇక్కడే (ఇహైవసంతః) ఉన్నదనే భావన వారిది.

ఈ ప్రపంచాన్ని విడిచిపోవలననే భావన ఆధ్యాత్మిక పతనంవల్ల వచ్చిన పరిణామం.

మూలం: శ్రీమాత
అనువాదం: కొంగర భాస్కరరావు

నీ పనిని నీకు వీలైనంత బాగా చెయ్యి

నీవే పని చేసినా వీలైనంత పరిపూర్ణంగా చేయి. నీలోని దైవానికి అది చాలా మంచి సేవ.

*

పరిపూర్ణత నీ ఆదర్శం అయినప్పుడు నీవు నిజమైన దైవోపకరణం కాగల్గుతావు.

*

స్వార్థం కోసం పనిచేయడం అనేది నీ లక్ష్యం కారాదు. ఇది మొదటి షరతు.

అందుకు పట్టుదల, ధైర్యం, సాహసం అనేవి ప్రాధమిక లక్షణాలుగా ఉండాలి.

ఇంతవరకూ నీకు తెలిసినది ఇంకా తెలుసుకొనవలసిన దాని ముందు చాలా అల్పమైనదని, చేసినది ఇంకా చేయవల్సిన దానికంటే చాలా అల్పమైనదని, మనము ఉండవల్సిన పరిస్థితితో పోల్చినపుడు మనము ఉన్న పరిస్థితి అసలు ఏమీ కానే కాదు – అనే గ్రహింపు ఉండాలి.

తన స్వభావంలో అనివార్యంగా కావలసినదానిని సంపాదించుకొనడం కోసం, తనకు తెలియనిదానిని తెలుసుకొనేందుకు, తాను చేయలేనిదానిని చేసి తీరాలన్న దృఢమైన సంకల్పం ఉండి తీరాలి.

వ్యక్తిగత కోరికలకు అతీతంగా ఉండగలిగినపుడు సంప్రాప్తమయే శాంతి, వెలుగులలో తాను నిరంతరం ఎదుగుతూ ఉండాలి.

ప్రతివారికి ఒకే ఒక దృక్పథం ఉండాలి. అది "ముందుకు, ఇంకా బాగా ముందుకు (సాగిపోవాలి)" అన్న ఒకే లక్ష్యం ఉండాలి. అది దైవాన్నీ అభివ్యక్తం కానివ్వడం ఎలాగో ఇంకా, ఇంకా బాగా తెలుసుకోవాలి.

ఈ రోజు చేయలేనిది రేపు తప్పక చేయగలననే దృఢ విశ్వాసం వుండాలి.

*

అమ్మా! మీరన్నారు – "నా ఇచ్ఛయే దైవేచ్ఛ... దైవేచ్ఛ ప్రకారమే కొనసాగనీ" – అంటే తీవ్రమైన ఆకాంక్షతో కేంద్రీకరింపబడిన లక్ష్యసాధన దిశగా మీ ఇచ్ఛ స్థిరంగా కొనసాగాలి. అంతేకాని ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమ దిశగానో, లక్ష్యసాధన దిశగానో కాదు.

ప్రశ్నోత్తరాలు (1929 21 ఏప్రిల్)

అవును. అందులోనే మన సమస్యకు పరిష్కారం ఉంది. నీ ఆకాంక్ష రూపంలో నీ ఇష్టాన్ని ప్రతిక్షణం సమర్పించుకుంటావు. ఆ ఆకాంక్ష చాలా సహజంగా సాకారమయేటట్లుగా – "ప్రభూ! నీ ఇచ్ఛయే నెరవేరనీ", అని గాక ఎంత బాగా చేసేందుకు వీలుందో అంత నిండుగా చేసేలా అనుగ్రహించు" అంటావు.

అయితే ప్రతీసారి ఎంత బాగా చేసేందుకు వీలుందో, లేక ఎలా చేయాలో తెలియకపోవచ్చు. కానీ అలా చేయాలన్న నీ సంకల్పాన్ని దైవం ముందే ఉంచు. అపుడు అద్భుతమైన ఫలితాలను చూడగల్గుతావు. ఈ పనిని నీవు సచేతనంగా, చిత్తశుద్ధితో, పట్టుదలతో చేసినపుడు పెద్ద పెద్ద అంగలతో నీవు ముందుకు వడివడిగా సాగిపోతావు. అదంతే! కదూ! ఆత్మగతమైన ఉత్సాహంతో, సంకల్పబలంతో, ఎవరైనా కర్మను ఎంత బాగా చేసేందుకు అవకాశం ఉందో అంత బాగా చేయాలి. ఇతరులు ఏమి చేస్తున్నారనే దానితో, నీకు ఏ సంబంధం ఉండకూడదు.

*

మనం ఎంత బాగా పరిణతి చెందితే, మనం చేస్తున్న పని గురించిన భావం కూడా అంతా బాగా వికసిస్తుంది. ఈ వికసిత భావ

జాలాన్ని ఏనాడూ మనం నిర్లక్ష్యం చేయకూడదు. కానీ మనం చేస్తున్న కర్మ మన ఆనందస్ఫూర్తితో, సహజసుందరంగా ఉండాలి – స్వచ్ఛమైన ఊటబావినుంచి నీరు పొంగిపైకెగసినట్లు.

మూలం: శ్రీమాత

అనువాదం: కొంగర భాస్కరరావు.

మన ఆశయము పరిపూర్ణ దివ్యత్వం

దివ్యశక్తికి అర్పణ కాబడిన 'నేను' అనుకునే ఈ ఉపకరణము (ఉపాధి) మరో ముందడుగు వేయాలి. మన నిమ్నప్రకృతి దివ్య సత్యశక్తికి లోబడినపుడు తనని తాను అధిగమించ గలుగు తుంది. సత్యజ్ఞానశక్తులకు అప్పుడే అనువైన పరిపూర్ణ ఉపకర ణంగా రూపొందుతుంది.

కర్మయోగంలో ముక్తి మాత్రమేకాక పరిపూర్ణ రూపాంత రీకరణం కూడా ఆశయం కావాలి. మన స్వభావానికి అనుగు ణంగా దైవం మనలో ప్రవర్తిస్తుంది. స్వభావం అపరిపూర్ణంగా ఉన్నపుడు చేసే కర్మలు కూడా అపరిపూర్ణంగా, అసమగ్రంగా, కల్తీగా ఉంటాయి. నైతిక బలహీనతలు ఘోరమైన పొరపాట్లు, అసత్యాలు, తప్పుదారి పట్టించే ప్రభావాలు దారికి అవరోధాలుగా ఉంటాయి. అలాటప్పుడు కూడా దైవం మనలో ప్రవర్తిస్తూనే ఉంటుంది. కాని అది మన బలహీన స్వభావానికి అనుగుణంగా లోపభూయిష్టంగా మాత్రమే ఉంటుంది. అంతేకాని మూలాధార స్వచ్ఛ శక్తి ప్రతిఫలించేటంతటిదిగా ఉండదు. లోపల కదలని జీవాత్మతో పాటు, కదిలే బాహ్యస్వభావము కూడా దివ్యంగా పరిణమించాలి. ఇదీ ఆదర్శం. ఇదెలా సాధ్యం? నీ ప్రతి కదలిక, ఇచ్ఛ, ఆలోచనా, భావన ప్రేరణ – దివ్యస్పృహలో జరిగినపుడు మాత్రమే! అజ్ఞానంలో కూడా మనకి దైవశక్తి స్ఫూర్తి ఉండక పోదు. కాని అది ప్రచ్ఛన్నంగా, అల్పమైనదిగా అధమస్థాయిలో ఉంటుంది. మనది ఉన్నతతరమైన ఆకాంక్ష. మన స్వభావము

దివ్యసత్యజ్ఞాన సంపన్నము. అనంత అంతస్సాక్షీభూత సంకల్పంతో శక్తియుతము. విశాల శాశ్వత జ్ఞానపరిపూతము. పదార్థ ప్రకృతికి అనుబంధితమైన అహం, దానికి లోబడిన మనోప్రాణిక దేహాలు – వీటి తెరలు వైదొలగినపుడు మనం అహంకారశక్తికి లోబడిన వాళ్లము కాక పరిణామక్రమంలో విశ్వేశ్వర ప్రేరణకి లోబడి ఉంటాము. ప్రభూ! నీచే నియమితుడైన నేను నీ చేత ప్రచోదింపబడినవానిగా నడుచుకుంటాను – అని అనుక్షణము ఏ కర్మ చేస్తూ ఉన్నా అనుకుంటావు. అయినా నీ కర్మలు రెండు పాయలుగా సాగుతవి. ఒకటి జ్ఞానప్రకాశము. వేరొకటి ఉన్నత పరా ప్రకృతిలో రూపాంతరం చెంది ఉద్ధరింపబడినది. అహంకార భ్రమకి లోనైన స్వభావం కర్మమార్గంలో పయనిస్తూ ఉంటుంది. కాని ప్రతి కర్మను ప్రచోదించేది దైవశక్తియే అని, దైవశక్తియే మనలను నడిపించే యాంత్రికశక్తి అనే పరిపూర్ణ అవగాహన – యోగులు అందుకునే ఆధ్యాత్మిక మనసు – నీకు స్వాధీనమౌతుంది. ఇంత మాత్రమే కాదు. ఇంకా ఉన్నతతరమైన అధిమానసమును చేరగలిగే సంభావ్యత కూడా కలుగుతుంది. అపుడు ఆధ్యాత్మిక మనోచేతన దాటి పరమోన్నత శక్తిస్వరూపిణి – శ్రీమాత యెరుకలో కర్మలు అనుష్ఠింపబడుతున్నవనే చైతన్యస్థాయికి చేరుకోగలుగుతావు. మన ప్రతి కదలిక, ఇచ్ఛ, శక్తి – అన్నీ శ్రీమాత ద్వారా నిర్వహింపబడుతున్నదనే భావన మనకు కలుగుతుంది. మనోప్రాణికశరీరాలు శ్రీమాత పరమోన్నత శక్తి జ్ఞానప్రకాశ వాహికలుగా రూపాంతరీకరింపబడి, భౌతిక అతీత సాధనాలుగా పరిణత చెంది పూర్ణజ్ఞానంతో నిర్దిష్టంగా పనిచేస్తాయి. ఈ దివ్యశక్తికాంతులు ఆవహించుకొన్న వాహికలుగా ఉపకరణాలు. వీటితోపాటు దివ్యపరమోన్నత శాశ్వత అనుభూతి, నీకు స్వంతమౌతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

దివ్యమాత ఎలా అనుగ్రహిస్తుంది

విశ్వంలో జరిగే ప్రతి సంఘటన వెనుకా దైవంయొక్క సంకల్ప శక్తి ఉండి నడుపుతూ వుంటుంది. కాని దైవం యోగమాయచేత ఆవృతమై కూటస్థంగా వుండి తన అధోప్రకృతి అయిన జీవుని అహంకారం ద్వారా సర్వాన్నీ నిర్వహిస్తుంది.

యోగంలో దైవమే సాధకుడూ, సాధన కూడా. ఆమె వెలుగుకూ, శక్తికీ, జ్ఞానానికీ, చైతన్యానికీ, ఆనందానికీ, ఆయన సంకల్పశక్తే ఆధారంగా వర్తిస్తూ వుంటుంది. ఇవన్నీ ఆమె వైపుకు విచ్చుకున్నప్పుడే, ఆ దైవశక్తులన్నీ కూడా సాధకుడిలో ప్రవేశించి సాధన సాధ్యమవుతుంది.

*

సమర్పణమంటే దైవం ఎడల గలిగిన ప్రేమయే. ఇది స్వచ్ఛందమైనదీ, పరిపూర్ణ శరణాగతీ, ప్రపత్తులతో గూడినది. దానిని ప్రతిఫలంగా శ్రీమాత యధేచ్ఛగా నిన్ను స్వీకరిస్తుంది. అది నీ మానసిక, ప్రాణిక, భౌతిక చేతనా భూమికల్లో ఆమె సన్నిధిగా నీకు లభిస్తుంది. ఆమె నీ అస్తిత్వంలోని గమనప్రక్రియల నన్నిటినీ స్వీకరించి తన దివ్యశక్తితో పునః నిర్మాణం చేసి పరిపూర్ణత వైపు, సిద్ధివైపు నిన్ను నడిపిస్తుంది. శ్రీమాత ప్రేమ నిన్నావరించి తన కౌగిలిలో చేర్చుకుని దైవం వైపుగా నిన్ను తీసుకొని వెడుతుంది. దీని కోసమే నీవు నీలోని భౌతికకక్ష్యల వరకూ అన్ని భాగాల్లోనూ గాఢంగా ఆకాంక్షిస్తూ, అనుభూతి చెంది, అమ్మ సన్నిధిని పొందితే, నీవు కోరినదిగానీ, కోరుకొనవలసినది గానీ, సిద్ధించకపోవటం ఉండదు. నీ ఆకాంక్ష సత్యమైనదైతే, నీవు కోరినది తప్పకుండా సిద్ధిస్తుంది. నీలో పవిత్రీకరణ కొనసాగేకొద్దీ, నీ స్వభావంలో (ప్రకృతిలో) ఈ అత్యావసరమైన మార్పు చోటు చేసుకుంటుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

మన ప్రగాఢమైన ఆకాంక్ష – అనివార్యమైన గమ్యము

సువర్ణ రోచిస్సు

నీ బంగారు కాంతిరేఖ నా మనోతీరాల మెరసింది.
సూర్యస్పర్శతో చీకటి మానస మందిరాలన్నీ
వివేక కాంతిశిఖరాలుగా ప్రజ్వరిల్లాయి.
దివ్యకాంతిహేల, దివ్యజ్వాలామాల.
నీ స్వర్ణోజ్వల తేజోనివహం నా కంఠంలో నిలిచింది.
నా వాగ్ఝరి దివ్యసంగీతలహరియే అయింది.
నీ గానమే నా ఏకైక సంకీర్తన.
నా మాటలన్నీ మధుర సుధాధారలు.
నీ హిరణ్మయ రోచిస్సు నా హృదయంలో వెలిగింది.
నీ శాశ్వతత్వంతో నా హృదయం స్పందించింది.
ఇప్పుడది ఒక దేవాలయం.
కొలువై ఉన్నది అక్కడ నీవే!
నా హృదయావేశాలన్నీ నీ వైపే!
నీ కాంచనదీప్తిశిఖ నా పాదాల వద్దకు నడిచి వచ్చింది.
ఇప్పుడు నా ఈ భువనం విశ్వలీలా బృందావనము.
నీ దివ్యపీఠము

మూలం: శ్రీఅరవిందులు
భావానువాదం: కె. యజ్ఞన్న

ఉన్మీలనం

చైతన్యాన్ని ఏకోన్ముఖం చేసి శ్రీమాతకు ఒదిగి ఉండటమే ఉన్మీలనం అంటే. మరియే ఇతర కార్యకలాపాలను దరిరానీయక, దైవదత్తమైనదానిని మాత్రమే స్వీకరిస్తూ ఉండటం.

*

జగన్మాత నీలో ప్రవర్తించే విధంగా, ఆమెను తిరస్కరించకుండా, ఆటంకపరచకుండా ఆమె నీలో పనిచేయడానికి వీలుగా ఆమెకు ఉన్ముఖుడవై ఉండటమే ఉన్మీలనమంటే. మనస్సు తన భావాల లోనే బంధింపబడి, సత్యము, వెలుగు (Divine Truth, Divine Light) లను జగన్మాత తీసుకుని రాకుండా నిరాకరిస్తే, ప్రాణికం కోరికలకే అంటిపెట్టుకుని, జగన్మాత శక్తి తెచ్చే నిజమైన స్పందనలు, చొరవను త్రోసిపుచ్చితే, భౌతికం (అన్నమయ కోశం) తన కోరికలలో, అలవాట్లలో, జడత్వంలో బంధింపబడి, అందులోకి కాంతిని, శక్తిని చొరనీయకుండా, పనిచేయకుండా ప్రతిఘటిస్తే, అతడు జగన్మాతకు పరాఙ్ముఖుడు.

*

ఒక దివ్యశక్తి తనలో పని చేస్తున్నదని, ఆ శక్తివల్ల కలిగే ఫలితాలు గూర్చి సాధకుడు స్పృహతో వుండే కనీస పరిస్థితి ఒకటి వుంది. తన మానసిక కార్యకలాపాలతో, ప్రాణిక అశాంతి, అలజడితో, శారీరక జడత్వంతో దివ్యశక్తి అవరోహణకు గాని, దాని చర్యలకుగాని అడ్డుపడక, ఆటంకం కల్గించకపోవటమే ఉన్మీలనం.

*

వివిధ స్థాయిలలో ఉన్నత చైతన్యాన్ని మనలోని చైతన్యం ఆవహించుకోగల్గటం ఉన్మీలనం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

తలుపులు తెరవాలి – ఎలా?

చిత్తశుద్ధితో కూడిన ఇచ్ఛ, ఆకాంక్షలకు అనుగుణంగా నీలో ఉన్మీలనం (opening) ఉంటుంది. (దైవాన్ని అనుగ్రహించుకో గలిగే శక్తి)

*

ఈ తెరుచుకోవటమనేది ఒకేసారి శరీరం అన్ని భాగాలలోను (శారీరక, ప్రాణిక, మానసికాలలో) సంభావ్యం కాదు. ప్రతిభాగంలోను కేంద్రస్థానాలు ఉంటవి. శ్రీమాత సాన్నిధ్యాన్ని ఆవహించుకునే ఆధారకేంద్రాలుగా ప్రబలమైన ఆకాంక్ష, ఇచ్ఛ (aspiration and will) లతో వాటిని బలోపేతం చేసుకోవాలి. అటుపిమ్మట నెమ్మదిగా పురోగమవనం ఉంటుంది.

*

సమర్పణ (surrender) ఉన్మీలనానికి అతియోగ్యమైన మార్గము. ఆకాంక్ష, నిశ్చలత కొంతవరకు సహకరిస్తాయి. అర్పణ – అంటే – నీ సర్వస్వము – అలవాట్లు, ఆలోచనలు, కోర్కెలు మొదలైన వాటిని – వేటిని 'నావి' అనుకోకుండా సర్వము దివ్యసత్య సమర్పణ కావించి సర్వత్రా దివ్య ఇచ్ఛా, జ్ఞానకాంతులు ప్రసరించేలా చేసుకోవాలి.

*

అమ్మపై దృఢవిశ్వాసము చైతన్యవికసనానికి దోహదపడుతుంది. దివ్యప్రసరణానికి సానుకూలంగా నీలో కవాటాలు తెరుచుకుంటవి. ధ్యానం మాత్రమే చాలదు. దృఢనమ్మకము, నీలో అమ్మను ఆవహించుకొని ఉండుట – ఇవి తప్పనిసరిగా కావల్సినవి.

*

సతతము శ్రీమాత స్పృహాలో ఉండు. ఆమె దివ్యశక్తి నీలో ప్రసరించి పనిచేసే వీలు కల్పించు. పనికిమాలిన ఆలోచనలకు తావు ఇవ్వకు. ఇది యోగానికి నిర్దేశిత సూత్రం.

*

నిజానికి, నీ ప్రమేయమేమీ లేకుండానే దివ్యశక్తి నీలో పని చేస్తూ ఉంటుంది. ఇందుకు నీ కృషి అవుసరం లేదు. కావల్సినది జీవునిలో యెరుక, గుర్తింపు, ఆమోదము.

*

ఇంకా కావల్సినది పరిమిత 'అహం' నుంచి అపరిమిత సత్వానికి, ఉన్మీలనం. ఇదీ యోగమునకు అర్థం. ఆ పరిస్థితికి రావటానికి ప్రయత్నం అవసరమే. సాధారణ జీవన కార్యకలాపాలలో జీవుడు దివ్యహస్తాలలో ఉపకరణం మాత్రమే. కాని అన్నీ 'నేనే' చేస్తున్నానని అహంకరిస్తాడు.

శ్రీమాతకు నిన్ను నీవు సమర్పించుకొని ఆమెకే లోబడి ఉండటం వల్ల లభించే ప్రశాంతత, ఆనందం, నమ్మకం, విశ్రాంతి అహంభావ జీవనంలో నీకు లభించదు. శ్రీమాత శక్తి నీలో ప్రవేశించి ఆమెయే నీ కార్యకలాపాలు అన్నీ సాగించనీ. ఆ విధంగా జ్ఞాన, శాంతి, ఆనందాలు అందుకో. ఆమెకి ఒదిగి ఉండలేకపోయినపుడు ఆమె అనుగ్రహబలాన్ని సదా ప్రశాంతచిత్తంతో ఆకాంక్షించు.

*

నిరంతర స్మృతివల్ల నీలో శ్రీమాత ప్రవేశానికి సంసిద్ధుడవు కాగలుగుతావు. హృదయకవాటం తెరు మరి! అపుడే కదా శ్రీమాత నీలో ప్రవేశించేది! అప్పుడే కదా ఆమె శక్తి, ఆవేశాలు నీలో ప్రవేశించి నీ స్వభావ పరిణామ కార్యక్రమం ప్రారంభమయేది!

*

యోగి, తపశ్వి, సన్యాసి – కావటం కాదు లక్ష్యం. రూపాంతరీకరణం లక్ష్యం. నీ పరిమిత శక్తికి మించిన అపరిమిత శక్తి వల్లనే ఇది సాధ్యపడుతుంది. దివ్యమాత ఒడిలో శిశువుగా ఒదిగి ఉండిపో. అంతా ఆమెయే నిర్వహిస్తుంది.

*

ఈ యోగానికి ప్రాధమిక సూత్రం శ్రీమాత దివ్యశక్తి ప్రభావాన్ని ఆవహానం చేసుకునేందుకు సంసిద్ధం కావటమే. ఆ శక్తి, నీకు పైన ఉన్నది. నీ చైతన్యం దానిని ఆకాంక్షించాలి. అప్పుడే అది

నీ శారీరక మానసికాల లోనికి దిగి నిన్ను ఆవహిస్తుంది. దివ్య శాంతి కాంతిలహరులు నీలో పొంగుతవి. ఇదే దివ్యానందము. నీలో ప్రగాఢమైన ఆకాంక్ష ఇందుకు కావాలి. విశ్వాసం బల పడాలి. నీ లోకవాటాలు తెరవబడాలి. ఆకాంక్ష, పిలుపు, వేడు కోలు – నీ యిష్టం. నీకేది సులువో అది చెయ్యి. మరొక మార్గం ఏకాగ్రత. నీ హృదయ చైతన్యసీమలో ఏకాగ్రత. కొంతమంది మానసిక ఏకాగ్రత పాటిస్తారు. ఏదైనా మంచిదే. శ్రీమాతను ధ్యానించటం ప్రధానం. నీ హృదయపీఠాన్ని అధిష్ఠించమని మనఃపూర్వకంగా వేడుకో. ముఖ్యంగా మనసు నిశ్చలపర్చుకో. ప్రారంభంలో ఇది అత్యంత ఆవశ్యకం. నీ సాధనను ఆటంక పరిచే ఆలోచనలను, సంచలనాలను దృఢంగా తిరస్కరించు. నిశ్చలమనస్సుతో సాధన క్రమేపీ ముందుకు కొనసాగుతుంది. ఓరిమి వహించాలి. తొందర పనికిరాదు. సద్యోఫలితాలు ఆశించ కూడదు. సమయం పడుతుంది. సాధన సడలనీయ కూడదు. చైతన్యాన్ని సుస్థిరపర్చుకోవాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

నీ లోపలి తెర ఎలా వైదొలగుతుంది?

ముందు దీని అవసరాన్ని నీవు గుర్తించగలగాలి. ఇది చాలా ముఖ్యం. ఇది నీ అంతరంగంలోని అణకువ – నా శక్తి ఏ మాత్రము లేదు; నేను నిస్సహాయుడను; దైవకృప లేనిదే నేను ఏమీ కాను; ఏమీ చేయలేను – అనే అవగాహనతో ప్రాథమి కంగా ఆరంభం కావాలి.

ఈ అనుభవం ఏదో ఒక సమయంలో ప్రతివారికీ కలి గేదే! ఓ విపత్కర పరిస్థితి, ఒక చిక్కు సమస్య, చికాకు పరిచే ప్రేరణ – ఎదుర్కొనవలసి వస్తుంది. పరిష్కారం తోచదు. నిస్స హాయస్థితి; మనసు, ఇచ్ఛ, భావము – ఏవీ పనిచేయవు. అన్యథా

శరణం నాస్తి అనే పరిస్థితి. ఇదిగో సరిగ్గా ఇక్కడే – నీలో ఒక పిలుపు – నీలోని మిగిలినవేమీ పనిచేయకపోగా – ఆ పిలుపే పనిచేస్తుంది. ఇదే నీ ఆకాంక్ష; నీ నిస్సహాయతకి పరిష్కారం.

ఇదీ మొదటి నిబంధన. దైవకృప మాత్రమే సమస్యకి పరిష్కారము – అనేది నీవు యెరుకపర్చుకోవాలి. ఇదే కష్టాల నుంచి గట్టెక్కిస్తుంది. బలాన్ని చేకూరుస్తుంది. ఈ అవగాహనతో నీలో తీవ్ర ఆకాంక్ష మేలుకొంటుంది. చైతన్యం ఉన్మీలనమౌతుంది. దైవకృపకు నీ (లో) ద్వారాలు తెరచుకుంటవి.

కాకపోతే కష్టం తీరిన తర్వాత దైవాన్ని మరువకూడదు. నా పురుషకారం వల్లనే నా కష్టం తీరిందని అహంకరించావో – మరి – ఇంతే సంగతులు.

తలుపులు మూసుకుని తాళం వేసుకున్నావన్న మాటే!

ఈ నీ అంతర్గత తెలివితక్కువతనం (అహం) పోవాలంటే మళ్లీ ఏదో ఉపద్రవంతో నీకు తీవ్రసంతాపం కలగాలి. అయ్యో! నేనేమీ కాను; నాకేమీ చేత కాదు అనుకునే నీ అల్పత్వం అంతవరకు గుర్తుకు రాదు. నా శక్తిప్రతాపాల వల్లనే నేను పని చేయగలుగుతున్నాననే భావన ఎప్పుడైతే నీకు కలిగిందో అంతే – నీ అంతరంగ కవాటాలు గట్టిగా మూసుకుపోతవి. అభేద్యమైన దుర్గంలో బందీవి అయిపోతావు. ఏదీ నీలో ప్రవేశించదు. ఇదే గొప్ప అవరోధం. మనం శక్తివంతులమనుకొని దైవాన్ని విస్మరించి దూరమైపోతాము.

ప్రశ్న: కానీ, అమ్మా! శక్తిహీనుడను అని తాను అనుకున్నా, తనలో, ఏదో తాను శక్తివంతుడను అనే నమ్మకం కలిగిస్తూ ఉంటుంది. (మరి ఇదేమిటి?)

నిజమే! చిత్తశుద్ధి కలిగి ఉండటం కష్టం. అప్పుడు తగిలే దెబ్బలు పెరుగుతవి; మరీ భయంకరంగా పెరుగతవి. బాధల ద్వారానే జ్ఞానోదయం. అజ్ఞానం పటాపంచలవటానికి ఎన్ని చేదు అనుభవాలు కావాలో!

నేను ఏమీ కాను, నా చేతులలో ఏమీ లేదు – దివ్య చైతన్యం, దైవకృప లేక 'నేను' అనేదేమీ ఉండనే ఉండదు. ఇది

తెలుసుకోవటానికి ఎన్ని ఆఘాతాలు, బాధలు, వ్యధలు అవసరమౌతవో! (Pain is the hand of Nature sculpturing men to greatness అంటారు శ్రీఅరవిందులు 'సావిత్రి' లో)

నీవు చేయవలసినది ఒక్కటే. నీ లోపలి ద్వారాలు దైవం కోసం తెరు. ఏదీ దాచకు. దాపరికం అసత్యానికి రహదారి. ఏ కాస్తంత ఆటంకం లేక అణచివేత (suppression) అయినా చాలు నిన్ను నిశ్చైతన్య అగాధంలోనికి నెట్టివేయటానికి. ఎప్పుడూ సత్యమునకే లోబడి ఉండు. (Cling to the Truth) సత్యప్రకాశమే నీలో అంతటా ప్రసరించనీ. పరిపూర్ణ వినయశీలుడవై ఉండు. నీ భౌతికమనస్సు నీకు అంతా తెలుసునని నిన్ను తప్పు త్రోవ పట్టిస్తుంది. ఇపుడు నేను ఏమిటి? నేనేమి కావాలి? మధ్య ఉన్న అంతరమెంత? తెలుసుకో. నిన్ను నీవు పూర్ణంగా దైవమునకు అర్పణ కావించుకో. అదే వినయశీలత (modesty) అంటే. మనః పూర్వకంగా అర్పించుకో. నీ కపుడు ఏ బాధ్యత, బరువు ఉండవు. విముక్తుడవు కాగలుగుతావు. ప్రశాంతత సిద్ధిస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

శ్రీమాత మార్గదర్శక సూత్రాలు

దివ్యశక్తిని గ్రహించుకుంటూ ఆ దివ్యప్రభావంతో పురోగమించాలనే సంకల్పమూ, దివ్యచైతన్యంతో నిరంతర సంస్పర్శ ఉండాలనే ఆకాంక్షా, ఆ శక్తీ, చైతన్యమూ కూడా నిరంతరం నీతోనే ఉంటాయనే దృఢవిశ్వాసమూ, నీకు ఆ దైవత్వానికీ మధ్య మధ్యవర్తిత్వము వహించేది ఏదీ రాకూడదు అనే భావమూ ఉన్మీలనానికి (openness) లక్షణాలే.

*

నీపై పనిచేస్తున్న చైతన్యాన్ని గ్రహించుకోటానికి సంసిద్ధుడవై యుండు. (ఉన్మీలుడవై యుండు) ఎంత నిశ్చలంగా, ప్రశాంతంగా ఉండగలిగితే అంతగానూ ఉండు.

ప్రేమకూ, కాంతికీ ఉన్ముఖంగా ఉండు. క్రిందటి నీ ఉత్తరానికి నేను పంపిన జవాబు కూడా ఇదే. చైతన్యంలో ఉద్ధతిని పొందు. విశాలమైన ప్రేమతత్వాన్ని వెలిబుచ్చు. ఇక దారితప్పటాలు ఉండవు. ఈ యోగమార్గం అనుసరించాలంటే ప్రపంచమంత విశాలంగానూ, సవిస్తరంగాను ఉండటం తప్పనిసరి.

*

ప్రియజననీ, మీకు ఉన్మీలుడనై యుండాలని నేను ఎంతగా ఉన్నప్పటికీ ఏదో ఆటంకం వస్తోంది.

బిడ్డా, నీ ఇష్టం వచ్చినట్లు కాకుండా నా అభిమతాన్ననుసరించి నీ జీవితాన్ని నడపించుకోవాలని నీవు నిర్ణయించుకోలేదు కాబట్టే నా దెసగా ఉన్మీలుడివవటం నీకు కష్టంగా ఉంది. ఎప్పుడైతే ఆ అవసరాన్ని నువ్వు గుర్తిస్తావో అంతా సుగమమవుతుంది – నీకు ఎంతగానో అవసరమైన ప్రశాంతతను పొందగలుగుతావు.

నీ కృషి, ఆకాంక్షల్లో నేను సర్వదా నీతోనే ఉంటాను.

*

అమ్మా! అన్నీ ఇవ్వటానికని మీరు ఎప్పుడూ సిద్ధంగా ఉన్నప్పటికీ, అంతగానూ అందుకోలేకున్నాను. గ్రహణశక్తి చాలటం లేదమ్మా!

ప్రపంచంలో సరిగ్గా ఇదే జరుగుతోంది. సరైన గ్రహణశక్తి లేదు కాబట్టే ప్రపంచ పరిస్థితులు ఇలా కష్టాల్లో పడుతున్నాయి. అది వివృతమై దివ్యప్రేమను పొందగలిగితే ఇక్కడే మోక్షము దొరుకుతుంది.

విధేయతతో నిరంతరమైన ఆకాంక్షే దానికి తగిన ఉపాయము.

*

అమ్మా! నాకూ ఇతరములైన వాటికీ, (అది ఏదైనా సరే) భేదము లేదనే అంశంపై ధ్యానం చేస్తే దాని ఫలితం ఎలా ఉంటుందంటారు? భగవంతుడు నాలో ఉన్నట్లే దానిలో కూడా ఉన్నాడు కదా?

ఫలితం ఘోరంగా ఉంటుందంటాను. ఎందువల్లనంటే అన్నిరకాల ప్రభావాలకు ఉన్మీలనమై ఉండటం అంత అభిలష నీయం కాదు.

*

ఈ ఉదయం వచ్చినామెతో నేను యధేచ్ఛగా మాట్లాడాను. కానీ మాట్లాడుతున్నంత సేపూ నాకేదో మంటల మధ్య నున్నట్లనిపించింది. ఆ తర్వాత రోజంతా జ్వరం వచ్చినట్లయింది. ఇదంతా ఆమెతో సన్నిహితంగా ఉండటం వల్లనే జరిగింతి కాబట్టి ఆవిడ నుంచి తప్పించుకొని తిరగమంటరా?

ఆమెను తప్పించుకోవాలనుకోవటం కంటే నీ చైతన్యాన్ని మార్పు చేసుకోవడమే మంచిది. బాహ్యంగా తప్పుకోడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. నీ చైతన్యం ఇతర ప్రభావాలకు లోనుకాకుండా దైవానికే ఉన్ముఖమై ఉండటం మంచిది.

*

నా ప్రేమ ఎప్పుడూ నీకు ఉంటుంది. నీకది అనుభవం కావటం లేదంటే దానర్థం నువ్వు దాన్ని స్వీకరించలేకపోవటమే. నీ గ్రహణశక్తిని వృద్ధి చేసుకుంటే నా ప్రేమను గ్రహించగలుగుతావు. అలా వృద్ధి చేసుకోవాలంటే నీలో ఉన్మీలత (opening) పెంపొందాలి. ఉన్మీలన పెంపొందాల్నంటే నిన్ను నువ్వు సమర్పించుకోగలగాలి. నువ్వు చైతన్యవంతంగా దివ్యశక్తులనూ, దివ్య ప్రేమనూ చేదుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తూనే ఉంది. ఆ పద్ధతి సరైనది కాదు. ఇచ్చి పుచ్చుకోవటంలో లాభనష్టాలు బేరీజు వేయకుండా, ప్రతిఫలాపేక్ష లేకుండా ఆత్మసమర్పణ చేసుకుంటే, చక్కగా స్వీకరించగలిగే సామర్థ్యం నీకు కలుగుతుంది.

*

ఒక జ్యోతిపై ఎంతో ధారణ చేశాను కానీ, దాన్ని ప్రజ్వలింప చేయలేకపోయాను. నా ఆకాంక్ష దాన్ని వెలిగించటానికి సరిపోలేదు.

జ్యోతి ప్రజ్వలనం నీ పని కాదని చెప్పాను కదా! అది వెలిగించేది నేనే. నీవు ఉన్మీలునుడవై దాన్ని గ్రహించి చక్కగా కాపాడుకో.

*

శ్రీఅరవిందుల వారొసగిన మంత్రరాజము.

"ఓం శ్రీఅరవింద మీరా!

నా మనసు, హృదయము, జీవితం నీ వెలుగుకీ, నీ ప్రేమకీ, నీ శక్తికీ వివృతం చెయ్యి. సర్వత్రా ఆ దైవాన్నే దర్శింతును గాక."

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

ఉదార్ జ్ఞాపకాలు

ఓ రోజు శ్రీమాతను అడిగాను: "చాలా సంవత్సరాలుగా యోగ సాధన చేస్తున్నాను. అయినా శ్రీఅరవిందులవారి యోగం ఎలా చేయాలో సమంగా బోధపడటం లేదు. (వారి) గ్రంథాలన్నీ అధ్యయనం చేశాను. సాధనకి ప్రయత్నం చేస్తునే ఉన్నాను. ఎంత పురోగతి సాధించానో తెలియటం లేదు" సహాయం చేయమని మాతను అర్థించాను. "అంతా అపసవ్యంగా చేస్తున్నావు" – అన్నారు ఆమె. "అయితే నేనేమి చేయాలి?" అని అడిగాను. ఆమె అన్నారు "నీ కోసం నేను యోగసాధన చేస్తాను" (ఆ మాట వినగానే) వొళ్లు జలదరించింది. "అయితే మరి నేనేమి చేయాలి?" అని మళ్లీ అడిగాను. "నిన్ను నాకు సమర్పించుకో. నేను చేస్తాను (యోగం) నీ కోసం" అన్నారామె. "నేనెలా అర్పణ కావించుకోవాలి?" అంటే, ఆమె అడిగారు – "నీవు మనఃపూర్వకంగా (అర్పణ) కావించుకోదలచావా?" "అవును, నిశ్చయంగా అమ్మా!" అన్నాను. అపుడు మాత అడిగారు "ప్రొద్దుట నిద్రలేవగనే మొదట ఏమి చేస్తావు?" "పళ్లు తోముకుంటాను." "ఎలా తోముకుంటావు?" నాకు ఆశ్చర్యం వేసింది. ఎలాగేమిటి? "అందరిలాగే

అన్నాను" ఆమె అపుడు అన్నారు: "అంటే నీలో స్పృహ లేకుండా చేస్తున్నావు. నాతో చేస్తున్నానని ఆ పని చెయ్యి. నీవు ముఖం కడుగుకుంటూన్నప్పుడు నాతో కలిసి చేస్తున్నానని భావించు. తిండి తినేటపుడూ నాతో కలిసి తింటున్నాట్లు భావించు. నీతో తింటూ నేనూ ఆనందిస్తున్నానుకో." ఇంకా అన్నారు ఆమె: "ముఖ్యంగా, నీవు నిద్రకు ఉపక్రమించే ముందు నా స్పృహలో ఉండవలసిన సమయం. నన్ను జోగొట్టనీ నిన్ను. అపుడు రాత్రంతా నా చైతన్యంలో శయనిస్తావు. మరునాడు నిద్రలేచి దినచర్య ప్రారంభించినపుడు నా స్పృహ నీలో మరింతగా ఉంటుంది." కాబట్టి అన్ని సమయాలలోను శ్రీమాత మనతో ఉన్నారనే చైతన్యంలో ఉంటూ, ఆమెకే, ఉన్ముఖులమై ఉండాలి.

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సమాచార పత్రం

ఆగస్టు 15, 2006 న శ్రీఅరవిందుల 134 వ జయంతి పాటించబడుతుంది. ఆ సందర్భంగా సొసైటీ బీచ్ ఆఫీసులో ఈ క్రింది రెండు కార్యక్రమములు నిర్వహించబడుతవి.

1. శ్రీఅరవింద సొసైటీ వార్షిక సమావేశము – ఆగస్టు 12, 13, 14 తేదీలలో.

2. శ్రీఅరవిందుల గీతావ్యాసాలపై అధ్యయన శిబిర నిర్వహణ – ఆగస్టు 17 నుంచి 26 వరకు; డా॥ యం.వి. నడ్కర్ణిగారిచే ఉ. 9 గం. నుంచి 10, తిరిగి 10.30 నుంచి 11.45 వరకు. అందరూ ఆహ్వానితులే.

పూర్ణియా (బీహారు) బ్రాంచివారు, 2006 ఫిబ్రవరి 18-20 తేదీలలో యూత్ క్యాంపు నిర్వహించారు.

శ్రీఅరవింద సొసైటి, వడోదరలో 2006 ఫిబ్రవరి 4 నుంచి 6 వరకు గుజరాతు రాష్ట్రస్థాయి వార్షిక సమావేశం జరిగింది. రాష్ట్రంలో కేంద్ర, బ్రాంచీల నుంచి 103 ప్రతినిధులు హాజరైనారు.

శ్రీఅరవింద సొసైటీ చైర్మెన్ శ్రీ ప్రదీప్ నరంగ్‌గారు ప్రారంభో త్సవ సభకి అధ్యక్షత వహించారు. ప్రముఖ కవి, మాజీ వైస్ ఛాన్సలరు పద్మశ్రీ శ్రీ సీతాన్సు యశశ్చంద్రగారు సభా ప్రారం భకులు. ప్రొ. కిట్టురెడ్డి శ్రీఅరవింద సొసైటీ, పాండిచేరి వారు, ముఖ్య అతిథి. శ్రీఅరవింద నివాస్ యువ విభాగంవారు, శ్రీఅర విందులవారి 'భవాని భారతి' పై హృద్యమైన కార్యక్రమం అందిం చారు. విశ్వ సంస్కృత ప్రతిష్ఠానమ్ వారు సంస్కృత భాషాభి వృద్ధి ప్రోత్సాహం గురించి చర్చించారు.

కొవ్వూరు (ఆంధ్రప్రదేశ్) కేంద్రం వారు 'మాతృసంకల్ప' మాసపత్రిక ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. డా॥ సంపదా నంద మిశ్రా, శ్రీఅరవింద సొసైటీ, పాండిచేరి వారు ముఖ్య అతిథి.

ప్రతాప్ ఘర్ (యు.పి) 'అధిమానస అవరోహణ' పై గోష్ఠి 2006 మార్చి 12 న నిర్వహించారు. డా॥ జె.పి. మిశ్రా, ప్రిన్సిపాల్ M.D.P.G కాలేజీ, ప్రతాప్ ఘర్ వారు అధ్యక్షత వహించారు. శ్రీ తేజ్ బహదూర్ సింగ్, సీనియరు ఏడ్వకేటుగారు ముఖ్యఅతిథి.

నౌడా (యు.పి) బ్రాంచివారు వేదాధ్యయన కార్యక్రమం ఏర్పాటుచేశారు (25-3-2006)

భ్రమలు, తికమకలు – వీటి ప్రాతిపదికగా మన స్వభావం అవిరామంగా చరిస్తూ ఉంటుంది. దైవశక్తి దీనికి భిన్నమైనది. ఇది స్వేచ్ఛగా, నిదానంగా అనం తమైన అగాధపు లోతులలోని శాంతితో పనిచేస్తూ వుంటుంది. నిమ్నస్థాయి స్వభావం ఆత్మని ఆవరించ కుండా ఉండాలంటే మనం అనంతమైన ఆనందాన్ని ఆవహించుకొని దానితో తాదాత్మ్యత పొందగలగాలి.

శ్రీఅరవిందులు

July 2006: Rs. 15



Flower: Miracle

శ్రీఅరవిందులు

శాస్త్రవిజ్ఞానము


అఖిల భారత పత్రిక, జూలై 2006

శాస్త్రవిజ్ఞానము

విషయసూచిక

To see the composition of the sun or the lines of Mars is doubtless a great achievement; but when thou hast the instrument that can show thee a man's soul as thou seest a picture; then thou wilt smile at the wonders of Physical Science as the playthings of babies.

Sri Aurobindo



Sri Aurobindo

శాస్త్రవిజ్ఞానం

పరిణామక్రమంలో నాల్గుకాళ్ల జంతువు నుంచి రెండుకాళ్ల మనిషి ఏ దైవీముహూర్తంలో లేచి నిల్చున్నాడో తెలియదు. కాని, నాటి ఆదిమానవుడి నుంచి నేటి ఆధునిక మానవుడిదాకా మానవ మస్తిష్కం అవిశ్రాంతంగా బాహ్యప్రకృతి రహస్య అన్వేషణలో నిమగ్నమై ఉంటూనే ఉంది. వేల సంవత్సరాలుగా మానవుడు పరిసరాలతో పోరాడుతూ జీవనాన్ని సౌఖ్యవంతం చేసుకోవాలనే నిరంతర తపనతో తాపత్రయపడుతూనే ఉన్నాడు. భౌతిక, సాంకేతిక విజ్ఞాన ఫలితాలతో జీవితాన్ని సుసంపన్నం చేసుకున్నాడు. వైజ్ఞానికంగా యెంత యెదిగినా మనిషి మరుగుజ్జులానే ఉన్నాడు. ప్రకృతిపై ఆధిపత్యం పెరిగేకొలదీ తోటివానితో సహజీవనం దిగజారుతూనే ఉంది. మానవుడు సృష్టించిన మారణాయుధాలు భస్మాసురుని తలపిస్తున్నాయి. Man walks by his own choice into Hell's trap – అన్నారు శ్రీఅరవిందులు. ఇంకా అంటారు: An idiot hour destroys what centuries made. మానవుడుప బుద్ధిజీవిగా పరిమితమై ఉన్నంతకాలం ఈ ప్రమాదాలకు ఆస్కారం లేకపోలేదు. – ఆధ్యాత్మికత, అంతరంగ స్పృహ కావాలి. మనిషి భౌతికంగా ఎన్ని విజయాలు సాధిస్తే మాత్రం! He would guide the world, himself he cannot guide. మనిషికి అంతరంగ చైతన్యం ఒకటి ఉంది. One speaks within; a dim disturbing some what lives in man. ఆ జాడ తెలుసుకోవాలి.

శాస్త్ర సాంకేతిక విజ్ఞానాలతోపాటు ఆధ్యాత్మిక ఉన్నతి, ఆత్మజ్ఞానం సాధించనిదే మనిషి మనుగడ దిన దినగండమే. The wonders of science are great and the wonders of God are even greater. శాంతి, సద్భావము, సహకారము, దయ, సహనము, సామరస్యము – ఆధ్యాత్మిక లక్షణాలు. ఇవి లేని భోగభాగ్యాలు నిష్ప్రయోజనాలు.

శాస్త్ర, ఆధ్యాత్మిక విజ్ఞాన సమన్వయ సాధన గురించి శ్రీఅరవిందులు చాల విపులంగా చర్చించారు. బుద్ధి సంబంధి

భౌతికవిజ్ఞానము, ఆత్మసంబంధి ఆధ్యాత్మిక విజ్ఞానము – పరస్పర పూరకంగా, వ్యక్తి పూర్ణవికాసానికి దోహదకారిగా ఉండాలి. ఇంద్రియాతీత అంతరంగ విజ్ఞానానికి సైన్సు చాలదు. '...the grandeurs of the Infinite' ఏ సైన్సు ఆవిష్కరించగలుగుతుంది! కావల్సినది అంతరంగ విషయపరిజ్ఞానము. అదే యోగవిజ్ఞానము. ఇది వినా మరి ఎంత అయినా అది అల్పమే!

– సంపాదకుడు

అద్భుతము

అద్భుతము అనేది ఒక ఆకస్మిక అవరోహణ. అంతే తప్ప మరోటి కాదు. నిమ్న భౌతిక తలము మీదకి పొంగిపొరలి వచ్చే అన్య చైతన్యశక్తి ప్రవాహం. ఉన్నతతల వ్యవస్థ నుంచి భౌతికతల వ్యవస్థ మీదికి విసరివేయబడేది (చైతన్యశక్తి) ఇవి మేఘాలను చీల్చుకొనివచ్చే అతీతశక్తుల కదలికల పరంపరలు. పైలోకాల నుంచి క్రింది మన భౌతికలోకానికి ఇలాటి ఆకస్మిక దాడులు అసాధారణం కావు. ఇవి ఎప్పుడూ దృగ్గోచరమయేవే. కాకపోతే వీటిని గమనించటానికి కళ్లు ఉండాలి. ఉంటే మనకెన్నో అద్భుతాలు కంటపడతాయి. ప్రత్యేకంగా ఉన్నత చైతన్య ప్రభావాలను క్రిందికి భూభౌతిక చైతన్యాల లోనికి తీసుకురావాలని కృషి చేసేవారికివి సర్వసాధారణం.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(CWM Vol. 3 P. 81)

స్థిరతలు

అగాథ తలంలో మరిన్ని అగాధాలు; ఉన్నత శిఖరాల కతీతంగా మరెన్నో ఉన్నతోన్నత శిఖరాగ్రాలు. అనంతత్వపు వాకిళ్లలోకి చేరుకున్నపుడే సత్త సంపూర్ణతను సంతరించుకుంటుంది. ఆ సత్వమే అనంతత్వం; దైవము.

అనంతశక్తి జ్ఞానానందాల కోసమే నా ఆకాంక్ష. నేను దానిని పొందగలనా? తప్పక. కానీ, ఆ అనంతానికి అంతం ఎక్కడ? అందుకే దానిని చేరుకున్నాను అనుకోకు. నేనే అది కావాలి. అంతే! దైవము కాగలగడమే దైవాన్ని చేరుకోగల్గడం.

అయితే, ఈలోగా ఆయనతో కొన్ని సంబంధాలు నెల కొల్పుకోవచ్చు. భగవంతునితో అనుబంధాలు నెలకొల్పుకోవడమే యోగం అంటే. అదే ఆనందపారవశ్యం. మహోన్నత ప్రయోజనము. మానవులుగా మనం మన పరిధులలో ఈ సంబంధాలను దైవంతో పెట్టుకుంటున్నాము. ఇవే మన ప్రార్థన, ఆరాధన, పూజ, నివేదన, ఆలోచన, నమ్మకం, విజ్ఞానం, వేదాంతం. మన కతీతమైనవి ఇంకా కొన్ని వున్నాయి. అనేక విధాలుగా దైవంతో మనం చేస్తున్న అనుసంధాన సాధననే యోగం అంటున్నాం.

మనం ఆ స్థితిని దైవం అనుకోకపోవచ్చు ప్రకృతి అని తెలుసుకున్నా, ఉన్నతోన్నతస్థితి అనుకున్నా, అనంతం అనుకున్నా, అవాఙ్మానస గోచరమనుకున్నా (పొందరాని స్థితి అనుకున్నా) అనుకోవచ్చు. బుద్ధుడు ఆ విధంగా అతనిని చేరుకున్నాడు. అలాగనే ఏమాత్రం రాజీపడని అద్వైతి చేరుకున్నాడు. అలాగే అతను నిరీశ్వరవాదికీ లభిస్తాడు. పదార్థవాదికి పదార్థంలోనే దాగి వుంటాడు. శూన్యవాదికి శూన్యంలోనే శూన్యంగానే గోచరిస్తాడు.

యే యథా మాం ప్రపద్యంతే తాం స్త థైవ భజామ్యహాం

గీత (4/11)

నన్ను ఎవరు ఎలా సేవిస్తే వారిని అలా అనుగ్రహిస్తాను.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కొంగర భాస్కరరావు

శాస్త్రీయ దృక్పథము

నిత్యమూ పోగుపడే మంచిచెడులు సత్యాసత్యములు ఈ విరుద్ధ ఆలోచనాపరంపరలు మనస్సును అంటుకొని ఉంటాయి. దీని స్వభావం తర్కించటం. దీని నుండి విడిపోవటమే విజ్ఞానశాస్త్ర తత్త్వము. యదార్థ శాస్త్రవేత్త సత్యజిజ్ఞాసువు కావాలి. ప్రాచీన వాసనల నుండి విడిపోవాలి. పరిశీలనకు హేతువుకు నిలువని సిద్ధాంతాలు ప్రతిదానిని నిరూపణ కాబడే వరకూ సందేహించటం, నిరూపణకు నిలువనంత వరకూ దేనినీ అంగీకరించకపోవటం. క్రొత్తగా కనుగొన్న నిజాలు దృష్ట్యా పాత సిద్ధాంతాలు పునర్విమర్శించటం, కొత్త పాతల భేదం లేకుండా అవన్నీ పరస్పర విరుద్ధంగా కనిపించినా, విచారణకి యోగ్యమైతే వాటి సత్యాసత్యాలు అనుభవపూర్వకంగా సిద్ధాంతీకరించితే వాటిని గురించి సత్యాన్వేషణ దృక్పథంలో పునరాలోచించటం యదార్థ శాస్త్రవేత్త లక్షణం. విచారణ లేకుండా ముందుగానే చేసే నిర్ణయాలు, పక్షపాతంతో కూడినవిగా ఉంటే, అవి సత్యానికి, సంకెళ్లలా బంధిస్తాయి. ఈ సంకెళ్లను ఉన్నతమనసుతో (the higher mind) తొలగించుకోవలసినదే! ఇది భౌతికవాదికి, ఆధ్యాత్మికవాదికి అందరికీ అన్వయిస్తుంది. భౌతికవాది ఆధ్యాత్మిక యోగానుభవాలను కాదనటం కాని, మతవాది విజ్ఞానశాస్త్రాన్ని నిరసించటంకాని ఉత్తమ లక్షణం కాదు.

*

విజ్ఞానశాస్త్రం స్వాభావికంగా భౌద్ధికజ్ఞానవికాస సంబంధం అయినది. ఇది బుద్ధి వ్యాపారం. దాని దృష్టి శరీర, ప్రాణరూపాలు వాటి పరిసరాలకు పరిమితమై వాటిని వశపర్చుకోటానికి ప్రయత్నిస్తుంది. భౌతిక పదార్థశక్తులను పరిశీలించి తత్సంబంధజ్ఞానాన్ని పొందటం విజ్ఞానశాస్త్రం యొక్క లక్షణం. అవి ప్రధానంగా బుద్ధి పరిధిలో సంచరించినా. మనిషి ఈ పదార్థ, ప్రాణికాలపై కాలూని నిలబడటానికి ఆధారమైనవి. భౌతికజ్ఞానంతో భౌతికాతీత ప్రకృతి (Superphysical nature) ధర్మాలు, సంభావ్యతలు తెలియబడు

తవి. శరీర ప్రాణికశక్తులు ఆధారంగా వాటి అతీతసీమలను అందు కోగలుగుతాము. అందుకే వీటిని పరిపూర్ణం చేసి ఉపయోగించు కోవాలి. భౌతిక ప్రకృతి న్యాయసూత్రాలు శక్తులు పూర్తిగా అవ గతం కావు. కనుక ప్రాచీన మానసిక, మానసికాతీత (psychic) చైతన్య శాస్త్ర విజ్ఞానం పరిపూర్ణమైన భౌతికజ్ఞానం మీద ఆధార పడి ఉంటుంది. ఈ నూతన శకావిర్భావానికి ఉషోదయ సూచి కలు అగుపిస్తున్నాయి. కాబట్టి భౌతిక విజ్ఞానం మనస్సును సుశి క్షితం కావించటానికి ప్రాధమిక అవసరము. మానవుడు ఈ నూతన కృషితోనే, దివ్యప్రకృతిని (Nature) తెలుసుకొని, తన అంతర్లోకాన్ని తాను స్వాయుత్తం చేసుకోగలడు.

*

విజ్ఞానశాస్త్ర, తత్వశాస్త్ర పరిశీలనలు, నిర్ణయాలు – మతసిద్ధాంత, నైతిక నియమావళి, సౌందర్య పక్షపాతాలు – ఇవి పరస్పరం సమన్వయం కావు. వాటి మానాన వాటిని వదిలిపెట్టి వేయాలి. చివరికి అవే – సత్యశివసౌందర్యాలతో సమన్వయం కాగలుగు తవి. అంతేకాక ఒక ఉన్నత పరమార్థాన్ని కూడా సమకూరు స్తాయి. ఈ పని, మత సిద్ధాంతము, నైతిక నియమం, సంకుచిత సౌందర్యభావన చేయలేవు. పోతే ఇవి కొండొకచో దైవాన్ని కూడా తిరస్కరిస్తాయి. అయినా ఫర్వాలేదు. ఆ తిరస్కారాలన్నీ తిరిగి వాటి ఆవర్తనంలో (in their circling) ఒక ఉన్నత సత్య సోధన దిశగా పురోగమిస్తాయి. తిరస్కరించిన సత్యానికే తిరిగి చేరుకుంటాయి. ఒక్కోసారి నాస్తికత – వ్యక్తిగతంగా లేక సామా జికంగా – లోతైన ఆధ్యాత్మిక సత్యసాధనకి అవసరమౌతుంది. దైవం ఎక్కడ ఉన్నాడు? అన్న సందేహంతోనే కదా దైవాన్వేషణ ఆరంభమయేది! హృదయపూర్వకమైన సంశయాత్మకత, నిరాక రణల ద్వారానే దైవశోధన అనివార్యంగా సిద్ధిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: తుమ్మపూడి కోటేశ్వరరావు

విజ్ఞానశాస్త్ర ప్రయోజనము

తార్కిక భౌతికవాదం (rationalistic materialism) వల్ల, మానవ జాతికి అపారమైన ప్రయోజనం కలిగిందని మనం ఒప్పుకోవడం సబబు. మానవాళి ఇంకా ఆ మార్గంలోనే కొనసాగుతోంది. కఠోరమైన తపోదీక్షతో నిష్ఠాగరిష్ఠతను పాటించగల మేధస్సు కలిగి ఉన్నప్పుడే అది ఆవిష్కరించిన సువిశాల కార్యరంగంలోనికి ప్రవేశించగలం. అపరిపక్వ మనసులతో బలవంతంగా దానిని ఆక్రమించగలిగితే అది అత్యంత హానికర అపార్థాలకు, అసంబంధ ఊహాగానాలకు దారితీస్తుంది. గతంలో బీజప్రాయంగా ఉన్న అసలు సత్యము (a real nucleus of truth) కుటిల మూఢవిశ్వాసాలు, మరియు అవివేకపు సిద్ధాంతాల పొరలతో కప్పివేయబడి, సత్యజ్ఞాన సముపార్జన దిశగా పురోగమించుట అసాధ్యమైంది. ఆ పరిస్థితిలో సత్యము, దానిని మరుగుపరచిన కుతర్క సిద్ధాంతాల ముసుగుతో సహా – మొత్తం అంతా తుడిచిపెట్టుకుపోయింది. ఒక క్రొత్త రహదారి ఏర్పడింది. ఇది ఖచ్చితమైన పురోగతికి ఒక క్రొత్త మలుపు అని చెప్పుకోవాలి. తార్కిక భౌతిక పెనుగాలి దుమారం వల్ల ఈ పని జరిగింది. ఈ రకంగా హేతువాదం, భౌతికవాదం జాతికి మేలే చేసిందని చెప్పాలి.

ఇంద్రియాతీత శక్తులు, ప్రజ్ఞలు పదార్థపు వలల్లో చిక్కుకొని వున్నందువలనను, భౌతిక శరీరం కర్మను నిర్వర్తించుటకై నియోగింపబడుట వలనను, భావోద్రేకపు కోరికలు కలవరపరచే ప్రేరణలతో పాటుగా తాము కూడ పదార్థ చట్రంలో బందీలు అయిపోతాయి (immeshed in matter). భౌతికశరీర నివాసంగా వాటి కర్తవ్య నిర్వహణ, మానసోద్వేగ కామనలు, నాడీవ్యవస్థ యొక్క బలమైన ప్రచోదనలు శరీరశకటాన్ని నడిపించడంలో, సత్యశోధన కృషిలో ఆటంకాలుగా గందరగోళం సృష్టిస్తాయి. కాబట్టి మసగలేని స్వచ్ఛమైన, క్రమశిక్షణతో కూడిన బుద్ధిని ఆధారం చేసుకుని అభివృద్ధి పొందుతూ ఉన్న విజ్ఞానాన్ని సద్వి

నియోగం చేసుకోవాలి. లేకపోతే ఇది వెర్రితలలు వేసి అప భ్రంశానికి దారితీస్తుంది.

*

ప్రస్తుతం మానవజీవితంలో అంతర్జాతీయభావన అభివృద్ధి చెందుటకు అనుకూలమగు పరిస్థితులు, వైఖరులు ఎంతగానో ప్రబలివున్నాయి. ఇట్టి అనుకూలశక్తులలో అంతర్జాతీయ జీవనబంధాలు రోజు రోజుకు ఒకదానికొకటి చేరువగుట, పరస్పర సంబంధానుబంధ కేంద్రాలు, సమాచార సాధనాలు గణనీయంగా పెరుగుట, ఆలోచనల్లోను, విజ్ఞానశాస్త్రంలోను, విద్యలలోను సామ్యత పెంపొందుట అత్యంత బలోపేతమైనవి. ముఖ్యంగా, విజ్ఞానశాస్త్రం ఈ దిశలో ఒక అపూర్వశక్తిగా అవతరించింది; ఎందుకంటే విజ్ఞానశాస్త్ర సిద్ధాంతాలు సర్వజనులకు సమానమే, దాని పద్ధతులు అందరికీ అందుబాటులో ఉంటాయి, దాని ఫలితాలను అందరూ అందుకోగలరు. అంతర్జాతీయత దాని సహజ లక్షణము; విజ్ఞానశాస్త్రము జాతికి అవిభాజిత వారసత్వము. దేశీయ విజ్ఞాన శాస్త్రమంటూ వేరుగా ఏదీ ఉండదు. అందువలన విజ్ఞానశాస్త్రవేత్తలకు దానితో అధికంగా ప్రభావితులైన వారికి అంతర్జాతీయ స్ఫూర్తితో ఎదుగుట సులభమవుతుంది. ఇప్పుడిప్పుడే ప్రపంచం విజ్ఞానశాస్త్ర ప్రభావాన్ని తెలుసుకొని దానిని జీవనవిధానంలో విలీనం చేసుకొనుట ఆరంభించింది. అంతేకాక, విజ్ఞానశాస్త్రం ప్రపంచంలోని ఒక భాగానికి మరొక భాగంతో సన్నిహిత సంబంధాలను నెలకొల్పింది. తత్ఫలితంగా అంతర్జాతీయతా భావన వృద్ధి చెందుతున్నది. వివిధ దేశాల జనజీవన అలవాట్లు సర్వులకూ ఆచరణ సాధ్యమగుట సర్వసాధారణమైంది. అంతేకాదు, దేశీయ పౌరులుగా రాణించేవారెందరున్నారో, అంతర్జాతీయ పౌరులుగా రాణించేవారు కూడ అంతకన్న ఎక్కువ సంఖ్యలోనే వున్నారు. ఒక దేశపు విజ్ఞాన వృద్ధి, కళ, సంస్కృతి, మతము, ఆలోచనలపై ఇతర దేశాలవారికి ఆసక్తిని పెంపొందిస్తోంది. వారిలో పాతుకుపోయి వున్న దురభిమానము, దురహంకారము, వేర్పాటువాదము కనుమరుగౌతున్నవి.

విజ్ఞానశాస్త్రం జీవితంపై సలిపిన పరిశోధనలో కనుగొనబడినదేమిటంటే, వ్యక్తిగత జీవితం సురక్షితంగాను, సమర్థవంతంగాను సాగుతూ, ఇతరులతో సన్నిహిత సంబంధాలను నెలకొల్పుకొనుట ద్వారాను మరియు సామూహికంగా సాధించే స్వయం అభివృద్ధి పథకాలను అనుసరించుట ద్వారా బలపడుతుంది, కాని దౌర్జన్యపూరిత స్వయం నిర్ణయాలను అమలుపరచుట ద్వారా కాదు. వాస్తవానికి, ప్రకృతి కాపాడదలచేది వ్యక్తిని కాదు. ప్రకృతి విలువల కొలమానం ప్రకారం ఏ ఒక్క వ్యక్తికో, జంతువుకో, కీటకానికో కాక, ఒక జట్టుకు, మందకు, తట్టుకే ప్రాధాన్యత. అందువల్ల విషయాలను న్యాయబద్ధంగా పరిశీలిస్తే, వ్యక్తి అందరికోసం జీవించాలి. జాతి ఎదుగుదలకు, జాతి సామర్థ్యానికి, జాతి పురోభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ స్వార్థప్రయోజనాలను త్యాగం చేయాలి. తన అవసరాల కన్నా జాతి మనుగడ ప్రధానమైనదిగా భావించాలి. నూతన సమిష్టివాదానికి, జయప్రదమగు శక్తి సామర్థ్యాలు, ఈ వినూత్న జ్ఞానం మానవ ఆలోచన ధోరణిపై చూపిన ప్రభావంవలన సమకూరినవి.

*

లౌకిక జీవితంలో నూతన భౌతికవాదం కేవలం ఒక అస్పష్టమైన రాజీమార్గమే అయినట్లయితే, పురోగతి అనిశ్చితంగా ఆలస్యం అయేది. కాని దాని ఆంతర్యం విజ్ఞానాన్వేషణ. ఇది ఆగేది కాదు. ఈ అభివృద్ధి ఇంద్రియజ్ఞానపు అడ్డంకులను అధిగమిస్తుంది. దాని శక్తి సాఫల్యతలు వాస్తవమని తేలుతుంది. అడ్డంకులను అధిగమించుటకై ఒక్కమారు అడుగు ముందుకు వేసి ఆవలనున్న దానిని జయించుటలో ఈ శక్తి సాఫల్యతలు మరోమారు ప్రస్ఫుటమౌతాయని ఆశించవచ్చు. ఆ పురోగమన ప్రారంభాలు మసగ మసగగా మనకప్పుడే అగుపిస్తున్నాయి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

సైన్సుయొక్క పరిమితులు

సైన్సు బుద్ధి సంబంధి. ఇది బాహ్య విజ్ఞానము, సత్యశోధన ప్రక్రియలు – అవి కూడా – అసమగ్రంగానే సమకూర్తుస్తుంది. బుద్ధికి అందేవి సైన్సు ద్వారా కొన్ని పట్టుబడతది. మరి బుద్ధికి అందనివి ఎన్నో ఉన్నాయి కదా; వాటి మాట ఏమిటి? ప్రకృతిలో జరిగే ఎన్నో సంఘటనలు ఎందుకు, ఎలా జరుగుతున్నాయో పశికట్టలేం. ఎన్నో ఆశ్చర్యకరమైన విషయాలు సైన్సు సాధించింది. ఇంకా యెన్నో సృష్టిస్వరూప స్వభావాల విషయంలో సైన్సు అజ్ఞానంలోనే ఉంది. వీటికి సంబంధిత మూలకారణాలు, సహేతుకమైన వివరణలు (the rationale) ఇంకా నిగూఢంగానే ఉన్నాయి. ఈ సువిశాల, సుసంపన్న వైవిధ్య ప్రపంచం, దానితో కూడిన జీవము, బుద్ధి, చైతన్యము, వీటి కార్యకలాపాలు – ఇవన్నీ సారూప్యమే అయినా, వాటి ఏర్పాట్లలో వైవిధ్యం కలిగిన ఎలక్ట్రాన్ల ద్రవ్యరాశి నుంచి పరిణామక్రమంగా నిర్మాణం కాబడినట్లు సైన్సు పేర్కొంటున్నది. ఇది బుద్ధికి అందని ఇంద్రజాలమని, ఒక విరోధాభాసమని (paradox) అంటుంది. ఈ సృష్టి అంతా క్రమపద్ధతిగా పైకి కనిపిస్తున్న యాదృచ్ఛిక సంఘటన అంటుంది. (అఘటన-ఘటనా-పటీయసీ) హేతువాదానికి అందని అద్భుత సంఘటన అంటుంది. ఇక్కడ సైన్సు సారభూతమైన ఒక అంశాన్ని విస్మరించింది. సృష్టి ఎలా జరిగినది? ఏమి జరిగినది? విచారణ చేసింది. కాని అసంభావ్యమైన దానిని సంభావ్యం కావించినదేదో తెలుసుకోలేకపోయినది. అవ్యక్తం కానిది ఎలా వ్యక్తం కాబడినది? ఈ ప్రశ్నకి సమాధానం సైన్సు దగ్గర లేదు. గమనించాల్సినది ఇక్కడ ఏమంటే – దైవ అస్తిత్వాన్ని విస్మరించి నీవు ఏ అంశాన్ని ప్రస్తావించినా అది తన ప్రాథమిక ప్రాముఖ్యతను కోల్పోతుంది. కారణం – నీవు ఎంత సేపూ బ్రహ్మాండమైన ఉపరితలం పైననే అంటిపెట్టుకుని ఉంటావు. అలాటపుడు నీవు లోతులు ఎలా కనుక్కో గలుగుతావు? ఐంద్రజాలికుని, ఇంద్రజాలాన్నే నీవు ఎంతసేపూ విశ్లేషిస్తావే తప్ప, ఐంద్రజాలికుని అంతరంగ వైభవం

పట్టించుకోవు కదా! అలాటపుడు ప్రాథమికమైన ఆరంభము, ప్రాముఖ్యత, దివ్యలీలావృతులు ఎలా అనుభావ్యము కాగల్గుతవి! దివ్య అస్తిత్వ శక్తిని తెలుసుకునే ప్రయత్నం ఆరంభించాలి. 'ఆరంభించాలి' అని ఎందుకు అంటున్నానంటే దివ్య అస్తిత్వము (the Divine Reality) అంత సులభగ్రాహ్యాం కాదు; ప్రప్రథమ సంసర్గంతోనే అవగాహన కాదు. ఏకసూత్రంగా నిబద్ధించబడినదీ కాదు. అనంతమైనది (infinite) అనల్ప విజ్ఞానమది. సర్వభౌతిక శాస్త్ర విజ్ఞానము దాని ముందు అల్పమే! ఆ దివ్యజ్ఞాన సంసర్గం – ఏకం సత్ – లో సర్వమూ గ్రాహ్యామౌతుంది.

*

కొంతకాలం క్రితం – సుమారు 20 వ శతాబ్ది ప్రాథమిక దశలో సైన్సు, ఆధ్యాత్మిక సంబంధం గురించిన సమశ్యకి ప్రజల మనస్సులలో ప్రముఖస్థానం ఉండేది. కాని ఇపుడది అప్రస్తుతమైనది. విషయముల అంతస్సత్వ, స్వభావ శోధన, అంతస్సత్వ నిర్ణయం వల్ల కాదనే నిర్ణయానికి సైన్సు వచ్చింది. భౌతిక విషయ ప్రక్రియలు, వాటి తీరుతెన్నులు, వ్యవహారసరళి, ఉపయోగాలు – ఇంత వరకే సైన్సు పరిమితం. కొన్ని పరిమితులకు లోబడే, పని చేయ గలదనే సత్యాన్ని సైన్సు గుర్తించింది. దైవము, ఆధ్యాత్మిక సమశ్యలు, అంతిమ అస్తిత్వము (the ultimate Reality) ఇవి సైన్సు పరిధిలోనికి రావనే విషయం సైన్సు తెలుసుకొన్నది. ఇది యూరపు ఖండంలో అంగీకరింపబడినది. ఇంగ్లాండు, అమెరికా దేశాలలో మాత్రము ఈ దిశగా భౌతికశాస్త్రపరంగా అన్వేషణ ఇంకా కొనసాగుతోంది.

*

ఇక్కడ ఒక ప్రశ్న. భగవంతుని తెలుసుకోకుండా పుష్పం గురించి తెలుసుకోగలమా? దాని రూప, నామముల గురించి తెలుసుకోగలం, రూపమును సైన్సు విశ్లేషిస్తుంది. నామము వేదాంతము తెలియపరుస్తుంది. (name by the aid of philosphy) కాని స్వరూపము? ఇందుకు తగిన మూడవ ఉపకరణమేదో కావాలి. ఇంద్రియాలు, మైక్రోస్కోపు, టెలిస్కోపు పరిపూర్ణ విజ్ఞానాన్ని

సమకూర్చలేవు. (నా సందర్శే తిష్ఠతి రూపమ్ అస్య) 'తత్' 'Tha t' – దృష్టి, వాక్కు మనస్సులకు అతీతమైనది. (న వాగ్గచ్ఛతి, నా మనః) తర్కానికి అందనిది. (నైషాతర్కేన మాతిర్ ఆపనేయా) ఈ అశక్తతల కన్నిటికీ కారణం – one compelling cause – because of Sat, the truth of existence – బ్రహ్మన్ – వస్తువుల వాస్తవ స్వరూప స్వభావములు గుర్తు పట్టడానికి, విశ్లేషించటానికి అందవు. (అనోరణీయాంశమ్, అతర్క్యమ్,, అనుప్రమాణాత్) పంచభూతాత్మకమై, సూక్ష్మత కంటే సూక్ష్మాతిసూక్ష్మమైనది (It is subtler even than elemental subtlety) కాబట్టి అనుమాన ప్రమాణములు, ప్రేరణ, నిశ్చయము, నామరూపాల పరిశీలనలలో వాస్తవ సత్యం కనుగోబడదు. కొంతమంది వేదాంతుల వేదాంతాలచే ఈ సత్యము విస్మరింపబడుతోంది. 'స్మృతి' (వేదం) మాత్రము దీనిని నొక్కి వక్కాణిస్తోంది.

*

శాస్త్రవేత్త (scientist) సంకుచిత పరిమిత సత్యాలను మాత్రమే అంగీకరిస్తాడు. మిగిలినదంతా భ్రాంతి, మోసం, మనోకల్పన అని తిరస్కరిస్తాడు. పైగా తాను వేదాంతి తప్పులను సరిదిద్దుతున్నాను అంటాడు. అతని సంశయాత్మకత, విచారణకు ముందే ఏర్పరుచుకున్న అభిప్రాయధోరణి విదితమే. అనుభవాలు, భావాలు, ఇవన్నీ కూడా సత్యములే అనే విషయాన్ని ఇతను విస్మరిస్తాడు. తన వైయ్యక్తిక పరిజ్ఞానమే నిశ్చితమైనదని భావిస్తాడు. ఇంద్రియాలు అందించిన భౌతిక ప్రపంచ చైతన్యస్పందనలను గురించి అవగాహన చేసుకోడు, సరికదా – తన వైయ్యక్తిక జ్ఞానప్రమాణాలతోనే ఇంద్రియ పరిజ్ఞానాన్ని బేరీజు వేసుకుంటాడు. భౌతికవాదులకు బాహ్యేంద్రియ పరిజ్ఞానమే ఆమోదయోగ్యము. ఈ ఇంద్రియాల ద్వారానే బాహ్యేతర పరిజ్ఞానాన్ని కూడా అందుకోగలమనే సత్యాన్ని పిచ్చితనమని కొట్టిపారేస్తారు. 'నాకు ఆకలేస్తోంది' – అంటే – కావచ్చు; నీవు చెప్పావు కాబట్టి అంటారు. 'భౌకాతీత ఆనందం ఏదో నాలో నిండి ఉంది' – 'ఈ సూర్యరశ్మికి అతీతమైన దివ్యకాంతి సీమలలో నేను విహరిస్తున్నాను.

నాకిది అనుభవైక వేద్యంగా ఉంది' – అంటే సైంటిస్టు ఏమం టాడో తెలుసా! వీడు పిచ్చి ఆసుపత్రికో, జైలుకో పంపించవల సిన వాడు అంటాడు. భూమి సూర్యుని చుట్టూ తిరుగుతోందని ఎవడు చూశాడు! మనకిది రోజూ విరుద్ధంగానే కనిపిస్తుంది. కంటికి కనపడని ఈ సత్యాన్ని సైంటిస్టు నమ్ముతాడు. భగవం తుడు ఉన్నాడు అని నువ్వు అంటే మాత్రం కోపంతో ముఖం త్రిప్పుకుని గంభీరంగా అడుగులు వేసుకుంటూ తన ప్రయోగ శాల వైపుకి దారితీస్తాడు. *

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

*: Essays Science and Dharma, 1996 Edn. p. 12.

విజ్ఞానశాస్త్రం వల్ల ప్రమాదాలు

మొదటి ప్రమాదం:

నవీన నాగరిక ముసుగులో అనాగరిక ఆదిమ భౌతిక మానవుడి పునరుద్భావం. శాస్త్రం మన కందుబాటులోనికి తెచ్చిన నూతన విధానాల వలన ఆధికారిక శక్తినీ, అస్తవ్యస్త నాగరిక తను బలవంతులైన అనాగరికప్రజలు నిర్మూలన చేసే అవకాశం చేజారిపోయింది. కానీ, ఈ ఆదిమ అనాగరక మానవుడు నాగ రికులమనబడే మనలోనే పునరుద్భావం చెందుట అనేదే మనల్ని ముట్టడించిన ప్రమాదం. మానవుడిని నిర్దేశించి నడిపించే ఉదా త్తమైన మానసిక, నైతికవిలువలు పూర్తిగా లుప్తమైన ఈ పరిస్థి తిలో చిక్కుకున్న మానవుడు, తనకు తానై ఆంతరంగిక ఆధ్యా త్మిక జీవితానుభూతుల లోనికి విముక్తి చెందటం కూడా సాధ్యం కాని పని ప్రాణికకక్ష్యలో వర్తించే భౌతిక మానవుడికి ఈ అని వార్య పరిస్థితి తప్పనిసరి అనిపిస్తుంది. ఉన్నత పరిణామ వాంఛ అణగారి, ఏ ఆదర్శమూలేని కరడుగట్టిన నేటి మానవుడి యాంత్రిక సాంఘికజీవనమే ఇందుకు ముఖ్యమైన కారణం. తర్కమనే పునాది పైన నిర్మించబడ్డ జాతి, అభివృద్ధిపథంలో పురోగమించలేదు.

ప్రాణికానికీ, శరీరానికీ మధ్యవర్తిగా వర్తించే అంతరంగ ఆధ్యాత్మిక జీవితానికి అవకాశమున్న జాతి మాత్రమే పురోభివృద్ధి సాధించగలదు. ఎందుకంటే ఈ 'మధ్యవర్తి' అనివార్యం గనుక. ఎప్పుడయితే మానవుడు తను అందుకున్న మానసికస్థాయి నుండి అతనిలో సుప్తంగా వుండి యింకా అనుభవంలోనికి రాని అనుభూతులను అందుకోలేకపోతాడో అప్పుడు ఆధ్యాత్మిక జీవితానికి మంగళహారతి పాడినట్టే. అమూల్యమైన అవకాశాన్ని పరిత్యాగం చేస్తే పరిణామంలో అతడు తిరోగమనం చెంది మళ్లీ మొదటి మెట్టు నుంచి ఆరోహణ ప్రారంభించటమో, ఆ పరిణామ ఆకాంక్షే లేకపోవటం వలన భ్రష్టుడై కొన్ని జీవరాసులలాగా అంతరించి పోవటమో జరుగుతుంది. మహా అయితే అటువంటి వాడు మధ్యంతరస్థితికి చెందిన జంతువుల పరిపూర్ణస్థితికి చేరి టక్కున అక్కడే ఆగిపోతాడు. కానీ ప్రకృతి మటుకు అటువంటి వాణ్ణి అక్కడే వదిలేసి, వాణ్ణి అధిగమించి ఉన్నతమైన సృష్టి సాగించడానికి పురోగమిస్తుంది. ప్రస్తుత మానవజాతి పరిణామస్థితిలో భవితవ్యాన్ని ఎటూ నిర్ణయించుకోలేని ఒక సంక్లిష్టస్థితిలో వుంది. ఎందుకంటే ఒక స్థాయి నందుకున్న మేధ కొన్ని దిశల్లో అపారమైన పురోగమనాన్ని సాధించినా, కొన్నిటిలో ఎటూ కదలలేని స్తబ్దతలో స్తంభించిపోతోంది. నిరంతర పరిశ్రమ వలన, చెదరని సంకల్పబలం వలన, మానవుడి భౌతిక జీవితం అభివృద్ధి చెందినా, మానవుడి తన యొక్క మానసిక, ప్రాణిక, భౌతిక వాంఛలు తీర్చుకోనడానికి తనే కల్పించుకొన్న అదుపు తప్పిన జటిలతర వ్యవస్థయొక్క పద్మవ్యూహంలో చిక్కుకొనిపోయాడు. అంతేగాక ఒక కుటిలమైన రాజకీయ, సాంఘిక, ఆర్థిక, వ్యవస్థీకృత సాంప్రదాయ యంత్రం కోరల్లో ఇరుక్కుపోయాడు. మేధోపరంగా, అనుభూతి పరంగా, భౌతికవాంఛల పరితృప్తి కోసం, వ్యవస్థీకృత ఉక్కు చట్రంలో చిక్కుకున్నాడు. అంతుచిక్కని సామర్థ్యం ఉన్నా అదుపు చేయలేని భయంకర వ్యవస్థలో నిస్సహాయుడైపోయాడు. మానవుడి దురహంకారం అదుపు తప్పి అతణ్ణి వాంఛల విషవలయంలోకి నెట్టి పారేసింది. విశాలదృక్పథంలేని మనస్సు, అంతర్

దర్శనం లేని విజ్ఞానం, చైతన్యంయొక్క ఉపరితలాన్ని కూడా అందుకోలేకపోతోంది. అంతులేని కోర్కెల అసంతృప్తులు కలిగించే వత్తిడిని తట్టుకోలేకపోతున్నాడు మానవుడు. వీటి నుంచి విముక్తి లభిస్తేగాని భౌతిక అస్తిత్వానికి, అతీతమైన ఉదాత్త ఆదర్శాల దిశగా పయనించలేడు.

సత్యం, శివం, సుందరం అనే ఆదర్శాలను దర్శించగలిగితే, ఇంకా ఉదాత్తమైన దివ్యశక్తిని మానవుడు ఆవిష్కరించగలుగుతాడు. ఆ శక్తే అతణ్ణి ఆదుకుని, జీవితాన్ని పరిపూర్ణం చేసుకునే అవకాశాన్ని కలిగిస్తుంది. అప్పుడు నూతనావసరాలను, సాధనాలను ఇతోధికముగా పెంచుకుంటూ పోయే సమిష్టి అహంకార విజృంభణ అదుపులోకి వస్తుంది. కాని ఇదే సమయంలో శాస్త్ర విజ్ఞానం, విశ్వశక్తి యొక్క సరికొత్త సాధనాలను మానవుడికి అందించింది. ఇది మానవజీవితాన్ని భౌతికంగా ఏకీకృతం చేసింది. ఇటువంటి విశ్వశక్తి వలన సామాన్య మానవుడికి వ్యక్తిగతంగా ఒరిగిన ప్రయోజన మేమిటి? విశ్వమానవ భావన లేని సమిష్టి అహంకారం విజ్ఞానశాస్త్ర తేజాన్ని నలువైపులా ప్రసరింపజేయగలదా?

ఒక జాతి అంతరంగం అజ్ఞానంచేత ఆవరింపబడి నిర్వీర్యమైనపుడు భౌతికమైన, ఐక్యతవలన దానికి భావైక్యతగానీ, సమైక్యతాయోగంగానీ, సిద్ధిస్తుందా? మానసిక భావ సంఘర్షణ వలన, వ్యక్తిగత, సమిష్టి కాంక్షల భౌతికావసరాల వలన, ప్రాణిక ఉద్రేకాలవలన, అజ్ఞాతమైన జీవశక్తి ప్రేరణవలన ఇంద్రియార్థాల్ని తీర్చుకునే దుష్టవాంఛా ప్రవృత్తులవలన ఏర్పడే అస్తవ్యస్త పరిస్థితులే అన్ని అనర్థాలకూ మూలం. విషపూరితమైన రాజకీయ, సాంఘిక, ఆర్థిక సిద్ధాంతాలు ప్రచారం చేసే నిరుపయోగమైన పరిష్కారాలు, హింసాయుత కుటిల మార్గాలు, అమృతంగా వర్ణింపబడే హాలాహలప్రాయమైన దౌష్ట్యమూ, ప్రజాస్వామిక ఆదర్శాలుగా తేనెపూసి ప్రజలపై రుద్దబడే నియంతృత్వ విధానాలు వికటాట్టహాసం చేస్తున్నాయి. శాస్త్రమూ, తర్కమూ భౌతికజీవనంలో కృతకంగా, ఏకత్వాన్ని సృష్టించడానికి కల్పించిన ప్రమాణీక

రణం, ప్రతీదాన్నీ ఒకే చట్రంలో బిగించే ప్రయత్నమూ అసహజమైన భౌతిక జీవితానికే దారితీస్తాయి. మానవజీవితాన్ని సంఘటితమూ, పరిపూర్ణమూ చేయడానికి మహత్తర శక్తీ, అఖండ జ్ఞానమూ, పరమోన్నతమైన పూర్ణత్వాన్నందుకున్న 'సత్త' – అవసరమౌతాయి.

నవీన యుగంలో భౌతిక విజ్ఞాన శాస్త్రాభివృద్ధి ద్వారా ఆవిష్కరింపబడిన పరిశోధనల వలన ప్రకృతిలో 'గుప్తంగా' ఉన్న రహస్యశక్తులు బహిర్గతమై మానవుడికి వినియోగపడ్డాయి. భౌతిక విజ్ఞానమే అన్నిటికీ మూలమైనదనీ, మనసు, ప్రాణము, పదార్థం యొక్క వివిధస్థాయిలకు చెందిన ప్రక్రియలలో ఆధ్యాత్మికతకు స్థానం లేదనే మిషతో వాటిని ప్రక్కన పడేశారు. భౌతికశక్తియే అన్నిటికీ ముఖ్యమని భావించి, మనస్సును, ప్రాణశక్తి ప్రవృత్తులనూ భౌతికసాధనాలతో నియంత్రించే ప్రయత్నంలో ఆధ్యాత్మికతను ఒక మానసిక ప్రవృత్తికింద కొట్టి పారేశారు. ఇటువంటి తప్పుడు నిర్ణయంతో ప్రారంభమైన ప్రయత్నం చివరిదాకా కొనసాగి విజయవంతమైతే అది మానవజాతి మనుగడకు ఎంత ప్రమాదం! మానసికంగా, నైతికంగా మహత్తరమైన ఆధ్యాత్మిక శక్తులను వాడుకోడానికి సిద్ధంగా లేని మానవాళి వాటిని దుర్వినియోగం, చేస్తుందని చెప్పవచ్చు. మన ఉనికికీ, మనుగడకూ ఆధారమైన అంతర్నిహిత శక్తుల గురించి ఏమాత్రం తెలుసుకోకుండా వాటిని కర్కశంగా నియంత్రించడానికి పూనుకుంటే మరేమవుతుంది? నవీన విజ్ఞానం తన భౌతికశాస్త్రావిష్కరణల గొప్పదనం కారణంగా భౌతికపదార్థం అస్తిత్వానికి ఆధారమన్న భావంలో ఒళ్లు మరచిపోతోంది. ఆత్మనూ, మనస్సునూ పరిశీలించేటప్పుడు కూడా భౌతికసమాచారం మీద మాత్రమే ఆధారపడి మానవ, జాంతవస్వభావాల్లో ప్రకృతిచేత చాలనం చేయబడే ప్రక్రియలను అసలు పట్టించుకోవటం లేదు. ఈ సందర్భంలో ప్రధానంగా అవసరమైన మనస్తత్వ విజ్ఞానం కూడా ముఖ్యమైనదనే అంశం విస్మరించబడింది. నవీన విజ్ఞానానికి తెలిసిన కాస్తంత మనస్తత్వశాస్త్రం కూడా కేవలం శారీరకశాస్త్రం – మెదడు, నాడీ

మండల వ్యవస్థల భౌతికాంశాల పరిశీలన మీదనే ఆధారపడి గ్రహించినది మాత్రమే.

ఈ కారణం చేతనే చరిత్ర, సమాజశాస్త్రాల పరిశోధనలో కూడా మానవుడి మనః ప్రవృత్తులను ప్రభావితం చేసే లోతైన భావోద్రేకాలనూ, అవచేతనలో శాశ్వతంగా వర్తించే భావమయ సత్తనూ పూర్తిగా విస్మరించి, న్యాయసూత్రాలూ, సంస్థలూ, ఆచార వ్యవహారాలు, కర్మకాండలూ, ఆర్థికాంశలూ, అభివృద్ధి మొదలగు భౌతికాంశాల సమాచారం మీద కేంద్రీకరించి పరిశోధనలు సాగా యంటే మనం ఆశ్చర్యపడవలసిన పని లేదు.

ఇటువంటి విజ్ఞానశాస్త్రం చరిత్రనూ, సాంఘికాభివృద్ధినీ, ఆర్థికావసరాల కోణం నుంచి మాత్రమే సాధ్యమయినంతవరకు వివరిస్తుంది. అంటే ఆర్థికశబ్దం యొక్క విపులార్థంలో అన్న మాట. చరిత్రకారుల్లో కొందరు మానవ సంఘవ్యవస్థ అభివృద్ధిపై కొన్ని భావాలకున్న ప్రాభావాన్ని, మేధావుల ప్రాబల్యాన్నీ అసలే పట్టిం చుకోకపోవటమో, తగ్గించి ఉటంకించటమో చేశారు. రూసో, వాల్టైర్ అనే రచయితలు కలం పట్టకపోయినా, పదునెనిమిదవ శతాబ్దపు ఆధ్యాత్మిక ఉద్యమం ప్రపంచ మౌలిక భావనా ధోర ణుల్ని ప్రభావితం చేయకపోయినా, ఆర్థికపరమైన కారణాల వల్ల ఫ్రెంచ్ విప్లవం అదే రీతిలో అప్పుడే సంభవించి వుండేదని కొందరి భావన.

*

ఆధునిక శాస్త్రవిజ్ఞానం సాధించిన అభివృద్ధి ఈ లోపు కొత్త భావాలను, ధోరణులనూ సృజించింది. – ఒక వైపు అతిశయిం చిన వ్యక్తిగత ప్రాగల్భ్యం (exaggerated individualism) లేక ప్రాణికాహంకార విజృంభణ (vitalistic egoism); మరోవైపు దానికి భిన్నధృవ మనదగిన సామూహిక ఆదర్శవాదం (collective idealism). విజ్ఞానశాస్త్రం జీవాన్ని పరిశోధించి, పరిశోధించి చివరకు స్వజాతి పరిరక్షణ, పరితృప్తి, ఆత్మోన్నత్యం కోసం పరి సరాలను తనకు అనువుగా మలచుకునేందుకు జరిగే సంఘర్ష ణమే అన్ని జీవరాసుల స్వభావం వెనుక దాగియున్న మౌలిక

లక్షణమని తేల్చారు. అనియమిత మానవ స్వభావం తన ధోర ణిలో తీవ్రమైన రీతిలో ఈ అంశం ఆధారంగా కఠిన, కర్కశ సిద్ధాంతాలను నిర్మించి వాటికి దైవవాక్కులుగా ప్రామాణ్యతను కల్పించింది. తను జీవించటం కోసం ఇతర జీవరాసులను విని యోగించుకోటమే కాక, అవసరమైతే తన ఉనికి కోసం వాటిని నాశనం చేసి తను బ్రతకటం కూడా అవసరమని బల్ల గుద్ది చెప్పింది.

దీని ననుసరించి ఒక వ్యక్తి ధ్యేయతను బలపడటం, నైపు ణ్యాన్ని పెంపొందించుకొనటం, శక్తిమంతుడై జీవించటం, జీవిం చినంతకాలం ఇతరులపై ఆధిక్యత వహించటం మాత్రమే. ఈ విధంగా తను కఠిన విధానంలో అహంకారపూరితుడై తనను తాను పెంచుకుని, చాతనయినంత సుఖాన్ని పొందటమే. దీనినే 'నీషే' (Neitzche) ఒకానొక రకమైన అరాచకత్వంగా వర్ణించాడు. ఇది ప్రాచీన తాత్త్వికులు ప్రతిపాదించిన వ్యక్తిగతమైన ఆదర్శ హేతువాద విధానానికి సహజమైన కొనసాగింపు కానే కాదు. ఇటువంటి అభిప్రాయాలే కొన్ని రకాలైన రాచరిక సిద్ధాంతాలను ప్రభావితం చేసి, స్థిరీకృతం చేశాయి.

*

ఒక విశాలమైన, గభీరమైన నూతన సంస్కృతికి పునాది వేసిన విజ్ఞానశాస్త్రం. తనది భౌతికవాద విధాన మార్గమైన, అనాగరక స్వభావంగల అసలైన ఆదిమ మానవుడి పునః ప్రవేశాన్ని అసం భవం చేసింది. అయినా తన ఆవిష్కరణలచేత, దృక్పథం చేత పరోక్షమైన ఆదిమ అనాగరిక మానవ ప్రకృతిని (barbarism) ప్రోత్సహించింది. దాని ఫలితమే పారిశ్రామిక వ్యాపారల సంబం ధమైన ఆర్థికయుగమని పేర్కొనవచ్చు. అది పెరిగి పెరిగి పతనా వస్థకు చేరుకుంది. ఈ ఆర్థిక ఆదిమ అనాగరిక మానవతా ప్రకృతి ప్రాణిక మానవుడికి చెందినది. ఇతడు ప్రాణిక అహంకార సత్వంతో వ్యక్తిగత సుఖానుభవమే జీవిత లక్ష్యంగా భావిస్తాడు. అతని జీవలక్షణం వాంఛ. వస్తు సంచయనమే అతనికి పుట్టుకతో వచ్చిన బుద్ధి, భౌతికదృష్టి గలిగిన ఈ అనాగరికుడు కండలు

తిరిగిన దేహాన్నీ, దాని పోషణనూ, భౌతిక బలాన్నీ, దేహదారు ఢ్యాన్నీ, ఆరోగ్యాన్నీ తన సర్వస్వంగా భావిస్తాడు. వ్యాపారదృష్టి గలిగిన అనాగరికుడు అవసరాలనూ, కోరికలనూ, వస్తుసంపాద ననూ జీవితధ్యేయంగా భావిస్తాడు. అతని దృష్టిలో ఆదర్శప్రా యుడెవరంటే సంస్కారవంతుడు, ఉదాత్తాశయుడు, తాత్త్వికుడు, నైతికుడు, మతనైష్ఠికుడూకాక, విజయవంతంగా అపార ధన సంపా దన చేసినవాడు. పెరగటం, ఆర్థికవిజయం సాధించటం, ఉత్పా దన పెంచటం, వస్తుసేకరణ చేయటం, ధనరాసులను పోగుజే యటం మాత్రమే అతని దృష్టిలో జీవితం – అస్తిత్వం. సిరిసంప దలను కూడబెట్టటం, కోట్లకు పడగలెత్తడం, తన ఐశ్వర్యాధిక్య తను ప్రదర్శించటం, సుఖలాలసత, కళాదృష్టిలేని ఆడంబర సౌక ర్యాలకై వెంపర్లాట, సౌందర్యరహితమైన అనుదాత్తమైన, సంప్ర దాయ చట్రంలో బిగింపబడిన మానవతను కోల్పోయిన బహి రంగ డంబాచారమూ, వృత్తివ్యాపారాలుగా మారిన రాజకీయ ప్రభుత్వ విధానాలూ, అఖరుకు ప్రతి సుఖమూ ఒక వ్యాపారంగా మారిన హృదయంలేని సంపూర్ణ వాణిజ్యవ్యవస్థ – ఇవే జీవిత భౌతికశాస్త్ర విపరీత పరిమాణాల్లోని విభిన్న కోణాలు!

*

ఆత్మదర్శనం చేసి అనుభూతిగా పొందినది మాత్రమే తెలుసుకు న్నది – (అదే సత్యం) మిగిలినదంతా, మిథ్య, పక్షపాతము, వ్యక్తి గత ఊహ.

*

విజ్ఞానశాస్త్రం సర్వజ్ఞత్వంతో విర్రవీగి ప్రవర్తిస్తుంది. వివేకం ఏకాం తంగా సాగిపోతూ అనంత సాగరాల అంచుల నుండి వెలువడే ప్రతిధ్వనులను వింటుంది.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: ధారా రాధాకృష్ణ మూర్తి

అధివాస్తవ విజ్ఞాన శాస్త్ర స్వప్నం

విజ్ఞానశాస్త్రం, ఆధ్యాత్మికత

స్వప్నంలో ఒకని రసగ్రంధి హేమ్లెట్ వ్రాయగా,
అమృతపానం చేసి, అమరత్వం పొందింది.
హార్మోనుల గుంపు ఒకటి ఇలియడ్,
ఒడిస్సే కావ్యాలను సృష్టించింది.
బోధివృక్షం చాటున ఒక థైరాయిడ్ గ్రంధి
ధ్యానిస్తూ, దివ్యకాంతిని వీక్షించింది.
నిశ్శబ్ద శిఖరాలపై మేలుకొని, ధర్మచక్ర పరివర్తనం,
అష్టాంగ మార్గం బోధించింది.
అజీర్ణంతో చెడిన మతి,
యూరప్ అంతటా గర్జించి,
జయించి, పాలించి, పతనమైంది.
హెలీనా దీవినుండి స్వర్గం చేరిందేమో!
అలా అధివాస్తవ ప్రపంచం తోకాడిస్తూ కదిలింది
ఈ లోగా ఒక శాస్త్రవేత్త అణువులతో ఆటలాడి,
భగవంతుడు 'ఆగు' అని అరిచేలోగా
ఈ విశ్వాన్ని విచ్ఛిన్నం చేశాడు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. యజ్ఞన్న

విజ్ఞానశాస్త్రం – ఆధ్యాత్మికత

వస్తువుల అంతర్గత ఆధ్యాత్మిక అస్తిత్వము గురించి (the spiritual reality) శాస్త్రవేత్తలది బాహ్యాదృష్టే. దీనిని గురించి నేను ఇదివరలో నీతో ప్రస్తావించాను. దానిని గురించి ఇప్పుడు నేను విపులీకరించను. అంతకన్న ముఖ్యమైన ప్రమాదం – ఆధ్యాత్మిక భౌతికాతీత అనుభవాల గురించిన వారి సంశయాత్మక ప్రతికూల వైఖరి; వినాశకరమైన క్రొత్త వ్యూహంతో ఆధ్యాత్మిక అనుభవాల ప్రామాణ్యతను సందేహించడం – వారు ప్రతిపాదించిన అంశాలను పరిశీలనాత్మకంగా విచారిస్తే వివరణకేమీ మిగలకపోగా, అసంబంద్ధంగా కూడా ఉంటుంది. మతానుకూలవాదుల వైయ్యక్తిక ఆధ్యాత్మికానుభవాలు గురించి మాత్రమే వారు నొక్కి వక్కాణిస్తారు – అది కూడా అసందిగ్ధంగానే. ప్రత్యర్థులైన ఈ భౌతికవాదులు నిజానిజాలు తెలుకునే ప్రయత్నంలో బలమైన తమ భౌతికవాదాలకే ద్వారాలు తెరుస్తారు. వారి భౌతికవాదనా బలం, భౌతికాతీత విషయాల పరిశీలనను తిరస్కరించడం – ఇదే వారికి బలమైన రక్షణ. నిర్జీవమైన భౌతికశాస్త్ర సిద్ధాంతాలు, వ్యాఖ్యానాలు, చాతుర్యమైన మనోవైజ్ఞానికి శాస్త్ర నామకరణాలు, వస్తుసమగ్ర స్వరూప స్వభావాలను వ్యక్తం చేయలేవు. కాగా ఇది అసంపూర్ణ అవగాహన – ఇది ఒక ప్రమాదం. మరొక ప్రమాదం పాత తప్పులే పునరావృతమౌతూండటం. ఇంకా మతదురహంకారుల అప్రాణిక నిగూఢ మిధ్యా అధ్యాత్మికత. ఒక వైపు దృష్టి విభ్రమము, భౌతిక అంధకారము. మరోవైపు పరిపూర్ణ తేజోవైభవం – వీటి మధ్య సరిహద్దు రేఖపై ఇవి కనిపిస్తాయి. ఏది ఏమైనా అంధకార పృథ్వీచేతనపై, మహోన్నత తేజోవైభవంయొక్క అంతిమ విజయం మాత్రం తథ్యమే!

*

భౌతికశాస్త్రవేత్తలను (తంత్రవేత్తలు, ఆధ్యాత్మికవేత్తలు) సంతృప్తి పరచాలన్న కోరిక అర్థం లేనిది. తర్కరహితం. శాస్త్రవేత్తల రంగం వేరు. వారికి వారి వారి ఉపకరణాలు, ప్రమాణాలు వారికి

ఉంటాయి. విభిన్నమైన విషయ పరిశీలనలను ఆధ్యాత్మికానికి వర్తింపచేయడం తెలివితక్కువతనం. ఆధ్యాత్మికసత్యాన్ని భౌతిక పరీక్షలకు గురిచేయడం ఎలా కుదురుతుంది! భగవంతుడ్ని ప్రయోగశాలలో ఉంచి పరీక్షించ లేరెవ్వరూ. ఆత్మను సూక్ష్మదర్శినిలో చూడలేరు. భూతలం పైన ఆత్మల్ని భౌతికంగా దర్శించడం వంటి సంఘటనలపైన పరీక్షలు చేయడం తప్పు. తన పద్ధతిలో, తన సూత్రాలకు అనుగుణంగాలేని విషయాలను శాస్త్రవేత్త ఆమోదించడు. మనిషి కళ్లకు గంతలు కట్టినా చూడగలడు, చదవగలడని నిరూపించడానికి రూల్స్ రో... అనే శాస్త్రవేత్త ప్రయోగాలు చేసి నిరూపించాడు. కాని ఇతర శాస్త్రవేత్తలు దానిని అంగీకరించలేదు. ఖుదాభక్ష్ అనే శాస్త్రవేత్త ఆ విషయాన్ని ఋజువు చేయడానికి సంసిద్ధుడయ్యాడు. కాని శాస్త్రవేత్తలు ఎవరూ అంగీకరించలేదు. నమ్మకూడదని నిర్ణయించుకున్న వారిని ఒప్పించడంవల్ల ప్రయోజనం లేదు.

*

తత్వశాస్త్రం ఎంత ఉన్నతమైనా, ఎంత కాంతివంతమైనా సంకుచితమే. విజ్ఞానశాస్త్రం ఎంత సహనం, శాస్త్రీయత, ఖచ్చితమైన దృష్టి ఉన్నప్పటికీ పరిమితంగా ఉంటుంది. గుడ్డిది. రసవిహీనమైనది. అవి రెండూ మతంలాగే ఛాందసమైనది. మతం ఉన్నతం కాదు. తీవ్రమైనది, స్పష్టమైనది కాదు కాని దాని ఉత్సాహం అంతా ఇంతా కాదు. అవి మానసిక భూమికలో జీవిస్తాయి. వాటి వల్ల పరిపూర్ణమైన సౌలభ్య, సామరస్యాలు మానవాళికి అందవు. స్వేచ్ఛ ఉండదు. పోరాటం తప్పదు. తన హృదయాన్ని ఊహల్ని మనోపీఠంపై బలి పెట్టాల్సిందేనని తత్వశాస్త్రం, విజ్ఞానశాస్త్రం పట్టుపడతాయి. పరిపూర్ణ మానవప్రకృతిని అవి తిరస్కరిస్తాయి. స్వేచ్ఛగా ఊపిరి తియ్యకుండా బ్రతకమని శాసిస్తాయి. సూర్యకాంతిలేని చీకటి, నిరుత్సాహ బ్రతుకులు మనోప్రధానమైన బ్రతుకులు. అటువంటి మనోజీవనంలో మానసిక ఆరోగ్యం, శక్తి పెరుగుతాయని చెప్పడం అసంబద్ధం. ఒక వ్యక్తి మనోప్రధానంగా జీవించగలడేమో! కాని జాతి అంతా అలా జీవించడం తగదు.

నిస్సారమైన బుద్ధి జీవనం దివ్యప్రకృతిని, శ్రీమాతని తిరస్కరిం చటం, ఆమె శాశ్వతసత్య శాసనాలను ఉల్లంఘించడం అభిలష నీయం కాదు. సత్యము, ఋతముల తిరస్కరణే ఔతుంది. ఇది మానవాళికి క్షేమదాయకం కాదు.

మానవాళి క్షేమం కోరి విజ్ఞానశాస్త్రం, తత్వశాస్త్రం సహా యపడాలంటే, మనిషిని ఒక సంక్లిష్ట చైతన్య స్వరూపంగా గుర్తిం చాలి. ఆ సంక్లిష్ట చైతన్యంతో ప్రతిభాగానికి తనదైన క్రియాక్షేత్రం వుంటుంది. మనిషిలోని ప్రతి అత్యావశ్యకమైన ఆకాంక్షను సంతృ ప్తిపరచవలసి వుంటుంది.

*

ఆధునిక మనస్తత్వవేత్తలు తమ విజ్ఞానంలో నిశ్చయత్వాన్ని కను గొన్నట్లు భావించారు. మనస్తత్వ శాస్త్రాన్ని, దేహధర్మ శాస్త్రాన్ని కలగలిపి తాము నిశ్చయత్వాన్ని (certitude) సాధించామని భావింపరాదు. మన దేహవ్యాపారశాస్త్ర ప్రక్రియలు మన చైతన్యా నికి ఉపకరణాలు మాత్రమే కాదు. మన మనస్తత్వ ప్రక్రియలకు ఆధారభూమికలు కూడా, కాని దీనివల్ల మనకు దేహవ్యాపార శాస్త్ర జ్ఞానం పెరుగుతుంది కాని, నిజమైన మనస్తత్వ శాస్త్రజ్ఞానం వృద్ధి చెందదు. భౌతికమైన ఉపకరణముల ద్వారా భౌతిక వస్తు వులు, వాటి స్పర్శ మన చైతన్యంపై ప్రభావం చూపిస్తాయి. నరాలు, మెదడు ద్వారా అవి మన చైతన్యాన్ని చేరతాయి. అవి కొన్ని ప్రతిక్రియలను మేలుకొల్పుతాయి. అవి మన మెదడుకు, చైతన్యా నికి సంబంధించినవి కావు. బాహ్యావస్తువులపై పనిచేయడానికి చైతన్యం కొన్ని దేహవ్యాపార ప్రక్రియలను, భౌతిక సాధనాలను వాడుకొంటుంది. భౌతికమైన పరిస్థితులు మన చైతన్యంపై పని చేస్తాయి. శరీరం ద్వారా, శరీరంతో పనిచేసే చైతన్యం మనది. తన సొంత హక్కుతో పనిచేసే స్వచ్ఛంద చైతన్యం కాదు.

*

విజ్ఞానశాస్త్రం (సైన్సు) భగవత్ ప్రేమికునికి, భగవత్ జ్ఞానికి ఎంతో అవసరమైనది. ఎందుకంటే, భగవంతుడు సృష్టించి విశ్వంలోని అద్భుతాలను సైన్సు వివరంగా అతనికి తెలియజేస్తుంది. ఒకరు

అన్నీ తెలుసుకుని, "చూడండి, పరమాత్మ పదార్థంలో ఎలా అభి వ్యక్తం అయ్యాడో!" అని అంటాడు. మరొకడు – "పరిపూర్ణ కళా కారునియొక్క సర్వ శక్తిమంతమైన హస్తం, నా ప్రేమికుడైన ప్రభువు స్పర్శ చూడండి" అంటాడు.

*

మనస్సులు పదార్థంలో కదలాడుతూంటే పదార్థమొక్కటే సత్య సంభూతమనుకొంటవి. పదార్థం నుంచి ఉపసంహరించుకున్న చైతన్యం పదార్థమొక ముసుగు అని తెలుసుకొని చైతన్య అస్తి త్వమే సత్యమని తెలుసుకుంటుంది. ఈ రెండింటిలో ఏది సత్యం? భగవంతునికే తెలుసు. ఈ రెండు అనుభవాలు కలిగినవాడు ఏది ఇతోధిక ఆనందస్థితికి, ఏది జ్ఞానసిద్ధికి దారితీస్తుందో వివేకముతో చెప్పగలడు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. యజ్ఞన్న

అతీత విజ్ఞానము
ధ్యానమగ్న సోపానపథము

వైజ్ఞానికి ఆవిష్కరణలు

1. దర్శించాను విద్యుత్ప్రవాహాలపై తేలి నడయాడుతున్న ప్రపంచం అణ్వాణువుల విస్ఫులింగాల చక్రభ్రమణం, సూర్యగోళ, నెబ్యు లాలతో కూడిన బ్రహ్మాండ అగ్నిగోళం, కాంతి చినుకులు, జ్వాలా కణికలు, పరిక్షిప్త వైఖానసులు.
2. కనిపించని కాంతి ముసుగులో ప్రవర్తించే (బ్రాహ్మీ) శక్తులు ఉపక్రమణిక లేని అనంత వాయు సంచాలనం ఇంద్రియా తీత. ఏకం సత్ (పూర్ణమిదం).
3. ఉపరితల యువనికపై దృగ్గోచర అద్భుత చిత్రవిచిత్రాలు ప్రకృతిమాత అందించిన మూల్యాలు, అనుభవాధార అదృశ్య

గుహ్యా మనోగహనాలను భౌతిక మనసు తాలూకు మొరటు హస్తాల నుంచి పరిరక్షించేందుకు –

4. నేటి ఆవిష్కృత సత్యాలు కేవలం అనంత దివ్యశక్తి నుంచి జాలువారిన ధూళి రేఖాకృతులు –

*

మనస్సుకు సంబంధించిన సైకాలజీ మొదలైన శాస్త్రాలన్నీ భౌతిక శాస్త్రంపైనే ఆధారపడినవి కాబట్టి అవి వాటి సంకుచిత పరిధి దాటి వెళ్లలేవు. దివ్యస్ఫూర్తితో విజ్ఞానశాస్త్రాలను అనుసంధించ గలిగితే అదొక క్రొత్త శాస్త్రంగా వికసించగలదు. అటువంటి శాస్త్రం ప్రాణిక జగత్తులోని శక్తులతో మనస్సుకుండే సంబంధము, మానసాతీత విషయాలను వివరించగలదు. ఇప్పటి విజ్ఞాన శాస్త్రం మాత్రం ఆ పని చేయేలేదు.

*

యోగవిజ్ఞానం భ్రమకాక వాస్తవమైతే, యోగశక్తి లేదా ఆధ్యాత్మిక శక్తి వాస్తవమే.

ఆధ్యాత్మిక శక్తి అనేది ఉంటే అది ఆధ్యాత్మిక ఫలితాలను చూపించి తీరుతుంది కదా! అటువంటప్పుడు కొంతమంది సాధకులు తమ ఉన్నతశక్తి లేదా దివ్యశక్తి పనిచేయడం తెలుస్తోందనీ, తమను ఆధ్యాత్మిక సిద్ధి దిశగా పురోగమింప చేస్తోందనీ చెపితే అందులో అసంబద్ధత ఏమీ ఉండదు. అది నిజమా కాదా అనేది వ్యక్తిగత విషయం మాత్రమే తప్ప తప్పుడు ప్రచారమని అటువంటివి జరగనే జరగవని కొట్టి పారేయ్యకూడదు. ఇంకా చెప్పాలంటే అంత ఆధ్యాత్మికశక్తి సంభూతమనేది నిజమైతే, దాన్నుంచి అనేక శక్తులు ఉత్పన్నం కావచ్చు. ఆధ్యాత్మిక శక్తి ప్రచోదనతో మానసికం, ప్రాణికం, దైహికమైన ఫలితాలు కనిపించడంలో అసమంజసం ఏమీ ఉండదు. అది మనస్సు, ప్రాణము, జీవపదార్థములపై సూటిగా పనిచేయనూవచ్చు. రెండు ఉదాహరణలు తీసుకుందాము. ఒకానొక వ్యక్తి జ్వరం, ఒళ్లు నెప్పులతో రెండ్రోజులుగా బాధపడుతూ, ఏ మందులూ వాడకుండా నీరసపడి చివరకు గురువుగారిని ప్రార్థిస్తాడు. మర్నాటికి చక్కగా,

బలంగా ఆరోగ్యంగా నిద్రలేస్తాడు. తనపై ఆధ్యాత్మిక శక్తి ప్రస రణం జరిగి అది బాగా పనిచేసినట్లు అతను అనుకోవటం సము చితమే కదా! ఇంకొక వ్యక్తి ఈ విధంగానే అస్వస్థుడైనప్పుడు అతను మందులు వాడుతూ, అవి పూర్తిగా పనిచేయడమనేది సందిగ్ధం కాబట్టి తన నివారణ కోసం శక్తిని కూడా ఆహ్వానిం చిన సందర్భంలో ఆ శక్తి ఈ మందుల మాధ్యమం ద్వారా పనిచేసి నివారణ జరిగితే బయటవారికి దేని ద్వారా తగ్గిందనే విషయం అనుమానాస్పదమే. అది కేవలం మందుల ద్వారా తగ్గిందా? లేక ఆధ్యాత్మికశక్తి ద్వారా పనిచేసిందా? ఏదైనా జరగవచ్చు. మందులు వాడాడు కాబట్టి ఆధ్యాత్మికశక్తి పనిచేయటమనేది అసంభవ మనటం సరి కాదు. ఇంకొక రకంగా చెప్పాలంటే మందిచ్చిన వైద్యుడు తన కొచ్చిన ఆధ్యాత్మిక సూచన ద్వారానే తన మందుతో రోగి త్వరగా వైద్యశాస్త్రానికి అంతుబట్టనంత శీఘ్రంగా కోలుకోవడం సాధ్యమైందని భావించవచ్చు. రోగి కూడా తనకు స్వస్థత చేకూర్చిన ఆ శక్తి అనుభూతిని పొంది యుండవచ్చు. ఇంకా శక్తిని పంపిన గురువు కూడా ఎప్పటికప్పుడు ఆ శక్తి ఫలి తాలను గమనిస్తూ యే యే గుణాలు తన శక్తివల్ల తగ్గుతున్నాయో, ఏవి తగ్గటం లేదో గమనిస్తూ వైద్యునికి గూడా తదనుగుణంగా అదృశ్య సూచనలిస్తూ తగ్గేవరకూ పనిచేసి ఉండవచ్చు. ఏది ఏమైనప్పటికీ వైద్యుడూ, రోగీ, శక్తి నుపయోగించిన గురువూ కూడా ఆధ్యాత్మికశక్తి వల్ల కొంతైనా నివారణ జరిగినట్లు నమ్మితే అది అసమర్థనీయము కాదు. అయితే వారి నమ్మకం వారి వరకే పరిమితంగానీ, హేతువాద పరిశీలకులకు గాదు. అట్లాగని వారి నమ్మకం అసంబద్ధమనీ, తప్పు అనీ హేతువాదు లారోపించటం సమంజసం కాదు.

గమనించ వలసిందేమిటంటే, ఆధ్యాత్మిక శక్తి అన్ని చోట్లా పనిచేయగలదని కానీ, పనిచేయనప్పుడు అది లేదని నిర్ధారించ టంకానీ చేయకూడదు. ఏ శక్తిని గురించీ గూడా అలా అనుకో కూడదు. అగ్నికి దహించే శక్తి ఉన్నప్పటికీ అది దహించలేని పదార్థాలున్నాయి కదా! కొన్ని చోట్ల మండే నిప్పుల మీద

పాదరక్షలు లేకుండా నడిచేవారి పాదాలను దహించకపోవటం జరుగుతున్నది. అట్లాగని అగ్నిశక్తి అనేది లేదని అనగలమా!

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకట్రామ శాస్త్రి

అతీంద్రియము

సాధారణంగా అతీంద్రియమైనదానిని ఇంద్రజాలమని, దానికి సంబంధించిన ఏర్పాటనీ భావిస్తారు. ఇగి ఒక పార్శ్వము మాత్రమే అది కేవలం మూఢవిశ్వాసం మాత్రం కాదు. ప్రకృతిలోని గుప్త శక్తులనూ, వాటి సంభావ్యతలనూ పరిశీలించనివారే ఆ విధంగా ఆలోచిస్తారు. భౌతికసూత్రాల మాదిరిగా కొన్ని సూత్రాల ప్రకారం, అంతర్నిహితమైన శక్తులతో పనిచేయించడమే గుహ్యావిద్య. ఆ గుప్తశక్తితో మనశ్శక్తి, ప్రాణశక్తులను సమర్థవంతంగా పనిచేయిం చడం అత్యావశ్యకరమైన విషయమే. అయినప్పటికీ అది అప్రధా నమైనది, పరిమితమైనది. కారణం మనస్సు, జీవశక్తులు రెండూ కూడా పదార్థంవలె కఠినమైవి కావు. అందువల్ల వాటిని తెలుసు కుని వాటి ప్రక్రియలను, చర్యలను అర్థం చేసుకొని ఉపయోగిం చాలంటే చాలా సూక్ష్మము, మృదులము అయినటువంటి అంత ర్బుద్ధి (intuition) అవసరము. ఆ విధంగానే వాటి నియమనిబం ధనలను అన్వయించడానికి కూడా అదే సూక్ష్మత అవసరము. ప్రయోగాత్మకత దృష్ట్యా చూసినా దానివల్ల తప్పిదాలు, దురుప యోగము, ఓటమి మిగులుతాయి. ఇప్పుడు మనం పదార్థ విజ్ఞానా నికి సంబంధించినంత వరకూ మూఢవిశ్వాసాలను అధిగమిం చాము కాబట్టి పురాతన (occultism) గుహ్యావిద్యలో నూతన సూత్రీకరణలు, వాటితోబాటు ఇంకా అవ్యక్తంగా ఉన్న మనోశక్తు లను, లోతులను పరిశోధిస్తున్న శాస్త్రవిజ్ఞానాన్నీ గమనిస్తే అతీం ద్రియమైన అసాధారణమైన, మానసిక విషయ సముదాయాన్ని స్వంతం చేసుకోవచ్చు. ఇప్పటికే కొంత సాధించాము కూడా.

అది పూర్తిగా సఫలం కావాలంటే దానికి సిసలైన స్థిరాధారము, లక్ష్యము, నిర్దేశము, ఆవశ్యక నియమావళి, జాగ్రత్తలు మొదలైనవన్నీ పునః పరిశీలించి, వ్యవస్థీకరించాలి. అన్నిటికన్నా ముఖ్యంగా మనస్సులోని గుప్తసత్యాలనూ, శక్తులనూ, ప్రాణశక్తినీ అంతర్ని హితంగా ఉన్న ఆత్మ మహత్తర శక్తులనూ ఆవిష్కరింప చేసుకో వడమే మన ఆశయం కావాలి. గుహ్యావిద్య అంటేనే అవ్యక్తమూ, బోధనాతీతమూ అయిన ఒక విజ్ఞానము. మన ఉపచేతనా, అధి చేతనలలోనూ, విశ్వప్రకృతిలోను అవ్యక్త విషయాలను దానితో సంబంధమున్న అనేక విషయాలనూ విశ్వజ్ఞానంలోనూ అత్యంత ప్రభావంగా దాన్ని ఉపయోగించటమే గుహ్యావిద్యకు ప్రయోజ నము.

*

ఏమీ దాచకుండా ఉన్నదున్నట్లు చెప్పాలంటే ఈ ప్రపంచంలో మహాత్వము లనేవి ఏమీ లేవు. దైవచర్యలతో కూడిన ఈ ప్రపం చంలో మహాత్వాలంటూ వేరే వుండవు. ఉన్నవన్నీ భగవంతుని మహాత్వాలే. మాహాత్మ్యమంటే అర్థం ఒక అద్భుత చర్య అని చెప్పాలి. విషయం తెలియకపోతే అద్భుతం, అందులోని ప్రక్రియ తెలిస్తే విజ్ఞానమవుతుంది. తీగె లేకుండా టెలిగ్రాం పంపడమనేది అప్పట్లో అద్భుతమే. మాట, పలుకు లేకుండా ఒక ఆలోచన ఒకరి నుంచి ఇంకొకరికి అందటం ఇంకా ఆశ్చర్యమే. అయినప్ప టికీ అది సర్వ సాధారణ మనస్సులతో జరుగుతూనే ఉంది. ఆ ప్రక్రియ తెలుసుకుంటే ఆశ్చర్యపడవలసినదేమీ ఉండదు. ఎందు కంటే ఈ అనంత విశ్వంలో జరుగుతున్న దాని బహుళత్వము, వైవిధ్యము, అత్యంత సూక్ష్మతతో, అణు పరిజ్ఞానంతో విశ్వనిర్వ హణ చూసి ఆ మహనీయత్వానికి అబ్బురపడటం తప్ప చేసే దేమీ ఉండదు. అయితే భగవంతుని అనంతత్వంతో పోలిస్తే ఈ అద్భుత అంతరిక్షచలనచాలనాలన్నీ అల్పమైనవిగానూ, 'టక్కు టమారాలు' గాను కనిపిస్తాయి. ఏ విధంగా అయితే నిస్తంత్రీ విధానం (Wireless Telegraphy) విజ్ఞానశాస్త్ర ఫలసిద్ధిగా అవ తరించిందో, ఇంకా ప్రకృతియొక్క సిద్ధిగా ఒక భావన, ఒక

ఉద్వేగం, ఏ విధంగా క్షణాల మీద జనసమూహాల్లోనూ, దేశ వ్యాప్తంగానూ, సైనికదళాల్లోనూ వ్యాపిస్తుందో అదే పద్ధతిలో యోగసిద్ధులు కూడా పనిచేస్తాయి. ఆ ప్రక్రియలను అర్థం చేసుకొని అందులో పరిపూర్ణులై విశ్వవ్యవస్థలో సరైన పద్ధతిలో ప్రయోగిస్తే అవి మాయామర్మాలు కాదు, విచిత్రాలు కాదు, అతీంద్రియ విషయాలూ కాదని విశదమవుతుంది. ఎటొచ్చీ అవి చైనా అక్షరముల మాదిరిగానూ, విమానాలూ, మోటారు వాహనాలూ నడిచినట్లుగానూ ఒక అసామాన్య విన్యాసం మాత్రమే అవుతుంది. అందులో మేజిక్ (మాయాజాలం) ఏమీ ఉండదు. నిజానికి మేజిక్ అనేది పూర్వపు పర్షియాదేశంలోని 'మాగి' ల నుంచి ఆవిర్భవించింది. అది కేవలం గారడి కాకుండా పరమ జ్ఞానం ద్వారా శక్తుల ప్రయోగం చేసే విజ్ఞానశాస్త్రమే. ఆ విధంగా చూస్తే రోజర్ బేకన్, పరాసెల్సన్ మహాశయుల శాస్త్రప్రయోగాల వంటిదే ఈనాటి గుహ్య విద్య గూడా. ప్రాచీన ఐరోపా శాస్త్రజ్ఞుల పయత్నాల మోస్తరుగానే ఈ గుహ్యవిద్యలో కూడా కొంత మోసము, దోషము, ఆత్మవంచన చోటు చేసుకున్నాయి. మన సనాతన యోగవిధానం కూడా పాశ్చాత్య అభ్యాసకుల, తూర్పు దేశ కుహనా సాధకుల లోపాలను తప్పించుకోలేక పోయింది.] @

*

వ్యక్తిలో అంతర్గతంగానూ, బాహ్యంగానూ సుస్పష్టమైన ఫలితాలను తీసుకొని వచ్చే అదృశ్యశక్తే యోగచైతన్యము. పర్యవసాన ఫలితమేమీ కనబడినా కనబడకపోయినా శక్తి అనుభూతి కల్గటం భ్రమ కాదు. ఆ శక్తివల్ల అంతులేని ఫలితాలు అనుభవంలోకి వస్తున్నాయి. ఉదాహరణకు ఆ శక్తి మనస్సులో తెచ్చే మార్పులు, దాని సామర్థ్యాన్ని వృద్ధి చేయటం, కొత్త సామర్థ్యాలను కల్పించడం, విజ్ఞానంలో కొత్త పంథాలు తేవటం, ప్రాణిక క్రియాకలాపాలను మార్పు చేయడం, స్వభావంలోనే మార్పు తేవడం, విషయాలపైనా, వ్యక్తులపైనా తన ప్రభావాన్ని కలుగచేయడం, శరీర ప్రవృత్తులనూ, ధర్మాలనూ నియంత్రణ చేయడం, మిగతా శక్తుల మీద ఘనమైన ప్రవృత్తి మంత్రశక్తిగా పనిచేయడం, కార్యకలా

@ Eastern Mind and Phenomena 1996 Edn P. 17 & 18.

పాలలో సవరింపులు మొదలైన వాటి కన్నిటికీ మూలం యోగ చైతన్యమే. కేవలం ఫలితాలవల్ల చెప్పడం కాకుండా దాని చలన చాలనాలు స్పర్శైకవేద్యము సుస్పష్టము.

అతిమానసశక్తి షరతులు, పరిమితులు లేకుండా పని చేస్తుంది. మిగతావన్నీ కూడా పనిచేయడానికి కొన్ని ప్రత్యేక పరిస్థితులూ, నిబంధనలూ ఉంటాయి. ఈ యోగశక్తితో పనిచేసే పరిస్థితులూ, నిబంధనలూ యదాలాపంగా, అకారణంగా ఉత్పన్నమయేవి కాకుండా వస్తునైజాన్ని బట్టి ఏర్పడతాయి. అవి ముఖ్యంగా సాధకుని సంకల్పం, గ్రహణశీలత, సమ్మతి, హృదయ వివృతము, శరణాగతి బట్టి ఉంటాయి. ఏవో సందర్భాలలో ఆ పరదైవమే వీటన్నిటి ప్రమేయం లేకుండా అనుగ్రహిస్తే తప్ప సాధారణంగా యోగశక్తి పనిచేయాలంటే ఇవన్నీ ఉండాల్సిందే. ఆ పరదైవం అనుజ్ఞ చాలా అపురూపంగా దొరుకుతుంది. అతిమానసశక్తి పూర్తిగా దిగివచ్చి తనంతట తానుగా అనుగ్రహిస్తే అది సంభవమవుతుంది. అతిమానసం దిగి వచ్చినప్పుడే సత్య ధర్మం వర్తిస్తుంది తప్ప అజ్ఞానవ్యవస్థలో అది పనిచేయదు.

అయినప్పటికీ నేను చెప్పిన పరిస్థితుల్లో యోగశక్తి అనుభవైకవేద్యంగా, సుస్పష్టంగా పనిచేస్తుంది. స్పష్టమైన ఫలితాలు చూపిస్తుంది. అయితే అది అదృశ్యంగానే ఉంటుంది తప్ప ఒక దెబ్బ తగిలినట్లుగా మోటారు కారు ఢీకొన్నట్లుగా బాహ్యేంద్రియాలకు అనుభవం కాదు. అలా ఇంద్రియాలకు తెలియకపోతే యోగశక్తి పనిచేస్తున్నట్లుగా బాహ్యమనస్సుకి ఎలా తెలుస్తుంది? ఫలితాలను బట్టి అనుకుంటే అవి యోగశక్తి వల్ల జరిగినవనీ ఇతర శక్తుల వల్ల కాదనీ ఎలా తెలుసుకోవడం? తెలుసుకోటానికి రెండు పద్ధతులున్నాయి. ఒకటి నీ చైతన్యాన్ని అంతర్నిహితం చేసి ఆ యెరుకతో అదృశ్య భౌతికాతీత అనుభవాన్ని పొంది, ఆ అనుభవంతో, సామర్థ్యంతో ఈ యోగశక్తుల చైతన్యాన్నీ, వాటి పని తీరునూ గమనించవచ్చు. ఒక శాస్త్రవేత్త అదృశ్య ప్రకృతి శక్తులనుపయోగించినట్లే ఇదీ ఉన్నట్లు తెలుసుకోవచ్చు. రెండవది నమ్మకం. నమ్మకంతో వికసిత హృదయంతో గమనిస్తే ఏది

ఎట్లా జరుగుతున్నదీ తెలుస్తుంది: ఒక శక్తిని ఆహ్వానించగానే కాస్సేపట్లో సమాధానం రావటం ప్రారంభిస్తుంది. ఆ విధంగా మళ్లీ మళ్లీ చేస్తూండాలి. చేసిన కొద్దీ స్పష్టమైన ఫలితాలే వస్తాయి.

*

ఆధ్యాత్మిక శక్తికి కూడా ఒక సెలయేరుకున్న మాదిరి ఘనపరి మాణ ముంది. రూపం కూడా ఉంది. అది తెలుసుకున్నవారు దాన్ని ఎలా కావాలంటే అలా ప్రవర్తింప చేసుకోగలరు.

ఆధ్యాత్మిక శక్తికి స్వతహాగా ఉండే సామర్థ్యాన్ని గురించిన వివరణ ఇది. ఇది కాకుండా ఏ సూక్ష్మశక్తినైనా సంకల్ప బలంతో ఉపయోగించి ప్రపంచంలో ఏ చోటు నుంచి అయినా కావల్సిన ఫలితాలను రాబట్టవచ్చు. ఆ సూక్ష్మశక్తి ఆధ్యాత్మిక, మానసిక, ప్రాణిక శక్తులలో ఏదైనా కావచ్చు. ఏ విధంగానైతే కంటికి కనబడకుండా భౌతికశక్తుల ఉనికి తెలుస్తున్నదో కంటికి కనబడని విద్యుచ్ఛక్తి తరంగా లున్నాయో అదే విధంగా మనో తరంగాలు, ఆలోచనా ప్రవాహాలు, ఉద్వేగ కెరటాలు మొదలైనవి కూడా అదృశ్యంగా ఏర్పడి ఉంటాయి. కోపము, దుఃఖము మొదలైనవి ఆ కోవ లోనివే. అవి బాహ్యీకృతమై (బయట వాతావరణంలో వ్యాపించి) ఇతరులను స్పృశిస్తాయి. అవి వచ్చినట్లుగానీ, వస్తున్నట్లుగానీ, ఎలా వస్తున్నాయనిగానీ తెలియకుండానే వస్తాయి, వాటి పర్యవసానం మాత్రం వ్యక్తులకు తెలుస్తుంది. అయితే ఎవరిలోనైతే వారి అంతరేంద్రియాలు, లేదా గ్రహణేంద్రీయాలు (occult senses) జాగృతమై ఉంటాయో వారికి మాత్రం ఈ అదృశ్య తరంగాలు స్పృశిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రపంచంలో మంచైనా, చెడైనా, ఈ విధంగానే వ్యాపిస్తుంది. అది ఉద్దేశ్యరహితంగానూ, స్వాభావికంగా కూడా జరుగవచ్చు. కొందరు ఉద్దేశ్యపూర్వకంగానూ వ్యాప్తి చేయవచ్చు. ఒక ఆధ్యాత్మికశక్తినిగానీ, మరే శక్తినీ గానీ ఒక ప్రయోజనం కోసమై ఉత్పన్నం చేయవచ్చు కూడా. అంతే కాకుండా ఒక మంచి సార్థకమయే సంకల్పాన్నిగానీ, భావనను గానీ బాహ్యోపకరణాలు (మాటా, మంత్రం) లేకుండానే

సూటిగా పనిచేసేటట్లు వ్యాపింపచేయవచ్చు. ఇవన్నీ ఊరికే చెప్పేవి కావు, ఊహాలు, భ్రమలూ కావు; దృగ్గోచరాంశములే.

*

ఆ శక్తిని నీవు తెలుసుకోలేకపోతున్నావనే దాన్ని బట్టి ఆ శక్తి అక్కడ లేదనేది రూఢి కాదు. స్టీమ్ ఇంజన్ తనని ఏ శక్తి నడిపిస్తోందో దానికి తెలుసా! అయినా శక్తి ఉందని మనకి తెలుసు కదా! మనిషి స్టీమింజన్ కాదు, కాని దానికంటె కొంచెం మెరుగు. ఎందుకంటే బాహ్యంగా ఏదో పొంగుతూన్నట్లుగా గ్రహిస్తూ, దాన్నే 'నేను' అనుకుంటాడు. అంతకు తప్ప తన ఉపచేతన, ఇంద్రియాతీత, అతిచైతన్య శక్తులకు లోబడి తను పనిచేస్తున్న విషయం ఏమాత్రం ఎరగడు. (ఈ విషయమే ఆధునిక మానసిక శాస్త్రం కూడా ధృవపరుస్తోంది.) మానవుడు తన మేధస్సుతో అనేక బాహ్య ఫలితాలు సాధించి అదంతా తన ఆత్మ ప్రభావమే ననుకుని ఉబ్బితబ్బిబ్బులవుతున్నాడు. అయితే ఆ గొప్ప ఆత్మ అనేది ఏమిటో ఎక్కడ ఉన్నదో తెలుసుకునే ప్రయత్నం చెయ్యడు. అసలైన ఉదాత్త ఆత్మ తన మసగ మేధస్సు వెనకాల పొగబట్టిన ప్రాణిక సంవేదనలు, ఉద్విగ్నతలు, ప్రేరణలు, భావనలు, అభిప్రాయాలకు అతీతంగా ఎక్కడో గుప్తంగా దాగి ఉన్న విషయాన్ని విస్మరిస్తాడు. మా లక్ష్యం ఆ గుప్తశక్తులను బహిరంగపరచి, అడ్డుగోడలు లేకుండా వెల్లడిచేసి, అడ్డుతెరలలోంచి మెరుపుతీగలుగా, క్రీనీడలుగా గాకుండా, అడ్డంకులేమీ లేకుండా ఆ శక్తులు కింద కురికి పొంగి ప్రవహింపచేయటమే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామ శాస్త్రి

ఈ ప్రపంచం అంతా భౌతికశక్తియొక్క క్రీడావిశేషము మాత్రమే నని సైన్సు అంటుంది. పదార్థము (Matter) నకు అసలు ఒక అస్తిత్వము అనేది ఉన్నదా అని సైన్సుకు సందేహం. దీని అస్తిత్వం కేవలం బాహ్యేంద్రియ జ్ఞాన ఆధారభూతమైన శక్తి మాత్రమే కదా – అంటుంది వేదాంతము. ఈ ప్రపంచము ఒక ఆధ్యాత్మిక మౌలికశక్తి యొక్క లీలావిశేషమని, అది కూడా ఒక భ్రాంతియేనని అంటూ, శక్తి యదార్థం అంటుంది (వేదాంతం).

వివేకము, తెలివి – ఇవి ప్రకృతిలోనే ఉన్నవి లేక – ఇవియే ప్రకృతి – అని అంగీకరించటానికి ఆధునిక తార్కికబుద్ధి సంశయిస్తోంది. కారణం? మానవ వ్యక్తిత్వం మనోచైతన్యంతోనే ఎప్పుడూ ముడిపడి ఉండటం వల్ల. వివేకము, వివేకవంతుడు అవి నాభావము – వివేకము వివేకవంతుని లక్షణము – అని సాధారణంగా మనం అనుకుంటాము. మానవచైతన్య పరిశీలనలో ఇది పొరపాటు అని తేలింది. వివేకము, అవివేకవంతుడు అవినాభావము కావని, వివేకము మనల నావహిస్తుంది తప్ప మనం వివేకాన్ని కాదు; వివేకము మనలను ఉపయోగిస్తుంది; అంతేకాని మన చేత అది ఉపయోగింపబడుట లేదు. మనోచైతన్యంతో కూడిన 'అహం' (the mental ego) వివేకముయొక్క సృష్టి; దానికి ఉపకరణం. వివేకమనేది దానికదే – ఒక భౌతికశక్తి. ఇది అల్పంగానో, అధికంగానో జంతువులలో అభివ్యక్తం కాబడుతోంది. Ego మనోసృష్టి అని సైన్సు అంగీకరిస్తోంది. అంటే వివేకము మనిషికి స్వాయత్తముకాక, అతీత ప్రకృతిశక్తి అని సైన్సు అంగీకరిస్తోంది. వివేకము ప్రకృతియొక్క ప్రత్యేక లక్షణము (Nature's attribute) విశ్వశక్తికి అభివ్యక్తీకరణ.

ఇక్కడ ఒక సంశయం. ఈ ప్రత్యేక లక్షణం ప్రాథమికమైన సర్వవ్యాపక లక్షణమా? లేక – ప్రకృతి తన పరిణామ పురోగతిలో సృష్టించిన అల్పసంఖ్యాకులలోనే అభివ్యక్తం కాబడేదా? ఇక్కడ మళ్లీ మరొక ఇబ్బంది ఉంది. మనము వివేకమును వ్యవస్థీకరిం

చబడిన మానసిక చైతన్యంతో జతపర్చుతాము. ఈ సందర్భంగా సైన్సు మనకు తెలిపిన కొన్ని సత్యాలను పరిశీలిద్దాము. అందులో ఒకటి – ఈగలను పట్టి మ్రింగే మొక్క గురించి. ఇది వృక్షజాతి జీవనవ్యవస్థ. దీనికీ ఆకలి ఉంది. అది సచైతన్యమే. మాంసాహారాన్ని కోరుతుంది. అందుకు అది ఒక వల పన్నుతుంది సాలెగూడులా. ఎర దరి చేరగనే ముణుచుకుపోయి గురికాబడిన జీవాన్ని తిని జీర్ణించుకుని, మరొక జీవం కొరకు ఎదురు చూస్తుంది. ఈ మొక్క చర్యకి, సాలెపురుగు చర్యకి (ఆహారాన్ని సంపాదించడంలో) సారూప్యత ఉంది. సాలెపురుగులో కదలిక ఉంది. మొక్కలో లేదు. అంతే తేడా. ప్రాణికస్థాయిలో ఈ రెంటి (వృక్ష, జంతు) అవసరాలు, వాటిని సంతృప్తి పర్చుకునే విధానము ఒకటే. సాలెపురుగుకి – మొక్కకు లేని – మనోచేతనను ఆపాదిస్తాము. సాలెపురుగు తెలివి ప్రాథమిక దశలోనిదే కావచ్చు. ఇక్కడ ఒకే సహజ స్వభావశక్తి ఒకే ప్రయోజనం కోసం రెండింటిలోను ఒకే విధంగా పనిచేస్తున్నది – అనేది గమనార్హం. అది, మానసిక చైతన్యమా లేక యాంత్రిక చైతన్యమా అన్నది వేరే విషయం. కాకపోతే intgelligence ఒక దానిలో మానసికంగా వ్యవస్థీకరింపబడినది గాను, వేరేదానిలో అవ్యవస్థీకరింప బడినది గాను వ్యవహారిస్తుంది. మనసుగా వ్యవస్థీకరింపబడని వివేకము, ప్రాథమికమైనది; స్వచ్ఛమైనది; పొరపాటు లేకుండా వ్యవహారిస్తుంది – మనసుగా వ్యవస్థీకరింపబడిన వివేకము కంటె కూడా! ఈ సత్యాలను దృష్టిలో ఉంచుకుని చూచినపుడు, ప్రకృతి అనంతమైన దివ్యసంకల్ప, వివేకశక్తి. వ్యవస్థీకరింపబడిన మనోచేతన కంటె పరమోన్నతమైనది. వ్యక్తి, వ్యవస్థలకు అతీతమైనది. సహజ సౌందర్య విలసితమైనది. సామరస్య పూర్వకమైనది.

శైశవావస్థలో ఉన్న ఆధునిక మనోవైజ్ఞానిక శాస్త్ర పరిశోధనలు ఈ నిగూఢ చైతన్యాన్ని గురించి సమంగా అవగాహన చేసుకోలేక పోతున్నాయి. యోగము వలన పొందిన విజ్ఞానము సునిశితమై, నిశ్చయంగా ఉంటుంది. అంతరంగ మనోమయపురుమడు

1976

p. 136, 137.

p. 139, 140

ప్రాణిక, శారీరక నేతగా మార్గదర్శకత్వం వహిస్తూ ఉన్నట్లు యోగం తెలియచేస్తోంది.

ఆధునిక మనోవైజ్ఞానిక శాస్త్ర పరిశోధనలు చేసి సేకరించిన ఆధారవిషయాల (data) వివేచనలో సహేతుకంగా నిర్ణయించి కనుగొన్న (Truths) సత్యాలు సనాతన మహర్షులచే వేల సంవత్సరాల క్రితం కనుగొనబడినవే! వారెలా కనుగొన్నారు? విద్యా వివేకసంపన్నతతో కూడిన విచారణవలనకాక, యోగశక్తి చేత. శాస్త్రవేత్త, వస్తువును విడగొట్టి ప్రయోగాలు చేసి, బాహ్య పరిశీలన సహాయంతో సేకరించిన ప్రత్యక్ష అనుమాన ప్రమాణాలతో నిర్ణయాలు తీసుకుంటాడు. ఇతడు బాహ్యపరిశీలనకు మాత్రమే పరిమితం కాగల్గుతాడు. లోపలి లోతులకు పోలేడు. యోగం అసహజ అహంభావ వ్యక్తిగత అవరోధాలను అతిక్రమిస్తుంది. మనోచైతన్య పరిధులను అధిగమిస్తుంది. విశ్వమానసిక చేతనలతో, వ్యక్తి మనోచేతనను ఏకం చేస్తుంది. సైన్టిస్టులు బోలెడన్ని పరిశోధనలుచేసి అస్పష్టంగా కనుగొన్న సత్యాలు, మహర్షులు యోగశక్తితో సుస్పష్టంగా కనుక్కో గలిగినారు. సృష్టియొక్క సనాతన అనంతవికాస వివేకశక్తిని కనుగొన్నారు. (ప్రజ్ఞా ప్రస్రతా పురాణీ) సర్వేశ్వరుడు ప్రకృతికి బయట, లోన (అంతర్బహిశ్చ) రూపరహితంగాను, సాకారంగాను, సర్వవ్యాప్తుడై, విశాల, సంక్లిష్ట సృష్టి కార్యక్రమాన్ని నడిపిస్తున్నాడు. ప్రకృతి పురుషుల సమ్మేళనంగా సృష్టి జరుగుతోంది.

ఈ విశ్వేశ్వర శక్తి మనలను సాధారణ స్వాభావిక వ్యక్తిత్వం నుంచి అధిమానస వ్యక్తిత్వవికాస ఆవిష్కరణ దిశగా నడిపిస్తున్నది. ఇది ఛిత్‌శక్తి. రూప, రేఖా, విలాసాలలో అభివ్యక్తమౌతున్నది. పరిణామక్రమ దిశలో ఒక స్థాయి నుంచి మరొక ఉన్నత స్థాయికి చేరుకునే ప్రగతి మార్గంలో దివ్యశక్తి పనిచేస్తూ ఉన్నది.

సహజంగా మౌలికమైన అంతర్గత అస్తిత్వం తాలూకు వాస్తవం తెలియకుండా చైతన్యం గురించి తెలియదు. అక్కడ నీ అసలు వాస్తవ సత్వంలో సుస్పష్టం కాబడి, వర్గీకరింపబడి, క్రమబద్ధం చేయబడవలసిన దృగ్గోచర విషయాలు (phenomena)

ఏమీ ఉండవు. భావనలు, గ్రహణశక్తులు, సంకల్పవికల్పాలు – వీటి పని ఉండదు. ఇవన్నీ అసంపూర్ణ పరికరమైన బుద్ధికి సంబంధించినవి; అసమగ్రమైనవి; తాత్కాలికమైనవి. ఏకపక్ష సత్యాలు. (partial truths) బుద్ధిది బాహ్యదృష్టే కదా! దీనికి లోచూపు లేదు. విషయముల లోపలికి వెళ్లకపోతే సమగ్ర విషయగ్రహణము ఉండదు. ఇందుకు కావల్సినది ఆధ్యాత్మిక దృష్టి. ఇక్కడ కూడా లోచూపు మాత్రమే చాలదు. ఇది ఆధ్యాత్మిక అనుభవంతో జత కూడాలి.

నిశ్చైతన్య భౌతిక విశ్వంలో, చైతన్య పరిణామం ఇదమిద్ధంకాని, యాదృచ్ఛిక, తాత్కాలిక, ఊహాతీత సంఘటన కాదు.

పైకి అలా అగుపించవచ్చు. భౌతిక విజ్ఞానశాస్త్రం పేరుకు తగినట్లుగానే భౌతికరూపాల బాహ్య పరిశీలనలకే పరిమితం. బాహ్యస్వరూపమే వస్తువుల నిజరూపం కాదు కదా! అది, పరిమిత వాస్తవరూపం. బాహ్యరూపా న్నధిగమించగలిగిన విషయ పరిజ్ఞానం కావాలి. లేకపోతే ప్రథమ దర్శనంతో మోసపోయే ఆస్కారం ఉంటుంది. మేఘంలో మెరిసే జాజ్వల్యమానమైన మెరుపు, విద్యుచ్ఛక్తి అవగాహనకు దోహదపడుతుందా! మెరుపుగా అభివ్యక్తమైన శక్తిని గురించిన అధ్యయనానికి లోతుల లోనికి వెళ్లాలి. అలాగే చైతన్యం గురించి కూడా! మౌలికంగా అజ్ఞానపూరితసత్యంలో అస్పష్టంగా అది బహిర్గతం కావచ్చు. ఈ అసాధారణశక్తిని గురించి తెలుసుకోవలసి వచ్చినపుడు, పైకి యుక్తంగా కనిపించే ఈ Phenomenon యొక్క పుట్టుపూర్వోత్తరాలు, నిజస్వరూప స్వభావాలు, లోతుగా అధ్యయనం చేయాలి. ఇది నిశ్చైతన్య పదార్థంలో అసాధారణ శక్తి. దీని ప్రతిక్రియలు, వికారాలు, కార్యకలాపాలు, పర్యవసానం – అన్నీ అసాధారణంగానే ఉంటాయి.

పదార్థ విజ్ఞానశాస్త్రం మనోవిజ్ఞాన శాస్త్రం – వీటి పరిశోధనలు క్రింది నుంచి మీదిగి సాగుతవి. మనోవిజ్ఞానశాస్త్రం పదార్థ విజ్ఞాన శాస్త్రానికి విస్తృతి మాత్రమే. పదార్థమును ప్రాతిపదికగా తీసుకొని దాని లోతు, కేంద్రము, ఎత్తు, అగ్రభాగము పరిశీలించి

బోధపడినది అని అనుకుంటారు. ఇది పొరపాటు. వీటి యదార్థం, లోతులలో లేక కేంద్రంలో లేక అగ్రభాగంలో ఎక్కడో ఉంటుంది. అలాగే చైతన్య సత్వం కూడా తెలియబడుతుంది. ఈ చైతన్య మును కనుగొనేలోగానే మనం పారవశ్యస్థితికి (trance) వెళ్లిపో తాము.

పదార్థ పరిశీలనలు నిరర్థకమనటానికి కారణం అందున్న చైతన్యం పారవశ్యస్థితిలో నిశ్చలమై ఉండటం వలననే. పరిశీల నకు అది అందదు. తరిచి తరిచి చూచినా దాని సంచలనం అంతుపట్టదు. అది ప్రాణిక పదార్థం (living matter) లో, అవ చేతనగా ఉండి మనకు అవగతం కాదు. పశువులలో చైతన్యం పాక్షికంగా మెలకువలో ఉంటుంది. మనిషిలో ప్రాథమిక అజ్ఞానం నుంచి ప్రారంభం ఔతుంది. దాని వ్యక్తీకరణము, ఆధారవిషయాలు మనం గమనించగలం. ఆ కదలికలు, అజ్ఞానం జ్ఞానం కోసం వెతుకులాటలు. వీటి వలన మాత్రమే చైతన్యం (consciousness) గురించి తెలుసుకోలేము. దీని మూలాధారము కాని, పరమశ్రేష్ఠ మైన దీని సంభావ్యతలు కాని, పరిమితులుకాని తెలుసుకోలేము. దీని కసలు పరిమితులున్నవా లేక అపరిమితమా అనేది కూడా తెలియదు. ఈ అసంపూర్ణ అజ్ఞానాల నుంచి ఉన్నత సంభావ్యత లకు గుప్తమైన లోతులకు మరుగున ఉన్న కేంద్రాలకు చేరు కున్నప్పుడు చైతన్యముయొక్క నిజస్వభావాన్ని, తద్వారా మన వాస్తవిక సత్యమైన జీవాత్మను తెలుసుకోగలుగుతాము.

ఒక ఉన్నత చైతన్యము లేక అంతర్గత కేంద్రము ఉన్నట్లు ఎలా తెలుసుకుంటాము? అది బాహ్యంగ వ్యక్తమైన దృగ్గోచర మయేది కాదు కదా? అది దాని అసాధారణ అభివ్యక్తీకరణ ద్వారా తెలుసుకోబడుతుంది. ఉన్నతసీమలో ఇవి ఎప్పుడూ అసా ధారణంగానే ఉంటాయి. మనకు అసాధారణము సాధారణముగా పరిణమించేది యోగము వలననే!

యోగప్రక్రియల ద్వారా ఆవిష్కృతమైన ఫలితాలు చైతన్య గమనాలను తెలుపుతవి. ఇది Yogic Psychology యోగపరమైన మనోవైజ్ఞానిక శాస్త్రము.

యోగమనోవైజ్ఞానిక శాస్త్రము. యోగప్రక్రియలను వాటి ఫలితాలను పరీక్షించి అది అందించిన చైతన్య భావనలను కదలికలను తెలియచేస్తుంది.

అంటే దీనికి సాధారణ మనోవైజ్ఞానిక శాస్త్రముతో సంబంధము లేనట్లే. బాహ్య ఇంద్రియానుభవ విషయ పరిజ్ఞాన పరిధులను దాటి, ఇంకా విశాల ప్రాతిపదికల నాధారం చేసుకొని యోగం పనిచేస్తుంది. దీని కార్యాచరణక్షేత్రము అనంతము. దీని ప్రక్రియలు సాధన సంపత్తి మృదులము. పరిస్థితుల కనుగుణంగా మారే సౌలభ్యం కలవి. విస్తృతమైనవి, అపరిమితమైనవి.

ఆధునిక మనోవిజ్ఞాన శాస్త్రము – సజీవ పదార్థ అంతర్నియమాలు, చైతన్యములు తరచి చూచి చెప్పుకోతగిన ఫలితాలనే సాధించింది. సందేహం లేదు. కాని దాని ఫలితాలు పరిమితములు. ఇదమిద్ధమని తేల్చి చెప్పేవి కావు. (fundamentally inconclusive) దీని వలన మనకు తెలిసేది ఎంతవరకు అంటే – చైతన్యముయొక్క కదలికలు బాహ్య శారీరక అవయవముల నడవడికలకు లోబడి ఉంటాయి – అంతవరకే. ఇది చాల పరిమిత జ్ఞానము. చైతన్యము యొక్క మూలస్వభావము, నియమములు తెలుసుకోవలసినవి ఎన్నో మిగిలే ఉన్నాయి. ఒకటి మాత్రము నిరూపితమైనది. శరీరము – చైతన్య అభివ్యక్తీకరణకు జీవయంత్రము, సాధన సంపత్తి – అని. దేహము యొక్క వడుదుడుకులు, వాటి ఫలితాల ప్రభావము దేహాన్ని అధిష్ఠించి ఉన్న చైతన్యముపై ఉంటుంది. ఇది ఊహించబడినదే. ఆమోదయోగ్యమైనదే కూడా. కాని చైతన్యం భౌతికస్థాయిలో పని చేస్తుందనే దానికి ఆధారము లేదు. ఇది శరీరము యొక్క జీవశాస్త్ర లేక రసాయన ప్రక్రియలలో ప్రభవిస్తుందనేది కూడా నిరాధారమైనదే. చైతన్య మూలము ఏదైనా, స్వభావమేదైనా – అది నిష్క్రమిస్తుందే తప్ప అంతమవదు. రాలిపోయిన శరీరము నుంచి ఇది నిష్క్రమిస్తుంది. అంతేకాని అస్తిత్వాన్ని కోల్పోదు.

దృగ్గోచర విషయాల విచారణలో ఆధునిక మనోవైజ్ఞానిక శాస్త్రము కనుగొన్న సత్యాలు యోగ ప్రక్రియలో కనుగొన్నవే –

అవచేతన, దానికి సంబంధిత ద్వంద్వ లేక బహుముఖ వ్యక్తిత్వాల వగైరా. ఇతర విజ్ఞానశాస్త్ర పరిశోధన ఫలితాల వలెనే, మనో వైజ్ఞానిక శాస్త్ర పరిశోధన ఫలితాలు కూడా విస్తృతస్థాయిలోనే కనుగొనబడినవి. కాని ఇవి తాత్కాలిక లక్షణాలుగా, చీకట్లో వెతుకులాటలుగా అసమగ్రంగానే ఉన్నాయి.

ఏది ఏమైనా యోగప్రక్రియ ద్వారా మాత్రమే బుద్ధికి అతీతమైన అంతిమ వాస్తవమును (psychologically Unknown) తెలుసుకోగలిగే దిశగా సాగే మహాప్రస్థానానికి సాధన సంపత్తి ఉపలబ్ధమౌతుంది. ఇది ఇరుగుదారుల గుండా సాగే అస్పష్టయానము. మనోవైజ్ఞానిక పరిశోధన రంగానికి కూడా అంతరంగ చేతనకి సంబంధించిన వైజ్ఞానిక సాధన సంపత్తి అవసరమౌతుంది. అంతరంగ చైతన్యంలో పనిచేసే తీరు తెలియబడాలి. దీని ద్వారానే నిశ్చితమైన ఉపపత్తులు, నిర్ధారితమైన ఫలితాలు పొందటానికి, దృగ్గోచరంగాని విషయాలు తెలియబడటానికి వీలు కలుగుతుంది. మనోవిజ్ఞానం బాహ్యంగా కనిపించే ఇంద్రియ గ్రాహ్య సంవేదనలకు పరిమితమైన వాటిని తెలుసుకోవటానికి మాత్రమే తగి ఉంటుంది. ఇంద్రియాతీత అంతరంగ విషయాలు తెలుసుకోవటానికి ఇది చాలదు. ఇందుకు అంతరంగ విషయపరిజ్ఞానం కావాలి. ఈ విజ్ఞానము గుప్తము, అంతగా అభివృద్ధి చెందనిది. చైతన్యం ద్వారా చైతన్యమునకు సంబంధించిన సాధన సంపత్తి వలన మాత్రమే చైతన్య స్వభావ విషయాలు తెలుసుకోబడుతవి. ఇదియే యోగవిజ్ఞానము.

ఒకాయన ఒక సైంటిస్టు దగ్గరకి వెళ్లి తనకు సైన్సు బోధించమన్నాడు. సైంటిస్టు సూక్ష్మదర్శిని, దూరదర్శిని ద్వారా వస్తువులను చూపించాడు. "ఇవన్నీ అద్దాలలో నుంచి చూడటం వల్ల కలిగిన దృష్టి దోషాలు. నా సాధారణ దృష్టికి ఇవి ఇలా చూపించే వరకు ఈ తమాషాలు నమ్మను" అన్నాడు. సైంటిస్టు వాటికి సంబంధించిన ప్రయోగాలు, పరీక్షలు చేసి చూపించి నిరూపించాడు. ఆయన ఓ నవ్వు నవ్వి "నీ నిరూపణలు అన్నీ కాకతాళీయ సంఘటనలు అంటాను. నీవు ఎన్ని ప్రయోగాలు చేసి చూపిం

చినా అవి ప్రకృతి వైపరీత్యాలు ఔతాయి" అన్నాడు. తర్వాత గణితశాస్త్ర ఫలితాలు అతని ముందుంచినపుడు ఆయన కోపంతో గట్టిగా అరుస్తూ "ఇదంతా దగా; అపభ్రంశం; మూఢవిశ్వాసం. ఈ అసందర్భ మోసపూరిత గీతలకు, అంకెలకు, విలువ అర్థం ఉన్నదని నన్ను నమ్మించి మోసం చేదామనుకుంటున్నావు" అన్నాడు. అపుడు సైంటిస్టు అతనిని పనికిమాలిన బుద్ధిహీనునిగా భావించి మెడ పుచ్చుకుని బయటకి గెంటివేశాడు. ఇక్కడ సైంటిస్టు గమనించవల్సినది ఒకటి ఉన్నది.

నిరాకరణ పద్ధతి, అప్రమాణ నిరూపిత తర్కవిధానం – ఒక విషయాన్ని నిష్పక్షపాత, నిష్కపట బుద్ధితో కూడిన విచారణలో తిరస్కరించినపుడు, ప్రత్యేకమైన ఆడంబర పదజాలంతో త్రోసిపుచ్చటం, విచారణను నిరర్థకం చేసే ప్రయత్నం చేయటం జరుగుతుంది. ఇక్కడ ఇదే గమనార్హం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

వెన్నెలలు

(1908 కి ముందు శ్రీఅరవిందుల పూర్వకవిత – ఒక భాగం)

విజ్ఞానశాస్త్ర ప్రవచనం విచిత్రం, అవాస్తవం –
జంతువుల్లా ఉంటూ దేవతలులాగా ప్రవర్తించడం,
మర్త్యులమై అమరత్వ మహత్వం నటించటం
శూన్యంలో దివ్యపక్షాలను విదిలించడం.

"అల్పాయుష్కులారా భవిష్యత్తు కోసం జీవించండి,
ఇంకా పుట్టని వాళ్ల కోసం జ్ఞానం, ఆనందం సేకరించండి.
వర్తమానమే నీది. ఆ వర్తమానాన్ని

కోల్పోవద్దు, ఫిర్యాదు చేయవద్దు."
అని విజ్ఞానశాస్త్రం ప్రబోధిస్తుంది.

మనిషికి అమృతత్వాన్ని తిరస్కరిస్తుంది.
నిరాకరించి పరిశోధిస్తుంది.
ఆకస్మిక జ్ఞానాంధురాలుగా మారుతుంది,
ఆమెలో దాగిన ఉన్నత మనస్సు ఆమె
కుతర్కాలని చూసి నవ్వుకొంటుంది.

సత్యం అటువంటి విహంగ విహారం చేయదు.
తొలి బలహీన ప్రారంభ దశలను దాటి,
తన రెక్కల కాంతుల్ని వెదజల్లుతూ
కాలాంతర సరిహద్దులు దాటుతుంది.

సత్యాన్ని భౌతిక ఆవిష్కరణలను
అణచివేయవద్దు. ఆమె ఇంకా పురోగమించాలి.
లోవెలుగుల్ని ఆమె తిరస్కరించరాదు.
సంకుచిత మనస్కుల భాషాడంబరం
మనుజుల మనోద్వారాలను మూయరాదు.

మేము సత్యాన్ని అన్వేషిస్తాం, ఒక్క క్షణం
ఆగము, భీతి చెందము. మేము దివ్యసత్యాన్ని
సాధిస్తాం. హేతువాది గంభీర ప్రవచనాలు మాకువద్దు.
మృగాలం, ముతక సౌలభ్యాలు మావి, కాకపోతే,
ఆత్మలం, అమర సంగీతం ఆలకిస్తాం.
మేధస్సే అంతా కాదు. మన అనుమాన నివృత్తి కోసం
మార్గదర్శి లోపల నిరీక్షిస్తూ ఉన్నాడు
హేతువునే అతను అధిగమిస్తాడు.
అతని మహత్వపు భవిష్యత్ సూచికలు రూప
రహితమై కదలాడతాయి.

రసాయనశాస్త్రం ద్వారా జీవమూలాన్ని
విజ్ఞానశాస్త్రం అన్వేషిస్తున్నది.
ఆమె శోధించిన మహాసూత్రాలు ప్రకృతిలోని
సూక్ష్మసూత్రాలు మాత్రమే. సంఘర్షణ ద్వారా
శాంతిని సాధించి, స్వేచ్ఛా ప్రపంచ నిర్మాణం ప్రకృతి లక్ష్యం.

మనలోని అంగాంగాల వెనుక రహస్యం దానికి తెలియదు.
మెదడంటే మనసనుకొంటుంది.
శరీరాన్ని ఆత్మగా భావిస్తుంది.
సృష్టి సర్వాన్ని అన్వేషించే సహనం దానికి లేదు.
శిశువులాగా దుందుడుకుగా పరుగుల తీస్తుంది.

"చాలు చాలు" "జీవమునంతా నేను కనుగొన్నాను.
నా పరిశోధన అంతా పూర్తి అయింది. ఇంకేమీ లేదు.
వివరాలను ఒక క్రమంగా అమర్చి, నా నిధులను లెక్కించాలి"
తనను తాను ఆమె మోసగించుకొంటుంది. దైవాన్ని
తిరస్కరిస్తుంది.

భగవంతుడందుకే అవతరిస్తాడు; అనిశ్చిత
మంచుతెరల వెనుక దాగిన అంతర్జగత్తు రహస్యాలు
అద్భుతాలు ఆవిష్కృత మవుతాయి త్వరలో.

చిట్టచివరికి తలుపు తెరుచుకుంటుంది.
విజ్ఞానశాస్త్రం ఇక కొద్దికాలమే నిలుస్తుంది.
మనిషిని చిన్నబుచ్చే ధోరణి అంతరిస్తుంది.
అతనిలోని అమృతాత్మ వికాసాన్ని అది ఆపలేదు.

అనువాదం: కె. యజ్ఞన్న

ఆత్మశక్తి మార్గాలు

పురోగమనశీలమైన ప్రకృతి తన ఉన్నత లక్ష్యాన్ని
ఎలా అందుకుంటుంది?
తడబడే అర్భక మనోచేతన వల్ల మాత్రం కాదు.
అది రూపొందించే మొరటు రూపరేఖావిలాసాలవల్ల అసలే కాదు.
మరి? సునిశిత ఆత్మావలోకనంతో మాత్రమే.
మనసు గీసిన బాహ్యేంద్రియ ఆల్జీబ్రా రేఖాచిత్రాలు
స్తబ్ధమైన నిస్సారమైన అస్పష్ట సంకేతాలు
ఆకర్షణీయంగా చూపించే బాహ్య విన్యాసాలు –
ఇవే కదా! మనిషికి మనసు అందించే అసమగ్ర ఆర్జనలు!
అంతరాత్మ ఎన్నో సుసంపన్న, పురోగమన, సంవిధానాలు
అందించింది మనిషికి –
(ఏమవి?) విశ్వాన్నే తనలో నిక్షిప్తం చేసుగోగలిగే అంతరంగం.
పొందికైన క్రాంత దృష్టి;
దివ్యాభినివేశ పరిపూత (విశ్వ) విశాల మనోచేతన
అనుకంపిత నిర్మల హృదయం
అద్భుతమైన సువిశాల విశ్వదృష్టి; నిశ్చల మనసు –

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

అన్వేషణ

దేనికి నా ఈ అన్వేషణ?

నిత్యనూతనమైనదే అయినా, సనాతన విజ్ఞానజ్యోతి కోసం. అది సప్రమాణికంగా ఉండాలి. సమరస్య పూర్వకంగా ఉండాలి. సార్వజనీన ఆమోదయోగ్యం కావాలి. మానవ సహజ అజ్ఞాన తిమిరాలను పోగొట్టగలిగే జ్ఞానప్రసారకాంతి కావాలి. నా అన్వేషణ ప్రక్షిప్తాలకు, మార్పులకు, చేర్పులకు అవకాశమీయని సార్వజనీన, సార్వకాలీన, అమరమైన మూలగ్రంథం కోసం. ఇంకా నా అన్వేషణ – నిరంహాకారమైన స్వచ్ఛత కోసం. దైవాన్ని, దైవసృష్టిని నిరర్థకం చేయని వైరాగ్యం (ascetism) కోసం. అది నాకు విముక్తిని స్వచ్ఛతను ప్రసాదించాలి. నిరహంకార యోగ్యంగా ఉండాలి. ప్రతి విషయాన్ని ఓరిమితో నిశితంగా పరిశీలించగలిగి, హేతుబద్ధమైన విమర్శనాత్మక దృష్టి కోసం నా అన్వేషణ. ఆధునికత పేరుతో శతాబ్దాల గత మానవ చరిత్రనంతా కేవలం నిరర్థక మూఢాచారం మాత్రమేనని తీసిపారవేసే అసమర్థనీయ, అవివేక సిద్ధాంతాలను త్రోసిపారవైచే సరసద్వివేకం కోసం నా అన్వేషణ. లోకజ్ఞానం, తెలివితేటల పేరుతో చేసే సంకుచిత పిడివాదం, సంస్కరణ వ్యతిరేకత, అసహనం – ఇవి కావు కావల్సినవి. నిర్విరామ సత్యశోధనకు తోడ్పడే సమ్యక్ దృష్టి, సదసద్వివేచన కొరకు నా అన్వేషణ. భౌతికాన్ని అంటిపెట్టుకుని ఉండని, దానికి బానిస కాని భౌతికపదార్థ వాదాన్ని గుర్తిస్తాను. మోసం, మాయ – వీటికి ఆస్కారం లేకుండా, సాక్ష్యాధారాలతో నిరూపించగలిగే అతీంద్రియ నిగూఢశక్తులను అన్వేషిస్తాను. గ్రుడ్డిగా ఆచరించే బుద్ధిహీనమైన పాతబడిన ఆచారవ్యవహారాలను నిరసిస్తాను. సంక్షిప్తంగా చెప్పాలంటే – నా అన్వేషణ విజ్ఞానం కోసం కాని, మతం కోసం కాని, దివ్యజ్ఞానం (Theosophy) కోసం కాని కాదు. నా అన్వేషణ వేదోక్త ప్రతిపాదితమైన పరబ్రహ్మము కొరకు. తాత్కాలిక పైపై మెరుగులు కోసం కాదు. సత్యానంద కర్మల దిశగా నడిపించే పరమోన్నత జ్ఞానజ్యోతి కోసం. యస్మిన్ విజ్ఞాతే సర్వం విజ్ఞాతం

– అన్న సనాతన వైదికధర్మము కొరకు నా అన్వేషణ. సనాతన ధర్మానికి వేదము మూలమని నమ్ముతాను. హిందూత్వములో నిగూఢంగా ధర్మమదియేనని నమ్ముతాను. అడ్డుతెరలు తొలగిం చుకొని తెలుసుకోదగిన సర్వధర్మజ్ఞమే ఇది అని నమ్ముతాను. భారతదేశ భవితవ్యముతో పాటు యావత్ప్రపంచ భవితవ్యం ఈ పరమోత్తమ సనాతన వైదికధర్మముపై ఆధారపడి యున్నదని విశ్వసిస్తాను. ప్రాపంచిక జీవనత్యాగంకాక ప్రపంచ జీవనయా నంలోనే సమ్యక్సత్య సోధన సుసాధ్యమని నమ్ముతాను.

Essays Divine and Human 1997 Edn. P.65 & 66

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సమాచార పత్రము

2006 ఆగస్టు 15, శ్రీఅరవిందుల 134 వ జయంతి. శుభసంద ర్భంగా పాండిచేరి బీచ్ ఆఫీసులో నిర్వహింబడే కార్యక్రమాలు:

1. శ్రీఅరవింద సొసైటీ వార్షిక సమావేశ సభలు – ఆగస్టు 12, 13 మరియు 14 వ తేదీలలో
2. ఆగస్టు 17 నుంచి 26 వరకు శ్రీఅరవిందులవారి 'గీతా వ్యాస ములు' పై అధ్యయన శిబిరము, డా॥ యం.వి నడ్కర్ణిగారిచే ఉదయం 9 గం॥ నుంచి 10 గం॥ వరకు మరియు 10.30 గం॥ నుంచి 11.45 గం॥ వరకు అందరూ ఆహ్వానితులే.

వడోదరా (గుజరాత్): ఆచార్య కిట్టురెడ్డిగారు, శ్రీఅరవిం దాశ్రమం, పాండిచ్చేరి 'భవిష్య భారతము – సంసిద్ధత – కార్యా చరణ ప్రణాళిక' అంశముపై వడోదర మున్సిపలు కార్పోరేషను టౌను హాలులో (ఫిబ్రవరి 2006) బహిరంగ ఉపన్యాసం ఇచ్చారు.

బంకూరా బ్రాంచి (వెస్టుబెంగాలు): వారు యువతకు శిబి రాన్ని మార్చి 18, 19 తేదీలలో నిర్వహించారు. నైరోబీ (కెన్యా): వారు మార్చి 15, 16, 17 తేదీలలో శ్రీఅరవింద భవన్‌లో నిర్వ హింపబడిన కార్యక్రమాలలో డా॥ ఆలోక్ పాండే, శ్రీ శ్రద్ధాళు

గారలు పాండిచేరి నుంచి వెళ్లి పాల్గొన్నారు. హేసల్ (రాంచి) బ్రాంచి వారు నూతనంగా నిర్మించుకున్న ధ్యానమందిర ప్రారంభోత్సవం ఏప్రిల్ 4, 2006 నిర్వహించుకున్నారు. గుల్బార్గా (కర్ణాటక) బ్రాంచివారు ఏప్రిల్ 16 నుంచి 30 రోజులు యోగాసన శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. నౌడా (యు.పి.) వారు యువతకి ఏప్రిల్ 16 న శిబిరము ఏర్పాటు చేశారు. అల్హాబాద్ (యు.పి) కేంద్రంవారు ఏప్రిల్ 16 న ఒక సెమినారు నిర్వహించారు. అంశం: Contribution of Sri Aurobindo and the Mother in Human Evolution.

తిరుపతి (ఆంధ్రప్రదేష్) బ్రాంచివారు 24-4-2006 తేదీ సాయంకాలం శ్రీమాత పాండిచేరి శాశ్వత ఆగమన దినమును భక్తిశ్రద్ధలతో పాటించారు. నాటి సమావేశంలో ఆధ్యక్షులు శ్రీ బలరామరెడ్డిగారు, శ్రీ యన్. అప్పాస్వామిగారు ప్రసంగించారు. కార్యదర్శి శ్రీ హానుమంతుగారు వందన సమర్పణ కావించారు.



శ్రీఅరవిందులు

జాతీయ విద్యావిధానము

అఖిల భారత పత్రిక, ఆగస్టు 2006

విషయసూచిక

7/08/2006.

విద్య

దేశానికి ఏ రకమైన విద్యావిధానం బాగుంటుంది అనే అంశంపై అభిప్రాయాలకు కొదవే లేదు. ప్రస్తుత విద్యావిధానము అసమగ్రము. అన్న విషయంపై భేదాభిప్రాయము లేదు. ఆధునిక కాలంలో విద్య అంటే శాస్త్రసాంకేతిక విద్యయే అనేది సాధారణ అభిప్రాయము. ఎందుకంటే ఇదే ఉపాధి కల్పించేది కనుక. దేశభవితవ్యం ఆ దేశ తరగతి గదులలో రూపుదిద్దుకుంటుంది అనేది వాస్తవం. భారతీయ విద్యావిధానము యూరోపియను విద్యావిధానానికి పూర్తి అనుకరణ అన్నది నిర్వివాదాంశము. దీనిని పూర్తిగా గర్హించనవసరము కూడా లేదు. కాకపోతే ఇది పూర్తిగా మేధోపరమైన విద్య. It feeds the mind, but starves the spirit. అందుకే

ఈ విద్యావిధానము అసమగ్రము, ఏకపక్షము. యూరపులో కొన్ని విప్లవాత్మక ప్రముఖ ఉద్యమాలు – *the Renaissance, the Reformation, the Industrial Revolution, Political Revolution* – కొన్ని శతాబ్దాల కాలవ్యవధిలో తలెత్తితే, భారతదేశంలో ఇవన్నీ ఇంచుమించు ఏకకాలంలో (19-20 శతాబ్దాల మధ్య కాలంలో) చోటు చేసుకొని దేశాన్ని అతలాకుతలం చేశాయి. దీనికి తోడు దేశపరాధీనత ఫలితంగా విలువలు తలక్రిందులైనవి. పాశ్చాత్య విద్యావిధానం తప్ప దేశానికి మరొక గత్యంతరం లేని దుస్థితి ఏర్పడింది. మన విద్యాలయాలు శాస్త్ర సాంకేతిక నిపుణుల శిక్షణ కార్యక్రమంలో తలమునకలై, పోటాపోటీగా teaching shops గా రూపాంతరీకరింపబడ్డాయి. ఇదొక అస్తవ్యస్త, గందరగోళ పరిస్థితి. ఒక పద్మవ్యూహంలో చిక్కుకొని ఉండటమే తప్ప బయలుపడే మార్గం తోచని పరిస్థితి. విద్యాలయాలలో అన్ని స్థాయిలలో ఆధ్యాత్మిక విలువల ప్రాతిపదికగా విద్యాబోధన జరగాలి. ఎలా? నూర్రేళ్ల క్రితమే శ్రీఅరవిందులు ఈ సమస్యని సూటిగా ఎదుర్కొన్నారు. విశ్లేషించారు. పరిష్కార మార్గాలు సూచించారు. వాటిని కార్యరూపంలో పెట్టాలంటే చిత్తశుద్ధి, పట్టుదల, ఆత్మవిశ్వాసం లాంటి ఎన్నో సల్లక్షణాలతో సంసిద్ధం కావాలి. అందుకు సిద్ధంగా ఉన్నామా? *'All can be done if the god touch is there'* మరి అధ్యయనం చేసి ఆలోచించండి.

– సంపాదకుడు

నూరేళ్ల క్రితం – III

(శ్రీఅరవిందులు – జాతీయవిద్య)

శ్రీఅరవిందుల బరోడా సంస్థాన ఉద్యోగం పదమూడు సంవత్స రాలకు కొంచెం పైబడి సాగింది. ఇందులో మూడోవంతు బరోడా కాలేజీలో ఇంగ్లీషు, ఫ్రెంచి భాషాధ్యాపకులుగా, వైస్ ప్రిన్సిపా లుగా వ్యవహరించారు. 1905-1906 నుంచి ఏక్టింగ్ ప్రిన్సిపాలుగా పనిచేశారు. బ్రిటిషువారు ప్రవేశపెట్టిన విద్యావిధానంలో శ్రీఅర విందులు విసుగు చెందారు. బరోడా కాలేజీలో ప్రొఫెసరుగా పని చేసిన సందర్భంగానే వారికీ అనుభవం కలిగింది. సహజంగా చురుకైన, విశిష్టమైన, కోమలమైన భారతీయ మేధ బలహీనమై, మొద్దుబారేటట్లు చేస్తోందని వారు భావించారు. అదే సమయంలో బెంగాలు జాతీయోద్యమంలో బహిరంగంగా పాల్గొనే అవకాశం కోసం నిరీక్షిస్తున్నారు. బెంగాలు జాతీయకళాశాల స్థాపన ఆ అవ కాశం సమకూర్చింది. బరోడా సర్వీసుకు స్వస్తి చెప్పి, ఈ కళా శాల ప్రిన్సిపాలుగా చేరే సదవకాశం వారికి లభించింది. సుబోధ్ మల్లిక్ అనే ఆయన ఆ కళాశాలకు లక్ష రూపాయిలు విరాళం ఇస్తూ, శ్రీఅరవిందులను అందులో ప్రొఫెసరుగా రూ 150/- లు నెల జీతంతో నియమించే షరతు పెట్టారు. ఆ నాటికి శ్రీఅరవిం దులు బరోడాలో తీసుకుంటున్న నెల జీతం రు 450/- ఆగస్టు 14, 1906 న బెంగాలు జాతీయ కళాశాల ప్రారంభోత్సవం కలకత్తా టౌను హోలులో జరిగింది. (సరిగా నూరేళ్ల క్రిందట) ఆ మరుసటి రోజు శ్రీఅరవిందుల 34 వ జన్మదినం. కళాశాల ఆరంభించినది కూడా ఆ రోజే.

ఈ కాలేజీ ప్రారంభానికి కొంచెం ముందే శ్రీఅరవిందుల వారికి '*వందేమాతరం*' పత్రికతో సాన్నిహిత్యం ఆరంభం అయింది. మొదటి నుంచీ వీరి ఆసక్తి కాలేజీపై కంటె, పత్రిక – అది ప్రాతినిధ్యం వహించే పార్టీపైననే. శ్రీఅరవిందులకి కాలేజీ మేనేజిమెంటు వారితో విభేదాలేమీ లేకున్నా, జాతీయ ఆశయా లకు అనుగుణంగా విద్యావిధానాన్ని నడిపించే అవకాశం వారికి

కల్పింపబడ లేదనేది మాత్రం స్పష్టం. అలాగైన కూడా వారు ఒక సంవత్సరం కాలేజీ ప్రిన్సిపాలుగా ఉంటూ, నిరాటంకంగా బోధన సాగించారు. '*వందేమాతరం*' కేసు వీరిపై బనాయింపబడినపుడు కాలేజీ కార్యనిర్వాహకులకు ఇబ్బంది కలుగకూడగదని భావించి తమ పదవికి రాజీనామా చేశారు.

అనువాదం: సంపాదకుడు

జాతీయవిద్య

(ఉపోద్ఘాతం)

I

(1920-1921 సం॥లో '*ఆర్య*' పత్రిక ఆఖరి రెండు సంచికలలోను శ్రీఅరవిందులు ఈ రెండు అధ్యాయాలు వ్రాశారు.)

సార్వత్రికవిద్యయొక్క ఆవశ్యకత, నిర్దిష్టమైన దాని యోగ్యత ఆధునిక మేధావికి ఒక బలమైన సిద్ధాంతం అయింది. మేల్కొన్న జాతీయతావాదం, ఉదారబుద్ధి – ఈ అంశానికి పట్టుగొమ్మలు. ఈ అంశం ఎంతవరకు నిరాక్షేపణీయము అనేది వేరే సంగతి. జాతి మేధోసంబంధమైన కృషికి నేడు ఇది తప్పనిసరి అంశం. పోతే, దీనికి సంబంధించి, అందరికీ అంగీకారయోగ్యమైన సాధన సంపత్తి లేదు. విద్యకి సంబంధించి సహేతుకము, సముజ్వలము, ఆదర్శవంతము, ఆచరణ యోగ్యము – అయిన సమ్యక్ అవగాహన కూడా లేదు. ఇదొక అనిశ్చిత పరిస్థితి. దీనికి తోడు దేశంలో నెలకొని ఉన్న అసాధారణ పరిస్థితులు – మేల్కొన్న స్వాతంత్ర్య పిపాస, భిన్న ప్రాచ్య, ప్రాశ్చాత్య సంస్కృతీ నాగరికతల సంఘర్షణ, రాజకీయ పరాధీనత, విద్యావిధానము, తత్సంబంధ విధాన నిర్ణాయక అధికారాలు విదేశీయుల చేతుల్లో ఉండటం, ఇంగ్లీష, భారతీయ మనోవైఖరుల – పరస్పర బలవంతపు భేటీ – ఇవన్నీ జాతీయ విద్యావిధానం కోసం డిమాండును బలపరచినాయి. కాని, ఈ విషయమై సుస్పష్టమైన భావాలు కలిగి ఉండటం అత్యావ

శ్యకం. లేకపోతే పరిస్థితి తలక్రిందులై గందరగోళమైపోతుంది. జరిగినది కూడా అదే.

2) నిజమైన విద్య స్వరూపస్వభావాలు ఎలా ఉండాలి? ఇది తెలుసుకోకుండా జాతీయవిద్య గురించిన అవగాహన అసమగ్రంగానే ఉంటుంది. అందరూ ఏకగ్రీవంగా అంగీకరించే విషయం ఒకటి ఉంది. అది, ఇప్పుడున్న విద్యాలయాలలో, విశ్వవిద్యాలయాలలో విద్యాబోధన బాగు లేదు – సరికదా – జాతీయతాభావాన్ని, ఆత్మగౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేదిగా ఉంటోంది. ఆదర్శాలు, పద్ధతులు, మౌలికవిషయాలు – పాశ్చాత్య ప్రభావానికి లోబడి ఉంటున్నాయి. సరే. కాని ఇలా వ్యతిరేక నిర్ణయానికి వచ్చినంత మాత్రాన సరిపడదు. దీనికి మరి ప్రత్యామ్నాయమేది? మనిషికి ఆచరణయోగ్యమైన విధానము ఏమిటి? ఈ విషయంలో సరియైన అవగాహన లేదు. స్కూలుకి, కాలేజీకి – 'జాతీయ' విశేషణము చేర్చి స్వజాతీయుల పరిపాలనలో వాటిని ఉంచినంత మాత్రాన సమస్య పరిష్కారం కాదు. ఈ స్వజాతీయులు కూడా మనం గర్హించే విద్యావిధానంలో శిక్షణపొంది వచ్చినవారే కదా! అంతేకాక, అదే విధానానికి ఏవో కొన్ని మార్పులు, చేర్పులు చేసి, పాఠ్యాంశాలలో సాంకేతికపరంగా కొన్ని మదింపులు చేసి – హమ్మయ్య పనైపోయింది – అని సంతృప్తిపడటం మేధోపరంగా పిల్లిమొగ్గలు వేయటమే! సమస్య పరిష్కరింపబడదు, సరికదా, అటు తిరిగి, ఇటు తిరిగి, ఉన్న చోటికే మళ్లీ తిరిగి రావటం ఔతుంది. పేరు మార్చుకున్న సంస్థలు మెరుగైన విద్య నందించవచ్చు. అందించకపోవచ్చు. కాని, అది ఎంతవరకు జాతీయము అనేది మాత్రం, సానుభూతితో కూడిన, సదవగాహనాపరులకు కూడా సందేహాస్పదమే.

3) నిజానికి సమస్య శక్తికి మించిన ప్రయాసతో కూడినది. దీనికి తగిన ఆలోచన, ఆచరణ ఎక్కడ నుంచి ఎలా మొదలు పెట్టాలి, ఏయే నిబంధనలు, నియమాలు పరిగణనలోనికి తీసుకొని వ్యవస్థీకరించాలి – అనేది తెలుసుకోవటం అంత సులువు కాదు. ఎన్నో చిక్కుపరిస్థితులు. రూపొందించవలసినది పూర్తిగా

నవ్యమైనది. ప్రాచీన భారతదేశంలో అమలులో ఉండే ఏదో ఒక పాతసూత్రాన్ని, పద్ధతిని, వ్యవస్థని పునరుజ్జీవింప చేయడం కాదు. గత నాగరికత, సంస్కృతులకు అనుగుణంగా అప్పుడు అది ఎంతో మేలైనదిగా ఉండి ఉండవచ్చు. గతంలోకి వెళ్లటం అసంభవం, నిష్ప్రయోజనం. వర్తమాన అవసరాలకి, భవిష్యత్తులో ఇతోధికంగా రాబోయే అవసరాలకు ఇది ఏమాత్రం సరిపడకపోవచ్చు. మరొక ప్రత్యామ్నాయం ఏమంటే – ఇంగ్లీషు, జర్మన్, లేక అమెరికన్ (పాశ్చాత్య) విద్యావిధానాలను తీసుకొని, మార్పులు చేర్పులు చేసి, భారతీయమైన పై పై మెరుగులు అద్ది రూపొందించటం – ఇది ఆకర్షణీయము, తేలికైన విధానంగానే ఉంటుంది. ఇందుకు పెద్దగా బుర్ర పాడుచేసుకో నవసరం ఉండదు. క్రొత్తగా ప్రయోగించి చూడవల్సిన అవసరమూ ఉండదు. జాతీయం చేయవలెననే గగ్గోలు ఉండదు. చేయవల్సినదల్లా, అధికారం మార్పిడి, బోధనా మాధ్యమంలోమార్పు, పాఠ్యాంశముల ప్రమాణ, పరిమాణములలో సర్దుబాట్లు. కాని నేను మాత్రం ఇంతకంటె ఉన్నతమైన, లోతైన, పరిశీలనాత్మకమైన ఆలోచనా విధానాన్ని చేపట్టవలె ననుకుంటాను. భారతీయ జన జీవనాలకి (ఆత్మ), స్వభావానికి, స్వధర్మానికి, సంస్కృతీ సంప్రదాయాలకు, అవసరాలకు – అనుగుణమైన విద్య కోసం అన్వేషణ కావాలి. దీని రూపకల్పన ఎంత కష్టమైనా అగు గాక. అలాగని కేవలం గతాన్ని పట్టుకుని వ్రేలాడటం కాదు. భారతీయాత్మ వికాసం, సనాతనధర్మ పరిరక్షణ ఆలంబనంగా వర్తమాన భవిష్యదవసరాలకు అనుగుణంగా, పురోగమన భారతీయ అభివృద్ధికి తోడ్పడే విధివిధానం గురించిన స్పష్టమైన అభిప్రాయాలు ఏర్పర్చుకోవాలి. ఇందుకోసం లోతుగా, మూలాధారాలలోకి చొచ్చుకొనిపోవాలి. కార్యాచరణలో పెట్టే ముందు వాటిని సుస్థిరపరచుకోవాలి. ఆరంభం కట్టుదిట్టంగా ఉండాలి. లేకపోతే విషయం వక్రమార్గం పడుతుంది. చేరవలసన గమ్యం చేరకపోగా, నిరర్థక వైఫల్యానికి దారితీస్తుంది.

4) ముందుగా 'జాతీయవిద్య' అనే భావానికి సంబంధించి పసలేని అభ్యంతరాలను గురించి సంశయనివృత్తి చేసుకోవాలి.

వీటి ఔచిత్యం, ఉచితానుచితాలు వివేచన చేసి అవగాహనకు రావాలి. 'జాతీయవిద్య' అనేది అంతగా పట్టించుకోవల్సినంతటి ముఖ్యవిషయం కాదు. అసలీ భావనే యుక్తమైనది కాదు. అసం బద్ధమైనది. సంకుచితమైనది. దేశభక్తికి, దీనికి ముడిపెట్టడం సరి కాదు. మంచి పౌరశిక్షణ అందివ్వటమే దీని ప్రాముఖ్యత. ఇందు కోసం ప్రత్యేకంగా జాతీయ విద్యావిధానమునకు ఆవశ్యకత ఏమి ఉన్నది? పౌరశిక్షణ అన్ని దేశాలకు సమానమే కదా! ప్రాచ్య పాశ్చాత్యదేశాలు – ఇంగ్లండు, జర్మనీ, జపాను, ఇండియా – ఏ దేశమునకైనా జాతి అవసరాలు సమానమే కదా! సత్యజ్ఞానాలకు ఎల్లలు ఉంటాయా? అలాగే విద్య కూడా – ఇది సార్వజనీనము. జాతి, ప్రాంతీయ విభేదాలు ఉండవు. ఉదాహరణకు శాస్త్రవిజ్ఞాన విద్యకి స్వదేశీ, విదేశీ తేడా ఏముంటుంది! యూరపు దేశాల నుండి మనకు దఖలుపడినాయని ఆధునిక శాస్త్రవిజ్ఞాన సత్యాలను విస్మరించలేము కదా! గెలీలియో, న్యూటను – వీరితోను, వీరి తర్వాతవారితోను, వచ్చిన శాస్త్రవిజ్ఞానాన్ని బహిష్కరించి, స్వదేశీ యమని, భాస్కర, ఆర్యభట్ట, వరాహమిహిర మొదలైన ప్రాచీన విజ్ఞాన శాస్త్రవేత్తలనాటి విజ్ఞానానికే పరిమితమై ఉండిపోగలమా! అలాగే భాషాబోధన విషయంలో కూడా సంస్కృతం, ఇతర ప్రాంతీయభాషా బోధనలు, లాటిను, ఇతర యూరోపియను ప్రాంతీ యభాషా బోధనలు – వీటిలో తేడా ఏముంటుంది? ప్రాచీన తక్ష శిల, నలంద విద్యాలయాలు పాటించిన బోధనా పద్ధతులను ఇపుడు అనుసరించగలమా! కాకపోతే ఇపుడు మనం డిమాండు చేయగలిగేది – ఇంగ్లీషుకు బదులు స్థానికంగా మాట్లాడుకునే భాష మాధ్యమంగా విద్యాబోధన జరగాలని, ఇంగ్లీషుకి ద్వితీయస్థానం ఇవ్వాలని. ఈ మార్పుయొక్క ఉచితానుచితాలు కూడా యోచిం చవలసిన అవసరం లేకపోలేదు. 20 వ శతాబ్దంలో ఉన్న మనం, చంద్రగుప్త, అక్బరు కాలాన్ని పునరుద్ధరించలేము. కాలానుగు ణంగా, సత్య, జ్ఞానాభివృద్ధిలో పురోగమనం సాగించాలి. విద్యా విషయకంగా వెనుకబడి ఉండలేము. విద్య ఆధునిక జవజీవాలతో పరిపుష్టంగా ఉండాలి.

5) జాతీయతాభావాన్ని హాస్యాస్పదం చేసినప్పుడు జాతీయ విద్యకి సంబంధించిన అభ్యంతరాలన్నీ యుక్తంగానే ఉంటాయి. సంస్కరణ వ్యతిరేక తిరోగమన గతరూపాలతో దీనిని ముడిపెట్టి నప్పుడు ఇది హాస్యాస్పదంకాక మేరమౌతుంది! ఈ గతరూపాలు (the past forms) అలనాటి మన సంస్కృతికి, సజీవ వ్యవస్థాపక రూపాలుగా విలసిల్లినవే. మరిప్పుడు అవి మృతప్రాయమైనవి. జాతీయవిద్య అంటే ఇది కాదు. మన ప్రయత్నము కూడా అందుకు కానే కాదు. మనం అభ్యర్థించేది (demand) సజీవమైన అంతస్సారంతో కూడిన జాతీయవిద్య. అంటే గతానికి తిరోగ మనం కాదు. భాస్కరుని గణితశాస్త్ర, ఖగోళశాస్త్రాల వైపు దృష్టి మరల్చటం కాదు. స్వదేశీయత అంటే రైలు, మోటారు వదిలి ఎద్దుబండి కోసం వెంపర్లాడటమా! కాకపోతే ఈ విషయంలో కొంత తిరోగమన భావావేశం లేకపోలేదు. లోకజ్ఞానం వెర్రితలలు వేయకపోనూ లేదు. ఈ పిచ్చిప్రవర్తనలు అసలువిషయాన్ని భంగ పర్చాయి. మితమీరిన ఈ వింతస్వభావాలు మౌలిక అంశాన్ని భ్రష్టు పట్టించాయి. ఇక్కడ మనం జీవలక్షణంతో కూడి, సారభూ తమై, ప్రాణప్రదమైన అంశాన్ని పరిగణనలోనికి తీసుకోవాలి. ఇక్కడ మనకి సమస్య – ఆధునికతా? ప్రాచీనతా? అని కాదు. పైనుంచి ఇక్కడికి మనం దిగుమతి చేసుకున్న నాగరికతయా? లేక – ఎంతో గొప్ప భవిష్య సంభావ్యతలతో కూడిన భారతీయ మేధోస్వభావసంపత్తియా? సమస్య – ఆధునికత, ప్రాచీనతల మధ్యకాక వర్తమాన, ఉజ్వల భవిష్యత్తుల మధ్య అయిదవ శతా బ్దానికి తిరోగమనంకాక రాబోయే ఉజ్వల శతాబ్దాల వైపుగా పురోగమనం. కృతకమైన, అసంబద్ధ వర్తమానస్థితుల నుంచి దూసుకొని ముందుకు పోవటం. తన సహజ స్వాయత్తమైన ఉన్న తోన్నత అంతర్నిహితశక్తుల సమీకరణ కోసం. – అదే – భార తీయ ఆత్మశక్తి వికసనం కోసం. ఇదే మనం గట్టిగా కోరుకొ నేది; కావాలని పట్టుపట్టేది (demand).

6) జాతీయ విద్యావిధానానికి పాఠ్యాంశ సేకరణ అత్యావ సరము, ప్రధానాశయము కాకూడదు. అధ్యయన అంశాల విష

యసేకరణ గురించిన నిర్జీవభావనతో (the lifeless academic notion) జాతీయవిద్యకి వ్యతిరేకవాదం ఆరంభమౌతుంది. వివిధ అధ్యయన అంశాల విషయసేకరణ విద్యావసరాలలో ఒకటి మాత్రమే. అదే సమస్తము, ప్రధానము కాదు. మానవ మానసిక, ఆత్మశక్తుల ఏకీకరణ, పరిపుష్టి విద్యకి ప్రధాన ఆశయం. సంస్కార సౌశీల్యాలను, జ్ఞానఇచ్ఛాశక్తులుగా వాటిని ఆవహానం చేసుకునేటట్లు దాని రూపకల్పన – ఇదీ కనీస ఆశయం. ఇది వ్యక్తియొక్క విచక్షణాశక్తిని అపరిమితంగా పెంచుతుంది. సైన్సు అందించే శాస్త్రీయ విజ్ఞానమే మనకు కావాలనుకుంటే, పాశ్చాత్య విజ్ఞానాన్నంతటినీ ఒకేమారు ఆపోశన పట్టేయవచ్చు. లేదా వివిధ భాగాలుగా అధ్యయనం చేసి అభ్యసించవచ్చు. విజ్ఞాన సముపార్జన కాక, ఆర్జించిన విజ్ఞానాన్ని ఎలా వినియోగిస్తాము? ఏ ఫలితాన్ని సాధించేందుకు ఉపయోగిస్తాము? ఇతర మానసిక అంశాలకు ఎలా అన్వయిస్తాము? సాధారణ వివేక వివేచనలనెలా ప్రభావితం చేసుకోగలుగతాము? ఇదీ భారతీయ శేముషీ విశేష లక్షణం. దీనిని బలోపేతం చేసుకోవాలి. మనోవైజ్ఞానిక సుసంప్రదాయాలతో భారతీయ మేధస్సు సుసంపన్నమైనది. అత్యున్నత ప్రాధాన్యాలతో కూడిన సాంస్కృతిక లక్ష్యలక్షణాలుగా ఇది అభివ్యక్తమైనది. సంస్కృతము, ఏ ఇతర ప్రాంతీయభాష అయినా సహజ పద్ధతిలో, మనసును ఉత్తేజపరిచేరీతిలో నేర్చుకోవాలి. పాతపద్ధతులను పట్టుకునే వ్రేలాడ నవసరం లేదు. ఎలా నేర్చుకున్నా స్వాయత్తమైన జీవలక్షణాన్ని పట్టుకుని పునరుద్ధరించి, పరిపుష్టం చేసి అవిచ్ఛిన్నంగా సాగేటట్లు స్థిరపర్చుకోవాలి. ఇంగ్లీషు, మరియే ఇతర యూరోపియను భాషనైనా నేర్చుకొని, ఆయా దేశాల భిన్న సంస్కృతి, జీవనవిధానాలు తెలుసుకొని, మన చుట్టూ ఉన్న ప్రపంచంతో సహకార సద్భావాలు పంచుకోవాలి. ఇందుకు తోడ్పడేదే అసలు సిసలైన జాతీయవిద్య దీని లక్ష్యము, లక్షణము, ఆదర్శము ఇవే కావాలి. ఆధునిక శాస్త్రవిజ్ఞాన సత్యాలను విస్మరించ కూడదు. భారతీయమైన సత్యము, మేధస్సు, ఆత్మ – వీటిని ఆలంబనంగా జాతీయవిద్యావిధాన నిర్మాణం కావాలి.

7) ప్రతికూలమైన రెండో వాదం – యూరోపియను నాగరికతయే మనకు శరణు; దీనిని మనం ఆర్జించాలి. మన విద్యావిధానాన్ని కూడా తదనుగుణంగా మలుచుకోవాలి – అనే అంశంపై ఆధారపడి ఉంది. ఇది పసలేని వాదం. లోతుగా పరిశీలిస్తే నిలపడదు. ప్రాచీన ఐరోపా సంస్కృతి, నాగరికత నిర్మాణ మూలాలు – తూర్పుదేశాలైన ఈజిప్టు, చాల్డియా, ఫొనిషియా, ఇండియాలలో స్థిరపడి ఉన్నవి. తర్వాత గ్రీకు, రోమను నాగరికతల సంపర్కంతో యూరోపియను నాగరికత ఒక మలుపు తిరిగింది. కానీ అదీ అట్టే కాలం నిలపడలేదు. కొంతకాలం అయినాక ఆరబ్, ఇతర తూర్పుదేశాలు, భారతదేశంతో సహా – వీటి నుంచి ఇంకా మరింత విస్తృతంగా Renaissance Period (14-16 శతాబ్దులు) పునర్నవీకరణ కాలానికి సంబంధించిన పునరుజ్జీవ ప్రాభవములను ఆకళించుకొన్నది. తర్వాత ట్యుటోనిక్, లాటిన్, సెల్టిక్, స్లావ్ – జాతుల సంస్కృతీ ప్రభావాల దిశగా మళ్లినది. ఈ విధంగా పలు మలుపులు తిరుగుతూ, ఎన్నెన్నో సంస్కృతుల ప్రభావాలకి లోబడిన యూరోపియను నాగరికత మానవజాతి మేధస్సును (మధ్యయుగాలలోను, పిమ్మట కూడా) బాగానే ఆకట్టుకుంది. ఎంతవరకు ఆకట్టుకుందీ అంటే – జాతికి యూరోపియను నాగరికతయే అంతిమ లక్ష్యం, అవశ్యం అనుసరణీయం – అనేంతవరకు వెళ్లింది. కాని ఇది, ఆసియా దేశాల నాగరికతా విధానాలకు సరిపడలేదు; స్వీకారయోగ్యంగా లేదు. ఉండదు కూడా. ఎందుకంటే, వీటి అన్నిటికంటే ఉన్నత, సంస్కృతీ సంప్రదాయాల నేపథ్యం కలిగిన దేశాలివి. యూరోపియన్ నాగరికత వల్ల వచ్చిన నవ్యతని, వైవిధ్యాన్ని తమ నాగరికత సంస్కృతులతో, తమ మనో, ఆత్మ, సాంఘిక స్వభావాలకు, జీవనశైలికి అనుగుణంగా అన్వయించుకోగలిగి, తద్వారా తమ భవిష్య సంస్కృతీ సంప్రదాయాలను సృష్టించుకోగలిగే ప్రాచ్యదేశ జాతులివి. నేటి విజ్ఞానశాస్త్ర, హేతువాద, పారిశ్రామిక, మిథ్యా ప్రజాస్వామిక యూరోపియను నాగరికత – పతనావస్థలో, అంతరించే ప్రక్రియకి చేరుకున్నది. కూలిపోతున్న నాగరికతను పట్టుకుని

వ్రేలాడటం మతిమాలిన పనే! పురోగమనశీలురైన పశ్చిమదేశ మేధావులు వారి నాగరికత పతనమయే సాయం సంధ్యాసమయంలో, ఆధ్యాత్మికత జీవనాడిగా ఉండే నాగరికత కోసం ప్రాగ్దిశాన, ప్రాచ్యదేశాల – ముఖ్యంగా భారతదేశం వైపుగా – ఆశగా చూస్తున్నారు. ఈ తరుణంలో మనమేమో మన అంతర్నిహిత ఆత్మవైభవాన్ని ప్రక్కన పెట్టి, కూలిపోతున్న మరణోన్ముఖమైన యూరోపియన్ గతాన్ని నమ్ముకుని, దానినే పట్టుకొని వ్రేలాడటం అబ్బురమే కదూ!

8) ఇక చివరి అభ్యంతరం – ఇది మానవ మస్తిష్కం ఎక్కడైనా సరే ఒకేలా, ఒకే మూసలో పోతపోయబడినదిగా ఉంటుందనే స్థిరనమ్మకంపై ఆధారపడినది. కాని ఇది సరైనది కాదు. పసలేని నీరసమైన మూఢనమ్మకం. దీనిని పట్టించుకోనవుసరము లేదు. కారణం – విశ్వమానవ ఆత్మ, బుద్ధి – వీటికి అనుబంధంగా ఉండేదే.! అనంత వైవిధ్యం కలిగిన వ్యక్తి మనసు, ఆత్మలు. ఇవి సాధారణ, అసాధారణ లక్ష్య లక్షణాల మేళవింపు. ఈ రెండింటి నడుమ మధ్యంతరశక్తిగా (an intermediate power) జాతీయ మనో ఆత్మలు ప్రవర్తిస్తాయి (the mind of a nation) ఇదే ప్రజానాడి (the soul of a people) ఈ మూడింటినీ – విశ్వజనీన, జాతీయ, వ్యక్తిగత – బుద్ధి ఆత్మలు – విద్యావిధాన రూపకల్పనప్పుడు పరిగణనలోనికి తీసుకోవాలి. ఏ విద్యావిధానమైనా కూడా వ్యక్తియొక్క మనో ఆత్మల ఆమంత్రణకు అనుకూలంగా, సజీవమై ఉండాలి. యాంత్రికం కాకూడదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

II

జాతీయవిద్య అనగానే ఎదురొచ్చే అభ్యంతరాలు, ఆక్షేపణలు, అపోహాలు ముందర తొలగించుకోవాలి. ఆ తర్వాత దానిపై ఒక నిశ్చితవైఖరి, స్థిరాభిప్రాయం ఏర్పరుచుకోవాలి. భారతదేశంలో జాతీయవిద్యకు మూలసూత్రాలు ఏ విధంగా ఉండాలి, దాని ద్వారా సాధించాల్సింది ఏమిటి? దాన్ని సాధించడానికి మనం అనుసరించవలసిన మార్గాలు ఎలా ఉండాలి? మొదలైన అంశాల న్నిటినీ సూత్రప్రాయంగా సమీకరించుకోవాలి. ఇది కొంచెం కష్టసాధ్యమే. ఎందువల్లనంటే చాలా కాలం నుంచీ విద్యావిషయం గానైతే నేమి, సాంస్కృతిక విధానాల్లోనైతేనేమి, ఇంకా అనేక విషయాల్లో జాతీయతాభావాన్ని పోగొట్టుకొని భావదాశ్యంలో ఉన్నాము. ఇంతవరకూ జాతీయతను పునరుద్ధరించుకొనే ఆలో చన ఏమి జరగలేదు. ఆయా విషయాల్లో ఒక అంగీకారమూ లేదు, బేధాభిప్రాయమూ లేదు. ఏదైనా ఉంటే అది అనిశ్చిత భావావేశం మాత్రమే. మన తెలివితేటలకి, అలవాట్లకి, చపలచిత్తానికి సరి తూగే అపరిపక్వభావాలతో సంతృప్తిపడి ఉండిపోయాము. దాని వల్ల ఏ ఫలితం లేకపోగా మరింత అస్తవ్యస్త పరిస్థితి ఏర్పడింది. అందువల్ల మనం ముఖ్యంగా ఆలోచించవలసిందీ, చేయవలసిందీ ఏమిటంటే మన జాతీయస్వభావ స్వరూపాదులు, ఉద్దేశాలకు ఎటువంటి విద్య అవసరమో స్థిరాభిప్రాయం ఏర్పరుచుకోవాలి. ఆ దృక్పథంతోనే ఇప్పటి వ్యర్థ, బూటక, యాంత్రిక విద్యా విధానానికి ప్రత్యామ్నాయంగా సజీవమైన సృజనాత్మక విద్య ద్వారా భావిభారత యువతను తీర్చిదిద్దే ప్రయత్నం చేయాలి.

2) ముందుగా మనసులోని సందిగ్ధాలను తొలగించుకొని సరైన విద్య అంటే అవగాహన ఏర్పరుచుకొని, దాని పరమార్థ మేమిటో, సార్థకత ఏమిటో ఆలోచించాలి. అప్పుడే దాని ప్రారం భానికి, అమలుపర్చుకునేదానికి ప్రాతిపదిక ఏర్పడుతుంది. విద్య అంటే ఒక అవగాహన ఏర్పడి జాతీయవిద్యపై స్థిరాభిప్రాయం ఏర్పరుచుకోగలము. సజీవమైన మంచి విద్యావిధానం ఏర్పాటు

చేసేటప్పుడు మూడు ముఖ్యాంశాలను దృష్టిలో ఉంచుకోవాలి. మొదటిది మనిషియొక్క సామాన్య వ్యక్తిత్వం, అసాధారణ వ్యక్తిత్వం; రెండవది జాతీయత లేక (National) సామాన్యజన ప్రత్యేకత; మూడవది విశ్వజనీనత. ఈ మూడింటినీ పరిగణన లోకి తీసుకుని ముందు వ్యక్తిగా పరిపూర్ణ వికాసంతో తన జీవితం సఫలం చేసుకోటానికీ, తద్వారా తన పరిసరాలతోనూ, సంఘంతోనూ సరైన అవగాహన పెంచుకొని, తన వ్యక్తిగత జాతీయ వికాసంతోపాటు, మొత్తం మానవజాతి వికాసానికి తోడ్పడగలిగే విద్యావిధానమే సజీవమైన, సక్రమమైన విద్యావిధా నము కాగల్గుతుంది. ఈ సమన్వయదృష్టితోనే విద్యను గురించీ, జాతీయ విద్యావిధానాన్ని గురించీ ఒక స్పష్టమైన అభిప్రాయం ఏర్పరుచుకోవాలి. భారతదేశ భవిష్యత్తు మలుపు తిరగబోతున్న ఈ తరుణంలో ఇంతటి విశాల దృక్పథము, ప్రణాళిక ఎంతో అవ సరము. ఆ పునాదిలోనించి మన శక్తియుక్తులన్నీ విజృంభించి దేశ ఔన్నత్యం, వ్యక్తి ద్వారా, జాతి ద్వారా, ఆవిష్కృతమై సకల మాన వాళి జీవనగతిలో ఆమె పాత్ర పునస్థాపితం కావలసి ఉంటుంది.

3) అయితే మానవుడు, మానవజీవితం, జాతి, జాతి జీవనం. విశ్వ మానవత, విశ్వ మానవజాతి జీవనం – వీటి గురించి భిన్నభావనలు ఉంటాయి కాబట్టి ఆ వైవిధ్యాల కనుగుణంగా విద్యావిషయికంగా, మన భావనలు కూడా మారేటట్లుండాలి. భారతావనిలో అనాదిగా విద్యావిషయకమైన పత్యేకభావనలు, దూరదృష్టి ఉంటూనే ఉన్నాయి. ఇవన్నీ పరిశీలించి మన విద్యా విధానం ఏ ప్రాతిపదికపై రూపొందించాలో, ఏమి చేస్తే దేశానికి స్వకీయమైన జాతి లక్షణం (National Character) ప్రస్ఫుటమవు తుందో నిర్ణయించాలి. భారతీయ సిద్ధాంతరీత్యా మనిషి కేవలం భౌతికజీవియే కాదు; మనస్సు, బుద్ధి, అహంకార ప్రధానంగా ఏర్పడిన ప్రకృతిజనిత జీవజాతి మాత్రమే కూడా కాదు. ఆ దృష్టితో మాత్రమే చూస్తే విద్య కేవలం అహంకార ప్రధానంగానే ఉండ వచ్చు. అంతే అయితే, వ్యక్తి అహంకారము, జాత్యహంకారము ప్రోత్సహించి, క్రమబద్ధీకరించే విద్యావిధానం సరిపోతుంది. కానీ

ఇది మానవజీవితానికి ఒక పార్శ్వం మాత్రమే. ఇవి బాహ్యామైనవి. మనోప్రాణిక కార్యకలాపాలను నిర్దేశించేవి. పరిపూర్ణ మానవత్వ వికసనానికి సరిపోయేది కాదు.

4) భారతదేశం ఎప్పుడూ మనిషిని శరీరాకృతిలో ఉన్న భగవదంశగా, ప్రకృతిలో సచైతన్య విశ్వాత్మగా పరిగణిస్తుంది. ఆ మాత తన బిడ్డలకు ప్రత్యేకంగా శక్తివంతము, ఆచరణాత్మకము అయిన మానసిక జ్ఞానాన్నీ, ధార్మిక బుద్ధినీ, సౌందర్యాత్మకము, సుఖదాయకము అయిన ప్రాణిక భౌతికదేహాన్నీ ఒనగూర్చింది. వీటన్నిటి ద్వారా ఆత్మ వికశించేటట్లు, అభివృద్ధి చెందేటట్లు చేసినప్పటికీ అంతటితో అది సంపూర్ణం కాదు. వీటన్నిటినీ మించి ఇంకా అభివృద్ధి సాధించి శిఖరాగ్రాన్ని చేరి ఆధ్యాత్మికజీవిగా ఎదిగినప్పుడు అదే ఆత్మ సాక్షాత్కారమనీ అప్పుడే మానవుడు దైవత్వాన్ని పొందుతాడనీ, అదే జీవిత పరమార్థమనీ, పురుషార్థమని భారతమాత భావిస్తుంది. అందువల్ల భారతదేశం ఒక వ్యవస్థీకృత ఏక రాజ్యంగా, సాయుధబలగాలుగల సమర్ధ సమాజంగా, ఆమె ప్రజలు భావించడం లేదు. భారతజాతి తన సర్వస్వాన్నీ తన జాతిప్రతిష్ఠ కాపాడటానికి సర్వదా సమాయుత్తంగా ఉండే జాతి మాత్రమే కాదు. అలా అయితే అది జాతి ఆత్మను బంధించి ఉంచే ఇనుపచట్రము మాత్రమే అవుతుంది. అట్లాకాక అఖిలాండంలో ఒక మహా సంఘటితాత్మగా వెలసి తనదైన స్వభావాన్నీ, స్వధర్మాన్నీ కూడా వివేచనాత్మక, ధార్మిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో నిబద్ధీకరించింది. మానవత్వం పట్ల మన అభిప్రాయం కూడా దాన్ననుసరించే ఉంటుంది. విశ్వాత్మ మనస్సు, ప్రాణికముల ద్వారా పరిణామం చెందుతూ అత్యుత్తమ ఆధ్యాత్మిక గమ్యాన్ని చేరాలనేది దాని సారాంశము. ఆ లక్ష్యము చేరటానికి, ఆ విశ్వాత్మ ఎన్నో ప్రయాసలు పడి, సుసంపన్నమైన అనుభవ జ్ఞానంతో వివిధ జాతుల సంస్కృతీ సంప్రదాయాలను పరిశీలిస్తూ, వ్యక్తుల ద్వారా వారి వారి శక్తులను అభివృద్ధి చేసుకుంటూ భిన్నత్వంలో ఏకత్వం అన్నసూత్రం పాటిస్తూ పరిపూర్ణత కోసం మెల్లగా ప్రయత్నం

కొనసాగిస్తుంది. నిజంగా ఇలా జరుగుతుందా అని ఎవరికైనా అనుమానం కలుగవచ్చు. కానీ మానవునియొక్క లేక జాతి యొక్క పురోగతి ఇలాగే జరుగుతుందని ఒప్పుకుంటే మాత్రం ఈ విధంగా జరగటానికి. అంటే ప్రాణిక, మనో, శరీరాల ద్వారా ఏమి సాధించటానికని ఆత్మ నిర్ణయించుకుంటుందో, ఆ సాధనకి సహకరించేదే నిజమైన విద్య. అదే మూలసూత్రంగా మన విద్యా విధానం రూపొందించుకోవాలి. ఆత్మ అభివృద్ధి చెంది, దాని శక్తి సామర్థ్యాలనూ, అవకాశాలను పెంపొందించుకోటమే విద్యావిధానానికి ప్రేరణ కావాలి. ఒక జాతిదృష్టి ప్రధానంగా దాని పరిరక్షణ, పటిష్ఠతల మీదే కేంద్రీకృతంగా ఉంటుంది. ఆ తర్వాత జాతి, ఆత్మనూ, జాతి ధర్మాన్నీ సుసంపన్నం చేసి, ఆ రెంటినీ మొత్తం మానవజాతి, మానవాత్మను ఉద్ధరించే శక్తులుగా తయారుచేయటమే దాని కర్తవ్యమవుతుంది. మానవ పరమావధి ఏదైతే ఉందో దానిని ఎన్నటికీ కనుమరుగు కానీయని దృఢత్వం మానవునికి అలవడాలి. అంటే అంతర్గతంగా ఉండే చైత్యపురుషని జాగృతం చేసి ప్రవర్ధమాన మయేటట్లు చేయడమే మానవ పరమార్థం. అది ఎన్నటికీ మరుగున పడరాదు.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటారామ శాస్త్రి

జాతీయ విద్యావిధానానికి ఒక పద్ధతి

(కొన్ని ప్రాథమిక భావాలు)

ఈ ఎనిమిది వ్యాసాలు మొదట 1910 లో .'కర్మయోగిన్.' పత్రికలో ప్రచురితమైనవి. ఇది అసమగ్రము. జాతీయ విద్యకి సంబంధించిన అంశాలు పరోక్షంగా స్పృసింపబడినాయే తప్ప, ప్రత్యేకంగా ప్రస్తావింపబడలేదు. ఈ పరిచయ వ్యాసాలు ఏ దేశ జాతీయ విద్యావిధానానికి అయినా అనువుగా అన్వయిస్తాయి. క్రమబద్ధమైన బోధనా పద్ధతికి పాటించవల్సిన నియమ నిబంధనలను

సూచిస్తాయి. అందుచేత కొంతవరకు మన భారతీయ విద్యావిధా నానికి ఇవి ఉపోద్ఘాతంగా నిలుస్తాయి.

(1924 ప్రతిలో ప్రచురణ కర్తలు పేర్కొన్న వివరణ)

I

మానవ మేధస్సు

విద్యా బోధనకు బుద్ధి విచారణ – అసలైన ప్రాతిపదిక (basis). శైసవ, యౌవన, యుక్తవయసు స్థాయిల మనోవిచారణ – ఏ విద్యావిధానమైనా కూడా కేవలం విద్యావిషయిక సిద్ధాంతాలపైన మాత్రమే ఆధారపడి, ప్రధాన ఉపకరణము, బుద్ధిని విస్మరిస్తే అది మానసిక ఉన్నతికి అవరోధమే ఔతుంది తప్ప, బుద్ధి వికాసానికి, మనోసాధనసంపత్తికి పూర్తిగా సహకరించదు. బోధ కుడు – కళాకారుడు శిల్పివలె నిర్జీవమైన కొయ్యా, రాయిలతో పనిచేయడు కదా! అతడు వ్యవహారించేది అనంతమైన సునిసిత సున్నిత ఇంద్రియ జ్ఞానం కలిగిన బుద్ధిపరికరాలతో, మానవుడు రాయిరప్ప కాదు కదా, విద్యావేత్త కళాఖండాలను సృజించటా నికి! మనసు చేతికి చిక్కని పదార్థము. సున్నితము, బలహీన మైన మానవ శరీరపరిమితులను కూడా పరిగణనలోనికి తీసుకో వాలి ఈ విషయంలో.

2) నేటి యూరోపియను విద్యావిధానము పూర్వపు విధా నాల కంటే నిస్సందేహంగా ఎంతో ప్రగతి సాధించింది. అయితే ఇందులోని లోపాలు కూడా స్పష్టమైనవే. ఇది, అసమగ్ర మనో విజ్ఞాన శాస్త్రం ఆధారంగా రూపొందినది. దీని దురదృష్ట ఫలితా లకు యూరపులో ఒక రకంగా రక్షణ కల్పింపబడినది. అక్కడ విద్యార్థి పరీక్షలో ఉత్తీర్ణత సాధించటానికి లేకపోతే, శిక్ష తప్పిం చుకోటానికి ఎంత వరకు అవసరమో అంత మేరకే తన అధ్య యనం పరిమితం చేసుకుంటాడు. ఎక్కువ సమయం, శరీర వ్యాయామ శిక్షణ కార్యక్రమాలలో పాల్గొని చురుకైన అలవాట్లు కలిగి ఉంటాడు. ఇండియాలో, విద్యావిధానం తాలూకు దుష్ప

భావాలు విద్యార్థి శారీరక మానసిక స్థాయిలలో ఎంతవరకు చూపిస్తున్నాయో అందరికీ తెలిసినదే. జాతీయ విద్యావిధానాని కిది మొదటి సమస్య – ఇది యూరోపియను విద్యావిధానమంత సర్వతోముఖంగాను ఉండాలి; మరింత సమగ్రంగా కూడా ఉండాలి. అందులో ఉండే లోపాలు – అలసట, బట్టీ పట్టించే పద్ధతి – తొలగింపబడాలి. ఇది ఎలా సాధ్యపడుతుందంటే – బోధనోపకరణము (బుద్ధి) ని పరిశీలించి, దానికి అనుగుణంగా విద్యావిధానం రూపొందించాలి. సహజంగా, అసంక్లిష్టంగా, సమ ర్థవంతంగా ఉండాలి. దీనికి ఉపకరణాన్ని (బుద్ధి) సునిసితము, శక్తివంతము కావించి ఆధునిక పద్ధతులకు అనుగుణంగా సమర్థ వంతంగా శిక్షణ నివ్వాలి. The muscles of the mind – మనో కండరాలకు – మంచిశిక్షణ నివ్వాలి. ఇందుకు సులువైన పద్ధతులు అవలంబించాలి. అప్పుడే తప్ప, అంతవరకు, మానసిక అద్భుతాలు సాధ్యపడవు.

3) 'దేనినీ బోధించలేము' అనేదే నిజమైన బోధనకు తొలి సూత్రం.

ఉపాధ్యాయుడు బోధకుడు కానే కాడు. పురమాయించే అధికారీ కాడు. కేవలం ఓ సహాయకుడు; ఓ మార్గదర్శి. సూచ నలు ఇవ్వడమే తప్ప బలవంతంగా రుద్దడం కాదు ఆయన పని. ఆయన నిజానికి శిష్యుని మనస్సుకి ఎటువంటి శిక్షణా ఇవ్వ లేడు. జ్ఞానోపకరణాలకు సానపెట్టి వాటి నుండి చక్కటి ప్రయో జనాలను పొందడం ఎలాగో సూచిస్తాడు. ఆ ప్రక్రియలో సహ కరిస్తాడు; ప్రోత్సహిస్తాడు. అంతేకాని శిష్యునికి ఏ జ్ఞానాన్నీ సమకూర్చడు. జ్ఞానాన్ని స్వయంగా సంతరించుకోవడం ఎలాగో చూపిస్తాడు. శిష్యునిలో నిబిడీకృతమైన ఉన్న జ్ఞానాన్ని బహి ర్గతం చేయడం కూడా ఆయన వల్లకాదు. లోలోపల జ్ఞానం ఎక్కడ ఉందో చూపించి, దానిని బయటకు పొంగులువారేలా చేసుకునే సాధనను తెలియజేస్తాడు.

ఈ ప్రత్యేక సూత్రం కేవలం కౌమారదశలో ఉన్నవారికి, యువకులకు మాత్రమే వర్తిస్తుందే తప్ప చిన్నపిల్లలకు వర్తించదు

అని ఎవ్వరైనా అనుకుంటారేమో. పసివారైనా సరే పెద్దవారైనా సరే! బాలుడు అయినా సరే, బాలిక అయినా సరే సూత్రం ఒకటే! ఎటొచ్చీ సహాయకార్యక్రమాలలో హెచ్చుతగ్గులుండవచ్చు అంతే.

ఇక రెండో సూత్రం –

మనోవికాసం అనేది మనోభీష్టం ప్రకారమే జరగాలి. తల్లి దండ్రుల కోరిక మేరకో, ఉపాధ్యాయుని ఇష్టప్రకారమో పిల్లల్ని బలవంతంగా రూపుదిద్దాలనే అభిప్రాయము అనాగరికం, అవివేకం, మూర్ఖత్వం.

ఎవరి సహజ లక్షణానికి తగ్గట్టు వారే స్వీయ అభివృద్ధిని నిర్ణయించుకోవాలి.

తమ పిల్లలు ఏ లక్షణాలను అలవరచుకోవాలో, ఏ రకంగా అభివృద్ధి చెందాలో, ఎటువంటి సామర్థ్యాన్ని సంతరించుకోవాలో, ఎటువంటి ఆలోచనలు కలిగి ఉండాలో, ఏ జీవనమార్గం అనుసరించాలో ముందే తాము నిర్ణయించడం కంటె ఘోరమైన తప్పిదం మరోటి ఉండదు.

తన సహజ లక్షణాన్ని బలవంతంగా అణచివేస్తే, స్వీయ ధర్మాన్ని వదులుకొనేలా చేస్తే, అది అతనికి శాశ్వతమైన కీడే అవుతుంది. అతని పరిపూర్ణతను సర్వనాశనం చేయడమే అవుతుంది. అటువంటప్పుడు అది మానవ ఆత్మ పట్ల స్వార్థ నియంతృత్వ దాడే కదా! ఫలితంగా మనిషే తన జాతికి సమర్ధవంతంగా ఇవ్వగలిగే దానిని ఇవ్వలేడు. కాబట్టి ఇది సమాజ ప్రయోజనానికి పెద్ద విఘాతమే!

మనస్సుపై జరిగే ఈ బలవంతపు దండయాత్ర సంపూర్ణత్వాన్ని, సహజత్వాన్ని నాశనం చేసి, అసంపూర్ణ, కృత్రిమమైన విషయాలను స్వీకరించేలా చేస్తుంది. నాసిరకం సామాన్య విషయాలను సైతం యాంత్రికంగా అంగీకరించేలా ఒత్తిడి చేస్తుంది.

ప్రతి వ్యక్తిలోను కొంత దైవాంశ ఉంటుంది. కొంత స్వీయ ప్రత్యేకతా ఉంటుంది. మనం ఉపయోగించుకున్నా, మానినా భగవంతుడు మాత్రం మనకు సామర్థ్యాన్ని, కౌశలాన్ని కొద్దో, గొప్పో ప్రసాదిస్తాడు.

భగవంతుడు ప్రసాదించిన ఆ సంపదను కనుగొని అభి వృద్ధి చేసుకుని, ప్రయోజనకరం చేసుకోవడమే మన విధి.

ఆత్మ తనకు తానే అభివృద్ధి చెందుతూ ఉదాత్త అభిరుచిని అలవరచుకుని అది ఉత్తమ కార్యానికి ఉపయోగపడేలా పరి పూర్ణతను సంతరించుకోవడానికి సహాయపడడమే విద్య ప్రధాన ఆశయం.

ఇప్పుడు మనకు అందుబాటులో ఉన్నాదానిని ఆధారంగా రేపటికి అవసరమైన దానిని రూపొందించుకోవటం – దగ్గర నుంచి దూరానికి from the near to the far – ఇది మూడవ సూత్రము.

ఆత్మకుగల గతమే మానవుని ప్రాతిపదిక అనవచ్చు. దానికి తోడు అతని వారసత్వం. మసలే పరిసరాలు, నివసిస్తున్న దేశం, ఆహారం అందించే భూమి, పీల్చే గాలి, చూసే దృశ్యాలు, వినే శబ్దాలు. అలవాటుపడిన ఆచారాలు – ఇవి కూడా ప్రాతిపది కలే! ఇంద్రియాలకు అతీతంగా వాటి ప్రభావం ఉంటుంది. కాబట్టి అవి మానవుణ్ణి శక్తివంతంగా మలుస్తాయి. నిజానికి వాటి ప్రభా వంతోనే మనం మనుగడ ప్రారంభిస్తాం.

మన నైజాన్ని భూమినుండి సమూలంగా వేరు చేయకూ డదు. ఎందుకంటే ఆ నైజం భూమి సంబంధంగానే పెరుగుతూ ఉంటుంది. జీవన ఆలోచనలు, దాని ప్రతీకలు మనస్సుని పెన వేసుకుని ఉంటాయి.

కాబట్టి బయటినుండి కూడా లోపలికి గ్రహించడం కొంత వరకు అవసరం ఉంటుంది. అయితే అలా బయటినుండి ఏదైనా విషయాన్ని గ్రహించడం అనేది హాయిగా స్వీకరించేలా ఉండాలే తప్ప మనస్సుపై ఒత్తిడితో కాదు.

నిజమైన వికాసానికి ఏ ఒత్తిడులు లేని స్వేచ్ఛతో సహజ మైన ప్రగతి తప్పనిసరి.

పరిసరాలపై సహజంగానే ఎదురు తిరిగే ఆత్మలు కొన్ని ఉంటాయి. అవి మరో కాలనికి, మరో ప్రాంతానికి సంబంధించి నవేమో అనిపిస్తాయి. అటువంటి వాటికి వాటి అభీష్టాన్ని అను

సరించే స్వతంత్రం ఇవ్వాలి. అలా కాకుండా వాటికి సంబంధం లేని విధంగా, కృత్రిమంగా మలిచినప్పుడు చాలా ఆత్మలు కృశించిపోతాయి. శూన్యం అవుతాయి. కృత్రిమంగా తయారవుతాయి. వారు ఆ రకంగా నిర్ణీతమైన జాతికి, కాలానికి, సమాజానికి చెంది ఉండాలనేదే భగవంతుని ఏర్పాటు, అటువంటివారు భూతకాలం ముద్దుబిడ్డలు, వర్తమానం భాగస్వాములు, భావి సృష్టికర్తలు!

గతించిన కాలం మనకు పునాది వంటిది. వర్తమానం సంపద. భవిష్యత్తు మన ధ్యేయమూ, గమ్యమూను.

*

ఎదురు చెప్పకుండా అంగీకరిస్తున్నాడు కదా అని పసివాడి మనస్సుపై తన ఆలోచనలను, అభీష్టాలను రుద్దాలని వివేకవంతుడైన ఏ గురువూ ఆశించడు.

అంతర్గతంగా దివ్యరక్షణలో వృద్ధిచెంది, కచ్చితంగా ఫలించే బీజాలను మనస్సుకు అందిస్తాడు గురువు. ఆదేశం ఇవ్వాలని కాకుండా, అవగాహన కలిగించాలనే ఆయన ఆశిస్తాడు.

సిద్ధాంతపరమైన ఓ సూత్రంగాను, చర్విత చర్వణం అయ్యే పద్ధతిలాగాను కాకుండా సహజమైన ప్రక్రియలో స్వేచ్ఛాపూరితమైన వికాసంతో శిష్యుని నైపుణ్యాలు, అనుభవాలు పెంపొందాలన్నదే ఆదర్శ గురువు అభిమతం. సహకరించే ఒక విధానాన్ని ఆయన సూచిస్తాడు. ప్రయోజనకరమైన పరికరాన్ని అందిస్తాడు.

అంతే కాదు. ఆ విధానాలు లక్ష్మణరేఖలుగా మారకుండా, యాంత్రికమైన ప్రక్రియలు కాకుండా గురువు జాగ్రత్తపడతాడు. ఆదర్శ గురువు చేయవలసిన పని అంతా – దివ్యతేజస్సును చైతన్యవంతం చేయడం, దివ్యశక్తి కార్యరూపం దాల్చేలా చూడ్డమూ – అంతే!

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు, కర్రా వెంకటేశ్వర్లు

II

విద్యావేత్తకి ఉపకరణం – బుద్ధి లేక అంతఃకరణం. ఇది నాలుగు పొరలుగా ఉంటుంది. గత మనోభావాలకి భాండాగారముగా ఉండేది చిత్తము లేక జ్ఞాపక భాండాగారము (storehouse of memory). ఇది మొదటి పొర. దీనిని క్రియాశీల స్మృతి (act of memory) గా పొరబడకూడదు. మిగలినవి మూడూ మనో ఉప రితలానికి పునాది. ఇవి దీనిపై ఆధారపడి ఉంటాయి. గత అను భవాలన్నీ కూడా. ఉదాసీన స్మృతిగా (as passive or potential memory) మన మనసులో భద్రంగా మిగిలే ఉంటాయి. క్రియా శీలమైన స్మృతి (active memory) అవసరమైనప్పుడు కావల్సిన దానిని ఆ స్టోరుహౌసు నుండి వెతికి పట్టుకుంటుంది. ఎలాగంటే – గుట్టలాపడి ఉన్న పోగులో నుంచి కావల్సిన వస్తువు కోసం వెతుకులాడినట్లుగా. ఈ వెతుకులాటలో అనవసరమైనవి (గత స్మృతులు) కూడా తారసిల్లుతూ ఉంటాయి. అనవసరమైన దానిని అవసరమైనదిగా పొరబడడం కూడా తటస్థిస్తుంది. ఉదాసీన స్మృతి లేక చిత్తమునకు ప్రత్యేక శిక్షణ అవసరము ఉండదు. ఇది automatic స్వయంచాలకమైనది. దీనిని తప్పించుకుని, ఏ అనుభవస్మృతి శకలమూ కూడా, పైకి పోలేదు. ఆశ్చర్యకరమైన ఈ జ్ఞాపకభాండాగారంలో ప్రతి గతస్మృతి కూడా భద్రంగా పదిల పర్చబడే ఉంటుంది. క్రియాశీల స్మృతి అంత వృద్ధి చెందనిది. అందుచేత దీనిని మెరుగుపర్చవలసిన ఆవశ్యకత ఉన్నది.

2) ఇక రెండవ పొర – మనస్సు – the mind proper భారతీయ మనోవిజ్ఞానశాస్త్రము ప్రకారము ఇది ఆరవ ఇంద్రియము (the sixth sense). మనసు ఇంద్రియ జ్ఞానాలను స్వీకరించి సమీకృతం చేస్తుంది. చూపు, శబ్దము, వాసన, రుచి, స్పర్శలుగా విషయాలను గ్రహిస్తుంది. మనసు నేరుగా కూడా విషయాలను రూపకల్పన చేసుకోగలదు. ఇవే మనోభావ కల్పనలు. ఇంద్రియ సంవేదనలు, అనుభూతులు – వీటిని ఆలోచనలుగా పొరబడకూ

డదు. ఇవి ఆలోచనలకు ముడిసరుకు మాత్రమే. ఇక్కడ ముఖ్యంగా గమనించవల్సిన విషయం ఒకటి ఏమంటే – ఆలోచనలకు ఆధారభూతమైన మౌలిక ఇంద్రియజ్ఞానం లోపరహితంగాను, సక్రమమైనదిగాను ఉండాలి. జుగుప్సాకర విషయమైన ఆలోచనలకు అవకాశం ఇవ్వకూడదు. ఇక్కడే ఉపాధ్యాయుడు పిల్లల ఇంద్రియ జ్ఞానవికాసానికి శ్రద్ధ తీసుకోవల్సినది. పిల్లవాని ఇంద్రియజ్ఞానం సహజంగా సునిసితంగాను, సున్నితంగాను, ఉంటుంది. ఇది లోపభూయిష్టం కాకుండా ఉపాధ్యాయుడు జాగ్రత్త వహించాలి. కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియ సమన్వయంతో వ్యవహరించాలి. అంతఃకరణ జ్ఞాన వ్యక్తీకరణ సౌలభ్యం, భావవ్యక్తీకరణ నైపుణ్యం పిల్లలకి కలిగించాలి.

3) మూడవ పొర (intellect) ఆలోచన విధానానికి ఉపయుక్తమయే ఉపకరణము – బుద్ధి (శారీరక) యంత్రభాగాల నుండి అందుకున్న (ఇంద్రియ) జ్ఞానసంవేదనలను ఇది నిర్దేశిస్తుంది. నేను పేర్కొన్న మూడింటిలో, బోధకునికి బోధనలో అత్యంత ప్రధానమైన ఉపకరణము ఇదే. బుద్ధి, వేర్వేరు ప్రయోజనాలకి, రీతులకు కేంద్రస్థానం. బుద్ధియొక్క ప్రయోజన ధర్మాలను రెండింటిగా విభజించవచ్చు. the functions and faculties of the right hand and the functions and faculties of left hand – కుడిచేతివైపు ప్రజ్ఞాధర్మాలు, ఎడమచేతివైపు ప్రజ్ఞాధర్మాలుగా – వర్గీకరించవచ్చు. కుడిచేతివైపు మనోశక్తులు (faculties) విస్తృతార్థ బోధకములు, కల్పనాచాతుర్యములు సంయోజనకరములు. ఎడమచేతివైపు మనోశక్తులు – విమర్శనాత్మకములు, విశ్లేషణాత్మకములు. వివేచన, భావుకత, జ్ఞాపకశక్తి బుద్ధికి కుడివైపు ధర్మాలు. ఎడమవైపువి – తులనాత్మకత (comparsion) తర్కము. వర్గీకరణ, పోలిక, సాధరణీకరణము (generalisation), సూచన, నిశ్చయాత్మకత – ఇవి తార్కిక శక్తులు. ఇవన్నీ హేతువాదశక్తికి అంగాలు. కుడిచేతివైపు మనోశక్తులు గ్రహిస్తాయి. శాసిస్తాయి. తమకు తాముగా నిర్ణయాలు తీసుకుంటాయి. బోధపర్చుకుంటాయి. పట్టుసాధించి నేర్పుగా కార్యాచరణలో పెడతాయి. కుడిచేతివైపు బుద్ధి

(the master of knowledge) జ్ఞానాధిపతి. దీనికి బంతు ఎడమ వైపుది. ఎడమవైపుది జ్ఞానసంచయాన్ని స్పృసిస్తుంది. అంతే. కుడివైపుది లోలోపలకి చొచ్చుకునిపోతుంది. తాను గ్రహించిన మేరకే సత్యమునకు లోబడి ఎడమవైపు faculty ఉంటుంది. కుడి వైపుది తనకు అందని దానిని కూడా పట్టుపట్టి పట్టుకుంటుంది. మానవుని తార్కికశక్తియుక్తులకు రెండూ అవసరమే. ఈ రెండింటి మనోధర్మాల కార్యాచరణ శక్తులను పిల్లలకి అందించాలి. అవి ఉన్నతము, మేలైనవిగా ఉండాలి. ఈ రెండు faculties – ప్రజ్ఞలు – పిల్లవానికి లేకుంటే అతని విద్య అసంపూర్ణము, ఏకపార్శ్వము (one-sided) గానే మిగిలిపోతుంది.

4) ఇక, బుద్ధియొక్క ప్రజ్ఞావిశేషమైన నాల్గవపొర మానవునిలో సమగ్రంగా వికసించనిది. ఇది క్రమేపీ పరిపూర్ణ పరిణామ క్రమంలో విస్తృతమై వికసించవలసి ఉన్నది. విజ్ఞానమునకు పరాకాష్ఠ ఇది. దీని శక్తులు విలక్షణంగా ఉంటాయి. దీనిని మనము అసాధారణ ప్రతిభ (genius) గా గుర్తిస్తాము. సర్వోత్కృష్ట బుద్ధి కుశలత కలిగి, అంతఃస్ఫూర్తితో సత్యదర్శన సౌలభ్యంతో అలరారుతుంది. దివ్యావేశ స్ఫూర్తితో కూడినవచో వైభవంతో ప్రకాశిస్తుంది. దివ్యజ్ఞానోదయంతో మనిషిని ప్రవక్తగా మార్చే దివ్య లక్షణ సంపన్నమైనది. ఇవన్నీ అసాధారణశక్తులు. అప్పుడప్పుడు అపరిపూర్ణంగా మెరుపులులా అనుభావ్యమౌతవి. ఇవి ఇప్పటికీ ఇంకా మానవుని తార్కిక బుద్ధికి అందని అపనమ్మకాలుగానే ఉన్నాయి. వీటి పరిపూర్ణ సాధనని, వికృతపరిచే ఆటంకాలు ఉన్నాయి. అవి – పొరపాట్లు, చపలచిత్తము, పక్షపాతవైఖరితో కూడిన భావావేశము. అయితే ఒకటి మాత్రము స్పష్టం. అసాధారణ ప్రతిభ (genius) లేకుండా మానవాళి ఇంతవరకు సాధించిన ప్రగతి సాధించి ఉండి ఉండేదే కాదు. ఈ అంశం గురించి విద్యావేత్తలు తమ దృష్టి సారించినట్లు కనపడదు. అసాధారణ ప్రతిభ విద్యార్థిలో ఉంటే దానినెలా క్రమబద్ధీకరించాలి అనేది ఉపాధ్యాయునికి ఇంకా చిక్కు సమస్యగానే మిగిలి ఉంది. సాధారణ బోధకుడు దీనిని నిరుత్సాహపరుస్తాడు, ఎదగనీయడు.

ఉదారమైన ఉపాధ్యాయుడు దీనిని స్వాగతీకరిస్తాడు. మానవాళికి ఉపయుక్తమైన అసాధారణ ప్రతిభను ఎన్నడూ విస్మరించకూడదు. అది తెలివితక్కువతనమే. నిరుత్సాహపర్చడం ఘోరమైన నేరం. అసమగ్రంగా ఉన్న ప్రతిభని వికసింపచేయాలి. పొరపాట్లు, క్రమరాహిత్యం, పక్షపాతవైఖరి – వీటిని జాగరూకతతో తెలివిగా వైదొలగించాలి. కాని ఇది ఉపాధ్యాయునికి అసాధ్యమైనదే. కలుపు మొక్కతోపాటు, పంటనిచ్చే సశ్యాన్నికూడా తొలగిస్తాడు ఉపాధ్యాయుడు కలుగ చేసుకుంటే – ఏ విద్యావిషయిక ఆచరణ కార్యక్రమం (operations) లోనైనా వికసించే ఆత్మని నిర్విఘ్నంగా వికసింపచేసి ఫలప్రదం కావించటం ఉపాధ్యాయుని కర్తవ్యం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

నైతిక స్వభావము

III

మనిషి సమతౌల్యానికి మానసికస్వభావము నైతికస్వభావముతో సమన్వయం కావాలి. కేవలము మానసికమునకే పరిమితమై, నైతికసూత్రాలను విస్మరించి హృదయ ఆవేశాలను క్రమబద్ధీకరించలేని విద్యావిధానము మానవాళి పురోగతికి హానికరము. ఇక్కడ వచ్చిన చిక్కు ఏమంటే – మానసికాభివృద్ధి శిక్షణకి తగిన పాఠ్య ప్రణాళిక రూపొందించటం సులువైనట్లు, నేటి ఆధునిక పరిస్థితులలో పాఠశాల, కాలేజీ విద్యాప్రణాళికలతో సమన్వయపర్చగలిగే నైతిక విద్యాప్రణాళికను రూపొందించటం సాధ్యపడడం లేదు. నైతిక, మతపరమైన పాఠ్యాంశాలు అధ్యయనం చేయించి మానసికంగా పిల్లలను నీతిపరులుగాను, మతాభిమానులుగాను తయారు చేయటం అనేది ఒక భ్రమ, వ్యర్థప్రయాస అవుతుంది. సరిగ్గా చెప్పాలంటే మనసు, హృదయం అవదు కదా! మనోవికాసానికి ఉపయోగపడే పాఠ్యప్రణాళిక హృదయవికాసానికి ఎలా సరిప

డుతుంది! అంటే ఇది పూర్తిగా నిష్ప్రయోజనమని చెప్పటం కాదు. ఈ పద్ధతిలో కూడా అంతఃకరణలో నైతిక సంబంధమైన ఆలోచనా బీజాలు వెదజల్లబడుతవి. ఆలోచనలు అలవాట్లుగా మారుతే ఇవి నడవడికను ప్రభావితం చేస్తాయి. పోతే నైతిక భోధనాంశాల వల్ల ఉన్నత ఆలోచనా విధానాలు యాంత్రికము, కృతకముగా మారే ప్రమాదము ఉంది. అలాగ అయినది కార్యసాధనకు అంతగా పనికిరాక వ్యర్థము అవుతుంది.

2) మనిషి నైతికస్వభావానికి సంబంధించి అత్యంత ప్రధానమైన అంశాలు మూడు ఉన్నాయి. అవి, భావోద్వేగములు, సంస్కారములు (అలవాట్లు, సాంగత్యాలకు సంబంధితమైనవి) మరియు స్వభావము (nature). నైతికమైన క్రమశిక్షణ కలిగి ఉండటము అంటే ఆవేశకావేషాలను అదుపులో ఉంచుకోగల్గటం, ఉన్నత సాంగత్యాలు, అత్యుత్తమ మానసిక శారీరక అలవాట్లు; వాటి ప్రేరణలతో స్వభావాన్ని, నడవడికను క్రమబద్ధం చేసుకోగల్గటం. పిల్లలపై కొంత క్రమశిక్షణ విధించవచ్చు; ఒకే మూసలో వాళ్లని తీర్చిదిద్దవచ్చు. అభిలషనీయమైన మార్గంలో వాళ్లని బలవంతంగా నడిపించనూ వచ్చు. కాని వాళ్లు హృదయపూర్వకంగా ఆమోదించి, ఆచరించనపుడు అది వంచనగా, పిరికితనంతో పాటించేదిగా ఔతుంది. అందరితోపాటే తాను కూడా, లోకాచారం పాటిస్తున్నాననే అనాసక్తధోరణి చోటు చేసుకుంటుంది. యూరపులో సరిగ్గా జరిగేది ఇదే. స్కూల్లో లేక ఇంటిలో క్రమశిక్షణ, ఒత్తిడి వైదొలగగానే పైలాపచ్చీసు, విచ్చలవిడి ధోరణికి దారితీస్తుంది. యూరోపియన్ సంఘజీవనంలోని ప్రధాన లక్షణం ఇదే. మనిషి తాను హర్షించి, ఆమోదించి స్వీకరించినది మాత్రమే హృదయపూర్వకంగా ఆచరిస్తాడు. మిగిలినదంతా ఒక నటనే (a mask). సాంఘిక నియమాలు, కుటుంబ కట్టుబాట్లు, పాఠశాల రూల్సు ఇలాగనే పాటిస్తాడు. తన స్వవిషయాలకు, అంతరంగమునకు సంబంధించి, తన ఇష్టాయిష్టాలకు అనుగుణంగా, ఇష్టారాజ్యంగా బ్రతుకుతాడు. నైతిక, మతపరమైన బోధన పూర్తిగా విస్మరించడం తగదు. ఇది జాతి నిర్వీర్యమవటానికి దారితీస్తుంది.

స్వదేశీ ఉద్యమం వచ్చి యువతలో నైతికపతనానికి కొంత అడ్డు కట్ట వేసింది. కాని ఇక్కడ మనం ఇంగ్లీషు విధానాన్ని గర్హించాలి. ఇది పూర్తిగా మానసిక శిక్షణకి మాత్రమే నిర్దిష్టమైనది. కేంద్ర హిందూ కళాశాలలో భారతీయ, పై మెరుగులతో అనుసరించే ఇంగ్లీషు విద్యావిధానం యూరోపియను ఫలితాల నివ్వక మరే ఫలితాల నిస్తుంది! పోనీలే, అసలేమీ లేనిదానికంటే, నయం కదా, ఇది, అని సరిపెట్టుకోక తప్పదు.

3) మనోవికాసానికి ఎలాటి శిక్షణ ఇస్తామో, హృదయ వికాసానికీ అలానే శిక్షణ ఇవ్వాలి. పిల్లవాని సక్రమ మార్గంలో ప్రవేశపెట్టి వదిలివేయాలి. తనకు తానుగా ఉన్నతి సాధించేలా ప్రోత్సహించాలి. ఉపాధ్యాయుడు ప్రత్యక్షంగా కల్పించుకోకుండా పరోక్షంగా పరిశీలిస్తూ, సూచనలిస్తూ, సహకరిస్తూ ప్రోత్సహించాలి. ఇంగ్లీషు బోర్డింగు స్కూలు విధానంలో అనుసరించే ఉత్తమ పద్ధతి ఇది. అక్కడ మాస్టరు నైతిక మార్గదర్శకుడు, ఆదర్శప్రాయుడుగా ఉంటాడు. పిల్లలు పరస్పరం సహకరించుకునేలా, ఒకర్ని చూసి ఒకరు ప్రభావితులయేలా చూస్తూ వాళ్లని స్వేచ్ఛగా వదిలేస్తాడు. కాకపోతే అనుసరించే విధానం మొరటుగా ఉంటుంది. విపరీతమైన బాహ్యాక్రమశిక్షణతో వికృతంగా ఉంటుంది. భయమే తప్ప పిల్లలకి భక్తి ఉండదు. ఈ పద్ధతిని వారు ఆంతర్యంలో ఏ మాత్రమూ సహించరు. దీనివల్ల మేలు కంటే కీడే ఎక్కువ. మన ప్రాచీన భారతీయ గురుకుల విద్యావిధానం చాలా శ్రేష్ఠమైనది. నైతిక విద్యావిషయకంగా కూడా. అక్కడ గురువు తన వ్యక్తిగత విజ్ఞానసంపత్తి, పవిత్రతలతో ఆదర్శంగా ఉండి పిల్లలకు మార్గదర్శిగా వారి మన్నలనందుకొనేవాడు. ఇపుడు ఆ ప్రాచీన సంప్రదాయాన్ని పునరుద్ధరించటం అసంభవం. ఒకటి మాత్రం సంభవం కావచ్చు. వివేకవంతుడైన మార్గదర్శకుని, సహాయకుని ప్రత్యామ్నాయంగా నియమించవచ్చు. మరి అలా కాకపోతే, యూరోపియను పద్ధతిలోలా, కిరాయి బోధకుడు (hired instructor) లేక ఉదారమైన పోలీసువాడు (the benovolent policeman) స్కూలు మాస్టరుకి ప్రత్యామ్నాయంగా ఉంటాడు.

4) నైతికశిక్షణ సానుకూలధోరణిలో సూచ్యప్రాయంగా పిల్లలకి అందివ్వాలి. అంతేకాని బలవంతంగా ఆదేశరూపంగా కాదు. ఆదర్శవ్యక్తిత్వము, నిత్యసద్గోష్ఠి, గ్రంథపఠనము – ఉత్తమ మార్గదర్శక సూత్రాలు. యువ విద్యార్థి అధ్యయనానికి నీతిపాఠాలతో కూడిన పుస్తకాలుకాక, మహోన్నత గతవైభవాన్ని ఆవిష్కరించే ఆసక్తికర ఆదర్శములతో కూడిన విషయాలు అందించేవిగా ఉండాలి. మహాత్ముల మహనీయ భావాలు, ఉదాత్త భావోద్వేగస్ఫోరకమైన సాహిత్యభాగాలు మరింత పెద్దపిల్లలకి పఠనీయాంశాలుగా ఎంపిక చేయాలి. ఉన్నత ఆదర్శాలు, ఆకాంక్షలు ప్రేరేపించే చారిత్రకాంశాలు, జీవితచరిత్రలు ఎంపికచేయాలి. ఈ రకమైన సత్సంగముతోవారు ప్రభావితులు కావాలి. ఆడంబరంగా చేసే నీతిబోధలు పనిచేయవు. తాను బోధించే ఉత్తమ ఆదర్శ సూత్రాలకు సజీవమైన, సాకారమైన, ఆదర్శ ఉపాధ్యాయుడు పిల్లల ముందు నిలిచి ఉన్నపుడు – అంతకంటే ఉత్తమమైన నీతిబోధ మరొకటి ఉండదు. ఆదర్శాలను ఆచరించే అవకాశం పిల్లలకీ కలుగచేయాలి. జ్ఞానపిపాస, ఆత్మవిశ్వాసంతో కూడిన శ్రద్ధ, స్వచ్ఛత, స్వార్థత్యాగము – ఇవి బ్రాహ్మణ లక్షణాలు. శౌర్య విక్రమాలు, ఉదాత్తత, ఔన్నత్యము, వీరోచిత లక్షణాస్వభావము, దేశభక్తి – క్షత్రియ లక్షణాలు. ఉపకారబుద్ధి, నైపుణ్యము, శ్రద్ధ, పూనిక, ఔదార్యము – వైశ్యలక్షణాలు. నిస్వార్థము, అనురాగపూరిత సేవాభావము – శూద్ర లక్షణాలు. వెరసి ఇవి ఆర్యుని సద్గుణాలు. దేశవ్యాప్తంగా మన యువతలో మనం అభిలషించే స్వాభావిక లక్షణాలుగా ఇవి వెల్లివిరిసేటట్లు చూడాలి. ఆర్యసంస్కార సంప్రదాయాలకు అనుగుణంగా యువతకి శిక్షణ ఇవ్వాలి. చిన్నతనం నుంచి ఆచరణయోగ్యంగా ఈ సద్గుణాలని పిల్లలలో పాదుగొల్పాలి. అప్పుడే ఉన్నతులుగా వాళ్లు తీర్చిదిద్దబడతారు.

5) అందుకు, ప్రతి పిల్లవానికి తనలో నిక్షిప్తంగా ఉన్న సద్గుణ సంపత్తిని ఆచరణలో ప్రస్ఫుటింపచేయగలిగే అవకాశము కల్పించి, తగిన మానసిక ప్రోత్సాహము ఇవ్వాలి. పిల్లవానిలో శారీరక మానసిక దుర్లక్షణాలు, చెడు అలవాట్లు ఉండవచ్చు.

అందుకని అతనిని ఒక అపరాధిగా నిలబెట్టి, మనసు నొప్పించేలా దురుసుగా వ్యవహరించకూడదు. నిరాకరణ, ప్రత్యామ్నాయము – రాజయోగ సాధనలు – ద్వారా పరిహరింప చేసుకునేటట్లు ప్రోత్సహించాలి. ఇవి పాపాలు, అపరాధాలు అని కాక, నివారణకు వీలైన రోగలక్షణాలు అని చెప్పాలి. అసత్యాన్ని నిరాకరించి సత్యమునే స్వాగతీకరించటం, భయాన్ని ధైర్యంగా, స్వార్థాన్ని నిస్వార్థ త్యాగబుద్ధిగా, ద్వేషాన్ని అనురాగంగా పరివర్తనం చేసుకోవచ్చును అని ఇందుకు కావల్సినది క్రమబద్ధమైన నిర్విరామ కృషి అని నచ్చచెప్పాలి. సద్గుణాలు కార్యరూపం దాల్చేవరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే ఇవన్నీ వట్టి బూటకాలు అని కొట్టిపారేసే ప్రమాదం ఉంది. యువతలో మితి మీరిన శక్తులు, విశృంఖలంగా ఆవేశవూరితంగా పొంగులెత్తుతూ ఉంటాయి. వీటిని క్రమబద్ధీకరించాలి. పరిశుద్ధపర్చాలి. అంతేకాని నీళ్లు చల్లి నిరుత్సాహపర్చకూడదు.

6) నేనింతవరకు నైతికాంశాలు ప్రస్తావించాను. మతబోధన గురించి ఒక మాట చెప్పాలి: సాధారణంగా ఒక వింతభావన వాడుకలో ఉంది. మతసిద్ధాంతాల బోధనవల్ల పిల్లలు నీతివంతులు, భక్తులుగా తయారు కాబడతారు అని. ఈ పొరపాటు ఆలోచన యూరపులో వాడుకలో ఉన్నది. ఈ రకమైన మతబోధనవల్ల అంతరంగ జీవితం ప్రభావితం కాదు; మతం యాంత్రికంగా పాటించే బాహ్యాడంబరంగా తయారౌతుంది. లేదా – మతఛాంధసానికి, కర్మిష్ఠిగా తయారవటానికి, కృత్రిమ ఉత్సాహం ప్రకటించే వంచకుడుగా మారటానికి దోహదపడుతుంది. మతం జీవన విధానం కావాలి. సిద్ధాంతాలు వల్లించటం కాదు. జాతీయ విద్యావిధానము అని పేరు పెట్టుకొని పిలుచుకునే బెంగాలు విద్యావిధానంలో మతబోధన నిర్బంధం చేశారు. ఇందులో మళ్లీ మత ఆచారాలు, ఆచరణలు, అనుష్ఠానాలు నిషేధిస్తూ ఒక రాజీవిధానం ప్రతిపాదించారు. తెలివితక్కువ గందరగోళానికిది ఒక మచ్చుతునక. మతాతీత లౌకిక విధానం అని ప్రజల దృష్టిని మళ్లింప చేయటానికి చేసినది ఇదంతా. ఆచరణలో పెట్టని ఈ రకమైన

మతబోధనకు ఎలాటి విలువ ఉండదు. సాధన, ఆధ్యాత్మికశిక్షణ, అభ్యాసము మతజీవితాన్ని పటిష్ఠం చేసే ప్రక్రియలు. అర్చన, భక్తి ప్రకటన, మతాచారాలు పాటించటం – వీటిని ప్రజలు అపేక్షిస్తారు. ఇవి మ్రొక్కుబడిగా కాక, చిత్తశుద్ధితో అనుష్ఠించినపుడు ఇవి ఆధ్యాత్మిక పురోగతికి ఆవశ్యకమౌతవి. మతాచరణ – ధ్యానం, భక్తి, సాధన – ఏదో ఒక రూపంలో ఉండాలి. లేకుంటే మతబోధన నిరుపయోగమే ఔతుంది. ఇంతకంటె అసలు మత బోధన లేకుండటమే మేలు.

7) మతబోధన ప్రస్ఫుటంగా ఏదో ఒక రూపంలో జరిగినా జరుగకపోయినా మత అంతస్సత్వం (the essence of religion) – ఈ జీవనము దైవము కొరకు, మానవత, దేశము, తన చుట్టూ ఉన్నవారి కొరకు, తద్వారా తన కొరకు – అన్నదే ఆదర్శం కావాలి. 'జాతీయ' అని పేరు పెట్టుకొన్న ప్రతి విద్యాలయంలోను ఈ ఆదర్శం ప్రస్ఫుటం కావాలి. ఈ హిందూత్వ జీవలక్షణం (the spirit of Hinduism) ప్రతి విద్యాలయంలోను పరివ్యాప్తం కావాలి. భారతీయ అంశాలు – హిందూమతగ్రంథాలు, నమ్మకాలు, బోధనలు – వీటి కంటే కూడా – మన పాఠశాలలో ఇదే జాతీయతాసారం నిర్దేశిత సూత్రమై – మిగిలిన వాటన్నిటికంటే కూడా – వెలుగొందాలి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

ఏకకాలంలో సమీకృత బోధన

IV

భారతదేశమందు అమలులో నున్న నూతన శిక్షణావిధానం, విష యాలను ముక్కలు ముక్కలు చేసి బోధించుటగా వుంటున్నది. ఇది హాస్యాస్పదంగా దిగజార్చేటంతగా అమలు కాబడుతోంది. అనగా ఒక్కొక్క విషయము (subject) ఇతర విషయాలతో చేర్చి కొద్దిగా కొద్దిగా బోధింపబడుచున్నది. ఈ విధానంవల్ల విద్యార్థి అసమగ్ర శిక్షితుడై – ఏ విషయము నందును సంపూర్ణజ్ఞానవం తుడు కాలేకపోతున్నాడు. అన్ని విషయాలను అసంపూర్ణంగా అభ్యసించి బైట ప్రపంచంలో అడుగిడుచున్నాడు. ద్వంద్వ ప్రవృత్తి, ప్రణీతమైన జాతీయ విద్యాసలహా మండలి ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలలో విషయాలను ముక్కలు ముక్కలు చేసి బోధించే విధానాన్ని అమలుపరుస్తూ, ఉన్నతస్థాయిలో హఠాత్తుగా బృహత్తర ప్రత్యేక నిపుణతాత్మక విషయాలను ప్రవేశపెట్టుటకు ప్రయత్నిస్తున్నది. ఇదెట్లున్నదంటే త్రిభుజాన్ని శీర్షం మీద నిల బెట్టి అది అలాగే నిలబడి ఉంటుందని ఆశించడం లాంటిది.

సనాతన విద్యావిధానంలో ఒకటి రెండు విషయాలను క్షుణ్ణంగా బోధించి ఆ తర్వాత మిగిలిన విషయాలపై దృష్టిని సారించేవారు. అది నవీనపద్ధతికన్న కచ్చితంగా వివేకవంతమైన పద్ధతి, ఈ విధానం వైవిధ్యమైన సమాచారాన్ని ఇవ్వలేదు. కాని ఇంతకన్న లోతైన, గంభీరమైన, నిజమైన సంస్కృతిని విద్యార్థుల్లో రూపొందించగలిగింది ఆధునిక సాధారణ విద్యార్థి మనస్సు, లోతులేని, బహువిషయాల మీద ప్రసరించే తేలికతనంతో చంచ లమైనదిగ వుంటున్నది. ఇందుకు కారణం ముక్కలు ముక్కలు చేసి విషయబోధన గావించే దుష్టబోధనా పద్ధతియే యగును. పూర్వవిద్యావిధానం లోని లోపం యేదైనా చెప్పాలంటే విద్యార్థి చిన్నతనంలో నేర్చిన విషయాన్ని ఉన్నత విద్య నభ్యసించే నాటికి మరచిపోయే అవకాశం వుంటుందనుటయే. కాని ప్రాచీ నులు జ్ఞాపకశక్తి కొరకై యిచ్చిన అద్భుతశిక్షణ యీ లోపాన్ని

తొలగించగలిగింది. భవిష్యత్ విద్యావిధాన రూపకల్పనలో మనం పురాతన పద్ధతికికాని లేదా నవీన పద్ధతికికాని కట్టుబడకుండా నిపుణాత్మక విజ్ఞాన సముపార్జనకు సమగ్రమైన, వేగవంతమైన పద్ధతిని ఎన్నుకొనవలసి వుంటుంది.

నవీన పద్ధతికి అనుకూలంగా చెప్పబడిన విషయమేమంటే పూర్వపద్ధతిలో ఒకే విషయాన్ని దీర్ఘకాలం బోధిస్తే విద్యార్థులు శ్రమ కోర్వలేక సులభంగా అలసిపోతారన్నది. తరచు విషయాలు మార్చి బోధించుటవల్ల వారి మనస్సుకు విశ్రాంతి కలుగుతుంది. నవీన విద్యార్థులు, పూర్వ విద్యార్థులకన్న వేరైనవారా అన్న ప్రశ్న వుదయిస్తుంది. అలాంటప్పుడు సుదీర్ఘ, ఏకాగ్రతకు తావిచ్చే పద్ధతిని నిరుత్సాహపరచి మనమే వాళ్లనలా తయారు చెయ్య లేదా? అతి చిన్నవయస్సున్న బిడ్డ ఎలాంటి పాఠశాలలో బోధనకైనా అనర్హుడే. ఏడు లేదా ఎనిమిది సంవత్సరాల వయసున్న వారే ఎలాంటి అధ్యయన ప్రారంభానికైనా తగినవారు. అలాంటివాడే ఆసక్తి వున్నచో చక్కని ఏకాగ్రతకు సమర్థుడవుతాడు. ఏకాగ్రతకు ఆసక్తియే మూలాధారం. మనం ప్రాథమికంగా అతని పాఠాలను ఆసక్తికరంగా లేని విధంగాను, విసుగు పుట్టించు విధంగాను చేసి, వాటిని తనపై బలవంతంగా రుద్దుతూ – పైగా అతని అశ్రద్ధను గూర్చి ఫిర్యాదు చేస్తుంటాం. ఇప్పటి అస్వాభావిక పద్ధతి స్థానంలో, విద్యార్థి తనకుతానుగా స్వభావానుగుణమైన, విధానాన్ని ప్రవేశపెడితే అది అతని అశ్రద్ధను, అశక్తతను తొలగిస్తుంది. పెద్దవారి వలెనే బాలురు కూడ ఒక విషయంపై ఆసక్తి కలిగి వుంటే ఆ విషయాన్ని మధ్యలో వదలకుండా చివరి వరకు నేర్చుకొన నిష్టపడతారు. అతడు తానెన్నుకొన్న విషయంపై ఆధిపత్యం వహించి, నిపుణత సాధించేవరకు కృషిచేస్తాడు. బాల్యంలో అతనికి అభిరుచి కలిగి, అవగాహన చేసికొనగలిగిన విషయాన్నే నెమ్మది నెమ్మదిగా బోధన సాగిస్తూపోవాలి.

ఉపాధ్యాయుడు తన దృష్టిని తొలుత భాషపై, విద్యార్థి మానసిక స్థాయిపై కేంద్రీకరించాలి. ఇవి సమగ్రం కాని మునుపే, బోధనా విషయాలను పెంచుతూపోతే, అది కాలాన్ని, శక్తిని

వృథాపరచినట్లవుతుంది. మనో పరికరాలు ఒక బాషను సులభం గాను, శీఘ్రంగాను నేర్చుకొనుటకు అవసరమైనంతగా అభివృద్ధి చెందిన సమయాన్నే, పలు భాషలను ప్రవేశపెట్టుట భావ్యమగునే కాని, విద్యార్థి తనకు నేర్పినదానిని కొంతవరకు కొంతమాత్రమే గ్రహించి, శ్రమతో అసమగ్రంగా దానిపై ఆధిపత్యం వహించనపుడు కాదు. ఇంకను చెప్పాలంటే విద్యార్థి తన మాతృభాషపై సంపూర్ణ ఆధిపత్యం వహించినపుడే, మరొక భాషను నేర్చుకొనగలిగిన సామర్థ్యాన్ని సంతరించుకో గలుగుతాడు. అతడు తన మాతృ భాషను సంతృప్తిగా నేర్చుకొనకపోయినపుడు ఇతర భాషలను సమగ్రంగా నేర్వడం అసాధ్యం. పరిశీలన, నిర్ణయం, హేతువు, తారతమ్య విచారణలకు చెందిన ప్రజ్ఞలు చాలా స్వల్పంగా మాత్రమే పెరిగినప్పుడు విజ్ఞానశాస్త్రాన్ని అధ్యయనం చేయటం అంటే దండుగే... శ్రమ కూడాను. ఇతర విషయాలలో కూడా ఇంతే.

మాతృభాష విద్యాబోధనకు సముచితమైన మాధ్యమం. కనుక విద్యార్థి తన ప్రాథమిక శక్తులు అన్నింటిని మాతృభాష సమగ్రగ్రహణ పట్ల కేంద్రీకరించవలెను. ఇంచుమించుగా ప్రతి విద్యార్థికి, కల్పనాశక్తి, నూతన పదాల కొరకైన సహజ ప్రేరణ, నాటకీయ ప్రజ్ఞ, అపారమైన భావాల ఊహా కల్పన సౌలభ్యం ఉంటాయి. వీరికి సాహిత్య, దేశచరిత్రలో ఆసక్తి కలిగించాలి. వివేకరహితమైన, మొద్దుబారిన వర్ణక్రమానికి, పుస్తకాలు చదవ టానికి బదులు, విద్యార్థి అభివృద్ధి దశలకి అనుగుణంగా, సాహి త్యాన్ని గూర్చి, తనయొక్క, తన చుట్టు తన వెనకనున్న జీవి తాన్ని గూర్చి అతనికి ఆకర్షణీయంగా, ఆసక్తికరంగా పరిచయం కలిగించే విధంగా ఆతనికి అందివ్వాలి. ఈ దశలో యితర అధ్య యనమంతా, అతని మనోకౌశలాలను, నైతికశీలాన్ని, పరిపూర్ణం చేయుట కోసం వినియోగించాలి. ఈ సమయంలోనే చరిత్ర, విజ్ఞానశాస్త్రము, కళలు మొదలైనవాటి అధ్యయనానికి పునాది వేయవలెను. కాని వీనిని విద్యార్థిపై బలవంతంగా రుద్దకూడదు. ప్రతి బాలుడు ఆసక్తికరమైన కథను యిష్టపడతాడు. వీరులను

పూజిస్తాడు. దేశభక్తి కలిగి ఉంటాడు. అతనికి తెలియకుండానే తన జాతీయ చరిత్ర ద్వారా యీ గుణాలను పెంపొందించుకొను నట్లు చూడవలెను. ప్రతి బాలుడు ఒక పరమార్శకుడుగా, ఒక పరిశోధకుడుగా, విశ్లేషకుడుగా, ఒక దేశనిర్మాణ పరిశీలకుడుగా వుంటాడు. ఈ స్వభావాన్ని ఆధారంగా చేసికొని అతనికి తెలి యకుండానే విజ్ఞానశాస్త్ర మౌలికజ్ఞానాన్ని అతడు పొందునట్లు చూడాలి. ప్రతి బాలుడు అన్నీ తెలిసికోవాలనే తనివితీరని ఆసక్తి కలిగి వుంటూ భౌతిక విషయవిచారణకు పూనుకొంటాడు. ఈ గుణాన్ని ఉపయోగించుకొని ప్రపంచాన్ని గూర్చి, అతన్ని గూర్చి తెలిసికొనుటకు, నెమ్మదిగ అతన్ని ఆ వైపు మరల్చాలి. ప్రతి బాలుడు స్వీయ ఆలోచన అనే విలువైన గుణాన్ని కలిగి వుంటాడు. అతనిలో క్రియాత్మక ఊహాశక్తి దాగి ఉంటుంది. ఈ సుగుణాన్ని ఉపయోగించి లలిత కళాత్మకశక్తికి తగిన ఆధారాన్ని అతని కందించవలెను.

ప్రకృతి మనకు ప్రసాదించిన ప్రజ్ఞలవల్ల లాభం పొందటా నికి, ప్రకృతి మన ద్వారా పని చేయనివ్వాలి. మానవజాతి బాలల కొసగుచున్న విద్యావిధానం, ప్రకృతి ప్రక్రియలకు విఘాతం కలి గించేలా ఉంది. ఇటీవల హర్షణీయంగా పరిణత భావాలు ప్రాబల్యం వహించటం ప్రారంభం అయింది. ఆచరణకు, మార్గము, యింకనూ సుగమం కాలేదు. గత బోధనానుభవాలు, పద్ధతులు, వాటి పక్ష పాత ధోరణులు, వాటి లోపాలు అన్నింటితో గతం మెడకు గుదిబండ అయింది. అవి మనలను అంత సులభంగా వదిలేట్లు లేవు. విద్యార్థుల ఉజ్జ్వల భవిష్యత్తు కోసం మనం స్పష్టమైన జ్ఞానవిధా నాన్ని నిర్భయంగా అమలుపరచాలి. విషయాలను ముక్కలు ముక్క లుగా బోధించే విధానాన్ని, వ్యర్థపదార్థాలు పారేసే చెత్తగదిలోకి పారెయ్యాలి. బాలునికి జీవితంలోను, పనిలోను, జ్ఞానంలోను ఆస క్తిని కలిగించుట, అతని జ్ఞానేంద్రియములను సమగ్రంగా అభి వృద్ధిపరచుట, అతడు తన మాతృభాషపై ఆధిపత్యం వహించగ లుగునట్లు చేయుట – ఇవి మనం తొలుత చేయవలసిన కార్యం. ఆ తర్వాత అతడు శీఘ్రంగా విషయాలను నేర్చుకొన గలుగుతాడు.

ఇది అతని క్రమ అధ్యయనంలో ఆలస్యాన్ని తొలగించగలుగుతుంది. దీని వలన ఇప్పుడు కొన్ని విషయాలను దోషభూయిష్టంగా నేర్చుకొనే అతడు – మున్ముందు ఎన్నో విషయాలను సమగ్రంగాను, బాగుగను, నేర్చుకొన గలుగుతాడు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: బి. నరసింహయ్య

ఇంద్రియ శిక్షణ

V

ఆరు జ్ఞానేంద్రియాలు కన్ను, ముక్కు, చెవి, జిహ్వ, చర్మం, మనసుతో కలిసి – విషయజ్ఞాన సముపార్జన సమకూరుస్తాయి. ఆఖరుదైన మనసుకాక, మిగతా పంచేంద్రియాలూ బాహ్యేంద్రియ ఉపకరణాలుగా, కంటికి అగుపించేవి. భావనా సామగ్రి వివరాల ద్వారా, బాహ్యేంద్రియాలు విషయపరిజ్ఞాన సేకరణలో, ఇంద్రియ శక్తులను ఉపాధ్యాయుడు పరిపుష్టం కావించాలి. ఇంద్రియాలకు రెండు విషయాలు ఆవశ్యకమౌతవి – అవి నిర్దిష్టత, సునిసితత్వం. ఈ రెండూ లోపిస్తే ఇంద్రియావయవాలు, అసమగ్రంగా పని చేస్తాయి. వీటికి వున్న ఆటంకాలు ముందు కనుగొనాలి.

నిర్దిష్టత మీద నిశితగ్రహణశక్తి మీద ఆధారపడ్డ ఇంద్రియాలు అంతరాయం లేని నాడీమండల వ్యవస్థ మీద ఆధారపడి వుంటాయి. గ్రహణశీలత కలిగి తటస్థంగా వున్న మనసుకి అవి వాహికలు వంటివని చెప్పాలి. పైన చెప్పిన అవయవాలు వాటి ధర్మాలు అవి సక్రమంగా నిరంతరం నెరవేరుస్తూనే వుంటాయి. ఉదా: కన్నుని తీసుకుందాం. కన్ను సరియైన దృశ్యాన్ని నేత్ర పటలం (Retina) మీద నిరంతరం ప్రసారం చేస్తూనే వుంటుంది. అక్కడ విషయగ్రహణపారీణతలో లోపం, ఏదైనా వుంటే అది మరే

ధైనా యితర కారణంవల్ల జరిగిందై వుంటుంది. కాని కన్ను చేస్తూన్న పని లోపంవల్ల కాదు.

బహుశా ఈ లోపం నాడీప్రసరణంలో పొరపాటువల్ల అయి వుండవచ్చు. నాడులు వాహికలు మాత్రమే. అవయవానికి సందేశాన్ని లేక సంకేతాన్ని మార్చే శక్తి వాటికి లేదు. ఒకప్పుడు నాడీ ప్రవాహంలో అవరోధం కల్గవచ్చు. ఈ అవరోధంవల్ల మనసుకు అందించబడిన సమాచారం తాలూకు సమగ్రత, నిర్దిష్టతలకు లోపం కలుగువచ్చు. అంగవైకల్యం ఉంటే, అది వేరే విషయం ఇది విద్యావేత్త పరిధి లోనికి రాదు. వైద్యుడు చూడవల్సినది.

ఆటంకం సమాచారాన్ని బుద్ధికి చేరవేయగల్గినంతటిదిగా లేకపోయినప్పుడు ఫలితం – ఇంద్రియ పరిజ్ఞానం అసమగ్రంగా ఉంటుంది. దృష్టి, వినికిడి, వాసన, స్పర్శ, రుచి మానసిక మాంద్యం మొద్దుబారిపోవటంలాంటి లోపాలు నివారించగలిగేవే – అవయం లోపరహితం కానప్పుడు గాయపడకపోయినపుడు, అవరోధం వైదొలగబడగలదు. పైన చెప్పిన నాడీవ్యవస్థ శుద్ధిపర్చుట ద్వారా ఇంద్రియజ్ఞానాన్ని క్రమబద్ధీకరించవచ్చు. ఈ చికిత్స చాల సులభమే – ప్రాణాయమం ద్వారా. ఈ ప్రక్రియ యూరప్ దేశాలలో ఎక్కువగా ప్రాచుర్యంలోకి వస్తూంది. ఈ పని కనక సక్రమంగా జరిగితే నాడీవాహికలు సమర్థవంతంగా పనిచేస్తాయి: మరింత మెరుగ్గా పనిచేస్తాయి. దీన్నే యోగశిక్షణ లేక నాడీశుద్ధి అని అంటారు.

నాడీవాహికలో కలుగుతున్న యీ నిరోధం సాధారణంగా పూర్తిగా విఫలం కాదు. కాకపోతే వికృతం చేస్తుంది. దీనివల్ల భయాందోళనలు కలుగుతూ ఉంటాయి. ఆ సమయంలో ఇంద్రియ జ్ఞానం చలిస్తుంది. భయానికి లోనైన గుబ్బం గడ్డిమోపు చూచి ప్రమాదకరమైన జంతువు అనుకోవటం, రోడ్డు మీద త్రాడును చూచి పాముగా భ్రమపడి మనిషి భయపడటం, ఇలాంటి వికృతాలే. ఇవన్నీ నరాల ఉద్రిక్తలని బట్టి జరుగుతాయి. వాటికి చికిత్స నాడీశుద్ధి ద్వారా, నరాలను సుస్థిరంగా, తొందరపాటు లేకుండా ఉంచుకోవటమే. నాడీశుద్ధి వ్యవస్థని కుదుటపరుస్తుంది.

సావధానమైన ప్రశాంతత నిస్తుంది. మనసు పరిశుద్ధమై అంతర్వ ర్తనలు నిలకడగా సాగుతవి.

నాడీవాహికలు నిశ్చలము, నిరాటంకముగా ఉన్నా కూడా, విషయసేకరణ పొరపాట్లు, అలజడి సంభవిస్తే, అది బుద్ధిపరంగా కలుగవచ్చు. ఆరవ ఇంద్రియం మనసు కూడా నాడులలాగే బుద్ధికి సమాచారవాహికయే. ఇది brain force – బుద్ధిబలంతో జరుగు తుంది. బుద్ధిపరమైన అలజడి అంతర్గతంగానూ బాహ్యాంగానూ కలుగవచ్చు. బాహ్యా సమాచారము, ముందు ఈ కొసనుంచి జ్ఞానేంద్రియముచేత సేకరింపబడుతుంది. పిమ్మట ఆ కొస నున్న ఉదాసీన స్మృతికి లేక, చిత్తమునకు నాడీవ్యవస్థ ద్వారా యథా తథంగా చేరుకుంటుంది. పంచేంద్రియ, జ్ఞాన సమాచర ప్రతిరూ పాలన్నీ (images) అక్కడ (మనసు) నిక్షిప్తం కాబడి, మనసుచేత బుద్ధికి అందింపబడుతవి. మనసు వాహికగానూ, జ్ఞానేంద్రియం గానూ కూడా – రెండు పనులు నిర్వర్తిస్తుంది. అవయవముగా (జ్ఞానేంద్రియ) మిగతావాటిలాగే ఇదీ నిర్దిష్టంగానే ఉంటుంది. కాని వాహికగా దీనికి అలజడి, ఆందోళనవల్ల ఆటంకం కలుగుతుంది. అపుడది వికృతమౌతుంది. అస్థిరమూ ఔతుంది.

జ్ఞానేంద్రియావయవంగా మనసు ఆలోచనానుభూతులను, బాహ్యాంతరాల నుంచి నేరుగా గ్రహిస్తుంది. ఈ అనుభూతులు వాటి కవి పరిపూర్ణ వాస్తవములు. కాని బుద్ధికి వాటి సమాచారం సక్ర మంగా చేరకపోవచ్చు. అసమగ్రంగా చేరవచ్చు. అసలు చేరకనే పోవచ్చు. అలజడి అభిప్రాయాలని ప్రభావితం చేస్తుంది. బుద్ధికి సంబంధించినంతవరకు దీని ప్రభావం శక్తివంతంగా ఉంటుంది. ఇక్కడే పొరపాటుకు ఎక్కువ అవకాశం ఉంటుంది. బుద్ధి పంచేం ద్రియ జ్ఞానాలతోపాటు, ఆలోచనకి సంబంధించిన అనుభూతులను కూడా నేరుగా స్వీకరిస్తుంది. మనోఇంద్రియమునకు సంబంధిం చిన పరిపూర్ణ జ్ఞానకౌశలమును యోగపరమైన క్రమశిక్షణలో (in yogic discipline) సూక్ష్మదృష్టి (subtle reception of images) అంటారు. భావప్రేషణము (Telepathy) వ్యక్తిత్వ అవగాహన (character reading) దివ్యదృష్టి, దివ్యవాణి వినికిడి, జరుగబోయే

వాటిని ముందే పసికట్టడం, ఎదుటి మనసును ముందే తెలుసుకో గల్గటం (thought reading) – అధునికంగా కనిపెట్టిన ఈ అంశాలు పురాతన మానసికశక్తులే! ఇవన్నీ మనసుకు సంబంధించినవే. అసమగ్ర అభివృద్ధితో ఇవి ఆగిపోయినవి. ఆరవ ఇంద్రియమైన మనసుయొక్క అభివృద్ధికి శిక్షణ, ప్రత్యేకంగా లేకున్నది. భవిష్యకాలంలో నిస్సంశయంగా దీనికి స్థానం కల్పింపబడుతుంది. ఈలోగా బుద్ధి ఉపకరణము, మనసుకు, ఇంద్రియజ్ఞానాన్ని, సమగ్రంగా అందించే శిక్షణ ఇవ్వటం సమంజసమే కదా!

నరాలు బలహీనత అనే ఆటంకాన్ని నాడీశుద్ధి క్రియ ద్వారా నిర్మూలించవచ్చు. రెండవ సమస్య భావోద్రేకాలకి సంబంధించినది. ఇవి అభిప్రాయాల్ని వక్రీకరిస్తాయి. ఈ కోవలోకి వచ్చేవే ప్రేమ, ద్వేషము నైతిక అలవాట్లు, భావావేశాలు, క్రమశిక్షణలో ఉంచుకోగల్గటం వల్ల ఈ ఇబ్బందిని తొలగించుకోవచ్చు. నైతిక నియమాలు క్రమశిక్షణలో ఒక భాగము. ప్రస్తుతము ఆ విషయాన్ని ప్రక్కకి పెడదాం – పోతే మూడవ యిబ్బంది – మనసులో ముందు నుంచీ వాసనా విలసితంగా వున్న భావాల, సంస్కారాల ప్రభావాలు. వీటియొక్క జోక్యం. అవి మార్పుల్ని సహించవు. కొత్త భావాలు పక్షపాత ధోరణిని చీల్చుకుని లోన ప్రవేశించలేవు. ఇదొక జడత్వం. పరిణిత మనస్కులైనవారు మాత్రమే సద్యో భావాల్ని యదాతథంగా స్వాగతీకరించ గలుగుతారు. ఒక సంఘటన జరుగుతూన్నప్పుడు, చూచేవాడిగి సరియైన అభిప్రాయం కల్గినా, దాన్ని మనసులో ఉన్న పాతభావాల కలయికతో, అలవాట్లకి వ్యతిరేకంగా వుండడం చేత దానిని తిరస్కరించటమో, గుప్తంగా ఉంచటమో, లేక కలగాపులగం చేయుటమో జరుగుతుంది. ఫలితంగా బుద్ధి తప్పుదారి పడుతుంది. దీని గురించి యింకా విపులంగా చెప్పాలంటే మానసిక శాస్త్రాన్ని లోతుగా తరచి చూడాలి. ప్రస్తుతానికి దాన్ని అలా వుంచేద్దాం. చిత్తశుద్ధి లేకుండా ఈ అవరోధాల నుంచి బయటపడటం అసాధ్యం. యోగానికిది ప్రాధమిక ప్రక్రియ. మన పూర్వీకులు దీనిని వేర్వేరు సాధ

నాలతో సాధించారు. కాని నేటి విద్యావిధానానికి ఇది అసంబద్ధంగా కనిపించవచ్చు.

ఈ సందర్భంలో గమనించవలసిన విషయం ఒకటుంది. మన ప్రాచీన భారతీయ నిబద్ధమైన సూత్రాల వైపునకు మనం దృష్టి సారించకుండా ఉన్నంత కాలము ఇప్పుడున్న ఈ అస్థిరత కొనసాగవలసినదే. నిజమైన జాతీయ విద్యావిధానము యూరోపియన్ భావాలచే నిబద్ధమై ఉండటమేమిటి! అందునా అతి ముఖ్యమైన అంశములలో.

దీనికి అతిసూక్ష్మము, ప్రముఖము మన వ్యవస్థకి సులువుగా అన్వయించగలిగే పద్ధతి ఒక ప్రక్రియ ఉన్నది. అది ఎలా అంటే – మన ఇచ్ఛతో సంబంధం లేకుండా, అడ్డు, ఆపు లేకుండా ఉదాసీన స్మృతి (passive memory) నుంచి అవిశ్రాంతంగా ఉప్పెనలా బయల్వెడలే ఆలోచనల పట్ల తటస్థమైన వైఖరి వహించటం. ఈ ఉదాసీనత పాత సంపర్కాలవల్ల కల్గిన సంస్కారాల నుంచి విముక్తి కల్గిస్తాయి. అవసరమైన వాటినే స్మృతి భాండాగారం నుంచి యెన్నుకునే స్వేచ్ఛ కలుగచేస్తాయి. అప్పుడు బుద్ధి సంస్కార రూపంలో మనసుని ఆదేశిస్తుంది – ఇక్కడ విషయాలని నిర్ణయించడం, ఎంపిక చేయడం, క్రమబద్ధం చేయడం మొదలైనవి జరుగుతాయి. ఈ క్రమాన్ని మొత్తంగా బుద్ధి తాలూకు 'కార్యాలయం' అని చెప్పవచ్చు. – అయితే, ఆ కార్యాలయం ఎంత సమర్ధవంతంగా వున్నా, చిత్తశుద్ధి లేకపోతే అవన్నీ భ్రష్టాచార (corruption) రూపంలో కలుషితమై నానా రకములైన తప్పుడు తీర్మానాలకీ దారితీస్తాయి. అందుచేత చిత్తశుద్ధి, బుద్ధి నిబద్ధతకి, పరిపూర్ణ కార్యనిర్వహణకు అత్యావశ్యకము.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ రాజేశ్వరి

అభ్యాసము ద్వారా ఇంద్రియ పటుత్వము

VI

జ్ఞానసముపార్జనలో ఇంద్రియాలు సమర్థవంతంగా తోడ్పడకపోవు టకు, మరొక కారణం, వాటి అసమగ్ర వినియోగము. మనం దేని నైనా అవసరమైనంతగా, తగినంత శ్రద్ధ, దీక్షలతో పరిశీలించము. ఇంద్రియ చలితచాలనాలు అయిన దృష్టి, శబ్దము, వాసన, స్పర్శ, రుచి మనలో ప్రవేశానికి వ్యర్థప్రయత్నాలు చేస్తాయి – గ్రహణో పకరణాలు తామసిక జడత్వంలో ఉండి బుద్ధి సావధానంగా లేకపోయినప్పుడు. అందువలన బుద్ధి సక్రమ కార్యాచరణ కొరకు అందించే శిక్షణ ఇక్కడ అప్రస్తుతం కాదు. మనస్తత్వశాస్త్రపరంగా దీని ఉచితానుచాలు అలా ఉంచి, దీని విలువ గుర్తించటం అవ సరమూ, అనుకూలము కూడా. తన చుట్టూ వున్న శబ్దగ్రహణ పారీణతలో విద్యార్థి చురుకుగా అలవాటుపడాలి. వాటి వైవిధ్యా లను తెలుసుకోగలగాలి. వాటి స్వభావాలను, లక్షణాలను, మూలా లను పసిగట్ట గలగాలి. జ్ఞాపకాలు గుర్తుకొచ్చిన వెంటనే సక్ర మంగా ప్రతిస్పందించగలిగేలా వాటి స్మృతులను చిత్తములో భద్ర పరచుకోగలగాలి.

ఇంద్రియ జ్ఞానాన్ని, జ్ఞాపకశక్తిని వుపయోగించుటలో సరి యైన శ్రద్ధ చూపకపోతే మనుష్యుల్లో శ్రద్ధాపూర్వక వస్తు పరిశీ లనా లక్షణం పరిపూర్ణంగా వృద్ధిచెందదని నిశిత పరిశోధనల ద్వారా నిర్ధారించబడింది. రెండు గంటల క్రితం చూసిన వాటిని జ్ఞాపకముంచుకొని తిరిగి వాటి గురించి చెప్పే పనిని ఓ పదిమం దికి అప్పగించినట్లయితే, ఒకరు చెప్పేది, మరొకరు చెప్పేదానికి తప్పక భిన్నంగా వుంటుంది. అంతే గాదు. అసలు జరిగిన సంఘ టనలకే భిన్నంగా కూడా వుంటుంది. ఇలాంటి లోపాలు లేకుండా చేసినట్లయితే, తప్పులు దొర్లకుండా జాగ్రత్తపడటంలో పురోగతి సాధించనట్లే, ఇంద్రియాలకు వాటి పనిని సక్రమంగా నిర్వర్తించ గలిగే తర్ఫీదు నిచ్చుట ద్వారా దీనిని సాధించవచ్చు. బుద్ధి ఈ పనిని ఇంద్రియాల నుండి వాంఛిస్తున్నదనే విషయం ఇంద్రియాలు

గ్రహిస్తే, అవి వాటి కర్తవ్యాన్ని నెరవేరుస్తాయి. అంతే కాదు, వివిధ విషయాలను వాటి వాటి స్థానాల్లో ఒక క్రమపద్ధతిలో నుంచుటకు తగిన శ్రద్ధ కూడా కనపరుస్తాయి.

జ్ఞానాంశములలో శ్రద్ధ ఒకటి. దీని ప్రాముఖ్యత తెలిసినదే. సరైన జ్ఞాపకశక్తికి, దేనినైనా ఖచ్చితంగా నిర్ధారించుటకు శ్రద్ధ ప్రథమ నియమము. విద్యార్థి క్రమశిక్షణా కార్యక్రమంలో అతను చేసే పనిపై శ్రద్ధ కనపరచుట ప్రధానాంశము. అంతేకాక, నేను సూచించినట్లుగ, శ్రద్ధ చూపవలసిన వస్తువును ఆసక్తికరమైనదిగా చేయగలిగితే యిది మరింత సులభతరమౌతుంది. ఆ విధంగా ఒకే ఒక వస్తువుపై శ్రద్ధ కనపరచుట ఏకాగ్రత అనబడుతుంది. ఏమైనాగాని ఓ నిజాన్ని మాత్రం అప్పుడప్పుడు ఉపేక్షిస్తుంటాము. అదేమంటే, వేరు వేరు విషయాలపై ఏకకాలంలో ఏకాగ్రత వహించుట తరచుగా అనివార్యమౌతుంది. ఏకాగ్రతను గూర్చి ప్రస్తావించినపుడు మనసును ఒకే కాలంలో ఒకే దానిపై కేంద్రీకరించుట అన్న భావనే కలుగుతుంది. కాని రెండు మూడింటిపైనో లేక అనేక విషయాలపైనో ఏకకాలంలో మనసును కేంద్రీకరించగల శక్తిని పెంపొందించుట అసాధ్యమేమీ కాదు. ఒక్కొక్కప్పుడు ఇది ఆవశ్యకమౌతుంది. ఏకకాలంలో వేర్వేరు సంఘటనల మేళవింపు లేక వివిధ పరిస్థితుల సమీకరణ కావచ్చు, అనగా, ఒక్క క్షణంలో లేక అతికొద్ది సమయంలో తటస్థించే దృశ్యమో, శబ్ధమో, స్పర్శయో లేక వేర్వేరు దృశ్యాల, శబ్దాల, స్పర్శల సమ్మేళనమో కావచ్చు. మనస్సుయొక్క లక్ష్యము ఒకేదానిపై ఉండి మిగిలిన వాటిపై నిర్లక్ష్యము చేయటం లేదా పూర్తిగా విస్మరించటం జరుగుతుంది. లేదా అన్నింటి పైన ఒకేమారు శ్రద్ధ వహించుట అవశ్యమైనట్లైతే, దృష్టి పలు దిశలుగా చెదిరి, ఏ ఒక్కదానిపైన లగ్నము కాదు. అయినప్పటికి, ఈ పరిస్థితిని సరిదిద్దవచ్చు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి గట్టిగా జ్ఞాపకముంచుకునే విధంగా వివిధ స్థితగతులపై శ్రద్ధాశక్తులను సరిసమానంగా కనపరచవచ్చు. ఇది కేవలం అభ్యాసానికి సంబంధించిన విషయం లేదా నిలకడతో సాధించవలసిన సహజ ప్రక్రియ.

వివిధ రకాల వస్తువులను ఖచ్చితంగా గమనించే ప్రక్రియలో కన్నులకు చేయి కూడ తోడ్పడుట ఎంతో వాంఛనీయం. దీని ఉపయోగము, ఆవశ్యకత సుస్పష్టమే. ఇది అంత చర్చనీయాంశము కాదు. ఇంద్రియగ్రాహ్య వస్తువును చేతితో అనుకరించే అలవాటు, ఆ వస్తువును మనస్సు గమనించుటలోను, గమనించిన దానిని యథాతథంగా నమోదు చేసుకొనుటలోను, జరిగే పొరపాట్లను, అస్పష్టతలను పసిగట్టుటకు సహాయపడుతుంది. హస్తానుకరణము గ్రహణపారీణతను బలపరుస్తుంది. చిత్రలేఖనము యొక్క ప్రధాన ప్రయోజనాలలో యిది ఒకటి. ఇంద్రియ శిక్షణలో భాగంగా చిత్ర లేఖనమును పాఠ్యాంశముగా చేర్చాలని చెప్పటానికి ఈ కారణము ఒక్కటి చాలు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

మనోనైపుణ్యాలు – శిక్షణ

VII

బుద్ధికి సంబంధించిన నైపుణ్యాలలో పరిశీలనా జ్ఞానం ఒకటి. ముందు బుద్ధికి ఉన్న గ్రహణశక్తులను బలోపేతం చెయ్యాలి. మన సాధారణ పరిశీలనలో కొన్ని వస్తువులను గమనిస్తాము; కొన్నిటిని విస్మరిస్తాము. గమనించటంలో కూడా అంత శ్రద్ధగా పరిశీలించము. యదాలాపంగా చూచిన వస్తువు యొక్క గ్రహణ శక్తి కూడా అంతంత మాత్రంగానే ఉంటుంది. ఏకాగ్రతతో గమనించినపుడు వేరుగా ఉంటుంది. అపుడు వస్తువు ఉన్న స్థానం గాని రూపురేఖా విలాసాలు, పరిసరాలకు అతీతంగా దానియొక్క ప్రత్యేకత – ఇవి స్పష్టంగా మనసులో చక్షు, స్రోత్ర, ఘ్రాణ – ఈ మూడు ముఖ్యజ్ఞానేంద్రియాల జ్ఞానం స్పష్టంగా మనసులో స్థిర పడుతుంది ఏకాగ్రతతో కూడిన పరిశీలన వల్ల. స్పర్శ, జిహ్వేంద్రియ

జ్ఞానాలు కలిపితే మొత్తం వస్తువుయొక్క పంచేంద్రియజ్ఞానం స్పష్టం ఔతుంది. వస్తువుయొక్క స్వభావధర్మాలు అవగాహన లోనికి వస్తాయి. కవి, చిత్రకారుడు, యోగి – వీరికి ఆరో ఇంద్రియజ్ఞానం (sixth sense) ఉంటుంది. దీని వల్ల బాహ్యాపరిశీలనాత్మక దృష్టిలో వస్తువుయొక్క బాహ్యాస్వరూప స్వభావ సత్యాలను తెలుసుకుంటాడు. ఇవి బాహ్యాపరిశీలనకు సంబంధించిన అంశాలు. వీటికి ఆధారం శ్రద్ధతో కూడిన ఏకాగ్రత; నిర్దిష్టత (minuteness). ఈ లక్షణాలు అలవర్చుకున్నపుడు, ఒక వస్తువును, అలా casual గా యదాలాపంగా – చూచినా కూడా దాని గురించిన సమగ్ర సమాచారం అందుతుంది. ఉపాధ్యాయుడు, ముందు పిల్లలకి నేర్పవలసినది ఇదే – శ్రద్ధతో కూడిన ఏకాగ్రత.

2) ఉదాహరణకి ఒక పుష్పాన్ని తీసుకుందాం. పిల్లవానికి పుష్పాన్ని గురించిన పరిశీలనా జ్ఞానం కలిగించాలి. పై పై జ్ఞానం అంటే – సాధారణ రంగు, వాసన మాత్రమే కాక, పువ్వుయొక్క సమగ్రజ్ఞానం కలిగించాలి. అంటే – పువ్వుయొక్క నిర్దిష్టమైన ఛాయ (shade), దానియొక్క ప్రత్యేకదీప్తి పరిమళంలో స్పష్టమైన గాఢత, రూపంలో వంపుసొంపుల విన్యాసం, వివిధ భాగాల అమరికలో అందాలు – ఇవన్నీ. ఆ పిమ్మట పువ్వును విడివిడిగా వేరుచేసి దాని ప్రధాన సమగ్ర స్వరూపాన్ని అదే పరిపూర్ణ దృష్టితో, సూక్ష్మపరిశీలన చేయాలి. ఈ పని అంతా – ఎందుకొచ్చినదిరా దేముడా – అన్నట్లుగా కాక, ఆసక్తితో చేయాలి. అందుకు తగిన ప్రశ్నావళిని నేర్పుగా ముందు ఉపాధ్యాయుడు రూపొందించుకోవాలి. వస్తువు పట్ల ఆకర్షితుడై, దాని సమగ్ర సమాచారాన్ని అంతటినీ తనకు తెలియకుండానే తాను సేకరించే ప్రోత్సాహాన్ని కలిగించేదిగా ఉండాలి.

3) తర్వాత జ్ఞాపకశక్తి, వివేచనాశక్తి (memorya & judgement) ఈ మానసిక లక్షణాలపై దృష్టి కేంద్రీకరించాలి. వీటిని కూడా పిల్లవాడు తనకు తెలియకుండానే తనకు తాను అలవర్చుకునేటట్లు ప్రోత్సహించాలి. పాఠాన్ని పలుమార్లు వల్లె వేయించి కంఠస్థం చేయించే పద్ధతి యాంత్రికమైనది, మొరటైనది;

తెలివితక్కువది. వేరొక పుష్పాన్ని అతనికి ఇచ్చి అదే పరిశీలనా దృష్టితో, దాని సారూప్యతలు, భేదాలు గుర్తించేలా చేయాలి. ఇలా రోజూ చేయటంవల్ల సహజంగానే పిల్లవాని జ్ఞాపకశక్తి సుశిక్షితమై బలపడుతుంది. అంతేకాదు. సారూప్యత, తారతమ్యాలు పోల్చి చూసే మానసిక ఆధారకేంద్రం స్థిరపడుతుంది. సమానధర్మాలు, వైవిధ్యాలు పరిశీలన చేసే అలవాటు విద్యార్థికి కలుగుతుంది. ఈ ప్రజ్ఞను పరిపూర్ణంగా వికసితమయేలా ఉపాధ్యాయుడు అవసరమైన ప్రతి జాగ్రత్త తీసుకోవాలి. ఇదే సమయంలో వృక్షజాతికి సంబంధమైన వర్గీకరణ, నియమాలు, ధర్మాల సమగ్రజ్ఞానం, మనోభూమికలో స్ఫురణకి రావడం ప్రారంభమౌతుంది. వికసించే మేధకి, నైపుణ్యంగా, సశాస్త్రీయంగా ఆలోచించగలిగే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చాలి. ఆ రకంగానే శాస్త్రీయ విజ్ఞానం తాలుకు ప్రాథమిక సత్యాలు అవగాహన చేసుకోగలిగే మేధోసంపత్తి సమకూర్చబడాలి. పువ్వులు, ఆకులు, మొక్కలు, చెట్లు – వీటి సారూప్యత, వైవిధ్యాల పరిశీలనవల్ల, వృక్షశాస్త్ర విజ్ఞానానికి ఒక చక్కటి ప్రాతిపదిక సమకూడుతుంది. ముందే శాస్త్ర సాంకేతిక విషయాలతో వాళ్ల బుర్ర బలవంతంగా నింపడం కాక విషయపరిజ్ఞానాన్ని శ్రమ లేకుండా వారంతట వాళ్లే తెలుసుకోవటం ఆరోగ్యకరమైన బుద్ధికి సహజమైనది. ఇదే విధంగా నక్షత్రాలు పరిశీలనతో ఖగోళ శాస్త్ర పరిచయం, భూమి, శిలల పరిశీలనతో భూవిజ్ఞాన శాస్త్రం, జంతువులు, కీటకములు పరిశీలనతో, జంతుశాస్త్రం, కీటకశాస్త్రం – వీటికి ప్రాతిపదికలు వారి బుద్ధికి అవలీలగా, శ్రమ లేకుండా అందించవచ్చు. కొంతకాలం తర్వాత రసాయన శాస్త్రం ప్రారంభించవచ్చు. పుస్తక విజ్ఞానభారంతో వాళ్ల బుద్ధిని ముందే నింపి వేయనక్కర లేదు. వివిధ రకాలైన పదార్థాలు, వస్తువులు – వీటి పరిశీలన, పరస్పరం పోలిక, వైవిధ్యం, – తద్వారా స్మృతి, నిర్ణయం – ఈ ప్రక్రియ ద్వారా ఏ శాస్త్రవిజ్ఞాన ప్రాథమిక జ్ఞానాన్ని అయినా సహజంగా ఆసక్తితో పిల్లలు తెలుసుకునేటట్లు చేయవచ్చు. ఒక్కసారి ఆసక్తి కలుగుతే పిల్లవాడు ఉత్సాహంతో పిపా

సతో ముందుకు ఉరకలు వేస్తాడు, అవకాశం కల్గినపుడు. ప్రతీ విషయం తరగతిగదిలోనే నేర్పాలనే నిర్బంధం వైదొలగుతుంది.

4) మిగిలిన మానసిక ప్రజ్ఞలతో పాటు, వివేచనాశక్తి (judgement) యుక్తాయుక్త పరిజ్ఞానం పెరుగుతుంది. అడుగడుగునా పిల్లవాడు మంచిచెడులు నిర్ణయించుకోవలసిన పరిస్థితి కలుగుతూనే ఉంటుంది. (విషయ లేక వస్తువు గురించిన) సమ్యక్ భావన, నిర్దిష్ట ప్రమాణము, రంగు, రుచి, వాసన, శబ్దము – వీటి మంచిచెడులు నిర్ణయించుకోవాలి. ఒక్కొక్కప్పుడు వివేచన (judgement) విచక్షణ (distinction) కి సంబంధిత అంశాలు సూక్ష్మంగాను, సుకుమారంగానూ ఉంటాయి. మొదట్లో చాలా పొరపాట్లు రావచ్చు. అలాగని, మనోధైర్యం సడలకూడదని నచ్చ చెప్పాలి. ఫలితాలపై అనుబంధం పెంచుకోకుండా మనోవిశ్వాసం దృఢ పర్చుకోవాలి. క్రమేపీ తన నిర్ణయం సక్రమము అని తెలుస్తుంది. పొరపాట్లు రావు. నిర్ణయాలు సక్రమంగానూ, నిర్దిష్టంగాను వస్తాయి. పిల్లవాని నిర్ణయం మిగిలిన పిల్లల నిర్ణయాలతో సరి పోల్చి చూడటం చాలా మేలైన విషయం. పిల్లవాని అంతిమ ఫలితం ఒకవేళ తప్పుగా వచ్చినా, ముందు తానెంతవరకు సక్రమంగా ప్రగతి సాధించాడు, ఎక్కడ, ఎందుకు తప్పు ఫలితం వచ్చిందనే విమర్శక దృక్పథం అలవర్చాలి. తర్వాత తనంతట తానే, సవిమర్శకంగా విషయాలను, పరామర్శించకలిగేలా ప్రోత్సహించాలి. తను చేసినది సక్రమమైనపుడు ఆ అంశాన్నే తనకి పలుమార్లు గుర్తుచేస్తూండాలి. ఈ ప్రోత్సాహంవల్ల పిల్లవాని ఆత్మ విశ్వాసం బలపడుతుంది.

5) (వస్తువులు, విషయాల) సారూప్యతలు, వైవిధ్యాలు నిర్ణయించేటప్పుడు (the centre of analogy) సాదృశ్య కేంద్రం అనేది ఒకటి మనసులో, తప్పనిసరిగా ఏర్పడుతుంది. విద్యార్థి సారూప్యత కలిగిన అంశాల సామాన్యధర్మాలను తప్పనిసరిగా సమాహారపరుస్తాడు. విచారణ కూడా చేస్తాడు. ఇక్కడా పొరపాట్లు, పరిమితులు ఉండకపోవు. అయినా ఈ ప్రజ్ఞ విద్యార్థిలో పెంపొందేలా ప్రోత్సహించాలి. To form the habit of analogy

– సరియైన సాదృశత్వము పెంపొందించుకునేటందుకు సుశిక్షితుడు కావాలి. ఇది అత్యంత ఆవశ్యకమైన ఉపకరణం – an indispensable aid in the acquisition of knowledge – విజ్ఞాన సముపార్జనకి.

6) తార్కిక బుద్ధి నైపుణ్యమే కాకుండా, భావుకత (imagination) బుద్ధికిగల ప్రముఖమైన, అత్యంత ఆవశ్యకమైన నైపుణ్యం. మనోదృశ్య రూపకల్పన, భావనాబలం, వస్తువులలో చైతన్యం, రమణీయత, సమ్మోహనం, ఔన్నత్యం, భావస్ఫోరకత్వము, ఆధ్యాత్మికత – వీటిని దర్శించి, ఆస్వాదించి, ఆనందించ గలగటం, భావుకత ప్రజ్ఞకి లక్షణాలు. ఇవి లోకమంతా పరివ్యాప్తమై ఉన్నవే. దీనిని గురించి వేరే సవివరంగా విచారణ చేయవలసిన ఆవశ్యకత ఉన్నది.

7) ముందుగా మానసిక శక్తులను విషయపరిజ్ఞాన సేకరణకు వినియోగించుకుంటాము. ఆ తర్వాత భావవ్యక్తీకరణ, అందుకు కావల్సిన భాషాభివృద్ధి వినియోగించాలి. భాషాభివృద్ధికి సంబంధించి మనం అంతంత మాత్రంగానే శ్రద్ధ వహిస్తున్నాం. వచో విన్యాసం, పదప్రయోగశక్తి, కొరవడితే భాషాదారిద్ర్యత ఏర్పడుతుంది. భావ వ్యక్తీకరణ కుంటువడుతుంది. మృదుత్వం ఉండదు. పదప్రయోగ ప్రక్రియలో మాట – దానియొక్క ధ్వని, రూప, భావ, – లక్షణాలు పరిగణనలోనికి తీసుకోవాలి. సమానార్థకమైన ఇతర మాటలతో పోల్చి సూక్ష్మతారతమ్యాలను తెలుసుకోవాలి. పొందిక, ఛందోగతి పరిశీలించాలి. వ్యాకరణయుక్తంగా ఉండాలి. సాహిత్యపరంగా, వాక్యవిన్యాస నైపుణ్యతకు ప్రాతిపదిక ఔతుంది. కేవలం వాక్యనిర్మాణ నియమాలు, సూత్రాలు వల్లె వేసినంత మాత్రాన భాషాకౌశల్యం రాదు. పిల్లవాని ఆసక్తి, జిజ్ఞాస ప్రాతిపదికలుగా తనలో భాషానైపుణ్యం, భావవ్యక్తీకరణ పెంపొందింపచేయాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

హేతువాద నిపుణతకి శిక్షణ

VIII

మన తార్కిక దృక్పథానికి ఏ అంశాలయితే తోడ్పడతాయో, వాటన్నిటినీ సరిగా మలచుకోవడంలోనే తార్కిక దృష్టి పెంపొందుతుంది. ఇంతే కాదు, ఇందుకు తగిన భావజాలాన్ని వ్యక్తీకరించగలిగే పదప్రయోగ కుశలత కావాలి. ఇది తార్కికతకి మొదటి మెట్టు. దీని తరవాత, సేకరించిన అనుమాన ప్రమాణాలను (premises) ఆధారం చేసుకుని ఆలోచించడం జరగాలి. ఏ ఆధారాలు లేకుండా తర్కం కొనసాగదు. దొరికిన ఋజువుల ఆధారంగా ఒక నిర్ధారణకి రావడము, పూర్వానుభవం ఆధారంగా ఏర్పరుచుకున్న నిర్ణయాలని మార్చుకోవడమూ తెలుసుకున్న ఒక వాస్తవం ఆధారంగా మరొక వాస్తవం ఆవిష్కరించటానికి ఆలోచన కొనసాగించడం – ఇవే తర్కంలోని మూడు పద్ధతులు. ఉదాహరణకి – రోజూ సూర్యుడు ఉదయించడం చూసి, ప్రతి రోజూ కొంత సమయం చీకటి తర్వాత సూర్యుడు ఉదయించడం, వెలుగు రావడం ప్రకృతి నియమనే నిర్ధారణకి వస్తాం. అలాగే, ఎక్కడ పొగ వుంటే, అక్కడ నిప్పు ఉంటుందని ఖచ్చితంగా అనుకుంటాం. అంటే, పరిశీలనాత్మకమైన సంఘటనల ఆధారంగా సాధారణ నిర్ణయాలకి వస్తాం. అటువంటప్పుడు ఎక్కడన్నా పొగ చూస్తే, దానికి ఆ పరిసరాల్లో ఇంకే ఇతర కారణాలూ లేకపోతే, ఎవరో మనిషే నిప్పు రగిల్చి ఉండాలనే నిర్ణయానికి వస్తాం. కానీ నిప్పు రాజుకోడానికి చాలా కారణాలుంటాయి. కేవలం మనుమలే కాక, అగ్నిపర్వతాలు, మెరుపులు, పరిసరాల్లోని బలమైన రాపిడి – ఏవైనా నిప్పు రాజుకోడానికి కారణాలు కావచ్చు. అందువల్ల అన్ని కారణాలు తెలుసుకోకుండా ఖచ్చితమైన నిర్ధారణకి రాలేము.

తర్కానికి మూడు ముఖ్యమైన అంశాలున్నాయి –

1) మనం ప్రాతిపదికగా తీసుకున్న వాస్తవాల లేక నిర్ణయాల నిర్దిష్టత.

2) ప్రాతిపదికగా తీసుకునే ఆధారవిషయాల (data) సమగ్రత, నిర్దిష్టత

3) లభించిన ఆధారాలనిబట్టి తీసుకోబోయే నిర్ధారణల్లోంచి అసంభవాలనీ, పొరపాట్లనీ తొలగించగలుగుట – నిజానికి ఈ నాడు మన తర్కవిధానం లోపభూయిష్టంగా వుండటానికి చాలా శాతం ఈ మూడు నియమాలు జాగ్రత్తగా పాటించకపోవడమే. ఏ విషయాలనయితే సత్యాలనుకుని తర్కం మొదలుపెడతామో, అవి అసంపూర్ణ సత్యాలో, లేక అసత్యాలో అవవచ్చు. ఇంకా అతి క్లిష్టమైనదేమిటంటే, ఇటువంటి విషయాల ఆధారంగా నిష్పక్షపాతంగా ఆలోచించడం, అసంభవాలనీ, అసత్యలనీ ఏరిపారేసి సరైన తార్కిక సమాధానానికి చేరుకోగలగడం! ఉదాహరణకి, భూమ్యాకర్షణశక్తి అన్నిటా వర్తిస్తుందని నిర్వివాద సత్యంగా అంగీకరిస్తే దీనికి విరుద్ధంగా వుండే ఏ చిన్న అంశం ఋజువైనా ఈ నిర్వచనం తప్పవుతుంది. జాగ్రత్తగా గమనిస్తే అటువంటి ఋజువు లుండకపోలేదు. గమనించాల్సిందల్లా – జాగ్రత్తగా, నిశితంగా పరిశీలించగలిగితే, తార్కిక ఆలోచనలలోంచి తప్పులనీ, పొరపాట్లనీ కనీసస్థాయికి తగ్గించడం సంభవమే.

తార్కికశక్తి పెంచుకోడానికి మనం సాధారణంగా అనుసరించే పద్ధతి కూడా తప్పే – తర్కశాస్త్రబోధనతో హేతువాద నైపుణ్యశిక్షణ ప్రారంభిస్తాం. అలవాటుగా మనం చేసే పొరపాటుకిది ఒక ఉదాహరణ. నేరుగా విషయాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకోవలసినదాన్ని, పుస్తక పరిజ్ఞానం ద్వారా విషయపరిజ్ఞాన సేకరణ – జీవితంలోని అనుభవాలను బట్టీ, గమనించి తెలుసుకున్న వాస్తవాలని బట్టీ తర్కజ్ఞానం/తార్కికత పెరగాలిగానీ, పుస్తకాల్లో చదివిన నియమాల మీద ఆధారపడి, నిర్వచనాలను స్థిరపర్చుకోకూడదు. Rule సహాయంతో example కాక, example సహాయంతో rule స్థిరపర్చుకోవాలి.

అందుకే తార్కికతకి పదును పెట్టాలంటే, ముందు నించీ కార్యకారణ సంబంధాల జాడ తెలుసుకొని, అనుమాన ప్రమాణాలు వెలికితీసే ప్రక్రియలో పిల్లవానికి ఆసక్తి కల్గించడం మొదట జరగాలి. ఇందులో ఎదురయే అనుకూల, ప్రతికూల సాఫల్యతలు గమనించాలి. జయాపజయాల హేతువులు తెలుసుకోవాలి. ముందు వాస్తవాలుగా తీసుకున్న అంశాలలో ఎన్ని అవాస్తవాలున్నాయో కనుక్కోవడం, అటువంటి అసంపూర్ణ/కాల్పనిక ఆధారాలని ప్రామాణికంగా తీసుకోడం వల్ల వచ్చే నిర్ణయాలలోని తొందర పాటుతనాన్ని పరిశీలించుకోవడం, ఏ అంశానికైనా ఆలోచించేందుకు వివిధ దృక్కోణాలుంటాయని తెలుసుకుని, కేవలం మన ఆలోచనే సరైనదనే మూర్ఖత్వంలోంచి బయటపడటం – క్రమ క్రమంగా ఈ లోపాలని తొలగించుకుంటే మానవ మేధస్సు సాధ్యమైనంత ఉన్నత తార్కికస్థితికి చేరుకోగలదు. జీవితంలోని అనుభవాల పాఠాల తరవాత, తార్కిక శాస్త్రపఠనం సునాయసమే. శాస్త్రాన్ని క్రమబద్ధీకరించే స్థాయికి వచ్చే సమయం వరకూ తర్క శాస్త్ర అధ్యయనం వాయిదా వేయవచ్చు.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: బి. వరలక్ష్మి

విద్యకి యదార్థ లక్ష్యము

ప్రతి మానవుడు స్వయం వికాసము చెందే జీవాత్మ. పిల్లలు స్వయంగా తమకుగా తాము నేర్చుకొనునట్లు చేయుట, తమ మేధాశక్తి, నైతిక స్తోమతను, కళానైపుణ్యాన్ని, కార్యదక్షతను పెంపొందించుకొనుట, అచేతనమగు మట్టిముద్దను పిసికి అచ్చు పోసి ఆకారమును దిద్దినట్లుగా కాక, స్వేచ్ఛగా సర్వాంగసౌష్ఠవము కలిగిన జీవుడిగా పెరుగుటకు దోహదపడుట, తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల కర్తవ్యము. ఆత్మ అనగా నేమిటి అనే అవగాహన యింకా ఏర్పడలేదు. పిల్లల విషయంలోగాని, పెద్దల విషయంలో

గాని, వారి అంతరాత్మను వారు కనుగొనుటలోను మరియు వారి లోని వాస్తవ చైత్యపురుష సత్తాను వారు తెలుసుకొనుటలోనే అసలు రహస్యం దాగివున్నదని వారికి యింకా తెలియబడలేదు. దానికి ప్రాధాన్యతను కలుగచేసి కూడా, దానిని ముందుంచి నాయకత్వం వహించి నడిపించేలా చేసినట్లైన, విద్యాభ్యాసానికి సంబంధించిన కార్యకలాపాలను చాలావరకు మన నుండి అదే స్వీకరిస్తుంది. అంతేగాక, నేటి మన బాహ్య, దైనందిన, యాంత్రిక జీవన వ్యవహారాలకు అతీతంగా మానవుడి మానసిక అంతర్గత శక్తిసామర్థ్యాలను పూర్తిగా తెలుసుకునేట్లు చేస్తుంది. ఇట్టి వినూత్న బోధనా పద్ధతులు నిజమైన కార్యాచరణకు దారితీసే తిన్నని మార్గము. ప్రాణిక, భౌతిక భావనల మరుగున దాగివున్న వాస్త వానికి దగ్గరయ్యే ప్రయత్నము వలన మరియు దానికున్న అవ కాశాలపై అధికంగా ఆధారపడుటవలన మానవుడు అంతర్గ తంగా ఒక ఆత్మ అని, ఒక దివ్యచైతన్యశక్తి అని, లోనున్న ఈ చైత్యపురుషుని మేల్కొల్పుటయే విద్యాభ్యాసము యొక్క అంతిమ లక్ష్యము అనే దిశగా మనలను నడిపిస్తుంది. స్వకీయ అస్తిత్వపు నిగూఢసత్యంలోని కీలకసూత్రాన్ని కనిపెట్టి దాని కనుగుణంగా జీవించ తలచినట్లయితే, సర్వ మానవజాతి జీవితలక్ష్యం కూడ నిజంగా ఒకటే అవుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

సమాచార పత్రం

2006 ఆగస్టులో ఈ క్రింది కార్యక్రమాలు పాండిచేరిలో నిర్వ హింపబడుతవి. 1. శ్రీఅరవింద సొసైటీవారి వార్షిక సమావేశము – ఆగస్టు 12, 13 మరియు 14 తేదీలలో. 2. ఆగస్టు 15 న శ్రీఅర విందుల 134 వ జయంతి ఉత్సవము. 3. శ్రీఅరవిందుల భగవ ద్గీతా వ్యాసాలపై గోష్టి.. ఆగస్టు 17 నుంచి 26 వరకు ఉదయం 9

Rs. 15

9/9/2006

భవానీభారతీ

అఖిలభారత పత్రిక

సెప్టెంబరు 2006



పరిచయము

భవానీ భారతీ! సర్వేశ్వరీ, శ్రీజననీ, నిర్వికల్పా, సనాతనీ, కాంతి మతీ, శక్తిమతీ, భయంకరీ, అభయంకరీ, సంరక్షణీ, సంహారిణీ! –

శ్రీఅరవిందులు రూపరహిత 'భవానీభారతీ' సత్వమును కవితగా అక్షరరూపములో ఛందోబద్ధం చేసి తొంబది తొమ్మిది శ్లోకాలలో 'ఉపజాతి' ఛందస్సులో మనకు ప్రసాదించారు. 1904-1908 సం॥ ల మధ్య వారు వ్రాసిన ఏకైక సంస్కృత పద్య కవిత ఇది. శౌర్యము, వీరత్వము, శక్తి, కోపోద్రిక్తత, పోరాటపటిమ – లక్షణాలను ప్రేరేపించడానికి తగిన ఛందస్సు ఎన్నుకున్నారు. దీనిని వారు రచించి ఇంకా నామకరణమే చేయలేదు. ఇది పోలీసులు స్వాధీనమైపోయింది. ఈ రచన 1985 లో శ్రీఅరవింద ఆశ్రమంవారికి దక్కింది. 'భవానీభారతీ' అనే సార్థక నామధేయంతో దీనిని తొలిసారిగా వారు ప్రచురించారు.

ఈ రచనకి ప్రేరణయైన నాటి కాలమాన పరిస్థితి, చిత్తవృత్తి (mood) తెలుసుకోటానికి శతాబ్దం వెనక్కి పోనక్కర్లేదు. నాటికీ, నేటికీ ఆ పరిస్థితి అలా కొనసాగుతూనే ఉంది. మనం పిలుచుకునే – ఇండియా, భారత్, హిందుస్థాన్ – తాను బంధింపబడిన సంకెళ్ల నుంచి ఇంకా విముక్తి కాబడవలసియే ఉన్నది! అణగద్రొక్కేవారు వస్తున్నారు, వెడుతున్నారు. తేడా – రంగు, రూపాలలోనే! మధ్యలో దేశం కాలూని నిలుస్తుంది; ఒక్కొక్కప్పుడు చిక్కుల్లో తగుల్కొని బిగుసుకుంటుంది; మరొక్కప్పుడు రౌద్రాగ్నిలో తిరగబడుతుంది. తన బిడ్డలు చాలమందికి ఈ పరిణామాల క్రమం బోధపడదు – దైన్యము, మనస్తాపము, మెలివేసి దేశాన్ని తీవ్రసంతాపానికి ఎందుకు గురిచేస్తుందో? దట్టమైన కారుమేఘాలు చుట్టుముట్టి పరిస్థితి చేజారిపోయే సమయం దాపురించినపుడు, చీకటిని దూసుకువచ్చి, కారుమేఘాలు పటాపంచలు చేసే ప్రచండమైన కిరణాన్ని దర్శిస్తారు వారు. ఎలా? ఎక్కడి నుంచి వచ్చినదీ నూతనోత్తేజం? ఈ బలీయమైన అనంత శక్తికి మూలము ఎక్కడ?

దైవలీలలు అత్యాశ్చర్యకరములు, కదా! అవి కలవరపెట్టే విగానూ ఉంటాయి.

'భవానీ భారతీ' లో సుపరిచిత దృశ్యమే మన ముందు ఆవిష్కృతమౌతుంది. తాను కాలూని నిల్చున్న నేల, అసురశక్తుల చేత పెకలించివేయబడుతూంటే, తమస్సులో, తనకేమీ పట్టన ట్లుగా భారతీయుడు ఉన్న పరిస్థితి – ఈ దృశ్యంతో కవిత ఆరం భమౌతుంది. తాను, తన సోదరులు – మాతృభూమి – దోపిడీకి గురికాబడుతూంటే – నిమ్మకి నీరెత్తినట్లు విస్మృతిలో ఉన్నారు. ప్రాపంచిక సుఖలాలసలో వారికి తల్లి కేక వినపడటం లేదు. ఆ అసహాన పరిస్థితిలో కాళి – ఉగ్రరూపం తాల్చి, మేఘగర్జనతో గడగడలాడిస్తూ, సాక్షాత్కరిస్తుంది.

తన పాదాలకడ పడి ఉన్న వీరిని తృణీకరిస్తుంది. పురాతన యోధులకు, ఇప్పటి, వీరు నిర్జీవ నమూనాలు! దేశమాతను ఆరాధించి ఆమె రక్షణకోసం తమ రక్తాన్ని ధారపోసి జీవితబలి దానం చేసినవారు నాటివారు. మరి నేడిట నిలిచి ఉన్న వీరెవ్వరు? అందరికీ స్పష్టంగా కనిపిస్తూన్నది వీరి కంటబడదా? మాత దుస్థితిని కాంచలేరా? ఆకలి, దప్పికలతో సొలసియున్న దేశమాత దుస్థితి వీరిని కదిలించదా? అసలు వీరికీ విషయం తెలుసా? ఏ జాతి నిరంతర ఆత్మార్పణకై సాటివారి క్షేమం కోసం ఉద్యుక్తమై ఉంటుందో, ఆ జాతిపట్ల కాళి కృప కలిగి ఉంటుందని? అలా కాక స్థబ్దతతో, నిస్సత్తువగా ఆమెకి గుండె బరువై ఉన్నపుడు, ఆమె తన రాకను విజయోత్సవ సంరంభంతో కాక, ప్రకృతి వైపరీత్యాలతో తెలియపరుస్తుందని? సనాతన భారతీయ జీవాత్మని హెచ్చరిస్తుంది – "ఓ పిరికి కిశోరములారా! లేవండి! లేవండి!" అని. మత్తు వదిలి మేల్కొని, రక్తసిక్తమైన కాళరాత్రిలో, స్వదేశస్థులను వెతుకుతూ భారతీయుడు వెళ్లగా ఏమి చూచాడు! మరుగున పడి ఉన్న శవాలను! అసురుడు (the Titan) మాత్రం నిబ్బరంగా ఒక పాదంతో అజేయమైన హిమవంతమును, మరొక పాదంతో ఆంధ్ర, పౌండ్ర మైదానాలను అణచి ఉంచి తలెత్తుకుని ధీమాగా నిల్చుని ఉన్నాడు.

రాక్షసుడు భారతీయ ఆత్మని అవమానపరుస్తూ ఉంటే చూస్తూ ఉండలేక నిర్దయతో, దుర్మార్గంగా జరుగుతూన్న దోపిడీకి రెచ్చకొట్టబడి, కోపోద్రిక్తయైన దేశమాత తీవ్రహుంకారం విని కదిలివచ్చిన యుద్ధవీరులు – దుర్మార్గుడు చావాలి – అని గర్జిస్తారు.

తన శక్తిసామర్థ్యాలను, మొండిధైర్యాన్ని తన్ననుసరించి తండోపతండాలుగా వస్తూన్న తన బిడ్డలకు అందించగా, ముల్లోకాలూ యుద్ధవీరుల పవిత్ర రక్తధారలతో తడిసి ముద్ద అయి కాళి ఉగ్రరూతలూగుతూ ముందుకు ఉప్పొంగింది. అహంకార ధిక్కారాలతో రాక్షసుడు చీకటిగుహలో – నాకు సరియెవరు ఈ లోకంలో? అని రంకె వేస్తున్నాడు.

సనాతమైన పసిడి దివ్యకాంతి, దుష్టఅంధకారం లోనికి చొచ్చుకొని ప్రవేశించి తునాతునకలుగా చెల్లాచెదరు కావించి దాని జాడకూడ కనపించకుండా చేస్తుంది. భవానీదేవి యొక్క స్నిగ్ధ సౌందర్యం, స్వచ్ఛమైన తీక్షణ మృదుల కిరణకాంతులతో క్షుద్రమైన దుష్ట అంధకారాన్ని చెదరకొట్టివేస్తుంది. ఆమె కృపతో అంతా దేదీప్యమానమైన సౌందర్యకాంతి లహరులే! కపాల మాలాకర్కశ ధ్వని, భీకర గావుకేకలతో అవివేక నిద్రావస్థ నుంచి తనను మేల్కొలిపిన ఆమె ఎవరా అని భారతీయుడు విస్తుపోతాడు. స్నిగ్ధ సుందర భవానీదేవి నీడలో సింహనాద కాళీనృత్య రూపాన్ని దర్శిస్తాడు. ఆమె దిగ్విజయ. ఆనందమయి. గందరగోళం అంతా చెల్లాచెదరైపోతుంది. కాళీ, భవానీ, చండీ, అన్నపూర్ణా, రాధా – అనంతరూపాలలో అమ్మ – సూర్యరశ్మిలోని అసంఖ్యాక కిరణాలవలె! భూమి నుంచి పూజలు, భజనలు, స్తోత్రగానాలు అందుకుంటూన్నది.

“నీవు సర్వేశ్వరివి, జగన్మాతవు, సర్వశక్తి సమన్వితవు. ఆధిపత్యము, శ్రేష్టత్వము, సముజ్వల సౌందర్యము నీ కానుకలు. సుసంపన్నవు నీవు. ఇన్నీ అనుగ్రహిస్తూనే, కోపోద్రిక్తురాలవైతే, దెబ్బలూ తగిలిస్తావు”

పూర్వవైభవం తిరిగి సంతరించుకుంటుంది. భరతభూమి ఆర్యావర్తము, సనాతనము. సాక్షాత్తు దివ్యమాతచే పరిరక్షింపబడే (పుణ్య) భూమి. సనాతన ధర్మపాలన, న్యాయనిష్ఠ, పునరుద్ధరింపబడుతవి. వేదోక్తంగా ప్రజ్వరిల్లిన హోమాగ్ని నుండి వెలువడిన అగ్ని కణములు. ఆకాశమును నింపుతాయి. జ్ఞానం వర్ధిల్లుతుంది. వివేకం వెల్లివిరుస్తుంది. సుసంపన్న వైభవం, భక్తిన్యాయాలు, తిరిగి భారతీయ ఆధికారిక చిహ్నాలుగా అలంకరించుకోబడి అలరిస్తాయి. సభక్తికంగా, కృతజ్ఞతాభావంతో బిడ్డలంతా పూజ్యభావంతో దేవతను దర్శిస్తారు. ఆమెయొక్క శాశ్వత రక్షణను ఆకాంక్షించి అభ్యర్థిస్తారు.

"దేవీ! ఔదార్యవతీ! భారతీయుల హృదయాలలో చిరస్థాయిగా కొలువై ఉండి అనుగ్రహించు. ఓ శక్తిస్వరూపిణీ! లోక కళ్యాణం కోసం ఈ నేలపై నీ స్థిరనివాసాన్ని అనుగ్రహించు తల్లీ"! అజ్ఞానము, జడత్వము, ప్రపంచ దేశాలకు క్రొత్తకాదు. భారతదేశమూ, అందుకు మినహాయింపు కాదు. నిశ్చైతన్యంగా తమస్సులో ఉండటం భారతీయ లక్షణం కాదు. శ్రీఅరవిందుల వారి దృష్టిలో – దేశమంటే ఒక భూభాగమే కాదు; అలంకారమూ కాదు; మనోకల్పనసలే కాదు. ఒక బ్రహ్మాండమైన (చైతన్య) శక్తి. కొట్లాది జనజీవన చైతన్యశక్తుల సమాహార స్వరూపం!

బలము, వీరము లేని దేశభక్తి ఒక మనోకల్పన మాత్రమే అయితే, అది అపరిపూర్ణమైనది. శక్తితీవ్రత, మొక్కవోని సంకల్ప బలం, లేచి ముందుకు దూకాలనే ఉద్రేకం – ఇవి, దేశమాత కోసం ఆత్మార్పణకి కూడా వెనుకాడని ఊపు, ఉద్రేకాన్ని ఇస్తాయి. వీటివల్ల అనుకున్నది సాధింపబడుతుంది. వ్యక్తం చేయాలనుకున్నది వ్యక్తీకరింపబడుతుంది. ఊపిరాడని బాధనుంచి విముక్తి కలుగుతుంది.

జన్మభూమిపై ప్రేమ మనకు తెలియకుండానే మనలను కార్యోన్ముఖులను చేస్తుంది. దేశభక్తి, ఎక్కువ భాగం అంతర్నిహితంగా ఉంటుంది. పతాకస్థాయిలో మెలికలు తిరిగి లోలోపలి పొరలను చీల్చుకుని, శక్తివంతంగా భవానీ రూపంలో కాళీశక్తిగా

ఆవిష్కృతమౌతుంతి. ఓహో! ఆ సమయమెంత మహిమాన్వితమో కదా!

ఈ దేశమాత బిడ్డలు భారతీయులు. అనుక్షణం శక్తివంత మైన సజీవ దేశప్రేమ ప్రేరణలో, తమయొక్క, తమ సహోదరుల హృదయస్పందనలతో తాదాత్మ్యం చెంది, ఉప్పొంగిన రుధిర ప్రవాహాలు నేల నాల్గుచెరగులా ప్రవహింప చేస్తూంటే – ఓహ్!

భవానీ భారతీ! ఇది ఈ గెడ్డపై నిరంతరంగా ప్రతిధ్వ నించే ప్రార్థన. దేశాన్నంతటినీ దేశమాతగా ఆవాహానం చేసేది –

ఆంగ్లమూలం: Richars Hartz

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

భవానీ భారతీ

శ్రీఅరవిందులు

1. సుఖే నిమగ్నః శయనే యదాసం
మధోశ్చ రథ్యాసు మనశ్చచార
స చిన్తయామాస కులాని కావ్యం
దారాంశ్చ భోగాంశ్చ సుఖం ధనాని

సుఖంగా మంచం మీద శయనించి ఉండగా – నా వాళ్లు, రసమయ మైన కావ్యాలు, భార్య, సుఖం, సంపద, ధనం – వీటి గురించిన తీయటి ఊహాలతో నా మనసు పలు మార్గాలలో పయనించింది.

2. కాంతైశ్చ శృంగారయుతైశ్చ హృష్టో
గానైః స ఛన్దో లలితం బబన్ధ
జగౌచ కాన్తావదనం సహాస్యం
పూజ్యేచ మాతుశ్చరణే గరిష్ఠే॥

ప్రేయసితో శృంగారయుత నా ఆనందాన్ని లలిత ఛందోపద బంధంగా మలచాను. నా ప్రేయసి మందహాసాన్ని, సభక్తికంగా మాతృపాదాలని గుర్తించి గానం చేశాను.

3. చక్రన్ద భూమిః పరితో మదీయా
ఖలో హి పుత్రానసురో మమర్ద
స్వార్థేన నీతోహ మనర్చ పాదౌ
దురాత్మనో భ్రాతృ వధేన లిప్తౌ॥

క్రూరుడైన రాక్షసుడు నా బిడ్డలను సర్వనాశనం చేస్తున్నాడంటూ నా దేశము ఆక్రందనంతో నా చుట్టూ తిరుగుతూ కనిపించింది. నా సోదరులను చంపిన రక్తంతో తడిసిన ఆ దురాత్ముని పాదాలను, స్వార్థంతో అర్చించాను.

4. సుఖం మృదావాస్తరణే శయానం
సుఖాని భోగాన్ వసు చిన్తయన్తమ్
ప స్పర్శ భీమేన కరేణ వక్షః
ప్రత్యక్ష మక్ష్ణోశ్చ బభూవకాలీ॥

సుఖ, ధన, భోగాలను తలుచుకుంటూ మెత్తటి పరుపులపై సుఖంగా కలలు కంటూ శయనించి ఉండగా, భయంకరమైన హస్తస్పర్శతో గుండెను తట్టి లేపి కాళి ప్రత్యక్షమైనది.

5. నరానరాస్థిమాలాం నృకపాలకాంచీం
వృకోదరాక్షీం క్షుధితాం దరిద్రామ్।
పృష్ఠే వ్రణాంకామసుర ప్రతోదైః
సింహీం నదన్తీమివ హన్తుకామామ్॥

మనుష్యుల అస్థికల మాలగా, పుర్రెల మొలత్రాడుగా, తోడేలు చూపులతో ఆకలి, దారిద్ర్యములతో, కొరడా దెబ్బలతో తట్లుతేరిన వీపుతో వేటకు బయల్దేరిన ఆడసింహంలా గర్జిస్తూ (శత్రు) సంహారమునకు సిద్ధమైన (కాళీమాతను దర్శించాను.)

6. క్రూరైః క్షుధార్తై ర్జ్వలనయనైర్జ్వలద్భిః
విద్యోతయన్తీం భువనాని విశ్వా
హుంకారరూపేణ కటు స్వరేణ
విదారయన్తీం హృదయం సురాణామ్॥
ఆకలితో ప్రజ్వరిల్లుతూన్న క్రూరమైన కళ్లతో సమస్త భువనములను ప్రకాశింపచేస్తూ దేవతల హృదయాలను బ్రద్దలుకొట్టే కటువైన హుంకారంతో (కాళి నాకు కనిపించింది.)

7. ఆపూర్య విశ్వం పశువద్విరావైః
లేలిహ్యా మానాంచ హనూకరాలే
క్రూరాంచ నగ్నాం తమసీవ చక్షుః
హింస్రస్య జన్తో ర్జననీం దదర్శ॥
మృగరంకెలతో లోకాన్ని నింపుతూ, భయంకరమైన దవడలను చాటిస్తూ, చీకట్లో క్రూరము, నగ్నము అయిన దుష్టజంతువు నేత్రాలు వంటి నేత్రాలతో కూడిన తల్లిని చూశాను.

8. ఆలోలకేశైః శిఖరాన్నిగృహ్యా
కరాలదంష్ట్రైశ్చ విసార్య సిన్ధూన్
శ్వాసేన దుద్రావ నభో విదీర్ణం
న్యాసేన పాదస్య చ భూశ్చకంపే॥
ఆమెయొక్క చంచలమైన కేశాల అడుగున పర్వతాగ్రాలు భయంతో క్రుంగి ఉన్నాయి. భీకరమైన ఆమె కోరలు నుంచి సముద్రాలు వెనుదిరిగాయి. ఆమె శ్వాస, మేఘశకలాలని చెదరకొట్టింది. ఆమె పాదఘట్టనలతో భూమి కంపించింది.

9. ఉత్తిష్ఠ దేహీతి పిపాసు రంబా
దధ్వాన రాత్రౌ నగరే వితారే
సేయం స్త నన్తీ రజనీం తమిస్రాం
బభౌ సమాపూర్య మనాంసి చార్యా॥

"లే! ఇయ్యి!" అంటూ దప్పికతో కూడిన అమ్మ పిలుపు, నక్షత్ర ములు లేని ఆ కాళరాత్రిలో నగరమంతా ప్రతిధ్వనించింది. మేఘ గర్జనతో వైభవోపేతమైన దేవియొక్క అస్తిత్వంలో చీకటిరాత్రితో పాటు, మనుష్యుల హృదయాలూ నిండిపోయినై.

10. భీతః సముద్విగ్నమనాశ్చ తల్పాద్
ఉద్ధాయ పప్రచ్ఛ తమో నమస్యామ్
కా భాసి నక్తం హృదయే కరాలి
కుర్వీయ కిం బ్రూహి నమోస్తు భీమే॥

భయపడి కలత చెందిన మనసుతో మంచం మీద నుంచి లేచి వందనీయమైన ఆమె రూపానికి నమస్కరించి ప్రశ్నించాను. భయంకరమైన కాంతితో నా హృదయంలో ప్రవేశించిన నీవు ఎవరు? నేనేమి చేయాలి? చెప్పు. ఓ! భయంకరమైన దేవీ! నీకు నమస్కారము.

11. సింహస్య సారావము దీరయన్తీ
క్రూరస్య కుంజే భ్రమతే వధార్థమ్
ససర్జ వాక్యాని కరాలమూర్తిః
యథా సముద్రస్తనితం శిలాయామ్॥

పొదలలో వేటకై తిరుగుతూ ఉన్న భయంకరసింహంవలె గర్జిస్తూ, శిలల తాకిడికి సముద్రము ఘోషించినట్లు, ఆ భయంకర దేవత పలికింది.

12. మాతాస్మి భోః పుత్రక భారతానాం
సనాతనానాం త్రిదశ ప్రియాణామ్
శక్తోన యాన్ పుత్ర విధిర్వి పక్షః
కాలోపి నో నాశయితుం యమోవా॥

బిడ్డా! సనాతనులు, దేవతలకు ప్రీతిపాత్రులు అయిన భారతీయులకు తల్లిని, దుర్విధికాని, కాలముకాని, మృత్యుదేవతకాని, వారిని నాశనము చేయ సమర్థులు కారు.

13. తే బ్రహ్మచర్యేణ విశుద్ధ వీర్యా
జ్ఞానేన తే భీమతపో భిరార్యాః
సహస్ర సూర్యా ఇవ భాసురాస్తే
సమృద్ధిమత్యాం శుశుభుర్ధరిత్ర్యామ్॥

బ్రహ్మచర్యముచేత పరిశుద్ధ పరాక్రములు. కఠోర తపస్సుచేత ఆత్మోన్నత సంపన్నులు, సహస్రభానుతేజో ప్రకాసితులుగా సుసంపన్నమైన ఈ భువిపై వెలుగొందుతున్నారు.

14. శూరాః ప్రగల్భాశ్చ హి శాత్రవాణాం
స్పర్ధాలవం సోఢు మమర్షణాస్తే
పూజాం జనన్యా రిపుభిః సమాప్య
రేజూ రణాన్తే రుధిరాక్తదేహాః॥

శూరులు, నిర్భయులు అయినవారు, శత్రువుల నుంచి ఏ కొంచెం ధిక్కారాన్ని సహించరు. శత్రు బలిదానంతో యుద్ధం ముగిశాక రక్తసిక్తదేహంతో ప్రకాశిస్తూ తల్లిని పూజిస్తున్నారు.

15. దీనాః క ఏతే ఘృణినా దరిద్రాః
శాన్తిం జఘన్యాం గణికామివాన్ధాః
భజన్తి భోః కాపురుషా విమూఢా
ఆలింగ్య యే మోదథ మృత్యుమేవ॥

ఎవరీ దీనులు, దురదృష్టవంతులు, దరిద్రులు? తమ అంధత్వంలో వారవనితను వోలె, అవమానకరమైన శాంతిని ఆలింగనం చేసుకునేవారు? మగతనం లేని అల్పబుద్ధికల పురుషులారా! మీరు మృత్యువుని ఆలింగనం చేసుకుంటున్నారని మీకు తెలియదా?

16. క్లీబాః కియన్త్యేవమసూన్ దినాని
ధరిణ్యా ధార్తాః ప్రహృతా వృథైవ
హసంత్య మిత్రా అపమాన రాశిం
క్రీణీథ శాన్త్యా ధనశోషణంచ॥

నిర్వీర్యుడవై శత్రువులు కావాలని పెట్టే బాధలను ఎన్ని రోజులు భరిస్తావు? నిన్ను ద్వేషించే, వారు, నిన్ను చూసి నవ్వుతారు. శాంతి పేరుతో ఎంతో అవమానాన్ని, నీ సంపదను కొల్లగొట్టుకు పోవటాన్ని కొనితెచ్చుకోకు.

17. మ్లేచ్ఛస్య పూతశ్చరణామృతేన
గర్వం ద్విజోస్మీతి కరోతి కోయమ్
శూద్రాదథానార్య తరోసి శూద్రో
వ్రతైః కి మేతైర్నరకస్య పాన్థే॥

మ్లేచ్ఛుల పాదామృత స్పర్శతో పవిత్రుడ్నై బ్రాహ్మణుడను అనుకుని, గర్వపడే ఈతనెవ్వరు? నీవు శూద్రుడికంటె హీనమైన అనార్యుడవు. నరకమార్గాన ప్రయాణించే వానికీ వ్రతాలు ఎందుకు?

18. ఉత్తిష్ఠ భోజాగృహి సర్జయాగ్నీన్
సాక్షాద్ధి తేజోసి పరస్య శౌరేః
వక్షః స్థితేనైవ సనాతనేన
శత్రూన్ హుతాశేన దహన్నటస్వ॥

మేలుకో! హోమానుష్ఠాలను వదిలిపెట్టు. నీవు సాక్షాత్తు పరమ పురుషుడు శ్రీకృష్ణుని తేజోరూపానివి. నీ హృదయగత సనాతన వహ్నితో శత్రువులను దహించుటకు ఉద్యుక్తుడవుకా.

19. కః క్షత్రబన్ధుర్భవనేమ గూఢో
మద్యైః కటాక్షైశ్చ విలాసినీనామ్
ధర్మాన్ యశో దుర్బల విస్మృతోసి
యుధ్యస్వ భో వంచక రక్ష ధర్మాన్॥

అంతఃపురంలో అజ్ఞాతంగా భోగలాలసులై, అంగనల కనుసన్నలలో మెలుగుతూ, మద్యం సేవిస్తూ ఉన్న ఈ క్షత్రియబంధువు ఎవరు! నీ బలహీనతతో నీ కర్తవ్యాన్ని, మర్యాదని విస్మరించావు. వంచకుడా! పోరాడు; ధర్మాన్ని పరిరక్షించు.

20. అస్త్యేవ లోహం నిశితశ్చ ఖడ్గః
కౄరారా శతఘ్నీ నదతీహ మత్తా
కథం ని రస్త్రోసి మృతోసి రోషే
రక్ష స్వజాతిం పరహా భవార్యః॥

(శస్త్ర) లోహం ఉన్నది; కరవాలనం నిశితంగా ఉన్నది. కౄరార కరాళ శతఘ్ని మత్తెక్కి గర్జిస్తున్నది; నీవు నిరాయుధుడవుగా ఉన్నావేమిటి! చచ్చినవాడిలా పడి ఉన్నావు! నీ జాతిని రక్షించు; నీ శత్రువును దునుమాడి ఆర్యుడను అనిపించుకో.

21. వైశ్యోసి కశ్చేహ విశః సమృద్ధ్యై
ధనం కిమేత ద్విపణీమ సజ్జమ్
మ్లేచ్ఛర్థిరేషా కురుషే దరిద్రాం
మామేవ కాలీం ఖల మాతృద్రోహిన్॥

నీ విక్కడ ఏ రకమైన వైశ్యుడవు? అంగడిలో అమర్చిన వస్తువులు ప్రజలను సంపన్నం కావించటానికా? ఇదంతా విదేశీయుని దోపిడీ సొమ్ము. కాళీదేవిని, నన్ను, దరిద్రులను చేస్తున్నావు – ఓ నీతిలేని మాతృద్రోహీ!

22. మ్లేచ్ఛర్థిమేతాం జ్వలనాహ దేహి
రోషాగ్నినా కిం బిభేషి కాల్యాః
దేవీం భవానీం హృది పూజ యిత్వా
యతస్వ లక్ష్మ్యైభవ జన్మభూమ్యాః॥

ఈ విదేశీ సంపదను అగ్నికి ఆహుతి చెయ్యి. కాళీమాత రోషాగ్నికి భయపడవా! భవానీదేవిని హృదయంలో ఆరాధిస్తూ జన్మభూమిని సుసంపన్నం చేసేందుకు పాటుపడు.

23. భో భో అవన్త్యో మగధాశ్చ బంగా
అంగాః కలింగాః కురు సిన్ధవశ్చ
భో దాక్షిణాత్యాః శృణుతాంధ్ర చోలా
వ సన్తి యే పంచన దేష శూరాః॥

ఓయీ! ఓయి! అవంతి, మగధ, వంగ, కళింగ, కురు, సింధుదేశాల ప్రజలారా! దక్షిణదేశవాసులైన ఆంధ్ర, చోళులారా! నా మాట వినండి! వీరు పంచనదీ పరివాహక క్షేత్రవాసులైన వీరులు.

24. యే కే త్రిమూర్తిం భజథైక మీశం
యే చైకమూర్తిం యవనా మదీయాః
మాతాహ్వాయే వస్తనయాన్ హి సర్వాన్
నిద్రాం విముంచధ్వమయే శృణుధ్వమ్॥

ఏకేశ్వరుని త్రిమూర్తులుగా పూజించే హిందువులు, మీరూ, ఆ ఒక్క మూర్తినే ఏకైక అసమానమూర్తిగా (భజించే) మహమ్మదీయులు, మీరూ, మీ అందరినీ, నా బిడ్డలే కాబట్టి, మీ తల్లిగా పిలుస్తున్నాను: వినండి; మొద్దు నిద్ర విడనాడండి.

25, కాలస్య భేరీం శృణు తాద్రిశృంగే
రౌద్రం కృతాన్తం మమ దూత రూపమ్
దుర్భిక్షమేతానథ భూమి కంపాన్
నిబోధతా ధీశ తమా గతా స్మి॥

పర్వతశిఖరాగ్రాలపై మ్రోగే భేరీనాదం వినండి. నిర్దయుడైన భయంకరమైన మృత్యువును నా దూత రూపంలో చూడండి. దుర్భిక్షాలు, భూకంపాలు పరిపూర్ణమైన నా ఆగమనాన్ని ప్రకటిస్తాయి.

26. దేహీ క్రమాన్ దేహి పిపాసురస్మి
జానీహి దృష్ట్వా భజ శక్తి మాద్యామ్।
శిరాంసి రాజ్ఞాం మహతాం తనూశ్చ
భోక్తుం నదన్తీ చరతీహ కాలీ॥

బలులు సమర్పించండి; అతితృష్ణతో ఉన్నాను – ఇవ్వండి. నన్ను దర్శించి ఆద్యశక్తిగా తెలుసుకొని ఆరాధించండి – బిగ్గరగా గర్జన చేస్తూ శక్తియుక్తులైన పాలకుల శిరస్సులను, శరీరాలను ఆక

లితో భోంచేయుటకు కాళికగా ఇక్కడ తిరుగుతున్నాను (తెలుసు కోండి.)

27. రక్తప్రవాహైరపి నాస్మితృప్తా
శతైః సహాస్త్రైరయుతైరజానామ్।
పదత్త భీత్వా హృదయాని రక్తం
సంపూజయ న్త్వేవమజాం కరాలీమ్॥

వందలు, వేలు, పదివేల మేకల నెత్తురు ప్రవాహాలతో తృప్తి లేదు నాకు. చీల్చిన మీ హృదయం నుంచి ప్రవహించే రక్తం నాకు అర్పించండి ఆ విధంగా అయోనిజ, భయంకరరూపిణి అయిన కాళీదేవిని పూజించండి.

28. యేషాం సదైవాత్మబలి ప్రవృత్తాః
శూరా మహాన్తఃప్రముఖాః కులార్థే।
సౌమ్యా కరాలీ భవతి ప్రజానాం
రక్తేన పుష్టా వినిహన్తి శత్రూన్॥

స్వజాతి హితం కోసం సతత ఆత్మబలిదానంతో, ఎక్కడైతే గొప్ప శౌర్యవంతులు, నాయకులు, నిమగ్నమై ఉంటారో, ఆ జాతి పట్ల కాళి కృప కలిగి ఉంటుంది. (శత్రు) రుధిరంతో పరిపుష్టయై, ఆమె వారి శత్రువులను అణగతొక్కి వేస్తుంది.

29. కం బిభ్యతార్యా రుధిరస్య సింధౌ
నిమజ్జతాస్మిన్ భవతార్య సత్వాః।
త్రిశూలి భోః పశ్యత తత్ర పారే
జ్యోతిర్ప్యు దేతీదమ భిన్నతేజః॥

ఓ! ఆర్యులారా! మీరెవరికి భయపడాలి! రక్తసముద్రంలో మునక వేయండి! మౌలికసత్వంలో మీరు ఆర్యులు అని తెలియచేయండి; చూడండి ఆవలి ఒడ్డున ఉదయించే అఖండ తేజోమయి, త్రిశూల ధారిణిని.

30. కవే విలాసిన్ శృణు మాతృవాక్యం
కాలీం కరాలీం భజ పుత్ర చండీమ్
ద్రష్టాసివై భారతమాతరం తాం
ఘ్నతీమరాతీన్ భృశమాజి మధ్యే॥
ఓయీ! కవీ! విలాసవంతుడా! అమ్మ మాట విను. నాయనా! కరాలీ, కాళీ, చండీ మాతను పూజించు. యుద్ధరంగంలో శత్రు సంహారిగా భరతమాతను నిజంగా దర్శిస్తావు.

31. సనాతనానాన్యాహ్వాయ భారతానాం
కులాని యుద్ధాయ జయోస్తు మాభైః।
భో జాగృతాస్మి క్వధనుః క్వ ఖడ్గ
ఉత్తిష్ఠతోత్తిష్ఠత సుప్తసింహాః॥
సనాతన భారతీయ తెగలవారిని యుద్ధానికి పిలవండి. భయం లేదు. జయం మనదే. నేను మేల్కొన్నాను. ఏదీ విల్లు? కత్తి యెక్కడ? లేవండి! లేవండి! నిద్రావస్థలో ఉన్న కిశోరములారా!

32. ఇమాని వాక్యాని నిశమ్య రాత్రౌ
తేజశ్చ భీమం తిమిరే విలోక్య
చిత్తం ననర్తాశు విహాయ సద్మ
భోగాన్ వినిర్ధూయ చ నిర్జగామ॥
ఈ మాటలు విని, చీకటిలో భయంకరమైన తేజస్సును చూచి, చిత్తము నర్తించింది. భోగాలను వదల్చుకొని, ఇల్లు విడిచి బయటికి వెళ్లిపోయాను.

33. సాంద్రం తిమిస్రావృత మార్తమన్ధం
దదర్శ తద్భారత మార్యఖండమ్।
గూఢా రజన్యామరిభిర్వినష్టా
మాతా భృశం క్రందతి భారతానామ్॥

దట్టమైన చీకటితో ఆవరింపబడి, బాధతో, అంధురాలైన ఆర్య భూమి భారతదేశాన్ని చూచాను. భారతమాత శత్రువులచే నాశనం కాబడినదై, చీకటిలో భోరున ఏడుస్తోంది.

34. నభ్రామయామాస దృశం రజన్యాం
భ్రాతౄన్ స తప్తస్తిమిరే విచిన్వన్।
కంకాల సారాణి దదర్శ తాని
శవాని తేషాం కరుణాని భూమౌ॥

చీకట్లో ఏడుస్తూ, నీడలలో, నా సోదరులను వెతుకుతూ, దృష్టి సారించాను. హృదయవిదారకంగా, ఎముకల ప్రోగులుగా నేలపై పడి ఉన్న వారి శవాలను చూచాను.

35. తదా దదర్శాసురమే కమీశం
కిరీటినం వజ్రధరం మహాన్తమ్।
అశ్రూణి రక్తౌఘశతాని మాతుః
సంగృహ్యా పుష్ణం తమ పత్యసంఘాన్॥

అపుడు ఒక రాక్షసరాజును చూశాను. కిరీటం దరించాడు. వజ్రా యుధాన్ని చేపట్టాడు; బలశాలి; మాతయొక్క వందల రక్తాశ్రు ప్రవాహాలతో తన సంతానసమూహాలను పోషించుకుంటున్నాడు.

36. పదా తుషా రాద్రి మదీన సత్వం
మృద్నన్తమంధ్రానితరేణ పౌండ్రాన్।
ప్రసారయన్తం కరవాలముగ్రం
చీనావనౌ పహ్లావ భూమిఖండే॥

అజేయమైన హిమాలయమును ఒక కాలితో, రెండవ కాలితో ఆంధ్ర, పౌండ్ర దేశాలను అణచి ఉంచి, ఉగ్రకరవాలాన్ని చైనా, పర్షియా దేశాలవైపు ఝుళిపిస్తూ ఉన్నాడు.

37. ఖలం విశాలం బలగర్వితం తం
ధర్మేణ దృప్యన్తమ ధర్మబుద్ధిమ్।

దృష్ట్వా త్వ భూచ్చిత్త మివాగ్నికుండం
క్రోధేన జాజ్వాల హి శాశ్వతేన॥

దుష్టుడు, అపరిమితుడు, బలగర్వితుడు, అధర్మబుద్ధి కలవాడు, ధర్మాన్ని గురించి బడాయిలు చెప్పేవాడు – అలాటి వానిని చూచి నా చిత్తము అగ్నికుండమే అయి, తరగని కోపంతో మండింది.

38. కులాని సుప్తాని సనాతనాని
హ్వాతుం జగౌ జాగరణాయ భీమా।
కృూరంవిరావౌఘ ముదీరయన్తీ
పార్శ్వే మమాయాద్రజనీవ ఘోరా॥

సనాతన కులగణాలను నిద్రలేపేందుకు కాళీదేవి భయంకరమైన కేక పెట్టింది. తర్వాత ఘోరగర్జన జోరుతో, కాళరాత్రివలె, నా వైపుగా వచ్చినది.

39. భీమైః కరాలైర్ధరణీ వచోభిః
చచాల సిన్ధుశ్చనభో జగర్జ।
భీమైః సరోషైశ్చ విలోకనైస్తైః
బ్రహ్మాండముత్తప్తమివాగ్ని వృష్ట్యా॥

భయం కలిగించే ఉగ్రమైన ఆ పై మాటలకు భూమి, సముద్రము కంపించినాయి. ఆమె క్రోధభరితమైన ఎర్రని నేత్రాలు అగ్నివృష్టిలా సృష్టిని ఉడుకెత్తించినవి.

40. త్రైలోక్యమున్మాదకరైః కరాల్యా
ఆవాహనైః పూర్ణమభూచ్చ సర్వమ్
జ్వాలాముఖీ దారుణ వహ్నిగర్భా
కంఠాదుదక్రామదజస్రశబ్దా॥

కాళికాదేవి ఉన్మత్త పిలుపులతో ముల్లోకాలు నిండిపోయినాయి. దారుణ అగ్నిపర్వతంలోంచి వచ్చే లావావలె కంఠం నుంచి అక్షయమైన శబ్దాలు ఉత్పన్నమైనవి.

41. క్షోభేణ తీవ్రేణ చరాచరస్య
క్షుబ్ధాన్యపశ్యం పృతనాని తత్ర।
స్వప్నో ధ్థితానీవ వచః సురౌద్రం
భో హాన్యతాం దుష్ట ఇతీరయన్తి॥

తీవ్రమైన క్షోభకు గురియైన చరాచర ప్రపంచం అంతా మహా కోపంతో, దుష్టుణ్ణి చంపండి – అనే కేకలతో, నిద్రనుంచి మేల్కొన్నట్లుగా, సైన్యగణాలు కనిపించాయి.

42. జ్ఞాత్వా హి మాతూ రుదితం క్షతాని
విద్యుద్ధరాణ్యక్షి శతా న్య భూవన్।
క్రోధైః సహస్రాణి తతో ముఖాని
భీమాని భీమం దనుజేశ మాయన్॥

అమ్మకు కలిగిన దుఃఖాన్ని, తగిలిన గాయాల్ని, తెలుసుకున్న వందల నేత్రాలలో మెఱుపులు దూసుకుపోయాయి. వేలాది ముఖాలనుండి భయంకర రాక్షసపతిపై క్రోధాగ్ని ప్రజ్వరిల్లింది.

43. సుప్తేషు పుత్రేషు రణోత్సుకేషు
నిశాచరః శోణితమార్య మాతుః।
పిబన్ వినర్దస్య బలాన్ బలీ కో
విహంసి చాండాల కృతాన్తభక్ష్య॥

రణోత్సాహులైన ఆమె పుత్రులు నిద్రిస్తూ వుండగా – ఆర్యజనని రక్తాన్ని రాక్షసునిలా త్రాగిన నీవెవడవయ్యా? దుర్బలులను అణగద్రొక్కి వారిని మృత్యువుకు ఆహారంగా అర్పిస్తున్న దుర్మార్గుడవెవరివయ్యా నీవు?

44. ఇతీరయన్తీ వచనాని రుష్టా
శస్త్రం గృహీత్వా ధనురగ్నిగర్భమ్।
అభ్యద్రవద్ భీమమరాతి ముగ్రా
పశ్చాత్ పురస్తాచ్చ జగర్జ కాలీ॥

ఈ మాటలంటూనే ఆ భయంకరదేవత తన ఆయుధాన్ని అగ్ని జ్వలించే ధనస్సును ఎక్కుపెట్టి శత్రువుపైకి వెళ్లింది. ఆమెకు ముందు, వెనుక కాళి గర్జించింది.

45. జ్వాలాకరాలా ధరణీ బభూవ
క్రోధైర్జ్వల ద్భిర్గగనంచతూర్తైః।
హ్రేషార వైర్దుందుభి ఘోరనాదై
ర్త్రస్తా ధరాభూ ద్దనుజస్య యుద్ధే॥

కాళి, ఆ రాక్షసునితో పోరాడే సమయంలో, భూమి, ఆకాశం అగ్ని జ్వాలలతో నిండి, అశ్వఘోషతో, దుందిభి ధ్వనులతో విశ్వం భయంకరంగా మారింది.

46. రక్తాక్తమేఘా నభసీవ తేపుః
పపాత చోర్వ్యాం రుధిరోగ్ర వృష్టిః।
రక్తోదధౌ రే జురథాద్రిసంఘాః
వసుంధరా రక్తమయీ బభాసే॥

రక్తసిక్తాలైన మేఘాలతో ఆకాశం మండుతోన్నట్లుగా ఉంది. భూమి మీద భయంకరమైన రక్తవర్షం కురిసింది. రక్తసముద్రం లోంచి లేచాయి పర్వతాలు. సమస్త భూతలం రక్తమయమైంది.

47. భీమో రజున్యామసురో బలీయాన్
మమర్ద సైన్యాని సురప్రియాణామ్।
జగర్జ చోన్మత్తమనాః సురారిః
కోమే సమః పుంస్వితి రూఢగర్వః॥

భీమబలుడైన ఆ రాక్షసుడు రాత్రి బలీయుడుగా దేవతలకు ప్రియమైన ప్రజలపై భయంకరంగా విరుచుకుపడ్డాడు. గర్వోన్మత్తుడైన, ఆ దేవతలకి శత్రువు, – మనుష్యజాతిలో నాతో సమానమైన వాడెవ్వడు? అని గర్జించాడు.

48. తదా తమిస్రామపసారయంతం
రక్తప్రకాశం దివి బాలసూర్యమ్।
శరోపమై ర్భిన్నమివాంశుభిస్తం
ప్రీతో దదర్శాహ ముదగ్ర రశ్మిమ్॥

అంతలో అంధకారాన్ని పారద్రోలే అరుణోదయాన్ని, బాణాల్లాంటి కిరణాలు చీకటిని చీలుస్తూ ఉంటే సహస్రకిరణాలు చూసి పులకాంకితుడనయాను.

49. సమాకులం భావి భిరాస్య వర్యై
ర్బ్రహ్మణ మద్రాక్షమథాభ్రరూపమ్।
సహస్ర మక్షీణి దదర్శ తస్మిన్
ప్రతీక్షమాణాన్య భయం జనన్యాః॥

కాంతివంతమైన భవితను కప్పే మేఘరూపంలో సృష్టికర్త, బ్రహ్మను భావించేను. అందులో వేలనేత్రాలతో భయాన్ని పోగొట్టే జననిని దర్శించగలిగేను.

50. ద్వికోటి భాస్వద్వర సూర్యభాసం
జ్యోతిస్తదా సౌమ్యమరాతినాశి।
నారీశరీరం రమణీయకాన్తి
దూరాదుదీచ్యాముదియాయ శుభ్రమ్॥

తూర్పుదిశలో – దూరంగా – మనోహరకాంతి రూపంగా స్వచ్ఛమైన సౌమ్యమైన రెండు కోట్ల సూర్యసమాన తేజస్సుతో శత్రునాశి రూపంలో ఓ దివ్యస్త్రీమూర్తి దర్శనమయింది.

51. తాం ప్రోదితా దీప్త జగత్సు దేవా
స్తామంత రీక్షే మధురం మయాంసి।
జగుర్మనుష్యాః ప్రణిపత్య చోర్వ్యాం
విశ్వం నినష్టాధి యదావివేశ॥

వేదనను పోగొట్టేందుకు విశ్వంలో ఆ మూర్తి ఆవిర్భవించిన వెంటనే దేవతలు ఆమెను కీర్తించారు. పక్షులు మధుర కిలకిలా

రావాలతో పొగిడాయి. మానవులు, ఆమె స్తుతిగానాలతో, సాష్టాం గపడ్డారు.

52. సమాధి ధీరా హిమభూత దేహో
యుగాన్యనేకాని, హిమాద్రికూటే।
యే యోగినో భారతగోప్త్రు రూపా
స్తే తుష్టువుస్తాం ముదితా మహాన్తః॥

హిమవత్పర్వత శిఖరాలపై యుగయుగాలుగా సమాధిస్థితిలో వుండి – తమ శరీరాలు సైతం మంచురూపంగా మారినప్పటికీ – భారతదేశ వైభవాన్ని పరిరక్షిస్తున్న యోగులందరూ ఆమెను సహర్షంగా స్తుతించారు.

53. జ్ఞానా కరేభ్యో హి విలోచనే భ్యో
హిమాని మన్నం యుగ సంచితాని।
ఉత్సార్య దేవీమథ భీమకాన్తిం
మహాప్రతాపా బలినీమగాయన్॥

యుగాల తరబడి మంచు కప్పబడిన తమ అనంతజ్ఞానోపేతమైన నేత్రాలను నెమ్మదిగా తెరిచి ఆ యోగులు అద్భుతకాంతివంతమైన పరాక్రమోపేతమైన ఆమెను ఇలా కీర్తించారు.

54. తుభ్యం నమోదేవి విశాలశక్త్యై
నమామి భీమాం బలినీం కృపాలుమ్।
త్వమేవ వై తారయసీహ జాతీ
రూర్జస్వలాయై నమ ఆదిదేవ్యై॥

సర్వశక్తి సమన్వితమైన ఓ దేవీ! నమస్తే. బలినీ, బయంకరీ, దయాస్వరూపీ ప్రణామములు. ఈ ప్రజలను కాపాడగల శక్తివి నీవు మాత్రమే. మహాపరాక్రమోపేతా ఆదిశక్తీ, నమస్కారమమ్మా!

55. కస్తేబలం వర్ణయితుం సమర్థో
దేవి ప్రచండే కరపల్లవేన।

ఏకేన హి భ్రామయసే రుణత్సి
విశ్వం సతారార్కమనన్త వీర్యే॥

అనంతసాహసరూపిణీ! నీ మాహాత్మ్యాన్ని ఎవరు వర్ణించగలరు! సూర్యనక్షత్రాలతో సహా ఈ విశ్వాన్ని పల్లవ సదృశ హస్తంతో నడిపించగలవు, ఆపు చేయగలవు. ఓ అనంతస్వరూపిణీ! (నమోస్తు.)

56. ఆజౌ యదా నృత్యసి చండి ఘోరే
శృగాల ఘుష్టే దధతీ త్రిశూలమ్।
స్పర్శేన కంపంత ఇవా యుధస్య
మాహాన్తి తారా నియుతాని నాకే॥

నక్కల అరుపులతో ఘోరమైన యుద్ధరంగంలో త్రిశూలాన్ని త్రిప్పుతూ నాట్యం చేస్తూంటే, ఓ చండీ! దాని తాకిడికి, ఆకాశాన అనంత నక్షత్ర సముదాయాలన్నీ కంపిస్తున్నాయి.

57. దయార్ద్ర చిత్తా రుదితేన పుంసాం
హంసి ప్రజాపీడక మస్తకేషు।
యో మృత్యు రత్తా భువనస్య రౌద్రః
స కింకరాస్తే వసతి త్రిశూలే॥

దుఃఖార్తులైన ప్రజల ఆక్రందనలకు కరగిపోయే నీవు, ప్రజాకంటకులైన తలలను ఖండిస్తావు. విశ్వాన్ని మింగే అతిభయంకరమైన మృత్యువు నీ సేవకుడమ్మా! అతడు నీ త్రిశూల మొనపైనే నిలిచి ఉంటాడు.

58. శక్తిః పరా కోటిమ మానవానాం
మన్యుశ్రితానాం భవసి ప్రబుద్ధా।
ఆర్యాన్ విపన్నానవతీర్యపాసి
యుగే యుగే యుధ్యస ఆర్యమాతః॥

ఓ ఆర్యమాతా! కోట్లాది మానవులలో ఉద్రేకాన్ని రెచ్చగొట్టగల పరాశక్తివి నీవే! ప్రజలు కష్టాలలో ఉన్నపుడు యుగయుగాలుగా యుద్ధోన్ముఖివై వాళ్లను ఉద్ధరిస్తున్న అవతారమూర్తివి.

59. సద్యోపి పశ్యామి గిరావుదీచ్యాం
దేదీప్యమానం ధవలం వపుస్తే।
త్వం భ్రాజసే జ్యోతిరుదేషి సౌమ్యే
ప్రకాశయన్తీ భువనాని కాంత్యా॥

ఉత్తరదిశ పర్వతాలపై కళ్లు మిరుమిట్లు గొల్పుతూ ప్రకాశించే ధవళమూర్తిని మళ్లీ ఈనాడు చూస్తున్నాను. ఓ సౌమ్యురాలా! తేజోభరితమైన నీ కాంతితో దేదీప్యమానంగా విశ్వాన్ని సౌందర్యవంతం చేస్తున్నావు.

60. ధే నౌ సమారూఢ మనోజ్ఞ కాంతీ
రణోన్మదాయాం చరసీయ మార్యా
శైలా ఇవోత్తుంగశిఖాః సమూలాః
పతన్తి సంఘాః పరితో సురాణామ్॥

ఓ మనోజ్ఞకాంతిమయీ! నీవు ధేనువుపై కూర్చుని రణోత్సాహంతో కలయ తిరుగుతూ ఉంటే, అసురసంఘాలన్నీ నీ చుట్టూ, పర్వత శిఖరాలు సమూలంగా కూలుతున్నట్లు పడిపోతున్నాయి.

61. సా శుభ్ర వర్ణాసిత వృత్తశృంగా
హిమస్య రాశిశ్చలతీవ తూర్ణమ్।
దేవప్రియా భారత భూమి రార్యా
ధేనుస్వరూపేణ విహన్తి శత్రూన్॥

నల్లని వృత్తాకార కొమ్ములతో, మంచుముద్దలా తెల్లగా ధేను రూపంలో శత్రువులను అణగద్రొక్కుతోంది. అదే దేవతలకి ప్రియమైన భారతభూమి.

62. వ్యూహాస్త్వకస్మాజ్జిత దైవతానాం
భయేనతే పాండురకాంతి వక్త్రాః।
వారి ప్రపాతా ఇవ పర్వతేభ్యో
ధావన్త్యధో వేగ పరాః సశబ్దాః॥

దేవతలను జయించిన అసురగణాలు – భయంవల్ల పాలిపోయిన ముఖాలతో – పర్వతాల నుండి జారిపడు జలపాతాల్లా అరుస్తూ వేగంగా పరిగెడుతూ పారిపోతున్నాయి.

63. శృణోమితే పంచనదేమ భీమే
స్వరానుదారాంజయ నాద ముగ్రమ్।
నిహన్య మానస్య రవం బలస్య
భయంకరే తారతరం శృణోమి॥

భయంకరమైన ఓ దేవతా! ఉదాత్త భయంకర, నీ జయధ్వానాలు పంజాబు ప్రజల్లో ప్రతిధ్వనిస్తూ ఉంటే విన్నాను. అలాగే, ఓ భయంకరీ, శత్రువులను నీవు సంహారిస్తూ ఉంటే, వారి గగ్గోలు కూడా మరింత గట్టిగా వినిపిస్తున్నది.

64. కృష్ణస్య సైషా యమునా స్రవన్తీ
రక్తేన నీలం విససర్జ వర్ణమ్।
బంగేష్వసృక్కర్దమమేవ పశ్య
దిగ్దక్షిణా భాతి సులోహితేవ॥

కృష్ణుని, ఆ యమునా నది తన నీలవర్ణాన్ని విడిచి రక్తవర్ణంగా మారింది. చూడు! వంగభూమి అంతా రక్తసిక్తమైన బురదగా మారితే, దక్షిణభారతమంతా రక్తవర్ణంతో మెరిసిపోతోంది.

65. స్పృష్టా స్త్రి శూలేన విహాయ సీమాః
సులోహితా భాన్తి దిశః సమన్తాత్।
అభ్రాణితే రక్తమయాని భీమే
బిభన్తి యుద్ధేన సుదారుణేన॥

నీ త్రిశూలస్పర్శతో ఆకాశమంతా రక్తమయమైనట్లు ఎఱ్ఱని కాంతి చిమ్ముతోంది. నీ యుద్ధప్రతాపానికి, మేఘాలు నీరదాలుగా కాక, రుధిరవాహికలుగా మారినై.

66. సిన్ధోస్తటే మాపల కర్కశేమ
దేవీమపశ్యం యుధి శేషితారీన్।
నిః శేషయన్తీమదయాం సకోపాం
శివాం త్రిశూలేన శివస్య శత్రూన్॥

కర్కశ శిలలతో నిండిన సింధునదీతీరంలో మిగిలిన శత్రువులను నాశనం చేయడం చూసేను. క్రోధంతో నిర్దయతో తన త్రిశూలంతో ప్రభువైన శివుని శత్రువుల నందరినీ సంహరిస్తోంది.

67. ఖురైః సునిష్పిష్ట మిదం సురభ్యా
ఘోరం కిమేవాపి సుకృష్ణవర్ణమ్।
మాంసస్య పిండిం హ్యావనౌ నిరీక్షే
శేషో య మత్స్యేవ తవాహి తానామ్॥

ఏమిది! దేవతాధేనువుయొక్క డెక్కలచే అణగద్రొక్కబడి నల్లగా భయంకరంగా ఉన్నదేమిటి! ఓ! భూమిమీద పడి ఉన్న విరోధి గణానికి చెందిన మాంసపు ముద్ద! అదే కదా మిగిలినది!

68. భగ్నాని తస్మిన్నిచయే విరూపే
ప్రానిః సరన్తీవ శిరాంసి కాని।
పాదాః కరాశ్చాపి హి తత్రతత్ర
క్రూరాసి రుద్రాణి కరాల కృత్యా॥

ఓ రుద్రాణీ! క్రూరమైన నీ కరాల నృత్యంతో వికృతరూపులై నీ శత్రుసమూహమంతా, తలలు, కాళ్లు, చేతులు తెగి, చెల్లాచెదరై పడి ఉన్నారు.

69. క్రూరాసి రుద్రాణ్యథవా జఘన్యే
క్రూరే ప్రజాపీడన రూఢ గర్వే।

దయేవ భూతేయమలం యదార్యం
స్వర్గప్రదం మృత్యుమవాప యుద్దే॥

ఓ రూద్రాణీ! నీవు క్రూరురాలవా – లేక ప్రజలను బాధించిన శత్రువులకు యుద్ధరంగంలో వీరమరణాన్ని ప్రసాదించి, స్వర్గానికి పంపడం కోసం చూపించిన కరుణా అది!

70. ఏకో గతా సోఽరపి రుద్ర శత్రో
ర్థత్తే కరః పావక గర్భమస్త్రమ్
ప్ల ష్టశ్చ చీర్ణశ్చ తథాపి దగ్ధాన్
అసూన్ భవాన్యాం క్షిపతీవ దైత్యః॥

రుద్రునియొక్క శత్రువు నశించినప్పటికీ, ఆతని చేతిలో మాత్రం నిప్పులు క్రక్కే శస్త్రం ఉంది. అది నల్లబారి ఛిన్నాభిన్నమైనప్పటికీ ఇంకా శత్రురాక్షసుడు భవానీ మీదకి తనయొక్క మండే శస్త్రాన్ని ప్రయోగిస్తున్నట్లుగా ఉంది.

71. స్రోతాంసి పశ్యామి మహోయుధాస్యాత్
ఉద్గీర్య మాణాని హుతా శనస్య।
ధృష్టోప్యసౌ నాలభతే తు చండీం
తిష్ఠన్ ప్రభామండల మూర్తి మగ్నే॥

ఆ మహా ఆయుధం నుండి అగ్నిజ్వాలలు క్రక్కుతూన్నట్లు చూస్తున్నాను. కానీ – ఎంత అహంకారగర్వితుడైనా వాడు ఆమె ముందే పడి ఉండటంవల్ల ప్రభామండలమూర్తిగా విరాజిల్లే చండీమూర్తిని చేరలేడు.

72. ప్రక్షిప్త ఖడ్గస్తు విషాణ మధ్యే
విష్టంభయత్యన్తిమ చేష్టితం తత్।
సమాప్తమేతత్తవ తర్కయామి
మహోవ్రతం దేవి విశాలవీర్యే॥

ఓ అనంతశక్తిస్వరూపిణీ దేవీ! నీ ఖడ్గప్రహారానికి (ఆ రాక్షసుని) కొమ్ములు రెండూ మధ్యగా చీలిపోవడంతో, వాని అంతిమ ప్రయాస విఫలమై, నీ మహావ్రతము నెరవేరినట్లు అయినదమ్మా!

73. తుభ్యం నమో దేవీ విశాల శక్త్యై
భీమవ్రతే తారిణి కష్టసాధ్యే।
త్వం భారతీ రాజసి భారతానాం
త్వమీశ్వరీ భాసి చరాచరస్య॥

ఓ విశాల శక్తిమతీ! నీకు ప్రణామములు. కఠోర వ్రతధారిణివి.. కష్టాల నుంచి గట్టెక్కించేదానివి. భారతీయులను పాలించే భారతీ! చరాచర ప్రపంచానికీ నీవే ఈశ్వరివి.

74. త్వమీశ్వరీ త్వం జననీ ప్రజానాం
కోన్యః ప్రభుర్దాన మిదం తావాడ్యే।
స్వామిత్వమైశ్వర్య మనిన్ద్య తేజో
దదాసి యా సాపి నిహంసి రుష్టా॥

నీవే పరదేవతవు. ప్రజలకు తల్లివి నీవే. నీకన్న శక్తికలవారెవ్వరు? అధికార, ఐశ్వర్య, యశస్సులను ప్రసాదించేది నీవే. ఓ భాగ్యదేవతా! ఎవరి మీద కోపిస్తావో వారిని దండించేదీ నీవే!

75. నమో నమో వాహనమేత దార్యే
హిమాభకాన్తం మధురాయతాక్షి।
తల్లాంగులాగ్రేణ సుకృష్ణభాసా
ధ్వజం కరోతీవ తవోచ్ఛ్రితేన॥

సుందరవిశాల నేత్రా! నమో నమః. మంచులా తెల్లనిది నీ వాహనం. పైకెత్తిన దాని నల్లని కుచ్చులతోక నీ కీర్తి పతాకలా ఒప్పింది.

76. నమో నమో దేవి తవాల కాలీ
రణశ్రమేణ ప్రసభం విముక్తా।

ఉడ్డీయమానా నభసీవ మేఘో
వేణిచ్యుతా భాతి సుదీర్ఘ వక్రా॥
నమస్తే, దేవీ, నమస్తే! యుద్ధంలో శ్రమించడంవల్ల విడివడిన నీ నల్లని కేశపాశం గాలిలో ఎగురుతూ, ఆకాశంలో నల్లని మేఘంలా ప్రకాశిస్తోంది.

77. శ్వేతాననే విద్యుదివాసిభూమౌ
రూషాప్రదీప్తే హి విలోచనే తే।
క్రీడన్త్యపాంగేషు కరాలహాసాః
శతహ్రాదేవ స్తనయిత్ను మధ్యే॥
ఓ తెల్లని ముఖము కలదానా! ఎఱ్ఱని నీ నేత్రాల మెరుపు చారలు భూమికి దిగినట్లున్నాయి. నీ నేత్రాంచలాల భయంకరమైన నీ హాసం మెరుపుల మధ్య మేఘగర్జనలా ఉంది.

78. ద్రష్టుం రిపూంస్తాన్ పతితాన్ గతాసూన్
గ్రీవేయమీషన్నమితా చ శుక్లా।
సజానువర్యం చరణం భవాన్యాః
స్తంభో హిమస్యేవ విభాతి శుభ్రమ్॥
నిర్జీవుడై పడివున్న నీ శత్రువులను చూడటానికి నీ తెల్లని మెడ కొంచెం వంగింది. భవాని! నీ యొక్క తెల్లని కాళ్లు – పాదాలనుండి అందమైన మోకాలి వరకు – తెల్లటి మంచుస్తంభాలవలె ప్రకాశిస్తున్నాయి.

79. శుక్లం ప్రవాతైః రనిలోప మంతే
సంక్షోభితం భాసురతోయధాభమ్।
వాతీవ వాసో రుచిరాణి మధ్యే
రాజన్తి తేంగాని శశిప్రభేవ॥
గాలికి రెపరెప లాడుతున్న నీ తెల్లని వస్త్రం దేదీప్యమై ప్రకాశిస్తున్న మేఘం కాగా, అందుండి మెరిసే నీ అవయవాలు, వెన్నెల వెలుగులు చిందుస్తూ, ప్రకాశిస్తున్నాయి.

80. ఉదీర్ణఫేనః పయసన్తరంగః
క్షీరాబ్ధి మధ్యే స్తన ఏక ఏషః।
త్వం దుర్నిరీక్ష్యాసి యదంగకాన్తే-
స్త్విష్షాక్షి మాతః ప్రతిహన్యతే మే॥

అమ్మా! నీ వక్షస్థలం పాలసముద్ర కెరటాల నురగలా ప్రకాశి స్తోంది. దుర్నిరీక్షమైన నీ శరీరకాంతిని దర్శించలేక కనురెప్పలు వాలిపోతున్నాయి.

81. సనాతనీ దేవి శివస్య పూర్వం
వపుస్త్విదం ధారయసే యువత్యాః।
తుభ్యం నమోస్తుభ్యమనాది మాతః
సౌమ్యా భవాంబ ప్రణతేమ భీమే॥

శివునికి పూర్వమే యువతీ రూపాన్ని ధరించిన ఓ సనాతనీ ఓ అనాది మాతా, నీకు నమస్కారం. ఉగ్రరూపిణీ! నీకు మోకరి ల్లినవారిని సౌమ్యరాలవై (అనుగ్రహించు తల్లీ!)

82. ఉద్దిశ్య భూమిం ద్రుమరాజినీలాం
శైలాన్తరాలేమ మహత్సు దృశ్యామ్।
కారుణ్య మయ్యాః ప్రసృతః కరస్తే
దదాసి రుద్రాణ్య భయం ప్రజానామ్॥

వృక్షపంక్తితో లీనమై ఉన్న పర్వతాల మధ్య భాగాల భూమిని దర్శనీయంగా నీ హస్తాన్ని చాచుతూ, ఓ దయాంతరంగా, రుద్రాణీ! ప్రజల భయం పోగొట్టి అభయము ఈయవమ్మా!

83. తత్సంజ్ఞయా తే కరపల్లవ స్య
తమో విధూతం భువి భారతానామ్।
రక్తస్య మేఘా నభసోపధూతా
అచిన్త్య వీర్యాసి శుభాని సౌమ్యా॥

ఆ విధంగా చూచిన నీ పల్లవ సుకుమార హస్తసంకేతంతో భారతా వనిలోని చీకటి అంతా తరిమివేయబడింది. ఆకాశంలోని రక్తవర్ణ

మేఘాలన్నీ కనుమరుగైపోయాయి. నీ వీర, సుందర, సౌమ్యమైన శక్తి అనూహ్యాము.

84. సౌమ్యం వపుస్తే హిమవర్ణమార్యం
సౌమ్యం భవాన్యా వదనం హ్యుదారమ్।
శుక్లాంబరాం యౌవన శుభ్రకాన్తిం
స్నేహార్ద్ర నేత్రాం బలినీం నమామి॥

దాయాపూరకము, సౌమ్యము, ధవళవర్ణంతో ప్రకాసించే శరీరము నీది. ఉదారము, ఆహ్లోదకరము అయిన ముఖము నీది. స్వచ్ఛ యౌవ్వన కాంతితో, తెల్లటి వస్త్రధారణతో, స్నేహార్ద్ర నయనాలతో, బలశాలినిగా ఉన్న దేవీ! నీకు ప్రణామము.

85. నరాస్థిమాలా, నృకపాల కాంచీ
క్వసా కరాలీ క్షుధితాచ కాలీ
నగ్నా చ ఘోరో విదృతాస్య భీమా
యస్యా విరావైః సహసోద్ధితో స్మి॥

నరుల ఎముకలమాలతో, మానవ పుఱ్ఱెలను నడుము చుట్టుకొని ఆకలితో, నగ్నంగా, భయంకరంగా నోరు చాచిన, ఎవ్వరి భయం కర అరుపులతో మేల్కొన్నానో, ఆ భయంకరమూర్తి ఏదీ? ఎక్కడ?

86. రక్తస్య యోయం వహతీహ సిన్ధు
శ్ఛాయా శుభాయా హసతీవ తస్మిన్।
ఖడ్గం పరిభ్రామయతి స్తనన్తీ
నగ్నా సుఘోరా చ నమామి కాలీమ్॥

ఆ రక్తవాహినిలో, ఆ సుందరమూర్తి ఛాయ, అక్కడక్కడ నవ్వు తున్నట్లుగా, కత్తి ఝుళిపిస్తూ, మెరిపిస్తూ, నగ్నంగా భయంకరంగా ఉన్న, ఓ కాళీ, నీకు మోకరిల్లుతున్నాను.

87. కాలీ త్వమేవాసి సునిష్ఠురాసి
త్వమన్నపూర్ణా సదయా చ సౌమ్యా

నమామి రౌద్రాం భువనాన్త కార్త్రీ
ప్రేమాకులామేవ నమామి రాధే॥

నీవే కాళివి. అతి నిష్ఠురమైనదానివి. దయాళువు, సౌమ్యురాలు అయిన అన్నపూర్ణవూ నీవే! ప్రపంచములను అంతం చేసే ఓ రౌద్రమూర్తీ! నీకు నమస్కారము. ప్రేమతోపరవశమైన ఓ రాధా! నమ స్కారము.

88. అనన్త శక్త్యార్ధి మశేష మూర్తిం
కో వక్ష్యతీమాం తవ సర్వశక్తే।
తేజస్త్వమేతద్బలినాం బలంచ
త్వం కోమలానామపి కోమలాసి॥

సంపూర్ణమైన అనంతశక్తివంతమైన ఓ సర్వశక్తి స్వరూపిణీ! నీ సమగ్ర శక్తిస్వరూపాన్ని ఎవరు వర్ణించగలరు! తేజోమయరూపివి నీవే. బలవంతుల బలానివీ నీవే! కోమలులలో కోమలత్వానివీ నీవే!

89. సౌమ్యామహం త్వాం ద్విభుజం నమామి
త్రిశూలినీం త్వామభయం వహన్తీమ్।
త్వామంబ సావిత్రి శుభే త్రినేత్రే
శుక్లాంగవస్త్రాం వృషరూఢకాన్తిమ్॥

రెండు భుజములతో సౌమ్యరూపిణివైన నీకు నమస్కారము. త్రిశూలాన్ని ధరించి అభయమిచ్చే నీకు నమస్కారము. ఓ సావిత్రీ, శుభప్రదాయినీ, తినేత్రీ, స్వేతవస్త్రధారిణీ, వృషభవాహినీ, అంబా నీకు నమస్కారము.

90. దశాయుధాఢ్యా దశదిశ్వ గమ్యా
పాతాసి మాతర్దశబాహురార్యాన్।
సహస్ర హస్తై రుపగుహ్యా పుత్రాన్
ఆస్సే జగద్యోని రచిన్త్య వీర్యా॥

పది బాహువులతో, పది ఆయుధాలతో దశదిశలా దుర్లభరూపివై ఆర్యులను రక్షిస్తున్న ఓ జగన్మాతా, వేల హస్తాలతో నీ బిడ్డలను చేరదీసి రక్షిస్తున్న నీ శక్తి అనూహ్యామైనది.

91. ప్రకాశయన్తీం గహనాని భాసై-
ర్భీమాం జ్వలత్పర్వత మూర్తి మగ్ర్యామ్।
పశ్యామి దేవీం నగరేషు సౌమ్యాం
ద్వారి స్థితామార్యభువః సఖడ్గామ్॥

చోరశక్యంగాని దట్టమైన అడవులను ఆమె తన కాంతులతో ప్రకాశింప చేస్తోంది. మండే పర్వతంలా ఉన్న ఆమె స్వరూపం భయంకరము, ఉన్నతము. ఆమె ఆర్యావర్త నగరద్వారాల దరి సౌమ్యమూర్తిగా చేతిలో ఖడ్గంతో ప్రకాశిస్తూ నిలిచి ఉండగా చూస్తున్నాను.

92. కాలిం దమిత్వా జననీ ప్రజానాం
సత్వాధికాపత్యకులైర్విభాతి।
స్వాధీనవృత్తీని పునశ్చరన్తి
పశ్యామి తాన్యాగమ మార్గగాణి॥

కలి (కాలాన్ని) ని దండించి సత్యగుణ సమన్వితులైన తన సంతానంతో, అమ్మలగన్న యమ్మ ప్రకాశిస్తోంది. తిరిగి వేద మార్గానుసారులై తమ స్వప్రవృత్తులతో అందరూ వర్తిస్తున్నట్లు నాకు కనబడుతోంది.

93. పునః శృణోమి మరణ్యా భూమౌ
వేదస్య ఘోషం హృదయామృతోత్సమ్।
సుజ్ఞానినామాశ్రమగా మునీనాం
కుర్యేవ పుంసాం వహతి ప్రపూర్ణా॥

హృదయాల్లో అమృతప్రవాహంలా సాగే వేదఘోషను అరణ్యాల్లో మళ్లీ వింటున్నాను. ఋష్యాశ్రమాలలో మానవ జీవనదుల జ్ఞాన ప్రవాహాల (నాదమూ వింటున్నా)

94. సనాతనాన్ రక్షతి ధర్మమార్గాన్
పునః సహస్రాంశుకులార్య జన్మా।
లక్ష్మీః పునః సాప్యచలా స్మితాస్యా
సముజ్వలా రాజతి భారతేమ॥
సూర్యవంశసంజాతుడైనవానిచే సనాతనధర్మం తిరిగి పరిరక్షింప బడుతుంది. చిరునవ్వులతో చంచలమైన లక్ష్మీదేవి కూడా భారతీయులో ప్రకాశిస్తోంది.

95. పురాతనీం మాతరమాగమానామ్
ఆగచ్ఛతాంచ స్తువతాంచ భూమిమ్।
ప్రాచ్యాం ప్రతీచ్యాం జగతోఖిలస్య
కోలాహలం వేగరవాన్శృణోమి॥
ప్రాక్పశ్చిమాలలో, ప్రపంచమంతా సనాతన వేదమాత స్తుతి కోలాహలం వింటున్నాను.

96. సద్ధర్మ గర్భేతి మహా వ్రతేతి
స్తువన్తి సౌమ్యాంచ భయంకరీంచ।
దేవ్యాః ప్రియాం భూమి మనాది శక్త్యాస్
తీర్థస్వరూపేణ చ పూజయన్తి॥
సౌమ్యస్వరూపిణిగా, భయంకరిగా, ధర్మదేవతగా (ధర్మానికి పుట్టి నిల్లు) వరప్రదాయినిగా ఆ జననిని ప్రశంసిస్తున్నారు. అనాది శక్తిస్వరూపిణిగా దేవతలకు ప్రియమైనదిగాఈ (భరత) భూమిని పుణ్యభూమిగా పూజిస్తున్నారు.

97. శివస్య కాశ్యాం నివసన్తి యేకే
స్పర్శేన తేతస్య భవన్తి ముక్తాః।
దేవ్యాస్తు పుణ్యేన పదార్పణేన
సర్వార్య భూమిర్జగ తోపి కాశీ॥

కాశీలో ఎవరైతే నివసిస్తారో వారు శివస్పర్శతో ముక్తులవుతు న్నారు. అలాగే ఈ దేవత పవిత్ర పాదస్పర్శవల్ల ఈ ఆర్యభూమి అంతా సమస్త విశ్వానికి కాశీ క్షేత్రమే.

98. ప్రీతిర్దయా ధైర్యమదమ్య శౌర్యం
శ్రద్ధా తితిక్షా వివిధాశ్చ విద్యాః।
అనన్తరూపే త్వమసి ప్రసీద
చిరం వసార్యే హృది భారతానామ్॥

ప్రేమ, దయ, ధైర్యం ఎవరికీ లొంగని పరాక్రమం, శ్రద్ధ, ఓర్పు, వైవిధ్యమైన విజ్ఞానం – ఇన్నీ నీలో ఉన్న అనంతరూపిణివి నువ్వు. భారతీయుల హృదయాల్లో చిరస్థాయిగా కొలువై ఉండి అనుగ్ర హించు తల్లీ!

99. సింధూన్ హిమాద్రిశ్చ సుసౌమ్యభాసా
ప్రకాశయన్తీ సుదృఢ ప్రతిష్ఠా।
తిష్ఠ ప్రసన్నా చిరమార్య భూమౌ
మహా ప్రతాపే జగతో హితాయ॥

నదులను, మంచుతో ఒప్పే పర్వతాలను, సుకుమారంగా ప్రకాశిం పచేస్తూ, ఓ మహాప్రతాపరూపిణీ! విశ్వశ్రేయస్సు కోసం ప్రసన్ను రాలివై చిరస్థాయిగాఈ ఆర్యభూమిలో సుస్థిరంగా ఉండిపో తల్లీ!

అనువాదం: యస్.బి.జె. గోవిందాచార్యులు,
డా॥ ఎ. గోపాలరావు

అనుబంధము:

సాధన

(శ్రీఅరవిందులతో నిరోద్‌బర్న్ ఉత్తరప్రత్యుత్తరాలు)

ప్రశ్న: శరీరశ్రమ, కృషి, సృజనాత్మకత వల్ల పొందే ఆనందాన్ని నాకు మిగల్చకుండా, పని అంటే భయంతో నన్ను కృంగతీస్తున్నాయి. ఇలా కావటానికి కారణం నేను ఒక శ్రామికుడును, సంశయాత్మకుడను కావటంవల్ల నంటారు మీరు. ఇదంతా బాగానే ఉంది, కాని, అయ్యా, మీరు సూటియైన మార్గము (Grand Trunk Road) నేదైనా ఇంతవరకూ నాకు చూపారా? (ఆ దారిని నడిపించటం మాట దేముడెరుగు!)

తిన్ననైన మార్గము చేరుకోటానికి రెండు పద్ధతులున్నాయి. ఒకటి – ఎగబ్రాకాలి. తీవ్ర ప్రయత్నంతో, కృషితో. (దేహాన్ని దైవానికి సమర్పణ కావించి, భారతదేశం నాల్గుచెరగులా పయనించే తీర్థయాత్రికుడివలె). కృషి అంటే అలా ఉండాలి. ఎప్పుడో, ఆకస్మికంగా నీకే తెలియకుండా సక్రమపంథా నందుకోలేక పోవు – మరో సంగతి – మనసును నిశ్చలపర్చుకోవాలి. ఎంతవరకంటే, మనసులోని ఉన్నత మనసు పలుక గలిగేటంతవరకు – (A greater Mind of mind can speak through it) అతిమానసం గురించి నేను ప్రస్తావించటం లేదు. రెండూ నీవు చేయవు. నీ మనసు నిశ్చలమవటానికి ఒప్పదు. ప్రాణికమేమో కృషిని సహించదు. ఒకటీ మరీ చురుకైతే, రెండోది, మరీ బద్ధకిస్టు. మరి నీకిక, నీ సహకారం లేకుండా గ్రాండు ట్రంకు రోడ్డు ఎలా చూపగలను?

*

ప్రశ్న: అయ్యా! ఈ లోకంలో – ప్రత్యేకంగా యోగప్రపంచంలో అంతా వింతగానే కనిపిస్తోంది. ఒకాయన (D.S) ఫ్రెంచిలో బాగా కృషి చేసి, వైద్యంలో కష్టపడి పనిచేసి, తాను అభివృద్ధిపొంది, హాస్పిటలును అభివృద్ధిపరుస్తూ, తద్వారా దైవాన్ని సేవిద్దామనుకున్నాడు. అది పనికి రాదాయె. (It is bad) మరీ యెక్కువ ఏకా

గ్రత, ధ్యానము మరింత చెడు (శ్రీ అరవిందులు 'తాను' అన్న మాట underline చేశారు.)

ఇక్కడ నీవొక నిజం గుర్తించటం లేదు. ఆయనా గుర్తించలేదు. తాను 'అభివృద్ధిపర్చుకోటానికి' ప్రయత్నించినది, ముఖ్యంగా యోగమార్గంలో కాదు. వ్యక్తిగతంగా ఆయన అభివృద్ధి పొంది ఉండవచ్చు. అది వేరే విషయం. స్వీయోన్నతి (self-aggrandisement) పతనము నుంచి కాపాడదు.

ప్రశ్న: మీ యోగము మీకే పరిమితము అన్న 'గ' యొక్క అభిప్రాయానికి నేను వస్తున్నాను. బహుశః ఏ కొద్దిమందికోకాని తల, తోక తెలియదు. ముందు 'తల' పై విశ్వాసం ఉంచుదాం. 'తోక' చాలమందికే వల వేసింది.

యోగం గురించిన మీ అభిప్రాయాలు అసాధారణము, అనూహ్యముగా ఉన్నాయి. నా యోగమును అర్థం చేసుకోవడం కష్టం కాదు. ఫ్రెంచి, సంస్కృతములలో తెలివైనవానిని అద్భుతమైన యోగిగా మీరు భావిస్తారు. అలాగే అయితే కలకత్తాలోని ప్రథమశ్రేణి బి.ఎ లు అందరూ మహా యోగులే అయి ఉండాలి. టీ త్రాగటం, వాగటం ద్వారా శక్తిని వృథా చేయటాన్ని నిరసిస్తే – 'ఏమి వింత గురువులు వీళ్లు. వింత భావాలతో?' అంటారు మీరు. 'పరబ్రహ్మము' నకు (as if sociability were the base of the Brahman) సంఘజీవనం ఆధారమైనట్లుగా – లేదా దానికి విరుద్ధంగా, చీకటిగదిలో తలుపులు బిడాయించుకొని, ఎవ్వరికీ కనపడకుండా, నిద్రాహారాలు లేక, పిచ్చెక్కినట్లు ఉంటే – దీనిని మేము నిరసిస్తే – "ఈ యోగాన్ని ఎవరు అర్థం చేసుకోగలరు బాబూ?" అంటారు. బుద్ధుని – అతిసర్వత్ర వర్జయేత్ – అన్న సూత్రము, కృష్ణుని – నిద్ర, ఆహారము, మితంగా ఉండాలి, ఉగ్ర తపస్సుతో ఆత్మను హింసించరాదు – అన్న ఆదేశము మీరెన్నడూ వినలేదా? ఇంకా కృష్ణుని – "యోగసాధన స్థిరంగా చెయ్యి; ధైర్యము సడలనీయకు; కర్మపరిత్యాగం చేసి అకర్మణుడవై ఉండకు; అలాగని కర్మయే నిన్ను రక్షిస్తుందనీ భావించకు; నీ కర్మలను యజ్ఞంగా, దైవాంకితంగా నిర్వహించు; కర్మలు నీవి



Seer deep-hearted

Seer deep-hearted, divine King of the secrecies,
Occult fountain of love sprung from the heart of God,
Ways thou knewest no feet ever in time had trod.
Words leaped shining, the flame-billows of wisdom's seas,
Vast in thy soul was a tide washing the coasts of heaven,
Thoughts broke burning and bare crossing the human night,
White star-scripts of the gods born from the presses of Light
Page by page to the dim children of earth were given.

Sri Aurobindo

కావు; నీ కోసమని నిర్వహింపబడుతున్నవనే భావన నీకు కావాలి. (కర్తృత్వభావన ఉండ కూడదు) భక్తి, ధ్యానము, అంకితభావంతో కూడిన కర్మలు, వీటి ద్వారా దివ్యచైతన్యాన్ని చేరుకుని, అక్కడే నివసించి ఉండు." బుద్ధుడు, కృష్ణుడు అర్థంకాని మూఢులు కారు. అయినా వారు చెప్పిన విషయాలను నొక్కి వక్కాణిస్తూంటే – "ఏమిటి, ఎప్పుడూ వినని ఈ గోల?" అని తెల్లబోయి చూస్తారు. ఆధునిక మనస్తత్వంతో, అన్నీ తెలిసి, గురువుకంటె మిన్నగా విచారణ చేయగల శిష్యులు ఉండటం వల్ల కలిగిన ఫలితము – ఇదంతా అనుకుంటాను. వీరికి యోగము యొక్క మౌలిక సూత్రాలు, వింతగా అసాధారణంగా, నిరుత్సాహంగా ఉంటాయి. కిస్మత్?

ప్రశ్న: నేనొక సున్నితము, వ్యక్తిగతము అయిన ప్రశ్న అడగటానికి పురిగొల్పబడుతున్నాను (am tempted). అది 'X' గురించి. అతిసాధారణంగానే, ఆమె తన కాలాన్ని గడుపుతూ ఉన్నా, సాధనలో మంచిస్థితిలోనే ఉన్నట్లున్నది. చాలా సంతోషంగానే, దిగులు లేకుండా ఉంటుందామె. ఆమెది చాలా మంచిసాధన అయి ఉండాలి – దిగులు లేదు ఆమెకు.

చాలా కాలంగా ఆమె తరచు ఏకాంతంగా ఉంటున్న సంగతి నువ్వు మర్చిపోయావు. ('Y' కి కోపకారణమే అయినా) ఆ కాలంలోనే ఆమె ఒక అంతరంగ జీవనాన్ని నిర్మించుకున్నది. దానిని, నిర్దేశించే బాహ్య, చలితచాలనాలలో మార్పుకి కొంత ప్రయత్నం చేసింది. బాహ్యప్రవర్తనలో వచ్చినది కాదు ఆ మార్పు. (not in the outward appearence) బాహ్యంగా, ఆమెలో వచ్చిన మార్పు ప్రస్ఫుటం కావటానికి, ఆమె ఇంకా ఎంతో చేయవలసినది ఉంది. కాని ఆమె సంకల్పంలో చిత్తశుద్ధి ఉంది. ప్రాథమికమైన ప్రశాంతతని స్థిరపర్చుకోగలిగినది. అందుకే ఆమెకు దిగులు లేదు – 'Y' తో ఆమెకు తగాదాలు పడుతున్నప్పుడు కొంత అస్థిమితం కలిగినా కూడా, రెండు రోజుల క్రితం, ఊర్ధ్వగమన అనుభూతి, విశాల ప్రశాంతతత, భౌతిక ఇంద్రియాతీత దివ్యానందము, మూలాధార అవరోహణ ఆమెకు అనుభవమై

నాయి. వీటి తాలూకు సాంకేతిక పదజాలం ఆమెకు తెలియదు. కాని పూర్తి వివరాలతో నిర్దుష్టమైన ఆమెయొక్క సూక్ష్మవివరణ పొరపాటుకు అవకాశం లేనిది. ఇలాటి అనుభూతియే ఈ మధ్య ముగ్గురు – నల్గురికి – కలిగినది. ఇది చాలా గొప్ప సంగతి. ఇక్కడ దివ్యశక్తి పనిచేస్తున్న తీరు విఫలం కాలేదు అని మనం భావించాలి. సుస్థిరమైతే ఇది సంప్రదాయ యోగాలకి మకుటాయమానమైనది. మనకైతే ఇది ఆధ్యాత్మిక రూపాంతరీకరణమునకు ప్రారంభము మాత్రమే. వ్యక్తిగతమైనా నీకిది చెప్పాను. ఎందుకంటే? ఒక వ్యక్తి తన స్వభావరీత్యా, బాహ్యంగా పొరపాట్లు, అవాంతరాలతో యోగి కానట్లుగా కనపడినా, అతను సాధకుడు కాదని కాని, సాధన చేయుటంలేదని కాని, అనుకోవటానికి వీలు లేదు. అందుకే ఇది నీకు చెప్పాను.

ప్రశ్న: దీని రహస్యం ఏమిటో తెలుసుకోవాలని ఉంది. ఎల్లప్పుడూ ఆమె శ్రీమాతను భావిస్తూ ఉన్నదా? మాత అంటే ఆమెకి ఎక్కువ ప్రేమ అనుకుంటాను. అదేనా రహశ్యం?

కొంతవరకు – తగిన రీతిలో సాధనను పట్టుపట్టి స్థిరపర్చుకుని, ఆచరణలో పెట్టింది. కాబట్టి తీవ్రమైన స్వాభావిక ప్రతిబంధకాలు ఉన్నా ఆమె నిలద్రొక్కుకుంది. 'Y' అలా చేయలేకపోయాడు. తన సందేహాలు, తిరస్కారము, బుద్ధిపరమైన గర్వము వీటి వల్ల.

చాలావరకు, ఆమెవలె కాలక్షేపము చేస్తూ ఉంటే, పురోగతికి, అది సరిపోతుందా?

ఆమె అలానే కాలక్షేపం చేస్తోంది. అలా ఉంటూనే తన అంతరంగస్థితి, సాధన భద్రంగా కాపాడుకోగల్గింది. ఆమె చెప్పేది కూడా అదే మరి.

*

ప్రశ్న: నా మానసిక పెనుగులాటే నాకు అవరోధం అంటారు మీరు.

నీ కవితాధారకు అవరోధం నీ మనసే. అంతే కాదు. లోతైన విస్తారమైన గొప్ప వాస్తవిక శాంతి, ఆనందాలకీ అది

అవరోధమే అయింది. విశాల భూమికల వైపుగా మరలింపబడే నిశ్చలమనసు నీకు కావాలి.

*

ప్రశ్న: అది సరే కాని – మీరు నా మనస్తత్వాన్ని తెలుసుకు న్నారా? తెలుసుకుంటే కొన్ని సమాధానాలు ఇస్తారా? అవి మార్మికమైనవిగా కాక, మానసికమైనవిగా ఉండాలి.

ఒక వాస్తవం తెలుసుకుంటే అర్థం చేసుకోవటం సులువే. సహజంగా జీవుడు ఏకరూపం కాదు. వివిధ భాగాల కలగలుపు. నీ మానసిక ప్రాణికాలలో ఒక భాగానికి దైవం కావాలి. ఆ అవ సరం ప్రస్ఫుటంగా ఉంది. కాని అందుకు తీవ్రప్రయత్నం లేదు. మరొక భాగము దేనినీ నమ్మదు, ఆశించదు. మనసులో ఒక భాగం కవిత్వాన్ని ఆశ్రయిస్తుంది. కాని అందుకు ప్రాణికం, ఉత్సాహం చూపదు. కారణం – ప్రాణికం దుఃఖాక్రాంతుని చేత (the Man of Sorrows) చుట్టుముట్టబడినది. ఈ దుఃఖాక్రాంతుడు అన్నిటా కలగలుపై ఉంటాడు. మనసులోని వివిధభాగాలు రక రకాలుగా తిరుగాడుతూ వివిధశక్తుల ఒత్తిళ్లకు లొంగి ఉంటూ ఉంటాయి. ఈ వైరుధ్యాలన్నిటినీ సామరస్యపరచటానికి – తొలగించవల్సిన వాటిని తొలగించటానికి, మార్పు చేయవల్సిన వాటిని మార్చటానికి – కేంద్రజీవుని దృఢసంకల్పం కొరవడింది. నా యీ సమాధానాలు మార్మికమో, మానసికమో – నీ వేమం టావో తెలియదు. మరింతకి మించి వేరే నిజమైనది నేను చెప్ప లేను.

ప్రశ్న: కేంద్రజీవుని (the central being) తీవ్రప్రయత్నము, సామరస్యము. సంకల్పము – నేను వీటినెలా వికసింపచేసుకో వాలి? ప్రాణికంలో, కవిత్వంపట్ల ఉత్సాహాన్నెలా మేల్కొల్పాలి? పనిచేసే దేదైనా ఏకైక సూత్రము – సర్వరోగనివారిణి లాటిది – ఉంటే ఎంతో బాగుంటుంది.

సర్వరోగ నివారిణి లాటివి కావు కాని, వివిధ సుత్రాలు ఉన్నాయి. మొదట నీవు నీ (central being) కేంద్రజీవునితో సంసర్గం కలిగి ఉండాలి. కార్యోన్ముఖుని గావించాలి. కేంద్రము

చైత్యపురుష the Psychic కావచ్చు. మనోపురుష (the mental Purusha) కి ఉన్నతంగా, దాని ప్రతినిధిగా జీవాత్మ (self) కావచ్చు. ఈ రెండింటిలో ఏ ఒక్కటి అయినా క్రియాశీలమైనపుడు సమరసభావం మొదలగు వాటిని నెలకొల్పగలవు.

రెండో పద్ధతి: మానసిక ఇచ్ఛ (mental will) ఈ విషయాలలో పనిచేయటం. లక్ష్యం నుంచి దృష్టిని మరల్చకూడదు. కష్టాలకి, ఆటంకాలకి బెదరకూడదు. అవసరమైనపుడు శ్రీమాతను ఆవహానం చేసుకోవాలి. దృఢసంకల్పంతో ముందుకు సాగాలి. ఇలా ఇంకా ఉన్నాయి. ఇప్పటికివి చాలు.

ప్రశ్న: కేంద్రజీవునితో సంసర్గం ఎలా కలిగి ఉండి కార్యాచరణ కావించాలో చెప్పారు కాదు.

ఎలాగ – అనేది కాదు. నిర్ణయించుకుని, పనిచేయడమే.

ప్రశ్న: నా మానసిక ఇచ్ఛ (mental will) నీరసమైనది.

దానిని బలోపేతం చేయవచ్చు.

శ్రీమాత శక్తి ఆవహానానికి ప్రయత్నం చేయగలను కాని, విశ్వాసానికి, అర్పణకు యోగపరమైన అద్భుత నిశ్చలమనస్సు, శక్తి కావాలి. ఇవి పుట్టుకతోనే యోగులైవ వారిక మాత్రమే సాధ్యం అనుకుంటాను.

అలా ఎన్నటికీ కాదు. యోగపరమైన నిశ్చలమనస్కత, శక్తి, ఆత్మవిశ్వాసాన్ని కలుగుచేస్తాయి. విశ్వాసము, అర్పణకంటె కూడా సాధారణ జనులకు విశ్వాసము, అర్పణ సులువు.

ప్రశ్న: నా జలుబు నాకు వెంటనే జ్ఞానోదయం కలిగించింది – ఈ ప్రపంచం అంతా – దైవముతో సహా – 'మాయే' అని. శంకరుడు, బుద్ధుడు సాధించినది, నేను simple cold తో సాధించాను.

అందుకు సాధన అక్కర్లేదు. ఏపాటి నిరుత్సాహమైనా ఆ పని చేస్తుంది. 'మాయ' నుంచి బయటపడటానికి సాధన కావాలి.

ప్రశ్న: నేను మరి కాలక్షేపం చేయాలి – ఎలా? వేదనని భరిస్తూ, పునరుజ్జీవనాన్ని ఆశిస్తూనా?

ఊరట పొంది హుషారుగా ఉండు. రోము నగరం ఒక్క రోజులో నిర్మింపబడలేదని అనుకుంటూ ఉండు. అలా ఉండలేక

పోతే, సూర్యోదయమై పక్షుల కిలకిలారావాలు వినపడేదాకా మరి అలా నిర్వేదంతోనే సాగిపో. అంతా బాగానే ఉంటుంది. (all is well)

చూస్తూంటే, వైరాగ్యంలో శిక్షణ పొందుతున్నట్లుగా ఉన్నావు. నేనైతే పనికిమాలిన వైరాగ్యం నుంచి తప్పించుకున్నాను. కొంతవరకు భరించాను. – 'సమత' ను సాధించేవరకూ. 'సమత' కష్టం. దుఃఖభూయిష్టమైన, దిక్కుమాలిన వైరాగ్యం సులువు.

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సమాచార పత్రం

శ్రీఅరవింద ఆశ్రమంవారు, ఆగస్టు 15, 2006 న శ్రీఅరవిందుల వారి ఈ క్రింది సందేశంతో ఫోల్డరు విడుదల చేశారు.


"ఆధ్యాత్మికత అంటే మేధోన్నతి కాదు; ఆదర్శం కాదు; నైతిక ప్రవర్తన – లేక – సచ్ఛీలత, మరియు, నియమమూ కాదు. మత విశ్వాసం కాదు. ఉత్సాహంతో కూడిన ఉన్నత భావతీవ్రతా కాదు. ఈ అన్ని అత్యుత్తమ లక్షణాల కలగలుపూ కూడా కాదు. అంతస్తత్వంలో ఆధ్యాత్మికత – మన జీవనంలో ఉన్న అంతరంగ వాస్తవానికి, మనో, ప్రాణిక, దేహాల కతీతమైన జీవాత్మకి – మేల్కొలుపు. విశ్వవ్యాప్తంగానూ, మన జీవములోనూ కూడా, వసించియున్న అతీత సత్యసంసర్గం కోసం, సన్నిహితత్వం కోసం, దానితో సంయోగం కోసం, తాదాత్మ్యత కోసం అంతర్నిహితమైన ఆకాంక్ష. ఒక నిర్ణాయత్మకమైన మలుపు. ఆ ఆకాంక్ష ఫలితంగా కలిగిన సంసర్గం, సంయోగంతో మన మొత్తం జీవుని యొక్క పరివర్తన, రూపాంతరీకరణ. ఒక కొత్త అస్తిత్వము లేక జీవనము. క్రొత్త జీవాత్మ; క్రొత్త స్వభావము"

– శ్రీఅరవిందులు

Rs. 15

శ్రీమాత మహాకాళి అంశ

అఖిల భారత పత్రిక, అక్టోబరు 2006



Mahakali Temple at Karnali

మహాకాళి

శ్రీఅరవిందుల ప్రవచనములు

శ్రీమాత ప్రవచనములు

అనుబంధం

ఉపోద్ఘాతము

మధ్యస్థజీవుడు (transitional being) గా బ్రతుకుతున్న నేటి మానవుని రేపటి దివ్యజీవనునిగా పరిణమింపజేసే బృహత్కార్య క్రమానికి నాంది పలికి, పథ నిర్దేశం చేసిన అవతారమూర్తులు శ్రీమాతారవిందులు. శ్రీమాత ఛిత్‌శక్తి స్వరూపిణి. ఆమె శక్తులు అనంతములు. మాతృ, శక్తి, ప్రేమ, విద్య, శాంతి – ఇలా అనంత రూపాలలో విశ్వమాతగా అభివ్యక్తమయే సర్వేశ్వరి, సర్వభూత నివాసి. శ్రీమాత అనంతత్వాన్ని, అంతస్తత్వాన్ని శ్రీఅరవిందులు రాశిలో చిన్నది, వాసిలో బ్రహ్మాండమైనది The Mother దివ్యగ్రంధంలో నిక్షిప్తం చేశారు. అది శ్రీవారి అసాధారణ అధిమానస దివ్యచేతనాస్థరాల నుంచిజాలువారిన దివ్యసౌందర్య లహరి. ప్రతి వాక్యము ఒక వేదమంత్రమే. ఋషివాక్కు కదా! శ్రీఅరవిందుల ఆధ్యాత్మికతత్వసారం, ఆధారశృతి అది. అలనాటి (1926) సంశయాత్మకులైన శిష్యుల సంశయనివృత్తి కోసం, ఆనాటి వారిని, ఈనాటి వారిని, ఏనాటి వారిని తరింపచేసే ఆధునిక గీతాసారం. శ్రీమాత నాల్గు ప్రధాన అంశలు, శక్తులు – మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి – విజ్ఞానవివేకములు, బలము, సామరస్యము, పరిపూర్ణత్వము – విశ్వానికి మార్గదర్శకత్వం వహించి, ప్రాపంచిక క్రియాకలాపాలను నడిపించేందుకు, అమ్మ వ్యక్తిత్వములో మూర్తీభవించి, సృష్టి మొత్తమును నడిపింప చేసేవి అవి.

అందు మహాకాళి అసుర భయంకరి. ప్రతికూలశక్తుల పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తుంది. దివ్యలక్షణాలు – సత్య, జ్ఞాన, ప్రేమ, సౌందర్య, సామరస్యాలను – మనలో పాదుగొలిపే మాతృమూర్తి. ఆమె ఆగ్రహానుగ్రహాలు రెండూ తీవ్రంగానే ఉంటాయి. తేజోమయ కృప, దిగ్విజయ సాఫల్య శక్తి ఆమె స్వంతాలు. మానవాళిని దివ్య జీవనులుగా సత్యయుగ పథానికి మరల్చుటలో ఎదురయే ప్రతికూలశక్తుల నెదిరించే, మహాకాళి విజృంభణమే, మన కీనాడు ఈ ప్రపంచంలో అగుపించే విధ్వంసాలు, తిరుగుబాట్లు, భీభత్సాలు –

ఇవి ప్రకృతిగతమైనవిగా, మానవకల్పితాలుగా కూడా ఉంటాయి; ఉంటున్నాయి. అంతర్బాహ్య జీవనాలు శ్రీమాత దివ్యస్పృహ ఆలంబనంగా తీర్చిదిద్దుకుంటూ ***Even the body shall remember God*** *అన్నట్లుగా మనుగడ సాగించినపుడు మానవుని మధ్యస్థ బ్రతుకు, దివ్యజీవనంగా ప్రకాశిస్తుంది. దసరా పూజా పుష్పంగా శ్రీమాతయొక్క ప్రముఖ మహాకాళీ అంశ ఈ సంచిక – చదివి తరించండి.*

– సంపాదకుడు

('యుగయుగాల శ్రీఅరవిందులు' పుస్తకంలో
నిరోద్‌బర్న్ ఈ విధంగా వ్రాశారు.)

శ్రీఅరవిందులు నర్మదా తీరాన ఉన్న కాళీకాదేవి దేవాలయాన్ని దర్శించారు (బహుశా 1903 సం॥ లో) అది కూడా వారి స్నేహితుల ప్రోద్బలంతో. ఆ రోజులలో ఆయనకి విగ్రహారాధనపై నమ్మకం లేదు. "యూరోపియన్ మనస్తత్వంలో ఉన్న నాకు వాటిపై విశ్వాసం లేదు. భగవంతుని ఉనికిపట్ల నాకేమాత్రం నమ్మకం లేదు" అని వ్రాశారు. కాని వారు దేవి విగ్రహాన్ని చూచినపుడు 'అనంతానికి ఆశ్రయమై, సజీవమై, అమరమైన దివ్యతేజోరూపాన్ని' దర్శించారు. "తొలిసారిగా నాకు భగవంతుడు ఉన్నాడనే నమ్మకం కలిగింది" అన్నారు. ఈ అనుభవాన్ని పురస్కరించుకునే, తర్వాత వారు వ్రాశారు. "ఓ పవిత్ర నది ప్రక్కన కాళీ దేవాలయం ముందు నిల్చుని ఉంటావు. ఏమి దర్శిస్తావు? ఒక శిల్పకళా వైభవం. మళ్లీ అంతలోనే అనుకోకుండా మాయగా, అక్కడ ఏదో ఒక అస్తిత్వము; ఒక శక్తి; నీ కళ్లలోకి చూచే ఒక ముఖవైఖరి; నీలోని ఒక అంతర్లోచనము విశ్వమాతని, (సభక్తికంకా) భావిస్తుంది."

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

శిలా దేవత

దేవపురి, అందొక చిన్ని దేవాలయము,
శిల్పాకృతిలోని దైవము నన్ను వీక్షించినది, –
అది సజీవ దివ్యతేజోమయ ఆకృతి
అనంతానికి ఆశ్రయం, అమరం.

మహనీయమైన లోకమాత, ఆమె ఇచ్ఛాశక్తి
గాఢసుమప్తిలో ధరిత్రి నిండా వసించి యున్నది,
పలుకదు సర్వేశ్వరి, అంతు చిక్కదు
భూమ్యాకాశాగాథాల్లో – అంతటా నిశ్శబ్దం.

మనసు ముసుగు చాటున ఆవాసమై ఉన్నదామె ఇపుడు
ఉలుకదు పలుకదు, అంతు చిక్కదు,
సర్వశక్తిమతి, ఆత్మకు అందేవరకు గుప్తము,
విచిత్రమైనది ఆమె అభివ్యక్తీకరణ.. నిగూఢము

నిగూఢ సౌందర్యము, కదలాడని ఆ ఆకృతి
శిలాకృతా లేత మానవాకృతా, ఒకటే
అర్చకునికి

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

మహాకాళి అంశగా శ్రీమాత

విశ్వానికి మార్గదర్శకత్వం వహించి, ప్రాపంచిక క్రీడావిశేషాలను నడిపించటానికి అమ్మయొక్క నాలుగు ప్రముఖమైన అంశలు, శక్తులు, వ్యక్తిత్వాలు ఆమె ముందు నిలిచి ఉంటాయి. ఈ నాల్గింటి ప్రముఖ నామధేయాలు – మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి.

మహేశ్వరి రాజరాజేశ్వరి. ఇచ్ఛ, ఆలోచనాబుద్ధికి ఆవల విశాలత్వంలో అధిష్ఠించి ఉంటుంది. మహనీయ విజ్ఞాన విశాలత్వాలుగా వీటిని ఈమె విస్తృతపరుస్తుంది. తన వైభవాన్ని వీటి కతీతంగా పొంగిపొరలేటట్లు చేస్తుంది. ఎందుకంటే ఈమె మహాశక్తిమతి, వివేకవతి. అనంత దివ్యచైతన్యసత్వాలకు, విశ్వవిశాలతకు, మహోన్నత దివ్యకాంతి ప్రకాశాలకు మనలను ఉద్దీపనం చేస్తుంది. అమ్మ తన అనంత శాశ్వత శక్తిగమనాలను, అద్భుత విజ్ఞానభాండాగారాలను కుడా, మనకు దర్శింపచేస్తుంది.

మహాకాళి స్వభావము వేరు. విశాలతకు బదులు ఉన్నతి, విజ్ఞానానికి బదులు శక్తిసామర్థ్యాలు ఈమె ప్రత్యేక శక్తులు. ఉప్పొంగే తీవ్రత, కార్యసాధనలో బ్రహ్మాండమైన భావోద్రేకశక్తి, పరిమితులను, అవరోధాలను పటాపంచలు చేయటానికి పొంగిపొరలే దివ్య ఉగ్రశక్తి ఈమెలో ఉన్నవి. ఈమెది దివ్యావేశం. ఇది తుఫాను వేగంతో ఉజ్వలంగా ఉరకలు వేస్తుంది. తక్షణ సాధనా ప్రక్రియగా వడి వేగములతో వెన్వెంటనే ప్రత్యర్థిని ఎదుర్కొని దెబ్బతీయటం – ఈమెకే చెల్లింది.

అసురభయంకరి. దైవద్వేషులపట్ల ఈమె తీరు నిర్దాక్షిణ్యము, ఘోరప్రమాద భరితము. ఎందుకంటే ఈమె యుద్ధంలో వెనుకంజ వేయని లోకవీర శిఖామణి. అపరిపూర్ణతను సహించదు. మానవుని నిర్లిప్తవైఖరి పట్ల కరకుగా వ్యవహరిస్తుంది. మూర్ఖ అజ్ఞాన అస్పష్టతల పట్ల తీవ్ర కాఠిన్యం వహిస్తుంది. వంచన, అసత్యము, గాఢమైన ద్వేషము – వీటికి వ్యతిరేకమైన ఆమె ఆగ్రహము సద్యో భయంకరము. శతృత్వం పట్ల దేవి దండన కూడ

అంతటిదే. దైవకార్యంలో అశ్రద్ధ, నిర్లక్ష్యము, సోమరితవము ఆమె భరించదు. సోమరిని, తిరుగుబోతుని తీవ్రమైన బాధ కల్గించేటట్లు కొట్టి మేల్కొల్పుతుంది అవసరమైతే. మహాకాళియొక్క ప్రేరణలు – వేగవంతంగాను, సూటిగాను ఉంటాయి. ఈమె సంచలనాలు నిరాటంకంగాను, పరిపూర్ణంగాను ఉంటాయి. దాపరికం ఉండదు. జ్వాలాముఖిగా పైకి ఎగసే ఆకాంక్ష ఈమె ప్రేరణయే. ఈమె శక్తి ప్రభావాలు, ఆత్మశక్తి మచ్చిక చేయుటకు లొంగనివి. ఆమె ఇచ్ఛ, దృష్టి, విహంగ విహారసీమలో మహోన్నతములై ఉంటవి. ఆమె నడక ఊర్ధ్వమార్గాన వేగవంతంగా సాగుతుంది. ఈమె హస్తాలు శిక్షణకు, రక్షణకు కూడా సాచి సిద్ధంగా ఉంటాయి.

ఆమె కూడా మరిత తల్లియే కదా! ఆమె ఆగ్రహం వలెనే ప్రేమా తీవ్రమైనదే. ఆమె అనుగ్రహము లోతైనది, ఆవేశపూరితమైనది. తనను శక్తివంతముగా కలుగచేసుకునే అవకాశమే ఆమెకి ఈయవలెగానీ, ఒక్క తృటిలో (దైవ) అన్వేషకులపై శతృదాడిని, కదలనీయని వారి అవరోధాలను ఛిన్నాభిన్నం చేసివేయదా!

ఆమె ఆగ్రహము శతృభయంకరము. దుర్బలులకు, పిరికివాళ్లకు ఆమె కలుగచేసే తీవ్రమైన ఒత్తిడి బాధాకరంగా ఉంటుంది. కాగా మాన్యులు, ఉన్నతులు, శక్తియుతులు ఈమెను ప్రేమిస్తారు. ఆరాధిస్తారు. ఎందుచేతనంటే ఆమె తన ఆఘాతాలలో వారిలోని తిరుగుబాటు లక్షణాన్ని శక్తిగా, పరిపూర్ణసత్యముగా మలుస్తుంది. కుటిల వక్రతలను సాగతీసి సాపు చేస్తుంది. లోపభూయిష్ఠము, అస్వచ్ఛమైన వాటిని విసిరిపారవేస్తుంది. శతాబ్దాలు పట్టే పనులు, ఆమె తలుచుకుంటే, ఒక్క రోజులో పూర్తి కాబడుతవి. ఆమెలేని ఆనందము మృదులము, విశాలము, గంభీరము కావచ్చును. కాని పరిపూర్ణ తీవ్ర ఆనందజ్యోతిర్మయముగా మాత్రము ఉండదు. జ్ఞానమునకు లభించే విజయశక్తి ఆమెదే. సౌందర్య, సామరస్యాలు, ఔన్నత్యాన్ని ఆరోహణాశక్తిని పొందేది ఆమె వలెననే. కష్టంగా మందగతిలో సాగే శ్రమకు, ఊపు, పరిపూర్ణత చేకూర్చేది ఆమెయే. ఆ ఊపుతో శక్తులు పెంచి వేగాన్ని పుంజుకొనేటట్లు చేసి కాల పరిమితిని తగ్గిస్తుంది. పరమ ఆనందపారవశ్యాలు, అత్యున్నత

ఔన్నత్యాలు, అత్యుదాత్త ఆదర్శాలు, విశాలతమ దృశ్యాలు – వీటికి తక్కువైనవేమీ కూడా ఈమెకు సంతృప్తి నీయవు. అందుకే, విజయోత్సవశక్తి ఈమెతో కూడానే ఉంటుంది. ఏ గొప్ప సాఫల్యమైనా సరే, మరెప్పుడోకాక, ఇప్పుడే సాధింపబడేది, ఆమె యొక్క తేజోమయకృప, గాఢావేశ తీవ్రత వలననే.

మూలం: శ్రీఅరవిందులు

(పూర్వఅనువాదకులకు కృతజ్ఞతలతో) సంపాదకుడు

మహాకాళి – శ్రీమాత ప్రబలమైన శక్తి

జగన్మాత యొక్క మహోజ్వలశక్తి రూపం మహాకాళి. జగన్మాతలోని అప్రతిహతమైన కాంక్ష వైదగ్ధ్యం. ఆమె వీరోచిత ప్రాబల్యం, ఆమె విజృంభమాన మహాసంకల్పం, ఆమె ప్రచండ క్రియాసంరంభం ప్రపంచాన్ని కదిలించే మహాశక్తి – ఇవన్నీ మహాకాళి రూపంలో మూర్తీభవించి వుంటాయి.

*

ఆమె మహాకాళి. మహోత్కృష్టశక్తియై వెలిగే దేవత. ఆమెలోనే సర్వశక్తులు. ఆధ్యాత్మిక సంపదలు, అతి తీవ్రమైన తపోవైభవం, యుద్ధానికి సర్వసన్నద్ధత, విజయపరంపర, మందహాసం, 'అట్టహాసం' – ఈ శక్తులతో మృత్యువు, పరాజయం, అవిద్యాశక్తులు నిర్వీర్యమైపోతాయి.

*

ప్రశ్న: 'ది మదర్' అనే గ్రంథంలో జగన్మాత యొక్క మహాకాళి శక్తి గూర్చి వ్రాస్తూ "రక్షణకు, శిక్షణకు ఆమె హస్తాలు చాచి ఉంటాయి" అని శ్రీఅరవిందులు అన్నారు. ఇందులో దెబ్బతీయడం (strike) అంటే అర్థం ఏమిటి?

ప్రపంచంలో మహాకాళి సర్వసాధారణ కర్తవ్యాన్ని ఆ మాట వ్యక్తం చేస్తున్నది. అసురులపై విరుచుకుపడి దెబ్బతీస్తుంది.

వదిలించుకోవలసినదానిని, నాశనం చేయవలసిన ప్రతిదానిని, సాధనలో అవరోధాలను ఆమె దెబ్బతీస్తుంది.

*

ప్రశ్న: "మహాకాళి తన శక్తితో జోక్యం చేసుకోడానికి అవకాశం యిస్తే, సాధకునికి అడ్డు వచ్చే అవరోధాలు, దాడిచేసే శత్రువులు ఒక్క క్షణంలో పలుచని వస్తురాశివలె చిన్నాభిన్న మవడం తప్పదు" అని 'ది మదర్' గ్రంథంలో ఉంది. మహాకాళిశక్తి జోక్యం చేసుకొన్నట్లు ఎలా తెలుస్తుంది?

ఏదో ఆకస్మికంగా, వేగవంతంగా, నిర్ణయాత్మకంగా, అనివార్యంగా జరిగినట్లు భావం కలుగుతుంది. ఆమె జోక్యం వెనుక దివ్యమైన లేదా అతిమానస ఆమోదం ఉంటుంది. అదొక కఠోర శాసనం. తిరుగులేనిది. జరిగినదానిని తలక్రిందులు చేయడంకాని, నిర్వీర్యం చేయడంకాని సాధ్యం కాదు. అసురశక్తులు ప్రయత్నించవచ్చు, స్పృశించవచ్చు, దాడిచేయవచ్చు. కాని అవి అప్రతిభులై వెనుతిరుగుతాయి. అవి ఉపసంహరించుకోగానే ఆ క్షేత్రం చెక్కు చెదరకుండా నిలుస్తుంది. దాడి జరిగిన పరిస్థితీ అంతే. మహాకాళి ఉగ్రశాసన అగ్ని స్పర్శకు కష్టాలన్నీ శక్తిహీనమై పటాపంచలైపోతాయి. వాటి నిజరూపాలు భస్మీపటలం అవుతాయి. క్షణకాలం కదలాడి అంతర్హితమయ్యే నీడలుగా కష్టాలు కనుమరుగైతాయి. నేను 'ఆ మహాశక్తి' అని అన్నాను. ఎందుకంటే మహాకాళియొక్క ఈ మహోత్కృష్ట కార్యం అసాధరణమైనది. ఆమెయొక్క ఇతర చలితచాలన శక్తులతో పోల్చి చూచినపుడు.

ప్రశ్న: నేడు నేను ప్రార్థన చేస్తుండగా మహాకాళి రూపం కనిపించింది. ఆమె నల్లగా, సన్నంగా ఉంది. శివుని వీపుపై పాదం మోపి ఆమె నిలబడింది. మామూలుగా పురాణాలలో ఆమెను అలాగే వర్ణిస్తారు. మహాకాళి ఆ రూపంలో ఎందుకు కనిపిస్తుంది? ఏ భూమికలో ఆమె అలా కనపిస్తుంది?

ప్రాణికభూమికలో ఆమె ఆ రూపంలో సాక్షాత్కరిస్తుంది. సర్వవినాశక శక్తి స్వరూపం ఆమె. కష్టాలు చుట్టుముట్టి అజ్ఞానంలోని ప్రకృతి శక్తికి అది ప్రతీక. ముందుకు చొచ్చుకొనిపోయే

అంధపోరాటంలో ఎదురైన ప్రతి వస్తువును హస్తగతం చేసుకుంటూ, ముక్కలు చేస్తూ సాగిపోతుంది. చివరకు ఆమె దైవత్వంపై ఒక కాలుమోపి నిలబడుతుంది. అప్పుడు ఆమె స్వస్వరూపానికి వచ్చి చేరుతుంది. పోరాటం, నాశనం అన్నీ పూర్తి అవుతాయి. ఇదీ ఈ ప్రతీక వెనుకగల వైశిష్ట్యం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. యజ్ఞన్న

ఫ్రెంచి విప్లవము – కాళీమాత

ఫ్రెంచి విప్లవమంటే కాళీకాదేవి మృత్యుతాండవమే. తాను జరిపిన విధ్వంస శిధిలాలపై భయంకరంగా చేసిన తీవ్ర విలయతాండవం అది. ప్రపంచంపై జాలితో అవశయై దయారహితంగా చేసిన కరాళ నృత్యమది. ఈ సంహారప్రక్రియలో తనకు అండగా తనలోని యాతుధానిని (Yathudhani) సహకారంగా రావించింది. యాతుధాని విధ్వంసవినోదిని. క్రోధోగ్ర చిత్రహింసకారిణి. విశ్వేశ్వర రుద్రరూపిణి. పశుపతి అన్నా, ప్రమదనాధుడన్నా మానవునిలో ఉండే మృగానికి అధిదేవత. హింసకు మారుపేరు. సంహారం చేసే ఉగ్రత. దానికి తోడుగా నిలిచే రాక్షసి. మనిషిలోని ఎదురులేని అహంకారానికి ప్రతిరూపం రాక్షసి. తన సహజాత ప్రవృత్తుల పరితృప్తి కోసం అడ్డువచ్చిన వాటిని విచక్షణారహితంగా నాశనంచేసే శక్తి. ఈ రెండు భయంకరశక్తుల వికటాట్టహాసమే ఫ్రెంచి విప్లవము. దీనికి తోడుగా స్వేచ్ఛ, సమత, సౌభ్రాతృత్వమనే తేజోమయ మహామంత్రము. ప్రత్యామ్నాయంగా ప్రచండ భయంకర మృత్యువు కూడా. అసురులకు, వారితోపాటు దివ్యపరిణామ క్రియని వ్యతిరేకించే వారందరికీ మృత్యువు తప్పదు. ఈ విధమైన రెండు భయంకరశక్తులతో కాళికాదేవి ఫ్రెంచి విప్లవంలో పనిచేసింది. తన దివ్యత్వాన్ని క్రోధావేశపు చీకటి ముసుగులో మరుగుపర్చుకొని రక్తపానం చేస్తూ సభ్యతా, సంప్రదాయాలను

వదిలిపెట్టి. ఐరోపా ఖండమంతా విలయతాండవం సల్పింది. దేశమంతా భయంకర యుద్ధనినాదాలతో, వికటాట్టహాసాలతో హుంకారాలతో మారుమ్రోగింది. అంత మారణహోమం జరుగుతూ ఉండగా ఒక్కసారిగా ఆమెకు స్పృహ కలిగింది. తాను తాండవం చేస్తున్నది పరమేశ్వరునిపైన అనీ, జాతీయత అనే సూత్రం భగవన్నిర్దేశితమనీ తెలుసుకొని వెంటనే, ఆ క్షణమే నెపోలియన్ రక్కసుని దూరంగా విసిరేసి జాతీయతావాద పరిపూర్ణ పునరుద్ధరణ కార్యక్రమములో నిమగ్నమైంది. ఆ రక్షక కవచంలో సౌభ్రాతృత్వాన్ని చక్కగా వ్యవస్థీకరించడానికి పూనుకుంది.

*

ఫ్రెంచి విప్లవం ఉదాత్తత అంతా దాని భావాలలో ఉందిగానీ, అది సాధించినదేమీ లేదు. ఎన్నో ఆశయాలతో ప్రారంభమైనా జరిగింది ఎక్కువ భాగం విధ్వంసమే. ఏమీ సాధించలేక పోయింది. నెపోలియన్ ప్రారంభించిన నిర్మాణాత్మక చర్యలు కూడా అర్థాంతరంగా ఆగిపోవలసి వచ్చింది. 1789 విప్లవం తాలూకు విలువలను ప్రపంచం అర్థం చేసుకొనేవరకు అవి అక్కడ అలాగే ఉండిపోతాయి కూడా. ఆ భావాలు నిజానికి ప్రపంచానికి అంత కొత్తవి కావు, అంతకు ముందే అవి క్రైస్తవ, అంతకన్నా వెనుక బౌద్ధాలలో ఉన్నవే. అయినప్పటికీ ఈ విప్లవం తర్వాత అవి చర్చి నుంచీ. మతగ్రంథాల నుండి బయటపడ్డట్లుగా అయి సమాజాన్నీ, ప్రభుత్వాన్నీ పునర్నిర్మించాలనుకున్నాయి. ఆ ప్రయత్నం విఫలమే అయినా ఆ వైఫల్యం కూడా ఐరోపా ముఖచిత్రాన్ని మార్చివేసింది. అది విఫలం కావటానికి కారణం దానికి సంబంధించిన పరిజ్ఞానం కొరవడటమే; దాని మౌలికసిద్ధాంతాలు, విధానాలు తెలిసినప్పటికీ ఆచరణాత్మకమైన అనుభవం లేకపోవడం వల్ల ఫలించలేదుకానీ, అది కలిగించిన ఉత్సాహం, బలం, ఆ భావాలను అమలుచేయాలనే ఉత్కంఠ ఐరోపావాసుల్లో మార్పు తెచ్చింది. అంతవరకూ ఐరోపాలో పాదుకొలిపి ఉన్నది స్వేచ్ఛ కాక, బానిసత్వము, అణచివేత; సమానత్వ స్థానంలో అసమానత దురన్యాయము; సౌభ్రాతృత్వానికి బదులు స్వార్థపరత్వం, దౌర్జ

న్యము. అయితే అప్పట్లో 1789 సిద్ధాంతాల ఆచరణకి ప్రపంచం సిద్ధంగా లేదు. మానవాళి గమ్యం ఎప్పటికీ అదే అయినా మనం ఇంకా లక్ష్యానికి చాలా దూరంగానే ఉన్నాము. అయితే ఇప్పుడు కొంతవరకూ అది అమలుచేయ.గల సమయం ఆసన్నమైంది. సౌభ్రాతృత్వమునకు సంబంధించిన క్రమశిక్షణను ముందు వ్యవస్థీకరించవలసి ఉన్నది. సౌభ్రాతృత్వమనే జీవశక్తి ఉంటేనేగానీ స్వేచ్ఛ, సమతాభావాలు స్థిరంగా నిలువలేవు. పాపం, ఫ్రెంచివారికి, ఈ మూలసూత్రం తెలియక స్వేచ్ఛ అనే దానిని పునాదిగా చేసి దాని మీద సౌభ్రాతృత్వమనే బృహన్నిర్మాణం చేశారు. అంటే త్రిభుజాన్ని శీర్షంపై నిలపెట్టినట్లయింది. అదంతా గ్రీకు, రోమనుల ప్రభావంలో ఉండటంవల్ల స్వేచ్ఛ అంటే వాళ్ళకుండే అభిప్రాయం చాలా సంకుచితమై, క్రైస్తవమతంలోనూ, ఆసియాలోనూ ఉన్న సౌభ్రాతృత్వ సూత్రాన్ని లాంచనప్రాయంగా మాత్రమే తీసుకోడం జరిగింది. ఈ విధమైన జ్ఞానాన్ని బట్టి త్రిభుజాన్ని దాని శిఖరాగ్రంపై నిలబెట్టారు. అది స్థిరంగా ఉండాలంటే దాన్ని సమంగా నిలిపి ఉంచాలి.

*

ఫ్రెంచి విప్లవం ప్రజలలో తీవ్ర గాఢావేశాన్ని నింపి, ఉగ్రమైన ప్రగాఢ ఆకాంక్షను వారిలో ప్రేరేపించి వినుతి కెక్కింది. అందు ప్రధానంగా నల్గురి ద్వారా అది ప్రయోజనం పొందింది. ఆ నలుగురూ మిరాబూ, డాంటన్, రోబెస్పీ, నెపోలియన్. మిరాబూ నాంది ప్రస్తావన చేయగా, డాంటన్ ఉత్తేజపర్చాడు. రోబెస్పీ సంహారకారకుడు కాగా, నెపోలియన్ కడతేర్చాడు. మొదటి ముగ్గురూ సమయానికి గుంపులో గోవిందయ్యలవలె అగుపించి తమ పని కానిచ్చి తెరమరుగైనారు. గమనవేగం పుంజుకుంది కాబట్టి సరిపోయిందికాని, అదే కొనసాగి, వాళ్లు ఇంకా అనవసరంగా మిగిలి ఉంటే భవిష్యత్తును భ్రష్టం చేశేవారే! వారు వారి పని కాగానే వెళ్లిపోవటం, మంచిదే అయింది. లేకుంటే జగన్మాతచేత వైదొలగింపబడేవారు. గారిబాల్డీ ఈ విషయంలో అదృష్టవంతుడు. కానీ నెపోలియన్, మజ్జినీలు వారికొచ్చిన ఘనకీర్తిని నిలబెట్టుకోలేక పతన

మైపోయారు. అందుచేత తన పని పూర్తికాగానే వైదొలగటం మనిషికి ఎప్పుడూ మంచిది. not to outstay the Mother's welcome.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

(మిరాబు, డాంటన్, రోబస్పీల గురించి శ్రీఅరవిందులవారి అభిప్రాయాలు తెలుసుకోవాలనుకుంటే శ్రీఅరవిందుల శతవార్షిక గ్రంధాలను చూడండి. SABCL Vol. 17, pp. 379, 387 or CWSA Vol. 1, pp. 514-522))

మహాకాళి – కాళి

మహాకాళి, కాళి ఒక్కరే కాదు. కాళి దిగువ తరగతికి చెందినది. ఉన్నత భూమికల్లో మహాకాళి సాధారణంగా బంగారు వర్ణంగా కనబడుతుంది.

*

కాళి, శ్యామ మొదలైన దేవతలు ప్రాణికస్థాయిలో కనిపించే సాధారణ రూపాలు. అధిమానసం మూలాధారంగా వాస్తవమైన మహాకాళి నలుపు కాదు; ప్రకాశహీనమైనది కాదు, భయంకరీ కాదు. ఆమె అసురులు ఎదుర్కొన వీలుకాని అసాధ్యమైన రీతిలో కూడా పసిడికాంతిలో పరిపూర్ణ సౌందర్యరాశిగా ఉంటుంది.

*

శ్రీమాతది ధవళవర్ణము. ప్రధానంగా వజ్రకాంతి. మహాకాళి రూపం సాధరణంగా బంగారు వర్ణం, కాంతివంతమైన దట్టమైన బంగారు ఛాయ.

*

సాధారణ మనస్సుకి ఉపరితలాన ఉన్నతభూమికల్లోని బంగారు సత్యతేజస్సు మౌలికంగా అతిమానసకాంతి. మనస్సుకి ఉపరిత

లాన అదే మహాకాళి కాంతి కూడ. శ్రీమాత నుండి బంగారు తేజస్సు వలెనే తరచు ధవళకాంతి కూడ ఉద్భవిస్తుంది.

*

నలుపు వర్ణంతో నున్న కాళిరూపము ప్రాణమయభూమికపై ఆవిష్కరింపబడిన మహాకాళి రూపమే. కాని అధిమానసంలో (in the overmind) మహాకాళి సువర్ణకాంతిమయం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: బి. నరశింహయ్య

దుర్గ

దేముళ్ల విషయానికొస్తే, మానవాళి తమకు ఆమోదయోగ్యమైన దేవతల రూపాలను రూపొందించుకోగలరు. కాని ఆ రూపాలు కూడ ఆయా దేవతలకు చెందిన భూమికల నుండి ఆయా మానవుల మనస్సులలో ప్రేరేపింపబడుతవి. సృష్టి అంతా మూర్తము, ఆమూర్తము అని రెండు పార్శ్వాలు కలిగి ఉంది. అలానే దేవతలు కూడ రూపరహితులు అయినా కూడా రూపం కలిగి ఉంటారు. కాని దైవం అనేక రూపాలుగా ఉండగలదు. ఇక్కడ మహేశ్వరిగా, అక్కడ (Pallas Athene) పల్లాస్ అథీన్‌గా వివిధ రూపాలుగా అభివ్యక్తం కాగలదు. నిమ్నస్థాయిలో, మహేశ్వరియే దుర్గ, ఉమ, పార్వతి, చండి లుగా అభివ్యక్తం ఔతుంది. దేవతలు మానవరూపాలుకే పరిమితం కాదు; మానవుడు కూడా వారిని మానవరూపాలలోనే ఎప్పుడూ దర్శించడు.

*

దుర్గ కొంతమేరకు మహేశ్వరి, మహాకాళిల విశిష్టగుణాలు మూర్తీభవించిన రూపం. ఆమెకు మహాలక్ష్మితో ఎక్కువ సంబంధం లేదు.

*

దుర్గ శ్రీమాత యొక్క రక్షణశక్తి.

*

దుర్గకు వాహనమైన సింహం, దివ్యత్వం చెందిన దైహిక ప్రాణ మయ, ప్రాణాశ్రిత భావమయశక్తి ద్వారా పనిచేసే దివ్యచేతనకు సంకేతం.

*

సింహం దుర్గాదేవియొక్క విశిష్ట లక్షణము. దుర్గ విశ్వజననియొక్క – స్వాధీనపరచుకొని, రక్షించే-విశిష్టగుణం.

కపాలం దివ్యశక్తిచేత జయింపబడి, చంపబడిన దైవప్రతి కూల శక్తులైన అసురులకి సంకేతం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: బి. నరశింహయ్య

కృష్ణుడు – మహాకాళి

కృష్ణుడు, మహాకాళి – ఈ ఇద్దరి సమీకృతశక్తి చాలా ప్రభావం కలది. ఈ రెండు పేర్లు కలిసి నీ చైతన్యంలో ఉత్పన్నమవట మనేది చాలా మంచి సూచన.

*

పరమాత్మునితో ఏకత్వం సిద్ధించినపుడు మన సాధనలో స్థితి శీలకమైన భాగం పూర్తి అయినట్లే; ఇక క్రియాశీలకమైన భాగం మిగిలి ఉంటుంది. అప్పుడే మన మా భగవంతునిలోని దైవాన్ని, దైవశక్తిని విడివిడిగా చూడాలి. దాన్నే హైందవ సంప్రదాయాన్న నుసరించి కృష్ణుడు, కాళీ రూపాలుగా వివరిస్తున్నాను. నన్ను పూర్తిగా ఆక్రమించి నా ప్రకృతిగా పనిచేసే శక్తి కాళీశక్తి తప్ప మరొకటి కాదు. ఆ శక్తిని ఉపయోగించి దానిచేత పనిచేయిస్తూ నడిపించేది నాలోని దైవమే. సర్వాంతర్యామియైన ఆ దైవప్రతిని ధిగా ఆ శక్తి నడిపించినట్లు నడుస్తూ పరమాత్మలో ఆత్మ మాదిరి ప్రవర్తిస్తే చివరికి భగవంతుడు, అతని శక్తి తప్ప మరేమీ మిగ లని స్థితి వస్తుంది.

*

కాళీశక్తి విజృంభించి తన మహోగ్రశక్తితో లోనికి చొరబడుతుంటే ఎవరు తట్టుకోగలరు? అంతకు ముందే కృష్ణుని తనలో ఆవాహనం చేసుకున్నవారే నిలబడగల్గుతారు.

శ్రీమాత వివరణ:

ఇది ఎంతో మధురమైన భావప్రకటన. అంటే ఎవరైతే తమలో చైతన్యవంతంగా దైవతత్వాన్ని నిలుపుకుంటారో వారు ఎటువంటి ఉగ్రశక్తినైనా విజయవంతంగా తట్టుకొని ఎదుర్కోగలరు.

*

నేను కృష్ణుని ఎక్కువ ప్రేమించానో, కాళీమాతను ఎక్కువగా ప్రేమించానో నాకు చాలా కాలం తెలియరాలేదు. కాళీని ప్రేమించాననుకుంటే అది నన్ను నేను ప్రేమించుకున్నట్లే. కృష్ణుని ప్రేమిస్తే అది పరాయివారిని ప్రేమించినట్లయింది. అంటే నాలోని పరమాత్మను ప్రేమిస్తున్నట్లన్న మాట. ఆ విధంగా కాళీమాత కంటే కృష్ణునే ఎక్కువ ప్రేమించడం మొదలుపెట్టాను.

*

కాళీమాత అంటే ఒక భయంకరశక్తిగా, తీక్షణ ప్రేమరాశిగా ఉన్న శ్రీకృష్ణసాక్షాత్కారమే. ఆమె క్రోధాఘాతాలతో మనస్సు, ప్రాణము, దేహములలో ఉన్న జీవిని (అహాన్ని) రూపుమాపి అమరమైన ఆత్మను విముక్తి కావించటమే.

శ్రీమాత వివరణ:

అనంత విశ్వాన్ని దర్శించటానికి వీలుగా మనలో ఒక జ్ఞానదీపాన్ని వెలిగించే నిమిత్తం, అత్యల్పమైన, అసహాయమైన అహంకారాన్ని రూపుమాపితే, దాన్ని గురించి మనకు విచారమెందుకు?

*

నిన్ను హింసించేవారిలోను, హతమార్చేవారిలోనూ, నీ బాధలోనూ, నీ మృత్యుక్షణంలోనూ కూడా, నీవా దైవాన్ని దర్శించలేవా? ఇంకా నీవు హతమార్చేటప్పుడూ, నీవు చంపుతున్నవారిలోను ఆ పర

మేశ్వరుని చూడలేవా? ప్రేమించలేవా? ఆ పరమోన్నతజ్ఞానము నీ హస్తగతమే కదా! కాళీమాతను ఆరాధించలేనివారు కృష్ణపర మాత్మను ఎలా పొందగలరు?

*

ఈ భూలోకం స్వర్గలోకంగా మారేదెప్పుడు? మానవులంతా బాల, బాలికలుగా మారి, అందరిలోనూ మంగళప్రదమైను బాలునిగా ఉన్న కృష్ణునితో, అందరిలోకీ దృఢమైన బాలికగా ఉన్న కాళీ మాతతో కలిసి భూతలస్వర్గ నందనవనాల్లో నడయాడే దెప్ప టికో. ఈడెన్ వనం బాగానే ఉండేదికానీ ఆడమ్, అవ్వాలు వృద్ధు లైపోయారు. అప్పటి భగవంతుడు కూడా వార్ధక్యంతో కఠినం గాను, భీతావహంగానూ ఉండిపోవటంవల్ల సైతాన్ ప్రలోభాలను ప్రతిఘటించలేకపోయారు.

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి. డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి.

భారతీయ సంస్కృతిలో భయం, జుగుప్స?

ద్రవిడియను దేవాలయ వాస్తుశిల్పాల గురించిన, హానికరమైన విమర్శలు అంతగా పట్టించుకోవలసిన అవసరం నాకు లేదు. కాని ఒక విమర్శ మాత్రం గమనార్హం. ఎందుకంటే అది Mr. Archer లాంటి వాళ్లు చేసిన విమర్శ వంటిది కాదు. కనుక దానిని మనం పరిశీలించటం మంచిది. ఈ బ్రహ్మాండమైన దేవాలయాల్లో అమా నుష భయం, జుగుప్సల ప్రభావం తనపై పడిందని, సానుభూతితో అర్థం చేసుకొనే ప్రొఫెసర్ గైడ్డెస్ వ్యాఖ్యానించారు. ఇటువంటి ప్రకటనలు భారతీయులకు ఆశ్చర్యం కలిగిస్తాయి. ఎందుచేతనంటే మతం, కళ లేదా సాహిత్యం భారతీయులలో రేకెత్తించిన అను భూతులలో భయం, జుగుప్స ఎక్కడా లేవనేది స్పష్టం. మతంలో ఎక్కడైనా పైకి తెచ్చినా, వాటినెలా చక్కదిద్దాలో వెంటనే చూప టానికి మాత్రమే. అపుడు కూడా వాటి వెనుక వాటి కాధారంగా, సహాయంగా ఒక దివ్యసన్నిధి, ఒక శాశ్వత ఔన్నత్యం, ప్రశాంతత

లేదా ప్రేమ లేదా ఆనందం ఉండనే ఉండేవి. విధ్వంసకారిణి అయిన దేవత కూడా అదే సమయంలో కరుణామూర్తి, ప్రేమస్వ రూపిణి అయిన దివ్యమాత కూడా. రుద్రుడైన మహేశ్వరుడు అదే సమయంలో మంగళకరుడైన శివుడు, ఆశయప్రదాత అయిన అశుతోషుడు కూడా. భారతీయచింతన, మతం, ప్రశాంతంగా ఏ విధమైన జుగుప్స లేక తిరస్కార భావం లేకుండా, దీర్ఘకాల కృషి ఫలితంగా సాధించిన, తాదాత్మ్యత, ఏకత్వభావన నుండి జనిం చిన అవగాహనతో, బ్రహ్మాండ దృశ్యజగత్తులోని సర్వాన్ని అవ లోకించింది.

ఈ ప్రపంచం అయదార్థం, సారహీనమైనదనే భావం నుండీ లేదా ఈ ఐహిక జీవితంకన్న ఉన్నతమైన, యదార్థమైన, సుఖ ప్రదమైన జీవితం ఉన్నదనే భావన నుండీ, సన్యాస సంప్రదా యం, ప్రపంచ వైముఖ్యత రూపుదిద్దుకొన్నాయిగాని, ప్రపంచం అంటే భయం వలనో, నైరాశ్యం వలనో కాదు. నిరాశానిస్పృహ లకు సంబంధించిన దాన్నంతా త్వరగా దాటిపోయి శాశ్వత శాంత్యానందాలతో పరవశించే లోకాల్లోకి చేరుకోవాలనే తపన తోనే అవి రూపుదిద్దుకొన్నాయి. భారతీయ లౌకికకవిత్వం, నాటకం, మొత్తం కూడా ఎంతో సంపన్నమైనది, సజీవమైనది, ఉల్లాసం కలిగించేది. ఈ విషయంలో మతం, సాహిత్యాలకన్న భారతీయ కళ భిన్నంగా ఏం లేదు. భారతీయ సాహిత్యం మొత్తంలో కనుపించని దాని కంటె ఎన్నో రెట్లు విషాదం, భయం, శోకం, నైరాశ్యాలు యూరోపియన్ సాహిత్యపు కొద్ది పుటల్లోనే కన్పిస్తాయి.

పాశ్చాత్య మేధస్సు తన కలవాటైన ప్రతిస్పందనలను, దేశీ యమైన మన అవగాహనలపై రుద్దుతోంది. ఇక్కడసలు పాశ్చాత్య మేధస్సుకు స్థానమే లేదు. ఉదా: శివతాండవాన్ని అదెలా అపార్థం చేసుకొన్నదో చూడండి. శివతాండవాన్ని మృత్యు లేక విలయ తాండవంగా చూస్తోంది. కాని నటరాజు వైపు దృష్టి సారించినవా రికి ఎవరికైనా, తద్విరుద్ధంగా, అది ఆనందతాండవంగా దర్శనమి స్తుంది. ఆ తాండవంలో అచంచలమైన, శాశ్వత, అనంత ఆనంద వైభవాలు దర్శనమిస్తాయి. అలాగే కాళిరూపం, ఐరోపావాసుల

కళ్లకు భయంకరంగా, రౌద్రంగా కన్పిస్తుంది. కాని అసురులనూ, మనిషిలో, ప్రపంచంలో ఉన్న దుష్టశక్తులనూ, దునుమాడటానికి జగజ్జనని దాల్చిన రూపమని మనందరకూ తెలుసు. పాశ్చాత్య మేధస్సు ఇలా చూడటంలో ఇంకా ఇతర కారణాలు ఉన్నాయి. మానవ పరిమాణాన్ని మించి ఉద్ధరించపబడేది ఏదైనా ఉంటే దాని యందు పాశ్చాత్యమేధస్సు కుండే అయిష్టత నుండి ఈ భావం మొలకెత్తినట్లు కన్పిస్తుంది. అతీతము, అపరిమితము, అమే యము లాటి భావనల యెడల ఉజ్వల భౌతికమానసానికి ఉన్న పరిమితి, భయం, నిర్వేదం, ఏవగింపు – వీటి సూక్ష్మాతి విశేషంతో కూడిన దృష్టికి సామాన్యంగా అలాగే అర్థం అవుతుంది.

కాని అటువంటి భావనకి భారతీయ మనస్తత్వంలో ఎక్కడా చోటు లేదు. కొన్ని అమానుషరూపాలు, లేదా రాక్షసరూపాలకు సంబంధించిన విచిత్ర లేక భయంకర పార్శ్వం గురించి చెప్పా లంటే భారతీయ సౌందర్యోపాసక మనస్సు, పృథ్వితోనేగాక, చైత్యపురుష స్థాయిలలో కూడా వ్యవహరిస్తుందనే విషయాన్ని క్కడ మనం గుర్తు చేసుకోవాలి. ఆ చైత్యపురుష స్తరాలలో ఈ రూపాలున్నాయి. కాని వాటి ప్రభావానికి లోనుగాకుండా స్వేచ్ఛగా వాటి మధ్య ఆ మనస్సు విహరిస్తూంటుంది. ఎందుచేతనంటే ఆత్మ లేక దైవశక్తియొక్క సర్వవ్యాపకత్వం మీద దానికి పెద్ద నమ్మకం వుంది. ఆ మనస్సు ఎక్కడ ఉన్నా దానితో పాటుగా ఆ నమ్మకం కూడా వుంటుంది.

ద్రవిడ వాస్తుశాస్త్రానికీ ఐరోపీయుల అభిరుచికీ ఎక్కడా పొంతన లేదు గనుక దానిపై భయంకర దాడి జరిగింది. అందు చేత నేను, హిందూ – ప్రత్యేకంగా – ద్రవిడ వాస్తుశాస్త్రాన్ని అధ్య యనం చేశాను.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కోనేరు వెంకటేశ్వరరావు

శ్రీమాత ఉపయోగించే మహాకాళి పద్ధతి

నీవు ప్రస్తావించిన శ్రీమాత ఉపయోగించే మహాకాళి పద్ధతికి సంబంధించి – ఈ అంశాలన్నీ వ్యక్తి, నిబంధన, పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. ఎవరిలో అయితే అసాధారణమైన ఆకాంక్ష మరియు ప్రధానంగా చిత్తశుద్ధి – ఎక్కడో ఒక చోట, ప్రాణికంలో అయినా సరే ఉంటుందో అలాటివారి పట్ల, ఎవరితో తాను సన్నిహితంగా ఉంటూ తన కాఠిన్యాన్ని అపార్థం చేసుకోకుండా తమపై ఆమె కృప ఉపసంహరించుకున్నది అని అనుకోకుండా, అదంతా తమ సాధనకు ఉపయుక్తమైనదిగా భావిస్తారో – వారి పట్ల – శ్రీమాత నీవు ప్రస్తావించిన మహాకాళి పద్ధతిని ఉపయోగిస్తుంది.

కొందరు ఈ పద్ధతిని సహించలేరు. ఇదే కొనసాగితే వారు దురవగాహనతో, నిరాశతో, తిరుగుబాటుతో దూరంగా పారిపోతారు. పద్ధతి – అల్పముగాని, అధికముగాని, వడిగలదైనదిగాని, దీర్ఘము మెలికలతో కూడినదై ఉండేది గాని – ఏదైనా శ్రీమాత అభిలషించేది మనుష్యులు ఆత్మానుభవసేకరణకు పరిపూర్ణ అవకాశం పొందగలిగే వారై ఉండాలి. ప్రతివాడు తన స్వభావానుగుణంగా చికిత్స పొందాలి. అమ్మ మందలింపులకు భయపడితే నీవు అభివృద్ధిని ఎలా సాధిస్తావు? త్వరితగతిని పురోగమనం సాధించాలంటే మహాకాళి ప్రహారాలను కూడా స్వాగతీకరించాలి. ఎందుకంటే, అవే నిన్ను పురోగమన మార్గంలో ముందుకు నెట్టి త్వరితగతిని నిన్ను ముందుకు సాగిపోనిస్తాయి.

*

ఆమె నిస్సంకోచంగా, స్వేచ్ఛగా, ధారాళంగా, నేనేం చెయ్యాలో, ఏమి చెయ్యకూడదో నాకు విశదీకరించగల సన్నిహిత సంబంధాన్ని శ్రీమాతతో నేను ఏర్పరచుకోగలగటం సాధ్యమా?

అవశ్యం. దివ్యచైతన్యం పరిపూర్ణంగా సాక్షాత్కారమైనప్పుడు, అమ్మ సంకల్పానికి, సాధకుని సంకల్పానికి మధ్య ఎట్టి తేడా ఉండదు.

నీవు చెప్పిన రీతిగా అమ్మ ఆచరించాలంటే – అలాంటి సంబంధ బాంధవ్యాలు నెలకొనాలంటే సాధకుడు శ్రీమాతలోని మహాకాళీ దృక్పథమునకు భయపడకూడదు. ఎప్పుడూ (ప్రసన్న) మధురిమనే ఆపేక్షించకూడదు. అతడు మహాకాళి అఘాతాలను ఆశీస్సులుగా ఆమోదించి స్వీకరించాలి. ఆమె దూరదృష్టిపైన, ఆమె యుక్తాయుక్త పరిజ్ఞానంపైన, ఆమె మాటపైన పరిపూర్ణమైన విశ్వాసం కలిగి ఉండాలి. అలా కాక తన అహంకి విరుద్ధంగా ఏమైన అనినా, చేసినా ముఖం ముడుచుకొని చిరచిరలాడుతుంది, తన్ను తానే సమర్ధించుకుంటూ. ఇది అహంకార లక్షణం. కాక పోతే చాలా కొద్దిమంది మాత్రమే అసంపూర్ణముగనైనా, అను కూల వైఖరిని స్వీకరించగలుగుతారు. అమ్మ అటువంటి వారితోనే ఈ సంబంధం కలిగి ఉంటుంది. భిన్నస్వభావం కలిగిన ఇతరు లతో ఆమె భిన్నరీతిలో వ్యవహరించక తప్పదు. ఎందుకంటే ఆమె ప్రతివారితోను, వారి వారి స్వభావాన్ని బట్టి వ్యవహరించవలసి ఉంటుంది కదా!

పై నుంచి వచ్చేదేదైనా కాంతి, శక్తి, శాంతి, ఆనందం – అలలు అలలుగా వస్తాయి. నీ విషయంలో ప్రభావితం చేస్తున్న శక్తి అదే. అది అలా ప్రవాహరహితంగా లేదా వర్షంలా లేదా ప్రశాంత గంభీరోధధిలా ఉన్నట్లయితే మహాకాళి అచట పనిచే స్తున్నది. అలాంటప్పుడు నిర్భయంగా ఉండటం అవసరం.

సౌందర్యాభిలాష హానికరము కాదు. విశ్వజనీన సౌంద ర్యాన్ని జాగృతం చేయటం మరియు మహాలక్ష్మి శక్తిని వినిర్మలం గావించటం – దాని మనోజ్ఞలాలిత్యాన్ని విశుద్ధపరచి ప్రకాశ మానం చేయటం అభిలషనీయం. ఇది కామలోభములను వ్యక్తప రచటం కాదు. మనం కనుక అజాగ్రత్తగా ఉంటే అలాటపుడు కుటిలత్వం చోటు చేసుకొనే అవకాశం లేకపోలేదు. మహాకాళి అనుభవం లోనికి రాజసిక తామసము, హింస చొచ్చుకొనివచ్చే

అవకాశము కూడ ఉన్నది. అలాగే అనుభవించి ఆనందించాలనే ప్రాణికస్థాయి ఆవేశానికీ అవకాశమున్నది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అన్నవరం ఆదిశేషయ్య

కాళీమాత పనితీరు

సమస్తమైన విధ్వంసాలు, భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు, తుఫానులు, వరద భీభత్సాలు మొదలైన ప్రకృతిగతమైన అపార మైన వినాశనాలు, వెనుకనేగాక, భూమిపైన మానవులు చేసే హింసాయుత విధ్వంసాలకు, యుద్ధాలకు, విప్లవాలకు, తిరుగుబా ట్లకు వెనుక కూడా భూవాతవరణంలో రూపాంతర ప్రక్రియలోని ప్రగతిని వేగిరపరచడం కోసం మహాకాళిశక్తి విజృంభణే నాకు కన్పిస్తున్నది.

ఈ విధ్వంసాలకు ఊర్ధ్వంగా, మౌలికంగా భగవంతుని సంకల్పం మాత్రమేకాక, సంసిద్ధి స్పర్శ గూడా ఈ వినాశకర సంఘటనల స్వభావంలో వుంది. ఈ విపత్తుల తీవ్రత అనేది అపరిపూర్ణతల ఘనిష్టతను తెలుపుతున్నది.

వీటినుండి సరైన గుణపాఠాలు నేర్చుకొని అవసరమైన అభివృద్ధిని సాధించడం ద్వారానే నిజానికి ఈ విపత్తులు తిరిగి రాకుండా నిరోధించడం జరుగుతుంది.

*

ఈ విధ్వంసాన్ని ఆహ్వానించడం అనే ప్రశ్నే లేదు. కానీ అది నేర్పే గుణపాఠాన్ని మాత్రం నేర్చుకొని తీరాలి.

*

కాళీమాత విజృంభించిన సందర్భంలో నిలబడి మిగిలిపోవడం కోసం ఎవరైనా, శక్తిని, న్యాయాన్ని కోరడంకాక దయాదాక్షిణ్యాల కోసం ప్రార్థించాలి.

*

అనుగ్రహం పనిచేస్తున్న సమయంలో చిత్తశుద్ధి లేకపోవడం అనేది దాన్ని నిరర్థకం చేసే ఒక సరిచేయలేని లోపం. చిత్తశుద్ధి లోపించిన సమయాల్లో ప్రపంచంలో మహాకాళి విధ్వంసకర విజృంభణ అనేది తప్పనిసరి.

*

అసలు నీకు దుర్గామాత కథ తెలుసా, తెలియదా? దుర్గామాత ప్రతి సంవత్సరం అసుర సంహారం చేయాల్సిందే. ఆమె యీ పనిని తిరిగితిరిగి చేయడం అనివార్యం. అసుర పరిపాలనను అంతం చేసే వరకూ యీ పని అలా జరుగుతూనే వుంటుంది. ప్రపంచంలో వాటి పరిపాలన తుడిచిపెట్టుకుపోయాక ఇంక అలా జరగదు. అయితే అంతవరకు, అంటే ఎంతవరకైతే దాని ఉపయోగం వుంటుందో (ఈ పుస్తకంలో నేను మరోచోట చెప్పినట్లు) ఆకాంక్ష బలపడేంతవరకూ చేతనకు కావలసిన వివరణ అందేంతవరకూ, చిత్తశుద్ధిగలవారి శక్తిని పరీక్షించేందుకు ఇది అలా కొనసాగుతూనే వుంటుంది. ఇంక ఈ పరీక్షలు అవసరం ఏమాత్రం లోనిరోజున వారి చిత్తశుద్ధి పరిశుద్ధంగా వుండి తనంతట తాను నిలబడగలిగిన రోజున ఇవన్నీ కన్పించకుండా పోతాయి. ఆ రోజునుంచి దుర్గామాత తన యుద్ధాన్ని ప్రతిసంవత్సరం జరపాల్సిన అవసరం ఏమాత్రం వుండదు.

*

ప్రతి సంవత్సరం దుర్గామాత యుద్ధం చేసి విజయం సాధించడం అనేది పరమోన్నత దివ్యచేతన విశ్వప్రగతి కోసం లయబద్ధంగా నియమితమయిన సమయాలలో జోక్యం చేసుకొంటుందన్నదానికి ప్రతీక.

*

వ్యతిరేకశక్తుల దాడులు తప్పనిసరి. ఆటంకాలన్నింటినీ ధైర్యంగా అధిగమించి నీ పయనం ప్రగతిపథాన సాగిపోయేందుకు అవన్నీ పరీక్షలుగానే పరిగణించాలి. ఈ పోరాటం కఠినమే అయినా దాని నుండి నీవు బయటపడినపుడు నీవు ఎంతోకొంత సాధించి నీ మార్గంలో మరో ముందడుగు వేస్తావు. అందుకే వ్యతిరేకశక్తుల

ఉనికి అవసరం వుంది. అవి నీ సంకల్పశక్తిని గట్టిపరుస్తాయి. నీ ఆకాంక్షను స్వచ్ఛతరం చేస్తాయి.

అవి ఆలా వుండేందుకు నీవే కారణం అనేది నిజం. నీలో వాటికి స్పందించేది ఏదో వున్నంతవరకూ వాటి జోక్యం అనేది అలా వుండటం సరైనదే. నీ స్వభావంలో ఏ భాగమూ, వాటికి స్పందించేది ఏదీ లేనపుడు అవే నిన్ను విడిచి వెళ్ళిపోతాయి.

మూలం: శ్రీమాత

అనువాదం: కొంగర భాస్కరరావు

ఒక Chaldean పురాణ గాథ

చాలా కాలం క్రితం నాటి మాట. అరేబియా దేశపు ఎడారి భూమిలో పరమ ప్రేమ ఎలా వుంటుందో తెలియజేయడం కోసం ఒక దేవదూత అవతరించింది. అనుకున్నట్లుగానే మానవులంతా ఆమెను తప్పుగా అర్థం చేసుకున్నారు. అనుమానించారు. వేధించి పగబట్టి చంపాలని వెంటపడ్డారు. ఈ హింసతో గాయపడిన ఆమె తన పనిని నెరవేర్చుకొనడం కోసం ప్రశాంతంగా చనిపోవాలని అక్కడి నుండి పారిపోయింది. హఠాత్తుగా ఆమెకు ఆ సువిశాల ఎడారి ప్రాంతంలో ఒక చిన్న దానిమ్మపొద కన్పించింది. నెమ్మదిగా పాకుకుంటూ దాని కొమ్మల మాటుకు వెళ్లి ప్రశాంతంగా దేహత్యాగం చేయాలనుకుంది. అంతే. వెంటనే ఆ చిన్నపొద కాస్తా ఆశ్చర్యంగా విస్తరించింది. ఏపుగా పెరిగింది. గుబురుగా, దట్టంగా ఆమెను వెంటాడుతున్నవారికి ఆమె కన్పించనంతగా అల్లుకుపోయింది. వారికి ఏమాత్రం అనుమానం కలుగలేదు. వెళ్లిపోయారు.

ఆమెనుండి జారిన పవిత్రమైన రక్తపు చుక్కలతో ఆ భూమి సారవంతమయింది. ఆ పొదంతా చక్కని విశాలమైన పొడవైన, దట్టమైన రేకులతో సింధూరవర్ణంతో కూడిన అద్భుతమైన పుష్పాలతో నిండిపోయింది. అవన్నీ ఆమె నుండి స్రవించిన అసంఖ్యాకమయిన రక్తబిందువులకు ప్రతిరూపాలు.

ఈ పుష్పాలే మనకు 'దివ్యప్రేమ' ను ప్రకటిస్తున్నాయి.

*

మధుమయి మాతా! ఈ Chaldean పౌరాణిక గాథకు కాళీమాత పూజకి ఏమైనా సంబంధం ఉందా?

ఉంది నాన్నా! అందుకే నేను కాళీమాత పూజాదినాన ఎపుడూ 'దివ్యప్రేమ' పుష్పాలు (అనార్కలి) పంచిపెడుతుంటాను. మహాశక్తికి సంబంధించిన అన్ని అంశలలోనూ మహాకాళి రూపం అత్యంత దయామయి. ఆమెది అత్యంత క్రియాశీలము, శక్తివంతము అయిన ప్రేమ. అందుకే కాళిమాత పుజాదినాన 'దివ్యప్రేమ' పుష్పాల రేకులను పంచిపెడుతుంటాను. ఈ పుష్పాలు 'దివ్యప్రేమ' కు ఎలా ప్రతీకలైనవీ యీ వివరణ సరిపోతుంది.

*

దివ్యమాత అంశలన్నింటిలోనూ కాళి క్రియాశీలము, అత్యంత శక్తివంతమైన స్పందనలతో కూడిన ప్రేమను వ్యక్తీకరిస్తుంది. ఒక్కొక్కసారి భయంకరంగా కన్పించినా ఆమె సువర్ణశోభలతో నిండిన అత్యంత శక్తివంతమైన ప్రేమను గొనివస్తుంది.

*

కాళిమాత సకృత్తుగా (rarely) మనస్సులో పరిచాలనం చేస్తుంది. ఉన్నతమైన స్థరాలలో రూపాంతర ప్రగతిని ముందుకు త్రోసే శక్తివంతమైన ప్రేమను అందిస్తుంది. ప్రాణికస్థాయిలో ఆమె అసత్యాన్ని, ఆత్మవంచనను, దుష్టసంకల్పాలను నిర్మూలించే శక్తిస్వరూపిణి. మంచిని, సత్యపరమైనదానిని యింకా ప్రగతిశీలపథాన్ని ఆమె ఎన్నడూ నిర్మూలించదు. పైగా వాటిని కాపాడి నిలబెడుతుంది.

*

మనం ఈ భూమిమీద అనేక జన్మల నెత్తేది ప్రగతిని సాధిస్తూ మనల్ని మనం పరిపూర్ణులం గావించుకొనేందుకే. కాళిమాత తనను కోరినవారికి ఎప్పుడూ సహాయపడుతూనే ఉంటుంది. ఆమె సహాయంతో పురోగమనం అనేది చాలా శీఘ్రంగా వస్తుంది కూడా.

సృష్టిలో మహాకాళి దివ్యప్రేమను ప్రకటిస్తుంది. అయితే అది ఎంతో ఉన్నతం, శక్తివంతం. ఆ ప్రేమ ఎంత ఉన్నతం అంటే దానిని (భరించలేక) మానవులు భయపడుతుంటారు.

మూలం: శ్రీమాత

అనువాదం: కొంగర భాస్కరరావు

మహాకాళిని చిత్రించే ప్రతిమలు

(శ్రీఅరవిందులవారి 'The Mother' నుంచి మహాకాళికి సంబంధించిన భాగం శ్రీమాత చదువుతారు.)

ప్రశ్న: మహాకాళి స్వరూపం గురించి చెప్పే కథలు నిజమేనా?

నాయనా! నీవే కథలు గురించి ప్రస్తావిస్తున్నావు? వందల కొలది కథలు ఉన్నాయి. ఏ మహాకాళి గురించి? ఆమెను చిత్రించే ప్రతిమలు, విగ్రహాలు గురించా? మానవుడు విషయాలను పరికించే విధానమది. ఆమె (నిజానికి) అలా ఉండదు.

నీ కిదివరకే నేను చెప్పాననుకుంటాను. ఉన్నత అస్తిత్వంలో వాటికి మౌలికస్వరూపాలు ఉంటవి. కాగా ఇవి ప్రత్యేక తరగతివి. భౌతికసీమలలో భూమికి చేరువ అవుతూన్న కొలదీ అసాధారణంగా అసంఖ్యాకంగా వేర్వేరు ఆకృతులు రూపుదిద్దుకుంటూ ఉంటాయి. శ్రీఅరవిందులు ప్రస్తావించేవి అతిమానస (Supermind) భూమికలకు దగ్గరగా ఉండి అతిమానస మూలానికి సుస్పష్టమైన చైతన్య సంసర్గంలో ఉంటాయి. శ్రీఅరవిందుల పేర్కొనే అధిమానస (Overmind) స్థాయిలో కూడా అవి అభివ్యక్తమౌతవి. ఆ స్థాయిలో రూపము మరింత గమనించగలిగేలా కొంత స్పష్టత కలిగి ఉంటుంది. ప్రజ్ఞాపాటవాలు బలహీనంగా ఉంటవి. తర్వాత అధిమానసం (Overmind) నుంచి క్రిందికి భౌతిక మనోభూమిక లోనికి (terrestrial mind) దిగజారుతవి. ఉదాహరణకి. పాపం! మహాకాళినే తీసుకో. లెక్కలేనన్ని మహా

కాళీలు ఉన్నవి. ఒకదానిని మించి భయంకరంగా మరొకటి. కొన్ని ఉగ్రోదగ్రంగా ఉంటవి. ఇవి పూర్తిగా మానవకల్పితాలు. మనోకల్పనలు. బాహ్య ఆకృతులు. అంతర్గత మహాకాళియొక్క ఒక అస్పష్ట ప్రతిబింబము వక్రీకరింపబడి బలహీనపడి మరుగుజ్జులా మానవచైతన్యస్థాయికి దిగజార్చబడుతుంది. మహాకాళియే కనుక చూస్తే ఆ రూపం నాది కానే కాదు అంటుంది. కంపరం పుట్టించే ఎన్నో రకాలైన మహాకాళి ప్రతిమలు నేను చూశాను. వాటి ప్రస్తావన మనకొద్దు. ఒక మంచి కళాకారుడే కనుక రూపొందిస్తే కొంత అందం మిగిలి ఉంటుంది. అద్దైనా రంగులు అద్దిన వికారాలు. ఏమీ మిగలదు. ఇక, దేవాలయాలలో ప్రతిష్ఠించే ఆకృతులు, ప్రతిమలు, విగ్రహాలు గురించి – మతమునకు సంబంధితమైన ఒక పూజావిధానం నిర్వహింపబడుతుంది. అర్చకుడు ఏ కాస్తంత అయినా నిగూఢశక్తియుతుడు కాగలుగుతే తన ఆకాంక్ష వల్ల, ఆచార అనుష్ఠానాల వల్ల, భౌతికాతీతమైన చైతన్యాన్ని వాటిలో నిక్షిప్తం చేయగలుగుతాడు. అదీ సూత్రము – "ఇది రాయి, రప్పా కాదు, ఉత్తి బొమ్మా కాదు. అందులో శక్తి ఉన్నది. మంత్రోచ్చారణ ద్వారా అది శక్తిని సంతరించుకున్నది" అంటాడు. అప్పుడు నీవు అనుకోవచ్చు. సరే కాని, పూజారి యొక్క స్వభావ (సద్భావాలు) ఎలాటివి, నిగూఢ విజ్ఞానశక్తులతో అతనికున్న అనుబంధ మెంతటిది – ఇలా యెన్నో విషయాలు. ఏదో ఒకటి ఉండకపోదు. దానియొక్క స్వభావ గుణశ్రేష్ఠతలు వైరుధ్యంగా, కొండొకచో, కలవరపెట్టేవిగా ఉంటవి. తెలివితక్కువ అజ్ఞాని ఎవడైనా ఏ శక్తీ లేకుండా, క్రిందికి ఏ శక్తినీ తేలేక హంగామా చేయడం అనేది సామాన్యంగా జరుగదు. మహాకాళి ఉదాహరణ నేను ఎందుకు చెప్పానంటే, సాధారణ మానవచైతన్యంలో మహాకాళి అంటే భయంకరమైనదనే భావన ఉంది. ఇతర దేవతల విషయంలో అయితే భీభత్సం ఉండదు. ఉదాహరణకు – మహాసరస్వతి – ఈమెకి అన్నిరకాలైన కళా, సాహిత్య, శ్రేష్ఠ గుణాలను ఆపాదిస్తారు. అవి భయంకరమైనవి కావు. కాని మహాకాళి ప్రత్యేకత వేరు. ఆమె శక్తిసామర్థ్యాలు, పోరాటపటిమ,

వారి భావనలో ఎంతో భయం ఉద్భవించటంవల్ల, అవి నిమ్నస్థాయిలో కొంత ప్రమాదభరితంగా ఉంటాయి, వాటిని ఆరాధించే వారికి. భారతదేశానికి వచ్చినప్పటి నుంచి లెక్కలేనన్ని కథలు విన్నాను. లెక్కలేనన్ని కాళీ విగ్రహాలు చూశాను. ఎంతోమంది కాళీవిగ్రహాలను ఇంటిలో ఉంచుకొని ఆరాధించేవారిని యెరుగుదును. వాళ్ల భయంకర సంఘటనలు తెలుసు నాకు. వాళ్లని అప్రమత్తం చేసి చెప్పాను. మీ దుర్విధి విధానాలన్నిటికీ మహాకాళియే కారణం అనుకోవద్దు. అందుకు ఆమె బాధ్యురాలు కాదు. కాకపోతే మీ ఇంట్లో ఉన్న కాళి ఈర్ష్యతో పగతీర్చుకునే బలమైన ప్రతీకారశక్తికి ఆశ్రయం ఇచ్చి ఉండవచ్చు. అది ప్రాణిక స్థాయి లోనిది కాబట్టి నీ బలమైన విశ్వాసంతో నిజంగానే ప్రమాదభరిత పరిణామాలు సంభవించవచ్చు. ఎన్నో రకములైన కష్టాలననుభవించి, మహాకాళి విగ్రహాన్ని గంగలో పారవైచినవారి నెందరినో నేనెరుగుదును. ఆ విధంగా ఊపిరి పీల్చుకోగలిగి, ప్రమాదం తప్పించుకోగలిగినా, కొంతమంది ఎంతగానో భయపడిపోయి, ఆ దుష్టపరిస్థితినలా కొనసాగేలా చేసుకుంటూరు.

నిజానికి భూవాతావరణంలో భౌతికవిషయాలతో వ్యవహరిస్తూ ఉండే కాళి శక్తి ఉన్నది. ఆమె స్వతంత్రురాలు కాదు అని చెప్పవచ్చు. ఆమె మహాకాళి వ్యక్తీకరణ కాదు. కాకపోతే ఆమె, ఈమె తాలూకు అధిక లక్షణాలను పుణికి పుచ్చుకుని, ఈమెకి పూర్తిగా ఒదిగి ఉంటుంది. ఆ లక్షణాలు శక్తి ఫలసాధనలలో అంత శక్తివంతంగా ఉండవు. కాని వాటికి అస్తిత్వం ఉన్నది. ఆమెయొక్క (మహాకాళి) సౌందర్యస్వభావమూ అక్కడ ఉంటుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ రాజేశ్వరి, కర్రా వెంకటేశ్వర్లు

శ్రీమాత నాల్గు స్వతంత్ర శక్తులు

ప్రశ్న: అమ్మా! ఆ నాలుగు శక్తులు వేటికవే స్వతంత్రంగా వ్యవహరిస్తాయా?

అవును కొంతవరకూ స్వతంత్రంగానే వ్యవహరిస్తాయి. కాని పూర్తిగా కాదు. ఒకోసారి సంపూర్ణమైన స్వేచ్ఛతో ఉన్నట్లుగా ఉంటుంది. అదే సమయంలో ఒక సర్వసంపూర్ణమైన శక్తితో అనుసంధానమై ఉంటుంది. ఈ భౌతిక ప్రపంచంలో కేంద్రచైతన్యశక్తిగా ప్రభవిస్తున్నది మహాశక్తియే. ఆ మహాశక్తి నించి అభివ్యక్తమయ్యేవే ఈ వివిధ ప్రముఖ వ్యక్తిత్వాలు. ఆ నాలుగు శక్తులు తమకి తాము స్వతంత్రంగా, వారి వారి ఆకాంక్షల ననుసరించి పనిచేస్తున్నా వాటిని నియంత్రించగలిగేది ఆ మహాశక్తియే.

కాళినే ఉదాహరణగా తీసుకుందాము. కాళి కల్పించుకోవాలని నిర్ణయించుకుంటుంది. సహజంగా మరింత పరిపూర్ణ దూరదృష్టి కలిగి ఉన్న మహాశక్తి, ఇది సమయం కాదు, తొందరపాటు అని గమనించి వారిస్తుంది. స్వతంత్రంగా పనిచేసేదే అయినా, హెచ్చరికకు నిబద్ధమై కాళి ఉంటుంది.

అయితే ఆమె (మహాశక్తి) మహాకాళిని తన పనిని తాను ఎందుకు నిర్వర్తించనీయదు?

మహాకాళి కలుగచేసుకుంటే యుగాలు పట్టే పని, క్షణంలో జరుగుతుందని శ్రీఅరవిందులు చెప్పారు కదా!

అవును. మహాకాళి కార్యసరళి ఆ విధంగా ఉంటుంది. మహాకాళి ఒకే కోణం లోంచి చూస్తుంది. సమగ్రదృష్టి కలిగి ఉన్నపుడు అయ్యో! అది ఇప్పుడు జరగవలసింది కాదని అనుకుంటాం.... (అలాంటప్పుడే మహాశక్తి కలగచేసుకోవడం)

మూలం: శ్రీమాత
అనువాదం: డి సత్యవాణి

ఇద్దరు కాళీలతో శ్రీమాత భేటీ

ప్రశ్న: దేవాలయాలలో దైవానికి జంతుబలులు సమర్పిస్తుంటారు. ఇది జంతుహింస కాదా?

హింసకుకంటే కూడా ఇది అజ్ఞానానికి, నిశ్చైతన్యానికి దగ్గర. వారు క్రూరత్వంతో చేసేది కాదు ఇది. మినహాయింపులున్నాయి. చెప్పాలంటే, వాళ్లు చంపటంలో ప్రత్యేక ఆనందం పొందటానికని కాదు. ఒక దేవత అంటే వారి భయం ఉంటుంది. జంతుబలి ఇచ్చి ఆ దేవతయొక్క అనుగ్రహాన్ని పొంద తలుచుకుంటారు.

ఇక్కడికి దగ్గరే సముద్రపు టొడ్డున వీరంపట్నం దగ్గర మత్స్యకారుల దేవాలయం ఉంది. ఇది ఒక విచిత్రదేవత ఆలయం. ఒక కాళీదేవాలయం. ఈ కాళి గురించిన అసాధరణమైన కథలు వినిపిస్తుంటాయి. ఇక్కడ ఆచారం సంవత్సరానికి ఒక పర్యాయం అధికసంఖ్యలో కోళ్లను బలివ్వటం, నేనొక రోజు అక్కడికి వెళ్లటం తటస్థించింది. ఉత్సవం జరిగిన మరుసటి రోజు అది. అక్కడ ఆ ఇసుక స్థలమంతా కోడి ఈకలతో నిండి ఉంది. అన్నిటికీ మించి అక్కడ అంతా ఒళ్లు గగుర్పాటుకొలిపే వాతావరణంలో నిండి ఉంది. పూర్తి అజ్ఞానం. అక్కడ ఆచారం ఏమిటో తెలియదు. ఆ చంపిన కోళ్లను ఎవరు తింటారో తెలియదు. చంపినవాళ్లో లేక పూజారులో – వాటిని అన్నీ పూజారులే తింటే రోగగ్రస్థులు అవుతారు. బహుశః బలి ఇచ్చినవాళ్లు కూడా తింటారేమో! ఆ వాతావరణం చూస్తే ఆబ, తిండిపోతుతనం బాగా ప్రస్ఫుటమౌతుంది. చంపబడిన కోళ్లయొక్క ప్రాణికశక్తులతో ఆ కాళి సంతృప్తి చెందినట్లున్నది. చంపబడిన ప్రతి కోడియొక్క ప్రాణికశక్తి ఆ కాళికి ఆహారం. అది ఆమెకు ఆనందం. దానిని హింస అనాలో, పేరాశ అనాలో నాకు తెలియదు. అది పేరాశయే! ప్రాణికశక్తుల పేరాశ. పాపం! ఆ కోళ్లకి చైతన్యము లేదు కదా! అక్కడ సృష్టింపబడిన వాతావరణం అంతా నిమ్నస్థాయిలో బాధాకర చేతనారహితమైన వాతావరణం. క్రూరత్వపు తీవ్రత మాత్రం కాదు. కాబట్టి ఈ ఆచారం క్రూరత్వంవల్ల అని చెప్పటానికి అవకాశం లేదు. నేను

అలా అనుకోవటం లేదు. బహుశః వాళ్ళు తమకు ప్రేమాస్పదమైన ఒక పసివానిని లేక ఒక గొర్రెని బలిస్తే అది వారికి దుఃఖాన్ని కలుగచేస్తుంది. కాని ఇది ఒక నిశ్చైతన్యము; గొప్ప భయం. ఈ పని నేను చేయకపోతే, ఓ డజను కోళ్లను కనుక బలీయకపోతే, విధ్వంసక పరిణామాలు నా జీవితమంతా లేక ఈ సంవత్సర మంతా చోటు చేసుకుంటాయి. నా పిల్లలు రోగాల పాలౌతారు; నా ఉద్యోగం పోతుంది; తినటానికి తిండి ఉండదు; నేను ఎన్నో విషాదకర సంఘటలను ఎదుర్కొంటాను. కాబట్టి డజను కోళ్లను బలిస్తాను. ఇది కేవలం చంపవలెననే కోరిక కాదు. కౄరత్వం కాదు. నిశ్చైతన్యము.

ఆ కాళి ఏమి చేసింది మీరు ఆమెను చూడటానికి వెళ్ళి నపుడు?

మీకు ఆ కథ తెలియదా? స్థలం నాకు తెలియదు; కాని అరియను కుప్పానికి, దేవాలయానికి మధ్య రోడ్డు ఉంది. దారి మధ్య నా కారులో నిశ్చింతగా కూర్చుని ఉన్నాను. కాళీ గురిం చిగాని, కోళ్లు గురించిగాని, ఏ విషయము నాకు తెలియదు. అలా కూర్చుని ఉండగా ఆకస్మికంగా ఒక నల్లటి జీవము రావటం గమనించాను. జుట్టు విరబోసుకుని ఉంది. ఒక ఒడంబిక చేసు కుందాము అంది. దీనస్వరంతో "మీరు కోరి నన్ను స్వీకరిస్తే, నాకు సహకరిస్తే, ఇది ప్రఖ్యాతి కాంచిన స్థలమౌతుంది. బోలెడు మంది జనాలు ఇక్కడికి వస్తారు". ఆమె ఒక విలక్షణమైన అల్ప జీవి. నల్లగా, జుట్టు విరమోసుకుని, సన్నగా, హీనంగా ఉన్నట్లు ఉంది. తర్వాత తెలిసినది ఏమంటే – ఆమెకు ఒక దురదృష్ట సంఘటన జరిగినదని; ఆమె తల నరికివేయబడినదని; ఈ కథ నాకు ఎవరో చెప్పారు. అంత ఆసక్తి కల్గించేది కాదనుకోండి. అదొక దురదృష్ట కాళి. నిశ్చలంగా ఉండమని ఆమెకి చెప్పాను. నా నుంచి ఆమె ఏమి ఆభ్యర్థిస్తున్నదో తెలియదన్నాను. ఆమె ఆకాంక్ష, చిత్తశుద్ధితో కూడినదే అయితే అందుకు క్రియారూపక మైన ప్రతిస్పందన ఉంటుందని చెప్పాను. తర్వాత దేవాలయం చేరుకున్నాము. అప్పుడు నాకు అర్థమైంది. ఈ దేవాలయం ఆమె

కోసం నిర్మింపబడినదని. తర్వాత సరుగుడు తోటలో నుంచి సముద్రతీరానికి నడిచి వెళ్లాం. అక్కడ అంతా కోడి ఈకలు, రక్తపుమరకలతో నిండి ఉంది. నిప్పు రగిల్చిన గుర్తు ఉంది. కోళ్లను ఆ నిప్పులో వండుకుని తింటారు వాళ్లు. కథ అడిగాను. కాళీ కథ తెల్సుకున్నాను. అధికసంఖ్యలో కోళ్లు హత్య కావించ బడటం తెలుసుకున్నాను.

ఇదీ కథ. కోళ్లను చంపడంవల్ల ఆ జీవి చెప్పుకోతగిన సంతృప్తి పొందిందని, నేను అనుకోను. దాన్ని గురించి ఇంకేమీ తెలియదు. నేను ముందు చెప్పినట్లు ఆమె ఇందువల్ల పొందిన లబ్ధి అల్లా, కోళ్ల నుంచి విడివడిన ప్రాణికశక్తులను తాను విలీనం చేసుకొనటంలో పొందినదే. అంత జనాన్ని చూడడంలో కూడా ఆమె అత్యధికమైన సంతృప్తి పొందినది. ఎంతమంది అధికసం ఖ్యలో జనం వస్తే అంత అధికసంఖ్యలో కోళ్లు తనకు బలి అవు తాయి. విజయానికిది చిహ్నము. ఇది ఆమె ప్రాముఖ్యతను చాటుతూ ఉన్నట్లు నిర్ధారితమౌతుంది. ఆమె తన తెలివితేటలతో నా సహకారాన్ని అర్థించవచ్చింది. కొంత నా ప్రాణికశక్తిని, ప్రాణిక సమక్షాన్ని కోరింది. ఆ విధంగా మరింతమంది జనం, మరిన్ని కోళ్లు. అప్పుడు అది ఒక గొప్ప విజయోత్సవం. నేను ఆమెకు చెప్పాను. జరిగినది చాలు... శాంతించు అని.

శ్రీమాతా! ఆమె ఏ భూమికకి చెందినది?

బలమైన భౌతిక ప్రాణిక భూమికకు –

కాళీ అని ఎందుకు పిలువబడుచున్నది?

నాకు తెలియదు. ఈమె ఒక కాళి. ఆమె తల నరికివేయబ డినది – లేక – పీక దాకా పాతిపెట్టబడి ఉన్నది. సరిగా ఏమై నదీ తెలియదు. ఇలాటి కథ ఒకటి ప్రచారంలో ఉంది. ఇది ఒక కాళీరూపము. ఇలా లెక్కలేనన్ని కాళీరూపాలు ఉన్నాయి. ఎవరి నమ్మకానికి అనుగుణంగా వారొక రూపాన్ని చిత్రీకరించుకుం టారు. ఆ కాళితో అనుబంధాన్ని పెంచుకుంటారు. ఒక్కొక్కప్పుడు వ్యక్తిగతంగా ఎవరి 'కాళి' వారికి ఉంటుంది. కొన్ని కుటుంబం కొలిచే కాళీరూపాలు. అలాటివి ఎన్నో. అవి కోరిన కోర్కెలు

తీర్చకపోతే, ఆ కుటుంబంలో ఏదో దురదృష్టకర సంఘటన జరుగుతుంది. ఇలాటి బలమైన లక్షణం (అభిప్రాయాన్ని) ఏర్పర్చు కోవటం ఉంది. కుటుంబసభ్యులు దీనికి ఎక్కువ బాధ్యులు, కాళి కంటె కూడా. కుటుంబంలో మరణంలాంటి విచారకర సంఘ టన జరిగినపుడు కాళీ విగ్రహాన్ని గంగలో పారవేసే వాళ్లు నాకు తెలుసు.

ఈ కాళికి మహాకాళితో సంబంధము లేదు కదా? లేదు. మనిషి బుద్ధితోనే ఈమెకి సంబంధము (connection) ఇవన్నీ మానవుని బుద్ధిరూపాలు. కాని గణపతి వాస్తవంగా ఉన్నట్లు నేను కనుగొన్నాను. నేను ముందు ఇది మానవకల్పితం అనుకు న్నాను. కాని గణపతి యదార్థము. అలాటి జీవి (being) ఉన్నది. నేను చూచాను. (It is quite alive and it is not a formation) సజీవంగా ఉన్నది. కల్పితం కాదు. అలాగే కాళిరూపం కూడా ఉన్నది. ఆమెనీ చూచాను – నల్లటి కాళి, నాలిక బయటకి చాచి, పుర్రెల దండతో – I am sure she exists. అది మానవకల్పిత రూపము కాదు. యదార్థజీవము. ఈ జీవమునకు మనిషి తన ఆలో చనతో కల్పనలు చేస్తూండవచ్చు.

ఆ నల్లకాళి ఏమి చేస్తుంది?

చెడ్డపనులు చేస్తుంది. విధ్వంసంలో ఆమెకు ఆనందం. ఇది స్పష్టం.

అది మొదటి ప్రపంచయుద్ధకాలం. నేను ఇక్కడ ఉన్నాను. డూప్లే స్ట్రీటులో, డూప్లే హౌసులో నా నివాసం. ఆ ఇంటి డాబా ఎక్కి చూస్తే శ్రీఅరవిందుల గది కనిపిస్తుంది. ఆ గది గెస్టుహౌసు లోనిది. వారు అక్కడ ఉండేవారు. నేను ప్రతి ఉదయం డాబా ఎక్కి శ్రీఅరవిందుల గది వైపుగా కూర్చుని ధ్యానం చేస్తూ ఉండే దాన్ని. ఆ రోజు నా గదిలోనే ఉన్నాను. చిన్న కిటికీలో నుంచి శ్రీఅరవిందులవారి గదివైపు చూస్తూ. ధ్యానంలో ఉన్నాను – కాని కళ్లు తెరచుకునే ఉన్నాయి. ఈ కాళి నా గదిలోకి ప్రవేశిం చటం చూసాను. "నీకేమి కావాలి?" అని అడిగాను. వికృతంగా నాట్యం చేస్తోంది. నాతో అన్నది, "పారిసు స్వాధీనపర్చుకోబడు

తుంది, నాశనమౌతుంది." నేను ధ్యానంలోనే ఉన్నాను. ఆమె వైపు తిరిగి అన్నాను, "లేదు, పారిస్ స్వాధీనపర్చుకోబడదు. పారిస్ రక్షింపబడుతుంది." నిశ్చలంగా, నిశ్చయంగా అన్నాను. నన్ను వెక్కిరించి ఆమె వెళ్లిపోయింది. మరుసటి రోజునే మాకు టెలిగ్రాం వచ్చింది. ఆ రోజుల్లో రేడియోలు వగైరా లేవు. వార్తలు టెలిగ్రాముల ద్వారా తెలిసేవి. గవర్నమెంటు హౌసు గేటు దగ్గర ప్రకటన పత్రం అంటించబడేది. మాకు వర్తమానం వచ్చింది. ఏమనంటే – జర్మను సైనికులు పారిసును స్వాధీనపర్చుకోవాలని ముందుకు వెడుతున్నారు, పారిస్‌కి రక్షణ లేదని. కొన్ని కిలోమీటర్లు వెడితే పారిస్‌లో వాళ్లు అడుగుపెట్టేవారే. కాని రోడ్డు అంతా నిర్మానుష్యంగా ఉంది, వారిని అడ్డగించే వాళ్లెవ్వరూ ఎదురుగా లేరు; శత్రువులు ఎక్కడో పొంచి ఉన్నారని నిశ్చయించుకున్నారు. ఇదొక పన్నాగం అనుకున్నారు. అనుకుని వెనుతిరిగారు. (నవ్వు) ఫ్రెంచి ఆర్మీలు ఇది గమనించి వాళ్లని వెంట తరిమారు; పట్టుకున్నారు. యుద్ధం చేశారు. వారిని అక్కడే ఆపేశారు. గెలుపు వీరిదే అయింది. నేను కాళితో 'అలా కాదు' (No) అన్నప్పుడు వాళ్లు (జర్మన్లు) భయపడ్డారు. వెనుదిరిగారు. వాళ్లు మరికొంచెం ముందుకి కనుక వెళ్లి ఉంటే, అంతా అయిపోయేదే.

మహాకాళి చూడడానికి ఎలా ఉంటుంది?

నాయనలారా, మీరు చూచినప్పుడు మీరే నాకు తెలియచేయగల్గుతారు. ఆ కాళిలా మాత్రము ఈమె ఉండదు – పుర్రెల దండ మెడలో వ్రేసుకొని, నాలిక బయటకి చాచి నల్లగా.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

మతకర్మల గురించి శ్రీమాత

ప్రశ్న: అమ్మా, చైతన్యం సాధారణస్థాయిలో వున్నవారికి మతం పేరిట కర్మలు చెయ్యడం అవసరమా?

శ్రీమాత: అంటే...? నీ అభిప్రాయం?

ప్రశ్న: అదే... జపము, తపము...

శ్రీమాత: ఓ, అవా, అవి సహాయము చేస్తే మంచివే.... లేదూ... కేవలం కాలక్షేపమే... ఇటువంటి విషయాలు పూర్తిగా వ్యక్తిగతాలు... వాటి మీద మనకున్న నమ్మకమూ, మనలో వచ్చే మార్పుని పట్టి వాటి విలువ... అది ధ్యానానికి సహాయం చేస్తే మంచిదే. కానీ... వీటిని సాధారణంగా మూఢనమ్మకంతోనే చెయ్యడం జరుగుతుంది. 'నేను వారానికొకసారి గుడికి వెడితే, పూజ చేస్తే, తప్పక మంచే జరుగుతుంది' అనుకునే ఎక్కువమంది ఈ పని చేస్తారు. మూఢనమ్మకం ప్రపంచవ్యాప్తంగా ఉన్నదే. ఆధ్యాత్మికంగా పరికించినప్పుడు దీనికే మాత్రం విలువ లేదు.

ప్రశ్న: అమ్మా! ఉదాహరణకి – ఏడాదిలో కొన్ని రోజుల్లో ప్రత్యేకంగా లక్ష్మీపూజ, కాళీపూజ అని జరుపుతామే – మరి వాటి సంగతి?

శ్రీమాత: అది మీ సరదా కోసం.

ప్రశ్న: మీరు ఆ రోజున ప్రత్యేకంగా దీవిస్తారే!

శ్రీమాత: అదీ మీ సరదా కోసమే. (నవ్వు)

ప్రశ్న: కేవలం మా సరదా కోసం మమ్మల్ని ఆశీర్వదిస్తారా అమ్మా!

శ్రీమాత: మీ సరదా కోసం అన్నాను మిమ్ములను అగౌరవపర్చేలా. మీకివి ఆనందాన్ని ఇస్తాయి.

ప్రశ్న: మరి మహాకాళి పూజ రోజున!

శ్రీమాత: ఒక్కోసారి మహాకాళి రెండురోజులు ముందో, వెనకో వస్తుంది.... ఆవిడ కేవలం ఆ ఒక్క రోజునే అక్కడ ఉండదు... కానీ, మీ ఆనందం కోసం ఆ రోజు ఆవిడని కొంచెం స్తుతిస్తాను. (నవ్వు) ఏమైనా – నాకు వీటిలో నమ్మకం లేదు.

అంతేకాక అదృశ్యలోకంలోని ఏ జీవులూ తాము ఆరాధింపబడ వలెనని అపేక్షించరు. ప్రాణికస్థాయిలోనివారే పూజలతో సంతోషిస్తారు, వాళ్ల ప్రాముఖ్యత పెరుగుతుందని ఎంత ఎక్కువమంది వాళ్లని కీర్తిస్తే అంత సంతోషిస్తారు. కాని వాస్తవమైన దేవతలు వీటికి విలువ నీయరు. ఆరాధనలలో వారు ఏపాటి ఆనందము పొందరు. వారు గర్విష్ఠులు కారు. వారు విలువ నిచ్చేది నీలోని పరిశుద్ధ భావన, నిస్వార్థత, ఉత్సాహము, ఆధ్యాత్మిక ఆనందము .. వీటికే అధికతరమైన విలువనిస్తారు.

నే చెప్పేది చాలా గంభీర సత్యం. ఏ దేవతనైనా అలా ఓ ఆసనం మీద కూర్చోపెట్టి నువ్వు పూజిస్తూంటే, తమాషా చూసి నట్టు చూసి నవ్వుకోవడం తప్ప సంతోషించదు. నీ భజనలు, కీర్తనలు... వృధా! ఈ పూజలలో దేవతని సంతృప్తిపరచగలమనే ఆలోచన మీలోంచి వైదొలగాలి. భౌతికభూమికలకు చెందిన ప్రాణికజీవులకు సంబంధించిన క్షేత్రమిదంతా. వాళ్లకు ఇవన్నీ కావాలి. ఎంత ఎక్కువమంది భక్తులు కొలిస్తే, ఎంతమంది అను చరులు వుంటే అంత ఎక్కువ ప్రాముఖ్యత అనుకుని గొప్పలు పోయేవాళ్లుంటారు. కానీ... నిజమైన దేవతలకి... ఇంకా చెప్పాలంటే Overmind స్థాయిలో ఉన్నవాళ్లు కూడా, ఏవో కొన్ని మానవుల లాంటి లోపాలున్నా, ఇలా భజనలకి లొంగే స్వభావానికి అతీతులే. మతపరమైన ఏ కర్మలు కంటే నీలోని నిజమైన నిస్వార్థమైన సద్భావము, వివేకము, సూక్ష్మపరిశీలనా జ్ఞానము, తెలివి ఎన్నో రెట్లు ఆనందాన్నిస్తాయి. ఇవి ఉన్నతమైనవి. మతపరమైన నిమ్నస్థాయి చేతనకి చెందిన కర్మకాండతో వీటికి పోలికే లేదు. రూపాలో, రూపాంతరాలో ఇలవేల్పులుగా పూజిస్తారే, వాటికి చాలా ప్రాణశక్తి ఉంటుంది. ఈ 'కాళీ' పూజ చేసేవాళ్లకి పూజలో ఏ చిన్న తేడా అన్నా చచ్చేంత భయం. ఏ అవాంతరం వచ్చినా అది ఆ 'కాళి' కోపం వల్లే వచ్చిందనే వణుకు! అది చాలా భయంకర పరిస్థితి! నాకు ఈ ప్రాణికశక్తులు తెలుసు. వాటికి ఆ లక్షణాలూ, రూపురేఖలూ ఆపాదించి పూజించేది మనుషులే! ఆశ్చర్యకరం ఏమిటంటే – మనుషులే ఇటువంటి దారుణ లక్ష

ణాలు, రూపాలుకల దేవతలని సృష్టించి, పూజించి, అవి నిజమ నుకోవడం!

కొన్నాళ్ళపాటు ఇటువంటి ఆలోచనల నించీ, పూజావిధుల నించీ దూరంగా వచ్చేస్తే నయం. ఎందుకంటే, ఆలా అనుక్షణం భయంతో నిండిన మూఢ ఆరాధన ప్రాణికలోకాల్లోని క్రూరశక్తు లని ఆహ్వానించినట్లే. అవి ఆ మనుషుల్ని స్వాధీనపరుచుకుం టాయి, తమ సుఖం కోసం కబళిస్తాయి. అందుకే, ఒకసారి అందు లోంచి బయటపడి, అవి నిజం కాదని ఖచ్చితంగా తెలుసుకుని, మూర్ఖత్వం లోంచి మనోవికాసంతో ముందడుగు వెయ్యాలి. అప్పుడే ఆధ్యాత్మిక ఉన్నత శిఖరాలకి ఎదగగలుగుతారు. దివ్య సత్యచైతన్యశక్తులతో సహకరించగల్గుతారు. ఆధ్యాత్మికోన్నతికి ఈ రకమైన పూజావిధుల బంధాలనుంచి బయటపడవలసినదే...

మూలం: శ్రీమాత

అనువాదం: బి. వరలక్ష్మి

ఆశ్రమంలో నవరాత్రి పూజాదినములు

(శ్రీమాత మోనాసర్కార్‌తో సంభాషణ, ఆయన జ్ఞాపకాల ఆధారంగా.)

శ్రీమాత మోనాసర్కార్‌తో ఇలా అన్నారు. నేను మీకో విషయం చెప్పబోతున్నాను. శ్రీదుర్గా, మహాసరస్వతి పూజాదినములలో నేను భక్తులను ప్రత్యేకంగా ఆశీర్వదించేదానిని. శ్రీదుర్గ తదిత రులు, పూజాదినములలో నా దగ్గరకు వచ్చేవారు. ఒకరి తర్వాత ఒకరు ఏదో పనిమీద వచ్చేవారు. గతసంవత్సరమో, ముందు సంవత్సరమో నాకు గుర్తులేదు. కాలాన్ని గురించి నాకు పట్టింపు లేదు. తర్వాత పూజాదినములలో భక్తులకు ఆశీస్సులు అందిం చడం మానివేశాను.

పూజాదినముల సందర్భంగా శ్రీదుర్గ నా దగ్గరకు వచ్చి నది. ఆమె ఎంతో అందంగా దుర్నిరీక్షింగా వెలిగిపోతోంది. మిగతా

విశ్వశక్తుల వలెనే. నేను ఆమెను ఇలా అడిగాను, "ఈ పరిమిత అహంకారజనిత అస్తిత్వాలకు అంతం లేదా? వాటిని వదలిపెట్టి మూలకారణుడైన పరమాత్మ వైపు మీ దృష్టిని సారించేదెప్పుడు?" అప్పుడు ఒక అద్భుత అనూహ్యా సంఘటన జరిగినది. వినమ్రతతో కూడిన స్వతస్సిద్ధమైన కృతజ్ఞతాపూర్వకమైన ఆనందంతో ఆమె అన్నది... "అవును. నేను పూర్తిగా నీకు స్వంతము. నీవు ఏది ఇచ్ఛగిస్తే అదే నేను చేస్తాను. నీకు నేను అర్పణ కావించు కుంటాను" అని నా ముందు మోకరిల్లినది. అక్కడ సంశయమనేదే లేదు. అదెంతో సుందరమైన సన్నివేశము. చూడవలసినదే కాని, చెప్పనలవి కానిది. అప్పటి నుండి దసరా సందర్భంగా భక్తులకు ఆశీస్సులు అందించే పనికి స్వస్తి చెప్పాను. ఇంకా ఈ అవసరము లేదు కదా!

ప్రభువైన సర్వేశ్వరునికి మాత్రమే గౌరవ కృతజ్ఞతలు వెల్లడించుకుంటాము. సర్వేశ్వరుడు తప్ప మరెవ్వరు లేరు! విశ్వదేవతల (Cosmic gods) పాలన అయినది. ఆ అధ్యాయం ముగిసింది. మనకు ఇప్పుడున్నది సర్వేశ్వరుడు (The Supreme) మాత్రమే. దీనికి చాలా కాలం మునుపు నేను క్రీడాస్థలానికి వెళ్లినపుడు ఒక రోజు దుర్గ వచ్చి కలిసినది. నేను ఆమెనూ అప్పుడూ అలాగే ప్రశ్నించాను. ఎంతకాలం భక్తుల నుండి ఇలా విధేయతను ఆశిస్తారు? మరి సర్వేశ్వరుని (The Supreme) మనం పూజించేదెప్పుడు? ఆ సమయం ఆసన్నం కాలేదా? అన్నాను. అప్పుడామె శాంతస్వరంతో ఇలా అంది: "నేనూ అదే అభిలషిస్తున్నాను. నేను నీ దానను. కాని ఈ ప్రజలు నన్ను అంటిపెట్టుకొని నన్ను వదలటానికి ఇష్టపడటం లేదు." అదే వచ్చిన చిక్కంతా. వారు తమ అహంకారములను గతంలో లాగే తృప్తిపరచుకొంటూ, గతం నుంచి బైటపడి, సర్వోన్నతుని వైపు మరల లేకున్నారు. ఆ బంధం నుంచి బైటపడలేకున్నారు. మనిషి మారటానికి ఇష్టపడటం లేదు. తనకున్న బంధాలను, అహంకారాన్ని వీడలేకున్నాడు. మనిషే ఈ తేడా సృష్టించినది. ఆమె నాకు అంకితమై, పని చేయాలనుకుంటున్నా... ఆమె భక్తులు మాత్రం ఆమెను

పూజించేవారు. స్వార్థం, లాభం కోసం ఆమె ఆరాధననే కొనసాగిస్తున్నారు. అంతకు మించి మరేమీ లేదు. మనుష్యులు ఒక పట్టాన వదలరు. వారికి ఒక ఆలంబన అవసరం – వాళ్ల స్వార్థ అవసరాల కోసం. అందుకే అలా అంటిపెట్టుకుని వదలటం లేదు.

అయినా ఈ అందమైన అనుభవం వలన ఒక లాభం ఒనగూడినది. ఆమె సహకారంతో కొంత మంచిని సాధించగలిగాను. నూతన సంవత్సర సందేశంలో ప్రకృతి మనకు సహకరించి పని చేస్తుందని పేర్కొన్నాను. గుర్తుందా!

అవును మాతా!

ఈ విధంగా ఆమె తన్ను తాను పూర్తిగా వైదొలగించుకోగల్గినది. ఇప్పుడు మనకీ పూజలతో అవసరము లేదు. ఆమె సర్వోన్నతునితో ఐక్యమైనది. మన మిపుడు ఆరాధించవల్సినది సర్వేశ్వరునే. ఆమె ఇపుడు నాలో ఉన్నది. బోధపడిందా?

మూలం: The Supreme

అనువాదం: చెదలవాడ వెంకట శేషయ్య

శ్రీమాత యొక్క 1958 నూతన సంవత్సర సందేశము

భౌతిక ఆకృతిలో ఉన్న ప్రకృతి మాతా! నీవు సహకరిస్తా నంటివి. నీ సహకార వైభవానికి అంత మెక్కడ తల్లీ!

దేవతలతో మన అనుబంధము

దేవతలతో మన అనుబంధాన్ని శ్రీఅరవిందులు ఎలా భావించి దర్శించారో అనే ఆసక్తికరమైన అంశము గురించి మీకు చదివి వినిపించాలనుకున్నాను.

మీకు తెలుసు భారతదేశంలో లెక్కలేనన్ని వర్గశ్రేణులకు చెందిన దేవత లున్నారు. వారంతా వివిధ స్తరాలకు చెందినవారే. వారిలో కొందరు మనిషికి బహు చేరువగా ఉన్నారు. ఇంకా కొందరు ఆ పరమాత్మకు (The Supreme) దగ్గరై, కొందరు మధ్యస్థంగా ఉన్నారు.

పురాణాల్లోని దేవతల గూర్చి ప్రస్తావిస్తే (నిన్న మనం సినిమాలో చూచిన లాటివి) ఇంకా బాగా అర్థం చేసుకోగలరు. వాళ్ల ఎన్నో విధాలుగా, ఎన్నో విషయాల్లో మానవుని కంటే తక్కువ స్థాయిల్లో ఉన్నవారే! అయినప్పటికీ వారిలో అపారమైన శక్తి ఉంటుంది.

అధిమనస్సుకు (the Ovenmind) చెందిన దేవతలుంటారు. వాళ్ల గొప్ప సృష్టికర్తలు. అట్లాగే వైదికదేవత లున్నారు. వారు ఋషిప్రోక్తలుగా కిందికి వచ్చినవారే. ఇక అతిమానసానికి చెందిన దేవతలున్నారు. వారెప్పుడూ పూర్ణశాశ్వతస్థితిలో వారి వారి చైతన్య భూమికలలో ఎప్పటికీ ఉండనే ఉంటారు. ఇక్కడ శ్రీఅరవిందులు ముఖ్యంగా వైదిక దేవతలను గూర్చి చెబుతున్నారు. కానీ సమ గ్రంగా కాదు. పురాణాల్లోని దేవతలకంటే ఉన్నతమైనవారు.

శ్రీఅరవిందులు మనకు వివరించి చెప్పేది, నిజానికి వైదిక దేవతలకు చేసే ఒక ప్రార్థన.

ఓ వరుణదేవా! నన్ను విస్తృతపరుచు.
ఓ ఇంద్రా! నాలో శక్తివై వసించు.
ఓ సూర్యదేవా! నన్ను తేజోమూర్తిగా తీర్చిదిద్దు.
ఓ చంద్రమా! నన్నందరికి హితునిగా ఆహ్లాదకరునిగా ఉండనీ.
ఓ రుద్రుడా! నాలో భీకర ఉగ్రతలతో వెల్లొందు.
ఓ మరుత్యు! ఓ వాయుదేవా! నాకు తీవ్ర ఉద్రేకాన్నివ్వండి.

ఓ ఆర్యమా! నాలో శక్తిధైర్యాలు ఉద్దీపింపచేయుమా!
ఓ భాగా! నాకు ఆనందభోగాలు అమర్చవయ్యా!
ఓ మైత్రా! కాంతిని నింపి నన్ను అంతర్ప్రేరితుని కావించు.
ఓ ప్రభాతమా! శోభాయమానంగా పరిఢవిల్లు నాలో. చీకటివల్ల నాకు పవిత్రత, సఫలత చేకూరుగాక! జీవితము ఉల్లాశభరిత మగు గాక!
ఓ మృత్యుదేవా! ఈ జీవనభవంతి నుంచి మరో నవజీవనహార్మ్యానికి నన్ను నడుపు.
ఓ బ్రహ్మణస్పతీ! ఈ సమస్త దేవతాశక్తులను నాలో సమన్వయ పరచు.
ఓ కాళీ! నన్నీ దేవతలకు బద్ధుడను కానీయకు సుమా!

కాళికాదేవిని శ్రీఅరవిందులు విముక్తం గావించే గొప్ప శక్తిగా ఆవిష్కరించారు. ఆమె మిమ్ము తీవ్రంగా అభివృద్ధి వైపుకు నడిపస్తుంది. ఆ పై ఎటువంటి అవరోధాలు మీ ప్రగతిని అడ్డగించలేవు.

ప్రశ్న: శ్రీఅరవిందులు కాళీకే ఎందుకంత ప్రాధాన్యత నిస్తున్నారు?

ఆ యా దేవతలు ప్రతీకలుగా ప్రాతినిధ్యం వహించే ఆ దివ్యలక్షణాలను మనలో కల్గి ఉండటమనేది చాలా ఉత్తమమే కాక, ఆవశ్యకం కూడా. అందుచేతనే శ్రీఅరవిందులు ఆయా శక్తుల్ని ఆవహింప చేసుకున్నారు. పరమోన్నతుని దివ్యసాక్షాత్కారము, సంయోగము, ఆకాంక్షించేవారి కివి సరిపోవు. అందుకే వీరందరికీ అతీతులు కాగలిగే శక్తి కోసం కాళిని ప్రార్థించారు.

కాళి విశ్వమాతలోని పరమోన్నత అంశ. ఈ సృష్టిలోని సమస్త దేవతలకూ మించిన శక్తి ఆమెది. ఆమెలో ఐక్యత నొందటమంటే పరిపూర్ణ విశ్వవిశాలశక్తులను పొందగలగటమే! అందుకే శ్రీఅరవిందులు ఆ మహాశక్తితో ఐక్యతకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చారు.

మూలం: శ్రీమాత
అనువాదం: హర్షవర్ధన్

అనుబంధం:

శ్రీ దుర్గా స్తోత్రం

(దండక రూపం)

(శ్రీఅరవిందుల కృతికి అనుకృతి[1])

1. జయ! జనని! దుర్గే! శివప్రియే!
సర్వశక్తిప్రదే! సింహవాహాధిరూఢే!
భవచ్ఛక్తి లేశాంశ సంజాతులున్
యౌవనోద్భాసితుల్ భారతోర్వీ సముద్భూతులౌ మేము
నీ మందిరంబునన్ నిల్చి ప్రార్థించుచున్నాము.
మాతా! మోరాలింపవే! భారతక్ష్మోణి నావిర్భవింపవే!

2. తల్లి! దుర్గే! యుగశ్రేణు లన్నింటిలో మర్త్యులై పుట్టుచున్,
జన్మజన్మంబు లన్నింటిలో నీదు కార్యంబులన్ దీర్చుచున్,
మీద నీ శాశ్వతానంద ధామంబులున్ జేరుచున్నాము:
నే డట్టులే నీదు కార్యంబులన్ దీర్పగా
దీక్షతో బుట్టియున్నాము: మాదౌ మొరాలింపవే!
భారతక్ష్మోణి నావిర్భవం బందుచున్
మాకు దోడ్పాటు సేయంగదే!

3. తల్లి! దుర్గేశ్వరీ! సింహవాహే!
త్రిశూలాంకహస్తే! జయశ్రీసనాథే!
తనుత్రాణ సంఛాద నోద్దీపితాకార సౌందర్యరాశీ!
మహాదేవి! నీకోస మీ భారతక్ష్మోణి యత్తైత్తి చూపెట్టి
యుండెన్,

---

[1] శ్రీఅరవిందులు బెంగాలీలో '*Dharma*', No. 9 (అక్టోబరు 1909) కొరకు వ్రాశారు. ఆంగ్లంలో దీనిని నళినీకాంత గుప్త అనువదించారు. దీనిని శ్రీఅరవిందులు చూచి చిన్న సవరణ చేశారు.

భవద్దివ్య రూపావ లోకోత్సుకత్వంబునన్ వేచియుండెన్,
మొరాలింపవే! భారతక్షోణి నావిర్భవంబందవే!

4. తల్లి! దుర్గేశ్వరీ! సత్త్వదే! ప్రేమదే! జ్ఞానదే!
శక్తిసంపన్మయీ! భీమసౌమ్యాతి రౌద్రస్వరూపీ! శివే!
జీవనోపాధి సంగ్రామరంగంబునన్
భారతోర్వీక సంగ్రామ రంగంబునన్
నీవు ప్రేరేపగా యోధు లైనిల్చి యున్నాము: మాతా!
యిదే మా మనఃప్రాణ వృత్తుల్ విజృంభింపగా
వానికిన్ రాక్షసంబౌ బలం బుద్యమంబిచ్చి,
యీ మా మనీషాత్మశక్తుల్ ప్రకాశింపగా,
వానికిన్ దైవికంబైన శీలంబు విజ్ఞానమున్ గూర్చి
పాలింపవే! మా మొరాలింపవే!

5. తల్లి! దుర్గే! జగజ్జాల విఖ్యాత మీ భారతీజాతి
యీనాడు గాఢాంధకారంబునన్ మున్గి పెంపేది యుండెన్
గదే!
నీవు ప్రాచీదిశా ప్రాంగణంబందు దీపింపగా,
నప్డె నీ దివ్యదేహ ప్రభల్ దోచి,
యీ చీకటింబాపి ప్రత్యూషరోచిస్సు లిచ్చుంగదే
తల్లి! తేజఃప్రసారంబు వచ్చుంగదే!
యీ తమోరాశి నాశంబు సేయంగదే!

6. తల్లి! దుర్గేశ్వరీ! శ్యామలా!
సర్వసౌందర్య రేఖాకళా! పుష్కలా!
ప్రేమవిజ్ఞాన శక్త్యాలయంబైన యీ భారతక్షోణి
నీదౌ విభూత్యంశమేయౌ గదా!
యీమె యిన్నాళ్లు నించించుకే!
స్వీయశక్తిన్ సమార్జించుకొం
చాత్మసంగోపనాయత్తయై యుండె:

నిష్ఠిప్పుడే యాగతం బీయుగం-భాగతం బీదినంబెంచి,
యావన్మహా భారతీయోరు భారంబునెల్లన్
భుజస్కంధమందుంచికొంచున్.
సముత్క్షిప్తశీర్షంబుతో లేచి నిల్చున్న దోతల్లి!
దుర్గేశ్వరీ! రాగదే!
యింక నీభూమి నావిర్భవం బీగదే!

7. తల్లి! దుర్గాంబికే మేము నీ కన్న సంతానమే గామొకో
నీ ప్రసాందంబుచే నీ ప్రభావంబుచే
నీ మహాకార్యమందున్ మహాలక్ష్యమందున్
సమర్థాత్వమున్ బొందగానిమ్ము! మాతా!
తొలగింపవే క్షుద్రభావమ్ము! మాతా!
మలంగింపవే స్వార్థ వృత్తమ్ము! మాతా!
భయాందోళనం బెల్లమాయింపవే!

8. తల్లి! దుర్గే! కపాలాస్థిమాలే!
కృపాణాఢ్యహస్తే! వివస్త్రే మహాకాళి!
దైతేయ సంహారిణీ! క్రూరసంరావిణీ! దేవీ!
మాలో నిగూఢారివర్గంబు
నీయట్టహాసంబులో సుంతదాక్షిణ్యముంచూప
డొక్కండునున్ జారిపోకుండ నిర్మూలముంజేయవే!
మమ్ము సంశుద్ధ బుద్ధాత్ములన్ జేయవే!
నిన్ను బ్రార్థింతు మీ యొక్కటే! తల్లి! యావిర్భవంబీయవే!

9. తల్లి! దుర్గేశ్వరీ! భారతక్షోణి యీనాడు
క్షుద్రాశయ స్వార్థభీత్యాదులన్
జాలదైన్యంబునన్ క్రుంగియుండెన్ గదే!
దీని బాపంగ-మమ్మున్
మహాసత్త్వులన్గా, మహోద్యోగులన్గా,
సుదారాత్ములన్ సత్యసంకల్పులన్గా

సమర్థించి దీవించి పాలింపవే!
యెన్నడే నల్పమౌ హీనమౌదాని
నెద్దానినిన్ గోరకుండం గటాక్షింపవే!
యిందునావిర్భవంబందవే!

10. తల్లి! దుర్గేశ్వరీ! నీ మహాయోగశక్తిన్
బ్రయోగోప యోగాది సంభారసంస్కార
విస్తారముంజేయవే!
తావకంబైన యీ యార్యసంతానమం
దిప్డు లుప్తంబులైయున్న
మేధాతపస్యా సదాబ్రహ్మ చర్యంబులన్
శక్తియున్ భక్తియున్ శ్రద్ధయున్ జ్ఞానమున్
సత్య నిష్ఠాదికంబెల్ల వేవేగమే యుద్ధరింపంగదే!
వాని నన్నింటి నీ విశ్వమం దెందునెండున్ బ్రసారింపవే!
సర్వదౌర్గత్య సంహారిణీ! లోకసంతారిణీ!
యీ ప్రజానీకముం గావగా నిందు నావిర్భవంబందవే!

11. తల్లి! దుర్గేశ్వరీ!
యస్మదంతర్గ తారివ్రజంబెల్లబోకార్చి,
యీ బాహిరంబైన విఘ్నంబులన్
బాధలెల్లన్ నివారించి కాపాడవే!
సత్త్వవంతంబు ధీరంబు
శూరం బుదారంబునౌ భీరతీజాతి
ప్రేమంబునం దైక్య భావంబునన్
సత్త్వసత్యంబులన్ జ్ఞానయోగంబులన్
శిల్పసాహిత్య సంగ్రామ రంగంబులందెందు
సర్వోన్నతింబొంది రాణింప,
దత్తత్కళా సుందరోద్యాన మధ్యంబులన్
దత్కళారమ్య కేదారసస్యంబులన్
దత్కళాప్రోన్నతాద్రీంద్ర శృంగంబులన్

దత్కళాపుణ్య ధున్యగ్రతీరంబులన్
నిత్య సంవాస సంచార సౌఖ్యంబులందం
గటాక్షింపవే! తల్లి!
నీపాదపద్మంబులన్ ముట్టి
మేమిట్టి విజ్ఞప్తియే సేయుచున్నాము:
నీవింక నావిర్భవంబందవే!

12. తల్లి దుర్గంబ! నీయోగశక్తి ప్రభావంబుతో
మా శరీరంబు లెందెల్లనిండన్ ప్రవేశింపవే!
నీదుశస్త్రంబులందేము
సర్వాశుభధ్వంసియౌ ఖడ్గమౌనట్టు
లజ్ఞాన విధ్వంసియౌ దీపమౌనట్లు
కాంక్షించుచున్నాము: యోగేశ్వరీ:
నీదు సంతానమౌ మావిశుద్ధాత్మలన్
భారతీయాత్మలందీ మహాకాంక్ష పూరించి పాలింపవే!
ధీరధీరంబుగానేడు మాముంగలన్నిల్చి
నీయంత్రశక్తిన్ జలాయింపవే!
వాడియౌ నీకటారిన్ దుటాయింపవే!
జ్ఞానదీపంబు చేపట్టి వెల్గింపవే!
యిట్టులీభూమి నావిర్భం బందవే!

13. తల్లీ! దుర్గేశ్వరీ! నీవు మాసేవకుంజిక్కుచో
నిన్ను మేమెన్నడున్ వీడగాబోము:
మా ప్రేమతో భక్తితో నిన్ను బంధింపనేర్తు:
మోతల్లిరో! రమ్మ! రారమ్మ!
మా మా మనఃప్రాణ కాయమ్ములందింప్పు
డావిర్భవింపంగ రా రమ్మ!
హే వీరమార్గైక సందర్శినీ: రమ్మ మా జీవనం బెల్లనెల్లప్పుడున్
మాతృపూజాపరార్థంబె యౌగాక!
మా సేవనంబెల్ల నెల్లప్పుడున్

మాతృసేవాపదార్థంబె యౌగాక!
నీపాదమూలమ్మునన్
బ్రేమసంపూర్ణమున్ శక్తిమంతంబు మా ప్రార్థనం బింతయే:
తల్లి! దుర్గేశ్వరీ! యీ మహాభూమిపైనింక
లీలావతరంబు చూపంగ! దమ్మా!
మహాదేవి! యీ భారతక్షోణిపై నింక
బూర్ణావతారంబు సేయంగదమ్మా!
నమస్తే; నమస్తే; నమస్తే; నమః

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: గడియారము వేంకట శేషశాస్త్రి

శ్రీమాత వ్యాఖ్య

భారతదేశాన్ని ప్రేమించి ఆమె ఔన్నత్యంకోసం కృషి చేసేవారికి
– నా ఆశీస్సులతో
శ్రీమాత

సమాచార పత్రం

శ్రీఅరవింద సొసైటీ వార్షిక సమావేశాలు, పాండిచేరరిలో, ఆగస్టు 12, 13, 14 తేదీలలో జరిగినాయి. శ్రీ శ్రద్ధాళు, డా॥ ఆనంద రెడ్డి, ఆచార్య కిట్టు రెడ్డి, డా॥ అలోక్ పాండే మరియు డా॥ నడ్కర్ణి గారలు ప్రసంగించారు. ఆచార్య మనోజ్ దాస్‌గారు ఒక గంట ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించారు. మహిళా సమవేశం జరిగింది. ఆగస్టు 15 న శ్రీ యం.యస్. సుందరరాజన్‌గారు తమిళంలో ప్రసంగించారు. శ్రీఅరవిందుల గీతావ్యాసములపై అధ్యయన శిబిరము డా॥ ఆనందరెడ్డి గారిచే ఆగస్టు 16 నుంచి 22 వరకు నిర్వహింపబడింది.

రెండు అధ్యయన శిబిరాలు డా॥ నడ్కర్ణిగారిచే నిర్వహింపబడుతున్నాయి. 1) నవంబరు 16 నుంచి డిశంబరు 4, 2006

వరకు, శ్రీఅరవిందుల గీతావ్యాసాల పైన 2) 2007 ఫిబ్రవరి 23 నుంచి, మార్చి 5 వరకు శ్రీఅరవిందుల (సావిత్రి) పైన బీచ్ హాలులో ఉ. 9 గం. నుంచి, 11.45 వరకు, మధ్య అరగంట విరామంతో జరుగుతవి. అందరూ ఆహ్వానితులే.

శ్రీఅరవింద సొసైటీ ఆంధ్రప్రదేశ్ పాలకవర్గము 31.3.2007 వరకు నియమాకం కాబడింది. పాలకవర్గ సభ్యులు: అధ్యక్షులు: శ్రీ బి. వెంకట్రామయ్య, ఉపాధ్యక్షులు: సర్వశ్రీ డి.వి.యన్ శర్మ, ఎ.వి,యన్. రాజు, జె, సురేంద్రాచార్య, కార్యదర్శి-కోశాధికారి: శ్రీ వి. సుబ్బారావు, యూత్ కో ఆర్డినేటర్: శ్రీ పి. స్వరూప్, సభ్యులు: సర్వశ్రీ ఎ. ప్రేమచందర్, యం. మల్లిఖార్జునరావు, కుమారి యన్. విజయలక్ష్మి, పి. రాజేశ్వరరావు, ఎ. నరేంద్రబాబు రెడ్డి, కర్రా వెంకటేశ్వర్లు, మరియు ఎక్సు-అఫీషియో సభ్యులు: శ్రీ ప్రదీప్ నరంగ్‌గారు. సహాయ సభ్యులు: సర్వశ్రీ శ్రీ వై.యస్.వి.యస్ మూర్తి, టి.వి. రమణారావు, బి.యస్.కె. చౌదరి, డా. ఆర్. సరోజాప్రసాద్, వై. మోహనరావు, కె.ఆర్.యల్. నరసింహారావు మరియు టి.యస్. రామచంద్రరావు గారలు.

కేంద్రవార్తలు

వడోదరా (గుజరాత్) బ్రాంచివారు 12 వ వార్షిక అధ్యయన తరగతులు (శ్రీఅరవిందుల గ్రంధావళిపై), శ్రీఅరవిందనివాస్‌లో జూన్ 4 నుంచి 19 వ తే.ల వరకు నిర్వహించారు. నైవేలీ (తమిళనాడు) కేంద్రం వారు పుస్తకప్రదర్శన జూన్ 30 నుంచి జూలై 9 వరకు నైవైలీలో ఏర్పాటు చేశారు. బెంగుళూరు (కర్ణాటక) బ్రాంచి వారు రెండవ వయోజన శిబిరాన్ని జూలై 7, 8, 9 తేదీలలో ఉల్సూర్ శ్రీఅరవిందభనన్‌లో నిర్వహించారు. నవోడా (ఉ.ప్ర) వారు మంత్రశక్తిగురించి శ్రీమతి శృతిగారిచే ఆగస్టు 5 న ప్రసంగం ఏర్పాటు చేశారు. రత్లమ్ (యం.పి) బ్రాంచివారు జూలై 23 న శ్రీఅరవిందుల బోధనలు గురించి ఒక సెమినారు నిర్వహించారు.

Rs. 15



అఖిల

అఖిల భారత పత్రిక

నవంబరు 2006

విషయసూచిక

శ్రీమాత ప్రవచనములు

శ్రీఅరవిందులు చేపట్టిన ప్రపంచ పరివర్తన మహా యజ్ఞం అఖండవిజయం పొందుతుందన్న విశ్వాసంలో ఒక్క క్షణమైనా తత్తరపాటు పనికిరాదు. అది నిజం. మేము చేపట్టిన దివ్యయజ్ఞ విషయంలో అనుమానానికి అసలు తావు లేదు... ఈ పరివర్తన సంభవించి తీరుతుంది. భూమిపై ఏ శక్తీ దానిని నిలువరించలేదు. ఏ శక్తి కూడా సర్వశక్తిమయుడైన పరాత్పరుని అప్రతిహత ఆదేశాన్ని నిర్వీర్యం చేయలేదు. బలహీనతల్ని, ఆత్మవిశ్వాస రాహిత్యాన్ని పారద్రోలండి. సుదీర్ఘ పోరాటం చిరంతన విజయంగా మారే మహనీయ దివ్యక్షణం వస్తుంది. అంతవరకు ధైర్యంతో సహనంగా వుండాలని నిశ్చయించుకోవాలి.

ఒక నవలోకం

మానవలోకానికి ఇది ఒక నవసంక్రాంతి. ఒక నవలోకం వెలసింది, వెలసింది, వెలసింది అని ముమ్మారు రెట్టించి మరీ ప్రకటించారు శ్రీమాత. ఏమిటా నవలోకం? అందు నివసించే మానవుడు ఎలా ఉంటాడు? వాని స్వభావాలు ఎలాటివి? నేటి మానవునికి రాబోయే, నాటి మానవునికి ఏమిటి తేడా? ఇదంతా అందమైన ఒక అపోహ? ఇది నిజంగా వాస్తవమయేదేనా? ఈ సంశయాలు సహజం. వినటానికి, ఊహించటానికి, ఆసక్తికరంగానే కాకుండా ఆశ్చర్యంగాను, నిజమేనా అనిపించేటట్లుగానూ ఉంటాయి. 'సావిత్రి' మహాకావ్యంలో శ్రీఅరవిందులు అంటారు: జగన్నాటకంలో ఒక క్రొత్త అంకానికి తెరతీసి (అవతారమూర్తులు) ఆ ఇద్దరూ ఒకటై (The united Two) ఒక నవయుగానికి నాంది పలికారు – అని. అది సత్యలోకం. ఆ ఇద్దరు మరెవరో కాదు; శ్రీమాతారవిందులే! ఆ రాబోయే సత్యశివసుందరలోకాన్ని అందమైన కవితాకృతిగా ఆవిష్కరించారు, శ్రీఅరవిందులు. అది కేవలం ఒక అపురూప సౌందర్య కవితాకల్పనే కాదు; రూఢియైనది కూడా. ఆ రాబోయే అతిమానసచైతన్య మానవుడు, ఇపుడున్న మానవాకృతిలోని పశువుగా కాక, మానవాకృతి తాల్చిన దైవంగా వ్యక్తమౌతాడు. సాధరణ మనోచేతనకి పైన ఎన్నో చైతన్యభూమికలు ఉన్నాయి. అందు సర్వోన్నతమైనది. 'అతిమానసము' (The Supermind). దానికి దిగువది 'అధిమానసము' (The Overmind). మానవుని జీవన మహాప్రస్థాన లక్ష్యము, అతిమానస చైతన్య (the Supramental Consciousness) సాధనయే. శ్రీవారి తపస్సాధన అందుకే. అది వారు సాధించారు. మానవాళి సాధించటానికి పథ నిర్దేశం చేశారు. శ్రీమాతారవిందుల అవతారలక్ష్యమే అది. మున్నెన్నడూ, ఈ భూలోకచరిత్రలో ఈ మహత్తర లక్ష్యసాధన కనీసం ఊహించినది కూడా కాదు. అలాటిది వారు సాధించి, అతిమానస వైతాళికులుగా అమరమై నిలిచారు. ఆ అతిమానసలోక నైసర్గిక లక్షణాలు, అతిమానసజీవుని జీవలక్ష

ణాలు శ్రీమాత తమదైన ప్రత్యేకశైలిలో వ్యక్తీకరించారు. భూమిపై అతిమానస అభివ్యక్తీకరణ ఇక ఏమాత్రము వాగ్దానం కాదు. అది ఒక సజీవసత్యముగా, వాస్తవంగా ఇపుడు ఇక్కడ పనిచేస్తూన్నది. ఎంతటి గ్రుడ్డివాడు, నిశ్చైతన్యుడు, అనాసక్తుడూ కూడా, దానిని తప్పక గుర్తించవలసిన సమయం వస్తుంది అన్నారు – శ్రీమాత. ఆ వివరాలు ముందు పేజీలలో, శ్రీమాత దివ్యచైతన్యస్ఫురాలో, చదివి ఆకళింపు చేసికొనెదరు గాక!

– సంపాదకుడు

భూమిపై అతిమానస అభివ్యక్తీకరణ

ఫిబ్రవరి 29, 1956, బుధవారం

సాధారణ ధ్యానసమయం

ఈ సాయంకాలం దివ్య అస్తిత్వం భౌతికంగా వాస్తవమై మీ మధ్య దర్శనీయమై ఉన్నది. విశ్వంకంటె విశాలమైన సజీవ బంగారు ఆకృతి నాకు అనుభావ్యమైనది. స్వర్గము నుంచి భూమిని విడదీసిన బంగారువాకిలి ముంగిట నేను ఉన్నాను.

తలుపు చూస్తుండగనే ఒక తృటిలో ముహూర్త మాసన్న మైనదని తెలుసుకున్నాను, సంకల్పించాను. శక్తివంతమైన బంగా రుసుత్తిని రెండు చేతులతో పైకి ఎత్తి ఒకే ఒక దెబ్బ కొట్టాను. తలుపు తునాతునకలై పోయింది. అపుడు అతిమానస దివ్యచైత న్యశక్తికాంతిలహారులు ఏకధారగా భూమిపై పొంగులెత్తినవి.

1956

29 ఫిబ్రవరి – 29 మార్చి

ప్రభూ, మీరు ఇచ్చగించినది నిర్వహించాను.
భూమిపై ఒక నవసంక్రాంతి ఆవిర్భవించింది
ఒక నవలోకం వెలసింది
మాట తప్పలేదు.

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

గొప్ప పరివర్తన

1. ఒక నవలోక అవతరణ

నూతన ప్రపంచము ఆవిర్భవించినదని మీ అందరికి నేను ప్రకటించాను. అయితే ఇది పాతలోకంలోనే అంతర్నిహితమై ఉంది. అందుచేతనే చాలామందికి వ్యత్యాసం కనపడటం లేదు చాలా నిలకడగాను, కొంతవరకు చాలా సమర్ధవంతంగానూ కూడా క్రొత్తశక్తులు పనిచేస్తున్నాయి. ఆధ్యాత్మికజీవనానికిది తొలుత ఒక క్రొత్త భావన. అంతేకాదు దివ్యసత్యము కూడా. సంప్రదాయ ఆధ్యాత్మికం ప్రపంచాన్ని అక్కడే వదిలేసి దివ్య అస్తిత్వంలోకి తప్పించుకొనిపోవటం – అంతే, దీనికి ప్రతికూలమైన క్రొత్త దార్శినకత (our new vision), నీ జీవితాన్ని దివ్యంగా రూపాంతరీకరించి, భౌతికజీవనాన్ని దివ్యజీవనంగా పరిణమింప చేస్తుంది. అయితే ఇది, ఇదివరకు ఉన్న ఈ ప్రపంచాన్ని అభివృద్ధిపర్చి, విశాలపర్చి, కొనసాగించటమే ఔతుంది. ఇంతవరకూ అది మేధోపరమైన భావన; అంతే. కాకపోతే ఇక్కడ జరిగినది మాత్రం నిజంగా క్రొత్తవిషయం – ఒక క్రొత్తలోకం వెలసింది – a new world is born, born, born. అలాగని పాతది రూపాంతరీకరణం చెందటం కాదు. ఒక క్రొత్తలోకమే ఆవిర్భవించింది. ఒకటేమో, సాధరణ చైతన్యాన్ని ప్రబలంగా పట్టి శక్తివంతంగా ఇంకా అధికారాన్ని చెలాయించాలనే ప్రయత్నం. క్రొత్తది నెమ్మదిగా, నిరాడంబరంగా, తెలియకుండా చొరబడి, బాహ్యంగా దేనినీ అస్థిరపర్చకుండా, ప్రస్తుతానికి చాలమందికి చైతన్యపరంగా తెలియకుండా పనిచేస్తోంది; ఇలా నూతన చైతన్యం తన్నుతాను వ్యక్తం చేసుకుని, భౌతికంగా కూడా తన ఆధిక్యతను చాటుకుంది.

మనం ఇప్పుడు అపరిణతమై, శక్తిహీనమైన ఒక క్రొత్తలోక ఆవిర్భావాన్ని దర్శిస్తున్నాము. దాని బలహీనత అంతస్తత్వంలోనిది కాదు – బాహ్య అభివ్యక్తీరణలో – ఇది ఇంకా గుర్తింపబడనిది; భావనకి అందనిది. 'అబ్బే! లేదు' అని అధికసంఖ్యాకులకు అనిపించేది. కాని ఇది ఇక్కడ ఉన్నది. వృద్ధి అవటానికి కృషి

చేస్తోంది. ఫలితం గురించి ఎలాంటి సందేహము లేదు. అయితే దీనికి మార్గము పూర్తిగా క్రొత్తది. ఇదివరకెన్నడూ దీని జాడ తెలియనిది. ఇది ఒక ఆరంభము మాత్రమే. విశ్వవ్యాప్తమైన ప్రారంభము. ఇంతవరకెవ్వరూ అక్కడికి చేరలేదు. ఇదంతా ఊహించని, ఊహించలేని సాహసం.

సాహసాన్ని ఇష్టపడే వారున్నారు. వారికే నా ఈ పిలుపు. ఈ గొప్ప సాహసానికి మిమ్ములను నేను ఆహ్వానిస్తున్నాను.

మనకు పూర్వీకులు గతంలో సాగించిన ఆధ్యాత్మికతత్వానికి ఇది పునరావృతి కాదు. మన సాహసం దానిని అధిగమిస్తుంది. ఇది ఒక క్రొత్త సృష్టి; పూర్తిగా నవ్యమైనది. ఊహించని సంఘటనలు, సాహసములు, చిక్కులు – వీటితో కూడుకున్నది. ఇది వాస్తవంగా సాహసమే. దీని లక్ష్యసాధనలో గెలుపు తథ్యము. అందుకు మార్గం క్లిష్టమైనది. నెమ్మది నెమ్మదిగా జాడలు తెలుసుకుంటూ పోవాలి. ఇంతవరకు ఈ విశ్వంలో లేనిది. మళ్లీ తిరిగి కావాలంటే వచ్చేది కాదిది. ఇది మీకు ఆసక్తిదాయకమైనదైతే ముందుకు సాగుదాం. రేపు మీకు ఏమౌతుందో నేను చెప్పలేను. I have no idea.

మనం ముందు ఊహించి, మన ఊహల ప్రకారం, మనం సిద్ధం చేసుకున్నదంతా ప్రక్కని పెట్టివేయాలి. ఇది తెలియని నవ్య లక్ష్య దిశగా ప్రస్థానం. ఏమైనాకానీ! సాగిపోవాలి.

2. రెండు లోకాలు – వాటి తారతమ్యత

నాకు ఒక విషయం అనిపిస్తుంది. అది ఇక్కడ నొక్కి చెప్పాలి. మన లోకానికి అతిమానసలోకానికి తేడా ఉంది. ఇక్కడ వర్తించే సాధారణ చేతనతో, ఆ ప్రపంచంలోకి ఆరోహించిన తర్వాతే, ఈ లోకం ఎంత బృహత్తరమైనదో నాకు ప్రస్ఫుటమైనది. ఇక్కడ ప్రతీది కృత్రిమమైనదే! లోలోపలి అంతరంగంలోకి వెడితే అది వేరే విషయం. సాధారణ భౌతికవిలువలు వేటికీ కూడా సత్యము ప్రాతిపదిక కాదు. మనం ధరించటానికి దుస్తులు ఎలా కుట్టించుకుంటామో, ఆకలిబారి నుంచి శరీరాన్ని కాపాడుకోటానికి బయ

టనుంచి ఆహారం స్వీకరిస్తామో ఇలా ప్రతి అంశంలోను మన భౌతికజీవనం కృతకమే.

అతిమానసలోకజీవనం సత్యమైనది. చిత్తశుద్ధితో కూడినది. సహజమైనది. సంకల్పప్రచోదితంగా సచైతన్యంగా పుట్టుకొని వచ్చేది. భౌతికజీవనాన్ని సామరస్యపూర్వకంగా నిర్దేశించేది. శక్తి, జ్ఞానము ఉన్నవాడు తాను కోరుకున్నది పొందగలుగుతాడు. అవి లేకపోతే అభిలషించేవాటిని కృత్రిమమార్గాల ద్వారా పొందలేడు.

నీ జీవితానికి సంబంధించిన సుఖదుఃఖాలు నీ జన్మకు సంబంధించిన ఉన్నత లేక హీన – పరిస్థితుల ఆధారంగా నిర్దేశింపబడి ఉంటాయి. అంతేకాని నీ అంతస్తత్వానికి అనుగుణంగా ఉండదు నీ జీవితం. నీకు సహజంగాను, స్వతస్సిద్ధంగాను, నీ చిత్తశుద్ధికి అనుగుణంగాను నీ పరిస్థితులు ఉండవు. ఎందుకూ పనికిరానివాడు ఉన్నతస్థాయిలో ఉంటాడు. అద్భుతమైన శక్తియుక్తులుండి, కార్యదక్షత కలిగినవాడు హీనస్థాయిలో ఉంటాడు. లోకంలో నిజాయితీయే కనుక ఉంటే ఇతను అన్ని విధాలుగా పనికివచ్చేవాడు కాగల్గుతాడు.

ఈ (artificiality) అసహజత్వము, చిత్తశిద్ధిలోపము, అసత్యము (lack of truth) నన్ను వ్యాకులపరుస్తున్నాయి. అదంతా ఒక కృత్రిమ ప్రపంచం. అలాటప్పుడు అక్కడ మనకు నిజమైన విలువలు ఎలా లభిస్తాయి!

3. విశ్వదేవతల లోకము – అతిమానసము

శ్రీఅరవిందులవారి కార్యక్రమము పృథ్వీతత్వముయొక్క రూపాంతరీకరణము.

మనసుకి పైన వివిధ చైతన్యసత్వాలు ఉన్నాయి. వాటిలో నిదే వాస్తవమైన దివ్యలోకం. ఇదే శ్రీఅరవిందులు నామకరణం చేసిన, అతిమానస సత్యలోకం (Supramental Consciousness). వీటి మధ్య అధిమానసం (Overmind) విశ్వదేవతల లోకాన్ని గుర్తించారు. ఇంతవరకూ అధిమానసమే ప్రకాశవంతమైన తన చైతన్యస్థాయిలో అత్యున్నతమైనదిగా మానవుడు గుర్తించాడు.

అదే ఇంతవరకూ ప్రపంచాన్ని నిర్దేశిస్తూన్నది కూడా. దీనిని (Overmind) సాధించినవారు, ఇదే సర్వోత్తమ పరమదైవంగా భావించారు. అదే పరమాత్మ అని నిస్సందేహంగా భావించారు. సాధారణ మనోచేతన దానినే సర్వోన్నత అస్తిత్వంగా నమ్మింది. మిరుమిట్లు గొలిపే దాని వెలుగులు మరి అలాటివి! కాని నిజానికి the Overmind is far below than the true Divine. అధిమానసం నిజమైన దివ్యత్వానికి చాలా దిగువనే ఉన్నది. అది దివ్యసత్యమునకు (the Truth) ప్రామాణికస్థానం కాదు. చరిత్ర పుట్టినప్పటి నుంచి, అది, మనుష్యులు ఇంతవరకూ పూజిస్తూ ఉన్న విశ్వసృష్టి శక్తులకు, దేవతలకు నిలయం. ఇంతవరకు అధిమానసము (the Overmind) అతిమానసంగా (the Supermind) భావింపబడుతూన్నది. ఇది పొరపాటు. అందుచేతనే నిజమైన దైవము (the true Divine) ఇంతవరకు అభివ్యక్తీకరింపబడక, భౌతికస్వభావము రూపాంతరీకరింపబడ లేదు. విశ్వదేవతలు (the Cosmic Gods) సత్యచైతన్యంలోనే (in the truth Consciousness) పూర్తిగా ఉండరు. దాని సంసర్గం మాత్రమే కలిగి ఉంటారు. ఒక్కొక్క దేవత పరమాత్మయొక్క (అనంత) వైభవాలలో ఒక్కొక్క అంశకి ప్రతిరూపంగా మాత్రమే ఉంటుంది.

ప్రపంచచరిత్రలో, నిస్సందేహంగా, అతిమానసం పనిచేయకపోలేదు. కాని అది అధిమానసం ద్వారానే జరుగుతూ వచ్చింది. అతిమానసచైత్యము, శక్తి, అవరోహణల వలన మాత్రమే, పూర్తిగా పరమాత్మకు అనుగుణమైన జీవన పునస్సృష్టి సాధ్యపడుతుంది. ఎందుచేతనంటే మనో, ప్రాణ, పదార్థముల మూడింటితో కలిసిన మనం నివసించే ప్రపంచం తాలూకు క్రీడావిశేషముల సంసర్గం అధిమనస్సుకు కలిగే అవకాశం ఉంది. అందువల్ల అక్కడ అంతరంగ సత్యపరమాత్మ స్వతస్సిద్ధంగాను, నిర్దుష్టంగాను పనిచేసే సావకాశం ఉండదు. ఫలితంగా అక్కడ వక్రీకరణ, అజ్ఞానాలకి బీజం ఉంటుంది. అలాగని అధిమానసము అంటే అజ్ఞానక్షేత్రమని కాదు. అది అధిమనస్సు, నిమ్నమానసాలకి మధ్య సరిహద్దురేఖ.

కాబట్టి దివ్యసత్యము నుంచి విషయాలు దారితప్పే అవకాశం ఉంది.

అధిమానసానికి మానవజాతిని దివ్యమానవజాతిగా రూపాంతరీకరించగలిగే శక్తి లేదు. అందుకు అతిమానసము (the Supramental) మాత్రమే శక్తివంతమైన ఏకైక సాధనము. అధిమానస కాంతులు, మనస్సుకి, దివ్య అస్తిత్వానికి మధ్యంతరంగా వచ్చేవి. ఇవే సర్వోన్నత సత్యము కాదు. మిగిలిన యోగాలతో పోల్చినపుడు, ఈ తారతమ్యాన్ని గుర్తించేదే మన యోగం.

4. ఎన్నో మధ్యంతర స్థాయిలు

మనసు చిట్టచివరి హద్దుకు చేరేముందు మనిషికి అందుబాటు కానివి ఎన్నో భూమికలు, వాటి చలితచాలనాలు ఉన్నాయి. ఒక వేళ అవి అందుబాటులోనికి వచ్చినప్పటికీ, అక్కడ అవి స్థిరంగా ఉండవు. అందుకు ఏకాగ్రతతో కూడిన కృషి కావాలి. అయినా కూడా ప్రతిసారీ ఆ భూమికలను చేరలేరు. శ్రీఅరవిందులు వర్ణించిన కొన్ని భూమికలు ఉన్నాయి. అవి అసాధారణ వ్యక్తులు మాత్రమే అందుకోగలిగేవి. అయినప్పటికీ కూడా అవి ఇంకా మానసికస్థాయి లోనివే అంటారు వారు. అతిమానసం అనే మాటతో దానిని వారు పిలవరు.

వారు ప్రస్తావించిన అతిమానసములో ఎన్నో భూమికలు ఉన్నాయి. చిట్టచివరివి ముందుగా అభివ్యక్తమౌతాయి. మధ్య ఇంకా ఎన్నో స్థాయిలు ఉండే అవకాశం ఉంది.

నిశ్చయంగా పరిపూర్ణమైన జాతి దానంతట అది రాదు. Very probably not. అందుకు సంబంధించి చేసే తొలి ప్రయత్నాలు, గొప్ప తేడాగా, మానవాతీతంగా ఉన్న భావన కలుగ చేస్తాయి – ప్రస్తుత మానవునితో పోల్చినపుడు.

తొలి అతిమానస అభివ్యక్తీకరణలు పూర్తిగా అసమగ్రంగానే ఉండవచ్చు. అయినా వీటికి ఇప్పటి స్థితిలో ఉన్న మానవుడు మొరటుగా ఉంటాడు. విశ్వప్రగతి ఆగదు. ఒకప్పుడు సమగ్రమైన పరిపూర్ణతతో పూర్తి అయినట్లు అగుపించినా, అది భవిష్య

అభివ్యక్తీకరణకి భూమిక మాత్రమే కాగలుగుతుంది. మనిషి మాత్రం తాను చేయవలసినది పూర్తి చేశాను అనుకుంటాడు.

అయితే విశ్వము మాత్రం కదలక మెదలక అలానే ఉండి పోదు. ముందుకు సాగిపోతూనే ఉంటుంది. ఇక్కడికి ఇది అయి పోయింది; ఇక చేయవలసినదేమీ లేదు అనే పరిస్థితి ఉండదు. అలా అనుకుంటే విశ్వచలిత చాలనాలకు దూరమైనట్లే. అభివ్యక్తీకరణలు ఎప్పుడూ సాపేక్షమైనవి. మొదటి జీవుడు మానవాకారంలోని పశువుగా ఉండడు. మానవాకృతిలోని దైవంగా ఉంటాడు. ఇదొక అద్భుతమైన విషయం. (అతిమానస) క్రొత్త సంతతి చాలా అపరిపూర్ణమైనదే కావచ్చు. సతతము మారే జీవితవిధానం అలవాటు చేసుకోవాలి. 'ఇక్కడితో ఇది ఆఖరు', 'ఇదే పరిపూర్ణత' అని లక్ష్యనిర్ధారణ ఉండదు. సమగ్ర పరిపూర్ణత అంటూ ఉండదు. విషయాలన్నీ సాపేక్షమైనవి. మారుతూనే ఉంటాయి.

మూలం: శ్రీమాత

అనువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

భూమిపై అతిమానస కార్యక్రమము

క్రొత్తమానవజాతి ఇక ఏమాత్రమూ అందని ఆశ కాదు; వాస్తవము.

"నవ మానవజాతి అంటే ఒక విలక్షణమైన బుద్ధిజీవుల వర్గంగా మనకు అగుపిస్తుంది. అది క్రమంగా అభివృద్ధి పొందుతుంది. వీరి మానసికసూత్రము ఏ మాత్రమూ అజ్ఞానంతో కూడిన బుద్ధి, జ్ఞానాన్ని అన్వేషించేదిగాను, జ్ఞానము అజ్ఞానముచేత బంధింపబడేదిగానూ ఉండదు. దివ్యకాంతి అన్వేషణలో అది ఇంకా స్వాయత్తం కాదు. జీవుడు దివ్యకాంతికి ఉన్మీలనమై ఉంటాడు, కాని అది తనకి ఇంకా ఆవాసం కాదు. సత్యచేతన కోసం అన్వేషకుడు ఇక ఎంతమాత్రమూ అసమగ్ర ఉపకరణంగా మిగిలి ఉండడు. ప్రత్యామ్నాయంగా జ్ఞానకాంతితో, సత్యమునకు నిబద్ధమైన మనసు కలిగి ఉంటాడు. సత్యచైతన్యవంతుడుగా జీవనంలో సూటిగా,

అపరోక్షంగా సత్యమునే అభివ్యక్తీకరించగలుగుతాడు. మనోప్ర వృత్తి అక్కడ ఏమాత్రము అజ్ఞానానికి కాకుండా, సర్వోన్నతస్థాయిలో దివ్యకాంతికి ఉపకరణమౌతుంది. ముందుకు సాగి అతిమానసంలోనే ఇది ప్రసరిస్తుంది. ఆ క్రొత్తజాతి నుంచి అతిమానస జీవజాతికి జీవులుగా శిక్షణ పొందటానికి ఎన్నిక కాబడతారు. వీరే భూపరిణామ ప్రక్రియకి నాయకులు కాగలుగుతారు."

శ్రీఅరవిందులు (*SABCL* Vol. 16, p. 67)

ఇదే సరిగ్గా మన నుంచి తప్పనిసరిగా వారు ఆశించేది. అతిమానసమానవుడు (the Superman) గా భావింపబడేవాడు, పశుత్వం నుంచి పాశవిక అవసరాలనుంచి పూర్తిగా విముక్తి కాబడినవాడై ఉంటాడు. ఇతడు అతిమానస పద్ధతిలో అతిమాన సజీవుడుగా సృష్టింపబడేవాడుగా ఉంటాడు.

ఇపుడు ఉన్న మనం, సాధారణ పశువురీతిలోనే సృష్టింప బడినవాళ్లము. మనం రూపాంతరీకరణం చెందినా కూడా, మూలంలో ఎంతో కొంత పశు అంశ మిగిలే ఉంటుంది. వారు భావించిన అతిమానసజీవుడు సాధారణ జంతుపద్ధతిలో ఎంత మాత్రమూ రూపొందింపబడేవాడు కాదు. ఒక సూటియైన ప్రక్రియలో అదేమిటో ఇప్పటికీ ఇంకా గోప్యమే – కొన్ని మూలాధారశక్తుల నిర్వహణలో శరీరము materialise ఔతుంది (వాస్తవీకరణ). ఇది సాధారణ పశుపద్ధతిలో రూపొందింపబడదు.

మధ్యస్థజీవుని అవసరం ఉన్నది. ఇది స్పష్టం. ఈ జీవులే అతిమానసజీవుల ఉత్పన్నానికి సాధనాలు కనుగొనాలి. ఇదే మనం ఇపుడు చేయవలసినది. ఈ విషయం శ్రీఅరవిందులు నమ్మకంగా వ్రాశారు.

వారు మన నుంచి దేనిని అపేక్షిస్తున్నారో దానిని మనం సాధించాలి. తప్పదు. అది ఇంతవరకు ఒక ఆశగానే మిగిలి ఉంది. ఇప్పుడది వాస్తవము. ఇది సిద్ధించటానికి ఎంత సమయం పడుతుంది అనేది మన కృషి, ఏకాగ్రత, ఇచ్ఛ – ఇంకా దీనికి మనము ఇచ్చే ప్రాధాన్యత వీటిపై ఆధారపడి ఉంటుంది. అంత శ్రద్ధగా

గమనించనివాళ్లకి విషయాలు గతంలో వలెనే అగుపిస్తాయి. దర్శించే విధంగా దర్శించేవాళ్లకి, బాహ్యదృష్టితో మోసపోనివాళ్లకి, విషయాలు సవ్యంగా దర్శనమిస్తాయి.

ఎవరికి వారు తమ శక్త్యానుగుణంగా కృషి చేస్తే ప్రాథమిక ఫలితాలు కనిపించటానికి సుదీర్ఘకాలం పట్టదు.

ప్రపంచంలో అన్నిటికన్నా ఆసక్తికరమైనది ఇదే అనేది నీవు తెలుసుకోవాలి. ఈ లోకంలో రూపాంతరీకరణ కోసం కంటె బ్రతకటానికి కావల్సినది మరేముంది – అనేది ఏదో ఒక సమయంలో శరీరం తెలుసుకుంటుంది. రూపాంతరీకరణకి మించిన ఉన్నతమైనది లేదనే భావావేశంతో కూడిన ఆసక్తి కలుగుతుంది. శరీరంలో జీవకణాలన్నీ ఆత్రంగా ఆ దివ్యవెలుగు కోసం, దాని అభివ్యక్తీకరణ కోసం గగ్గోలు పెట్టి, పరమ ఆనందంతో విజయము తథ్యము అనుకుంటాయి.

ఇదీ ఆకాంక్ష. దీనినే మీకు తెలియచేయటానికి ప్రయత్నిస్తున్నాను. జీవితంలో మిగిలినదంతా, దానితో పోల్చినపుడు ఎందుకు కొరగానిది, నిస్సారమైనది, పనికిమాలినది – అనిపిస్తుంది. దివ్యతేజస్సుతో మమేకం కావడం అన్నిటికీ మిన్న.

*

పెనుగులాట – శక్తుల సంఘర్షణ

ఒకటి మాత్రం స్పష్టం. మానవజాతి మితిమీరిన ఉద్రిక్త చైతన్య స్థాయికి చేరుకుంది. దైనందిన జీవితకార్యకలాపాలలో, కృషిలో ఈ ఉద్రిక్తత బహుళవ్యాపకంగా ఉన్నది. ఫలితం – భయము, తత్తరపాటు. ఇది ఏ స్థాయికి చేరుకున్నదంటే – దీనిని గట్టిగా ప్రతిఘటించి, నిరోధించి, బయటపడి, ఒక నవచైతన్యంలోనికి ప్రవేశించటమా – లేక – ఒక అవచేతన చీకటి అగాధంలోనికి జారుకోవటమా – అనే పరిస్థితికి చేరుకుంది.

ఈ ఉద్రిక్తత ఎంతో విస్తృతంగా పరివ్యాప్తమై పతాకస్థాయికి చేరుకుంది. ఇక ముందు ఇలా సాగలేదు. ఇది ఒక స్పష్టమైన సంకేతము. నవచైతన్య శక్తిసామర్థ్యాలు కార్యాచరణకు మార్గదర్శ

కసూత్రములుగా పదార్థములో చొరబడి ఈ తీవ్రపరిస్థితిని ప్రభ వింప చేయటానికి ఒత్తిడి తెస్తున్నాయి. ప్రకృతి, పెనుమార్పు తేవా లనుకున్నప్పుడు అందుకు పాతపద్ధతులనే అవలంబిస్తుందను కుంటాము. కాని ఇక్కడ విలక్షణమైనది ఒకటి ఉన్నది. అది – ఒక నవ్య, ఉన్నత, పురోగమన పరిష్కారం కనుగొనాలనే ఇచ్ఛ – అపరిమితమైన సర్వతోముఖపరిపూర్ణత దిశగా ఉన్నతికి కృషి చేయాలని. ఈ విశిష్టలక్షణాలు ప్రపంచవ్యాప్తంగా పరివ్యాప్తమై ఉన్నత వర్గాలలో కనిపిస్తోంది.

ప్రపంచంలో, సాధారణంగా, కొన్ని భావాలు విస్తృతంగా సమాలోచనం కాబడుతూ పనిచేస్తున్నాయి. రెండు విషయాలు సమాంతరంగా పనిచేస్తున్నాయి. దుస్సాహసంతో నూతన పద్ధతుల ద్వారా, మున్నెన్నడూ లేనంతగా, విచ్ఛిన్నానికి ఒక సంభావ్యత; అదే సమయంలో, సర్వోతముఖమైన ఉన్నత భావాలు, ఇచ్ఛాపూర్వకమైన చర్యలు – అభివ్యక్తీకరణ. ఇదివరకు కన్నమిన్నగా విస్తృతమైన, విశాలమైన, సమగ్రమైన, పరిపూర్ణ ప్రతిక్రియను తేగలిగేవి, ఇవి.

ఉన్నతపరిణామక్రమంలో పరిపూర్ణ దివ్యసాధనకు నిర్మాణాత్మకశక్తులు – అదుపుతప్పిన శక్తివంతమైన విచ్ఛిన్నకరశక్తులు – వీటి పెనుగులాట, అంతకంతకు ప్రస్ఫుటంగా గుర్తించేలా అగుపిస్తున్నాయి. ఇది ఒక రకమైన పోటీ; పెనుగులాట. ముందు ఏది లక్ష్యమును చేరుకోవాలి? ప్రతికూల రాక్షసశక్తులు, ప్రాణికభూమికలకి చెందినవి అన్నీ ఈ భూమి మీదకి దిగబడ్డాయి అనిపిస్తుంది. ఈ రకంగానే, నవోన్నత ఆధ్యాత్మికశక్తి కూడా క్రొత్తజీవనం ఆవిష్కరించటానికి దిగినది. వీటి ఘర్షణ మరింత ఉద్ధృతమై హింసాత్మకంగా మారుతోంది. మరింత స్పష్టంగాను, నిశ్చితంగాను ఉన్నట్లుగా ఉంది. అందుకే పరిష్కారం వేగంగా లభిస్తుందనే ఆశ!

*

కొంతకాలం క్రితం, మనిషియొక్క ఆధ్యాత్మిక ఆకాంక్ష, ప్రాపంచిక విషయాల నుంచి విడివడి, నిశ్చల నిశ్శబ్ద ప్రశాంతత కోసమే. జీవిత ప్రయత్నాలు, పోరాటాలు, పెనుగులాటలు – నుంచి తప్పించుకునిపోవటం. ఇంతే. ఈ ఆధ్యాత్మిక ప్రశాంతతతో ఉద్వేగం, శ్రమ, పెనుగులాటతో పాటు అన్నిరకముల్లైన బాధలు ఆగిపోతాయి. ఇదే నిజమైన ఆధ్యాత్మిక దివ్యజీవన వ్యక్తీకరణగా భావింపబడేది. ఇదే దివ్యకృప, దైవసహాకారంగా భావించేవారు. ఇప్పుడూ, బాధ, ఉద్వేగము, Hypertension లతో కూడిన కాలంలో కూడా ఈ సర్వోత్కృష్టమైన ప్రశాంతతే గొప్పగా స్వాగతీకరింపబడుతోంది. అభిలషించబడుతోంది. ఇదే చాలామందికి ఆశ, ఉపశమనం. ఇదే వారికి దైవకృప. నిజానికి ఏది సాధించాలనుకున్నా సుస్థిరమై పరిపూర్ణ ప్రశాంతత ఆధారంగానే సాధించాలి. తన వ్యక్తిగత అహంతో కూడిన ముక్తికోసం మాత్రమే అనుకుంటే మరి ఇది ఇంతటితో సరి. కాని అలా ఉండకూడదు. దివ్యకృపకి మరొక దృక్పథం ఉంది. అదే అభివృద్ధి దృక్పథం. ఎన్ని ఆటంకాలైనా, ఇది అధిగమించి విజయవంతం కాగలదు. ఇది మానవ జాతిని ముందుకు, ఒక నవీన అవగాహనకు, సిద్ధికి నడిపిస్తుంది. ఒక క్రొత్తలోకానికి ద్వారం తెరుస్తుంది. ఎన్నికైన వారికి ఏ కొద్దిమందికో దివ్యసిద్ధివల్ల లబ్ధి పొందే అవకాశం కాకుండా, వారి ప్రభావంవల్ల వీరు ఆదర్శంగా, వీరి శక్తివల్ల మిగిలిన మానవాళికి కూడా మరింత మెరుగైన నవీన పరిస్థితులు అందుబాటుగాకలుగుతవి.

ఇది భవిష్యసాధనకి మార్గం సుగమం చేస్తుంది. నూతన శక్తులకు ఉన్మీలనమైన మానవాళి – తెలిసో, తెలియకో – మరింత ఉన్నత, పరిపూర్ణ సామరస్యజీవనానికి ఉద్ధరింపబడతారు. వ్యక్తిగత రూపాంతరీకరణమునకు, ప్రతిసారీ అవకాశం లేకపోయినా, ఒక రకమైన సాధారణస్థాయిలో ఉద్ధరణ సమరస భావము, మొత్తం అంతటా ఉంటుంది. ఒక క్రొత్తసామరస్యంతో

కూడిన విధానం వ్యవస్థీకరింపబడుతుంది. ఇప్పుడున్న బాధ, అస్తవ్యస్త పరిస్థితి, పెనుగులాట, కనుమరుగై, దాని స్థానంలో, అంతా సామరస్య భావనతో కూడిన వ్యవహారసరళి చోటు చేసుకుంటుంది.

ఇంకా ఇతర పరిణామాలు ఉంటాయి. వ్యతిరేక పద్ధతిలో మనోకల్పితాలైన వక్రతలు, వికారాలు, వికృతాలు, వీటివల్ల అధికమయే బాధ, వ్యధ, నైతిక అభావం – ఇవి చాలవరకు అసహ్యాం కలిగించి, జీవితాన్ని భయంకరంగా చేస్తాయి. ఇవి తప్పనిసరిగా వైదొలగాలి. ఇవే మానవజీవితాన్ని పశుజీవితంకన్న ఎన్నో రెట్లు నీచంగా చేసేవి. పశుజీవితం సహజమై, స్వతస్సిద్ధమై, కృత్రిమం లేకుండా, సామరస్యంగా, సాధారణంగా సాగిపోతుంది. పశువుల బాధ మనిషి బాధంత హీనంగాను, నీచంగాను ఉండదు. మనిషికి ఉండే మానసిక వక్రతలు, స్వార్థము, వాటికి ఉండవు. మనం వీటిని అధిగమించి ఎదగాలి. దివ్యకాంతి సామరస్యాల లోనికి తటాలున దూకాలి. లేదా వక్రతలు లేని ఆరోగ్యకరమైన సాధారణ పశుజీవన విధానం అనుసరిస్తూ బ్రతకటం, తప్పనిసరి.

ఈ సమయంలో మీరు భూమి మీద బ్రతుకుతున్నారంటే, మీకు తెలిసో తెలియకో, తప్పనిసరిగా కావాలనుకున్నా, వద్దనుకున్నా, ఈ నూతన అతిమానస మూలద్రవ్యం (the new Supramental substance) కూడిన గాలిని పీలుస్తూ, దానిని మీలోకి తీసుకుంటున్నారు. మీరు సిద్ధపడుతున్నారు. కావల్సినది మీ నిశ్చయాత్మక నిర్ణయం. అపుడు అనూహ్యాంగా మీ భవితవ్యం మారిపోతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

నవచైతన్యం – మానవాళి

(నవంబరు 25, 1965) శ్రీఅరవిందులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉన్నారు. అవును. అతిమానససృష్టికి సంబంధించిన మానవజాతి స్థితి, మానవాళిలో ఉన్న భిన్నాభిప్రాయాలు, అంతస్థులు ప్రస్ఫుటంగా, సజీవంగా ఒక గంటకు పైగా దర్శింపచేశారు నాకు. మానసిక పురోగతివల్ల లబ్ధిపొంది, ప్రాణిక, సాహిత్య, కళాక్షేత్రాలలో ఒక రకమైన సమరసభావాన్ని సృష్టించుకొని జంతులక్షణాలు లేని మానవజాతి అదంతా. అధికభాగం అలా సమరసభావంతో జీవించటంలో సంతృప్తి పొంది ఉన్నారు. అదొక నాగరిక పరిసరం. నూతన సంస్కారం, లలితమైన అలవాట్లు, అభిరుచులు. ఏమైనా విపత్తు వస్తే ఏమో కాని, అదొక సుందర సౌలభ్య సంతృప్తికర జీవనం. వారంతా మానసికంగా అభివృద్ధి చెందినవారు. వాళ్లకు ఒక అభిరుచి ఉంది. కాబట్టి అలాటివారు క్రొత్తశక్తుల పట్ల, నూతనమైన విషయాలపట్ల ఆకర్షితులై, భవిష్యజీవనానికి తగినవారుగా ఉండగలరు. ఉదాహరణకు – వారు శ్రీఅరవిందులవారికి మానసికంగా, బుద్ధిపరంగా శిష్యులు కాగలరు. కాని, వారు భౌతికంగా ఎలాటి మార్పునిగాని, దాని ఆవశ్యకతనుగాని ఊహించటం లేదు. అందుకు వాళ్లని బలవంతపెట్టడం తొందరపాటు పని అవుతుంది. యుక్తంగా ఉండదు. వాళ్ల జీవనంలో అస్థిరత, గందరగోళం సృష్టిస్తుంది. ఇది స్పష్టం.

మరికొందరున్నారు. అపురూపవ్యక్తులు. రూపాంతరీకరణ ప్రక్రియలో తగురీతిగా శ్రమపడటానికి సిద్ధంగా ఉన్నవారు. నూతనశక్తులను ఆకర్షించేవారు. పదార్థాన్ని (matter) అనుకూలంగా మలచగలిగేవాళ్లు. అభివ్యక్తీకరణకు సాధనాలను అన్వేషించేవారు – వీళ్ల శ్రీఅరవిందుల యోగానికి సిద్ధంగా ఉన్నవాళ్లు. వీరు కొద్దిమందే. ఇంకా కొంతమంది, భవిష్యత్ రూపాంతరరీకరణానికి దోహదపడితే కష్టనష్టాలతో కూడిన జీవనాన్ని సాగించటానికి సంసిద్ధులై ఉన్నవాళ్లు. అలాగని వీళ్లు ఇతరులను ప్రభావితం చేయటానికి ప్రయత్నం చేయకూడదు. అలా చేస్తే అది

అనుచితమేకాక మొరటుగా కూడా ఉంటుంది. ఎందుకంటే ఇది విశ్వంలో – ప్రాపంచికంగా – పరస్పర సమరసభావనకి, గతికి తోడ్పడకపోగా, ఘర్షణ, గందరగోళం సృష్టిస్తుంది.

రూపాంతరీకరణ కృషిలో రాసి తగ్గితే వాసి పెరిగి సిద్ధికి శక్తివంతంగా తోడ్పడుతుంది. క్రొత్త సృష్టికి మార్గదర్శకులు ఎన్నిక కాబడినవారై ఉంటారు. 'వ్యాప్తి చేయటం', 'తయారుచేయటం', 'పదార్థ మథనం' లాటి భావాలు చిన్నపిల్లల ఆలోచనలుగా ఉంటాయి. ఇది మానవ అశాంతి. It is human restlessness.

2. అహంకారమమకారాలను విడిచిపెట్టడానికి మానవుడు సిద్ధంగా లేడు

అహంకారం అల్పమైనది. దీనికి లోబడి ఉన్నంతకాలము నీలో స్తబ్ధత ఏర్పడుతుంది. లోతులకు పోలేవు. శక్తివంతమైన లక్షణాలు లేకుండా దైవంతో తాదాత్మ్యత సిద్ధించదు.

ఈ సందర్భంగా మీకో విషయం చెప్పాలి. చాలాకాలం నాటి మాట. కొంతమంది ఆశ్రమంకి వచ్చేవారు. వారి రాక ఎందుకోసం అంటే అమృతత్వసిద్ధి కోసం. ఆశ్రమంకి వస్తే అది సిద్ధిస్తుందనుకొనేవారు. వయసుమీరిన వాళ్లు. ఇక ఆట్టే కాలం బ్రతకమనుకొని, ఇంకా అలా బ్రతికి ఉండాలనుకొని వచ్చేవారు – శాశ్వతత్వాన్ని ఎంతగానో ఆకాంక్షింస్తూ. వారి దృష్టిలో మరణరాహిత్యం అంటే, నిరవధికంగా వారున్నట్లుగా వారు అలాగే కొనసాగటం. ఈ మాట అన్న మొదటి వ్యక్తికి చెప్పాను: ఎవరైనా అమరత్వం పొందగలిగారేమో నాకు తెలియదు. అయినా అందుకు మూల్యం చెల్లించటానికి ఎంతమంది సిద్ధంగా ఉన్నారు?. అందుకు ఎన్నెన్నో గణనీయమైన విషయాలు వదులుకోవాలి. దారి మధ్యలో, "అమ్మో! ఇందుకు చాలా వెచ్చించాలి" అనుకోవచ్చు. శాశ్వతత్వ అవకాశం గురించి నేను ఒక పెయింటర్‌తో మాట్లాడిన సంభాషణ నాకు ఇంకా గుర్తుంది. నవలోకం ఎలా ఉంటుందని నన్ను ఆయన అడిగాడు. అంతా బహుకాంతివం

తంగా ఉంటుంది. ఇప్పుడు మనకు భూమిమీద పడే వెలుగువలె కాంతి పరావర్తనం ఉండబోదు అన్నాను. నేనిలా అంటూ ఉంటే అతని ముఖం ముడుచుకుంది. గంభీరంగా మారింది. చివరికి అన్నాడు: "ఇలా అయితే పెయింటింగు చేయటం ఎలా బాబూ? నీడ లేకుండా కాంతిని చూపలేం కదా!". "నీవు సమస్యకి సరియైన పరిష్కారం చూపావు" అన్నాను నేను.

చాలామంది క్రొత్తజీవితం ఎలా ఉంటుందని అడిగారు. నేను చెప్పాను. "శక్తుల పరివర్తన ఉంటుంది; శక్తిప్రసారం ఉంటుంది; దేహనిర్మాణం తేడాగా ఉంటుంది. వికారంగా ఉండే అవయవాలు లేకుండా పోతాయి. వాటి స్థానంలో మానసిక ప్రవృత్తులు చోటు చేసుకుంటాయి. తినే అవసరం, తిండి తాపత్రయం ఉండదు". మళ్లీ ముఖం ముడుచుకోవటం గమనించాను. "అయ్యో! మంచి భోజ్యపదార్థాలు ఇక ఉండవన్న మాట!" అని వాపోయారు.

ఇవి కొన్ని స్వల్పమైన ఉదాహరణలు. ఇంతకన్నా ప్రధానమైనవి ఇంకా చాలా ఉన్నాయి. అన్నిటికీ మించి, కష్టతరమైనది, 'అహం' వదులుకోవటం. అహం వదులుకోవటానికి సిద్ధంగా లేనివానికి, అది వదులుకోవటం మృత్యు సమానమే. భౌతికంగా చావటంకన్న ఇది ఎక్కువ. అహం చావటం అంటే అతనికి తన అస్తిత్వాన్నే కోల్పోవటం లాంటిది. ఇది సరి కాదనుకోండి. కాని ఇలాటి అభిప్రాయాన్నే కలుగచేస్తుంది. అమరత్వాన్ని పొందటానికి వ్యక్తి తనకున్న అన్ని limitations – పరిమితులను వదులుకోవాలి. 'అహ' మే అన్నిటికన్నా ప్రధాన limitation పరిమితి కదా! కాబట్టి 'నేను' అనుకొనేదే శాశ్వతం కానప్పుడు ఇంకెందుకది? What is the good of that?

*

ఆధ్యాత్మికతకి మానవుడు సమ్మతించగలుగుతే!

ఇంతకీ అసలు సమస్య – మానవజాతి మేలిమి బంగారంగా తయారై ఉన్నదా? లేక దానికి మూసలో అగ్నిపరీక్ష ఆవశ్యకత ఉన్నాదా?

ఒకటి మాత్రం స్పష్టం. మానవజాతి ఇంకా మేలిమి బంగారం కాలేదు. ఇది స్పష్టంగా కనిపించే యదార్థం.

కాని ప్రపంచచరిత్రలో ఒకటి జరిగింది. అది మనకి ఒక ఆశ మిగిల్చింది. అదేమంటే, మనవాళిలో ఎన్నిక కాబడిన కొద్ది మంది మేలిమి బంగారం కావటానికి సిద్ధంగా ఉన్నారు. వాళ్ల అహింసాయుతంగా విధ్వంసం వినాశనం లేకుండా ధైర్యసాహసాలతో (అతిమానస) శక్తిని అభివ్యక్తీకరింప చేయగలరు.

తర్వాత ఒక సమాధానం శ్రీఅరవిందులు చెప్పారు: "మానవుడు ఆధ్యాత్మికతకి సమ్మతించ గలుగుతే" సమ్మతిస్తే...

అతని అంతరంగం ఏదో అభిలషిస్తోంది; ఆకాంక్షిస్తోంది. మిగిలినదేమో దాని నంతటినీ వ్యతిరేకిస్తోంది; ఎలా ఉన్నది అలానే యథాతథంగా ఉండాలి అంటోంది. ఇది కల్తీ ఇనుప ఖనిజం. ఫర్నేస్‌లో పరిశుద్ధం కాబడవలసినది.

భూగోళచరిత్రలో మళ్లీ మానవజాతి చేరినదొక మలుపు. నిశ్చయాత్మకమైన మలుపు. "ఏమి జరగబోతోంది?" – అన్ని వైపులనుంచి నాకు వినిపించే ప్రశ్న ఇది. అంతటా భయం, బాధ, నిరీక్షణ. "ఏం జరుగుతుంది?" ఒక్కటే సమాధానం – "మానవుడు ఆధ్యాత్మికతకి సమ్మతించగలుగుతే."

సంఘటనల దిశ, దశ మారటానికి బహుశా కొద్దిమంది వ్యక్తులు మేలిమి బంగారమైతే సరిపడుతుందేమో. చాలా అర్జంటుగా మనకీ అవసరం కనపడుతోంది.

మననుంచి దైవం శౌర్యప్రతాపాల నాశిస్తోంది. మన పోరాటంలో మన ఆటంకాలను, అపరిపూర్ణతలను, అసందిగ్ధాలను ఎదుర్కొనటానికి మన మెందుకు వీటిని వినియోగించకూడదు? కొలిమిలో కాలి అంతశ్శుద్ధి పొందటానికి వీరోచితంగా ఎందుకు సంసిద్ధులం కాకూడదు? ఆ విధంగా ప్రళయాన్ని తప్పించినవాళ్లం కాలేమా?

ఇదీ మన ముందు ఉన్న సమస్య. ఎవరికి వారే తమకు తాముగా పరిష్కరించుకోవలసినదే ఇది.

ఈ సాయంకాలం ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేటప్పుడు నన్ను అడిగారు. శ్రీఅరవిందులవారు చెప్పినదే నా సమాధానం కూడా. మానవుడు ఆధ్యాత్మికతకు సమ్మతిస్తే –

మరో మాట జతపరుస్తాను. మానవదృక్పథాన్ననుసరించి from the human point of view కాలం ఒత్తిడిచేస్తోంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

అతీత మానవత్వానికి మార్గము

ఒక అసాధారణ మలుపు
ఒక నూతన జాతి ఆగమనము

ప్రపంచచరిత్ర ఒక అసాధారణమైన మలుపు తిరిగే తరుణంలో మనం ఉంటున్నాము. ఎన్నడూ మానవజాతి ఇంతటి రక్తపాతం, గందరగోళ పరిస్థితి, ద్వేషపూరిత వాతావరణం అనుభవించి యుండలేదు. అయితే ఎన్నడూ కూడా మానవహృదయంలో ఇంత తేజోవహమైన ఆశాకిరణమూ ఉద్భవించలేదు. మన గుండె చప్పుళ్ళు వింటే మనకు అర్థమవుతుంది. న్యాయం, ధర్మం, సౌందర్యం, సహృదయ సౌభ్రాతృత్వాలతో వెల్లివిరిసే నూతన సామ్రాజ్యం ఏర్పడాలని ప్రతి హృదయం ఆరాటపడుతోందని. అయితే ప్రస్తుత పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయి. ప్రాతః కిరణాలు వెలువడే ముందుండే చీకటి గాఢాధికంగా ఉంటుందని మనకు తెలుసు కదా! రాబోయే అరుణోదయానికి ఇది చిహ్నం కావచ్చు. ఈ అంధకారం ఎన్నడూ లేనంత దట్టంగా, భయంక రంగా ఉన్నట్లే, రాబోయే ఉషోదయం కూడా ఎప్పటికంటే ఎక్కువ వెలుగుతో, స్వచ్ఛంగా, తేజోమయంగా ఉంటుందేమో.. ఈ దుస్వప్నాల రేయి గడిపేస్తే ప్రపంచం ఒక నూతన చైతన్యా నికి మేల్కొనగలదు.

ఇప్పటి దాకా మనోశక్తితో ముడిపడి ఉన్న ఈ నాగరికత నాటకీయంగా ముగియనున్నది. పదార్థాన్నీ, జీవాన్నీ కూడా ఇంత దాకా శాసిస్తూ వచ్చిన మనస్సువల్ల ప్రపంచానికి ఒరిగిందేమి టని మనం ఇప్పుడు చర్చించటం లేదు. ఇక మీద ఒక నూతన పరిపాలన రాబోతున్నది – అదే, మానవ పరిపాలన ముగింపు; దైవపాలన ఆరంభం.

ఇటువంటి అత్యద్భుతమైన, అపురూప సమయంలో మనం భూమ్మీద నివసిస్తున్నామంటే అది ఎంతటి అదృష్టమో! అయితే ఇటువంటి అపూర్వపరిణామాలను ప్రేక్షకులుగా చూస్తూంటే సరిపోతుందా? ఎవ్వరైతే తనూ, తన కుటుంబంవరకే కాక విశాల హృదయంతో వ్యవహరిస్తారో, తమ ఆలోచనలను తమ స్వంతా నికీ, సంప్రదాయ వ్యవహారాలకీ పరిమితం కాకుండా విస్తరి స్తారో, ఇంకా చెప్పాలంటే ఎవ్వరైతే తమకూ, తమ కుటుంబానికీ, తమ దేశానికి మాత్రమే కాక, ప్రపంచం మొత్తం మానవుల రూపంలో ఉన్న ఆ సర్వవ్యాపక పరమేశ్వరునకే చెందినవారు మని భావిస్తారో వారు తెలుసుకుంటారు; – తాము మానవత్వం కోసం, దివ్యమైన ఆ అరుణోదయం కోసం లేచి ఉద్యమించా లని –

అపరిచితము, కష్టము అయిన మార్గాన్వేషణలో మన పురో గమనాన్ని సాధ్యమైనంత స్పష్టతరం చేయటానికి ప్రయత్నిద్దాము.

భావి మానవుడు, అంటే అతీతమానవుడు ఏ విధంగా ఉంటాడోనని మనం రూపకల్పన చేసుకొనటంలో జాగ్రత్త పాటిం చాలి. ఎందువల్లనంటే ప్రస్తుత మానవునే మచ్చుగా (type) తీసుకొని, మరింత పరిపూర్ణతతో అభివృద్ధి చేయటం కాదు. ఈ పొరపాటు చేయకూడదనుకుంటే జీవన పరిణామ క్రమం చెప్పే పాఠాలను అధ్యయనం చేయాలి.

భూమ్మీద, ఏదైన ఒక కొత్త జీవరాసి ఉత్పన్నమైనదంటే దాని అర్థం ఒక నూతన సూత్రము, నూతన చైతన్యస్థాయి, ఒక నూతన శక్తి ప్రకటితమౌతుందనే విషయం మనం లోగడ తెలు సుకున్నాము. ఎప్పుడైతే ఈ నూతన జీవరాసి ఇంతవరకూ అవ్య

క్తంకాని చైతన్యాన్ని, శక్తిని సంతరించుకుంటుందో, గతంలోని తన పరిపూర్ణ ప్రత్యేక లక్షణాలను కొంతగానీ, చాలావరకుగానీ కోల్పోవచ్చు. ఉదాహరణకు ప్రకృతి పరిణామంలోని చివరి దశలో మానవునికీ అతని ముందున్న జాతి కోతికీ మధ్య నుండే గొప్ప భేదం ఏమిటి? కోతికుండే ప్రాణికశక్తి, బలము, పరిపూర్ణ త్రాణ క్రొత్త జీవారాశియైన మానవుడు వదులుకున్నాడు కదా! అత్యద్భుతంగా చెట్లెక్కడం, మొగ్గలు వేయడం, పెద్ద పెద్ద గోతు లను అవలీలగా దాటడం, శిఖరాల మీద గెంతటం మానవుడు చెయ్యలేడు కదా! అయితే దానికి బదులుగా అతనికి మేధాశక్తి, తార్కికంగా ఆలోచించడం, సంయోగపరచడం, ప్రయోగాత్మకంగా ఉండటం సొంతమైంది. నిజానికి మానవునితోనే మనోమయ జీవనం భూమ్మీద ఆవిర్భవించింది. ముఖ్యంగా మానసికజీవిగా ఉన్న మానవుడు తనకు శక్యమైనవి తనతో ఆగకుండా తనలో ఇంకా ఇతర లోకాలు, శక్తులు, ఇతర చైతన్యస్థాయిలు ఉన్నట్లు భావిస్తున్నాడంటే అవి భవిష్యత్తుకు సంబంధించిన వాగ్దానాలే. ఏ విధంగా కోతిలో మానసికశక్తులు గుప్తంగా దాగి ఉన్నాయో, అదే విధంగా మానవునిలో భవిష్యత్ మానవుని సంభావ్యతలు కూడా ఉన్నాయి.

మన లోకానికి అతీత ఆధ్యాత్మిక ప్రపంచంలో నివసించే మనుష్యులు కొంతమంది మన మధ్యే ఉంటారు. అటువంటివారు కొద్దిమందే అయినా వారు అపురూపంగా ఉన్నప్పటికీ మానవ జాతికి మార్గదర్శకులై భవిష్యత్పరిణామ దిశగా కొంతమందిని నడిపిస్తారు. కాలగతిలో అక్కడా అక్కడా కొద్దిమందిలో మాత్రమే మూర్తీభవించి ఉన్న ఆ గుణగణాలు ఆవిర్భవించనున్న నూతన జాతికి ప్రధాన లక్షణాలు కాగలవు.

ప్రస్తుత మానవుని జీవనవిధానం తర్కానికి లోబడి నడి చేది. మనస్సు ప్రధానంగా అతని చర్యలు సాగుతాయి. అన్నిటినీ పరిశీలిస్తూ జ్ఞానాన్ని పొందుతూ నిర్ణయాలు చేస్తూ తనకి కావ లసిన విధంగా జీవితాన్ని గడుపుతాడు. కానీ భవిష్యత్తులో అలా కాకుండా ఉపజ్ఞ (Intution, అంతర్బుద్ధి) జాతిని నడిపిస్తుంది.

అంటే మనస్సు, ఆలోచనలతో నిమిత్తం లేకుండా అంతరంగ దైవసూత్ర నిబద్ధమై జాతి నడుస్తుంది. ఇప్పుడు కూడా కొంత మంది ఆ విధంగా అంతర్బుద్ధి అనుభవమునకు నిబద్ధులైన వారు న్నారు. – కొన్ని రకాల అడవి గొరిల్లాలకు కొద్దికొద్దిగా తార్కి కమైన ప్రవర్తన ఉండడం నిస్సందేహమైన విషయమే కదా!

అంతర్గతంగా ఆత్మాభివృద్ధి చేసుకున్న కొద్దిమంది మాన వులు తమ సర్వశక్తులతో కృషిచేసి వారి సత్తాయొక్క నిజ సూత్రాన్ని కనుగొన్నవారు కొంతవరకూ అంతర్బుద్ధిని కలిగి ఉంటారు. గాలి లేక స్తంభించినప్పుడు నిశ్చలమైన కొలనులో ఏ విధంగా నక్షత్రకాంతి ప్రదీప్తమౌతుందో అలానే మనస్సు నిశ్శబ్దం గానూ, బాగా శుభ్రపరచిన అద్దం మాదిరి స్వచ్ఛంగానూ ఉన్న ప్పుడు అతిమానసకాంతి, అందలి సత్యము దాని పైబడి, ఆ అల జడిలేని మనస్సులో దీపించి, అంతర్బుద్ధిని జనింపచేస్తుంది. ఆ నిశ్శబ్దంలో ఆ స్వరాన్ని ఎవరైతే వినగల్గుతారో వారు దానిని తమ చర్యలకు తగిన ప్రేరణగా భావిస్తారు; సాధారణ మానవులు వారి తర్కాన్ననుసరించి గజిబిజి మార్గంలో ఇటూ అటూ తిరుగుతూం డగా వీరు మాత్రం అంతశ్చేతన చూపే మార్గంలో తిన్నగా వెళ్ల గలుగుతారు. ఈ అంతర్బుద్ధి ఒక వరంగా లభించే ఉపజ్ఞ. అది ఒక సుస్థిరమైన, అమోఘమైన చేయూత.

ఈ అమోఘమైన శక్తి ప్రస్తుతం అస్వభావికంగా కనుపిం చినా, భవిష్యత్ జాతికిది సాధారణం, స్వాభావికం కాగలదు. అయితే నిరంతరం దాని వాడుక సాధారణ మనో తర్కసామర్థ్యా నికి నష్టకారి అవుతుందేమో! కోతికున్న శారీరకసామర్థ్యం మాన వునికి లేకుండా పోయినట్లే, మానవుని మానసికసమర్థత అతి మానవుడు పోగొట్టుకుంటాడు. అయితే ఇప్పుడున్న ఆ మానసిక సామర్థ్యం తననూ, తన తోటివారినీ మోసగించుకోటానికే గదా!

ఎప్పుడైతే మానవుడు ఇప్పటిదాకా తాను అభివృద్ధి చేసు కున్నాననుకుని గర్వపడుతూ చెప్పుకుంటున్న తన సామర్థ్యా లన్నీ – తన మేధస్సుతో సహా సరిపోవని గ్రహించి ధైర్యంగా వెల్లడి చేస్తాడో అప్పుడే అతిమానసత్వానికి మార్గం అతనికి

సుగమమవుతుంది. ఇక అప్పటి నుంచీ తన అంతర్గత పేటిక తెరిచి అందులో నిగూఢమై యున్న గొప్ప శక్తుల నన్నిటినీ ఆవిష్కరించుకొని విడుదల చేయుటమే అతని ముఖ్య కార్యక్రమం అవుతుంది. అంతవరకూ తాను అధ్యయనం చేసిన కళలు, తత్త్వశాస్త్రాలు, విజ్ఞానశాస్త్రం, నీతిశాస్త్రం, సాంఘికజీవనం మొదలైన ప్రముఖ సాధనాలన్నీ తన జీవితానికీ, తన మనస్సు తృప్తికీ పరిమితమైపోకుండా ఒక మహాసత్యాన్ని ఆవిష్కరించడం కోసమే వినియోగపడాలి. మానసిక జీవితపరిధుల వెనక మరుగైయున్న ఈ మహాసత్యంయొక్క శక్తిని మానవజీవితంలో ప్రవేశపెట్టాలి. ఈ ఆవిష్కరణమే మన ఉన్నత సత్తకీ, ప్రకృతికీ సరిపడిన కార్యక్రమము.

అయితే మనం ఇంకా ఆత్మోపజీవులం కాము; కాని కావాలి. అంటే నీషే కీర్తించిన బలమైన ప్రాణిక ఇచ్ఛాజీవులు కాకూడదు. అధ్యాత్మిక ఆత్మబలసంపన్నులు కావాలి. అతిమానస మానవత్వమును ప్రస్తావించినపుడు నీషే రూపకల్పన చేసిన దృఢమైన కాని, అసమగ్ర బాహ్య Superman భావనకి సంబంధించిన గందరగోళం నుంచి బయటపడాలి.

నీషే పొరపాటు చేశాడు. దానిని మనం తిరస్కరించాలని అంటున్నాము. నీషే సూపర్మేన్ అధిక బలాఢ్యుడు, ప్రబలమైన శక్తి. ఆ శక్తి బరువుకి మనిషిలోని ఇతర ప్రత్యేక లక్షణాలు అన్నీ అణగిపోతాయి. అలాటి Superman మన ఆదర్శం కాదు. ప్రస్తుతం ఆరాధింపబడే ఆ అతిమానసశక్తి, ఇప్పుడు వెర్రితలలు వేసి వినాశకరశక్తిగా దేశాలను ఎలా నాశనం చేస్తున్నదో చూస్తూనే ఉన్నాము.

అది కానే కాదు; సంతత పరిపూర్ణ ఆత్మవికసనమే అతీత మానవత్వానికి మార్గము. మనిషి ఆధ్యాత్మీకరణకు ఒదిగి ఉంటే, అంతా మారుతుంది, సుగమమవుతుంది. ఆధ్యాత్మిక మార్గాన్ననుసరిస్తూ ఆత్మసిద్ధిని పొంది, తనలోని సత్యాన్ని, తన సత్యస్వరూపాన్ని గుర్తించి, స్వతస్సిద్ధంగా దాని ముందు వినమ్రుడైనపుడు మానవుడు అధికాధిక పరిపూర్ణతను పొందగలడు. ఈ

స్వతస్సిద్ధత అనేది జంతుప్రకృతి మాదిరిగా (instinctive and subconscient) అంతర్బుద్ధి, సుప్తచేతనా కాదు. but intuitive and integrally conscient అంతర్ జ్ఞానము, ఒక సమగ్రమైన అంతర్వాణి.

దీనిని బట్టి నూతనయుగంలో భావిమానవతకు సహాయ పడగలిగే వారెవరంటే ఆధ్యాత్మిక పరిణామమే మానవ భవిత వ్యమనీ, అదే ముఖ్యావసరమనీ గుర్తెరిగినవారే. ప్రస్తుత మానవ జాతి, ఆధ్యాత్మిక మానవజాతిగా మారిపోవాలనీ, ఏ విధంగా ఆదిమానవుడు పశుస్వభావం నుంచి పూర్తి మానసికవికాసం పొందిన మానవునిగా పరిణామం చెందేడో అదే మాదిరి ఈ పరి ణామం కూడా కొనసాగాలని గుర్తించినవారే ఆ వ్యక్తులు.

అటువంటివారు జాతిమతాలను ఎక్కువ పట్టించుకోకుండా ఎవరి నమ్మకాలను వారికి వదలిపెడతారు. కానీ ఆధ్యాత్మిక మార్గం వైపు మళ్ళటానికే ఎక్కువ ప్రాధాన్యత నిస్తారు. ముఖ్యంగా బాహ్యావ్యవస్థలు, యంత్రాంగాల ద్వారా ఈ మార్పు తేవచ్చనే తప్పుడు ఆలోచన మాత్రం వారు చేయరు. ఎవరికి వారు అనుస రిస్తే తప్ప ఇది కార్యరూపం తాల్చదని వారికి పూర్తిగా తెలుసు.

ఈ విధంగా ఉన్న వ్యక్తులు అహంకారజనిత ప్రేరణలను, ఆచారవ్యవహారములను, స్వార్థపూరిత గమ్యాలను పూర్తిగా వది లిపెట్టేస్తారు. పరిపూర్ణ నిష్కామకర్మయే వారిది. ఇహలోక పర లోకాలకు సంబంధించిన స్వలాభాపేక్షతో పనిచేయడం వారి ఊహా కందనిది. ప్రతిఫలాపేక్ష లేకుండా ఏ పనినైనా భగవన్నిర్దేశి తంగా, సంపూర్ణంగా, భేషజమేమీ లేకుండా ఆనందంగా చేస్తారు. ఆ విధంగా భగవత్ప్రేరణతో పనిచేస్తే, ఆ చేయడంలోని ఆనందమే వారికి పారితోషకము, తమ చైతన్యంతో, తమ సంకల్పంతో తమ లోని దివ్యతత్వంతో ఏకత్వాన్ని పొందటమే వారికి దక్కే ప్రతి ఫలము.

ఈ విధమైన ఏకత్వంలోనే అతీతమానవుడు తన సాంఘి కస్థాయిని తెలుసుకుంటాడు. తనలోని దివ్యత్వాన్ని గుర్తెరిగిన ప్పుడు అదే దివ్యతత్త్వాన్ని అందరిలోనూ కూడా గుర్తుపట్టగ

లడు. తనలో తాను ఏకత్వాన్ని పొందినట్లు అందరిలో ఉండేది ఒకటిగా చూసి అందరితోనూ ఏకత్వాన్ని పొంది అంటే వారి తత్వంతోనే కాక అంతర్బాహ్యాస్థాయిలలోనూ, ఆకృతులలోనూ కూడా ఏకత్వాన్ని పొందుతాడు. అతను ఒక మనస్సు, ప్రాణం, శరీరము కాకుండా ఎరుక కలిగి ఆధారభూతమైన ప్రత్యగాత్మే. అదే మౌనంగా, ప్రశాంతంగా ఉండే మనఃప్రాణదేహాలను పాలించే శాశ్వతతత్త్వము. ఆ తత్త్వమే సకల జీవరాసులను పోషిస్తూ, పాలిస్తూ ఉండటాన్ని అతడు దర్శిస్తాడు. తనలోని ఆ పరతత్త్వమే సృష్టికి మూలాధారమై సర్వప్రాణులలోనూ కర్తగా ఉండి వారిని నడిపిస్తోందనీ తెలుసుకుంటాడు. ఈ విశ్వంలో అభివ్యక్తమైన సకల ఆకృతులూ, ఆ దైవస్వరూపాలనే విషయం గ్రహిస్తాడు. అలా గ్రహించి ఆ పరమాత్మలో లీనమై, తన తనువూ, మనసూ, ప్రాణం ఆయన ప్రకటనలేననీ, ఆ విధంగా ఇతరులుగా కనబడే వారు కూడా తన మనసూ, ప్రాణం, దేహంగానే ఉన్నట్లు, అను భూతిని పొందుతాడు. వారితో సమంగా ఉంటాడు. అందరిలోని ఏకచైతన్యాన్ని గుర్తిస్తాడు. పదార్థమంతా ఒకటిగా అనుభూతి పొందినప్పుడు తన శరీరానికీ, ఇతర శరీరాలకీ తేడా అతనికి తోచదు. సర్వజీవకోటి యొక్క మనస్సుతో, హృదయంతో ఏక త్వాన్ని పొందుతాడు. ఇంతెందుకు, తననే అందరిలోనూ, అంద రినీ తనలోనూ దర్శిస్తూ, పరిపూర్ణ ఏకత్వంలోనే నిజమైన ఐక మత్యముందనే విషయం గ్రహిస్తాడు.

అతీత మానవుని గురించిన మొట్టమొదటి వివరాలన్నిటినీ వర్ణించాము కాబట్టి ఇంతటితో ఆపటం మంచిది. ఇంతకంటే ఎక్కువ వివరించడం నిరర్థకమే కాక నిరుపయోగమని కూడా తెలిసింది. మనం ఎన్ని రకాలుగా నిర్దుష్టమైన ఊహాగానాలు చేసి నప్పటికీ ఆ భావిమానవుని రూపొందించలేము. మనం ఏం చేయాలంటే పరమోత్సాహంతో మనస్ఫూర్తిగా ఆకాంక్షించడంవల్ల కలిగే అప్రతిహత ప్రేరణ క్రియాశీలతలను మనస్సులోను, హృద యంలోను నిలుపుకొని, పృథ్విపై ఆవిర్భవించనున్న నూతన జాతిని గురించిన ఉన్నత భావన పొందగలిగే స్థితిలో ఉండాలి.

అప్పుడు మనం నూతన మానవుల రూపకల్పనలో నిర్ణయాత్మ కంగా ముందుకు సాగగలము; మానవత్వాన్ని పరిరక్షించగల జాతిని సృష్టించడంలో మధ్యవర్తులుగా మన వంతు సేవచేయ గల అర్హతను సంపాదించగలము.

*

అతీత మానవతకు శిక్షణ

ప్రశ్న: తల్లీ! మనిషికీ, అతీతమానవునికి నడుమ మధ్య స్థాయిలు ఏమీ లేవా?

నూతన అతీతమానవజాతిని గురించే గదా నీవు మాట్లా డుతున్నది? మనం అతీతమానవుని ఎవరినిగా వ్యవహరిస్తు న్నాము. అంటే మానవునిగా ఉద్భవించి, మానవస్థాయిలో ఉన్న తన భౌతికతత్వాన్ని మార్చుకోవాలని ప్రయత్నిస్తున్న అతీత మానవుని గురించే కదా! అయితే అటువంటప్పుడు అనేక స్థాయి లుంటాయి. వారి వారి సామర్థ్యాన్ను నుసరించి, మారిన దశను బట్టి అనేకమైన స్థాయి లుంటాయి. అనేకమైన ప్రయత్నాలు జరు గుతాయి. కొన్ని ప్రయోజనకరం కాగా, కొన్ని నిష్ప్రయోజనంగా కూడా ఉండవచ్చు. చివరకు కొంతవరకూ ఫలప్రదమై అతీత మానవుని తరహాలో రూపొందవచ్చు. ఎవరైతే వారి సాధారణ మానవత్వాన్ని అధిగమించటానికి పాటుపడతారో, ఎవరైతే తమ అంతర్గత దివ్యసత్యంతో సంసర్గమును పొంది, ఆ అనుభవాన్ని భౌతికప్రకృతిలో సిద్ధింపచేసుకోవాలనుకుంటారో, ఎవరైతే తాము పొందిన అంతర్గత చైతన్య పరిణామంతో పరలోకం వైపు దృష్టి సారించకుండా బాహ్యప్రపంచంలో, భౌతికంగా ఆ పరిణామాన్ని సాధించాలని ప్రయత్నిస్తారో – అటువంటివారంతా అతిమానస శిక్షణ పొందుతున్నవారే. ఈ విధమైన వారి ప్రయత్నాలు సఫ లీకృతం కావడంలో కూడా లెక్కకు మించినన్ని అంతరాలు న్నాయి. మనం సాధారణ జీవితం గడిపే సాదా సీదా మానవుని వలె ప్రవర్తించకుండా చేసే పనుల్లో, ప్రతి క్రియల్లో, మన కద లిక లన్నిటిలో దివ్యసత్యాన్ని వ్యక్తం చేయటానికి ప్రయత్నించి

నప్పుడూ, సాధారణమైన అజ్ఞానానికి లోబడకుండా, సత్యానికే లోబడి ఉన్నప్పుడూ అతీత మానవస్థితికి శిక్షణ పొందుతున్నట్లే. ఈ ప్రయత్నాలన్నిటిలో సఫలీకృతులం కావటాన్ని బట్టి మనం మంచి శిక్షణాభ్యాసకులమా కాదా అని తెలుస్తుంది. ఆ మార్గంలో ఎంతవరకూ పురోగమించామో తెలుస్తుంది.

అయితే మనం ఎంతవరకూ వచ్చాము, ఇంకా ఎంతదూరం వెళ్ళాలి అనే విషయాలను గురించి ఎక్కువ ఆలోచించకపోవటమే మంచిది. అది నిన్ను కుంటుపరచి ముందుకు వెళ్లనివ్వదు. అందు చేత ముందుకు వెళ్ళే విషయం తప్ప నీవు ఇంకోటి ఆలోచించ వద్దు. అప్పుడే బాగా వేగంగా పురోగమించగలవు. నువ్వెక్కడికి చేరాలనుకుంటున్నావో, దాని మీద దృష్టి నిలిపి ముందుకు కద లడానికి నీ శక్తులన్నీ ఉపయోగించు. ఎంత దూరం వెళ్ళావనేది నీకు అక్కర్లేదు. ఇదే చరిత్ర అవుతుంది. ఆ తర్వాత చరిత్రకారులు మనం చేసిన ప్రయత్నాల గురించి చెపుతారు. మనం ఏమి చేశామో, ఏ విధంగా చేశామో వారే చెపుతారు. ప్రస్తుతం ఏది అవసరమో అదే చేయాలి. మనకంత వరకే.

*

మనం అతిమానసంతో సాన్నిహిత్యం పొందామనటానికి అప్రతి హాతమైన రెండు గుర్తు లున్నాయి.

1. నిరంతరాయంగా ఉండే పరిపూర్ణ సమత్వ దృష్టి
2. సత్యజ్ఞానమునందు పరిపూర్ణ నిశ్చితత్వము.

సమత్వదృష్టి పరిపూర్ణత అంటే అది అన్ని సందర్భాల లోనూ, అన్ని పరిస్థితుల్లోనూ, అన్నిరకాల సంబంధాలలోనూ అంటే పదార్థసంబంధమైనవైనా లేక మనస్సంబంధమైనవైనా అవి ఎటువంటివనిగానీ, వాటి ప్రభావం ఎలా ఉంటుందనికానీ, ఆలో చన లేకుండా స్థిరంగానూ, స్వతస్సిద్ధంగానూ ఉండాలి.

సారూప్యం ద్వారా మాత్రమే సంపూర్ణంగా, నిరాక్షేపణీ యంగా ఉండే అమోఘమైన సత్యజ్ఞానం లభిస్తుంది.

అనువాదకులు: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

దేనిపైనా వ్యామోహంలేని, విముక్తమైన సమయం ఒకటి వస్తుంది. ఏది ఉపయోగించినా, చేసినా చైతన్యం ప్రభావితం కాదు. సరిగ్గా కావల్సినది ఇదే. ఆకాంక్షించే ఉన్నతజీవనానికి కార్యసాధనాలుగా బాహ్య హావభావాలు, హేతుబద్ధంకాని నిర్ణయాలు మనోచేతన నుంచి ఉద్భవిస్తాయి. ఇవి అసమర్థమైనవి అయినా ఇవి ఇప్పుడు ఉన్న జంతుస్వభావానికి మించి అతీతంగా తప్పక ఉండవలెనని జీవుని ప్రచోదనం చేస్తాయి. కాని కావల్సినది ఇది కాదు. బాహ్య విషయాలు పట్టించుకోకుండా వాటి ఆలోచనే లేకుండా, అందినవి స్వీకరిస్తూ, అందనివాటి కోసం ప్రాకులాడకుండా ఉండే వ్యక్తి (ఆధ్యాత్మిక) మార్గంలో చాలా పురోగామిగా ఉంటాడు. ఇందుకు సన్యాసి కానక్కర్లేదు.

చైతన్యంలో మార్పు నిజమైన సార్థకత. అతిమానసశక్తుల స్పందనలతో, సతత, సమగ్ర, సన్నిహిత సంయోగము – ఇది అనివార్యము. దీని ద్వారానే అంతరంగ విముక్తి, అతిమానస దైవీ శక్తులతో సమైక్యత. ఇక్కడ ఇంకా కావల్సినది – నిరంతర మానసిక నిమగ్నత. శరీరజీవకణాలతో సహా, సమస్త జీవుని ఆకాంక్ష, ఇచ్ఛ. పరిణామాలు గురించి పట్టించుకోవాల్సిన పనే లేదు. ఎందుచేతనంటే ఇవన్నీ సహజంగా, స్వతస్సిద్ధంగా, స్వయంచాలనంగా అభివ్యక్తమయే, విశ్వశక్తుల లీలలకు అనుగుణంగా వ్యవహరిస్తాయి. దివ్యశక్తి, కాంతి, సత్యాలతో ఇంకా అనిర్వచనీయ అతిమానస ఆనందంతో సంతత పరిపూర్ణ సంసర్గము – this is the only thing that matters కావల్సినది అదే.

ఇదే చిత్తశుద్ధి అంటే. మిగిలినదంతా తనకు తానుగా ఆడే నాటకం. పరిపూర్ణస్వచ్ఛత అంటే? అలా దినదినప్రవర్ధమానంగా, స్వచ్ఛంగా ఉండటమే. తప్పనిసరిగా, స్వచ్ఛందంగా, స్వచ్ఛంగా ఉండటమే – అంతే. అదే చిత్తశుద్ధి.

2. అభివృద్ధికి బలమైన కోరిక: ఇది చాలావరకు చాలా మందిలో, ఆదరం, దయ, ఉత్సాహం, గ్రహణశక్తులపై ఆధారపడి

ఉంటుంది. సమూహాముకంటె వ్యక్తి ముందుగా పురోగమిస్తాడు. సృష్టిలో సహజంగా మానవజాతి, మిగిలినవాటికంటె, అతిమానస అభివ్యక్తీకరణకి నిర్దేశింపబడి ఉంది. విషయాలు ఎప్పుడూ అలానే ఉండిపోవు. వ్యక్తులు కూడా అంతే. మార్పుకి ప్రేరణ తప్పనిసరిగా ఉంటుంది. కలిసి పనిచేయటం (collaboration) దీనికి ఆధారం. ఇందుకెన్నో పద్ధతులు; అన్నీ మంచివే విజయవంతమైతే! వ్యక్తికి తను ఉన్న అస్తిత్వంలో విసుగు కలుగుతుంది. ఉన్న పరిస్థితి నుంచి బయటపడాలని గాఢంగా కోరుకుంటాడు. ఉన్నదానికంటే మించినదేదో సాధించాలనుకుంటాడు. గుణాత్మకంగా, తనలో, సత్యసౌందర్య సామీప్యతల స్పర్శ గ్రహిస్తాడు. ఈ దిశగా తన పయనం దుస్సహం కాకూడదని, మిగిలినవాటినన్నిటినీ ఆటంకాలుగా తనకు తానే వదిలేస్తాడు.

ఇక్కడ ముఖ్యంగా కావల్సినది (ఆధ్యాత్మిక) అభివృద్ధికి తీవ్రమైన ఆకాంక్ష. అందుకు ఏ ఆటంకాన్నైనా మనఃపూర్వకంగా ఆనందంతో పరిత్యజించటం; అభివృద్ధినిరోధకమైన దానినంతటినీ తననుంచి తీసి దూరంగా పారవేయటం; దృఢవిశ్వాసంతో అనూహ్యమైన గమ్యం కోసం పయనం – ఇదే రేపటి సత్యము. ఇదే అత్యావశ్యకమైనది. ఏ ప్రకృతి వైపరీత్యము, దుష్టశక్తి, అడ్డుకోలేనిది. పాత అలవాట్లకు దాసులుకాని వాళ్లు, వారి అదృష్టం కొలదీ, అద్యతనభావిలోనే ఈ దివ్య అస్తిత్వాన్ని దర్శించగలుగుతారు; తెలుసుకోగలుగుతారు!

ప్రజలు సాధారణంగా అప్రమత్తంగా నిద్రావస్థలో ఉంటారు. జీవితాన్ని చాలా తేలికగా తీసుకుంటారు. కాని మనం ఇప్పుడు ఒక అసాధారణ సమయంలో ఉన్నాము అన్న విషయం గుర్తుంచుకోవాలి. ఇది మన అదృష్టం. ఒక నవలోకం మనకోసం వెలసే సమయంలో ఉన్నాం. మనకిది ఒక అమూల్య అవకాశం కాదా! ఇదే కనుక మనం గమనిస్తే మనకేదీ ఆటంకం కాదు.

ఒక నవప్రపంచ ఆవిర్భావాన్ని దర్శిస్తున్నామనే అనుభూతి మనకు ప్రస్ఫుటం కాకపోవచ్చు. కాని ఇది రూఢియైనదనే విశ్వా

సంతో – మెలకువలో, నిద్రలో, – ఈ ఉన్నత సత్యచైతన్య స్పృహాలో కర్మలు అనుష్ఠిస్తూ ఉండటం – చాలా ముఖ్యం.

ఆ విధంగా, మనం, అందులో భాగస్వాములం కాగలుగుతాము. మనమే ఈ నవప్రపంచం కాగలం. ఇది ఒక అద్భుతమైన అవకాశం కాదా! ఇందు కోసం ఏమైనా వదిలిపెట్టవలసినదే కదా!

3. అంటిపెట్టుకుని ఉండకు: దేనికీ ఆశపడకుండా ఉండటం, అనేది మనం చేయగలిగే ప్రశస్తమైన పని. అలాగే ముందే ఊహించుకున్న భావాలకి, సూత్రాలకి, కట్టుబడి ఉండక పోవటం. నైతికసూత్రాలు, ప్రవర్తనా నియమావళి, ఏమి చేయాలి, ఏమి చేయకూడదు, నైతికంగా ఏర్పర్చుకున్న భావాలు, సామాజిక, మానసిక సంప్రదాయాలు – ఓ! వీటికంటే హీనమై అవరోధాలు ఉండవు. ఏర్పరుచుకున్న దృఢ అభిప్రాయాల నుంచి బయటపడటానికి దశాబ్దాలు వ్యర్థం చేసుకున్నవాళ్లు నాకు తెలుసు. నిరాడంబరంగా ఉంటూ, దేనినైనా ఆహ్వానించే సంసిద్ధత (openness) ఉన్నప్పుడు ఏమైనా జరగటానికి వీలుంటుంది. సహజంగా పురోగతి కోసం తపన, జ్ఞానపిపాస, రూపాంతరంకోసం తృష్ణ, అన్నిటికీ మించి సత్యప్రేమలపై ప్రగాఢవాంఛ – వీటిని సుస్థిర పర్చుకున్నప్పుడు పురోగతి త్వరితమౌతుంది. కావలసినదల్లా – పిపాస. నిజంగా ఇదే ఎంతో ఆవశ్యకం.

నిన్ను బంధించేవి ఏమిటో నీకు తెలుసా? నిన్ను అంటిపెట్టుకుని ఉన్న నీ విశ్వాసాలు, అలవాట్లు, ఇష్టాలు, భావాలు, అవసరాలు, నిన్నంటి ఉన్న ఈ లోకం – వీటినన్నిటినీ వదల్చుకోవాలి. బంధవిముక్తి కావాలి. ఎన్నివేలసార్లు చెప్పు. చేసినదే చేస్తూంటారు. అనర్గళంగా ప్రబోధాలు చేసేవాళ్లు కూడా అలా అంటిపెట్టుకునే ఉంటారు. వాళ్ల దృక్పథం, భావనలు, అలవాట్లు – ఇవే వాళ్ల ప్రపంచం.

ఎప్పుడూ ప్రతి విషయంలోనూ మార్పును ఆహ్వానిస్తూ ఉండాలి. మారకూడనిది ఒక్కటే. అదే ఆకాంక్ష, తృష్ణ.

నాకు తెలుసు, కొంతమందికి దైవము అనే భావనే నచ్చదు. ఎందుకంటే వెంటనే ఇది యూరోపియన్ లేక పాశ్చాత్యభావాలతో మిళితమైపోతుంది. నిజానికి దీని అవసరం లేదు. అవసరమైనది – దివ్యప్రేమ, సత్యము, మహత్తరమైన పరిపూర్ణత. ఇక సిద్ధాంతాలంటారా – అవి ఎంత తక్కువ ఉంటే అంత మేలు. కావల్సినది శ్రేష్ఠమైనది ఒక్కటే. పద్ధతులు, మార్గాలు వేరు కావచ్చును. అమెరికను యువత దుబారా జీవితమైనా కానీ – అదేమంత ప్రముఖ విషయం కాదు.

4. పెనుగులాడకు; అర్పించుకో: అన్నిటికీ, ఆధారంగా ఉండటానికి కావల్సినది సమతూకం. ఇది నిరహంకారం, సర్వేశ్వర శరణాగతి వలన సాధ్యపడుతుంది. సర్వేశ్వరునితో తాదాత్మ్యత నిజమైన స్వచ్ఛత. పరిపూర్ణమైన సమతౌల్యం లేకుండా అతిమానసశక్తి ప్రమాదభరితము. దాని అవరోహణకి ప్రయత్నించకూడదు. perfect balance లేకుండా ఈ పని చేస్తే బెడిసికొడుతుంది. దాని శక్తి చాలా భయంకరమైనది.

ఈ సందర్భంగా మీకో సలహా ఇస్తాను. నీ (ఆధ్యాత్మిక) సాధన పురోగమనంలో ఆకాంక్షతో శక్తులను నీ వైపు బలవంతంగా ఆకర్షింపచేసుకునే ప్రయత్నం చేయకు. నిన్ను నీవు అర్పించుకో. నిరాసక్తంగా ఉన్మీలనం చెంది ఉండు (open yourself). శక్తిని క్రిందికి నీవైపు లాగుకునే ప్రయత్నం ప్రమాదభరితమైన అహంకారము. నువు ఆకాంక్షించు; అర్పించుకో, ఉన్మీలనం చెంది ఉండు. విషయాలు వక్రిస్తే శక్తిని నిందిస్తారు. బాధ్యత శక్తిది కాదు. నీ అహంకారము, అజ్ఞానము, బలహీనత లది.

నిన్ను నీవు ఉదారంగా, పరిపూర్ణ నిరాసక్తతతో, కావాలి అని ఆపేక్షించకుండా అర్పణ కావించుకో. నీకెలాటి చెడూ ఎప్పుడూ రాదు. కావాలనే అభిలాష అగాధపుటంచుకి నిన్ను చేరుస్తుంది.

5. అతిమానస జీవనమార్గంలో కష్టసుఖాలు: పురోగమిత, విశ్వవికాస క్రమంలో తర్వాత రాబోయేది అతిమానస జీవన ప్రారంభాలు. దీని పురోగతి ముందు అంతగా ప్రస్ఫుటం కాకపో

వచ్చు. కాని ఇది తప్పనిసరి. అంతకంతకు ఇది బహిర్గతమౌతూ ఉంటుంది. మానసికశక్తియొక్క చలితచాలనాలతో అతిమానస జీవనం చేరుకోవటం చాలా కష్టం.

మానసిక జీవనం ఆధారంగా అతిమానసజీవనం అందదు. ఎంత సర్వోన్నత మేధోచింతన ఉన్నా ఇది కష్టం. 'అతిమానసం' అన్న మాటలో 'మానసం' మనలను తప్పుత్రోవ పట్టించే అవకాశం ఉంది. ఇది ఉన్నతమానస క్రియాకలాపం అని పొరబడవచ్చు. నిజానికి అది కాదు. ఎంత ఉన్నత, స్వచ్ఛ ఉదాత్త మానసికశక్తి ఉన్నా, అది నిరూత్సాహ శక్తిహీనమైన ఊహాగానాలు చేయడానికే పనికివస్తుంది తప్ప అతిమానస అనుభవానికి ఏమాత్రం దగ్గరకి తీసుకొని వెళ్లదు. జీవితానికే మాత్రం అది సంబంధించి ఉండదు.

ఈ మూలాధార పదార్థం (the Supramental Consciousness) ప్రపంచంలో విస్తృతమౌతూ పనిచేస్తోంది. ఇది ఉత్సాహ భరితంగాను, శక్తివంతంగాను, ఆనందకరమైనదిగాను, తీవ్రమైనదిగానూ ఉంటుంది. దీని ముందు మొత్తం మానసిక కార్యకలాపం అంతా అనాసక్తంగానే ఉంటుంది. కాబట్టి దీనిని గురించి ఎక్కువ మాట్లాడటం అనవసరం. దీని గురించిన ఎన్నో వివరాలుకంటె, ఒక్క లోతైన దివ్యకృపకి ఆలంబనయే ప్రేమాస్పద స్పందన చాలు. ఇది ఒక్క క్షణం ఉన్నా ఫర్వాలేదు.

ఇంకా ఒక రకమైన పరిశుద్ధమైన సంవేదన – సూక్ష్మము, పారదర్శకము, తేజోమయము, నిశితము, లోలోపలికి చొచ్చుకొనిపోయేది – నీకు కవాటము తెరుస్తుంది. ఎంతటి సూక్ష్మాతిసూక్ష్మ వివరణ అయినా దానిముందు తీసికట్టే.

పదార్థ, పరార్థాల కొసలు రెండూ స్పృశించుకుంటాయి. వృత్తమావృతమౌతుంది. పరార్థము పదార్థములో అభివ్యక్తమౌతుంది. అతిమానస అనుభూతి వాస్తవమౌతుంది. అనుభవైక వేద్యమౌతుంది. అనుభవంలోకి వస్తేనే కదా ఏమైనా బోధపడేది!

6. అంతరంగ పరివర్తన తర్వాతే బాహ్యాపరివర్తన.: మేము అభిలషించేది – శరీరము, దాని కార్యకలాపాలతో కూడా మిళిత మైనదాని యొక్క పరిపూర్ణ రూపాంతరీకరణ.

గతంలో రూపాంతరీకరణ అంటే అంతరంగ చైతన్యరూపాంతరీకరణ మాత్రమే అని భావించేవారు. అంతరంగ చైతన్యాన్ని గుర్తించి, గతంలో శారీరక బాహ్యా కార్యకలాపాలన్నిటినీ పనికి మాలిన అవరోధాలుగా తిరస్కరించేవారు. శ్రీఅరవిందులవారు ఇది సరికాదని తెలియపర్చారు. రూపాంతరీకరణ ప్రక్రియలో, దివ్యసత్య అభివ్యక్తీకరణకు బాహ్యాంతరాలు రెండూ సముచిత రీతిలో పాలుపంచుకోవాలి అని ప్రకటించారు. ప్రజలు ముందు దీనిని విన్నప్పుడు, అంతరంగ చలితచాలనాల చికాకులతో ప్రమేయం లేకుండా భౌతిక కార్యకలాపాల రూపాంతరీకరణం సాధ్యమే అనుకున్నారు.

శారీరక రూపాంతరీకరణం చేపట్టడానికి ముందు ... ఇది అన్నిటికన్నా కష్టతరమైనది – నీ అంతరంగ చైతన్యం దివ్య సత్యచైతన్య సంసర్గంలో గట్టిగా గాఢంగా స్థిరపడాలి. అపుడే రూపాంతరీకరణకి పరాకాష్ఠగా దివ్యసత్య వ్యక్తీకరణ (the final expression of the Truth) final for the moment at least.

రూపాంతరీకరణానికి మొదటి మెట్టు గ్రహణశక్తి (receptivity). రూపాంతరీకరణానికి ఇది అత్యావశ్యకమైనది. తర్వాత వచ్చేది చైతన్యంలో మార్పు. చైతన్యంలో అభివృద్ధికి సన్నద్ధం కావటాన్ని కోడిగ్రుడ్డులో పిల్ల పెరుగుదలతో పోల్చవచ్చు. చిట్ట చివరిదాకా గ్రుడ్డు మార్పుచెందకుండా అలానే ఉంటుంది. పిల్ల పూర్తిగా సజీవాకృతి పొందిన తర్వాత తన చిన్న ముక్కుతో చిన్న రంధ్రం చేసుకుని, గ్రుడ్డులోనుంచి పిల్ల బయటకి వస్తుంది. చైతన్య రూపాంతరీకరణం కూడా ఇలానే జరుగుతుంది. సాధారణ అభిప్రాయం చైతన్యంలో మార్పు ఏమీ రాదని – గాఢమైన ఆకాంక్ష ఉన్నపుడు నిన్ను ఏదో నిరోధిస్తున్నట్లు, అడ్డుతగలిన భావన. ఇలా అనుకోవటం చాలా కాలంగా ఉంది. కాని చివరి దాకా పరిశ్రమిస్తూ లక్ష్యం చేరుకున్నపుడు జీవుడు తనని చుట్టి

వున్న గుల్ల (shell) ను బ్రద్దలు కొట్టుకుని ముందుకు మరొక ఉన్నతచేతనాస్థరానికి దూసుకుపోగల్గుతాడు. (రూపాంతరీకరణం చెంది).

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

నూతన సృష్టికి పునాదులు

నూతన సృష్టికి సహకరించడం

ప్రశ్న: 1919 లో శ్రీఅరవిందులు అల్లకల్లోలాలు, విపత్తులు అనేవి నూతనసృష్టి కోసం పుడమితల్లి పడుతున్న పురిటినొప్పులు అని వ్రాశారు.. ఇది ఇలా ఎంతకాలం కొనసాగుతుంది? ఆశ్రమంలో, భారతదేశంలో, అలాగే యావత్తు ప్రపంచంలో ఎంతకాలమిలా...?

ప్రపంచం నూతనసృష్టిని ఆహ్వానించి అందుకోసం సిద్ధపడే పర్యంతం యిది ఇలా కొనసాగుతూనే ఉంటుంది. ఈ సంవత్సర ఆరంభం నుండి (1969) నూతనసృష్టికి సంబంధించిన చేతన తన పనిని తాను చేసుకుపోతూనే వుంది. దానిని అడ్డుకొనకుండా ప్రజలు అందుకోసం సహకరిస్తే, అది శీఘ్రంగానే జరుగుతుంది. కాని మూర్ఖత్వం, అజ్ఞానం మొండిపట్లు పట్టు వదలవు.

ప్రశ్న: (1970) లోని మీ సందేశంలో 'ప్రపంచం ఒక గొప్ప మార్పుకు సిద్ధం అవుతున్నది. నీవందుకు సహాయపడతావా?' అన్నారు. మీరు చెప్తున్న ఆ గొప్ప మార్పు ఏమిటి? అందుకు మేం అందించే సహకారం ఏమిటి?

ఇపుడు జంతువుకు మానవుడు ఎలాగో, రాబోయే ఆ నూతనజాతికి ఇప్పటి మానవుడు అలా! అంతటి గొప్పమార్పు అది. ఈ నూతనజాతికి చెందిన చేతన తన పనిలో తాను నిమగ్నమై వుంది; దానికి స్పందించి, స్వాగతించేవారికి విశదీకరించేందుకు.

*

ప్రశ్న: మీరు మా సహాయం కోసం అడిగారు కదమ్మా! నేనుగా మీకేం సహాయపడగలను? అందుకోసం నేనేం చేయాలి?

ప్రగతిశీలమైన ఆ నూతన చేతనను ఏకాగ్రతతో ఆహ్వానించడం నూతనంగా దిగివస్తున్న శక్తులను పనిచేయనివ్వడం. అంతే.

*

ఆ మార్పుకు మన సహాయం అవసరం లేదు. కానీ అవతరిస్తున్న ఆ చేతనకు మనం ఉన్మీలనమై ఉంటే, అది మన పట్ల నిరర్థకం కాకుండా వుంటుంది.

*

ప్రశ్న: 1969 లో అవతరించిన ఆ నూతనచేతన స్వేచ్ఛగా పని చేయాలంటే సాధకుడు చేయాల్సిందేమిటి?

(దానిపట్ల) గ్రహణశీలత మరియు మృదుత్వము (కలిగి ఉంటే చాలు)

*

ఈ నూతనచేతనను మనం ఆహ్వానించడంకోసం మనల్ని మనం సంసిద్ధం చేసుకోవాలనుకున్నపుడు మొట్టమొదటి తప్పనిసరి షరతు ఏమిటంటే మనం నిజాయితీతో సహజసుందరమైన నమ్రతాభావం అలవర్చుకోవడం. అపుడే మనం సంపాదించుకొనబోయే ఆ అద్భుతమైన విషయాలతో పోల్చి చూసినపుడు మనకు తెలిసింది ఏమీ లేదని, అసలు మనమేమీ కాదనే వాస్తవం మన అంతరంగంలో మెదలుతుంది.

*

నూతనజీవి రాకకోసం మనల్ని మనం వీలైనంత ఎక్కువగా సంసిద్ధం చేసుకొనెదము గాక!

మనస్సును నిశ్శబ్ధపరచుకొని దాని స్థానంలో సత్యచేతనను ప్రతిష్ఠించుకోవాలి. సమగ్రచేతన, సూక్ష్మచేతనతో సమరసంగా మేళవించాలి.

*

అది చాలా సున్నితమైన కార్యక్రమం. ఎందుచేతనంటే బహుశా అది మనకు. పరిచయం లేనిది. ఏమాత్రం చలనం ఉన్నా, అత్యల్ప మానసికప్రకంపనం వల్లనైనా మొత్తం చెదిరిపోతుంది. కానీ అది నిలిచినంతకాలం చాలా పరిశుద్ధంగా ఉంటుంది. అంతేకాక అతి మానస సుస్థిరస్థితి కావాలి. మానసికమైన ఆధ్యాత్మిక సంకల్పం ఇంక ఎంతమాత్రం జోక్యం చేసుకోగూడదు. ఎందుచేతనంటే ఆధ్యాత్మిక సంకల్పం ఎవరికైనా ఉండవచ్చు. ఆధ్యాత్మిక సంకల్పంతోనే సదా జీవిస్తూకూడా ఉండవచ్చు – అంతరంగంలోని దైవం నడిపిస్తున్నదని అనుకొనే వారందరి విషయంలో జరిగేది అదే – కానీ అది మనస్సు అందించేదే తప్ప, ఆధ్యాత్మికం కాదు. అలా ఉన్నంతకాలం అది అతిమానసజీవితం కాదు. అతిమానస జీవితం అనేది ఎంతమాత్రం మనస్సు ద్వారా సాగదు. పైనుంచి క్రిందికి, క్రింది నుంచి పైకి సమాచారం ప్రసారమయ్యే దారిలో మధ్యనున్న నిశ్చల క్షేత్రం మనస్సు. ఒక చిన్న కుదుపు చాలు. ఆ నిశ్చలతను భగ్నం చేయడానికి.

ఐహిక చేతన ద్వారా, నిశ్శబ్ద అతిమనస్సు (Supermind) తనను తాను, వ్యక్తం చేసుకోగలగాలంటే, పరాత్పరునితో ఆధ్యాత్మిక ఏకత్వం ద్వారా లభించిన పరిపూర్ణమైన, సదా నిలిచివుండే సమత్వస్థితి అవసరం. పరిపూర్ణ సమతలో ప్రతీదీ పరాత్పరునిదే అవుతుంది. అంతేకాదు, అది సచేతన సంకల్పంతోగానీ, బుద్ధి ప్రయత్నంతోగానీ, లేక ఆ స్థితికి ముందున్న అవగాహనతోగానీ సాధించుకున్న సమత్వం కాగూడదు. అప్పటికప్పుడు, అప్రయత్నంగా, దానంతటదే సిద్ధించినదై ఉండాలి. బయటినుంచి వచ్చే ప్రతిదానికీ, బయటినుండి ఏదో వస్తోంది గనుక ప్రతిస్పందిద్దామన్నట్లుగా మాత్రం స్పందించగూడదు. ఈ విధమైన అంతర్విచారణ, ప్రతిస్పందన స్థానంలో సదా గమనిస్తూ ఉండే ఒక స్థితి – దాన్ని నేను ఎపుడూ ఒకే విధంగా ఉండాలని అనను. ఎందుచేతనంటే ప్రతిదానికీ తప్పక ప్రత్యేకమైన ప్రతిస్పందన అవసరం –

చెప్పాలంటే అది ఏ విధమైన వ్యతిరేకస్పందన కాగూడదు. బయటినుండి వచ్చి కావాలని ఏదో నిన్ను తట్టినప్పుడు ప్రతిస్పందించడానికీ, సహజంగా సంచరించే దానితో పాటు సాధారణకార్యం నిమిత్తం ప్రకంపనాలను తీసుకొచ్చినపుడు కలిగే ప్రతిస్పందనకూ మధ్య భేదం వున్నది.... నేను మీకు స్పష్టంగా అర్థమయ్యేట్లు చెప్పగలుగుతున్నానో లేదో నాకు తెలియడం లేదు.... ప్రకంపన రూపంలో ఒక ప్రత్యేక కార్యక్షేత్రంలో జరిగే కదలికకూ, బాహ్యం నుండేదో వచ్చి, బాహ్యంపై తగిలి ప్రతిస్పందనను రేకెత్తించే దానికి – మానవచేతన సహజస్థితికీ – మధ్య ఉండే భేదం అది. అలాకాక పరాత్పరునితో చేతన తాదాత్మ్యసిద్ధి పొందినపుడు కదలికలన్నీ, అంతరంగంలోనివే అవుతాయి. బాహ్యం అనేది ఏదీ ఉండదు గనుక, బయటినుండి ఏదీ రాదు అని చెప్పవచ్చు. కొన్ని విషయాలున్నాయి. అవి కేవలం అలా సంచరిస్తూ ఉంటాయి. అవి సంచరిస్తున్నపుడు కొన్ని ప్రకంపనాలు వాటితోపాటు సహజంగానే సంచరిస్తూ వుంటాయి. సారూప్యతవల్ల, అవసరంవల్ల అలా వుంటాయి. లేదా అవి సంచరించే మాధ్యమంలో వాటిని మార్చే దాని మూలంగా కూడా కొన్ని ప్రకంపనాలు కలుగుతాయి.

పురోగమనానికి నిరంతర ఆకాంక్ష మరియు వికాసం – శ్రీమాత

ప్రశ్న: అతిమానసం ఎలా పనిచేస్తుంది? దానిని ఆహ్వానించడం ఎలా? అది ఏ రూపంలో ప్రకటితమౌతుంది?

శ్రీఅరవిందులు వేదాలమీద వ్రాసిన పుస్తకంలో ఒకచోట ఈ ప్రశ్నలన్నింటికీ చక్కని సమాధానాలిచ్చారు. విను, చెప్తాను.

"మనల్ని మనం నిరంతరం వికసింపజేసుకొనడం ద్వారా మరియు ఆత్మను సుసంపన్నం చేసుకున్నదాని ఫలితంగా. దైవ సంకల్పం ప్రకారం అతిమానసప్రపంచం అనేది మనలో అవతరించడం జరుగుతుంది."

అంటే అతిమానసిక సత్తాగా మనం రూపొంది తద్వారా అతిమానసిక ప్రపంచం ఉనికిలోకి రావాలనుకుంటే, ముమ్మం

దుగా మన చేతన నిరంతంరం విశాలమవుతూ అంతకంతకూ పురోభివృద్ధిని సాధించడం ద్వారానే ఆశించగలం. అంతే తప్ప ఒక్కసారిగా ఎగరాలనుకోవడం, ఏదో ఉండీ లేనట్లుగా ఉండే ఆకాంక్షతో, ఏదో చిన్నప్రయత్నం చేసి అంతలోనే వెల్లికిలా పడి, సుషుప్తిలో మునిగిపోవడం ద్వారా మాత్రం కాదు. దీనినే నిరంతరం ఆశయంగా అంటిపెట్టుకొనడం, సడలని పట్టుదలతో, వెనుదిరిగిచూడని ప్రయత్నం అలాగే జీవితానికి అది తప్ప వేరే లక్ష్యం ఏదీ ఉండకూడదు. అలా అయితేనే అది సాధ్యం.

రోజులో ఓ 5 నిమిషాల పాటు అతిమానసశక్తి అనేది ఈ జగత్తులో ఉంది అని గుర్తుచేసుకొనడం, 'అది నాలో ఆవిష్కరించబడితే బాగానే ఉంటుంది.' అని తలపోస్తూ, మిగిలిన సమయమంతా ఇతరత్రా దేనిని గురించో ఆలోచిస్తూ బిజీగా గడిపేస్తూ ఉంటే అది నీలో ప్రవేశించి పని చేసేందుకు అవకాశం ఏమాత్రం వుండదు. ఈ విషయాన్ని శ్రీఅరవిందులు స్పష్టంగా, వివరంగా చెప్పారు. నీవు ఆ పని చేయగలవని చెప్పడం లేదు: అది దైవేచ్ఛ అని మాత్రమే చెబుతున్నారు. అందువల్ల 'అమ్మో! అది నా వల్ల కాదు' అనవద్దు. నిన్ను ఆ పని చేయమని ఎవరూ చెప్పడం లేదు. కాని అందుకోసం ఎడతెగని ఆకాంక్షతో దానిని అంటిపెట్టుకొని సత్తాను అంతకంతకూ విశాలం చేసుకొనడం, చేతనను వీలైనంతగా నిరంతరంగా విస్తృతం చేసుకొనడం తప్పనిసరి అని మాత్రమే చెప్పడం జరుగుతున్నది. నిజం చెప్పాలంటే అతిమానసాన్ని మనలో నిలిపేటందుకు మనలో ఏమాత్రం ఖాళీ లేదు. మనం చాలా చాలా చిన్నవాళ్ళం. ఎందుకంటే మనలో ఎన్నో సాధారణ విషయాలన్నీ చేరి మరి దేనికీ చోటు లేకుండా చేశాయి. అందుకే అతిమానసానికి చోటు కల్పించాలంటే మనల్ని మనం చాలా చాలా విశాలం చేసుకొని దానికి చోటు కల్పించాల్సి వుంది.

అంతేకాకుండా పురోగమనం కోసం మనలో ఆకాంక్ష కావాలి. ఉన్నదానితో తృప్తిపడడం, చేసినదానితో సంతృప్తి చెందడం, బాగానే ఉన్నానుగా అనుకోవడం కాకుండా, తెలిసిన దానితోనే సరిపెట్టుకొనడం, ఇంతకన్నా కావలసింది మాత్రం

ఏముంటుంది అనుకోవడం కాకుండా, ఇంకా ఇంకా కావాలనే తపన కావాలి. ఇంతకన్నా బాగా వుండాలి. ఇంతకన్నా గొప్ప వెలుగు కావాలి, ఇంతకన్నా విశాలమైన చేతన కావాలి. ఇంతకు మించిన నిజమైన సత్యం తెలుసుకోవాలి. విశ్వజనీనమైన సౌజన్యం అలవరచుకోవాలి. అన్నింటికీ మించి అకుంఠితమైన సత్‌సంకల్పం కావాలి.

ఇదంతా ఏదో కొన్ని రోజులలో జరిగే పని కాదు. నీవు ముఖ్యంగా గుర్తుంచుకోవలసిన విషయం మరొకటి వుంది. నేనిదంతా భౌతిక పరివర్తనం గురించి చెప్పడం లేదు. అందరికీ తెలిసిందే; ఉన్నట్టుండి తెల్లవారేసరికల్లా నీ శరీరం ఎలా కావాలంటే అలా మలచటానికి వీలు కల్గించుకోవడం; తేజోవంతం గావడం; అనుకున్నప్పుడు అదృశ్యం గావడం; అలా జరగదు. ఇలా జరుగుతుందని నీవు అనుకోవని నాకు తెలుసు. అలా జరిగేందుకు కొంత సమయం పడుతుంది.

అయినా సరే! చేతన పనిచేయడమంటే ఎంతో కొంతమేరకు తనపై తనకు ఆధిపత్యం కలిగి ఉండటం, తగినంత అదుపు, విషయాలపై సూటియైన అవగాహన, అన్నింటితో తాదాత్మ్యత చెందగల స్థాయి, స్పష్టమైన దార్శనికత, – అంటే పైపైన చూసి మోసపోయి, అట్టడుగున పడిపోయినవాటిని తవ్వి బయటికి తీయడం, అసత్యమైన వాటికి అనవసర ప్రాధాన్యత నీయడం లాంటివాటికి బదులుగా – అంతఃస్ఫూర్తితో తెలుసుకొనడం, నేరుగా గ్రహించడం ద్వారా తనను తానుగా అలా సంసిద్ధం చేసుకొనడం ద్వారా, మాత్రమే ఈ దిశగా పురోగమించవచ్చు.

ఒక్క మాటలో, తాము పీల్చే గాలిలో ఆ ఉనికిని సజీవంగా సాక్షాత్కారం చేసుకొంటూ, తగిన బలశౌర్యాలను అనుభవించడం ద్వారా ఆ అనుభూతిని పొందవచ్చు. ఒక అంధునిలాగా ప్రతి విషయానికి అటూ ఇటూ తడువులాడుకోకుండా సూటిగా విషయాలను అవగాహన చేసుకోవడం. ఇందుకు – ఎవరైతే సిద్ధంగా ఉంటారో వారు త్వరగానే విషయాలను స్వీకరించగలరు.

అంతఃకరణ శుద్ధి తప్పనిసరి

చాలామంది ఈ (యోగ) మార్గంలో ఎదురయ్యే చిన్నాపెద్దా ఆటంకాలను చూసి ఇది సురక్షితమైంది కాదనీ, ఇందులో తమకు తగినంతరక్షణ దొరకదనీ అనుమానిస్తుంటారు. చిత్తశుద్ధి లేకుండా, తగుమాత్రమైనా అంతఃకరణశుద్ధి పట్ల జాగ్రత్తలు తీసుకోకుండా యోగమార్గంలో ప్రవేశించి చిన్నచిన్న దుర్ఘటనలను చూసి బెదిరిపోతూ వణికిపోయేవారిని గురించి (మీకు ఈ రోజు సాయంకాలం చదివి చెప్తున్నాను కదూ) ఇది కేవలం వారి అహంకారం వల్లే అలా జరుగుతుంది. కాని వారలా అనుకోరు.

ఈ మార్గంలో తగుమాత్రమైనా (అంతఃకరణ) శుద్ధి కోసం ప్రయత్నించకుండా తిరస్కరించేవారికి ఇది సురక్షిత మార్గం కాదు. వారిపట్ల అనుగ్రహమూ పనిచేయదు.

నేను మరో సంగతి కూడా చెప్పదలిచాను. భయం అనేది ఒక మాలిన్యం. దివ్యకార్యక్రమాన్ని భ్రష్టుపట్టించడంలో ముఖ్యమైనది, ప్రమాదకరమైనది. రాక్షసశక్తుల ఆగడం, అందుకే యోగంలో ప్రవేశించే ప్రయత్నాన్ని చేయదలచుకున్నవారు తమ శక్తినంతటినీ ప్రయోగించి, చిత్తశుద్ధితో చేయాల్సిన మొదటి పని. తమ శక్తినంతటినీ కూడదీసుకుని ఎంతో ఓర్పుతో దీనిని సాధించాల్సి వుంటుంది. వారిలో భయం అనే దాని నీడ కూడా పడకూడదు. యోగం నడక సాగించేందుకు ఎవ్వరైనా సరే నిర్భయంగా వుండాలి. అల్పమైన, హీనమైన, దుర్బలమైన, అసహ్యకరమైన విషయాలకు తలయొగ్గి వెల్లికిలా పడడం భయానికి లొంగిపోయినట్లు అవుతుంది.

అప్రతిహితమైన ధైర్యం, పరిపూర్ణమైన చిత్తశుద్ధి, హృదయపూర్వకమైన ఆత్మనివేదన చాలా అవసరం. అంతేకాక ఎప్పటికప్పుడు నాకెంత ప్రయోజనం కలుగుతున్నది. నేనెంత పొందగల్గుతున్నాను అనే బేరసారాలు, లెక్కలు... సురక్షితంగా ఉన్నానా లేనా అనే అనుమానంతో పాటు, ప్రతీసారీ అపనమ్మకంతో ఋజువుల కోసం ఎదురుచూస్తూండడం లాంటివి నిషిద్ధం. అపుడే యోగ

మార్గంలో సకల ఆపదల నుండి సురక్షితంగా, అప్రతిహతంగా ముందుకు సాగిపోగలవు.

*

శక్తి అనేది ఎంత బలంగా, ఎంత గట్టిగా పనిచేస్తుంటుందో దానిని నిరోధించే శక్తులు కూడా అంతే గట్టిగా నిరోధిస్తాయి. దీనికి బదులుగా – ఇక్కడ అంతగా సంతోషాన్నివ్వని విషయాన్ని చెప్పాలి – నీకు ఎదురయ్యే చిన్న చిన్న ఆటంకాలకు, చిన్న చిన్న అసౌకర్యాలు, అంతగా సంతోషకరంగాని విషయాలు, 'పెద్ద' లోపాలు. వీటికి లోనుకాకుండా, రెండవవైపు నుండి నీకు లభిస్తున్న శక్తి ఎంత స్పష్టంగా పనిచేస్తున్నదీ, అనుగ్రహం ఎంతగా వెన్నంటివున్నదీ, నీకు లభిస్తున్న సహాయం ఎంత చెప్పుకో తగిందిగా వున్నదో చూడాలి. ఒక్కమాటలో నీలో అహంకారం ఏ కొంతైనా సడలిపోయినపుడు, నీకై నీవు అదే పనిగా భయ పడకుండా వున్నపుడు, ఎంతోకొంత నీ దృష్టిని విశాలం చేసుకున్నపుడు,నీ సమస్యల పట్ల నీ వైఖరిలో మార్పు వస్తుంది.

*

ఒక నూతన ప్రపంచం జన్మించింది – అందులో స్థానాన్ని ఆశిస్తున్నవారంతా తమకు తామే సిద్ధం కావాలి.

*

సహనం, బలం, ధైర్యం, ప్రశాంతి, తిరుగులేని శక్తిసామర్థ్యాలు – వీటితో అతిమానసిక శక్తిని పొందేందుకు మనల్ని మనం సిద్ధం చేసుకోవచ్చు.

అనువాదం: కె. భాస్కరరావు

తేజోమయభవితకై సంసిద్ధంకమ్మని భూమిని ఆదేశించటానికి శ్రీఅరవిందులు అవతరించారు.

– శ్రీమాత

పృథ్వీయోగం

ప్రపంచయోగం

ప్రపంచయోగం గూర్చి స్ఫురణతో నేను హఠాత్తుగా (1962 ఏప్రిల్ 12) రాత్రి మేలుకొన్నాను. బృహత్ పరిస్పందనల ద్వారా సముత్కృష్ట, పరమోన్నత ప్రేమ అభివ్యక్తమవుతున్నది. ప్రతిస్పందనా ఆ దివ్యప్రపంచాన్ని మరింత అభివ్యక్త పరుస్తున్నది. అవి శాశ్వతమైన, మహనీయమైన ప్రేమయొక్క అప్రతిహత స్పందనలు, ప్రతి ప్రేమస్పందన ఈ విశ్వాన్ని తమ అభివ్యక్తితో మరింత ముందుకు తీసుకునివెళ్తున్నది.

సాధించవలసింది సాధించినంత నిశ్చయ ధీమా. నిశ్చయంగా అతిమానస అవతరణ జరిగింది.

ఏదీ వ్యక్తిగతం కాదు.

అంతా వ్యక్తిగతంకాని అతీత అముక్త అభివ్యక్తి.

ఇది సంభవిస్తున్నది. ఇప్పటికీ... ఇప్పటికీ... ఇప్పటికీ...

నిశ్చయంగా సాధించవలసింది సాధించబడింది.

అసత్య పర్యవసానాలన్నీ అదృశ్యమైనాయి. మృత్యువు ఒక భ్రాంతి. జాడ్యం ఒక భ్రాంతి. అజ్ఞానం ఒక భ్రాంతి. అవిద్య సత్యం కాదు. దానికి అస్తిత్వం లేదు. ప్రేమ మాత్రమే, ప్రేమ, ప్రేమ. అది విశ్వవిరాట్ రూపం. అప్రతిహతం. అది మహత్తరమైనది. మహోజ్వలం. సమస్తాన్ని తనతో తీసుకొనిపోతుంది.

దీనిని ఈ ప్రపంచంలో వ్యక్తం చేయడం ఎలా? అది అసంభవం లాటిది. ఎందుకంటే ప్రపంచజీవనానికి అది విరుద్ధం.

"అతిమానస మహాసత్యం గూర్చి ప్రపంచానికి తెలియాలని నువ్వు అంగీకరించావు. అది పరిపూర్ణంగా, సర్వసమగ్రంగా కావాలి" అనే మాటలు ధ్వనించాయి. ఔను... ఔను... అంతే. అదే జరిగింది.

*

ప్రపంచ పరిస్థితి – ఒక సంభావ్యత

ప్రపంచ పరిస్థితి, అంత ఆశావహంగా లేదు. ఒకటే సంభవమని అనిపిస్తోంది. ఇంతకు ముందే ఆ విషయం అనేకసార్లు చెప్పాను. బాహ్యాపరిస్థితులు పూర్తిగా క్షీణిస్తున్నప్పటికీ, మహోపద్రవాన్ని తప్పించలేకపోయినప్పటికీ, ఒక్క అవకాశం వుంది. అతిమానస జీవనం ఒక వ్యర్థస్వప్నం కాదని భావించే వారికి, ఆ జీవనాన్ని సాక్షాత్కరింపచేసుకోవాలన్న ఆకాంక్ష, విశ్వాసం గలవారికి, ఆశ్రమంలోనే వారే గాదు, శ్రీఅరవిందులు ప్రసాదించిన మహాజ్ఞాన సంపద, ఆ సంపదను అనుసరించి జీవించాలన్న సంకల్పంగల వారికి – తమ ఆకాంక్షను, సంకల్పాన్ని, తమ సాధనను తీవ్రతరం చేయాలి. తమ శక్తుల్ని కూడదీసుకుని, అతిమానస సత్యసిద్ధికి పట్టే సమయాన్ని కుదించాలి. ఇది మన చేతులలో మిగిలిన ఒక అవకాశం. ఈ సిద్ధికి పట్టే కాలం, వ్యవధిని జయించాలి. ఇది వ్యక్తిగతంగాను, సామూహికంగానూ చేయగలగాలి. అది ఒక అద్భుతం. అదే మనకు మిగిలిన అవకాశం. అంతేగాదు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల ప్రాబల్యం, పర్యవసానాల నుండి విముక్తం కావడానికి ఈ సిద్ధిపై చేసే సాధనను మరింత తీవ్రతరం చేయాలి. కాలంతో ప్రమేయం లేకుండా సాధన వేగవంతం చేయాలి. శక్తియుక్తుల్ని, కాంతిని, సత్యాన్ని ఏకాగ్రం చేయడం వల్ల ప్రపంచ (వర్తమాన) పరిస్థితులకు అతీతంగా జీవించవచ్చు. వాటినుండి రక్షణ కవచం పొందవచ్చును. ఒక దివ్య జ్యోతిర్నవహం, ఒక మహాసత్యం, నైర్మల్యం వారికి రక్షణ కల్పిస్తాయి. అంతరంగ పరివర్తన ద్వారా దివ్యనైర్మల్యం (divine purity) వస్తుంది. అద్యతన భవిష్యత్తులో అతిమానస పరివర్తన మహదాశయాన్ని నాశనం చేయకుండా ఈ తుఫాను (ప్రపంచ పరిస్థితి) ప్రపంచం నుండి కనుమరుగవుతుంది. తుఫాను ఈ సిద్ధి ప్రారంభదశలను తుడిచిచెపెట్టడం జరగదు. అన్నీ తేలికగా తీసుకొని ప్రశాంతంగా నిద్రపోయి, సంఘటనలు జరుగుతుంటే చూస్తూ ఉండడం కన్నా, సంకల్పం, ఆకాంక్ష, ఉత్సుకతతో గట్టిగా

పోరాడి, వెలుగులోకి ఉరికితే, తన శిరస్సును ఉన్నతంగా నిలుపుకోవచ్చును. చైతన్యపు ఉన్నతభూమికలో జీవిస్తూ, ఊపిరి తీస్తూ, వికాసం చెందుతూ కదిలిపోయే తుఫాను నుండి తప్పించుకోవచ్చు. ఇది సంభవం. శ్రీఅరవిందులు ఇక్కడ వున్నప్పుడు క్రిందటి (ప్రపంచ) యుద్ధసమయంలో ఇటువంటి ప్రయత్నం జరిగింది. దానిని మళ్లీ సాధించవచ్చును. కాని ఎవరైనా దానిని తప్పనిసరిగా కోరాలి. నిజాయితీతో, సర్వసమగ్రంగా ఎవరికి వారు తమ పనిని శక్తివంచన లేకుండా చేయాలి.

అత్యుత్తమ విధానం

సృష్టి అంతా, మొత్తం విశ్వ అభివ్యక్తి అంతా ఒక చెడు హాస్యోక్తిగా కనిపిస్తుంది, ఇదే పరిస్థితి అయితే. ఈ సృష్టినుండి బయటపడాలనుకొన్నప్పుడు, దీనిని ప్రారంభించడం దేనికి! ఈ సృష్టి నుండి ఎలా బయటపడాలో, నీకు బోధించాలనుకుంటే, ఇంత కష్టపడి, ఇన్ని బాధలు పడి, చేసిన సృష్టి విషాదాంతమైతే, అంతా హాస్యప్రహసనం అయితే ప్రయోజనం ఏమిటి? అసలు ప్రారంభించకపోవడమే మేలు కదా! విషయాల లోతులలోకి వెళ్తే, అహంకారాన్ని పూర్తిగా త్యజించి, పూర్తి సమర్పణభావన కలివుంటే, నిష్కామయోగంతో పరిశీలిస్తే, భగవంతుని ప్రణాళిక అర్థం అవుతుంది. అప్పుడు అది హాస్యోక్తిగా కనిపించదు. బాగా దెబ్బలు తిని ముళ్లబాటలో ప్రారంభించిన చోటుకు తిరిగి రావడం కాదు. ఈ సృష్టిలో ఒక ఆనందం ఉంది. ఒక సౌందర్యం ఉంది. ఒక మహనీయత వుంది. ఒక మహోత్కృష్ట జీవనదీప్తి వుంది. ఆ ఆనందం, ఆ సౌందర్యం, ఆ మహత్వం నిరంతర వికాసం చెందుతుండటం గమనించవచ్చు. అది నిత్య పురోగమనశీలం. అప్పుడు ప్రతి అంశంలోను అర్థం కనిపిస్తుంది. మనం కష్టపడ్డాం, బాధలు అనుభవించాం అని విచారించవలసిన పని లేదు. ఒక దివ్యగమ్యాన్ని సాధించగలమన్న మహోత్సాహం వస్తుంది. గమ్యం, విజయం మనచేత చిక్కుతాయన్న ధీమాతో సిద్ధివైపు, ఒక్క పెట్టున ఉరుకుతాము. అది తెలుసుకోవాలంటే అహాన్ని

విడిచిపెట్టాలి. స్వార్థంతో జీవించే వ్యక్తి కాకూడదు. మన మూల చైతన్యం నుండి విడివడి బ్రతకకూడదు. చేయవలసింది అది. అహాన్ని త్యజించాలి. అప్పుడు గమ్యం తెలుస్తుంది. అదొక్కటే మార్గం! అహాన్ని విడిచిపెట్టాలి – పనికిరాని వస్త్రం లాగా. ప్రయత్నాలకు తగిన ఫలితం వస్తుంది. అప్పుడు ఆ దారిలో ఏకాకిగా బ్రతకవలసిన అగత్యం లేదు. విశ్వాసం ఉంటే, ఆ వ్యక్తికి సహాయం అందుతుంది.

భగవత్ కృప ఒక క్షణం మిమ్మల్ని స్పృశించినా, అది చాలు. ఆ కృప మిమ్మల్ని తనతో మోసుకొని వెళ్తుంది. మార్గంలో మీ ప్రయత్నాన్ని త్వరితం చేస్తుంది. నీవు తొందరపడవలెననే స్పృహే ఉండదు. నిరాడంబరత, నిర్మల మనస్సుగల శిశువులాగా నిన్ను నీవు ఆ కృపకు సమర్పించుకోవాలి. అదే అన్ని పనులు చేయనివ్వండి. ప్రతిఘటించే, వ్యతిరేకించే వాణిని వినగూడదు. నిజమైన విశ్వాసం, ఆత్మవిశ్వాసం ముఖ్యం. ఎటువంటి బేరసారాలు లేకుండా, ఎటువంటి జమాఖర్చులు లేకుండా పూర్తిగా నిన్ను నీవు సమర్పించుకోవాలి. విశ్వాసం! "ఈ పని నా కోసం చెయ్యి, అంతా నీకే వదిలిపెడుతున్నాను" అని విశ్వాసం (దైవంతో) అంటుంది. అదే అత్యుత్తమ పద్ధతి.

*

అహం స్థానంలో అతిమానస దివ్యచైతన్యం తేజరిల్లే నూతనజాతి

శతాబ్దాలుగా మానవాళి ఈ (అమృత) క్షణం కోసం ఎదురుచూసింది. ఆ క్షణం రానే వచ్చింది. కాని అది కష్టభూయిష్టం. ఈ భూమిపై మనం హాయిగా విశ్రాంతి తీసుకొని, ఉల్లాసంగా విలాసజీవితం గడపాలని నేను నీకు చెప్పడం లేదు. అందుకిది సమయం కాదు. నవసృష్టికి మార్గం సన్నద్ధం చేయడానికి మనం ఇక్కడ వున్నాం. ఈ శరీరంలో ఇబ్బందులున్నాయి. కాబట్టి నేను క్రియాశీలంగా పనిచేయలేను. నేను వృద్ధురాలిని కాను. మీలో చాలామందికన్నా చిన్నదానిని. రూపాంతర మహత్కార్యాన్ని

సంసిద్ధం చేయడం కోసం ఈ శరీరం తనను తాను అంకితం చేసుకొన్నది. చైతన్యం విస్పష్టంగా ఉంది. ఇక్కడ మనం శ్రమించి పనిచేయాలి. విశ్రాంతి, విలాసజీవితం తరువాత వస్తాయి. మన పని మనం చేద్దాం.

ఆ విషయం చెప్పడానికి మిమ్మల్ని పిలిచాను. ఏం కావాలో తీసుకోండి. ఏం చేయగలరో చేయండి. నా సహాయం మీతో వుంటుంది. చిత్తశుద్ధితో చేసే పనికి గరిష్ఠస్థాయిలో సహాయం అందుతుంది.

వీరోచితంగా వుండవలసిన సమయమిది. వీరత్వం మాటల్లో చెప్పబడేది కాదు. పూర్తిగా సంఘటితబడవలసినది. పూర్తి చిత్త శుద్ధితో ఈ వీరోచిత కార్యాన్ని నిర్వర్తించాలని, నిశ్చయించుకొ న్నవారికి భగవంతుని సహాయం అందుతుంది.

ఎప్పుడో గతంలో కోరుకున్నావు కాబట్టి ఈ క్షణంలో ఈ భూమిపై ఉన్నావు. అది నువ్వు మర్చిపోయావు. కాని నాకు తెలుసు. ఉన్నతలక్ష్యంతో ఉన్నతశిఖరాలు చేరాలి. నువ్వు కష్ట పడి సాధన చేయాలి. అన్ని బలహీనతల్ని, పరిమితుల్ని జయిం చాలి. అన్నింటికీ మించి – 'నీ టైము అయిపోయింది' అని అహంతో చెప్పాలి. అహం లేని జాతి కావాలి. ఆ స్థానంలో దివ్య చైతన్య మహత్వంతో విరాజిల్లే జాతి రావాలి. అదీ మేము కోరు తున్నది. జాతివికాసాన్ని ప్రదీప్తం చేసే దివ్యచైతన్యమహస్సు. ఈ క్షణం అత్యవసరం. దానితోనే అతిమానసచైతన్యం ప్రభవించాలి.

నేను ఇక్కడున్నానంటే పరిమితులకు లోబడి లేను. దివ్య పరివర్తన యజ్ఞంలో తొలిప్రయత్నంగా నా శరీరాన్ని అర్పించు కొన్నాను. శ్రీఅరవిందులు నాతో అలా చెప్పారు. నేను ఆ పని లోనే నిమగ్నమై యున్నాను. అది అంత సుఖప్రదమైనది కాదు. అందువల్ల నా కోసం ఆ పని ఎవరూ చేయాలని నేను కోరను. ఫలితాల కోసం నా అంతట నేనే ఆ పనికి పూనుకొన్నాను. ఆ పనివల్ల ప్రతి ఒక్కరికి ప్రయోజనం ఉంటుంది. నేను మిమ్మల్ని కోరేది ఒక్కటే. అహం చెప్పే మాటలను వినకండి. మీ గుండె లలో చిత్తశుద్ధితో కూడిన 'అంగీకారం' వుంటే, మీరు నన్ను

పూర్తిగా సంతృప్తిపరచినట్లే. నాకు పొడిమాటలు వద్దు. మీ గుండెల్లో నుండి చిత్తశుద్ధితో, సూటిగా ఈ అంగీకారం రావాలి. అంతే.

అనువాదం: కె. యజ్ఞన్న

(దివ్య) శక్తి ఇక్కడే ఉన్నది

నూతన అభివ్యక్తీకరణ చేరువై యున్నది.

గ్రహణశక్తిలో ఎంత సమగ్రత! వినయం, నిరాడంబరత, అర్పణభావం, పూజ్యభావం, ప్రశాంత మందహాసం, సర్వసమైక్య భావన, అల్పానల్పముల అభేదభావము, పరిపూర్ణ ఐక్యతా భావన – ఈ సర్వలక్షణ సమన్విత ఏకైక సత్వము నీకు మోకరిల్లుతున్నది. అదే సమయంలో అనితర సాధ్యమై, సాటిలేని, విజయోజ్వల వైభవం – నీ సార్వభౌమత్వంలోని, నీ సర్వతోముఖశక్తి అభివ్యక్తీకరణకు సంసిద్ధమైనది. సావకాశంగా ముహూర్తము స్థిరపర్చుకుని వేచియున్నది.

దివ్యశక్తి ఇక్కడే యున్నది

ఆశతో నిరీక్షిస్తూన్న నీవు హర్షోల్లాసాలతో సంబరపడు. నూతన అభివ్యక్తీకరణ తప్పనిసరి. మనకది అందుబాటులోనే ఉంది.

శక్తి ఇక్కడ ఉన్నది.

ప్రకృతి అంతా ఆహ్లాదకరంగా, ఆనందపారవశ్యంతో సంకీర్తనం చేస్తోంది. పండుగ చేసుకుంటోంది.

శక్తి ఇక్కడ ఉన్నది.

లే! లే! సజీవంగా తేజోవంతుడవై, లేచి రూపాంతరీకరణం సాగించు.



అఖిల

అఖిల భారత పత్రిక

డిశంబరు 2006

సాధన – సాధకబాధకాలు

విషయసూచిక

లోన అంతరాత్మ – పైన దైవకృప

(శ్రీఅరవిందులవారితో నిరోద్బరన్ ఉత్తరపత్యుత్తరాలు)

నిరోద్: ఆధ్యాత్మికమార్గానికిగాని, జీవితంలో మరే ఉత్కృష్టకృషి కిగాని నేను పనికిరాను అని అనుక్షణం అనుకుంటూ ఉంటాను. నేను సంతోషంగా ఉండలేనని నాకు తెలుసు. అయితే పుట్టిన ప్రతి వాడూ దుఃఖాక్రాంతుడుగా ఉండటానికే జన్మిస్తాడా?

శ్రీఅరవిందులు: దుఃఖజీవీ! దుఃఖాక్రాంతుడా! తరిమికొట్టు వయ్యా, అతనిని! తరిమికొట్టు!

జనవరి 19, 1936

నిరోద్: దుఃఖాక్రాంతుని తరిమికొట్టు – అన్న ఆ సమాధానం నాకు మార్మికంగాను, అసమగ్రంగాను ఉంది. నాకు సంతృప్తి నివ్వటం లేదు. దైవమే అంతా చేస్తుంది – అనే దానిపై నాకు నమ్మకం లేదు. నాకున్న ప్రముఖమైన ఇబ్బంది ఇది. ఇది నేను అనుభవంవల్ల తెలుసుకున్నది. నీ మొహం! నీ అనుభవం ఏపాటి అని అనకండి. ఉదాహరణకి: ఈ కవిత్వం సంగతే తీసుకోండి. ఎంతో శ్రమిస్తే తప్ప కవిత్వం రాదు. మీకిది బాగా తెలుసు. ఒకటి రెండుసార్లు తప్పించి, నాలో ఏ శక్తియొక్క ప్రమేయంవల్లా క్షణంలో కవితాసృష్టి – పనికిమాలినదే అగు గాక – జరగలేదు. నేను వ్రాయకపోతే అంతే వ్రాయకపోవటమే! ఒకవేళ వ్రాయటానికి ప్రయత్నిస్తే, ఎన్నో రోజులు, ఎంతో పరిశ్రమించవల్సినదే. దీనికి మీరు ఏమంటారంటే, ఇంకా శ్రమపడాలి అంటారు. ఇందులో కృతకృత్యుడను అవటానికి పడే శ్రమ ఇంతా, అంతా కాదు. జలగపట్టు నాకు చేతకాదు. దివ్యశక్తి ఏదో పొంగిపొరలుకుంటూ వచ్చి, ఏదో అద్భుతం జరుగుతుందని నేను నమ్మను. మీ మటుకు మీకు, రోజుకు నాలుగైదు గంటలు, ఎన్నో సంవత్సరాలు ఏకాగ్రత వహించిన తర్వాతనే, అంతా ప్రవాహంలా పొంగిపొరలింది. పట్టినపట్టు విడువకుండా ఉండటానికి నేనేమీ, శ్రీఅరవిందులను కాను. అంతటి ఆత్మబలంతో నేను జన్మించలేదు. కాబట్టి వివేకవంతమైన పని నాకు ఏమంటే, భగవంతుని నమ్మి

కుని ఉండటమే. కాని నాకు అలాటి నమ్మకమూ లేదు. మీరు, దిలీప్‌దా, అలాగే ప్రతివారూ ఏకాగ్రత వహించవలసి వచ్చినది. మరి నేనంత శ్రమపడలేను. కాబట్టి పెద్ద పెద్ద విషయాలు నా వశం కావు. మూడు, నాలుగు రోజులుగా, రెండు మూడు గంటలు ఏకాగ్రతతో కూర్చుని ఉన్నాకూడా, నా పని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే పరిస్థితే. ఫలితం! దిగులు. ఎక్కడ ఉందీ దివ్యశక్తి?

ఇక యోగానికి సంబంధించి – నేను ఎంత ప్రగతి సాధించానో మీకు తెలుసు. మిమ్మలను తప్పు పట్టను. ధ్యానం చేయలేను; ప్రార్థన చేయలేను; ఆకాంక్షించలేను. ఇవి లేక నాకు ఏమైనాకానీ ఎలా సంప్రాప్తిస్తుంది? ఇవి ఎందుకు చేయవని మీరు నన్ను అడుగవచ్చు. నేను చేయగల్గితే, నాకీ యేడుపు, మిమ్మలను బాధపెట్టడం ఎందుకు? నా వశం కాకపోబట్టే, నాకీ అశాంతి, దుఃఖం. వాటి కోసం నాలో ప్రేరణ, ఆకాంక్ష లేకుండా మీరేమీ ఇవ్వరు కదా! వీటి కోసం ఎంతగా ఆకాంక్షిచాలో నాకు తెలుసు. అయినా ఫలితం లేదు. ఆకాంక్షించలేకపోయినపుడు ఆశించటం దేనికి?

ఒకోసారి ఎందుకీ బుర్ర పాడుచేసుకోవటం – హాయిగా తిను, త్రాగు, ఆనందంగా ఉండు; ఆలోచన, ఆందోళనా వద్దు, తింటూ, సరదాగా కబుర్లు చెప్పుకుంటూ పుస్తకాలు చదువుకుంటూ, కాలక్షేపం చేస్తూంటే సరిపోదా – అనిపిస్తుంది. కాని నా వశం కాదది. నాకిది శాంతి నివ్వదు. ఇది కొంతమంది విషయంలో బాగానే ఉంటుంది. అనిల్‌కుమార్ సంగతే చూడండి. అతనిని తప్పు పట్టడం కాదు. తెల్లవార్లూ నవలలు చదువుతూ అలా కాలక్షేపం చేస్తాడు. అతనికది ఎలా సాధ్యం? అతనిలో ఏదో ఉంది. నేనూ అలా చేయగల్గితే ఎంత బాగుండును! అయినా, ఆ విధంగా సాధనలో పురోగతి ఎలా సాధ్యపడుతుంది? మీరు చెప్పినట్లు, వ్యక్తిగతమైన కృషి తప్పనిసరి – మీ అనుగ్రహం అందుకునేదాకా. తర్వాతా? ఏమో? ఏమౌతుందో ఆ భగవంతునికే తెలియాలి. పోతే – ఆ రకమైన కృషి, సామర్థ్యము, ఇచ్ఛ నాకు

అవగతం కావటం లేదు. మరి నేను దేనిపై ఆధారపడి ఆశిం చాలి? నేనైతే ప్రయత్నించలేను; మీరైతే సహకారం అందిస్తారనే నమ్మకం లేదు. అందుకే నాకీ ఆందోళన, అపనమ్మకం. ఏ ఘన కార్యానికీ నేను పనికిరాను.

మనసులోనికి చొచ్చుకొనిపోయి, అంతరంగాన్ని స్పృసించే సమాధానం ఇవ్వండి. సమాధానం మాత్రమే. అంతకు మించి ఏమీ ఆశించను.

శ్రీఅరవిందులు: ఈ వేళ నన్ను చాలా దుఃఖాలే ముట్టడిం చాయి. ఒక్కొక్కటే పరిష్కరించటానికి సమయం చాలదు. నాకు అర్థం అయినంతవరకు నీ వాదం ఇది. "దైవమే అంతా చేస్తుందన నేది నేను నమ్మను. నిష్ప్రయోజనమైనదే అయినా కానీ బలమైన నా కృషివలననే నేను కవిత్వం వ్రాసినా, కవిగా రూపొందినా కూడా" – అంతే కదూ? బాగుంది. అద్భుతంగా ఉంది. ఇది ఇంతకుపూర్వం విననిది. మొదటినుంచి మానవచరిత్రలో వింటు న్నది ఏమంటే, పద్యాలు అల్లటం నేర్పవచ్చు. లేదా తనకు తానుగా నేర్చుకోవచ్చు. కాని కవి పుడతాడు. తయారు కాబడడు – a poet is born, not made – ఈ లోకోక్తి యుగయుగాలుగా విని పిస్తూన్నట్టిదే. సాహిత్య, చారిత్రక వాస్తవాలు కూడా ఈ లోకో క్తినే బలపరుస్తున్నాయి. కాకపోతే, మనం పాండిచేరిలో కవు లను ఉత్పత్తి చేయటం కాక, వారికి జన్మనిస్తున్నాము. అదీ, భౌతికంగా కాక, ఆధ్యాత్మికంగా. ఎన్నో విజయవంతమైన దృష్టాంతాలు మనకు ఇక్కడ ఉన్నాయి. ఘనమైన తమరు కూడా అందులో ఉన్నారు. అలా కాకపోతే నిన్ను పనికిమాలిన నిరాశాపూరితుడైన దుఃఖితుడు – అని అనుకోవాలా? ఇక్కడ రెండు సిద్ధాంతాలు ఉన్నవి. ఒకటి దివ్యశక్తి పనిచేయడంవలన జరిగినది. రెండోది – స్వకీయమైన శక్త్యావేశాలతో కూడిన దుష్క రమైన కృషివలవ – ఈ రెండో వాదం ప్రకారమే, మున్నెన్నడు కని, విని యెరుగని రీతిలో నీవు కవి కాగలిగితే, ఇప్పుడు ఈ హీనమైన ఆత్మన్యూనతా మహమ్మారి రోగం ఎందుకు నీకు? స్వయంకృషితో కవిత్వం వ్రాస్తే హర్షించి 'శహభాష్' అని అభి

నందించవలసినదే. ఇది సాధించిన, నీ కృషి ఇక ముందు సాధించలేనిది అంటూ ఏముంటుంది? ఎన్నో అద్భుతాలు సాధించవచ్చు కదా! బ్రహ్మాండమైన ఆత్మవిశ్వాసం నీలో ఉండి ఉండాలి. లేదా – దివ్యశక్తివల్ల ఇది సిద్ధించింది అనుకున్నా కూడా – నా దృఢ విశ్వాసం అదే – దానికీ అసాధ్యమైనదేదీ ఉండదు కదా? ఏ రకంగా చూచినా కావల్సినది బ్రహ్మాండమైన విశ్వాసం. ఏది ఏమైనా కానీ – ఇక్కడ ఆనందసంకీర్తనమే! దుఃఖపడటానికేమీ లేదు. ఆనందించు.

అది సరే కాని – నేను కొన్ని సం॥ ల పాటు నిత్యము నాల్గైదు గంటలు ఏకాగ్రత పాటించాను అన్నావు. అదేమిటి? ఏకాగ్రత అంటే కష్టపడి ధ్యానంలో నిమగ్నమవటమే అయితే – అలాటి దెన్నడూ జరగలేదే! నేను చేసినది రోజుకు నాలుగైదు గంటలు ప్రాణాయామం. అది పూర్తిగా వేరే సంగతి. నీవేదో ప్రవాహం (flow) అన్నావు చూడు. అది – నేను ప్రాణాయామం చేస్తూన్నపుడు కవితాధార పొంగిపొరలింది. మరి తర్వాత లేదు. ప్రాణాయమం ఆపివేశాక చాలాకాలం నేనేమి చేయలేదు. ఏమి చేయాలో తెలియలేదు. నా కృషి సఫలం కాకపోగా దృష్టి ఎటు సారించాలో తెలియరాలేదు. అనుభవాల ప్రవాహం మాత్రం కొన్ని సంవత్సరాల తర్వాత ఉప్పొంగింది. అది సంవత్సరాల తరబడి చేసిన ప్రాణాయమం, ఏకాగ్రతల ఫలితంగా కాదు. చాలా సులువుగా in a ridiculously easy way జరిగింది. గురుప్రభావం వల్లనా – అంటే – మరీ అదీ కాదు. ఎందుకంటే – ఆ గురువే అది చూసి విస్తుపోయాడు. లేక by the grace of the eternal Brahman – తర్వాత మహాకాళి, కృష్ణ – కృపవలన – అందుచేత don't try to turn me into an argument against the Divine – ఆ ప్రయత్నం పూర్తిగా నిష్ప్రయోజనం.

మరి ఇది ఇక్కడితో ముగిస్తాను. లేకుంటే 12 గం॥ ల వరకూ ప్రణామ కార్యక్రమం ఉండదు. నీలో ఉన్న దుఃఖితుని వెళ్లగొట్టు. ఇంకా వ్రాయవలసినది ఏదైనా ఉంటే అది తర్వాత.

ఏదో దూకుడుగా, హడావిడిగా వ్రాశాను. లోపాలు ఉండవని ఆశి
స్తాను.

జనవరి 20, 1936

నిరోద్: అయ్యా, నాలోని 'దుఃఖితుని' మీకు పంపించివే
స్తున్నాను. నా వ్యాఖ్యలను నాలోనే ఉంచుకుంటున్నాను. ఏది
ఏమైనా నన్ను ఆవరించియున్న విషాదమేఘాలను చెదరకొట్ట
డంలో మీరు కృతకృత్యులయారు.

శ్రీఅరవిందులు: To continue – నీకు నీలో ఏ శక్తీ అను
భావ్యం కానంత మాత్రాన అది లేకపోవటం అనేది నిజం కాదు.
ఆవిరియంత్రాన్ని నడిపే శక్తి, ఆవిరియొక్క ఉనికి ఆ యంత్రానికి
తెలియదు కదా! అంతమాత్రాన ఆ శక్తి అక్కడ లేకుండా పోదు.
మనిషి ఆవిరియంత్రం కాదు. కాని అంతకంటే నయమే. పైపైన
బుడగలువలె స్పందనల కదలికలు తెలుస్తాయి. కాకపోతే తనను
కదలించే అవచేతన, అతిచేతన శక్తుల చైతన్యం తనకేమాత్రము
ఉండదు. (ఈ నిజాన్ని ఆధునిక మానసిక విజ్ఞానశాస్త్రం ధృవ
పర్చినదే. ఇది నిమ్నస్థాయి శక్తులకే పరిమితము. ఉన్నతస్థాయి
శక్తులు దీనికి అందవు. నీ తార్కికబుద్ధి ప్రయోజకత్వంతో నిర
సనభావం చూపకు) మనిషి బాహ్యఫలితాలకే తెలివితక్కువగా
కిచకిచమంటాడు. ఇదే తన ఉన్నత స్వభావ లక్షణం అనుకుం
టాడు. నిజానికి తన ఉన్నతస్వభావంయొక్క (his noble self)
బాహ్యమానస మెరమెరలు వెనుక ఎక్కడో అంతర్నిహితంగా
ఉంటాయి. ప్రాణికస్వభావ ఉద్రేకాల, సంవేదనల అనిశ్చిత విశ్వా
సాల ముసుగులో దాగి ఉంటాయి. నీ వాదం పూర్తిగా అసంద
ర్భము, పనికిమాలినది. మనయొక్క ఆదర్శం అంతర్నిగూఢశక్తు
లను వెలికితీయడం, అవి అలా అలా పైపై మెరుపులులా అప్పు
డప్పుడు వెనక నుంచి కనపడి మాయమవటం కాదు. అవి నిరం
తరాయంగా వెల్లువగా ప్రవహించాలి. దీని కోసం ముందే ఎదురు
చూడటం దురహంకారంతో కూడిన కామనయే కాగలదు. ఇది
అసహనంతో కూడిన అజ్ఞానాన్ని, అనుభవరాహిత్యాన్ని వ్యక్తం
చేస్తుంది. ప్రారంభంలో బొట్లు, బొట్లుగా కనిపించినా, అది

మున్ముందు రాబోయే కుంభవృష్టికి సూచనగా తెలుసుకోవాలి. ఒకటి రెండు పర్యాయములు ఏదో శక్తి ఆవహించి, నాలో కవి తను ఉద్భవింపచేసినదని నీవు అంగీకరించావు. నీలో అప్పుడూ, ఇప్పుడూ శక్తి ఒకటి ఉన్నదనటానికిది నిరూపణ. ఇది చాలు నీలో మిగిలి ఉన్న దుఃఖితుని తునాతునకలుగా చెదరగొట్టి పార వేయటానికి. ఇదీ నీకు అనుభూతి కాకుండా నిరోధించేది నీ sweating Herculean labour. ఓరిమితో ముందుకు సాగితే, చుక్కలుచుక్కలుగా సంప్రాప్తమయే అనుగ్రహాలబ్ధి ప్రవాహంగా పొంగుతుంది. అందుకు అర్హత పొందాలి. అంతవరకు ఓరిమితో నిరీక్షించాలి. యోగంలో అనుభవాలు ముందు, వాచవి (fortaste) గానే అనుభూతి కలిగిస్తాయి – ఒక భవిష్యద్వాగ్దానంలా స్వభావం పరిణత చెంది సంసిద్ధమైనపుడు సఫలత చేకూరుతుంది. యోగు లకీ ఇంద్రియజ్ఞానసంవేదనలు, దివ్య ఆనంద అనుభూతులు తెలి సినవే. నీ జలగపట్టు అక్కర్లేదు. అంటిపెట్టుకుని ఉంటే చాలు. నీవు శ్రీఅరవిందులవు కావు (అయినా ఔనని ఎవరన్నారు?) అన్న సత్యము, అసందర్భము. నైరాశ్యాన్ని వదల్చుకొని దానినే అలా పట్టుకొని ఉండకుండా – తమ ప్రత్యేక వ్యక్తిత్వవికసనంలో సద్భావపూరితంగా ఉండాలి.

మిగిలినదంతా, తమోగుణప్రధాన 'అహం' యొక్క దిక్కు మాలిన చెత్త. రజోగుణ ప్రధానమైన అహం: "అబ్బ! నేనెంత సాటిలేని దివ్యోన్నతశక్తివంతుడను" అని గగ్గోలు పెడుతుంది. మరి తమోగుణ ప్రధానమైన 'అహం' "నేనెంతటి హీనమైన, పని కిమాలిన, చేతగాని దురదృష్టవంతుడను; నా అంతటి వ్యర్థుడు మరొకడు ఉండడు – మిగిలినవాళ్లు అందరూ – అరవిందులు, దిలీపులు, అనిల్‌కుమార్‌లు – అనితరసాధ్యమైన శక్తివంతులు. మరి నేనో! నేనో!" అని కీచుకంఠంతో మూల్గుతుంది. ఇదీ నీ వరస. ఈ తామసికమైన అహంకారమే రకరకాలుగా నీకు దుఃఖాన్ని కలుగచేస్తూ ఉన్నది. ఇదెందుకూ అక్కరకు రాదు. సుఖోపభోగంగా అనుభవించే బద్ధకం, నిరుత్సాహం, నిరాశ – జడమైన భౌతిక, చైతన్య ఊబిలా దిగపడిపోవటానికి ఇదంతా

ఒక నెపం. ఇదొక నమునా (specimen) ఒక్కొక్కరు ఒక్కొక్క specimen మరేమి చేయాలి? చేతనైతే బయటపడే ప్రయత్నం చెయ్యి. లేదూ – తాళ్లతో నిన్ను పైకి లేవనెత్తేవరకు వేచి ఉండు. భగవదనుగ్రహం సంప్రాప్తిస్తే ఏమైనా జరుగవచ్చు. ఇది అంతా, నీ బుద్ధిని కలవరపరుస్తుంది. నేను అనర్హుడను అనుకుంటావు. ఇదంతా నీ ఊహ. చెప్పాలంటే – ఎవరు మాత్రం అర్హులు? అర్హత, అనర్హతలు బాహ్యప్రకృతికి సంబంధించిన మాటలు. (ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించినంతవరకు). కాని, లోన ఉన్నది ఒక అంతరాత్మ. ఊర్ధ్వంలో దైవకృప ఉన్నది. ఇదీ నీకు తెలినది లేక తెలియవలసినది. తెలిసినా తెలియకపోయినా ఈ మార్గంలో తడ పడినావు (stumbled). కాబట్టి జ్ఞానోదయమయేదాకా వేచి ఉండ టమే. అస్తు (amen)

జనవరి 21, 1936

*

నిరోద్: గొప్ప ఉత్తేజకరమైన ఒక సూత్రాన్ని మీ లేఖలో కను గొన్నాను – అంతరంగంలో ఆత్మ, పైన దివ్యానుగ్రహం – నీవు తెలుసుకున్నది లేక తెలుసుకోవలసినది, ఇదియే. నిజంగా అంతా ఇంతేనా?

శ్రీఅరవిందులు: అవును. ఆధ్యాత్మికజీవనాన్ని అభిలషిం చేవారికి ఇది చాలును.

నిరోద్: కేవలం అంటిపెట్టుకొని వదలకుండా ఉండటం వల్ల లేక అంతరంగంలో ఆత్మ ఉండటంవల్ల – అనుగ్రహదశ 'a state of grace' ను చేరుకోగలమా?

శ్రీఅరవిందులు: చేరుకోగలరు. చాలామంది విషయంలో ఇది జరిగింది.

నిరోద్: అందరిలోను ఆత్మ ఉన్నది. అందరికీ పైన దివ్య కృప ఉండనే ఉన్నది. అయినప్పటికీ చాలమంది దైవానికి విము ఖులై ఉంటారు – ఎందుకని?

రజోగుణ ప్రధానమైన అహంకారము, దురాశ, స్వాతిశయం – వలన. దైవానుగ్రహంపైనకాక, తమ స్వకీయమైన కృషిపట్లనే ఎక్కువ నమ్మకం కలిగి ఉండుటవలన –

నిరోద్: దైవకృపయే అంతా చేస్తుందని నేనెన్నడూ విన లేదు. ఒకవేళ అలాగే జరుగుతే, అతను గతజన్మలో సాధన చేయ లేదనేది ఎలా తెలుసుకోవటం? ఇది మీరు కాదంటారా?

శ్రీఅరవిందులు: ఆధ్యాత్మికచరిత్రలో ఎన్నో దృష్టాంతాలు నీకు చూపగలను – అందరికీ తెలిసిన Jagai Madhai మొదలు కొని – రెండూ రెండూ నాలుగు అని విశ్వసించని బుద్ధికి ఏమి చెప్పినా ఉపయోగం లేదు. నీవు అంగీకరించలేవు; అంతే కదూ?

నిరోద్: కేవలం అంటిపెట్టుకుని ఉన్నా కూడా సరిపోదు. అలాగే కనుక అయితే మన ఆశ్రమంలో పిల్లి Bushy కి అవ కాశం ఎక్కువ ఉంటుంది.

శ్రీఅరవిందులు: అవును. ఆమెకి (పిల్లి) ఉన్నది – మలి జీవితంలో క్రొత్త ఉన్నతశ్రేణి పుట్టుకకి అవకాశం –

నిరోద్: సాధనలో బ్రహ్మాండమైన కృషి Herculean effort కావలసి ఉంటుంది. కాబట్టి, దైవకృపపై ఎక్కువ నమ్మకం ఉంచలేకపోతున్నాను – షరతులు లేకుండా దైవకృప క్రిందికి దిగివచ్చేది కాదా?

శ్రీఅరవిందులు: షరతులపై ఇది ఆధారపడి ఉండదు. నిర పేక్షక అర్పణ (unconditional surrender) వేరుగా ఉంటుంది.

నిరోద్: రామకృష్ణుని, మార్జాల కిశోరం మాదిరి సాధ కుడైనా, నిశ్చయాత్మకమైన అర్పణ కావించుకోవలసివాడే. కాక పోతే మిగిలిన సత్వము అంతా ఒదిగి ఉండేలా వశపర్చుకోవాలి. కాని ఇది ఈ భూమి మీద కష్టాతికష్టమైంది అని మనవి చేస్తు న్నాను, సార్.

శ్రీఅరవిందులు: మార్జాలకిశోరము అలాటిదని నేనెన్నడూ వినలేదే! అదే నిజమైతే, అది మార్జాల కిశోరము కానే కాదు. He is the baby monkey trying to become a baby cat who does that. ఆధ్యాత్మికజ్ఞానంలో నీవు రామకృష్ణుని, నన్నూ కూడా

మించిపోయినట్లున్నావు. మరి అలాటప్పుడు సవినయంగా తల వంచుకుని అల్పజ్ఞానులవైపు దృష్టి మరల్చుకుంటాను.

నిరోద్: ఒక్క దెబ్బతో ఎవరైనా మార్జాలకిశోర (న్యాయం లాటి) అర్పణ కలిగి ఉండి ఉంటే, అది అతని గతజన్మయొక్క అసంపూర్ణ వక్రరేఖ, ఇపుడు పరిపూర్ణమైనందువలననే.

శ్రీఅరవిందులు: జయహో! సర్వజ్ఞ ఋషీ.! మా గతజీవితాల గురించి, అంతా మాకు వివరించు.

నిరోద్: అంతరాత్మ జడత్వంలో ఉండక నా దివ్యకృపానాధుని ఆవాహనం చేయాలంటే, నాలో అంతటి ఆకాంక్ష ఎక్కడిదీ? నా ఆధ్యాత్మిక కవితాసౌధాల నిర్మాణాలు నాలోని అల్పమైన స్వల్పకాలిక దివ్యానంద క్షణాలు ఆలంబనంగా మీరు నిర్మాణం చేయతలచుకుంటే నేను ఏమి అనాలి?

శ్రీఅరవిందులు: ఏమీ అనకపోవటమే మేలు. It will sound less foolish.

నిరోద్: మిమ్ములను దైవానికి వ్యతిరేకంగా వాదించటానికి నియోగించవద్దని నన్ను మీరు తరుచు హెచ్చరిక చేసేవారు. అయితే మీ సాధనయొక్క చరిత్ర మీ మాటలలోనే – ఏమిటి? బ్రహ్మాండమైన ప్రాణాయామ సాధన, ఏకాగ్రత తర్వాత దైవకృప the Grace of Brahman – కోసం ఏండ్ల తరపడి నిరీక్షణ. అయినా కూడా దైవకృపను కీర్తించటంలో మీరు పంచముఖులే!

శ్రీఅరవిందులు: ఎంతటి మందమతివి? కావాలని విషయాలను వక్రీకరిస్తూంటే నీకేమి చెప్పి ప్రయోజనం? ప్రాణాయామం వల్ల ఆధ్యాత్మిక సాధనలో నాకు ఎలాటి ప్రయోజనం కలుగలేదని నేను చాలా స్పష్టంగానే చెప్పాను. అదెప్పుడో మానివేశాను. సాధన అంటూ ఏమీ లేకుండానే నేనొక దారి కోసం అన్వేషిస్తూ ఉంటే, బ్రహ్మాన్ అనుభవం నాకు కలిగింది. అంతుకు ముందు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనాకే ఇది జరిగింది. ఎంతోమంది యోగులకు దీర్ఘకాల యోగానంతరం లభ్యమయేది నాకు మూడు రోజులలోనే సిద్ధించింది. అందుకు చేసిన పెద్ద ప్రయత్నమూ లేదు; కావాలని కోరనూలేదు. లేలే కూడా ఎంతో ఆశ్చర్యపోయాడు.

ఆయన నాకు వేరే ఏదో మార్గం చూపించాలనుకున్నాడు. నీకు ఇవేమీ అర్థం అవుతాయి అని అనుకోను. ఇక మరేమీ చెప్పను. నీ మందమతిని గురించి మాత్రము విచారిస్తూ ఉంటాను.

నిరోద్: తాళ్లు కోసం నిరీక్షించటం బాగానే ఉంది. కానీ ఈలోగా ఏమి జరుగుతుందో ఎవరికి యెరుక. యాత్రికుడు హిమవత్శృంగ అధిరోహణ ప్రయత్నంలో మార్గమధ్యంలో ఏ అడవులలోనో ప్రాణాలు కోల్పోడా?

శ్రీఅరవిందులు: అడవుల పాలైపోయి, హిమాలయాలను ఎవరు అధిరోహించమన్నారు? నేను చెప్పినదానికి, దీనికి, ఏమిటి సంబంధం? Herculean effort కావాలని నేను అనలేదే?

నిరోద్: సాధనలో విఫలులై వెళ్లిపోయిన దృష్టాంతాలు నాకు జ్ఞాపకం ఉన్నాయి. దైవం ఇక్కడ పెద్దగా ఏమీ చేయలేకపోయింది. కారణం? వ్యక్తియొక్క ఇచ్ఛకి ప్రతికూలంగా – అంటే ఆకాంక్ష, నిరాకరణ, అర్పణలు లేకుండా – వారు ఏమి చేయటానికి ప్రతిపాదించ లేదు – భగవదనుగ్రహాన్ని అభిలషించేందుకు ముందు ఇవి ఉండాలని.

శ్రీఅరవిందులు: ఇంకా దీని అర్థం – దైవకృప కోసం కూడా వేచి ఉండాలని. దైవోపహతుడై, దురహంకారంతో దైవకృప అపేక్షించకపోయినపుడు, అనుగ్రహం చూపవలసిన బాధ్యత దైవానికి ఉండదు.

మే 1, 1936

*

నిరోద్: ఇక్కడ ఎవ్వరైనా ఏదైనా సాధిస్తున్నారా అని నాకు ఒక్కొక్కప్పుడు సంశయం కలుగుతూ ఉంటుంది. ఎవ్వరైనా దైవత్వాన్ని సాధించారా? దైవత్వం అంటే ఏమిటని మళ్లీ దయచేసి నన్ను అడగకండి. ఈ విషయాలు వివరించటం కష్టం.

శ్రీఅరవిందులు: ఎందుకు అడగకూడదు? వేదాంతసాధనయే నీ అభిప్రాయమైతే చాలమంది అది సాధించారు. అలాగే భక్తిసాధన కూడా. సాధన అనుభవాలు గురించి నాకు వచ్చిన ఉత్తరాలు ప్రచురిస్తే ప్రజలు ఆశ్చర్యపోతారు. ఆశ్రమం అంతా

గొప్ప యోగులతో నిండి ఉన్నదని భావిస్తారు. వైఫల్యాలు, ప్రతికూల దాడులు, నిరాశలు – వీటి గురించి, యోగాన్ని గురించిన అవగాహన ఏమాత్రం ఉన్నవారు కూడా పెద్దగా పట్టించుకోరు. యోగుల విషయంలో ఇది సాధారణమేనని వారికి తెలుసు. వైఫల్యాలు మనకు గురువులే అవుతని. ఆశ్రమానికి ఆవల పొందిన సిద్ధులు అనుకున్నవి, ఇక్కడ ప్రారంభాలు మాత్రమే! చైత్యపురుష ఆధ్యాత్మిక, చివరకు, అతిమానస రూపాంతరీకరణము – ఇవి ఇక్కడ జరిగే పరిశోధనలు. మిగిలిన ఆధ్యాత్మిక కార్యక్రమాల కంటె ఇవి చాలా కష్టతరం.

నిరోద్: 'క' ఇక్కడ బాధపడుతూ ఉండేవాడు. తాను ఎనిమిది సంవత్సరాలుగా ఇక్కడ ఉంటూ ఉన్నా ఇంతవరకు ప్రశాంతతకు నోచుకోలేకపోయాడు. ఏ కాస్త ఆనందమైనా కలుగుతే అది సాహిత్యసృష్టి వలన పొందే ఆనందమే. ఆయన మాటలలోనే: "నేను అందుకోసం ఇక్కడికి రాలేదు. ఇది నాకు బయట ఎక్కడైనా పుష్కలంగా లభ్యమయేదే. శ్రీఅరవిందులకీ విషయం మొరపెట్టుకుంటే, ఇంకా వ్రాయి, వ్రాయి అంటారు. కాని భగవంతుడా! ఈ వ్రాతల వలన నేను పొందగలిగేది ఏమిటి? ఇంకా సంగీతం ద్వారా అయితే అర్పణ చేసుకుంటున్నాను, work offering చేసుకోగల్గుతున్నాను, అనే భావన కలుగుతుంది నాకు."

శ్రీఅరవిందులు: ఔత్సాహిక యోగులారా! పరిచయాత్మకమైన సన్నద్ధతకి, ఆత్మపరిశుద్ధతకి, 8, 9, 10 అని సంవత్సరాలు లెక్కపెట్టడం సరికాదు. సరిపోదు కూడా. అదియే 'క' యొక్క దుఃఖకారణం. ఒక్క దౌడులో స్వర్గాన్ని జయించడం అతని వశమా? దానికి ఒక్కటే మార్గము. అది పరిపూర్ణ అహంకార పరిత్యాగము. దానిని అతను తిరస్కరించాడు. తనకది వశం కాలేదు కూడా. పరుగుతో సాధించకలేకపోగా – జపమూ, తపము, పూజలతో కుస్తీపడుతూ, ఖిన్నుడై మూల్గుతున్నాడు. "ఇదెప్పుడు సాధ్యమౌతుంది? ఎప్పుడు? ఎప్పుడు? ఎందుకిది ఇంకా సాధ్యపడటం లేదు?" – అని ఇది అలా సాధ్యపడేది కాదు. ఎన్నటికీ కాదు. ఇది పద్ధతి కానే కాదు.

అయినా, అతడు అర్హత పొందేవరకు తన అహాన్ని వద ల్చుకుంటానని నాకు మాట ఇచ్చాడు. అతనిలోని అవచేతన మొండిపట్టుతో అసందర్భంగా, వక్రకక్ష్యలో మార్పులేకుండా సంచ రిస్తూ బలంగా పనిచేస్తోంది.

మే 19, 1936

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

దైవానుగ్రహం అంటే?

దైవానుగ్రహం అన్నది పరిశోధించి, నిర్వచించేది కాదు. అది ఒక వాస్తవమైన ఆధ్యాత్మిక అనుభూతి.

*

అప్పటికప్పుడు జీవునిలో అసంకల్పితంగా, అకస్మాత్తుగా పెల్లు బికే దివ్యచేతనానుభూతి. – శ్రీఅరవిందులు

*

మౌలికంగా దివ్యప్రేమ నిరంతరము జోక్యం కలుగచేసుకునే దివ్యకృపగా ప్రకటితం కాబడుతుంది. ఒక శక్తిగా ఉపశమనం కల్గించే మధుర స్పందనగా, సర్వవ్యాపకమై ఉంటుంది.

*

దైవకృప (grace) అవగాహనకు అందని కారుణ్య వ్యక్తీకరణ (clear-seeing kindness).

*

సాధింపబడవలసిన లక్ష్యము వైపుగా నిన్ను ప్రచోదింపచేసే దివ్య కృప. నీ పరిమితబుద్ధితో దానిని అంచనా వెయ్యాలని చూడకు. అది అసాధ్యమైనది. మానవమేధస్సుకు అందనిది.

దైవానికి నీవు ఎంత చేరువగా ఉంటే, అంతగా, నీవు, ఆయనయొక్క అపరిమిత దివ్యకృపాసాగరంలో, తలమునకలుగా ఉంటావు.

కొన్ని ప్రత్యేక పరిస్థితులలో వున్నప్పుడు, కొన్ని ప్రత్యేక సంఘటనలు జరిగినప్పుడు, అది నీకు ప్రతికూలమో, అనుకూలమో అవుతాయి. విషయాలు చిన్నవైనా, పెద్దవైనా కావచ్చు. ప్రతికూల పరిస్థితులలో "అయ్యో! యిలా జరిగిందేమిటి? ఇలా కాక, అలా జరిగితే బాగుండును కదా! అలా కాక, యిలా జరిగితే బాగుండును కదా!" అని పరిపరివిధాల విచారిస్తావు. కొన్నేళ్ళు గడచిన తరువాత ఆ విషయాన్ని మళ్ళీ తరచిచూస్తే, నువ్వనుకున్నట్టు జరిగినట్టయితే యెంత నష్టపోయి వుందువో, నువ్వే గ్రహిస్తాయి. ఆ గ్రహింపు కలిగిన వెంటనే ఆశ్చర్యంతో అవాక్కయిపోతావు. ఆ తరువాత నెమ్మదిగా నీలో నువ్వే నవ్వుకుంటావు. చివరికి ఏమాత్రం వివేకం ఉన్నా అనుకుంటావు "ఆహా! నిజంగా దైవానుగ్రహం యెవరికీ అంతుపట్టనిది కదా!" – అని.

ఈలాటి సంఘటనలు పలుమార్లు నీకు సంభవించినపుడు – మనిషి ఎంత గ్రుడ్డివాడైనా, విషయాలు ఎంత వక్రంగా అగుపించినా, – దివ్యకృప ఎల్లవేళాల అక్కడ పనిచేస్తూనే ఉంటుందని, ఎపుడు ఏ పరిస్థితిలో ఏది జరిగినా అప్పుడు ఆ పరిస్థితిలో అదే అత్యుత్తమమైనదని నీవు గ్రహిస్తావు. అల్పబుద్ధివల్లనో, పక్షపాతధోరణివల్లనో విచక్షణాజ్ఞానం అప్పుడు కోల్పోవచ్చు.

*

ఏదైనా తారతమ్యం వచ్చినప్పుడుతప్ప మనిషి మేధస్సు దీనిని అర్థం చేసుకోలేదు. ఎందరి నుంచో, తాము ప్రమాదాల నుంచి కాపాడబడినందులకు, ధన్యవాదాలు తెలియజేస్తూ నాకు యెన్నో వుత్తరాలు వస్తూ వుంటాయి. కాని, యే ఆపదా రానందుకు ధన్యవాదాలు తెలియజేసేవారు చాలా అరుదు. ఏదైనా ప్రమాదం లేక ఆపద కలిగినప్పుడు సంభవించినప్పుడు తప్ప జనాలకి దైవకృప గుర్తుకు రాదు. ఏ ఆపదా లేకుండా జీవితం సాఫీగా సాగిపోయినప్పుడు, ప్రయాణాలు నిరాటంకంగా జరిగినప్పుడు అది అంతకుమించిన దైవకృప వల్లనే జరిగినది అని గ్రహించు. అదంతా అతిమామూలు విషయం అనుకుంటారు. జబ్బుపడి, త్వరగా కోలు

కోవడం భగవత్కృప అనుకుంటాం. అసలు జబ్బే రాకపోవడం భగవంతుని అపరిమిత కృప అని భావించం. అదే లోకంలో వింత.

*

ఆపదలనుంచి గట్టెక్కించడానికి ప్రతిక్షణం భగవంతుడి కృప మన వెన్నంటే వుంటుంది.

*

సర్వేశ్వరుని శక్తి అనంతం. మన విశ్వాసం అత్యల్పం. మనిషి స్వీకరించగలిగిన దానికంటే కూడా భగవత్కృప అపారమైనది.

*

భగవత్కృపతో అసాధ్యమన్న దేదీ ఉండదు.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

అనుగ్రహమే అంతా సాధించగలిగితే ఇంక తపస్సు ఎందుకు?

ఈ ప్రశ్నకి ఖచ్చితమైన సమాధానమివ్వలేం. ఎందుకంటే అనుగ్రహమూ, తపస్సు – రెండూ కూడా సత్యమనే నాణేనికి బొమ్మ బొరుసుల్లాటివి. భగవదనుగ్రహం లేకుండా ఏదీ జరగదు కానీ, ఆ అనుగ్రహం సంపూర్ణంగా ప్రకటితం కావడానికి సాధకుడు సంసిద్ధంగా వుండాలి మరి. అంతా భగవదనుగ్రహం మీదే ఆధారపడి జరిగేట్లయితే, ఇంక మనిషి కేవలం కీలుబొమ్మే – అప్పుడింక సాధన ఆవశ్యకత ఉండదు. ఎలాటి నియమనిబంధనలూ వుండవు – అంటే విశ్వమే వుండదు. ఇంక వుండేదల్లా కేవలం ఆ భగవంతుడు – ఆయన లీలలే! ఒక రకంగా చూస్తే చివరికి విశ్వంలో జరిగేదంతా ఆయన ఇచ్ఛే అనవచ్చు, కానీ అది జరిగే విధానం – ప్రకటితమయే విధానం – మనుష్యుల ద్వారా, ప్రకృతినియమాలకి లోబడి వుండే శక్తుల ద్వారా. అప్పుడప్పుడు, అత్యవసర పరిస్థితుల్లోనో – ప్రత్యేక సమయాల్లోనో ఆ భగవం

తుడు సూటిగా జోక్యం చేసుకోవడం జరుగుతుంది – కానీ ఇది చాలా అరుదుగా, అసాధరణంగా తప్ప సాధారణంగా జరిగేది కాదు.

*

తపస్సు గురించి బ్రహ్మానంద చెప్పింది నిజమే. ఎవరైతే శ్రమించడానికీ, తపస్సు చేయడానికీ, మనసునీ, శరీరాన్నీ అదుపులో పెట్టుకోడానికీ సిద్ధపడరో, వాళ్లు గొప్ప ఆధ్యాత్మిక ప్రగతిని సాధించలేరు. ఎందుకంటే, మనసు, ప్రాణికశక్తీ కూడా సాధకుడిని అనేక మార్గాలలో ప్రలోభపెట్టీ, మోసగించీ, ఏదోలా తమ ఆధిపత్యాన్ని కొనసాగించాలని చూస్తాయి. వాటి ఇష్టాఇష్టాలకీ దాసుడిని చేసి, తాము సాధకుడికి దాసులు అయి, ఆత్మజ్ఞానానికీ, దివ్యజ్ఞానానికీ తోడ్పడే సాధనాలుగా పని చేయాల్సిన సమయాన్ని ఇంకా ఇంకా వాయిదా వేస్తాయి.

ఒక్కోసారి భగవదనుగ్రహం సాధకుడి అర్హతకి మించిందిగా అనిపించవచ్చు. ఒక్కోసారి నిజంగా అలాగే వుండొచ్చు కూడా. కానీ ఒకటి నిజం – ఎట్టి పరిస్థితుల్లోనూ భగవదనుగ్రహాన్ని మనం ఒక హక్కుగా సాధించలేము. హక్కుగా సాధించేదే అయితే, అది అనుగ్రహమే కాదు. పిలవగానే పలికేది కాదు అది. మనకి ఆ హక్కు కూడా లేదు. నేను గమనించేదమిటంటే, ఆ దివ్యానుగ్రహం ప్రకటితమయ్యే ముందు, పైకి కనబడని ప్రయత్నం ఎంతో ఉంటుంది. ఆ అనుగ్రహం కలిగాక కూడా మానవ యత్నం ఆగకూడదు. ఆ లభించినదాన్ని పదిలంగా వుంచుకుని, తెలుసుకోవలసినవి తెలుసుకోవడం, ఇంకా – సిద్ధి పొందేవరకు సాధించవలసిన ప్రతి అడుగులోనూ తపస్సే అవసరం. ఆ సిద్ధి పొందాక, అప్పుడు అంత శ్రమ అవసరం లేదు. ఎందుకంటే సంపూర్ణసిద్ధిలో స్థిరపడతాడు కనక. అందుకని సాధకుడికి ఏదో రూపంలో తపస్సు మాత్రం అనివార్యం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: బి. వరలక్ష్మి

చైత్యాత్మ అంటే ఏమిటి?

చైత్యాత్మ (Soul) అనేది దైవంయొక్క విస్ఫులింగం. అది అభివ్య క్తమైన సత్తకు అతీతంగా గాక, అభివ్యక్తసత్త లోనికి దిగివచ్చి దాని పరిణామమునకు దోహపరుస్తూ నిలిచి వుంటుంది. అది దివ్యచేతన నుండి వేరుగా లేకుండానే ఇంకా రూపుదిద్దుకొనని శక్తిగా, అనేక సంభవ్యాలకు నెలవై పరిణామక్రమంలో వాటి కొక రూపము నిచ్చును. ఈ దివ్యాగ్నికణము అతినిమ్నస్థాయి నుండి, అత్యున్నతస్థాయి వరకుగల సకల జీవులలోనూ వుంది.

*

చైత్యాత్మ (Soul) దివ్యాత్మయొక్క అగ్నికణం. వ్యక్తి స్వభావ మును పరిణామక్రమంలో వెల్లడించే పరికరాలైన మనఃప్రాణదే హములకు ఆధారము. చాలామందిలో బాహ్యాప్రకృతి క్రియల వెనుక చైత్యాత్మ దాగి వుంటుంది. అయితే ప్రాణికసత్తాచేత శరీరం నడుపబడుతున్నందువల్ల దానినే వారు అంతారత్మ అని పొరబడుతున్నారు. కానీ యీ ప్రాణికసత్తా మంచి – చెడు కోరి కలచే నడుపబడుతున్నది. ఇది కామనాత్మ. (desire-soul) అంతే తప్ప యదార్థ సత్త కాదు. ఎప్పుడైతే యీ యదార్థ చైత్యాత్మ ముందుగు వస్తుందో, అపుడది యీ పరికరాలను (మనఃప్రాణ శరీరములు) ప్రభావితం చేసి, వాటిని నడుపుతుందో, అపుడు మనిషి ప్రాణికకామనలనుండి బయటపడి దివ్యప్రకృతివైపుగా వికసించడం ప్రారంభమౌతాడు.

*

మానవునికి అగ్రభాగంలో ప్రాణికస్థాయి ఉద్వేగపూరిత హృదయం (the heart of the vital emotions) జాంతవికమైనదే అయినా వైవిధ్యంతో మరింతగా అభివృద్ధి పొంది ఉంటుంది. అది నిమ్నస్వభావము కలిగి వుంటుంది. అహంకారయుతంగా, పతనమైన ప్రాణికకామనలు, క్రోధములు, కోరికలు, తీవ్రమైన వాంఛలు, అల్పమైన ఆశలు, అత్యంత క్షుద్రమైన అల్పభావములు వంటి వాటికి యీ హృదయము వశవర్తియై వుంటుంది. అపుడది

పనికిమాలిన ప్రతిప్రేరణకు బానిసగా వుండి కామక్రోధాదులతో సంకీర్ణమైన ఉద్రేకపూరిత, క్షుద్రమైన నీచవికారాలతో ముట్టడిం పబడిన హృదయం మానవునిలో ఒక అసత్యపూరితమైన కామా త్మకు (a false souled desire) కారణమౌతున్నది. ఈ కామాత్మ మొరటైనది; మోసపూరితమై, ప్రమాదభరితంగా రూపొందుతుంది. అందుకే మానవునిలోని హేతుబుద్ధి దీనిని నమ్మకుండా అదుపులో వుంచాలని చూస్తుంది. కానీ వ్యక్తియొక్క వాస్తవమైన అంత రాత్మ ఇది కాదు. నిజమైన జీవాత్మ ఒక అగోచరమైన, ప్రకాశ మానమైన రహస్యగుహయందు, సహజప్రవృత్తులకు అతీతంగా హృదయాంతరంగంలో నిగూఢంగా వుంటుంది. అది నిశ్చలము. నిశ్శబ్దమైన అంతరాలయము. ఇది అందరిలో ఉన్నా దీనిని ఎరి గినవారు దీని ప్రేరణను నేరుగా అనుభవించినవారు చాలా కొద్ది మందే వుంటారు. ఆ లోతులలో దైవానికి చెందిన ఒక చిన్న విస్ఫులింగం వుంది. ఇదే మన అజ్ఞానపూరిత సంకీర్ణ స్వభావా నికి కూడా ఆధారభూతం. దీని ద్వారానే చైత్యపురుషుడు పెరిగి రూపు సంతరించుకుంటాడు. – యదార్థమానవుడుగా రూపుదా ల్చిన అంతరాత్మగా ఈ చైత్యపురుషుడు క్రమంగా వికసించి హృదయస్పందనలు, దైవప్రేరణలు, కదలికలకు ప్రతిస్పందించి నపుడు యీ మానవుడు అధికాధికముగా అంతరాత్మలో జీవి స్తాడు. బాహ్యమైన ఉన్నత పశుత్వము పోయి, అపుడపుడు లిప్త కాలంపాటు తనలోని భగవంతుని దర్శనముల పట్ల సచేతనుడౌ తాడు. దైవం నుండి అందే ప్రేరణలకు స్పందించి తనలో తాను అగాధ తలాలలో జీవించినా, క్రమంగా విముక్తుడై ముసుగులు వీడి ఉపరితలానికి వచ్చి మనఃప్రాణశరీరాలకు కూడా తన దైవ ప్రేరణలను, దర్శన స్పర్శనాదులను అందించగలుగుతాడు. ఇదే పూర్ణయోగంలో ప్రముఖ ఘట్టం. అపుడే బయటి భౌతికజీవితంలో కూడా దివ్యత్వం ప్రతిష్ఠించడం ప్రారంభమౌతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కొంగర భాస్కరరావు

సందేహం పని ఎప్పుడూ సందేహించటమే

అనుభవాలకి ద్వారం తెరు

మనిషి నిత్యశంకితుడు. తన సహజసిద్ధమైన అజ్ఞానానికి దండన ఇది అతనికి. సందేహం గురించి వ్రాయటం మొదలుపెట్టి నేనే 'సందేహం' లో పడ్డాను. ఎంత రాస్తే మాత్రం నిత్యశంకితునికి నమ్మకం కల్గించటం సాధ్యమౌతుంది. అరవై కాదు, ఆరువందలు కాదు, ఆరువేలపేజీలు వ్రాసి కూడా నమ్మించగలమా! సంశయం సంశయం కోసమే మరి! దాని పనే అది కదా.! నమ్మకం కుదిరినా కూడా పరిపూర్ణ సందేహనివృత్తి కలగటం అసాధ్యమే! సందేహానికి సాదరంగా సర్వసౌకర్యాలు అందించి, స్వీకరించే వానికి అది honest సత్యాన్వేషిగా భ్రమ కల్పిస్తుంది. నాయొక్క, ఇతరులయొక్క మానసిక అనుభవాల వలన నేనీ పాఠం నేర్చుకున్నాను. మరి సందేహం నుంచి నివృత్తి పొందటమెలా! సత్యాసత్యాలు ఆచూకీ తెలుసుకునే విచక్షణాజ్ఞానం ద్వారా. ఈ విచక్షణ సంరక్షణలో స్వేచ్ఛగా, ధైర్యంగా, అనుభవాలకి ద్వారం తెరవటమే మార్గం.

దైవము నిశ్చయంగా అనుభవైకవేద్యము

ఏది ఏమైనప్పటికి నేను వ్రాయటం ప్రారంభించాను. కాకపోతే సందేహంతో మాత్రం కాదు. దైవము భౌతిక దృగ్గోచర విషయము, ఇంద్రియగ్రాహ్యము అనే దృఢనిశ్చయంలో దైవాన్ని పొందవలెనని అభిలషిస్తూ మొదలుపెట్టాను. దైవము ఇంద్రియ సంవేద్యమానంగా, పదార్థప్రపంచంలో నిశ్చయంగా ఉన్నది. ఇది మానసిక ఆలోచనా పరిధికి లోబడినదిగాకాక, అనుభూతి గ్రాహ్యంగా మాత్రమే ఉంటుంది. దివ్య అస్తిత్వము, దివ్య ప్రశాంతత నీలో ఆవహింపబడాలి. అపుడు దివ్యానందలహరులు నీలో పొంగిపొరలుతవి. దివ్యశక్తి ఊపిరితో ప్రచోదింపబడతావు. దివ్య ప్రేమ నీలో వికసిస్తుంది. దివ్యజ్ఞానకాంతులు నిన్ను ముంచెత్తుతవి. ఆ దివ్య అస్తిత్వము నిన్ను పరివేష్ఠించి ఉన్నపుడు, అంతకు

ముందు ముసిరిన చీకట్లు, చీకాకులు – ఇవన్నీ ఆ దివ్యశక్తి అస్తిత్వంలో సంలీనమైపోతవి become part of the One Reality. ప్రకాశవంతమైన ఆలోచనాలోచనాలకు, అంతరేంద్రియాలకు ఆధ్యాత్మికస్పర్శకు, ప్రాణిక, భౌతిక ఇంద్రియ జ్ఞానసంవేదనలకు సహితము, సర్వత్రా, దైవమే అనుభవైకవేద్యమౌతుంది. అపుడిక సంశయమనేదే ఉండదు. వీచే గాలిని, ఆకాశంలో సూర్యుని, పగటి వెలుగుని సంశయించగలమా! భౌతిక అస్తిత్వాలు ఇంద్రియజ్ఞాన సంవేదనలుగా మనకి అనుభవంలోకి వస్తున్నాయి. అలానే దైవానుభూతి కూడా దృఢంగా, సంశయానికి ఆస్కారం లేకుండా, కలుగుతుంది.

ఆధ్యాత్మిక అనుభవాల శాశ్వతత్వము

ప్రాథమికమైన ఆధ్యాత్మికానుభవాలు శాశ్వతంగా నిలిచి ఉంటాయనుకోకు. ఏ కొద్దిమందికో అది సంభావ్యం. వారికైనాకూడా అనుభవతీవ్రత అలా ఉండిపోదు. చాలామందికి అనుభూతి కలుగుతుంది. తర్వాత సడలిపోతుంది. ఆ అనుభవాన్ని అలా నిలుపుకొని, పెంపుచేసుకుంటూ, శాశ్వతంగా ఉంచుకునేలా మానవ ఉపకరణాన్ని సంసిద్ధం చేసుకోవాలి. అలాగని దానిని సందేహించటం చాలా అవివేకం, గాలి అంతటా వీచటం లేదని, దాని ఉనికిని సందేహించం కదా! అలాగే రాత్రి అదృశ్యమైన సూర్యరశ్మి గురించి కూడా. వచ్చిన చిక్కేమిటంటే, సాధారణ మానవచైతన్యానికి, ఆధ్యాత్మిక అనుభూతి అసాధారణంగా కలుగుతుంది. ఈ మన సాధారణ చైతన్యం, ఆ అసాధారణ గాఢ దివ్యానుభవంతో సంసర్గం పొందటం కష్టమే. ఒక వేళ అనుభూతి కలిగినా అది అల్పమైన మానసిక, ప్రాణిక అనుభవాలతో సంకీర్ణమై పల్చపడిపోతుంది. ఒకవేళ ఉక్కిరిబిక్కిరి చేసే ఆధ్యాత్మికానుభవం కల్గినా అది నిలపడదు. ఏది ఏమైనా, అనంతుని అవరోధించే బుద్ధిమాంద్యం భగ్నం చేసేందుకు ఏ కాస్తంత అవకాశం కల్పించి, చోటు ఇచ్చినా, అది తొందరగానో, ఆలశ్యంగానో విస్తరించి, అది శాశ్వతంగా అవరోధాన్ని నిరోధిస్తుంది.

మనసెప్పుడూ తన పరిమితులతో, పక్షపాతాలతో, అజ్ఞానసూత్ర ములతో జోక్యం కలుగచేసుకుంటూనే ఉంటుంది. హేతువు, దానియొక్క అనుమానప్రమాణాల విచారణలు మొదలైన ఇతర అజ్ఞాన సంరంజామాతో దివ్యజ్ఞానం కోసం తడుములాడుతుంది. అలాటప్పుడు శాశ్వతస్థితితో కూడిన నిశ్చయాత్మక ఆధ్యాత్మిక అనుభవాలు సాధింపబడవు. క్రమానుగతంగా, ముందుకు సాగే చైతన్యమును నిశ్చలపర్చుకుని, నిలకడగా ఆధ్యాత్మిక అనుభవా లకు ఉన్మీలనం చెంది ఉన్నపుడే, ఈ ఉన్నత అంశాలు సాధ్య పడగలవు. ఆధ్యాత్మిక అనుభవాలు మానసికనిర్మాణాలు mental constructions కావు. ప్రాణికచలితచాలనాలసలే కావు. ఇవి సారభూతమైన అంశాలు. ఆలోచనకు అందనివి. మనసు భావిం చలేనివి. ఇవి వాస్తవ అస్తిత్వాలు. దృగ్విషయాంతర్గత ప్రధాన ప్రకృతిలో గుర్తించదగని, మార్పు చెందని మూలద్రవ్యాలు. సార భూతమైన పదార్థాలు – not mentally felt but felt in our underlying substance and essence. మనసు నిస్సందేహంగా అక్కడ కలుగచేసుకుంటుంది. కాకపోతే, అది దైవాన్ని మానసి కదృక్పథంతోను – దివ్యసత్యాన్ని – ఆలోచనల, నమ్మకాల, భావావేశాల పరిధిలోను అవలోకిస్తుంది. ఉన్నత దివ్యసత్యాన్ని ఈ విధంగా మానసికంగా అవగాహన చేసుకోవటం పూర్తిగా నిష్ప్రయోజనం కాకపోయినప్పటికీ, but it is concrete, intimate, and indubitable. మనసునకు నిశ్చయాత్మకత అనేది అందనిది. చేతకానిది. తాను నమ్మిన ప్రతి అంశాన్ని మనసు శంకిస్తుంది. దృఢపర్చిన దానిపై తిరిగి నిరాకరిస్తుంది. పట్టుపడుతుంది; కాని అంతలోనే పట్టు సడలిస్తుంది. నిజం చెప్పొద్దూ! మనసుకి ఆ స్వేచ్ఛ, హక్కు ఉన్నాయి. మనసుకు ఉండే ఈ లక్షణాలు కీర్తిం చతగినవే. కాని ఈ మానసికపద్ధతుల ద్వారా you cannot hope to arrive at anything, call an ultimate certitude. It is for this compelling reason that mentalising or enquiring about the

Divine cannot by its own right bring the Divine. బుద్ధిపర మైన విచారణ, హేతువాదం – వీటివల్ల దైవసిద్ధి సాధ్యపడదు. ముఖ్యంగా ప్రాణికశక్తులు, కామనలు, ముందే ఏర్పర్చుకున్న అభి ప్రాయాలు – ఈ మూకతో కూడిన చలితచాలనాలతో చైతన్యం ఎప్పుడూ అవిశ్రాంతంగా చంచలమై ఉండగా, ఒక నవ్య విజ్ఞాన అంతస్తు నందుకోగలిగే మూలాధార అనుభూతులకుగాని, లోలో తులలో వెల్లువలా ఉరకలు వేసే అద్భుత ఉల్లోలకల్లోలాకిగాని, దివ్య ఆత్మావరోహణకిగాని, అవకాశ మెక్కడ ఉంటుంది? మనో చేతనకి సంబంధిత కార్యకలాపాలలో, మనసు, నిమగ్నమై ఉన్నా కూడా, మనసులో దూసుకొని లోనకి ఆకస్మికంగా చొచ్చుకొని వచ్చి ముంచెత్తే ఆధ్యాత్మిక అనుభూతులకు, నిజంగా అవకాశం లేకపోలేదు. కాని తర్వాత ఆ మనసు ప్రశ్నించటం, సందేహిం చటం, సిద్ధాంతీకరించటం, ఊహించటం లాటివి ప్రారంభించి – ఏమిటీ అనుభవాలు? ఎంతవరకు ఇవి వాస్తవమైనవి? అని అను మానించటం మొదలుపెడితే, వచ్చిన ఆధ్యాత్మికశక్తి పలాయనం చిత్తగించి, దిక్కుమాలిన మనోభ్రమలు వైదొలగేదాకా వేచివుం డక ఏం చేస్తుంది?

ఒక సామాన్యమైన ప్రశ్న

ఆధ్యాత్మిక అనుభవం యొక్క ప్రామాణికతను విచారణ చేసే బుద్ధిజీవుని ఉద్దేశించి ఒక సింపుల్ ప్రశ్న అడుగుతాను. దైవం అనేది మనసుకంటె అల్పమైనదా? లేక ఉన్నతమైనదా? మాన సిక చైతన్యం – దానియొక్క అంతులేని హేతువాదం, శల్యపరీక్ష, తీరని సందేహం, పిడివాదం – వీటితో కూడి, దాని ఆచరణ, అంతస్థులలో దివ్యచైతన్యంకంటె, ఉన్నతస్థితిలో ఉన్నదా? అంత కంటె నీచస్థితిలో ఉన్నదా? లేక సమానస్థాయిలో ఉన్నదా? ఉన్నతస్థాయిలో ఉంటే దైవం కోసం వెతుకులాటలు అనవసరం, అసందర్భం. సమానస్థాయిలో ఉంటే ఆధ్యాత్మిక అనుభవం నిష్ప్ర యోజనం. తక్కువస్థాయిలో ఉంటే, ఇది, దివ్యచైతన్యాన్ని సాక్షిగా ధర్మాసనం ముందు నిందితునిగా ఎలా నిలదీస్తుంది? ప్రవేశానికి

అభ్యర్థిగా పరీక్షాధికార సంఘం ముందు హాజరు కావల్సినదిగా ఎలా ఆజ్ఞాపిస్తుంది? లేక – సూక్ష్మదర్శిని కింద కీటకాన్ని పరీక్షకు ఉంచినట్లు ఎలా నొక్కి ఉంచుతుంది? ప్రాణికశక్తి ఆధారంగా ఉన్న జంతువు, మానవ మస్తిష్కాన్ని వేలెత్తి చూపి, దానియొక్క ప్రచోదనలు, ప్రవృత్తులు, సాంగత్యాలు, నిర్దిష్టతలు – అని దాని లోతులను కొలిచి వ్యాఖ్యానించి తీర్పు చెప్పగలుగుతుందా? లేదు. ఎందుకంటే మానవమస్తిష్కం జంతుప్రాణికచైతన్యానికి అందదు. అంతకంటె ఉన్నతమైనది; విస్తృతమైనది; సంకీర్ణ సంక్లిష్టలతో పనిచేయగలిగేది కాబట్టి. మరి ఆలానే దివ్యచైతన్యం అనేది తప్పనిసరిగా విశ్వవిశాలమైనది. సంక్లిష్టమైనది. మానవచైతన్యంకంటె ఉన్నతతరమైన శక్తులతో, వెలుగులతో, అతీతమైనది – అని తెలుసుకోవటం అంత కష్టమేమీ కాదు. అలాటిదాని లోతులను పశికట్టడం, వ్యాఖ్యానించటం, తీర్పుచెప్పటం, పరిమితజ్ఞానం కలిగిన అల్పబుద్ధికి ఎలా సాధ్యం? ఆత్మ, మనసు (Spirit and Mind) ఒకటే ఎలా కాగలుగుతవి? ఇది సాధారణ విషయమే కదా! యోగి ప్రవేశించతగినది ఆధ్యాత్మిక చైతన్యం లోనికి – దైవంతో నిరంతర సాంగత్యం కోరుకుంటాడు కాబట్టి. మనసును నిశ్చలపర్చుకుని, పరిమితులను గుర్తించి, అపేక్షలు వదిలి, ఉన్నత దివ్యకాంతికి ఉన్మీలనమై, అర్పణ భావంతో తన అస్పష్టస్థాయిని గుర్తెరిగి ఉండగల్గాలి.

తప్పనిసరిగా మనసు చేయవలసినది

ఆధ్యాత్మిక జీవనంలో మనసుకు అసలే స్థానం లేదని దీని అర్థం కాదు. అంటే మరేమిటి? అంటే ఇది ప్రధాన ఉపకరణం కాదని. ఆధ్యాత్మికజీవనంపై ఆధిపత్యం దీనికి లేదు అని; దైవం దీనికి విధేయంగా ఉండవలసినది కాదు అని. ఒకటి తెలుసుకోవాలి. మనసుకన్న మిన్నయైనది దివ్యచైతన్యం. మనసు దీనికి చేరువ కావల్సినదే తప్ప, దీనిపై అజమాయిషీ చేయవలసినది కాదు. మనసు ప్రమాణాలు దైవానికి ఆపాదించకూడదు. మనసు దివ్య సత్యమునకు ఉన్మీలనమై ఉంటూ, దివ్యప్రకాశాన్ని అందుకోగ

లగాలి. మానసిక ఆదేశాలకు అనుగుణంగా పనిచేయని ఉన్నత తరశక్తిని ఆవహానం చేసుకుని, దానికి అర్పణభావంతో వశం కావాలి. ఊర్ధ్వభూమికల నుంచి పొంగిపొరలివచ్చే శక్తిప్రవాహా లకి తనలో చోటు కల్పించాలి. తన మిడిమిడి జ్ఞానాన్ని, మనక చీకట్లను వైదొలగించుకోవాలి. అప్పుడే తనకు అంతవరకు విన పడనిది వినిపిస్తుంది. నిశ్చైతన్యమై ఉన్నది చైతన్యవంతమౌతుంది. అంతవరకూ ఉన్న కలవరం, అనిశ్చితత్వం, సందేహం, నిరాశ వైదొలగి, ఆనందం, సాఫల్యత దృఢవిశ్వాసం, ప్రశాంతత లభ్య మౌతవి.

ఆత్మవిశ్వాసం మార్గదర్శిగా ఉండే అంతరంగ వెలుగు

యోగానికిది ప్రాతిపదిక, మనిషి దైవంకోసం చేసే నిర్విరామకృషి ఆరంభించిన నాటి నుంచి పొందిన అనుభవాలపై ఇది ఆధారపడి ఉన్నది. ఇది సత్యము కాకపోతే యోగములో సత్యము లేనే లేదు. యోగ అవసరమూ లేదు. ఉన్నత చైతన్యం ఆధారంగా ఇది వాస్త వము అవుతుంది. ఆధ్యాత్మికజీవనానికి సంశయంతో ప్రయోజనం ఏమైనా ఉన్నదా? లేదా? అనే దృక్పథం ప్రాతిపదిక. కాగా దైవా న్వేషణకు ప్రతీది గ్రుడ్డిగా నమ్మటం బుద్ధిహీనమైనది. ఇది ఆధ్యా త్మికత ఎప్పుడూ కాదు. ఉన్నత వెలుగులు అందుకునేవరకు, ఆధ్యాత్మికజీవనంలో చాలా జాగరూకత వహించి ఉండాలి. ఏది ఆధ్యాత్మికసత్యము, ఏది కపట ఆధ్యాత్మికత – అనేది ఎప్పుడూ గమనిస్తూనే ఉండాలి. ఇక్కడ మనసు, ప్రాణిక కామనలు తప్పు త్రోవ పట్టించే అవకాశం ఉంది. దివ్యసత్యములు, ఆసురిక అస త్యములు – వీటి వర్గీకరణ యోగానికి కావల్సిన మౌలికమైన ఆవశ్యకత. ప్రతికూల, వినాశకర, సంశయాత్మక పద్ధతుల ద్వారా ఇది సాధించవలెనా అనేదే ఇక్కడ ప్రధాన సమస్య. ఈ పద్ధతిలో సత్యాసత్యాలు రెండూ ఒకే దెబ్బతో నాశనమవుతవి. దీనికి ప్రత్యా మ్నాయం – మరింత అనుకూలమైన, ఉపయుక్తమైన, జ్యోతిర్మ యమైన పరిశోధనాశక్తి. ఇది అంతర్నిహిత అజ్ఞానానికి, లోబడి, సందేహం అనే బాకు, నిరాకరణ అనే దుడ్డుకర్రతో సత్యశోధన

చేయదు. ఆధ్యాత్మికత అంటే అవివేకమైన మూఢనమ్మకం కాదు. మొరటైన బుద్ధిజాడ్యమూ కాదు. ఇది అంతరంగ ఆత్మవిశ్వాసం. అందుండి ప్రసరించే మార్గనిర్దేశిక ప్రకాశం. 'అసతోమా సద్గమయ' కి రహదారి. ఆ ఆత్మవిశ్వాసం అంతవరకు నిలుపుకోవాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రావెంకటేశ్వర్లు

నేను పొంది తీరాలి; అది తప్పనిసరిగా పొందుతాను

నీవు విశ్వాసాన్ని ఆకాంక్షించాలి. అంతకు మించి నీ నుంచి నేను అపేక్షించేది ఏముంటుంది? కాకపోతే నీ పద్ధతి క్షుణ్ణంగా, పట్టిన పట్టు విడువనిదిగా ఉండాలి. ఏదో రెండు రోజులపాటు ఆకాంక్షతో ఉండి, తర్వాత నీరుకారిపోవటం తగదు. దైవకార్యంలో నిర్లిప్తతత పనికిరాదు. పూర్తి అవకాశం కల్పించాలి. ఆయన నీలో ఒక చిరుజ్వాలను ప్రజ్వరిల్ల చేయాలనుకుంటున్నప్పుడు, నీవు నీళ్లు చల్లి చల్లార్చకూడదు. అదేదో చిరుదివ్వె కదా అని నిర్లక్ష్యం పనికిరాదు. ఇటువంటి విషయాల్లో అంటే దైహిక, ప్రాణిక, మానసికస్థాయిలలో చీకట్లను చెదరకొట్టడానికి చిరుదివ్వె ఒక ప్రారంభంగా ఉండి, తద్వారా, క్రమేమీ దేదీప్యమానమైన సూర్యకాంతిగా భాసించవచ్చు. అందువల్ల దేనికైనా అంకురార్పణ జరిగినప్పుడు దాన్ని కొనసాగనివ్వాలేగానీ మధ్య మధ్యన నీ నిరాశా, నిస్పృహ, సందేహాలతో అవరోధాలు సృష్టించకూడదు. సాధారణంగా మొదట్లో అప్పుడప్పుడూ వచ్చే అనుభవాలు, మధ్య మధ్య విరామాలతో ఉన్నా, క్రమంగా అవి నిర్విరామంగా సాగిపోతవి. దాన్ని శాస్త్రీయ పరిభాషలో చెప్పాలంటే క్వాంటమ్ సిద్ధాంతం (Quantum theory) ప్రకారం శక్తి అంశలంశలుగా ప్రసరిస్తుందనే భౌతికశాస్త్ర సూత్రాన్ని వదిలి న్యూటన్ మహాశయుడు చెప్పినట్లు నిరంతరాయంగా శక్తిప్రసరణ జరుగుతుంది. అయితే ఇంతవరకూ

నువ్వు ఆ అవకాశం దైవానికి ఇవ్వనే లేదు. మధ్య మధ్య వస్తున్న వ్యవధానాలను నీ శంశయ, విముఖతలతో నింపివేస్తున్నావు. అందువల్ల ప్రారంభించినది ప్రారంభంగానే మిగిలిపోతున్నది. సంశయం ఎప్పుడూ మనసుకి పట్టువదలని శత్రువు. ఈ శత్రువుకి నీ ప్రక్కని ఎప్పుడూ స్థానం ఇవ్వకు. అన్నిటికీ మించి నీలో దైవప్రవేశానికి, నీ నిరాశ, నిర్వేదాలతో, ఆటంకం కలుగచేయకు.

కాస్త సౌమ్యంగా చెప్పాలంటే – ఎప్పటికైనా నీకూ, నీ ఈ నేలకూ ఇదొక్కటే తరుణోపాయం. బయట ఏమి జరగనీ. భూకంపాలు రానీ. హిట్లర్లుండనీ. నాగరికతలు తలక్రిందులవనీ. అవి నీ బాధ్యతను మరింత గురుతరం చేస్తాయని, నీకు నిర్దేశిత కర్తవ్యాన్ని తెలియచేస్తాయని గ్రహించు. అది కష్టమైనదే కావచ్చు. చాలా కాలమే పట్టవచ్చు. నీకు లభించే ప్రోత్సాహం అంతంత మాత్రమే కావచ్చు. అంతటి ఉత్కృష్ట కార్యం ఆ మాత్రం కష్టం లేకుండా ఎలా పూర్తి అవుతుంది? సద్యోఫలితాన్ని అపేక్షించ కూడదు. కష్టాలను మందహాసంతో ఎదుర్కొనాలి. అపుడే నీకు విజయం. చేయవలసింది ఒక్కటే! విజయం తథ్యమనే మంత్రజపం. ఏదీ కాదు అసాధ్యం అనే దృఢనిశ్చయంతో ఉండు. కష్టాలనేవి ఏవైనా కానీ, కృతనిశ్చయంతో అధిగమించేవేగాని అసాధ్యమైన విగా ఉండవు. కృతనిశ్చయంతో ఉంటే ఈ రోజు కాకపోతే రేపైనా తప్పక నెరవేరుతాయి – నిరాశను వెనక్కి నెట్టి ధీరుడవై సాధన చెయ్యి. యోగసాధనతో ధైర్యంగా నిరాశాంధకారాన్ని పారద్రోలు. చీకట్లు వైదొలగుతాయి. అంతర్గత కవాటాలు తెరుచుకుంటాయి.


జీవితంలో కష్టాలను ఓరిమితో, స్థిరచిత్తంతో ఎదుర్కొనలేనివారు, యోగసాధనలో అంతకు మించిన కష్టాలనుండి ఎలా కడతేరగల్గుతారు! ఈ యోగంలో తెలుసుకోవల్సిన మొదటి పాఠం, జీవితసమస్యలను ప్రశాంతచిత్తంతో, గుండెధైర్యంతో దైవ శక్తిపై పూర్తి విశ్వాసంతో ఎదుర్కోవాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి



Sri Aurobindo




It is finished, the dread mysterious sacrifice,
Offered by God's martyred body for the world...
He who has found his identity with God
Pays with the body's death his soul's vast light.
His knowledge immortal triumphs by his death.

(*Savitri*, p. 445)


(The last three lines were one of the three passages dictated last by Sri Aurobindo as additions to *Savitri*. The autobiographical slant is unmistakable.)




... and at the bed's head and feet disciples of long standing
sat quietly, heads bowed.



**"... Time lies below thy feet
And the whole world seems only a part of thee."**




A living Presence deathless and divine,
A Form that harboured all infinity.



The coffin of rosewood with metal-gold rings was lowered into the earth. French officials, all dressed in white, made a line to the left.





Words of the Mother inscribed on the Sri Aurobindo's Samadhi

9 December 1950

To Thee who hast been the material envelope of our Master, to Thee our infinite gratitude. Before Thee who hast done so much for us, who hast worked, struggled, suffered, hoped, endured so much, before Thee who hast willed all, attempted all, prepared, achieved all for us, before Thee we bow down and implore that we may never forget, even for a moment, all we owe to Thee.

డిసెంబరు 5, ఒక స్మృతి
(శ్రీఅరవింద దర్శనం)

Sorbonne లో, Indology చదువుతున్నప్పుడు, స్విట్జర్లాండులో Jung ని కలిశాక శ్రీఅరవిందుల్ని తప్పక చూడాలనుకున్నాను. హాలండ్‌లోని హేగ్ పట్టణంలోగల అంతర్జాతీయ న్యాయసంస్థలో పనిచేస్తున్న సమయంలో, ఆ వేసవికాలపు ఆఖరులో ఇండియా వెళ్లే అవకాశం లభించింది. అట్లాంటిక్ ద్వారా అమెరికా వెళ్లటానికి బదులు పసిఫిక్ మహాసముద్రం దాటి ఇండియా వెళ్లటానికి నిశ్చయించుకున్నాను.

పాండిచేరి ఆశ్రమ నిర్వాహకులతో ఉత్తరప్రత్యుత్తరాలు ప్రారంభించేను. ఆ సమయంలో శ్రీఅరవిందులు యేడాదికి నాలుగుసార్లు మాత్రమే ప్రజలకి దర్శనమిస్తారని తెలుసుకున్నాను. రాబోయే దర్శనం నవంబరు 24 వ తేదీ హాజరవడానికి నాకు అనుమతి లభించింది.

Oranje అనే డచ్ షిప్‌లో మొదట మధ్యధరా సముద్రం ద్వారా బయలుదేరి తరువాత సూయజ్ కాలువ, ఎఱ్ఱసముద్రం దాటి హిందూ మహాసముద్రం ద్వారా పయనించి, శ్రీలంక రాజధాని, కొలంబో చేరుకున్నాను. అక్కడినించి, భారతదేశపు ఆగ్నేయదిశ చివర వున్న పాండిచేరి చేరాను. అది అప్పటి కింకా ఫ్రెంచి భూభాగమే. చాలామంది అమెరికన్లు అప్పటికే అక్కడ చేరుకుని ఉన్నారు. న్యూయార్కునగరం నించి వొక వ్యాయామ ఉపాధ్యాయిని హఠయోగం నేర్చుకునేందుకు వచ్చింది. ఇద్దరు స్టాన్ ఫోర్డు నించి వచ్చారు. మా అందరికీ చక్కటి గోల్కొండ అనే అతిధిగృహంలో బస యేర్పాటు చేయబడింది. అది, శ్రీఅరవిందుల శిష్యుడు, జపాను దేశీయుడైన Frank Lloyd Wright చే కట్టించబడినది. నా గది చాలా ప్రశాంతంగా నిరాడంబరంగా వుంది. అందమైన గాజుపలకల డిజైన్లతో పెద్ద పెద్ద కిటికీలు, వాటిలో నించి కనిపించే పూలతోట. కిటికీ అడుగు అంచు పొడవునా, అంతవరకు యెత్తు చేసిన సిమ్మెంటు దిమ్మ, దాని మీద

చల్లని నీటితో వుంచిన నీళ్ల కూజా. పడకకి పూర్తిగా దోమతెర అమర్చబడింది. వర్షాకాలం అవడంచేత కాళ్లకి చల్లగా తగులుతున్న నల్లరాతి నేల. బయట ప్రాంగణంలో విరిసిన మందారాలు. కొలనులో వెదజల్లబడుతున్న తామరపూల వర్ణకాంతులు. తామరాకుల చుట్టూ, అడుగున మెలికలు మెలికలు గిరికీలు కొడుతున్న బంగారు చేపలు. (నిజంగా వర్ణనాతీతం)

శ్రీఅరవిందుల భావనలో భారత ఉపఖండమంతా ఒకే అవిభాజ్య దేశం. స్వాతంత్ర్యానంతర విభజనను ఆయన గుర్తించ లేదు. (వొప్పుకోలేదు) శ్రీఅరవిందుల అనుయాయిలు చాలామంది (తూర్పుపాకిస్తానీయులు) పాండిచ్చేరిలో స్థిరనివాసా లేర్పరుచుకున్నారు. అందులో కొంతమంది గోల్కొండలో వున్నారు. అక్కడికి రెండు విభాగాల కవతల భోజనాలగదితో వున్న ప్రధానభవనంలో మరికొంతమంది వున్నారు. మిగిలిన వివాహితులు చిన్న చిన్న స్వంతయిళ్లలో వున్నారు.

దర్శనంకి ముందు నెలలో, పాండిచ్చేరికి చుట్టుప్రక్కల వున్న చిన్న చిన్న గ్రామాలను చుట్టిరావడానికి, ఎక్కడెక్కడ ఫ్రెంచి రెస్టారెంట్లు వున్నాయో తెలుసుకోడానికి, మా అతిథి గృహానికి సమీపంలో వుండే సముద్రంలో యీతకొట్టి రావడానికి నాకు సమయం దొరికింది. ఆశ్రమంలో ఎవరు అనుసరించినా, అనుసరించకపోయినా తప్పనిసరిగా అమలుచేసే కొన్ని రోజూవారీ కార్యక్రమాలున్నాయి. ప్రధాన భోజనాలయంలో పొద్దున్నే ఫలహారం – ఒక అరటిపండు, గోధుమతో యింట్లో చేసిన మాదిరి రొట్టి, కోకో పాలు యిస్తారు. తరువాత ముందుగా తెలియజేస్తే, భోజనం వుంటుంది. చీరకట్టుకున్న వొక అమ్మాయి తళతళ మెరిసే రెండు యిత్తడి పాత్రలలో కూరలు మొదలైన భోజనపదార్థాలు తెచ్చిపెడుతుంది. గోల్కొండ క్రింది అంతస్థులో, పరిశుభ్రమైన పరిమళభరితమైన గాలి వచ్చే చోటు భోజనం చేయడానికి స్థలం యేర్పాటు చేసారు. విష్ణుపటేల్ అనే వొక హిందూయువకుడ్ణి మాకు పరిచయం చేసారు. అతడు కుటుంబంతో సహా పాండిచేరిలో వున్నాడు. అతడు భారతదేశపు మితా

యిలు, ఆ ప్రాంతపు వంటకమయిన వడ, సాంబారు (vegetable-flour, doughnut, dipped in a hot sauce) రుచి చూపించాడు. వడ, సాంబారు నాకు ఇప్పటికీ ఇష్టమే. విష్ణు మా అమెరికన్లని, యూరోపియన్లని బజారుకి తీసుకెళ్ళేవాడు. బట్టలుతికే, యిస్త్రీ చేసే చాకలిని చూపించేడు. ఈ వాతావరణానికి సరిపడే చెప్పులు దొరికే ప్రాంతం చూపించేడు.

ప్రతిరోజూ వుదయాన్నే ఫలహారం తరవాత అందరూ శ్రీమాతగా భావించే, మిరా అల్ఫాసాతో సమావేశం వుంటుంది. ఆ సమావేశంలో ఆమెని చూడవచ్చినవారికి ఆమె పువ్వులివ్వడం, వారినుండి పువ్వులు స్వీకరించడం జరిగేది. ప్రతి పువ్వుకి ఆధ్యాత్మికస్పందన కలిగించే వొక ప్రత్యేక గుప్తనామం వుంటుంది. ఉదయమే అక్కడ చలువరాతి నేలగల చిన్నగదిలో శ్రీమాతతో పాటు సామూహిక ధ్యానం వుంటుంది. ఆ గది, ద్వారం మధ్య ప్రాంగణం వైపు వున్నది.

రోజు రోజుకీ పాండిచ్చేరి ఆశ్రమానికి దర్శనం కోసం జనం రావడం యెక్కువయింది. ఆ సమయంలో అక్కడ వస్తు ప్రదర్శనశాలలు, ఆ కోలనీలో వుంటున్న యువజనులకి ఆటల పోటీలు మొదలయ్యాయి. ఇవన్నీ పూర్వం నించీ వున్న వృద్ధులకి బాగా చిరాకు కలిగించేవి. వీటివల్ల రోజువారీ పనులకి ఆటంకం కలగడంచేత మిగిలినవాళ్లు కూడా యిబ్బంది పడేవారు. ముంబాయి నించి అక్కడికి తరచు వస్తూ వుండే వొక వేదాంతపండితుడు. (Professor of Philosophy) నాకు వివరించినట్టు శ్రీఅరవిందాశ్రమం పాతపద్ధతులకి స్వస్తి పలికి, యితర ఆశ్రమాలకి భిన్నంగా యేర్పడిన విప్లవాత్మకమయిన ఆశ్రమం. ఆయనే మంగళూరు తీరాన వున్న 'చిదానంద స్వామి' (the laughing sage) అయిన రామదాసుని కూడా తప్పక దర్శించమని సలహా యిచ్చారు. ఒక వారం తర్వాత రామదాసు ఆశ్రమం దర్శించేను. ఆ సందర్శన నాకు గొప్ప కనువిప్పు కలిగించింది. ప్రాచీనప్రమాణాల కతీతంగా వున్న పాండిచ్చేరి ఆశ్రమం యెంత అసాధారణమైనదో అర్థమైంది. ఏదేమైనా రామదాసు కూడా చాలా

ఆహ్లాదకరమైన వ్యక్తి అనిపించాడు. ఇక్కడి వాతావరణం పాండిచ్చేరికి పూర్తిగా భిన్నమైది. ఇక్కడ స్త్రీలు, పురుమలు విడివిడిగా, వారివారి ప్రత్యేక స్థలాల్లో కూర్చుంటారు. అంతా స్వదేశీ ఆహారమే. పాండిచ్చేరిలో లాగ ఆధునిక సౌకర్యాలేమీ లేవు.

అమెరికా ప్రెసిడెంటయిన విల్సన్ కుమార్తె మార్గరెట్ విల్సన్ తన చివరి రోజులు పాండిచ్చేరిలోనే గడిపి యిక్కడే చనిపోయిందని తెలిసింది. అప్పట్లో కమ్యూనిజం చట్టసమ్మతం కావడంచేత ఫ్రెంచివారి రక్షణలో 1947 సం॥ లో మొత్తం ఆ కోలనీ అంతా కమ్యూనిస్టులు ముట్టడించారని తెలిసింది. ఆ సమయంలో వొక ఆశ్రమవాసిని చంపేశారు కూడా.

రాత్రివేళల్లో పాండిచ్చేరి వొక రమ్యరసమయప్రాంతంగా మారిపోయేది. అక్కడి ఓడరేవులోకి ఓడలు స్వేచ్ఛగా వచ్చేవి. ఆ వోడల్లో బంగారుకడ్డీలు భారతదేశంలోకి దొంగతనంగా రవాణా (smuggled) చేయబడేవని చెప్పుకునేవారు. సముద్రతీరంలో పెద్ద పెద్ద చలిమంటలు వుండేవి. ఆ వెలుతురులో తెల్లటి తలపాగాలు ధరించిన వ్యక్తులు అటూ యిటూ తిరుగుతూ కనిపించేవారు. ఆశ్రమవాసుల్లో మధ్య చావడిలో పనివున్నవారు తప్ప, మిగిలిన వాళ్లలో కొంతమంది సాహసించి బయటకి పోయి తిరిగేవారు. అక్కడున్నన్నాళ్ళూ అమెరికానించి వచ్చినవాళ్లం మాత్రం యివన్నీ చూస్తూ వుండేవాళ్లం.

నియమం ప్రకారం మధ్యాహ్నం పూట నేను ఆశ్రమం లైబ్రరీలో నా పరిశోధనకి కావలసిన పుస్తకాలు తీసుకుని నోట్సు తయారు చేసుకునేవాడిని. ఇప్పుడా పుస్తకాలు ఆమెరికాలో కూడా దొరుకుతున్నాయి. సాయంత్రాలు మేం కొంతమందిమి ఆ వూళ్లో ప్రదర్శించే బహిరంగ చలనచిత్రాలు (out-door movies) చూడ్డానికి వెళ్లేవాళ్లం. అప్పుడే, వొక రోజు ఒక వుత్కంఠభరితమైన సంఘటన జరిగింది. ఆ చలనచిత్రాలు ఒక పెద్ద గుడారంలో ప్రదర్శించేవారు. యూరోపియన్లకు, ఆమెరికన్లకు కూర్చునేటందుకు బెంచీలు వేసేవారు. మిగిలిన గ్రామస్థులు కాళ్లు ముడుచుకుని, యిసకనేల మీద కూర్చుని చూసేవారు. హఠాత్తుగా ఒకసారి

జనంలోంచి కలకలం బయల్దేరింది. ఏమిటో? అని చూసేసరికి ఒక పాము కనిపించింది. నేను వెంటనే నా కాళ్లు బెంచీ మీదకు లాక్కుని సినీమా పూర్తయేవరకు అలాగే కూర్చున్నాను. మరొక సారి బజారులో ఒక పాములవాడు తటస్థపడ్డాడు. తన ప్రదర్శ నికి నేను డబ్బు లివ్వలేదని, కోపంతో బ్రతికున్న ఒక త్రాచు పాముని తోక పట్టుకుని నా మొహం మీద ఆడించేడు. అది పట్టు తప్పి నేలమీద పడి అక్కడున్న జనం కాళ్ల మధ్య మెలి కలు తిరుగుతూ ప్రాకుతూ వుంటే, వారు వుల్లాసంగా వినోదిం చడం చూసి ఆశ్చర్యంతో అది వారి స్వభావంగా అర్థం చేసుకు న్నారు.

చివరికి నవంబరు 24 వ తేదీ వుదయం రానే వచ్చింది. గోల్కొండలో పుకార్లు షికారు చేయసాగాయి. వేలకొద్దీ జనం అప్పటికే దర్శనం కోసం వచ్చి వున్నారు. శ్రీఅరవిందులు తీవ్ర అస్వస్థతతో వున్నారని బహుశా దర్శనం వుండకపోవచ్చుని అను కున్నారు. చివరి నిమిషంలో ఆయన బాగానే వున్నారని తెలిసింది. ఒక పెద్ద సందర్శకుల వరుస ప్రధానభవనం నించి బయల్దేరి, ఆ విభాగం చుట్టూ తిరిగింది. వివిధ రంగుల్లో, రకరకాల పద్ధతుల్లో దుస్తులు ధరించినవారంతా ఆ వరుసలో వున్నారు. ప్రభుత్వో ద్యోగులు, పెద్ద పెద్ద హోదాల్లో వున్న ఆచార్యులు, యువకులు, వృద్ధులు అనేక దేశాలనించి వచ్చినవారు యీ వేదాంతి ఋషి దర్శనం కోరి వచ్చారు. మాలో ప్రతి ఒక్కరూ వరుసలో మెట్లెక్కి మేడ మీద పొడవైన ఇరుకు గదిలో వున్న శ్రీఅరవిందుల్ని, శ్రీమాతను దర్శించుకోవాలి. శ్రీఅరవిందులు తెల్లని వస్త్రం, శ్రీమాత బంగారురంగు చీర, ధరించి ప్రక్క ప్రక్కనే ఆసీనులై వున్నారు.

ఏమీ మాట్లాడకుండా కేవలం వారిద్దరి ముందునించి అలా సాగిపోవటం పాశ్చాత్యుడైన నాకు చోద్యంగా తోచింది. ఆ రకమైన మౌనసమావేశంలో హిందువుల అభిప్రాయం, అందులో వుండే ఆధ్యాత్మికశక్తి తీవ్రప్రభావం అప్పటికి నాకింకా తెలి యదు. నేను, వరుసలో పరిశీలిస్తూ పైకి వచ్చాను. వారిద్దరి యెదు టికి వచ్చినవారు కొద్ది క్షణాలు ప్రశాంతంగా, మౌనంగా నిల్చొని

తరువాత శ్రీఅరవిందులు సంజ్ఞ చేయగానే ముందుకి సాగిపోవడం గమనించాను. ఆ తరువాత జరిగినది మాత్రం యెన్నడూ నేను వూహించనిది. వారికి నాలుగడుగుల దూరంలోకి వచ్చేసరికి ఒక తీవ్రమైన శక్తిక్షేత్రంలోకి కదిలిపోతున్న అనుభూతి కలిగింది. అది ప్రేమశక్తిగా నా అంతఃకరణకి స్ఫురించింది. అది సామాన్య మానవులు వాడుక మాట కాదు. వారిద్దరూ తిన్నగా అనుసంధానం కాబడి ఉన్నారు. మామూలు తల్లిదండ్రుల చూపే శ్రద్ధ కాదు వారిది. కాని ఆ వుదాసీనతలో కావలసిన ఉపశమనం ఉంది. అంతే హఠాత్తుగా నేను వారిని నా ఆధ్యాత్మిక తల్లిదండ్రులుగా ప్రేమించడం మొదలుపెట్టాను. అప్పుడు నా ఆలోచనలన్నీ ఆగిపోయాయి. నేనెక్కడున్నానో నాకు బాగా తెలిసింది. అది నా శ్టాన్ ఫోర్డు మిత్రుడు చెప్పినట్టు సమ్మోహనం (Hypnotism) కాదు. ఆ కొద్ది క్షణాలలో నా మనస్సు పూర్తిగా నిశ్చలమయిపోయింది. నేనక్కడ చాలాసేపు వున్నట్టున్నాను. అక్కడ కాలం ఆగిపోయింది. చాలా సంవత్సరాల తర్వాత మాత్రమే నేనా అనుభవాన్ని మాటలలో చెప్పగలిగాను. కాలం స్తంభించిన అనుభూతి (the Timelessness in Time) అది. దర్శించిన యిద్దరు వ్యక్తులు, తాము దేనినైతే సాధించి, అనుభవించామని ప్రకటించారో, ఆ విషయమై నాకు పిసరంత అనుమానం కూడా కలుగలేదు. వారు అతీంద్రియ జ్ఞానసంపన్నులు (Gnostic Beings). శ్రీఅరవిందులు వర్ణించిన నవ్యచేతన, 'అతిమానసము' వారు సాధించారు. ఈ అనుభవం తరువాత నాకు Heidegger చెప్పిన స్థిరమైన సన్నిహితత్వం (standing presence) అనేది నాకు అర్థమైంది.

ఆ సందర్శన అక్కడితో పూర్తి కాలేదు. చాలా రోజుల తర్వాత శ్రీఅరవిందులవారి ఆరోగ్యం నానాటికీ క్షీణిస్తున్నట్లు గోల్కొండలో వున్న ఒక ఇంగ్లీషు డాక్టరు నాతో చెప్పాడు. 1950 డిసెంబరు 5 వ తేదీ రాత్రి తెల్లవారుఝామున 1 గం 30 ని॥ లకు మూత్రకోశవ్యాధితో శ్రీఅరవిందులు భౌతికదేహాన్ని విడిచి మహాసమాధి చెందారు. అదే రోజున సుమారు 3 గం॥ 30 ని॥ లకు యీ వార్త ఆశ్రమవాలులందరికీ ప్రకటించబడింది. వారి

ద్దరూ కలిసి యిచ్చిన ఆ దర్శనమే నాకు దక్కిన ఆఖరి దర్శనం అని తెలిసి యెంతో విచారించాను.

డిసెంబరు 5 వ తేదీ రోజంతా నేను ఆశ్రమప్రాంగణంలో ఒంటరిగా ఏమీ తోచని స్థితిలో కాలుగాలిన పిల్లిలా తిరుగాడుతూ వుండిపోయాను. అప్పటికే ఫ్రెంచి గవర్నరుయొక్క ఆదేశాన్ని త్రోసిపుచ్చి, శ్రీఅరవిందుల పార్థివదేహాన్ని ఆశ్రమప్రాంగణంలో విశాలమైన కొమ్మలతో విస్తరించివున్న పెద్ద చెట్టు క్రింద ఖననం చేసి సమాధి కట్టడానికి నిర్ణయం తీసుకున్నారు. సందర్శన కోసం వచ్చిన డాక్టరుతో సహా ఆశ్రమంలో వున్న పురుషులు సమాధి నిర్మించడం మొదలుపెట్టారు. ఒక పెద్ద సుత్తితో కాంక్రీటు దిమ్మ బద్దలుకొడుతున్న డాక్టరు మృత్యురహస్యాన్ని బ్రద్దలుకొడుతున్నవాడిలా కనిపించాడు. శ్రీఅరవిందులు స్వయంగా తాము 'అవతారపురుషుడిగా వెల్లడించుకున్నారని' తను గట్టిగా నమ్ముతున్నట్లు చెప్పాడు.

అక్కడంతా దుఃఖమే. కాని hysteria లేదు. మధ్యాహ్నం స్త్రీలు, పురుషులు అంతా సమాధి త్రవ్వకం నించి తీసిన మన్ను తట్టలతో ఒకరికొకరు అందించుకుంటూ బయటకు తీసుకెళ్తున్నారు. చెట్టు క్రింద త్రవ్వకం కొనసాగుతూనే వుంది. అప్పుడే అక్కడ ఒక తాజాప్రకటన వెలువడింది. అక్కడే వున్న మా అందరికీ రెండవదర్శనం వుంటుందని. పైఅంతస్థులో తన శయ్యమీద పడుకున్న కవి, వేదాంతి, భౌతికదేహాన్ని సందర్శించడానికి వరసలు కట్టి బయల్దేరాం.

మళ్లీ ఆ మర్నాడు డిసెంబరు 6 వ తేదీ వుదయం మళ్ళీ వరుసల్లో వెళ్లి సందర్శించాము. నేను మొదట చెప్పిన శక్తిక్షేత్ర తీవ్రత ఆ శరీరం మొదలు గదంతా పరివ్యాప్తమై వున్నది. తెల్లని శయ్యమీద, తెల్లని వస్త్రాలలో కిటికీల ముందు శ్రీఅరవిందులు స్థిరంగా శయనించి వున్నారు. చుట్టూ పూలకుండీలు అమర్చారు. తలవద్ద, పాదాలవద్ద యెప్పట్నించో తనతో వుంటున్న శిష్యులు తలలు వంచుకొని మౌనంగా ధ్యాననిమగ్నులై వున్నారు.

అనుకోకుండా మధ్యాహ్నం మళ్లీ మరొకసారి దర్శనం చేసాం. శ్రీఅరవిందుల ముఖంలో అప్పుడు కూడా మృత్యుఛాయ ల్లేవు. మేనిచర్మం స్వర్ణకాంతులతో ప్రకాశిస్తున్నది. పంకా నించి వస్తున్న చల్లని గాలిలో తెల్లటి జుత్తు దిండుమీద పరుచుకొని యెగురుతున్నది. కొనదేలిన నాసికలో ముఖపార్శ్వం గొప్ప ప్రవక్తని తలపిస్తున్నది. అక్కడసలు మృత్యుజాడ మచ్చుకైనా లేదు. ఒక చిన్న ధూపకళిక వెలుగుతున్నది. మళ్ళీ మళ్ళీ దర్శనాల ఫలితంగా ఆయన దేహం మరింత ప్రశాంతంగా వున్నట్టుండటం నాకు విచిత్రంగా తోచింది.

మూడవసారి దర్శనానికి వెళ్లినపుడు ఆ గదిలోని యితర వస్తువులు గమనించాను. సేకరించిన యేనుగుదంతాలు, ఒక నగిషీలు చెక్కిన బీరువాలో, పులిచర్మాలతో కప్పబడిన చేతులున్న ఒక కుర్చీ (arm-chair) ప్రక్కనే ఒక బెంచీ, ఎప్పుడో నేను Seattle లో వేలంలో కొన్న మేజాబల్లని పోలిన పర్షియా చెక్కడపు పనిగల మేజాబల్ల, గోడకి జపాన్‌దేశపు సాగరతీర చిత్రపటం వున్నాయి.

డిసెంబరు 7 వ తేదీ అంత్యక్రియలు జరుగవచ్చని అందరి అంచనా. ఇక్కడ పూర్తిగా ఉష్ణమండల వాతావరణం. మృతదేహాలు యెంత తొందరగా వీలైతే అంత తొందరగా దహనం చెయ్యడం భారతదేశ ఆచారం. సాధారణ హిందూసాంప్రదాయ పద్ధతి ప్రకారం జరిపే ఖననాలు కూడా సాంప్రదాయబద్ధమైన ఆడంబరంతో కూడిన లాంచనాలతో జరుగుతాయి.

పెద్ద పెద్ద సిమ్మెంటు దిమ్మల వరుసలతో కూడిన సమాధి నిర్మాణం పూర్తయింది. ఖననానికి బదులుగా శ్రీమాత నుండి ఒక ప్రకటన వచ్చింది.

ఆ రోజు కూడా శ్రీఅరవిందుల అంత్యక్రియలు జరుపబడవు. ఆయన దేహం నుండి అతిమానసతేజస్సు వెలువడుతూనే వున్నది. దేహం శిథిలమవుతున్న చిహ్నాలు మచ్చుకైనా లేవు. ఎంతకాలం ఆ దేహం ఆ స్థితిలో వుంటుందో అంతకాలం అది ఆలాగే వుంచబడుతుంది – అని.

ఈ నిర్ణయంపై ఫ్రెంచికాలనీ నించి అసమ్మతి సూచనలు బయల్దేరాయి. అధికారులలో అలజడి మొదలయింది. మృతదేహాన్ని రహస్యంగా రసాయనసాధనాలలో వుంచారని పుకార్లు బయలు దేరాయి. ఆశ్రమప్రాంగణంలో ఖననమే ప్రభుత్వ నిబంధనలకి విరుద్ధం. అంతేకాక మృతదేహాన్ని యెట్టి పరిస్థితులలోనూ 48 గంటలకి మించి వుంచడానికి వీల్లేదన్న నిబంధన కూడా వుల్లం ఘించడం మరొక నేరం.

డిసెంబరు 7 వ తేదీ ఉదయం ప్రభుత్వ ప్రతినిధిగా ఒక ఫ్రెంచి డాక్టరు (Dr. Barbet) శ్రీఅరవిందుల భౌతికదేహాన్ని పరీ క్షించడానికి వచ్చాడు. చివరకి అతడు కూడా తన నివేదికలో "యిది అత్యాశ్చర్యకరమైన అద్భుతం. మృతదేహం క్షీణిస్తూన్న సూచనలుగాని, చెడుతున్న చిహ్నాలుగాని బొత్తిగా లేవు" అని వెల్లడించడం జరిగింది. ఇది ఎన్నడూ కని, విని యెరుగనిది. ఆ సమయంలో వాతావరణంలో వుష్ణం యథాతథంగానే వున్నది. ఈ శాస్త్రీయమైన, అధికారిక సమ్మతితో పునర్దర్శనానికి యెటు వంటి ఆటంకం లేకపోయింది. భారతదేశపు అన్ని ప్రాంతాల నించి తండోపతండాలుగా జనం రావడం మొదలుపెట్టారు. భార తదేశపు వార్తాపత్రికలన్నీ శ్రీఅరవిందులకి మరణానంతరం ప్రక టించే నోబెల్ శాంతిబహుమతి ప్రకటించాలని వ్రాసాయి.

ఇది చివరిసారి దర్శనం కావచ్చని నా కనిపించింది. తర తమ భేదాలు లేకుండా, చింకిబట్టలు కట్టుకునే యాచకులు, కుతూహలంతో పరిశీలించడానికి వచ్చినవారు, గ్రామస్థులు, ఆశ్ర మవాసులు, సందర్శకులు అందరూ శ్రీఅరవిందుల పార్థివదేహం సమీపం నించి చూచిపోవడానికి అనుమతించబడ్డారు.

డిసెంబరు 8 వ తేదీ ఆశ్రమ ఆవరణంలో మౌనం పాటిం చబడింది. ఆలస్యంగా చూడవచ్చినవారికి మాత్రమే సందర్శనా నికి అనుమతి ఇవ్వబడింది. ఆశ్రమవాసులు వుత్కంఠభరితంగా వున్నారు. నమ్మశక్యంగాని చింతనలో ఆ రోజు గడిచిపోయింది.

మా అమెరికా దేశస్థులతో మాట్లాడతానని, 'లైఫ్ మేగ జైన్' భారతీయ ప్రతినిధి వచ్చాడు. చనిపోయిన తరువాత యింత

కాలం దేహం యీ విధంగా వుండడం, యిటువంటి అద్భుతం భారతదేశంలో యిదివరకు యెప్పుడూ, యెక్కడా సంభవించలేదని చెప్పాడు. నిరంతర సాధనతో సజీవ సమాధిస్థితి సాధించిన యోగులు సైతం యిటువంటి అద్భుతకృత్యం చెయ్యలేదని అన్నాడు. చరిత్ర ప్రసిద్ధులైన భారతదేశపు యోగులెవ్వరియొక్క మరణానంతరం దేహాల్ని యీ విధంగా యిన్నాళ్లు వుంచడం జరగలేదని, ఇప్పటికీ, అంటే డిసెంబరు 8 వ తేదీ నాటికి కూడా, శ్రీఅరవిందుల దేహం సజీవంగా యోగసమాధిలోనో, కోమాలోనో వున్నట్టు వున్నదని ఆశ్చర్యపోయాడు.

డిసెంబరు 9 వ తేదిని ఒక నోటిసు జారీ చెయ్యబడింది. ఆశ్రమంలో వున్నవారికి ఒంటి గం॥కి అంతిమదర్శనం వుంటుందని. తరువాత అది మధ్యాహ్నం 2 గం॥ 30 ని॥ లకు మార్చబడింది. బయటినించి వచ్చే సందర్శకులకి మొదట అనుమతి యివ్వబడింది. రాత్రి కావడానికి ముందుగా ఛార్టర్డు విమానంలో డార్జిలింగ్ నించి పందొమ్మిది మంది వచ్చారు. అప్పుడు గోల్కొండలో వున్నవారంతా వారి గదుల్లో సందర్శకులకి చోటు యివ్వవలసి వచ్చింది. అతిథిగృహం మొత్తం జనాలతో, పక్కచుట్టలతో నిండిపోయింది.

నా ప్రయాణం వాయిదా వేసుకున్నాను. ఇదంతా నా జీవితంలో యే పరిస్థితితోనూ సరిపోల్చలేని అరుదైన అపురూపస్థితి. యథాతథంగా నా స్మృతిపథంలో శాశ్వతంగా నిలిచిపోయేదని గుర్తించాను. జరిగేది సంపూర్ణంగా చూసి వెళ్లాలని నిశ్చయించుకుని వుండిపోయాను.

డిసెంబరు 9 వ తేదీ సాయంత్రం 5 గం॥ లకి అంతిమ దర్శనం తరువాత ఖననకార్యక్రమం ప్రారంభమయింది. శ్రీఅరవిందుల సమీప వాతావరణంలో అతిమానసశక్తి తీవ్రత, బలం నిండివున్న అనుభూతి అలాగే వున్నది. కాని ఆ తీవ్రత క్రమక్రమంగా యిప్పుడు బలహీనమవుతున్నది. ఖననం పూర్తయిన తరువాత పూర్తి నిశ్శబ్దంతో ప్రతి ఒక్కరూ ఆశ్రమప్రాంగణంలో కూర్చున్నారు. కుతుహూలంతో చూడవచ్చేవారిని వారించడం

కోసం, గేట్లు తాళాలు వేయబడ్డాయి. అక్కడెటువంటి మత, సాంప్ర దాయపరమైన పద్ధతులు పాటించబడలేదు. శవపేటిక నల్ల యిరిడి చేవ (Rosewood) చెక్కతో చేయబడి, బంగారు రింగులతో పూర్వపు రోజుల్లో అందంగా చేయబడిన Seachest ని పోలి వున్నది. ఆశ్రమంలోనే తయారుచెయ్యబడింది. శవపేటిక భూమి లోకి దింపబడింది. ఫ్రెంచి అధికారులంతా తెల్లనిదుస్తులతో యెడమవైపు వరుసలో కాఠిన్యంతో, బిగుసుకున్న ముఖాలతో నిల్చున్నారు. ఆ ముఖాలలో అధికారదర్పం, యీ తంతుపట్ల తిర స్కారం వ్యక్తమవుతున్నాయి. శవపేటికపైన కాంక్రీటు దిమ్మలు పేర్చబడ్డాయి. తరువాత మేమంతా వాటిపై వొకరి తరువాత వొకరు తట్టలతో మన్ను వెదజల్లాము. విశాలమైన అ చెట్టు క్రింద అంతా చీకటిగా వుంది. మాలో ప్రతి ఒక్కరం యీ అంతిమ వీడ్కో లులో పాల్గొన్నాము.

డిసెంబరు 10 వ తేదీ వుదయమే నేనా సమాధి దర్శించ డానికి వెళ్ళాను. అప్పటికే అదంతా పూలతో పూర్తిగా నింపబడ్డది. అగరొత్తులు వెలుగుతున్నాయి. ఆశ్రమనిర్వహణ శ్రీమాత యధా విధిగా కొనసాగిస్తారని, త్వరలోనే ఒక కొత్త విశ్వవిద్యాలయం తెరవబడుతుందని ప్రకటించబడింది.

శ్రీమాత రెండువారాల వరకు ధ్యానంలో వుంటారని, ఆ సమయంలో యెవరినీ చూడడంకానీ, మాట్లాడడంగాని చేయరని ప్రకటించేరు. అయినప్పటికీ, ఆమె వుదారంగా డిసెంబరు 15 వ తేదీ సాయంత్రం 6 గం॥ లకి నాకు వీడ్కోలు సమావేశానికి అను మతి యిచ్చారు.

5 గం॥ లకు నేను ధ్యానమందిరానికి వెళ్లేను. జరిగిన సంఘటనతో మానసికమైన వుద్వేగంతో మనసంతా వికలమయి వున్నది. ఆమె మెట్ల పైభాగంలో కనిపించేరు. తెల్లని దుస్తుల్లో వున్నారు. నేను చిరునవ్వు నవ్వగానే తలవూపి పైకి రమ్మ న్నారు.

నేనడగాలనుకున్న ప్రశ్నలన్నీ మటుమాయమయిపోయాయి. ఈ సమావేశం చాలా బాధకరమైనదని నాకు ఆంతర్యంలో అని పిస్తున్నది.

ముప్ఫయి సంవత్సరాలు తోడునీడగా వున్న సహచరుణ్ణి కోల్పోయిన విషాదకరపరిస్థితి ఆమెది. "నువ్వు నన్ను చూడాల నుకుంటున్నావని చెప్పేరు" అని ఆమె ప్రశాంతంగా అన్నారు.

నేను అనాలోచితంగా, "నేను అనేక భయాలతో భయప డుతున్నట్టు అనిపిస్తున్నది. యుద్ధభయం, వ్యక్తిగతజీవితంలో భయాలు యిలా అనేక రకాలుగా భయపడుతున్నా" నని నా భయాన్ని వెళ్లగక్కాను.

"ఎవ్వరూ యెప్పుడూ భయపడకూడదు" అన్నారామె. "భయంతో నీ భయాన్ని నువ్వే తెచ్చుకుంటున్నావు" అన్నారు. నేను తల వూపాను. ఆవిడ నా ఒక్కరితో కాక మిగతా ప్రపం చంతో మాట్లాడినట్టు అనిపించింది. "అది అహం! అహమే!."

వ్యక్తిగత విషయాలు చాలా చర్చించబడ్డాయి. ఆ తర్వాత ఆధ్యాత్మికాభివృద్ధి గురించి ఆమె అన్నారు. "నీకు తెలుసో లేదో, దీని కంతటికీ మనిషి సాహసప్రవృత్తి కలిగి వుండాలి."

మా సంక్షిప్తసంభాషణ అయిపోయింది. అంతవరకూ ఆమె వొక నల్లని మేజాబల్ల అంచుని మోచేయి ఆనించి కూర్చున్నారు. బల్లమీదే వున్న కంచుపాత్ర లోనించి తీసి సుదీర్ఘమైన చూపుతో (with a long look) వొక ఫ్రెంచి బంతిపూల జంటని నాకి చ్చారు.

కొంతకాలం గడిచిన తరువాత, కొన్నేళ్ళకి నేనెంత అదృ ష్టవంతుణ్ణో గుర్తించాను. ఒక్క సంవత్సరకాలంలో నేను నా దేశ తీరాలకి సుదూర దేశాలలో ప్రపంచంలోనే గొప్ప మహాత్ములైన ముగ్గురు మహనీయుల్ని కలుసుకున్నాను. ఒకరు స్విట్జర్లాండు దేశీయుడైన జంగ్. భగవంతుడి భావనలో మానవుడు తన భావ నని మించి యెదుగుతాడని జంగ్ విశ్వాసం. ఇంక మిగిలిన యిద్దరూ శ్రీఅరవిందులు, శ్రీమాతగా భావించే మిర్రా అల్ఫాస్సా. వీరిద్దరూ కలిసి ప్రపంచాని కవసరమయిన దైవభావనను అందిం

చడానికి బృహత్ప్రయత్నం చేసేరు. వారి ఆధ్యాత్మిక అసాధారణ ప్రజ్ఞాపాటవంతో నిరంతరకృషితో జీవితానికి ఆశని, అర్థాన్ని కలిగించారు.

ఆంగ్లమూలం: Rhoda P. Le Cocq
అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

సమాచార పత్రం

2007 ఫిబ్రవరి 23 నుంచి మార్చి 5 వరకు సొసైటీ బీచ్ ఆఫీసు దరి డా॥ మంగేష్ నడ్కర్ణిగారు 'సావిత్రి' అధ్యయన శిబిరం నిర్వహిస్తున్నారు. ఉ. 9 నుంచి 10, తర్వాత 10.30 నుంచి 11.30 దాకా ప్రతిదినము ఉంటుంది. అందరు ఆహ్వానితులే.

శ్రీగోపాల్ భట్టాచార్జీ ఆగస్టు – సెప్టెంబరు 2006 కాలంలో జర్మనీ, బ్రిటనుల లోని కేంద్రాలు దర్శించారు. Weinhein లో, 2006 ఆగస్టు 19 న, శ్రీఅరవిందుల జన్మదిన వేడుకలలో పాల్గొన్నారు. శ్రీఅరవిందుల గురించి ప్రసంగించారు. Heidelberg మరియు Fortshein లను దర్శించారు. శ్రీఅరవింద సొసైటీని పరిచయం చేశారు.

లండను సొసైటీ కేంద్రాన్ని దర్శించారు. Kent మరియు Oxford దర్శించారు. అక్కడ సమావేశాలలో పాల్గొన్నారు. Harrow లో ఆగస్టు 26, 9 సెప్టెంబరు తేదీలలో రెండు ఉపన్యాసాలు ఇచ్చారు. 'The New World' పత్రిక వీరి రెండు వ్యాసాలు ప్రచురించింది. 'శ్రీఅరవిందుల ఆవశ్యకత నేడు' గురించి శ్రీ భట్టాచార్జీగారి interview అంశాలను ప్రచురించింది. సుల్తానాపూరు (ఉ.ప్ర) వారు వందేమాతరం గురించిన సమావేశం సెప్టెంబరు 7, 2006 న నిర్వహించారు. డా. జె పి. సింగ్, డా. డి. డి. పాండే, డా. జె. యన్. లాల్, డా. ధర్మపాల్ సింగ్ గారలు ప్రసంగించారు.